# TELUGU - II
# (DTEL21)
# (BA, BCOM, BSC, BBA)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించబడి మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2003వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

ఆచార్య. **కె. వియన్నారావు**
కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# B.A. B.Com. Telugu : Syllabus

## Paper - II : Poetry, Prose, Drama, Prosody, Poetics and Essay

### ప్రాచీన పద్యభాగము

1. ప్రహ్లాద చరిత్రము - పోతన - శ్రీ మహాభాగవతము - సప్తమ - 130 - 163 పద్యాలు.
2. సత్యభామా సాంత్వనము - నంది తిమ్మన - పారిజాతాపహరణము - ప్రథమా 62-137 పద్యాలు
3. నిగమ శర్మ అక్క - తెనాలి రామకృష్ణుడు - పాండురంగ మహాత్మ్యము - తృతీయ 24 - 50 పద్యాలు
4. సీతాపరిత్యాగము - కంకంటి పాపరాజు - ఉత్తర రామాయణము - షష్ఠాశ్వాసము 266 - 295 పద్యాలు

### ఆధునిక పద్యభాగము

1. ప్రతిజ్ఞ - శ్రీశ్రీ - మహాప్రస్థానము నుండి
2. ఆర్తగీతం - తిలక్ - అమృతం కురిసిన రాత్రినుండి
3. మహేంద్రోదయం - దాశరథి - మహేంద్రోదయం నుండి
4. లకుమ త్యాగం - సి. నారాయణరెడ్డి - కర్పూర వసంతరాయలు
   5వ ఆశ్వాసం "రాణిమేను తపించె నిప్పున..." నుండి
   "కర్పూర సౌరభమ్ములు వీచు" వరకు
5. నా దేశం - నా ప్రజలు - మొదటి సర్గ - శేషేంద్ర శర్మ

### గద్యభాగము

1. స్వభాష - పానుగంటి లక్ష్మీనరసింహారావు - సాక్షి నుండి
2. రాయలనాటి రసికత - రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ
3. బహుకాల దర్శనం - దేవులపల్లి కృష్ణశాస్త్రి
4. మనుచరిత్ర - (కావ్యలహరి - యువభారతి ప్రచురణ నుండి) - దివాకర్ల వేంకటావధాని

### నాటకము

వర విక్రయము - కాళ్ళకూరి నారాయణరావు

### అలంకారములు

ఉపమ, రూపక, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, స్వభావోక్తి అర్థాంతరన్యాస, దృష్టాంత, శ్లేష

### ఛందస్సు

ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభము, ఆటవెలది, తేటగీతి, కందం, సీసము

### వ్యాసము

సమకాలీన సామాజిక, వైజ్ఞానిక, సాంస్కృతిక విషయాలు ఏవైనా.

(DTEL 21)

# B.A./B.Com./B.Sc./B.B.M. DEGREE EXAMINATION, MAY 2006.

(Examination at the end of Second Year)

Part I - Telugu

Paper II - **POETRY, PROSE, DRAMA, PROSODY, POETICS AND ESSAY**

Time : Three hours

Maximum : 100 marks

1. దిగువ పద్యాల్లో ఒకదానికి ప్రతిపదార్థ తాత్పర్యాలు రాయండి : (8)

   (i) మాసిన చీర గట్టుకొని, మౌనముతోడ, నిరస్తభూషయై
   వాసెన కట్టుగట్టి, నిడువాలిక కస్తూరి పట్టువెట్టి, లో
   గాసిలి, చీకటింటికడ కంటిపై జలదాంత చంద్రరే
   ఖా సదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాద వేదనన్.

   (ii) జలజాతాసన వాసనాది సురపూజా భాజనంబై తన
   ర్చులతాంతాయుధు కన్న తండ్రి శిరమచ్చోవామ పాదంబునం
   దొలఁగంద్రోచె లతాంగి, యట్లయగు నాధుల్నేరముల్సేయ, బే
   రబకం చెందిన యట్టి కాంతలుచిత వ్యాపారముల్నేర్తురే.

2. ఈ క్రింది వాటిలో ప్రతి భాగం నుంచి రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి. (4 × 3 = 12)

అ – భాగం

(a) గ్రంథంబుల్ చదివించి నీతి కుశలుంగావించి రక్షింపరే

(b) నీదయ గన్గొనకుండిన నిల్వనేర్తునే

(c) కుంతల బంధంబు విడిచి కుశలాశయమై

(d) మానరహితమైన బ్రతుకు మానిని కేలా ?

ఆ – భాగం

(a) వరాల వర్షం కురిపించాలని

(b) శౌర్యదావాగ్ని నా లేఖనీ ముఖాంతరమునందు

(c) తేనె పూసిన కత్తి ధాత్రీసురుండు

(d) బ్రతుకు లోనేడ పూర్వమ్మైన దినమురా.

3. ఈ క్రింది వాటిలో ప్రతి భాగం నుంచి ఒకదానికి సమాధానం రాయండి : (2 × 10 = 20)

అ – భాగం

(a) ప్రహ్లాదుని విద్యాపాటవాన్ని తండ్రి పరీక్షించిన వృత్తాంతాన్ని తెల్పండి.

(b) సత్యభామను శ్రీ కృష్ణుడు అనునయింపజేస్తూ మాట్లాడిన తీరును వివరించండి.

ఆ - భాగం

(a) శ్రీశ్రీ చేసిన కవితా ప్రతిజ్ఞను వివరించండి.

(b) మహేంద్రోదయాన్ని దాశరథి రచించిన తీరును తెల్పండి.

(2 × 10 = 20)

4. ఈ క్రింది వాటిలో ప్రతి భాగం నుంచి ఒకదానికి సమాధానం రాయండి :

అ - భాగం

(a) స్వభావ వ్యాస ప్రాశస్త్యాన్ని వివరించండి.

(b) రాయలనాటి జనజీవన విధానాన్ని తెల్పండి.

ఆ - భాగం

(a) బహుకాల దర్శనంలో మానవ సంబంధాల్ని విశ్లేషించండి.

(b) పెద్దన వర్ణనా వైచిత్రిని మీ పాఠ్యభాగం ఆధారంగా వర్ణించండి.

(2 × 10 = 20)

5. ఈ క్రింది వాటిలో రెండింటికి సమాధానం రాయండి :

(a) వరవిక్రయ నాటకంలోని సంస్కరణ దృష్టిని తెల్పండి.

(b) కాళింది గుణగణాల్ని వివరించండి.

(c) కమల పాత్ర ప్రాధాన్యాన్ని వివరించండి.

(d) పురుషోత్తమరావు

(10)

6. ఈ క్రింది వాటిలో ఒకదానిని గూర్చి వ్యాసం రాయండి :

(a) పర్యావరణ పరిరక్షణ

(b) మాతృభాషా పరిరక్షణ

(c) విలువ ఆధారిత పన్ను

(5)

7. (a) (i) క్రింది పద్యపాదానికి గణవిభజనచేసి, ఛందస్సును గుర్తించి యతిని పేర్కొనండి :

ప్రారంభించిన వేదపాఠఘునకున్ బ్రత్యూహమౌనంచునో

లేదా

(ii) క్రింది వాటిలో ఒకదానికి సోదాహరణంగా లక్షణాల్ని తెల్పండి :

(1) చంపకమాల

(2) సీసం

(b) (i) క్రింది పద్యపాదంలో అలంకారాన్ని తెల్పి లక్షణంతో సమన్వయించండి.

"ఇనుమయస్కాంత సన్నిధినెట్లు భ్రాంత
మగు, హృషీకేశు సన్నిధి నా విధమున
గురగుచున్నది దైవ యోగమున జేసి
బ్రాహ్మణోత్తమ చిత్తంబు భ్రాంతమగుచు" (5)

లేదా

(ii) ఈ క్రింది అలంకారాల్లో ఒకదానికి సోదాహరణంగా లక్షణం తెల్పండి :

(1) స్వభావోక్తి

(2) రూపకం.

# విషయ సూచిక


ఖండం : 1 ప్రాచీన పద్య భాగము

1. ప్రహ్లాద చరిత్రము 1 - 35
2. సత్యభామా సాంత్వనము 1 - 36
3. నిగమశర్మ అక్క 1 - 32
4. సీతా పరిత్యాగము 1 -25

ఖండం : 2 ఆధునిక పద్యభాగము

1. ప్రతిజ్ఞ 1 - 14
2. ఆర్త గీతం 1 - 12
3. మహేంద్రోదయం 1 - 11
4. లకుమ త్యాగం 1 - 14
5. నా దేశం నా ప్రజలు 1 - 13

ఖండం : 3 గద్యభాగం

1. స్వభాష 1 - 8
2. రాయలనాటి రసికత 1 - 16
3. బహుకాల దర్శనం 1 - 8
4. మనుచరిత్ర 1 - 21

ఖండం : 4 నాటకము

1. వర విక్రయము 1 - 9
2. వర విక్రయము 1 - 13
3. వర విక్రయము 1 - 15
4. వర విక్రయము 1 - 16

ఖండం : 5 వ్యాసములు 1 - 21

ఖండం : 1

పాఠం : 1

# ప్రాచీన పద్యభాగము
# ప్రహ్లాద చరిత్రము

(శ్రీ మదాంధ్ర మహాభాగవతము - సప్తమ స్కంధం - 130 - 183 పద్యాలు) - పోతన

శీర్షికలు :


1.0 లక్ష్యము
1.1 కవి పరిచయం
1.2 పాఠ్యభాగ సందర్భం
1.3 పాఠ్యభాగ సారాంశం
1.4 కఠిన పదాలకు అర్థాలు
1.5 ప్రతిపదార్థ తాత్పర్యాలు
1.6 సందర్భసహిత వ్యాఖ్యలు
1.7 ప్రశ్నలు - సమాధానాలు
1.8 ఛందస్సు
1.9 అలంకారాలు
1.10 సారాంశము


## 1.0 లక్ష్యం :-

ఏ జాతిలో పుట్టిన వానికైనా చదువు తప్పనిసరిగా ఉండాలి. అది లేకపోతే అతనికీ, పశువుకూ తేడా ఉండదు. అయితే కూటి విద్యలనీ, పరమార్థ విద్యలనీ విద్యలు రెండు విధాలు. పరమార్థ విద్య పరమార్థమైన మోక్షాన్ని సాధిస్తుంది. కూటి విద్య కూటిని సాధిస్తుందో లేదో చెప్పలేం. ఈ పాఠ్యభాగం ద్వారా పరమార్థ విద్య స్థితిగతులు మనం చక్కగా తెలుసుకోగలుగుతాం.

## 1.1 కవి పరిచయం :-

ఇది తెలుగులో మహాకవి పోతన రచించిన శ్రీమహాభాగవతం సప్తమస్కంధం లోనిది. వేదవ్యాసుడు సంస్కృతంలో తీర్చిన శ్రీమహాభాగవతం దీనికి మూలగ్రంథం. పోతన్న భాగవత రచన ద్వారా తన్నేకాదు, ఆదరంతో చదివిన ఆంధ్రజాతి నంతటినీ తరింపజేసిన మహాభక్త కవి.

భాగవతంలోని భాగాలకు స్కంధాలని వ్యవహారం. భాగవతం ఒక కల్పవృక్షం. అందులో ఒక్కొక్కభాగం ఒక్కొక్క పెద్ద కొమ్మ. కల్పవృక్షంలో ఏ చిన్న భాగమైనా కోరిన కోరికలను తీరుస్తుంది. ముఖ్యంగా ప్రహ్లాద చరిత్ర అతిమనోజ్ఞమైన గ్రంథభాగం. తెలుగు పల్లెలలో ఒకప్పుడు అక్షరాలు రానివారు కూడా పోతన భాగవతంలోని యిటువంటి ఘట్టాల పద్యాలను ఆనందంతో చదువుకొనేవారు.

పోతన ఇప్పటి వరంగల్లు అనబడే ఓరుగల్లు నగరానికి దగ్గరగా ఉన్న బమ్మెరకు చెందినవాడనీ, 15వ శతాబ్దంలో జీవించినవాడనీ చరిత్రకారులు నిర్ణయించారు. భోగినీదండకం, వీరభద్ర విజయం, నారాయణశతకం ఇతని ఇతర రచనలుగా ప్రసిద్ధికెక్కాయి.

మహాభక్తుడు.
పోతన సహజపండితుడు. కోరి దారిద్ర్యాన్ని వరించి దానిద్వారా మోక్ష సామ్రాజ్యసింహాసనం అధిరోహించిన

## 1.2. పాఠ్యభాగ సందర్భం :

రాక్షసులను చంపటానికి అవతారాలు
ధర్మరాజుకు ఒక సందేహం కలిగింది. భగవంతుడైన విష్ణువు అందరి యందూ సముడే కదా! హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతాన్ని
ఎందుకు ఎత్తవలసి వచ్చింది? అని. ఈ విషయం నారదుని అడుగగా అతడు దానికి సమాధానంగా అతనిలో హరిభక్తిని
చెప్పాడు. హిరణ్యకశిపుడు రాక్షసుడు. అతని కొడుకు ప్రహ్లాదుడు విష్ణుభక్తులలో మొదట పరిగణింపదగినవాడు. గురుపుత్రులైన
అంతం చేసి రాక్షసుల గుణాలను పట్టించాలని తండ్రి భావన. నీతి శాస్త్రంలో నిండు పాండిత్యం కలిగించవలసినదిగా
చండా మార్కులవారికి తండ్రి ప్రహ్లాదుని అప్పగించాడు. ఆ సందర్భంలోని పాఠాన్ని మనం ఇప్పుడు చదువుతున్నాం.

## 1.3. పాఠ్యభాగ సారాంశం :

చదువుకుంటే మంచి, చెడులను చక్కగా
హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి పిలిచి 'నాయనా ! చదువుకోకపోతే ఏమీ తెలియదు. చదువుకో' అని శుక్రాచార్యుని
నిర్ణయించుకొనే శక్తి, నేర్పు కలుగుతాయి. అందుకని చదువుకోవాలి. పెద్దల దగ్గర నిన్ను చదివిస్తాను,
కొడుకులు చండామార్కులనే వారిని పిలిచి సత్కరించి ఇలా అన్నాడు.

మీరు
గురుపుత్రులారా ! మా చిన్నవాడు గ్రుడ్డివానిలాగా ఉండిపోతున్నాడు. నా ప్రతాపమూ, శక్తీ వానికి ఏమాత్రం తెలియవు. మా మీద అభిమానంతో ఈ
గురువులు. నాకు ఆత్మబంధువులు. మాయందు నిండుగా కరుణ కలవారు. మాకు మన్నింపదగినవారు. బాలుని వారికి అప్పగించాడు.
పిల్లవానికి చదువు బోధించండి. నీతిలో ఆరితేరిన వానినిగా చేయండి. మమ్ములను రక్షించండి అని పలికి షణ్ణేశాస్త్రాలు బోధించారు.
వారు అతనిని తీసుకొనిపోయి అతని యీడు పిల్లలతో కలిపి రాజగృహం దగ్గరనే ఒక పాఠశాల ఏర్పరచి అది ఎలా
శిష్యుడు శ్రద్ధగానే వింటున్నాడు కాని అతని ఎదలో ఉన్న విష్ణుభక్తి మాత్రం చెదిరిపోలేదు. చెప్పినది వినటమే కానీ ఇది ఏమిటి?
..ని ఆక్షేపించడు. అవన్నీ అబద్ధపు విషయాలని అతని భావన.

మా పిల్లవాణ్ణి గురువులే
కొన్నిదినాలు గడిచాయి. హిరణ్యకశిపుని హృదయంలో కొడుకు మారాడా లేదా అని శంక పట్టుకొన్నది. అని తలపోసి
విధంగా చదివించారో! వీడొక అయోమయం. వారు చెప్పినది ఒంటబట్టించుకుంటున్నాడో లేదో ఒకసారి పరీక్షిద్దాం, ఉత్సాహశక్తి ప్రభుశక్తి
మహాభవనంలో కూర్చుని కుమారుని పిలిపించాడు. వచ్చిన వెంటనే కుమారా ! రా ! నీ విద్యా ప్రయత్నం ఎలా ఉంది? అధ్యయనం
మంత్రశక్తి అనేవానిని నీ ప్రయత్నానికి చక్కగా జోడించావా? జ్ఞానం చక్కగా అబ్బిందా? వేదాలను, శాస్త్రాలనూ చక్కగా తన
చేశావా? రా ! నాయనా ! రా ! అని పలికి ఒడిలో కూర్చుండ బెట్టుకొన్నాడు. హృదయంలో కుతూహలం పరవళ్లు త్రొక్కుతున్నది. కొంచెం
పుత్రుని పాండిత్యం ఎంత తొందరగా తెలుసుకుంటానో అని ఆరాటపడిపోతున్నాడు. నాయనా! నీలో భద్రంగా ఉన్న విద్య ఏదో
చెప్పు - అని అడిగాడు.

చీకటి నూతిలోపడి
ప్రహ్లాదుడు, "రాక్షస మహా చక్రవర్తీ ! మనకు శరీరం భగవంతుడిచ్చాడు. ఎందుకో తెలుసుకోకుండా సంసారమనే సర్వము ఆ పరమాత్మని
నశించిపోతున్నాం. ఎక్కడికక్కడ వారూ, మేమూ అని భేదాన్నే చూస్తున్నాం. ఈ రెండూ చాలా ప్రమాదకరమైనవి. అని నిర్భయంగా
దివ్యకళామయమే అని విష్ణువునందు చిత్తాన్ని సమర్పించి అడవిలో ఉండటం మేలు. అది ప్రమోదకరమైన విషయం". లేదా
తొణకకుండా పలికాడు.

హిరణ్యకశిపునికి అందరు తండ్రులకు లాగానే ఇది వీడిబుద్ధికాదు, గురువులు అలా చెప్పి ఉంటారనే ఆలోచన కలిగింది. ఈ బుద్ధి నీకే
ఎవరైనా గిట్టనివారు శత్రుపక్షం బోధలు చేశారేమో అనే అనుమానం కలిగింది. "నాన్నా ! నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. మనం దానవులం.
తోచిందా? పరులెవరైనా నూరిపోశారా? లేదా ఒకవేళ గురువులే ఎవరూలేని వేళ ఇలాంటి పాఠాలు చెబుతున్నారా? దేవతల రాజులను బాధించటం,
మనకు ఆ వైకుంఠుడు అపరాధం చేశాడు. అతనిని నీవు కొనియాడగూడదు. దేవతలను తరిమికొట్టటం, పక్షిజాతివారు, పాముజాతుల
సిద్ధులను మొద్దులను చేయటం, మునివర్యులను ముప్పతిప్పలు పెట్టటం యక్షులు, కిన్నరులు, గంధర్వులు,

వారిని సర్వనాశనం చేయటం మనకు కార్యాలు. అంతేకానీ హరిగిరీ అంటూ మోహంతో గ్రుడ్డివాళ్లం కాకూడదు." అని కొడుకును మందలించాడు.

ప్రహ్లాదుడు ఒక్కసారి గురువుల వైపు చూచి ఇలా అన్నాడు. "మోహాన్ని పటాపంచలు చేసుకోవాలి. హరి తప్ప మరొక ఆలోచనరాన్విక మెలగాలి. అట్టివారికి తాను, ఇతరులు అనే భేదభావమే ఉండదు. అలా ఉండటం మాయ. అదొక లేని భూతం. అది కనబడకుండా ఉండాలంటే పరమేశ్వరుని అనుగ్రహం పొందాలి. నేనాతని నమస్కరిస్తాను" తెలివిలేని వాళ్లు ఆ మాయలో పడిపోతారు. అంతటా ఉన్న ఆ పరమాత్మను పట్టుకోలేరు. మాట్లాడలేరు. అసలు తెలుసుకోవాలనే తపనయే వారికి ఉండదు. బ్రహ్మ మొదలగువారు కూడా ఆ విషయంలో తప్పటడుగులు వేస్తారు. ఇంక సాధారణుల సంగతి చెప్పనేల? గురువర్యా ! ఇనుము అయస్కాంతం దగ్గర తన ప్రయత్నం లేకుండానే వెళ్లి అతుక్కుంటుంది. అలాగే నా హృదయం హృషీకేశుడైన విష్ణువు సన్నిధిలోనికి బలంగా త్రోసుకొని వెళ్లిపోతున్నది.

ఆచార్యా ! మందారపుష్పంలోని పూదేనె రుచి మరగిన తుమ్మెద ఉమ్మెత్త పూవుల దగ్గరకు, నిర్మలమైన ఆకాశగంగ తరంగాలలో హాయిగా తూగుతూ ఉండే రాజహంస ఏవోఏవో నదులకు, సుకుమారమైన మామిడి చిగుళ్లు తిని పరవశించే కోయిల కొండ మల్లెల కడకు, నిండు చంద్రుని వెన్నెలలో ఆనందంతో విహరించే చకోరం మంచుగడ్డల దగ్గరకూ పోవటం ఎందైనా ఉందా! నా హృదయం కూడా శ్రీ మహా విష్ణువు దివ్యపాదాలనే పద్మాలను భావించటం అనే అమృతం గ్రోలి పరమానందంతో పరవశించిపోతున్నది. దానిని మరొక చోటికి మళ్లించటం సాధ్యమా!"

గురువులకు పట్టరాని కోపం వచ్చింది. అయిదేళ్లున్నాయో లేదో తర్కవాక్యాలు పలుకుతావా? మేము చెప్పిన శాస్త్రాలలోని పలుకులలో ఒక్కటైనా వివరించవేమి? రాక్షసాధిపతి ముందు మాకు తలవంపులు తెస్తున్నావు. వంశాన్ని దూషిస్తూ వైరిని పొగడుతున్నావు. ప్రభూ! ఇతడు కొడుకు గాదు. పగవాడు. రాక్షసులనే చందన వనంలో పుట్టిన ముళ్ల కంప చెట్టు. ఎప్పుడూ రక్కసులను చంపిన ఆ విష్ణువునే కొనియాడుతూ ఉంటాడు. వీనిని బాగా దండిస్తేగానీ దారికిరాడు. 'మహారాజా! కోపపడకు. నయానానో భయానానో వీనిని దారిలోనికి తెస్తాం. నీ పాదాల మీద ఒట్టు' అని బాలుని భయపెడుతూ రాజు దగ్గర నుండి ఆవలికి తీసుకొనిపోయారు.

అటుపై తమ మార్గం తప్పిపోకుండా ధర్మ, అర్థ, కామ పురుషార్థాలకు చెందిన పాఠాలు గట్టిగా బోధిస్తున్నారు. అలాగే సామ, దాన, భేద, దండాలనే ఉపాయాలను గురించి కూడా ఉపదేశాలు చేశారు. తమ దారిలోనికి వచ్చాడని నమ్మి ముందుగా తల్లి దగ్గరకు తీసుకొని వెళ్లారు. ఆమె దగ్గర నిలిపి "బాబూ! మేము చెప్పిన మాటలేమీ తండ్రితో చెప్పు. నీతి పాఠాలు మేము చెప్పినవే వల్లించు. తక్కినమాటలు రానివ్వకు. పగవానికి సంబంధించిన నీతులను విప్పవద్దు. ముఖ్యంగా విష్ణుని మాటయే రాకూడదు అని లాలించి చెప్పారు. హిరణ్యకశిపుని దగ్గరకు మెల్లగా తీసుకొని వెళ్లారు. బాలునకు మాధవాను చింతనంతో ఒడలు తెలియటంలేదు. బ్రహ్మమొదలైన వారికి కూడ అభ్యాసానికి రాని హరి భక్తికి పురుషరూపం వచ్చిందా అన్నట్లున్నాడు. తల్లి గర్భంలో ఉండగానే హృదయం హరి మీద తగులుకొన్నవాడు కదా ! ప్రపంచమంతా విష్ణుమయంగానే చూస్తున్న మహాభక్తుడు. సద్గుణాలన్నీ తనలోనే ఉన్నవాడు. పండిన పాండిత్యం గలవారు కూడా అతనిని ప్రశంసిస్తూ ఉంటారు. అట్టి బాలుని తండ్రి ముందు నిలబెట్టారు గురువులు. అబ్బాయి అన్ని విద్యలు అందంగా నేర్పాము. స్వామి తమరు పరీక్షింపవచ్చు" అని పలికారు.

తండ్రి మురిసిపోయాడు. ముద్దు పెట్టుకున్నాడు. ముంగురులు ముచ్చటగా నిమిరాడు. చేతులు చాచి కౌగిలిలోనికి తీసుకున్నాడు. ప్రేమతో ఆనంద బాష్పాలు జాలువారుతున్నాయి. తీయగా ఇట్లు ప్రారంభించాడు.

"పుత్రా! ఇంతకాలం గడిచింది. ఏమేమి చెప్పారు గురువులు. ఎలా చదివించారు? నీ విద్య ఏ అంచులు ముట్టిందో తెలుసుకోవాలి. ఏదీ ఒక పద్యం చెప్పి తాత్పర్యం వివరించు. నీ సహపాఠకులు ఎన్నో విద్యలు నేర్చారు. నీకేమీ రాదని గేలి చేస్తున్నారు. గ్రంథార్థాలను సమర్థంగా వివరిస్తున్నారు. మా పసివాడు కూడా అలా ఎప్పుడు విద్యావంతుడౌతాడా అని ఎంతో కోరికతో ఉన్నాను. ఏదీ ! నీ పాండిత్యం ప్రదర్శించు". అని ఎంతో ఆశతో అబగా అల్లారుముద్దుగా అడిగాడు కన్నతండ్రి.

కన్నకొడుకు మొదలు పెట్టాడు. "నాన్నగారూ ! గురువులు గొప్ప పాఠాలు చెప్పారు. ధర్మశాస్త్రాలు మొదలైన వన్నీ నేను చాలా అభ్యసించాను. ముఖ్యమైన సంగతి - చదువులలో మర్మాలన్నీ చదివాను.

దేహంతో, హృదయంతో, పలుకులతో స్నేహము, గుణాలను వినటం, దాసుడు కావటం, నమస్కరించటం, పూజలు చేయటం, ఆత్మలో తెలిసికొని ఉండటం, కీర్తనలు పాడటం, భావన చేయటం - అని భగవంతునికి సంబంధించిన భక్తి మార్గాలు తొమ్మిది ఉన్నాయి. వానితో హరిని నమ్మి ఉండటమే భద్రమైన మార్గమని నా నమ్మకం. హరిభక్తి లేదనుకో ఆ బ్రతుకు పనికి మాలినది. గ్రుడ్డివానికి చంద్రుని చూపటం, చెవిటివానికి శంఖం ఊదటం, మూగివానికి పుస్తకాలను వక్కాణించటం, పేడివానికి పెండ్లిచేయుటం, కృతఘ్నులతో చుట్టరికం కలుపుకోవటం, బూడిదలో హోమద్రవ్యాలుంచటం వంటిదవుతుంది ఆ బ్రదుకు. ఆ సంసారం ప్రయోజనం లేనిది. చేతులు కమలాక్షునికి అర్పించాలి. నాలుక శ్రీనాథుని వర్ణించాలి. చూపులు శ్రీవిష్ణువునే చూడాలి. తల శేషశాయికే మ్రొక్కాలి. చెవులు విష్ణువునే వినాలి. మనస్సు మధువైరినే తగులుకోవాలి. లేకపోతే అవి ఉండినా లేకున్నా ఒకటే. దేవదేవుని చింతించే దినమే దినం. చక్రహస్తుని ప్రకటించే చదువే చదువు. లక్ష్మీపతిని బోధించే గురువే గురువు. తండ్రీ! ఏ తండ్రి కొడుకును హరిని జేరవలసినదిగా బోధిస్తాడో అతడే తండ్రి.

మనకు భగవంతుడు ప్రసాదించిన అవయవాలూ, దేహమూ అతనికే సమర్పించాలి. లేకపోతే దేహం గాలి ఉండే తోలుతిత్తి అవుతుంది. నోరు డక్కయై పోతుంది. చేయి కొయ్యతో చేసిన తెడ్డు వంటిది, కన్నులు గోడలోని రంధ్రాలూ అయిపోతాయి. చక్రధారి చింతన లేని బ్రదుకు బ్రదుకు గాదు. నీటిబుడగ. విష్ణుభక్తి లేని జనుడు రెండు పాదాలున్న పశువు.

సంసారం ఒక పెద్ద మబ్బుల దుబ్బు. అది విచ్చిపోవాలంటే చక్రిదాస్యమనే పెనుగాలి వీచాలి. తాపత్రయం అనే భయంకరమైన దావాగ్నులు ఆరిపోవాలంటే విష్ణుసేవ అనే అమృతవర్షం కురియాలి. నిలువెల్లా రాపిడి పెట్టే పాపాల సముద్రాలు ఇంకిపోవాలంటే హరియందు బుద్ధి అనే బడబాగ్ని ప్రజ్వరించాలి. ఘోరమైన అపదలనే కటిక చీకట్లుపోవాలంటే పద్మాక్షుని ప్రశంసలనే రవిప్రభలు ప్రకాశించాలి. విష్ణువు ంటి భావన అనే కాటుక లేకపోతే తిరిగిరాని నిష్కళంకమైన ముక్తి అనే గని కానరాదు".

అని ప్రహ్లాదుడు తన భక్తియుక్తులను శక్తికొలది అనురక్తితో భీతి లేక వెల్లడించాడు. తండ్రికి పట్టశక్యం కాని కోపం వచ్చింది. ురువుల మీద మండిపడ్డాడు. విరోధిశాస్త్రాలు చెప్పారని తీవ్రంగా నిందించాడు. పురోహితులు ప్రాధేయపడి "మా తప్పేమీ లేదనీ, మా ుమారుని తీరే ఇంత" అని విన్నపం చేశారు. నిజమే అనుకొని హిరణ్యకశిపుడు కుమారుని గురువులు చెప్పని ఈ విద్య నీకెవరు ోధించారురా! అని తర్జిస్తూ అడిగాడు.

అప్పుడు ప్రహ్లాదుడు "అచ్చమైన అజ్ఞానంలోబడి కొంపాగోడూ అనుకుంటూ విషయాలను (శబ్దము, స్పర్శ, రూపము, రసము, ంధములను) అనుభవిస్తూ చస్తూ పుడుతూ ఉండేవారికి ఎవ్వరు చెప్పినా వారికి సంబంధించిన జ్ఞానం కలుగదయ్యా ! గ్రుడ్డివానిని ఆధారంగా తీసుకొని వెనుక వెళ్ళే గ్రుడ్డివాడు దేనినైనా చూడగలడా? విష్ణువు పాదపద్మాల ధూళి మాత్రమే కర్మ దోషాలను నాశనం చేస్తుంది. రొక గతిలేదు. నాయనా ! శాస్త్రాలన్నింటినీ జాగ్రత్తగా శోధించాను. ఈ సంసారమనే మహా సముద్రాన్ని దాటటానికి విష్ణువు మీది బుద్ధి నే నావ తప్ప మరొక గతి లేదని చక్కగా తెలిసివచ్చింది".

అని ప్రహ్లాదుడు తండ్రికి భక్తితత్త్వాన్ని తెలియజెప్పాడు.

ఇది ఈ పాఠ్యభాగం సారాంశం.

## 1.4. కఠిన పదాలకు అర్థాలు :

130. అజ్ఞుడు = తెలివిలేని వాడు

సద్, అసద్, వివేక చతురత = మంచి, చెడులను నిర్ణయించ గల నేర్పు.

ఆర్యులు = జ్ఞానము విశేషముగా గలవారు.

131\. అసురలోకము = రాక్షసుల సముదాయము

ప్రచండ వితర్కులన్ = మిక్కిలి తీవ్రమైన విచారణ ధోరణి కలవారిని

133\. దనుజ రాజకుమారునిన్ = రక్కసులరేని కొడుకును

సమానవయస్కులు = ఒకే యీడు కలవారు:

సహ శ్రోతలు = కలిసి పాఠాలు వినేవారు - కలిసి చదువుకొనేవారు

134\. ఆక్షేపింపడు = చెప్పిన దానిని గూర్చి అడ్డముగా మాట్లాడడు

మిథ్యలు = అబద్ధములు

నిరూఢ మనీషన్ = గట్టిగా స్థిరమైయున్న బుద్ధితో

138\. ఆహూయమానుడు = పిలువబడుచున్నవాడు

141\. భద్రము = మేలు

143\. ప్రతిపక్ష + అనురూపములు = పగవారికి తగిన విధముగానున్నవి

దానవ, ఇంద్రుడు = రాక్షసుల రాజు

144\. దట్టించి = ఒత్తిడి చేసి

పరపక్షంబుల్ = పగవారికి చెందిన విషయములు

147\. నిరీక్షించి = చూచి

మోహ నిర్మూలనంబు = అజ్ఞానాన్ని మొదలంట తీసి వేయుట

తత్పరులు = అదే భావన కలవారు

అసద్, గ్రాహ్యంబు = అజ్ఞానమనే గ్రహింపదగిన విషయం

149\. భ్రాంతము = కదలునది - లాగబడునది

హృషీక+ఈశుడు = ఇంద్రియములపై అధికారము కలవాడు- విష్ణువు.

దైవయోగమునన్ = అదృష్టవశమున

బ్రాహ్మణ+ఉత్తమ = బ్రాహ్మణులలో గొప్పవాడా !

150\. మధుపము = తుమ్మెద

మదనములకు = ఉమ్మెత చెట్ల దగ్గరకు

వీచికలు = అలలు

తరంగిణులు = అలలుకలవి - నదులు

రసాల, పల్లవఖాది = మామిడి చిగుళ్ల తినునది

కుటజములకు = కొండగోగుచెట్లకు

పూర్ణ+ఇందు, చంద్రికా, స్ఫురిత, చకోరకము = నిండు చంద్రుని వెన్నెలలతో వికాసం పొందు వెన్నెల పిట్ట

సాంద్ర నీహారములకు = దట్టంగా ఉండే మంచులు

అంబుజ + ఉదర, దివ్య, పాద, అరవింద, చింతన, అమృత, విశేషమత్త, చిత్తుడు = విష్ణువు యొక్క దివ్యమైన పాదాలనే పద్మాలను భావించటం అనే అమృతం చేత మత్తెక్కిన హృదయం కలవాడు.

వినుత గుణశీల = కొనియాడ దగిన గుణాలు శీలమూ కలవాడా !

154. దనుజకుంజర = రక్కసులలో శ్రేష్ఠుడా !
155. ఏకాంతంబున = ఎవ్వరూ లేని చోట
156. భార్గవ నందనుడు = శుక్రాచార్యుని కొడుకు
నిచ్చల్ = ప్రతిదినము
వర్గత్రితయము = ధర్మము, అర్థము, కామము అను మూడింటి సముదాయము
అనర్గళము = అడ్డులేనిది
157. నీతికోవిదుండు = నీతిలో పండితుడు.
కుల దీపకున్ = కులమునకు దీపము వంటివానిని
మాధవ+అనుచింతన, సుధామాధుర్యమునన్ = విష్ణువును వదలక చింతించుట అను అమృతము తీయదనములో.
160. అంభోజగర్భ+ఆదులు = బ్రహ్మ మొదలగువారు
పుంభావము = మగవానితనము
అంకించు = గొప్పగా రాజిల్లు
బుధలోక సంభావ్యున్ = జ్ఞానవంతుల సముదాయము చేత గొప్పగా భావింపబడు వానిని
161. శిక్షించితిమి = నేర్పితిమి
162. దండ ప్రణామము = కర్రవలె దేహము నంతటిని నేలకాన్చి చేయు నమస్కారము
గాఢ + ఆలింగనము = గట్టి కౌగిలింత
చుంచు = పిల్ల జుట్టు
చుబుకము = గడ్డము
మూర్కొని = వాసన చూచి
ప్రేమ+ అతిరేక, సంజనిత, భాష్ప, బిందు, సందోహంబుల = మిక్కిలి ప్రేమ చేత పుట్టిన కన్నుల నీటి బిందువుల సముదాయముల చేత;
వదన + అరవిందమున్ = ముఖమనెడు పద్మమును;
మధుర + ఆలాపంబులన్ = తీయని మాటలతో
169. కమల + అక్షున్ = కమలముల వంటి కన్నులు గల వానిని - హరిని
శేషశాయికిన్ = ఆదిశేషునిపై పవ్వళించువానికి - విష్ణువునకు
మధువైరిన్ = మధువను రక్కసుని చంపిన వానిని - విష్ణువును
వలగొను = ప్రదక్షిణము చేయు
చక్రహస్తునిన్ = చక్రము చేతియందు కలవానిని - విష్ణువును
కుంభినీధవున్ = భూమికి నాథుడైన వానిని - విష్ణువును
170. కంజాక్షునకున్ = పద్మముల వంటి కన్నులు కలవానికి - విష్ణువునకు
పవన గుంభిత చర్మభస్త్రి = గాలి నింపిన తోలుతిత్తి - కొలిమితిత్తి
వక్త్రము = నోరు
దర్వి = తెడ్డు
తనుకుడ్య జాల రంధ్రములు = సన్నని గోడ కిటికీల బొక్కలు
చక్రి = విష్ణువు

తరళ సలిల బుద్బుదము = కదలాడే నీటిలోని బుడగ
విబుధుడు = పండితుడు

171. జీమూత సంఘము = మబ్బుల సముదాయము
ప్రభంజనము = పెనుగాలి
తాపత్రయ + ఆభీల, దావ + అగ్నులు = మూడు తాపములనెడు భయంకరమైన అడవి మంటలు.
(తాపములు మూడు - ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము - శరీరం వలన, తేలు. పాము మొదలగు వాని వలన, భూకంపము మొదలైనవాని వలన కలిగే బాధలు)
అమృత వృష్టి = అమృత వర్షము
విపద్, గాఢ + అంధకారములు = ఆపదలనెడు దట్టమైన చీకట్లు
పద్మాక్షునుతి రవిప్రభలు = విష్ణువును కొనియాడటం అనే సూర్యకాంతులు
నిరుపమ + అపునరావృత్తి, నిష్కళంక ముక్తినిధి = సాటిలేని, తిరిగి వచ్చుటలేని, మచ్చలేని ముక్తి అనే గని
శార్ఙ్ఞ కోదండ, చింతన + అమృతము = శార్ఙ్ఞమను విల్లుగల విష్ణువును ఎల్లవేళల తలపోయుట అను అమృతము

172. నుడువులు = పలుకులు
విమత కథనంబులు = పగవారికి చెందిన మాటలు
కఱపినవాడవు = నేర్పినవాడవు.

174. ధర్మ + ఇతర వర్తనులు = అధర్మపు నడవడి కలవారు
కల్మషకర్ములు = పాపకర్ములు.

177. దైత్యజలధి చంద్రమ = రాక్షస కులమనెడి సముద్రమునకు చంద్రుడా !

179. ఒజ్జలు = ఉపాధ్యాయులు
మత్ + జాతుడవు = నా కొడుకవు.
ఉద్ + జాతము = గొప్పగా పుట్టినది.
తద్ + జనులన్ = ఆ మనుష్యులను

## 1.5. ప్రతి పదార్థ తాత్పర్యాలు.

ప. 132. అంధప్రక్రియ నుండు రాఁడు వలుకం డస్మత్ప్రతాపక్రియా
గంధంబించుక లేదు మీరు గురువుల్ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁబెద్దలు మముం బాటించి యీ బాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుంగాఁజేసి రక్షింపరే !

ఈపద్యం ఆంధ్ర మహాభాగవతం సప్తమస్కంధంలోనిది. ఈ పాఠంలోని అన్ని పద్యాలకూ ఈ పరిచయం వ్రాయాలి.

ప్రతి పదార్థము :

నా కుమారుడు
అంధప్రక్రియన్ = గ్రుడ్డివాని తీరులో;
ఉండున్ = ఉంటాడు;

రాడు = నా దగ్గరకు రాడు;
పలుకండు = మాటాడడు;
అస్మత్, ప్రతాప, క్రియా, గంధంబు = నాదైన, పరాక్రమం వాసన
ఇంచుక = కొంచెం కూడా;
లేదు = లేదు
మీరు = తమరు
గురువుల్ = ఉపాధ్యాయులు;
కారుణ్య చిత్తుల్ = దయగల హృదయం కలవారు;
మనస్, బంధులు = మనస్సుతో చుట్టాలు
మాకున్ = మాకు;
మాన్యులు = గౌరవింపదగినవారు;
పెద్దలు = విద్య, వయస్సు అనువానితో పెద్దవారు;
మమున్ = మమ్ములను;
పాటించి = పరిగణనలోనికి తీసుకొని
ఈ బాలకున్ = ఈ పిల్లవానిని;
గ్రంథంబుల్ = పుస్తకాలను - శాస్త్రవిషయాలను;
చదివించి = చదివే విధంగా చేసి
నీతి కుశలున్ = నీతిలో ఆరితేరిన వానినిగా;
కాన్, చేసి = అయ్యేట్లు చేసి;
రక్షింపరే = కాపాడండి.

**తాత్పర్యము :** బాబూ ! మా అబ్బాయి గ్రుడ్డివానిలాగా ప్రవర్తిస్తున్నాడు. మా దగ్గరకు రాడు, మాటాడడు. నా పరాక్రమాల వాసన కూడా వానికి లేదు. మీరు మా యింటి గురువులు. దయగలవారు. ఆత్మీయులు. మా మన్ననలు పొందవలసినవారు. జ్ఞాన వృద్ధులు. ఈ పిల్లవానికి మంచి గ్రంథాలు చదివించి నీతిలో నేర్పరిగా చేసి రక్షించండి.

ప. 134. అంచిత భక్తితోడ దమజాధిపు గేహ సమీపమును బ్రవే
శించి సురారి రాజసుతుఁజేకొని శుక్ర కుమారకుల్ పఠిం
పించిరి పాఠ యోగ్యములు పెక్కులు శాస్త్రము లా కుమారుఁడా
లించి పఠించె నన్నియు ఁజలింపని వైష్ణవ భక్తి పూర్ణుడై.

**ప్రతి పదార్థము :**

శుక్ర కుమారకుల్ = శుక్రుని కొడుకులు;
అంచిత భక్తితోడన్ = మేలైన భక్తితో;

దనుజ + అధిప, గేహ, సమీపమున్ = రక్కసుల రేని యింటి దగ్గరను;
ప్రవేశించి = చేరి;
సుర + అరి, రాజ, సుతున్ = దేవతల పగవాడగు రక్కసుల రాజు కొడుకును;
చేకొని = గ్రహించి;
పాఠ యోగ్యములు = చదువుటకు తగినట్టి
పెక్కులు = చాల;
శాస్త్రములు = శాస్త్రములను;
పఠింపించిరి = చదివించిరి;
ఆ కుమారుడు = ఆ బాలకుడు
చలింపని = ఊగులాడని - స్థిరముగామున్న
వైష్ణవ, భక్తి, పూర్ణుఁడు, అయి = విష్ణుని యెడల భక్తితో నిండినవాడై
అన్నియున్ = అన్నింటిని;
ఆలించి = విని;
పఠించెన్ = అభ్యసించెను - చదివెను.

తాత్పర్యము : ఆ శుక్రాచార్య తనయులు రాక్షస రాజు ఇంటి సమీపంలో పాఠశాల ఏర్పరచి హిరణ్యకశిపుని కుమారునికి నేర్పదగిన శాస్త్రాల నన్నింటిని నేర్పారు. ఆ బాలుడు తనలో స్థిరంగా ఉన్న విష్ణుభక్తిని వదలకుండా అన్ని శాస్త్రాలు అభ్యసించాడు.

ప. 136. అంతం గొన్ని దినంబు లేగిన సురేంద్రారాతి శంకాన్విత
స్వాంతుండై నిజనందనుం గురువు లేజాడం బఠింపించిరో
భ్రాంతుం డేమి పఠించెనో, పిలిచి సంభాషించి విద్యాపరి
శ్రాంతిం జూచెదఁగాక నేఁడని మహాసౌధాంతరా పీనుఁడై

ప్రతిపదార్థము:

అంతన్ = అప్పుడు;
కొన్ని దినంబులు = కొన్ని రోజులు;
ఏఁగినన్ = గడువగా;
సుర+ఇంద్ర+అరాతి = దేవతల ప్రభువులకు పగవాడు - హిరణ్యకశిపుడు;
శంకా+అన్విత, స్వాంతుడు+అయి = అనుమానంతో కూడిన మనస్సు కలవాడై;
గురువులు = ఉపాధ్యాయులు;
నిజనందనున్ = నా కుమారుని;
ఏ జాడన్ = ఏ విధముగా;
పఠింపించిరో = చదివించారో;
భ్రాంతుండు = చెదరిన హృదయం కల (ఈ నా కుమారుడు)

ఏమి = ఏ విషయాలను;

పఠించెనో = నేర్చుకున్నాడో;

నేడు = ఈ రోజు

పిలిచి = పిలిచి;

సంభాషించి = మాటలాడి;

విద్యా పరిశ్రాంతిన్ = చదువులో పడిన శ్రమను;

చూచెదన్, కాక = చూస్తాను;

అని = అని;

మహాసౌధ + అంతర + ఆసీనుడు + ఐ = పెద్ద రాజభవనం లోపల కూర్చున్నవాడై (ముందు పద్యంలోనికి అన్వయం)

**తాత్పర్యము :** కొన్ని రోజులు గడిచిన తరువాత రాక్షస రాజునకు మనస్సులో కొన్ని ఆలోచనలు కలిగాయి. నా కుమారుణ్ణి ఈ గురువులు ఎలా చదివించారో!. వీడు అసలే చెదరిన హృదయం కలవాడు, ఎలా నేర్చుకున్నాడో ! ఈ దినం ఇక్కడికి పిలిచి మాటలాడి చదువులో ఎంత శ్రమ పొందాడో తెలుసుకోవాలి. అని తన మహాభవనం లోపల కూర్చుండి (కుమారుణ్ణి పిలిపించాడు).

ప. 137. మోదముతోడ దైత్యకులముఖ్యుఁడు రమ్మని చీరఁబంచెఁబ్ర
హ్లాదకుమారకున్ భవమహార్ణవతారకుఁ గామరోషలో
భాది విరోధివర్గ పరిహారకుఁ గేశవచింతనా మృతా
స్వాదకఠోరకున్ గలుషజాల మహోగ్రవనీకుఠారకున్.

**ప్రతిపదార్థము:**

దైత్యకులముఖ్యుడు = రాక్షస కులరాజు హిరణ్యకశిపుడు;

భవమహా + అర్ణవ, తారకున్ = సంసారమనే మహాసముద్రంనుండి తరింపజేసేవాడు,

కామ, రోష, లోభ + ఆది, విరోధి, వర్గ, పరిహారకున్ = కామము, క్రోధము, లోభము మొదలైన లోపలి శత్రువుల సముదాయాన్ని తొలగింప గలవాడు

కేశవ, చింతన + అమృత + ఆస్వాద కఠోరకున్ = విష్ణువును ధ్యానించటం అనే అమృతం రుచి యందు చెదరని నిష్ఠ కలవాడు

కలుష, జాల, మహా + ఉగ్ర, వనీ, కుఠారకున్ - పాపాల సముదాయమనే చాలా ఘోరమైన అడవికి గొడ్డలి అయినవాడు - అయిన

ప్రహ్లాదకుమారకున్ - ప్రహ్లాదుడనే కుమారుణ్ణి;

మోదముతోడన్ - సంతోషంతో;

రమ్ము - రా,

అని - అని

చీరన్, పంచెను - పిలువ పంపాడు.

**తాత్పర్యము :** రాక్షసరాజు హిరణ్యకశిపుడు ప్రహ్లాదకుమారుణ్ణి సంతోషంతో పిలువబంపాడు. ఆ బాలుడు సంసార సముద్రాన్ని దాటింపగలవాడు, కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము అనే లోపలి శత్రువులను సమూలంగా నాశనం

చేసికొన్నవాడు. విష్ణు ధ్యానం అనే అమృతం త్రావటంలో దృఢమైన నిష్ఠ కలవాడు. పాపాలనే మహాభయంకరమైన అడవులకు గొడ్డలి వంటివాడు.

ప. 139. ఉత్సాహ ప్రభుమంత్ర శక్తియుతమై యుద్యోగ మారూఢసం
విత్సంపన్నుఁడ వైతివే? చదివితే వేదంబులున్ శాస్త్రముల్?
వత్సా! రమ్మని చేరఁజేరి కొడుకున్ వాత్సల్య సంపూర్ణుఁడై
యుత్సంగాగ్రముఁజేర్చి దానవ విభుం డుత్కంఠ దీపింపఁగన్.

ప్రతిపదార్థము :

దానవ విభుఁడు = రాక్షసరాజు;
ఉత్కంఠ = వేడుక;
దీపింపగన్ = వెలుగొందగా;
వాత్సల్య సంపూర్ణుడు + ఐ = బిడ్డ మీది ప్రేమతో పూర్తిగా నిండినవాడై;
వత్సా = నాయనా;
రమ్ము = రా;
అని = అని
చేరన్, చీరి = దగ్గరకు తీసుకొని;
ఉత్సంగ + అగ్రమున్ = తొడమీదికి;
చేర్చి = చేర్చుకొని;
ఉద్యోగము = నీవు సాధించు గొప్ప కార్యము;
ఉత్సాహ, ప్రభు, మంత్ర, శక్తి, యుతము + ఐ = ఉత్సాహము, ప్రభువు, ఆలోచన అను మూడు శక్తులతో కూడినది - అగుటచేత;
ఆరూఢ, సంవిత్, సంపన్నుఁడవు - గట్టిగా పాదుకొనిన జ్ఞానమనెడు సంపద కలవాడవు;
ఐతివే = అయ్యావా?
వేదంబులన్ = వేదాలను;
శాస్త్రంబులన్ = శాస్త్రాలను;
చదివితే = నేర్చుకున్నావా?

**తాత్పర్యము :** రాక్షసుల రాజుకు కొడుకును చూచినంతనే ప్రేమ పొంగుకొని వచ్చింది. రా నాయనా ! అని పిలిచి తొడమీద కూర్చోబెట్టుకున్నాడు. బాబూ ! రాజనీతిలో ప్రధానమైనవి మూడు శక్తులు. మొదటిది ఉత్సాహ శక్తి. కార్యసాధనలో నిండైన ప్రీతి ఉండటం ఉత్సాహం. రెండవది పాలకుని సామర్థ్యం. మూడవది ఆలోచన. నీ పూనిక ఈ మూడూ నిండుగా ఉన్నదై అలరారుతోన్నదా? వేదాలను, శాస్త్రాలను చక్కగా అధ్యయనం చేశావా? అని అడిగాడు.

ప. 142. ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటి నూతి లోపలం
ద్రెళ్లక వీరు నేమను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్హతని దివ్య కళామయమంచు విష్ణునం
గుల్లము సేర్చి తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ!

ప్రతి పదార్థము :

నిశాచర + అగ్రణీ = రాక్షసుల నాయకుడా !

ఎల్ల శరీర ధారులకున్ = దేహం ధరించిన అందరికీ;

ఇల్లు = సంసారము;

అను చీఁకటి నూతి లోపలన్ = అనే చీకటి బావిలో;

త్రెళ్లక = పడిపోక;

వీరును = ఈ మనుజాలును,

ఏము = మేము;

అను = అనే

మతిభ్రమణంబునన్ = బుద్ధి చెదరిన స్థితితో;

భిన్నులు + ఐ - ఎవరికి వారుగా నై = ఒక్కటిగా నుండని వారై;

ప్రవర్తిల్లక = మెలగక;

సర్వమున్ = అంతా;

అతని = ఆ భగవంతుని;

దివ్య కళామయము = అతి శ్రేష్ఠమైన కళయే అయినది;

అంచున్ = అని తలచుచు;

విష్ణునందున్ = విష్ణువు నందు;

ఉల్లమున = హృదయాన్ని;

చేర్చి = భద్రంగా ఉంచి;

తారు = ఈ జనులు;

అడవిన్ = అడవి యందు

ఉండుట = ఉండటం;

మేలు = మంచిది.

తాత్పర్యము : రాక్షసరాజా ! మనకు శరీరం ఉంది. సంసారం ఉంది. అది యొక పెద్ద చీకటి బావి. అందులో పడరాదు. పడితే సర్వనాశనమే. మీరు మేము అనుకోవటం ఒక బుద్ధి తక్కువతనం. అలా ప్రవర్తిల్లరాదు. అంతా ఆ సర్వేశ్వరునితో నిండినదే అనే భావంతో దానికి నిండుదనం కలిగించే ఏకాంత ప్రదేశమైన అడవిలో ఉండటం మంచిది.

ప. 145. నాకుంజాడఁగ ఁజోద్య మయ్యెడు ఁగదా ! నాతండ్రి! యీబుద్ధి దా

నీకున్ లోపల ఁదోఁచెనో? పరులు దుర్నీతుల్ పఠింపించిరో?

యేకాంతంబున భార్గవుల్ పలికిరో? యీ దానవ శ్రేణికిన్

వైకుంఠుండు కృతాపరాధుఁడతనిన్ వర్ణింప నీకేటికిన్?

ప్రతిపదార్థము :

| | | |
|---|---|---|
| నా తండ్రి | = | నా కుమారా! |
| చూడఁగన్ | = | పలికింపగా; |
| నాకున్ | = | నాకు |
| చోద్యము | = | అబ్బురము; |
| అయ్యెడున్, కదా | = | అవుతున్నది కదా ! |
| ఈ బుద్ధి | = | ఇటు వంటి భావన; |
| తాన్ | = | తాను; |
| నీకున్ | = | నీకే; |
| లోపలన్ | = | హృదయంలో; |
| తోఁచనో | = | స్ఫురించిందా? |
| పరులు | = | పగవారు; |
| దుర్నీతుల్ | = | చెడు నీతులను; |
| పఠింపించిరో | = | చదివించారా? |
| భార్గవుల్ | = | భృగు వంశం వారు చండామార్కులు; |
| ఏకాంతంబునన్ | = | ఒంటరి ప్రదేశంలో; |
| పలికిరో | = | చెప్పారా? |
| వైకుంఠుండు | = | వైకుంఠంలో ఉండే ఆ విష్ణువు; |
| ఈ దానవ శ్రేణికిన్ | = | ఈ రాక్షసుల సముదాయానికి; |
| కృత + అపరాధుడు | = | ఎగ్గు చేసినవాడు; |
| నీకున్ | = | నీకు; |
| అతనిన్ | = | వానిని; |
| వర్ణింపన్ | = | కొనియాడటం; |
| ఏటికిన్ | = | ఎందుకు? |

**తాత్పర్యము :** నాయనా ! నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ బుద్ధి నీకే నీ మనస్సులో పుట్టిందా? లేక పగవారెవరైనా చదివించారా? ఒకవేళ నీ గురువులు చండామార్కులు ఒంటరిగా ఉన్నప్పుడు చెప్పారా ఏమి? ఆ విష్ణువు మన రాక్షసజాతికి కీడు చేసినవాడు. నీవు వానిని స్తుతించటం ఎందుకు?

ప. 146. సురలన్ దోలుటయో, సురాధిపతులన్ ద్రుక్కించుటో, సిద్ధులం
బరివేధించుటయో, మునిప్రవరులన్ బాధించుటో, యక్షకి
న్నర గంధర్వ విహంగ నాగపతుల న్నాశంబు నొందించుటో
హరి యంచున్ గిరియంచు నేల చెడు మోహాంధుండవై పుత్రకా !

ప్రతిపదార్థము :

పుత్రకా = చిన్ని కొడుకా !

సురలన్ = దేవతలను

తోలుటయో = తరిమి కొట్టటమో

సుర + అధిపతులన్ = దేవతల ప్రభువులైన దిక్కుల ఏలికలను;

స్రుక్కించుటో = పీడించటమో

సిద్ధులన్ = సిద్ధులను;

పరివేధించుటయో = మిక్కిలిగా బాధపెట్టటమో;

ముని ప్రవరులన్ = మునులలో గొప్పవారిని

బాధించుటో = హింసించటమో

యక్ష, కిన్నర, గంధర్వ, విహంగ, నాగపతులన్ = యక్షలు, కిన్నరులు, గంధర్వులు, పక్షులు, పాములు అను జాతుల ఏలికలను;

నాశంబున్ + ఒందించుటో = రూపుమాపటమో (మనము చేయాలి గానీ)

హరి = విష్ణువు;

అంచున్ = అంటూ;

గిరి = గిరి

అంచున్ = అంటూ

మోహ + అంధుండవు + ఐ = అజ్ఞానంతో కన్నులు మూసికొని పోయినవాడవై;

చెడన్, ఏల? = పాడైపోవనేల?

(సిద్ధులు, యక్షులు, కిన్నరులు, గంధర్వులు - దేవ జాతులు హరి, గిరి అన్నచోట గిరి - నిందలో వచ్చేమాట అన్నమూ లేదు, గిన్నమూ లేదు అన్నట్లు)

**తాత్పర్యము :** నా చిన్ని కుమారా ! మనం చేయువలసిన పనులు దేవతలను, దేవతల అధిపతులను, సిద్ధులను, ముని వర్యులను, యక్షులు, కిన్నరులు, గంధర్వులు, పక్షిరాజులు, సర్పరాజులు మొదలగువారిని బాధించటం, నాశనం చేయటం. మోహంతో గ్రుడ్డివాడవై హరీ గిరీ అంటూ చెడిపోతావేల?

ప. 148. అజ్ఞుల్ గొందఱు మేము దా మనుచు మాయం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యు వరాన్వయ క్రమములన్ భాషింపగా నేర రా
జిజ్ఞాసా పథమందు మూఢులు గదా! చింతింప బ్రహ్మాదివే
దజ్ఞుల్ తత్పరమాత్మ్మ విష్ణు నితరుల్ దర్శింపగా నేర్తురే?

ప్రతిపదార్థము :

కొందఱు = కొంతమంది;

అజ్ఞుల్ = ఏ కొంచెమూ జ్ఞానం లేనివారు;

మాయన్ = మాయను

చెంది = పొంది (నిజమైన తత్త్వాన్ని గ్రహించలేక దేనినో ఏదో అనుకోవటం మాయ)
మేము = మేము;
తాము = వారు;
అనుచు = అంటూ;
ప్రజ్ఞాలభ్యున్ = విశేషమైన బుద్ధికి మాత్రమే దొరికే;
సర్వ + ఆత్మకున్ = సర్వమూతానే అయిన పరమాత్మను;
వర + అన్వయ క్రమములన్ = గొప్పవైన పొందిక అయిన పద్ధతులతో;
భాషింపగాన్ = పలుకగా;
నేరరు = చాలరు;
చింతింపన్ = లోతుగా భావింపగా;
బ్రహ్మ + ఆది వేదజ్ఞుల్ = బ్రహ్మ మొదలైన వేదాలు తెలిసినవారు-కూడా;
ఆ జిజ్ఞాసా పథమందు = తెలిసికోవాలనే ఆ దారిలో;
మూఢులు + కదా ! = మోహంలో (తెలివి తక్కువ తనంలో) పడినవారే కదా !
ఇతరుల్ = తక్కినవారు;
తత్, పరమ + ఆత్మున్ = ఆ పరమాత్మ అయిన;
విష్ణున్ = అంతట నిండియున్న విష్ణువును;
దర్శింపగా నేర్తురే = చూడగలరా?

**తాత్పర్యము** : కొందరు తెలివిలేనివారు మాయలో పడి మేమూ, తామూ అంటూ గొప్పబుద్ధికి మాత్రమే సర్వాత్ముడైన విష్ణువును చక్కగా పొందుపడే మార్గాలతో స్పష్టంగా చెప్పలేరు. అజ్ఞాన మార్గంలో వేదాలను పుట్టించిన బ్రహ్మ, వానిని చక్కగా అధ్యయనం చేసిన ఇతర దేవతలు కూడా పొరపాటు పడుతూ ఉంటారు. ఇంక తక్కినవారు పరమాత్మ అయిన ఆ విష్ణువును దర్శింపగలరా? - లేరు.

ప. 152. పంచశర ద్వయస్కుడవు బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదు తర్కవాక్యములు చెప్పిన శాస్త్రములోని యర్థ మొ
క్కించుక యైనఁ జెప్ప వసురేంద్రుని ముందట మాకు నొదలల్
వంచుకొనంగఁజేసితివి వైరి విభూషణ ! వంశ దూషణా !

ప్రతిపదార్థము

వైరి విభూషణ - శత్రువును స్తుతించేవాడా !
వంశ దూషణా - వంశాన్ని పాడుచేసేవాడా !
పంచశరద్, వయస్కుడవు - అయిదేండ్ల వయస్సు కలవాడవు
బాలుడవు - పసివాడవు;
ఇంచుక, కాని, లేవు - కొంచెం కూడా లేవు
తర్క, వాక్యములు - వాదాలకు చెందిన మాటలను;

భాషించెదు = పలుకుతున్నావు

చెప్పిన శాస్త్రములోని + అర్థము = మేము బోధించిన శాస్త్రంలోని అర్థాన్ని;

ఒక్క + ఇంచుక +ఐనన్ = కొంచెమైనా కూడా;

చెప్పవు = చెప్పకున్నావు;

అసుర + ఇంద్రుని ముందటన్ = రాక్షసరాజు ఎదుట;

మాకున్ = మాకు;

ఔదలలన్ = నడి నెత్తులను;

వంచుకొనంగన్ = వంచుకొనే విధంగా;

చేసితివి = చేశావు.

**తాత్పర్యము:** శత్రువును కొనియాడుతూ వంశాన్ని చెడగొట్టుతున్న ప్రహ్లాదా ! అయిదేండ్ల వాడవు, పసివాడవు, కొంచెమైనా లేవు. తర్కం మాటలు పలుకుతున్నావు. మేము బోధించిన శాస్త్రంలోని అర్థం కొంచెం కూడా చెప్పవు. రాక్షసరాజు ముందు తలయెత్తుకొనటానికి వీలు లేకుండా చేశావు.

ఉ. 153. తనయుఁడు గాఁడు శాత్రవుఁడు దానవ భర్తకు వీఁడు దైత్యచం
దనవనమందుఁ గంటక యుతక్షితి జాతము భంగిఁబుట్టినాఁ
డనవతరతంబు రాక్షస కులాంతకుఁ బ్రస్తుతి సేయుచుండు దం
డనమునఁ గాని శిక్షలకు డాయఁడు పట్టుఁడు కొట్టుఁడుద్ధతిన్.

ప్రతిపదార్థము:

వీఁడు = ఈ పిల్లవాడు;

దానవ భర్తకున్ = రాక్షస రాజుకు;

తనయుఁడు = కొడుకు;

కాఁడు = కాదు;

శాత్రవుఁడు = పగవాడు;

దైత్య, చందన వనమందు = రక్కసులనే మంచిగంధపు తోటలో;

కంటక, యుత, క్షతి జాతము, భంగిన్ = ముళ్లతో కూడిన చెట్టు మాదిరిగా;

పుట్టినాఁడు = పుట్టాడు;

రాక్షసకుల + అంతకున్ = రాక్షసుల కులాన్ని రూపుమాపే వాడయిన హరిని;

అనవరతంబున్ = అడ్డూ ఆపూ లేకుండా

ప్రస్తుతిన్ = కొనియాడటం

చేయుచున్, ఉండున్ = చేస్తూ ఉంటాడు

దండనమునన్, కాని = శరీరంపై బాధించటం చేతనే తప్ప;

శిక్షలకున్ = బోధలకు;

| | | |
|---|---|---|
| డాయఁడు | = | లొంగడు |
| పట్టుఁడు | = | పట్టుకోండి |
| ఉద్ధతిన్ | = | క్రూరంగా; |
| కొట్టుఁడు | = | కొట్టండి |

**తాత్పర్యము :** వీడు రాక్షసరాజుకు కొడుకు గాడు. పగవాడు. రక్కసులనే మంచి గంధపు తోటలో ముళ్ల చెట్టులాగా పుట్టాడు. అలుపూ సొలుపూ లేకుండా రక్కసులను చంపే ఆ విష్ణువును పొగడుతూ ఉంటాడు. వీనికి ఉపదేశాలు పనికిరావు. పట్టుకోండి. తీవ్రంగా కొట్టండి. దండిస్తే గానీ వీడు దారికి రాడు.

ఉ. 158. త్రిప్పకుమన్న మామతము దీర్ఘములైన త్రివర్గ పాఠముల్
దప్పకు మన్న! నేఁడు మన దైత్యవ రేణ్యుని మ్రోల నేము మున్
చెప్పిన రీతి గాని మఱి చెప్పకుమన్న విరోధి పాఠముల్
విప్పకు మన్న దుష్టమగు విష్ణు చరిత్ర కథార్థ జాలమున్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అన్న | = | నాయనా! |
| మామతము | = | మేము చెప్పిన భావాన్ని; |
| దీర్ఘములు | = | ఎక్కువగా సాగినవి |
| అయిన, త్రివర్గ పాఠముల్ | = | అయినట్టి మూడు వర్గాలకు - ధర్మ, అర్థ, కామములకు సంబంధించిన పాఠాలను; |
| తప్పకుమన్న | = | తప్పవద్దు |
| నేఁడు | = | ఈ దినం |
| మన, దైత్య, వరేణ్యుని, మ్రోలన్ | = | మన రాక్షసరాజు ఎదుట; |
| ఏము | = | మేము; |
| మున్ | = | పూర్వము; |
| చెప్పిన రీతిన్ | = | చెప్పిన పద్ధతిలోనే |
| కాని | = | కాని; |
| మఱి | = | మరొక విధంగా; |
| విరోధి పాఠముల్ | = | పగవానికి చెందిన పాఠాలను; |
| చెప్పకు మన్న | = | చెప్పవద్దయ్యా; |
| దుష్టము, అగు, విష్ణు చరిత్ర, కథా + అర్థజాలమున్ | = | చెడ్డదైన విష్ణుని చరిత్రలోని కథల అర్థాల సముదాయాన్ని; |
| విప్పకుమన్న | = | విప్పవద్దు బాబూ! |

**తాత్పర్యము :** నాయనా! మా అభిప్రాయాలను తారుమారు చేయకు. మేము చాలా ఎక్కువగా చెప్పిన ధర్మ, అర్థ, కామాలకు సంబంధించిన విషయాలను తప్పించవద్దు. ఈ రోజు మన దానవరాజు ఎదుట మేము చెప్పిన పాఠాలనే కానీ వేరు వానిని శత్రువు పాఠాలను చెప్పవద్దు. చెడ్డది అయిన విష్ణు కథలను, వాని అర్థాలను విప్పవద్దు.

ప. 163. చోద్యంబయ్యెడు నింతకాల మరిగెన్ శోధిం, యేమేమి సం
వేద్యాంశంబులు సెప్పిరో! గురువు లే వెంటంబఠింపించిరో
విద్యాసార మెఱుంగఁగోరెద భవద్విజ్ఞాత శాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి సెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా !

ప్రతిపదార్థము :

| | | |
|---|---|---|
| చోద్యంబు | = | ప్రశ్న |
| అయ్యెడున్ | = | పుడుతున్నది |
| ఇంత కాలము | = | ఇంత అయిన కాలం; |
| అరిగెన్ | = | కడచింది; |
| గురువులు | = | ఉపాధ్యాయులు; |
| శోధించి | = | చక్కగా వెదకి; |
| సంవేద్య + అంశంబులు | = | తెలిసికోదగిన విషయాలు; |
| ఏమి + ఏమి | = | వేనిని వేనిని; |
| చెప్పిరో | = | చెప్పారో ! |
| ఏ వెంటన్ | = | ఏ పద్ధతిలో; |
| పఠింపించిరో | = | చదివించారో |
| విద్యా సారమున్ | = | చదువులలోని సారాన్ని; |
| ఎఱుంగన్, కోరెదన్ | = | తెలుసుకోగోరుతున్నాను; |
| భవద్, విజ్ఞాత శాస్త్రంబులోన్ | = | నీవు తెలిసికొన్న శాస్త్రంలో; |
| పద్యంబు | = | పద్యాన్ని; |
| ఒక్కటిన్ | = | ఒక దానిని; |
| చెప్పి | = | చెప్పి; |
| సార్థముగ | = | అర్థంతో పాటు; |
| తాత్పర్యంబు | = | తాత్పర్యాన్ని - (పద్య సారాంశాన్ని); |
| భాషింపుమా ! | = | పలుకు నాయనా ! |

తాత్పర్యము: నాయనా ! నేనొక విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. చాలా కాలం అయింది. గురువులు ఆయా విషయాలనన్నింటినీ వెదకి తెలుసుకోదగిన అంశాలను నీకేమేమి బోధించారు? ఏ విధంగా నిన్ను చదివించారు. నీవు నేర్చిన విద్యలో సారాన్ని తెలుసుకోవాలి. ఏదీ ఒక పద్యం చెప్పి అర్థంతో పాటు, తాత్పర్యాన్ని వివరించు.

ప. 164. నిన్నున్ మెచ్చరు నీతిశాస్త్ర మహిమన్ నీతోడి దైత్యార్భకుల్
గన్నా రన్నియుఁ జెప్పనేర్తురు గదా! గ్రంథార్థముల్ దక్షులై
యున్నా! యెప్పుడు నీవు నీతివిదు డౌ దంచున్ మహావాంఛతో
మున్నాఁడన్ ననుఁ గన్న దండ్రి! భవదీయోత్కర్షముం జూపవే !

**ప్రతిపదార్థము:**

| | | |
|---|---|---|
| అన్నా | = | బాబూ ! |
| నీతోడి, దైత్య + అర్భకుల్ | = | నీతో పాటు చదువుకొనే రాక్షస బాలకులు; |
| నీతి శాస్త్ర మహిమన్ | = | నీతి శాస్త్రాల గొప్పతనంలో; |
| నిన్నున్ | = | నిన్ను |
| మెచ్చరు | = | మెచ్చుకొనరు |
| అన్నియున్ | = | విద్యలన్నింటిని; |
| కన్నారు | = | పొందారు; |
| దక్షులు + ఐ | = | సమర్థులై; |
| గ్రంథ + అర్థముల్ | = | గ్రంథాలలోని అర్థాలను; |
| చెప్పనేర్తురు, కదా | = | చెప్పగలుగుతున్నారు కదయ్యా ! |
| నీవు | = | నీవు; |
| ఎన్నడు | = | ఎప్పుడు; |
| నీతివిదుఁడు | = | నీతి తెలిసిన వాడవు; |
| ఔదు | = | అవుతావు; |
| అంచున్ | = | అనుచు; |
| మహావాంఛతో | = | పెద్ద కోరికతో; |
| ఉన్నాఁడన్ | = | ఉన్నాను; |
| ననున్ | = | నన్ను |
| కన్న తండ్రి | = | కన్న తండ్రీ (ఇది ప్రేమతో అనేమాట); |
| భవదీయ + ఉత్కర్షమున్ | = | నీదైన పాండిత్య విశేషాన్ని (గొప్పతనాన్ని) |
| చూపవే | = | చూపు నాయనా ! |

**తాత్పర్యము:** నాయనా ! నన్ను కన్న తండ్రీ ! నీతోపాటు చదువుకుంటున్న రాక్షస బాలకులు నీతి పాఠాల మహిమలో నిన్ను మెచ్చుకున్నారు. (ప్రహ్లాదుడు మంచి విద్యార్థి అని చెప్పటం లేదు). వారేమో అన్ని విద్యలూ చక్కగా నేర్చి ఏ గ్రంథంలో ఏ అర్థాన్ని అడిగినా సమర్థతతో చెప్పగలుగుతున్నారు. నీవెప్పుడు నీతిలో పండితుడ వౌతావా అని పెద్ద కోరికతో ఉన్నాను. ఏదీ ! నీ గొప్పతనాన్ని ప్రదర్శించు.

ప. 167. తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా !

**ప్రతిపదార్థము:**

| | | |
|---|---|---|
| దైత్య + ఉత్తమా | = | రాక్షసులలో గొప్పవాడా ! |
| తను, హృద్, భాషలన్ | = | దేహము, హృదయము, మాట అనువానితో; |

సఖ్యమున్ = స్నేహ భావమును;
శ్రవణమున్ = (భగవంతుని కథలను మొదలగువానిని) వినటం,
దాసత్వమున్ = దాసుడుగా కావటము,
వందన, అర్చనముల్ = నమస్కరించటమూ, పూజించటమూ,
సేవయున్ = పనులు చేయుటమూ;
ఆత్మలోన్ = హృదయంలో;
ఎరుకయున్ = తెలిసికొని ఉండటమూ;
సంకీర్తనల్ = పాటలు పాడుతూ కొనియాడటమూ
చింతనంబు = భావిస్తూ ఉండటమూ;
అను, ఈ తొమ్మిది భక్తి మార్గములన్ = అనే యీ తొమ్మిది భక్తికి సంబంధించిన పద్ధతులతో;
సర్వ + ఆత్మున్ = అందరకు, అన్నింటికి ఆత్మ అయిన;
హరిన్ = విష్ణువును;
నమ్మి = నమ్ముకొని;
సద్ + జనుఁడు = మంచి నడవడి కలవాడు;
ఐ = అయి;
ఉండుట = ఉండటం
భద్రము = మేలు;
అంచున్ = అనుకొనుచు
తలంతున్ = భావిస్తూ ఉంటాను.
సత్యము = నిక్కము

**తాత్పర్యము :** రాక్షసాధిపా ! భక్తి మార్గాలు తొమ్మిది ఉన్నాయి. మాట, మనసు, చేష్ట అనే మూడు కరణాలతో భగవంతు యందు చెలిమి కలిగి ఉండటం, ఆతని గుణాలను వినటం, దాసునివలె ప్రవర్తించటం, నమస్కరించటం, పూజలు చేయటం, సేవ చేయటం అంతరంగంలో అతని జ్ఞానాన్ని నిలుపుకోవటం, అతనిని మంచి పాటలతో కొనియాడుతూ ఉండటం - ఇవి ఆ తొమ్మిది. ఈ మార్గా ద్వారా సర్వాత్మకుడైన హరిని నమ్మి మంచి నడవడితో బ్రదకటం భద్రమైన విషయం. ఇది సత్యం.

ప. 168. అంధేందూదయముల్ మహాబధిరశంఖారావముల్ మూక స
ద్గ్రంధా ఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావళీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధ ద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సంసారముల్.

**ప్రతిపదార్థము:**

హరి, భక్తి, వర్జితుల, రిక్త, వ్యర్థ, సంసారముల్ = విష్ణుభక్తిలేని వట్టిపోయిన, పనికిమాలిన బ్రదుకులు
అంధ + ఇందు + ఉదయముల్ = గ్రుడ్డి వానికి చంద్రుని ఉదయాలు;
మహాబధిర శంఖ + ఆరావముల్ = గొప్ప చెవిటి వానికి ఊదిన శంఖాల ధ్వనులు;

మూక, సద్, గ్రంథ, + ఆఖ్యానముల్ = మూగివానికి చేసిన ఉత్తమ గ్రంథాల బోధనలు
నపుంసక, వధూ, కాంక్షల్ = మగతనం లేనివానికి కలిగిన స్త్రీలపై కోరికలు;
కృతఘ్న + ఆవళీ, బంధుత్వంబులు = చేసిన మేలు గుర్తించక ద్రోహం చేసే వారి చుట్టరికాలు.
భస్మ, హవ్యములు = బూడిదలో పోసిన హోమద్రవ్యాలు;
లుబ్ధ ద్రవ్యముల్ = పిసినిగొట్టు వారి ధనాలు;
క్రోడ సద్గంధంబుల్ = పందికి అందించిన సువాసన వస్తువులు;

**తాత్పర్యము :** తండ్రీ ! విష్ణుభక్తిలేనివారి సారంలేని పాడు బ్రదుకులు గ్రుడ్డివానికి చూపిన చంద్రుని ఉదయం వంటివి. పెద్దగా చెవుడు గలవానికి శంఖ ధ్వని వినిపించటం వంటివి. మూగివానికి గొప్ప గ్రంథాలను ఉపదేశం చేయటం వంటివి. పేడివానికి పెళ్లి కూతురి మీది మోజు వంటివి. కృతఘ్నులతో చుట్టరికం వంటివి. బూడిదలో వేసిన హోమద్రవ్యాల వంటివి. పిసిని గొట్టువాని ధనం వంటివి. పందికి మంచి వాసనలు చూపటం వంటివి. (ఆ బ్రదుకులు ఏ మాత్రమూ సార్థకం లేనివని భావం.)

ప. 173. పటుతర నీతి శాస్త్రచయ పారగుఁ జేసెద నంచు బాలు నీ
వటు గొని పోయి వానికి ననర్థము లైన విరోధి శాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాడవు భృగు ప్రవరుండ వటంచు నమ్మితిన్
గటకట ! బ్రాహ్మణాకృతివి గాక యథార్థపు బ్రాహ్మణుండవే?

**ప్రతిపదార్థము :**

నీవు = నీవు;
బాలున్ = పిల్లవానిని;
పటుతర, నీతి, శాస్త్ర, చయ, పారగున్ = మిక్కిలి దృఢమైన నీతిశాస్త్రాలను తుదిముట్ట చదివే వానినిగా
చేసెదన్ = చేస్తాను;
అంచున్ = అంటూ;
అటు = ఆవలికి;
కొనిపోయి = తీసుకొని వెళ్లి;
వానికిన్ = వానికి;
అనర్థములు, అయిన, విరోధి శాస్త్రముల్ = తగనివైన పగవాని విషయాలు;
కుటిలతన్ = వంకర బుద్ధితో - మోసంతో;
చెప్పినాడవు = బోధించావు;
కటకట = అయ్యయ్యో!
భృగు ప్రవరుండవు = భృగు వంశంలో మిక్కిలి గొప్పవాడవు
అటంచున్ = అనుకొంటూ;
నమ్మితిన్ = విశ్వాసం పొంది ఉన్నాను;
బ్రాహ్మణ + ఆకృతివి = బాపని ఆకారం గలవాడవు;

కాక = కానీ;

యథార్థవు, బ్రాహ్మణుండవే = నిక్కమైన విప్రుడవా

**తాత్పర్యము:** మీ కుమారుణ్ణి నీతిశాస్త్రంలో గట్టి పాండిత్యం కలవానినిగా చేస్తానని తీసుకొని వెళ్లావు. కానీ వంచనతో పగవాని శాస్త్రాలు పట్టించావు. నీవు భృగు వంశంలో శ్రేష్ఠుడవని నమ్మాను. కేవలం ఆకారంతో మాత్రమే బ్రాహ్మణుడవు గానీ, నిజమైన బ్రాహ్మణత్వం నీలోలేదు.

ప. 176. తప్పులు లేవు మా వలన దానవనాథ! విరోధి శాస్త్రముల్
సెప్పము, క్రూరులై పరులు సెప్పరు మీ చరణంబులానసు
మ్మెప్పుడు మీ కుమారకున కింతయు నైజమనీష; యెవ్వరుం
జెప్పెడి పాడిగాదు ప్రతిచింతఁ దలంపుము నేర్పు కైవడిన్.

ప్రతిపదార్థము :

దానవనాథ = రాక్షసరాజా!

మా వలనన్ = మా వైపు

తప్పులు = దోసగులు;

లేవు = లేవు;

విరోధి/శాస్త్రముల్ = పగవాని శాస్త్రాలు;

చెప్పము = బోధింపము;

పరులు = ఇతరులు;

క్రూరులు + ఐ = హింసించే బుద్ధి కలవారై;

చెప్పరు = బోధించలేదు;

మీ చరణంబులాన = మీ పాదాల మీద ఒట్టు;

సుమ్ము = సుమా!

ఇంతయున్ = ఇదంతా;

మీ కుమారునకున్ = మీ అబ్బాయికి

నైజమనీష = సహజంగా పుట్టిన బుద్ధి

ఎవ్వరున్ = ఎవరూ;

చెప్పెడిపాడి, కాదు = చెప్పే తీరు కాదు;

నేర్పుకైవడిన్ = నీ నేర్పు గట్టిగా ఉపయోగించి;

ప్రతిచింతన్ = దీనికి విరుగుడు అయిన భావనను (ప్రతి క్రియను)

తలంపుము = ఆలోచించు.

**తాత్పర్యము :** మహారాజా! మాలో ఏ దోషమూ లేదు. మేము శత్రువు శాస్త్రాలు బోధించలేదు. ఇతరులు ఎవ్వరూ కూడా ...రులై ఉపదేశించలేదు. ఇది మీ కొడుకుకు సహజంగా పుట్టిన బుద్ధి. ఒకరు బోధిస్తే వచ్చే విద్య కాదు. దీనికి నేర్చుకొలదీ ఏదో ఒక ... క్రియను ఆలోచించు.

ప. 181. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మఱలఁ జర్వితచర్వణులైన వారికిని
జెచ్చెరఁ బుట్టునే? పరులు సెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁగానలకు నేగిన నైన హరి ప్రబోధముల్.

ప్రతిపదార్థము:

| | | |
|---|---|---|
| అచ్చము + చీకటిన్ | = | అచ్చమైన అజ్ఞానమనే చీకటిలో; |
| పడి | = | పడిపోయి; |
| గృహవ్రతులు + ఐ | = | సంసారమందే నిష్ఠ కలవారై; |
| విషయ ప్రవిష్టులు + ఐ | = | విషయాలలో దూరినవారై; |
| చచ్చుచున్ | = | చస్తూ; |
| పుట్టుచున్ | = | పుడుతూ |
| మరలన్ | = | తిరిగి; |

చర్విత చర్వణులు, అయినవారికిన్ = నమిలిన దానినే నమిలే పనికిమాలిన పనిలో మునిగిన వారికి;

| | | |
|---|---|---|
| హరి ప్రబోధముల్ | = | విష్ణువును గూర్చిన ఉప దేశాలు; |
| పరులు | = | ఇతరులు; |
| చెప్పినన్, ఐనన్ | = | చెప్పినా గానీ; |
| నిజ + ఇచ్ఛన్, ఐనన్ | = | తమ కోరికమేరకు గానీ; |
| ఏమి | = | దేనిని; |
| ఇచ్చినన్, ఐనన్ | = | ఇచ్చినా గానీ; |
| చెచ్చెరన్ | = | తొందరగా; |
| పుట్టునే | = | కలుగుతాయా? |

**తాత్పర్యము :** రాజా! ఇది ఒక అచ్చమైన అంధకారం వంటి సంసారం. అందులోపడి అందులోనే నిష్ఠగా బ్రదుకుతూ శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనే విషయాలలో మునిగి తేలుతూ మరల మరల జనన మరణాలు పొందటం అలవాటుగా అయిన వారికి ఇతరులు బోధించినా, తన ఇచ్ఛననుసరించి అయినా, ఏమిచ్చినా హరికి సంబంధించిన జ్ఞానం పుట్టదు.

(చర్విత చర్వణులు - నమిలినదానినే నమిలే వారు. అందులో మంచి చెడ్డలను భావించకుండా వ్యసన రూపంలో ప్రవర్తించేవారు - అని అర్థం).

ప. 182. కాననివాని నూతగొని కాననివాఁడు విశిష్ట వస్తువుల్
గాననిభంగి గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁగందు రకించన వైష్ణవాంఘ్రి సం
స్థానరజోగు భిషిక్తులగు సంహృతకర్ములు దానవేశ్వరా!

ప్రతిపదార్థము :

| | | |
|---|---|---|
| దానవ + ఈశ్వరా ! | = | రాక్షస ప్రభూ ! |
| కొందరు | = | కొంతమంది; |
| కాననివాడు | = | గ్రుడ్డివాడు; |
| కానని వానిన్ | = | గ్రుడ్డి వానిని; |
| ఊతగొని | = | ఆధారంగా గ్రహించి; |
| విశిష్ట వస్తువుల్ | = | మేలైన పదార్థాలను; |
| కానని భంగిన్ | = | చూడలేని విధంగా; |
| కర్మములు | = | యజ్ఞములు మొదలైన కర్మములను; |
| కైకొని | = | పట్టుకొని; |
| కర్మబద్ధులు + ఐ | = | కర్మముల బంధంలో చిక్కుకొని పోయి; |
| విష్ణున్ | = | అంతటా నిండి ఉన్న పరమాత్మను; |
| కానరు | = | చూడరు; |
| కొందరు | = | మరి కొందరు; |

అకించన, వైష్ణవ + అంఘ్రి, సంస్థాన, రజస్ + అభిషిక్తులు = ఇతరమెరుగక, విష్ణువు పాదాల మీది దుమ్ముతో స్నానమాడినవారు

| | | |
|---|---|---|
| అగు, సంప్రాప్త కర్ములు | = | అయిన, పూర్తిగా తొలగించుకొన్న కర్మలు కలవారు; |
| అటన్ | = | ఆ వైపు - విష్ణుని; |
| కందురు | = | చూస్తారు. |

తాత్పర్యము: దానవాధిపా ! గ్రుడ్డివానిని ఆసరాగా తీసుకొన్న గ్రుడ్డివాడు ఏ వస్తువునైనా చూస్తాడా ! అలాగే కర్మములను పట్టుకొని ఆ బంధాలలో చిక్కుకొన్నవారు విష్ణువును చూడలేరు. అనన్య భావంతో విష్ణు పాదాల ధూళిని ఒడలంతా నింపుకొన్నవారు మాత్రమే చూడగలుగుతారు.

ప. 183. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ ! వేయేటికిన్
గాథల్, మాధవ శేముషీతరణి సాంగత్యం బునంగాక దు
ర్మేధన్ దాటఁగ వచ్చునే? సుతవధూ నోగ్రవాంఛా మీద
క్రోధోల్లోల విశాల సంసృతి మహా ఘోరామితాం భోనిధిన్.

ప్రతిపదార్థము :

| | | |
|---|---|---|
| రక్షోనాథ | = | రాక్షసరాజా ! |
| గాథల్ | = | కథలు; |
| వేయి | = | వేయు; |
| ఏటికిన్ | = | ఎందుకు? |
| సర్వశాస్త్రములు | = | శాస్త్రాలన్నీ; |

శోధింపంబడెన్ = చక్కగా వెదక బడ్డాయి.

సుత = అంభోనిధిన్

సుత = కొడుకులు (సంతానము)

వధూ = భార్య - అను

మీన = పెను చేపలతో భయంకరం అయినది;

వాంఛా = కామము,

మద = పొగరు,

క్రోధ = కోపము మొదలైన వానితో

ఉల్లోల = పెద్ద అలలతో ఎగిరి పడుతూ ఉండే

సంసృతి = సంసారమనే

మహాఘూర = మిక్కిలి ఘోరమైన;

అమిత = అతి విశాలమైన;

అంభోనిధిన్ = మహా సముద్రాన్ని;

మాధవ, శేముషీ తరణి సాంగత్యంబునన్ = విష్ణునిపై బుద్ధి అనే నావతోడి కలయికతో;

కాక = తప్పు;

దుర్మేధన్ = చెడిన బుద్ధితో;

దాటంగ వచ్చునే = దాట వచ్చునా?

**తాత్పర్యం ;** రాక్షసాధిపా ! సంసారం ఒక పెద్ద సముద్రం. అందులో సంతానము, భార్య మొదలైనవే పెద్ద జల జంతువులు. కామము, క్రోధము, మదము మొదలైన భయంకర గుణాలే పెద్ద అలలు. అది చాలా ఘోరమైనది. ఒడ్డు కానరానిది. అది దాటాలంటే విష్ణువునందలి నిరంతర భావన అనే నావ అంటిపెట్టుకొని ఉండటం ఒక్కటే మార్గం. పాడు బుద్ధులతో దానిని ఎవ్వరూ దాటలేరు.

## 1.6. సందర్భ సహిత వ్యాఖ్యలు :-

**1. "చదివిన సదసద్వి వేక చతురత గలుగున్"**

**పరిచయం:** శ్రీ మదాంధ్ర మహాభాగవతం - ఏడవ స్కంధంలోనిది ఈ వాక్యం. రచయిత బమ్మెర పోతన.

**సందర్భం:** పలికిన వాడు హిరణ్యకశిపుడు. పలికింది ప్రహ్లాదునితో, తన కుమారుడు తాను భావించిన తీరులో రూపొందటం లేదని మనస్సులో బాధపడిన రాక్షసరాజు చదువు స్థితిగతులను గురించి మాటాడుతూ ఇలా అన్నాడు.

**వివరణ :** "నాయనా ! ప్రహ్లాదా ! చదువులేకపోతే మనుజుడు ఏమీ తెలియని వాడవుతాడు. పశువుకూ అతనికీ తేడా ఉండదు. చదువుకుంటే మంచిని, చెడును చక్కగా తెలిసికోగల నేర్పు కలుగుతుంది. అందుకని చదువుకోవాలి. మంచి గురువుల దగ్గర నిన్ను చదివిస్తాను. చదువుకో." అని హిరణ్యకశిపుడు పలికాడు.

సత్ అంటే మంచిది, ఉన్నది అని అర్థం. అదికానిది అసత్తు. వీనిని విస్పష్టంగా వేరు చేసి చూడగలగాలి. సత్తును ఆచరించాలి. అసత్తును విడనాడాలి. దీనికి కావలసిన నేర్పు చదువు వలన కలుగుతుందని వాక్యం భావం.

**2. " అన్నియు రూపించిన మిథ్యలు"**

**పరిచయం :** ఆంధ్ర భాగవతం - సప్తమస్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం.

**సందర్భం :** ఇది కవి ప్రహ్లాదుని విద్యాగ్రహణ విధానం గురించి చెప్పిన మాట.

**వివరణ :** గురువులు విద్యను బోధిస్తారు. శిష్యులు అందులోని విషయాలను భావిస్తూ ఉండాలి. అవసరమైన చోట తెలిసికొనే కోరికతో గురువులను వినయంగా ప్రశ్నించాలి. కానీ ప్రహ్లాదుడు ఆ పని చేయలేదు. గురువులు బోధించే విషయాలన్నీ సంసారానికి, బంధానికి సంబంధించిన విషయాలని అతనికి తెలుసు. అందువలన నోరెత్తకుండా వింటాడు. ఆక్షేపాలు చెప్పడు. వారు చెప్పే విద్యలన్నీ తత్త్వ దృష్టితో అబద్ధాలని నిరూపితమయ్యాయని అతని భావన.

**3. "భ్రాంతుండేమి పఠించెనో"**

**పరిచయం :** ఆంధ్రభాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం. రచయిత బమ్మెర పోతన.

**సందర్భం :** కుమారుని విద్యకోసం గురుకులానికి పంపిన తరువాత కొన్నాళ్ళకు తండ్రి హిరణ్యకశిపుడు అతని స్థితిగతులను గూర్చి ఊహిస్తూ ఇలా అనుకుంటున్నాడు.

**వివరణ :** "గురువులు చదివిస్తామని బాలకుని తీసుకొని పోయారు. ఏ విషయాలు ఏ విధంగా బోధిస్తున్నారో తెలుసుకోవాలి. ఈ ప్రహ్లాదుడు భ్రాంతుడు. ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా చూచే విపరీతపు ఆలోచనలవాడు. గురువులు చెప్పిన దానిని సరిగా చదువుతున్నాడో సొంత భావనలను పెంచుకుంటున్నాడో" అని హిరణ్యకశిపుని శంక ఇందులో తెలియవస్తున్నది.

**4. "జనకులకుం గర్ణయుగళ సద్భూషణముల్"**

**పరిచయం :** పోతన రచించిన ఆంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం.

**సందర్భం :** విద్యలో కుమారుని పరీక్షించాలని సంకల్పం కలిగిన హిరణ్యకశిపుడు అతనిని పిలిపించి వాత్సల్యంతో ఒడిలో కూర్చుండబెట్టుకొని కలిగిన ఆనందాన్ని మాటలతో తెలుపుతున్నాడు.

**వివరణ :** చిన్ని వయస్సు గల కొడుకులు ముద్దుముద్దుగా మాటాడటం కన్నవారిని ప్రతిదినమూ ఆనందపరుస్తాయి. ఎంత అలసినా, ఏదో కారణం చేత మనస్సు వేడి ఎక్కి ఉన్నా, హృదయంలో దుఃఖం అలముకున్నా పిల్లల మాటలు ఆ అన్నింటినీ తొలగించి వేస్తాయి. రెండు చెవులకు అవే నిజమైన ఆభరణాలు. అంటే ఆభరణాలు పెట్టుకున్నందు వలన కలిగే ఆనందం కంటే పిల్లల మాటలు విన్నప్పుడు కలిగే ఆనందం చాలా గొప్పదని భావం.

**5. "తారడవి నుండుట మేలు".**

**పరిచయం :** పోతనామాత్యుని రచన ఆంధ్ర మహాభాగవతం ఏడవ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం.

**సందర్భం :** తండ్రి హిరణ్యకశిపుని ప్రశ్న "నీకు భద్రమైయున్నది ఏది" అనేదానికి సమాధానంగా ప్రహ్లాదుడు ఇలా అన్నాడు.

**వివరణ :** ఈ సంసారం ఒక ఘోరమైన చీకటి బావి వంటిది. అందులో పడగూడదు. సృష్టిలో అందరిలో, అన్నింటిలో ఉన్న పరమాత్మను మాత్రమే దర్శించాలి. మీరు, మేమూ అనే భేదభావన పెట్టుకోకూడదు. అది బుద్ధి చలించిన వారి ధోరణి. సర్వమూ విష్ణుమయమే అనే జ్ఞానాన్ని పొందాలి. ఆ జ్ఞానానికి తోడుపడేది జనసంచారంలేని అడవి మాత్రమే. ఇక్కడ అడవి అంటే సంబంధాలు, సంపర్కాలు లేని మనఃస్థితి. అందులో ఉండటం భద్రమైన విషయం - అని ప్రహ్లాదుడు తండ్రికి తెలియజెప్పాడు.

6. "హరియంచుం గిరియంచు నేలచెడ"

**పరిచయం :** బమ్మెరపోతన వ్రాసిన ఆంధ్ర భాగవతం ఏడవ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం.

**సందర్భం :** వైరాగ్య భావంతో ప్రహ్లాదుడు పలుకగా కోపం వస్తున్న తొలి దశలో హిరణ్యకశిపుడు రాక్షసులకు కర్తవ్యం ఏది? కానిది ఏది అని తెలియజేస్తూ పలికిన మాట ఇది.

**వివరణ :** నాయనా మనం జాతినిబట్టి రాక్షసులం. మనకు కొన్ని చేయవలసిన పనులు ఉన్నాయి. దేవతలను, అట్టివారిని సర్వకాలాలలో బాధించటం మన పని. దానియందు నీకు దృష్టిలేకపోగా చేయరాని పనికూడా చేస్తున్నావు. అదేమింటే "హరీ గిరీ" అంటూ మోహంతో కనుగానక చెడిపోతున్నావు. హరి మనకు పగవాడు. అట్టివాని మీద భక్తి ఉండటమే చెడిపోవటం. అదికూడదు - అంటున్నాడు హిరణ్యకశిపుడు.

ఇక్కడ 'గిరి' లో 'గి' నిందలో వచ్చే అక్షరం. అందులో వెక్కిరింతతో పాటు వాడొక బండ అనే నింద కూడ ఉంది. అంతేకాదు. 'కిరి' లో కకారం సంధిలో గకారంగా మారుతుంది. కిరి అంటే పంది. వాడొక పంది అనే కసితో కూడిన భావన కూడా ఇందులో ఉంది.

7. "చిత్త మితరంబు నేరీతి ( జేరనేర్చు?"

**పరిచయము :** శ్రీమదాంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్ర లోనిది ఈ వాక్యం. రచయిత బమ్మెర పోతన.

**సందర్భం :** ప్రహ్లాదుడు తండ్రి బోధనలకు లొంగక తన హృదయంలో ఉన్న విష్ణుభక్తిని గూర్చి సుదృఢంగా ప్రకటిస్తున్న సందర్భం. ఇది గురువును చూచి ప్రహ్లాదుడు పలికిన మాట.

**వివరణ :** ఆచార్యా ! నా హృదయం అమృతాన్ని త్రావి పరవశతతో ఊగిపోతున్నది. ఆ అమృతం విష్ణు పాద చింతన. అది త్రావిన వానికి తక్కినవన్నీ పరమనీచంగా కనిపిస్తాయి. ఆ నా హృదయాన్ని మరొక దానిమీద మళ్లించటం నాకూ మీకూ సాధ్యంకాని విషయం, తుమ్మెద ఉమ్మెత్తలకు, రాజహంస నీటిపడియలకు, కోయిల కొండగోగులకూ, చకోరం పిట్ట మంచుముద్దలకు వెళ్లే విధంగా ఎవ్వరూ ఎలా చేయలేరో నా హృదయాన్ని నారాయణ పాద పద్మాల నుండి వేరు చేయటం కూడా ఎవరూ చేయలేరు.

8. "మాకు నౌదలల్ వంచుకొనంగ(జేసితివి"

**పరిచయం :** ఆంధ్ర మహాభాగవతం ఏడవ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం. రచయిత బమ్మెర పోతన.

**సందర్భం :** తన మనస్సు విష్ణువు మీది నుండి తిరుగదని ఖండితంగా చెప్పిన ప్రహ్లాదుని మీద మండిపడుతూ రాజపురోహితుడు పలికిన మాట.

**వివరణ :** నీవు పగవానిని ప్రశంసిస్తున్నావు. వంశాన్ని చెడగొడుతున్నావు. పిట్టకొంచెం కూతఘనం అన్నట్లు అయిదేండ్లు నిండాయో లేదో తర్కం మాటలు పలుకుతున్నావు. మేము బోధించిన శాస్త్రాలలోని ఒక అర్థం కూడ మీ తండ్రి ముందు చెప్పకున్నావు. దీనితో మేము దుర్బోధ చేస్తున్నామని మీ తండ్రి ఆగ్రహంతో మమ్ములను శంకిస్తున్నాడు. ఈ విధంగా మేము ఉత్తమ ఉపాధ్యాయులుగా తలయెత్తికొని బ్రదకవలసిన వాళ్లం, నీ కారణంగా తలలు వంచుకోవలసిన దశ దాపురించింది - అని గురువులు ఆవేదనను వెళ్లగక్కారు.

9. "శిక్షలకు దాయడు పట్టుడు కొట్టు దుద్దతిన్ "

**పరిచయం :** ప్రహ్లాద చరిత్రలోనిది. రచయిత బమ్మెర పోతన. గ్రంథం శ్రీమదాంధ్ర మహాభాగవతం - సప్తమస్కంధం.

**సందర్భం :** ప్రహ్లాదుని భక్తి వాక్యాలకు హిరణ్యకశిపునికి ఆగ్రహం వచ్చిందని గుర్తించిన గురువులు అతనిని నిందిస్తూ పలికిన సందర్భం.

**వివరణ :** ఇతడు మామూలుగా చెప్పే మంచి మాటలకు లొంగడు. దండం దశ గుణం భవేత్తన్నట్లు పట్టుకొని కొడితేగానీ వీనికి బుద్ధి రాదు. దండించండి. తండ్రికి కోపం తెప్పించే పనులు చేసినవాడు తనయుడు కాడు. శత్రువు. రాక్షసకులం అనే మంచిగంధపు తోపులో విషంతో కూడిన వృక్షంలా పెరిగాడు - అని అవమాన భారంతో అధ్యాపకులు మహారాజుముందు రాజకుమారుని గూర్చి పలికారు.

**10. "విప్పకు మన్న దుష్టమగు విష్ణు చరిత్ర కథార్థ జాలమున్"**

**పరిచయము:** తెలుగు భాగవతంలోని ఏడవ స్కంధమునందలి ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం. కవి బమ్మెర పోతన.

**సందర్భం :** ప్రహ్లాదునికి తండ్రి ఏర్పాటు చేసిన గురువు తన శక్తి మేరకు విద్యలన్నీ చెప్పి తండ్రి దగ్గరకు పరీక్ష కోసం తీసుకొని పోతూ హెచ్చరికలు చేస్తున్న సందర్భం.

**వివరణ :** నాయనా ! బాబూ ! మేము చెప్పిన పాఠాలే మీ నాయన ముందు వివరించు. పొరపాటు రానీయకు. మాకు అవమానం కలిగే విధంగా, నిన్ను మీ తండ్రి శిక్షించే విధంగా మన జాతికి శత్రువైన విష్ణుని పాడు కథలను విప్పకు. కావాలనుకుంటే నీ హృదయంలో ఉంచుకో. తండ్రి దగ్గర మేము ఏ ధర్మార్థకామాలను గురించి బోధించామో అవే చెప్పాలి సుమా - అని వారి హెచ్చరిక.

**11. "పద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమీ".**

**పరిచయం :** శ్రీమదాంధ్ర మహాభాగవతం - సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రనుండి గ్రహించిన వాక్యం ఇది. కవి బమ్మెరపోతన.

**సందర్భం :** రెండవమారు ప్రహ్లాదుణ్ణి గురువులు హిరణ్యకశిపుని దగ్గరకు తీసుకొని వచ్చినపుడు తండ్రి కొడుకుతో మాటాడుతున్న సందర్భం.

**వివరణ :** నాయనా! చాలాకాలం అయింది. గురువులు ఏమేమి పాఠాలు చెప్పారు. తెలిసికోదగిన విషయాలు ఏమేమి తెలుసుకున్నావు. నీ చదువులో సారం తెలుసుకోవాలి. ఏదీ ! ఒక పద్యం చెప్పు. అర్థంతో పాటు తాత్పర్యం వివరించు - అన్నాడు.

**12. "చదువులలో మర్మమెల్లఁ జదివితి "**

**పరిచయం :** ఆంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది ఈ వాక్యం. కవి బమ్మెర పోతన.

**సందర్భం :** ఏమి చదువుకున్నావో తెలుసుకోవాలి. ఏదైనా పద్యం చెప్పి అర్థంతో పాటు తాత్పర్యం వివరించు - అని తండ్రి అడుగగా ప్రహ్లాదుడు సమాధానంగా చెప్పిన మాటలలోనిది ఈ వాక్యం.

**వివరణ :** తండ్రీ! గురువులు నన్ను బాగుగా చదివించారు. ధర్మ శాస్త్రాలు, అర్థశాస్త్రాలు మొదలైనవి చాలా చదివాను. అంతేకాదు చదువులు పైపైగా కాదు. వానిలో రహస్యాల నన్నింటినీ హృదయానికి పట్టించుకుంటూ చదివాను. దీనిని బట్టి చదువు అంటే లోతుగా రహస్యంగా ఉన్న భావాలను పట్టుకుంటూ చదవటం - అనేభావం ప్రహ్లాదునకు ఉన్నట్లు తెలుస్తుంది.

**13. "సజ్జనుడై యుండుట భద్రము"**

**పరిచయం :** ఈ వాక్యం ప్రహ్లాద కథలోనిది. ఆ కథ ఆంధ్ర మహాభాగవతం ఏడవ స్కంధంలోనిది. కవి బమ్మెర పోతన.

**సందర్భం :** ప్రహ్లాదుడు తనవిద్యా ప్రాభవాన్ని వివరిస్తూ తండ్రితో పలికిన సందర్భంలోనిది ఈ వాక్యం.

**వివరణ :** మనిషిగా పుట్టటం పెద్దకష్టమైన విషయం కాదు. నిజమైన మనిషి కావటం చాలాకష్టం. అందులోనూ సజ్జనుడు కావటం ఇంకా దుష్కరం. ప్రహ్లాదుని అభిప్రాయంలో సజ్జనుడు అంటే తొమ్మిది విధాలైన భక్తి మార్గాలతో పరమాత్మను హృదయంలో పదిలంగా చెదరకుండా నిలుపుకోవటమే. అది యొక్కటే మేలు దారి అని తండ్రికి కొడుకు వివరించాడు.

**14. "పాదయుగముతోడి పశువు"**

**పరిచయం :** ఆంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది యీ వాక్యం. రచన బమ్మెర పోత[illegible]ాత్యునిది.

సందర్భం : ప్రహ్లాదుడు తండ్రికి విష్ణుభక్తి లేనివాని బ్రతుకు ఎంత వ్యర్థమైనదో చెబుతున్న సన్నివేశం.

వివరణ : మనకు భగవంతుడు చేతులు, కాళ్లు మొదలైన అవయవాలను ప్రసాదించాడు. వానికి ఒక సాధారణ ప్రయోజనాన్నీ, ఒక విశేష ప్రయోజనాన్నీ ఏర్పరచాడు. సాధరణ ప్రయోజనం, దాని అంతట అదే జరిగిపోతుంది. విశేష ప్రయోజనాన్ని వివేకంతో సాధించాలి. లేకపోతే ఆ అవయవాలు పనికి మాలినవి అవుతాయి. దానిని ప్రతిపాదిస్తూ ప్రహ్లాదుడు విష్ణుభక్తిలేని పండితుడు పండితుడు కాడు. వింతగొడ్డు అంటున్నాడు. వింత ఏమిటంటే పశువులకు నాలుగు కాళ్లుంటాయి. వీనికి రెండే ఉంటాయి. ఒక విధంగా అట్టివానిని పశువులు కూడా పశువు అని అంగీకరించవని తాత్పర్యం .

15. "బ్రాహ్మణాకృతివి గాక యథార్థపు బ్రాహ్మణుండవే"

పరిచయం : ఆంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోనిది యీ వాక్యం. కవి బమ్మెర పోతన.

సందర్భం : తన కొడుకు తనకు శత్రువైన విష్ణువును గూర్చి పరమ భక్తితో మాటాడుతూ ఉంటే సహింపని హిరణ్యకశిపుడు గురువే కపటంగా ఈ బుద్ధులు నేర్పాడని భావిస్తూ అతనిని నిందిస్తున్నాడు.

వివరణ : ఏమయ్యా ! నా కుమారుని గొప్పనీతి శాస్త్రవేత్తగా చేస్తానని తీసుకొని వెళ్లి అయోగ్యమైన విరోధి శాస్త్రాన్ని బోధించావు. భృగు వంశంలో ఉత్తముడవని నిన్ను నమ్మి ఉన్నాను. ఇంత ద్రోహం చేసిన నీవు పైకి బ్రాహ్మణుని ఆకారంతో కనబడుతున్నావు కానీ నిజంగా బ్రాహ్మణుడవేనా? అని హిరణ్యకశిపుడు తీవ్రధోరణిలో అడిగాడు.

ఆర్జవం - కపట ప్రవృత్తి లేకుండా బ్రదకటం బ్రాహ్మణుని ముఖ్య ధర్మం. అది లేదనుకొని రాక్షసరాజు ఇలా నిందిస్తున్నాడు.

## 1.7. ప్రశ్నలు - సమాధానాలు

### ప్ర. 1. ప్రహ్లాదుని విష్ణుభక్తిని వివరించండి?

ప్రహ్లాదుడు రాక్షసులలో పుట్టినా, నారదుని ఉపదేశం తల్లి గర్భంలో ఉండగానే కలగటం వలన విష్ణువునందు అచంచలమైన భక్తి కలిగింది. మనస్సులో మాధవునే భావిస్తూ అడుగుతీసి అడుగు వేయటం కూడా మరచే తీవ్రస్థితికి వచ్చాడు. బ్రహ్మ మొదలైన వారికి కూడా అభ్యసింపలేని స్థాయికి చెందిన హరిభక్తి పురుషాకారం ధరిస్తే ఇలా ఉంటుంది అన్నట్లుగా అయింది అతని నడవడి. తల్లి గర్భంలో కదలాడే క్షణం నుండీ అతని మనస్సు అచ్యుతుని మీదనే ఉండేది. తనలో ఉన్న విష్ణువే అఖిల ప్రపంచంలోను ఉన్నాడనీ సర్వమూ విష్ణుమయము అనీ అతని సందేహం లేని భావన. ఆ భక్తి విశేషం చేత అతనిలో వినయము, దయ, బుద్ధి, వివేకము మొదలైన లక్షణాలు చక్కగా కుదురుకున్నాయి. అందువలననే వయస్సులో చిన్నవాడయినా అతనిని విద్వాంసులలో గొప్పవారు కూడా గొప్పవాడని భావించేవారు. తండ్రి నీవు ఏమి చదువుకున్నావు నాయనా ! అని అడిగితే చదువులలో మర్మమెల్ల చదివాను అని వినయంగా చెప్పాడు. అతని దృష్టిలో ఆ మర్మం విష్ణుపరమైన జ్ఞానమే.

తొమ్మిది విధాలుగా భక్తిని శాస్త్రకారులు విభజించి చెప్పారు. భగవంతుని గూర్చి వినటం, అతని యందు త్రికరణ శుద్ధిగా సఖ్యభావం కలిగి ఉండటం, దాసుడుగా మెలగటం, నమస్కరించటం, పూజలు చేయటం, సేవ, తత్త్వాన్ని ఆత్మలో తెలిసికోవటం, సంకీర్తన, భావన అనే ఆ తొమ్మిదింటితో అతడు విష్ణువును నమ్మి ఉన్నాననీ అలా ఉండటమే భద్రమైన స్థితి అనీ మొగమోటం లేకుండా చెప్పాడు.

విష్ణుభక్తిలేని మానవుని బ్రతుకు బూడిదలో పోసిన హవ్యం, పేడి వానికి పెండ్లికూతురి మీది మోజు మొదలైన వాని వంటివని స్పష్టంగా ప్రకటించాడు. విష్ణువుకోసం కాని కాళ్లు చేతులూ మొదలైన అవయవాలన్నీ పనికి మాలినవని దృఢంగా వక్కాణించాడు.

గురువులు ఎన్ని విధాల ఏ శాస్త్రాలు బోధించినా విష్ణుభక్తిని గూర్చి ఎంత విరుద్ధంగా ఉపదేశాలు చేసినా ప్రహ్లాద కుమారకుని హృదయంలో మార్పు రాలేదు. పైగా ఇంకా విష్ణుభక్తి దృఢపడుతూ వచ్చింది. రెండవ పర్యాయం గురువులు రాజు దగ్గరకు తెచ్చినప్పుడు అతనిలో మార్పును చూడటానికి, చూపటానికీ వారు పడిన శ్రమ అంతా వ్యర్థం అయిపోయింది. బాలుడు మరింత పట్టుదలతో విష్ణువును

గురించి ఆరితేరిన మాటలు మాటాడాడు. చక్రిదాస్యం అనే పెనుగాలి లేకపోతే సంసారం అనే దట్టమైన మబ్బుల ఉబ్బు అణగదు. విష్ణు సేవ అనే అమృతం సేవింపకపోతే ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములనే మూడు తాపాలు చల్లారవు. హరియందు బుద్ధి - భావన అనే బడబాగ్ని లేకపోతే పాపాలనే సముద్రాలు ఇంకవు. పద్మాక్షుని కొనియాడటం అనే సూర్యుని వెలుగులు లేకపోతే గొప్ప ఆపదలనే దట్టపు చీకట్లు చెదరిపోవు - అని తండ్రికి సుస్పష్టంగా సుదృఢంగా చెప్పాడు.

విష్ణుభక్తి వెల్లివిరిసిన రాక్షసరాజ పుత్రుడు ఆ సంస్కారంతో అచ్చమైన వేదాంతాన్ని బోధించాడు. "సంసారం అనేది భయంకరమైన చీకటి. సంసారలంపటం పెంచుకున్నవారు అందులో పడి మ్రగ్గుతున్నారు. పుడుతున్నారు. చస్తున్నారు. ఎంతకాలమైనా అదేపని. అట్టివారికి జ్ఞానం, పరులు చెప్పినా, ఏమిచ్చినా పుట్టదు. కర్మలు కర్మలు అంటారు. అందులో ఇరుకుకొని పోతారు. అట్టివారికి ఎన్నటికీ విష్ణుదర్శనం కాదు. దానికి కర్మలను రూపుమాపుకోవటం ఒక్కటే మార్గం".

చివరికి అతిముఖ్యమైన ఒక విషయం విశదం చేశాడు. సంసారం ఒక మహాసముద్రం. అందులో భార్యా పుత్రాదులు తిమింగిలాల వంటివి. కామక్రోధాదులు మహాతరంగాలు. ఈ సముద్రాన్ని దాటాలంటే మాధవుని మీది మనస్సు నిరంతరంగా ఉండాలి. ఏ మాత్రమూ చెదరగూడదు. అదే గొప్ప నావ.

ఈ విధంగా బాలుడైన ప్రహ్లాదుడు అఖండమైన విష్ణు భక్తిని పదిలంగా హృదయంలో పెట్టుకొని దానికి ఎదురు గాలులు ఎంతగా వీచినా ధీరుడై నిలిచాడు. అందరికీ ఆదర్శ ప్రాయుడైనాడు.

ప్ర. 2. పోతన కవిత్వంలోని విశేషాలు వెల్లడించండి?

తెలుగులో పోతనది ఒక ప్రత్యేకమైన కవితాశైలి. అతడు సహజ పాండిత్యుడు. ఆంధ్ర కవిత్వంలో ఎక్కువగా తెలుగు పదాలను నింపి కవిత్వం రచించటం ఒక పద్ధతి. సంస్కృత పదాలను, దీర్ఘ సమాసాలను ఉపయోగించి నాద సౌందర్యాన్ని రూపొందించటం ఒక పద్ధతి. పోతన రెండు మార్గాలలోను ఆరితేరినవాడు.

ఎట్టాడిన నట్టాడుదు
రిట్టిట్టని పలుక నెఱుఁగ రితరుల శిశువుల్
దట్టించి యెవ్వరేనియుఁ
బట్టించిరొ బాలకునకు పరపక్షం బుల్

ఈ పద్యంలో శిశువులు, బాలకునకు, పరపక్షంబుల్ - అనేవి మూడే తత్సమ పదాలు. తక్కినవన్నీ చక్కని అచ్చు తెలుగు పదాలు. భావానికి అనుగుణంగా ఈ విధమైన పదాలను ప్రయోగించటంలో పోతనది అందె వేసిన చేయి.

ఇట్టిదే మరొక పద్యం.

ఏ పగిది వారు చెప్పిన
నా పగిదిం జదువు గాని యట్టిట్టని యా
క్షేపింపఁడు తానన్నియు
రూపించిన మిథ్యలని నిరూఢ మనీషన్.

ఇందులో కూడ అచ్చు తెలుగు పదాల కూర్పు అందంగా అమరింది.

ఇక సంస్కృత పదాలను ఎక్కువగా ప్రయోగించిన సన్నివేశాలు కూడా ఇతని రచనలో కనిపిస్తాయి.

అంధ ప్రక్రియనుండు రాడు వలుకం డస్మత్ప్రతాప క్రియా
గంధం బించుకలేదు, మీరు గురువుల్ కారుణ్య చిత్తుల్ మనో

బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మముం బాటించి యీ బాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుంగా జేసి రక్షింపరే!

అంధేందూదయముల్, మహాబధిర శంఖారావముల్,
మూకసద్గ్రంధా ఖ్యాపనముల్, నపుంసకవధూ కాంక్షల్,
కృతఘ్నావళీ. బంధుత్వంబులు, భస్మహవ్యములు, లుబ్ధద్రవ్యముల్,
క్రోడస ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్

ఇట్టి పద్యాలలో సంస్కృతపద భూయిష్ఠమైన రచన మనకు అధికంగా కనిపిస్తుంది.

పోతన కవిత్వంలో నాద సౌందర్యం అధికంగా గోచరిస్తుంది. దాని వలన పాఠకునిలో ఆకర్షణ పెరుగుతుంది. ఇంకా ఇంకా చదవాలనే భావం పెంపొందుతుంది. ముఖ్యంగా అంత్యాను ప్రాసలను నిబంధించటంలో అతనికి ప్రత్యేకమైన దృష్టి ఉన్నది. ఒక ఉదాహరణ:

మోదముతోడ దైత్యకుల ముఖ్యుడు రమ్మని చీరఁబంచెఁ బ్ర
హ్లాద కుమారకున్, భవమహార్ణవ తారకుఁ
గామరోషలో భాది విరోధి వర్గ పరిహారకుఁ గేశవచింతనామృతా
స్వాద కఠోరకున్ గలుషజాల మహోగ్రవనీ కుఠారకున్.

ఈ విధంగా ప్రతి పదం చివరి రెండుమూడక్షరాలు ఒకే విధంగా కూర్చటం వలన పద్యంలో సౌందర్యం తొణికిసలాడుతుంది.

"మందార మకరంద మాధుర్యమునఁదేలు"
"త్రిప్పుకుమన్న, తప్పుకుమన్న, చెప్పుకుమన్న, విప్పుకుమన్న"
వంటి పద్యాల కూర్పులోని అందచందాలు అందరూ ఎరిగినవే.

పోతన కవిత్వంలో చక్కని అలంకారాలు మనకు ఎన్నో అందంగా గోచరిస్తాయి.
"అంబుజోదర దివ్య పాదారవింద" అన్నచోట పాదములనే పద్మాలు - అని రూపకం మనకు కానవస్తుంది.
ఇల్లను చీకటి నూతిలోపలన్ - అనే పద్యంలో కూడా రూపకం కానవస్తుంది.

"ఇనుమయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశు సన్నిధి నా విధమున
గరగుచున్నది దైవయోగమునఁ జేసి
బ్రాహ్మణోత్తమ ! చిత్తంబు భ్రాంతమగుచు" అనే యీ పద్యంలో చక్కని ఉపమాలంకారం సుందరంగా నిబద్ధమైనది.

"కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే
పవనగుంభిత చర్మ భస్త్రిగాక" మొదలైన తావులలో అపహ్నావాలంకారం అందంగా ఇమిడింది. ఒక వస్తువునందు ఆ వస్తువు ధర్మాన్ని కప్పిపుచ్చి మరొక వస్తువు ధర్మాన్ని ఉంచటం అపహ్నవం. ఇక్కడ నిజంగా కాయమైన దానియందు కొలిమితిత్తితనాన్ని ఉంచుతున్నారు.

శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ మొదలైన సన్నివేశాలలో శబ్దాలంకారాలు మనలను ఎంతో ఆకర్షిస్తాయి.

ఈ విధంగా పోతన భావప్రకటనకు అనుగుణమైన కవితారీతిని నిబంధించి భాగవతాన్ని అందరికీ ఇష్టమయ్యే విధంగా రూపొందించాడు

## 1.8. ఛందస్సు :

ఈ పాఠ్య భాగంలో మనకు కానవచ్చే ఛందస్సు స్వరూపాన్ని ఈ క్రింది విధంగా విశ్లేషించుకోవచ్చు.

**(1) ఉత్పలమాల :**

ఇది వృత్తముల జాతికి సంబంధించినది. ఇందులో పాదానికి ఇరవై అక్షరాలు ఉంటాయి. ఈ పద్యంలో ప్రాస నియమమూ, యతి నియమమూ రెండూ ఉన్నాయి. భరనభభర, లగ అనే గణాలు వరుసగా ఉంటాయి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| పంచశ | రద్వయ | స్కుడవు | బాలుడ | వించుక | గానిలే | వుభా |
| భ | ర | న | భ | భ | ర | లగ |

ఈ పద్యానికి మొదటి అక్షరంతో పదియవ అక్షరానికి యతి మైత్రి ఉంటుంది. 'ప' - 'బా' లకు యతి.
నాలుగు పాదాలలోను రెండవ అక్షరం పూర్ణబిందు పూర్వక చకారం ఉంటుంది. ఇలా ఉండటాన్ని 'ప్రాస' అంటారు.

**2. చంపకమాల :**

ఈ పేరుగల పద్యానికి నజభజజజర అనే గణాలు వరుసగా ఉంటాయి. అంటే పాదానికి 21 అక్షరాలు అన్న మాట. 11 వ అక్షరంతో యతిమైత్రి. ప్రాసనియమం ఉంది.

**ఉదాహరణ :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| తనయు | డు గాఁడు | శాత్రవు | డు దాన | వభర్త | కు వీడు | దైత్యచం |
| న | జ | భ | జ | జ | జ | ర |

'త - దా' లకు యతి.

**3. శార్దూలము :**

పాదానికి 19 అక్షరాలు ఉండే వృత్తం ఇది. "మసజసతత౹౹" అనే గణాలు వరుసగా ఉండాలి. ప్రాసయతి నియమాలు రెండూ ఉన్నాయి. 13 వ అక్షరం యతి స్థానం.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| నాకుం జా | డఁగఁజో | ద్యమ య్యె | డుగదా | నాతంౘ్డ్రి | యా బుద్ధి | దా |
| మ | స | జ | స | త | త | గ |

**4. మత్తేభము**

ఇందులో పాదానికి 20 అక్షరాలు ఉంటాయి. "సభరన" మయవ అనేవి వరుసగా ఉంటాయి. యతి, ప్రాసనియమాలు ఉన్నాయి. 14 వ అక్షరం యతి స్థానం.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| తనుహ్రా | ద్భూషల | సఖ్యమున్ | శ్రవణ | మున్ దాస | త్వమున్ వ | ందనా |
| స | భ | ర | న | మ | య | వ |

'త' - 'దా' లకు యతి.

ఈ నాలుగూ వృత్త జాతికి సంబంధించినవి. ఇవి కాక మాత్రా గణాలతో ఏర్పడే పద్యాలు నాలుగు సాధారణంగా తెలుగు కవులు వాడుతూ ఉంటారు.

**(5) కందం :**

ఇందులో గగ, భ, జ, స, నల అనే గణాలలో వేనినైనా వాడవచ్చు. ఇవన్నీ నాలుగు మాత్రలు గల గణాలు. పాదానికి ఎనిమిది గణాలు ఉండాలి. అందులో మూడింటిని ఒక పాదంగా, అయిదింటిని రెండవ పాదంగా విభజిస్తారు. రెండవ, నాలుగవ పాదాలలో నాలుగవ గణం మొదటి అక్షరం యతి స్థానం.

ఆరవ గణంగా నల, జ అనే రెంటిలో ఏదో ఒకటి ఉండాలి. బేసి గణాలలో జ గణం ఉండగూడదు. రెండవ, నాలుగవ పాదాల చివర తప్పని సరిగా గురువు ఉండాలి.

**ఉదాహరణ:-**

| | | |
|---|---|---|
| U U | I I U | I I I I |
| శిక్షం | చితి మ | న్యములగు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| U U | I I | U | I U I | U I I | U U |
| పక్షం | బులు | మా | ని నీతి | పారగు | డయ్యెన్. |

గగ, స, నల, గగ, స, జ, భ, గగ అనే గణాలు ఇక్కడ ఉన్నాయి.

రెండవ పాదంలో 'ప - పా'లకు యతి.

రెండు పెద్ద పాదాలను, నాలుగు చిన్న పాదాలుగా విభజించగా ఆ నాలుగింటిలో ప్రాసనియమం ఉంటుంది.

**(6) తేటగీతి**

ఒక సూర్యగణం, రెండుంద్రగణాలు, రెండు సూర్యగణాలు వరుసగా ఉంటే అది తేటగీతి అవుతుంది.

గల, న - అనేవి సూర్య గణాలు.

నల, నగ, సల, భ, ర, త - ఇంద్రగణాలు.

ఈ పద్యంలో ప్రాసనియమం లేదు. నాలుగవ గణం మొదటి అక్షరం యతి స్థానం. యతి కాకపోతే ప్రాసయతిని పాటించవచ్చు. అంటే మొదటినుండి రెండవ అక్షరానికీ, యతి స్థానంనుండి రెండవ అక్షరానికీ ప్రాసమైత్రి పాటించటాన్ని ప్రాసయతి అంటారు.

**ఉదా :**

| | | | | |
|---|---|---|---|---|
| U I | U I I | U U I | I I I | I I I |
| దేవ | దేవునిఁ | జింతించు | దినము | దినము |
| గల | భ | త | న | న |

**7. ఆట వెలది :**

ఇందులో రెండు పాదాలకు కలిపి లక్షణం ఉంటుంది. మొదటి పాదంలో మూడు సూర్యగణాలు, రెండు ఇంద్రగణాలు ఉండాలి. రెండవ పాదంలో వరుసగా అయిదు సూర్యగణాలు ఉండాలి. నాలుగవ గణం మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసయతిని కూడా వాడుకోవచ్చు. ప్రాసనియమం లేదు.

| | | | | |
|---|---|---|---|---|
| గల | గల | గల | త | ర |
| U I | U I | U I | U U I | U I U |
| చక్రి | చింత | లేని | జన్మంబు | జన్మమే |
| I I I | I I I | U I | U I | U I |
| తరళ | సలిల | బుద్బు | దంబు | గాక |
| న | న | గల | గల | గల |

8. సీసం :

ఇందులో పాదానికి ఎనిమిది గణాలు ఉంటాయి. ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలు. ఈ యెనిమిదింటినీ రెండేసి పాదాలు
విభజిస్తారు. కానీ ఎనిమిది పాదాలుగలవి నాలుగు ఉంటాయి. నాలుగు గణాల ప్రతి పాదానికి యతి ఉంటుంది. మూడవ గణం మొదట
అక్షరం యతి. ప్రాసయతి కూడా వేయవచ్చు. ప్రాసనియమం లేదు. సీసపద్యం చివర ఆటవెలదిని గాని, తేటగీతిని గాని నిబంధించాలి

ఉదా :

| | | | |
|---|---|---|---|
| U U I | U U I | U U I | U I U |
| సంసార త | జీమూత త | సంఘంబు త | విచ్చునే ర |

| | | | |
|---|---|---|---|
| U I U | U I U | I I I | U I |
| చక్రి దా ర | స్వ ప్రభం ర | జనము న | లేక గల |

## 1.9. అలంకారాలు :

కావ్య శరీరానికి శోభను గూర్చేవి అలంకారాలు. శబ్దాన్ని అలంకరించే వానిని శబ్దాలంకారాలనీ, అర్థాన్ని అలంకరించేవానిని అర్థాలంకారాలని అంటారు. శబ్దాలంకారములు సిలబస్‌లో లేవు.

**అర్థాలంకారాలు :** ఉపమ, రూపకం, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, స్వభావోక్తి, శ్లేష, దృష్టాంతం అను 8 అలంకారాలు సిలబస్‌లో నిర్దేశింపబడినవి.

1. **ఉపమ :** ఒక వస్తువును మరొక ప్రసిద్ధమైన వస్తువుతో రమణీయంగా పోల్చటం ఉపమ. ప్రకృతమైన దానిని ఉపమేయం అనీ, పోలిక కోసం తీసుకున్న వస్తువును ఉపమానం అనీ అంటారు. ఈ రెంటిలో సమానంగా కొన్ని లక్షణాలు ఉంటాయి. వానిని సమానధర్మం అంటారు. పోలికను తెలియజేసే వలె, వంటి, పగిది మొదలైన పదాలను ఉపమావాచకాలంటారు. సాధారణంగా ఈ నాలుగు ఉన్న దానిని 'పూర్ణోపమ' అంటారు. ఒకటి, రెండు, మూడు లోపిస్తే 'లుప్తోపమ' అంటారు.

**ఉదా :** ధర్మేతర వర్తనులును
దుర్మంత్రులు నైన జనుల దురితము లొందున్
మర్మములు గలచి కల్మష
కర్ములు రోగములు వొందు కైవడి విప్రా.

ఇందులో దురితములొందటం ఉపమేయం. రోగములు పొందటం ఉపమానం. 'కైవడి' వాచకం. పై రెంటికి చక్కని పోలిక చెప్పటం వలన ఉపమాలంకారం ఏర్పడింది.

2. **రూపకం :** ఉపమాన ధర్మాన్ని ఉపమేయం మీద ఆరోపించటం రూపకం.

ఉదా; "ఎల్ల శరీరధారులకు నిల్లను చీకటి నూతి లోపలన్"

**సమన్వయం :** ఇందులో ఇల్లును వర్ణిస్తున్నారు కనుక అది ఉపమేయం. దానికి పోలికగా తెచ్చిన 'చీకటి నూయి' ఉపమానం. ఇల్లే చీకటి నూయిగా - అభేదంగా చెప్పటం వలన ఇది రూపకం.

3. నిదర్శన - సదృశములయిన వాక్యార్థాలకు ఐక్యారోపం - అదే యిది అనటం - నిదర్శన.

ఉదా : తనయుల సంభాషణములు
జనకులకుం గర్ణయుగళ సద్భూ షణముల్

**సమన్వయం :** తనయుల సంభాషణములు, కర్ణయుగళ సద్భూషణములు - అనే రెండు వాక్యాలు. ఇవి రెండూ పోలిక కలిగి ఉండటంచేత అదే ఇది అని చెప్పటం వలన నిదర్శన.

4. **అతిశయోక్తి :** సంబంధం ఉన్నా లేదని వర్ణించటం అతిశయోక్తిలో ఒక భేదం.

**ఉదా :** అంభోజ గర్భుదు లభ్యసింపగలేని హరిభక్తి పుంభావమైన వానిన్

**సమన్వయం :** బ్రహ్మను అంభోజ గర్భుడంటారు. అతడు వేదాలను వెలువరించినవాడు. హరిభక్తిని అభ్యసించటం అనే సంబంధం అతనికి ఉంటుంది. కాని లేనట్లుగా వర్ణించటం వలన ఇది అతిశయోక్తి అవుతుంది.

5. **స్వభావోక్తి :** ఆయా జాతుల స్వభావాన్ని రమణీయంగా వర్ణించటం స్వభావోక్తి.

ఉదా : "దానవేంద్రుడు కొడుకును దీవించి తొడమీద నిడుకొని, చుంచు దువ్వి, చుబుకంబు పుణికి, చెక్కిలి ముద్దుగొని, శిరంబుమూర్కొని"

**సమన్వయం :** కొడుకులను చూచినంతనే సాధారణంగా తండ్రులకు కలిగే ప్రేమ ఏమేమి పనులు చేయిస్తుందో వానిని ఇందు కమనీయంగా వర్ణించటం చేత ఇది స్వభావోక్తి.

ఉత్ప్రేక్ష, శ్లేష, దృష్టాంతం అనే అలంకారాలకు లక్ష్యములు ఈ పాఠంలో లేవు.

## 1.10 సారాంశం :

నవ విధ భక్తులను, చదువులలోని మర్మమును జీర్ణించుకొన్న ప్రహ్లాదుడు విష్ణుభక్తి తప్ప ఈ సంసార సముద్రమును దాటగలిగిన నావ మరొకటి లేదన్న సత్యమును తండ్రికి చాటిచెప్పడం పోతన పరమ రమణీయంగా వర్ణించాడు.

## ప్రశ్నలు :

1. ప్రహ్లాద హిరణ్యకశిపుల సంవాదాన్ని వివరించండి?
2. పోతనామాత్యుని శయ్యా సౌభాగ్యమును వివరించుడి.
3. ప్రహ్లాదుడు వివరించిన విష్ణుభక్తి మహిమను విశదీకరించండి.
4. ప్రహ్లాదుని గుణశీలములను చిత్రింపుడు.

రచయిత
**ఆచార్య శలాక రఘునాథ శర్మ,**
విశ్రాంతాంధ్రాచార్యులు,
శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం,
అనంతపూర్.

ఖండం : 1

# ప్రాచీన పద్యభాగము

పాఠం : 2

# సత్యభామా సాంత్వనము

\- నంది తిమ్మన

(పారిజాతపహరణము - ప్రథమాశ్వాసం 62 - 137 పద్యాలు)

శీర్షికలు :

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠినపదాలకు అర్థాలు
5. ప్రతిపదార్థ తాత్పర్యాలు
6. సందర్భ సహిత వ్యాఖ్యలు
7. ప్రశ్నలు - సమాధానాలు
8. ఛందస్సు
9. అలంకారాలు

**లక్ష్యం** : ప్రబంధమనే ఒక ప్రత్యేక ప్రక్రియ తెలుగులో ఉన్నట్లు భావుకులు నిర్ణయించారు. రస, భావ, వర్ణనాది లక్షణాలు దీనికి ప్రత్యేకించి ఉంటాయి. ఇట్టి ప్రక్రియను అధ్యయనం చేయటం వలన కవి భావనా ప్రపంచం అందచందాలు అనుభవంలోనికి వస్తాయి. విభిన్న సందర్భాలలో విభిన్న వ్యక్తుల మనస్తత్వాలు ఎలా ఉంటాయో, ఇతరులు తదనుగుణంగా ఎలా మెలగాలో ఈ పాఠ్యం మనకు చక్కగా తెలియజేస్తుంది.

## 1. కవి పరిచయం :

శ్రీ కృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ చక్రవర్తిగా కీర్తి పొందాడు. అతని ఆస్థానంలో నానా భాషలకు సంబంధించిన చాలామంది కవులు ఉండేవారు. ముఖ్యంగా తెలుగు కవులు ఎనిమిదిమంది. అల్లసాని పెద్దన, నంది తిమ్మన మొదలైనవారు మహోదాత్త కావ్యాలు వ్రాశారు. వీరిని అష్టదిగ్గజాలంటారు. రాయల కాలాన్ని బట్టి నంది తిమ్మన 16 వ శతాబ్దంవాడనీ, అతడు అరణపుకవిగా రాయల ఆస్థానానికి వచ్చాడనీ ప్రసిద్ధి.

నంది తిమ్మన తన కవితా మాధుర్యం చేత మహాపండితుడు, మహాకవి అయిన కృష్ణదేవరాయలను మెప్పించి అగ్రహారాది సన్మానాలు అందుకొన్న ఉత్తమ కవి. ఆ కాలంలో వెలువడిన అనేక రసవత్తర ప్రబంధాలలో ఈయన కావ్యం 'పారిజాతాపహరణం' అగ్రశ్రేణికి చెందినదని పండితవర్గం భావిస్తున్నది.

శ్రీకృష్ణుడు తన ప్రియభార్య సత్యభామను ప్రసన్నురాలిని చేసికోవటానికి స్వర్గంలో దేవేంద్రుని రక్షణలో ఉన్న పారిజాతమనే పుష్పవృక్షాన్ని భూమికి తేవటం ఇందులో ప్రధానాంశం కనుక ఈ కావ్యానికి "పారిజాతాపహరణం" అనేపేరు కలిగింది. ఈ కథకు మూలం సంస్కృతంలోని భారత పరాంశమని పేరుపొందిన "హరివంశం".

పారిజాతాపహరణంలో అయిదు ఆశ్వాసాలు ఉన్నాయి. దీనిని కవి రసికజన చక్రవర్తి అయిన రాయలకు అంకితం ఇచ్చాడు. రాయలు తన ప్రియసతి మీద ఏదో కారణంగా అలుక వహించి ఉన్నప్పుడు సుకుమారంగా అతనిని మందలించటానికి ఈ కావ్యం వ్రాశాడనే ఒక జనశ్రుతి లోకంలో వ్యాపించి ఉంది.

తెలుగు సాహిత్యంలో మనుచరిత్ర కున్నంత కీర్తిప్రతిష్ఠలు ఇంచుమించుగా పారిజాతాపహరణానికి ఉన్నాయి. భావప్రకటనలో, వర్ణనా నైపుణ్యంలో, కథా నిర్మాణంలో, శిల్ప వైదుష్యంలో తిమ్మన తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకస్థానం పదిలపర్చుకొన్న వ్యక్తి.

## 2. పాఠ్యభాగ సందర్భం :

ప్రస్తుత పాఠ్యభాగం సత్యభామ కోపవికారం పొందటంతో మొదలవుతుంది. కోపకారణం తెలుసుకోవటానికి అంతకుముందు జరిగిన కథాంశాల స్థూలమైన అవగాహన అవసరం.

శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది రాణులు ఉన్నారు. రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద, భద్ర, సుదంత, కాళింది, లక్షణ - అని వారి పేర్లు. ఇంకా పదునారువేలమంది భార్యలు కూడ ఆయనకు ఉన్నారు. ఇందులో ప్రధాన వ్యక్తులు రుక్మిణి, సత్యభామలు ఇద్దరు మాత్రమే.

ఒకరోజు శ్రీకృష్ణుడు రుక్మిణీదేవి యింటిలో ఉండగా దేవముని నారదుడు శ్రీకృష్ణుని దర్శించుకోవటంకోసం అక్కడకు వచ్చాడు. శ్రీకృష్ణుడు అతనికి తగిన సత్కారాలు చేసిన తరువాత నారదుడు తాను దేవలోకం నుండి తెచ్చిన పారిజాత పుష్పాన్ని అతనికి కానుకగా ఇచ్చాడు. కృష్ణునికి ఇప్పుడొక పెద్ద సమస్య ఏర్పడింది. ఎదురుగా ఉన్న రుక్మిణికి ఆ పువ్వునివ్వకపోవటం సముచితం కాదు. ఎక్కడో ఉన్న సత్యభామ ఈ విషయం తెలుసుకుంటే నొచ్చుకుంటుంది. తటపటాయిస్తున్నాడు. అది కనిపెట్టి కలహభోజనుడైన నారదుడు రుక్మిణికి ఇవ్వు అన్నట్లుగా కనుసన్న చేశాడు. కృష్ణుడు ఇచ్చాడు. అప్పుడు ఆ పువ్వు మహిమను గూర్చి పెద్ద ఉపన్యాసం చేసి నారదుడు రుక్మిణి సౌభాగ్యాన్ని పొగడటమేకాక సత్యభామను గూర్చి చులకనగా పలికాడు. ఇదంతా చూచీ, విని సత్యభామ చెలికత్తె ఒకతె విషయమంతా చిలవలు పలవలుగా సత్యభామకు చేరవేసింది. అదిగో అక్కడ మన కథాభాగం ప్రారంభమవుతుంది.

## 3. పాఠ్యభాగ సందర్భం :

సత్యభామచింత నారదుడు పారిజాత పుష్పం తెచ్చి రుక్మిణి సన్నిధానంలో కృష్ణునకిచ్చాడని, అతడు దానిని రుక్మిణికీయగా సంతోషించి నారదుడు ఏవేవో మాటలు ఆడి తనను అవమానించాడనీ సత్యభామ చెలికత్తెవలన విన్నది. దెబ్బతిన్న త్రాచులాగా, నేయిపోయగా భగ్గునమండే అగ్గిలాగా లేచి ఆమె పెగిలిరాని గొంతుకతో ఇలా అన్నది.

ఏమిటీ ! కలహభోజనుడచ్చటికి వచ్చాడా? అలా అన్నాడా ? ఆ మాటలన్నీ గొల్లభామల ప్రియుడు ప్రీతిగా విన్నాడా ? ఆ రుక్మిణమ్మ ఏమన్నది ? ఓ సఖీ దాచకుండా ఉన్నదున్నట్లు అన్ని మాటలు వివరంగా చెప్పు. నిజమే ! ఆ పువ్వు చాలా గొప్పదే కావచ్చు. ఆ నారదుడు దానిని కృష్ణునికిస్తే ఇవ్వనీ ! ఆయనగారు తనకు ప్రేమ ఉన్నచోట అర్పణచేయనీ ! మధ్యలో ఆ మాయలాడి ముని మమ్మల్ని ఎందుకు తలపాలి ? పోనీ ! ఆయన ధోరణే అది. వద్దని ఈయన పలకవద్దా ముని యేమిచేస్తాడు?

రుక్మిణి ఆ పూవునెందుకు తీసుకోవాలి ? ఇంతకూ ఈ దుడుకు గొల్లవాని చేష్ట ఏమని చెప్పాలి ? ప్రాణానికి ప్రాణమైన మగడు ఇలా అయితే మనసు మండిపోదా ? పురుషులు చపలచిత్తులు, వారిని నమ్మరాదు. ఇన్నాళ్ళు సాటివారిలో ఎంతో గౌరవంగా బ్రతికిన నా పరువంతా పాడైపోయింది. అందరు తలలెత్తుకొని సన్న సన్నగా సూటిపోటు మాటలంటే బ్రతకగలనా ?

నా మొగమాటం కోసం ఇన్నాళ్ళు కృష్ణుడు నాటకాలాడాడు. ఆయనకు నిజమైన ప్రేమ ఆ రుక్మిణి మీదనే. అదంతా నాకు తెలియనీయలేదు. ఆయనను ఎంతైనా మెచ్చుకోవాలి. చెలీ ! నారదుడొక పూవు తెచ్చి కృష్ణునికిచ్చాడట ! ఆయన ఆ త్రిప్పు కన్నులదానికి దానిని అర్పించాడట. ఇదంతా విని కూడా నేను ప్రాణాలతో ఉన్నాను. ఇంకా ఏమేమి కానున్నదో!

ఆయన ఆమె యింటిలో ఉండగా ముని పూవునిస్తే ఆయన ఆమెకు ఇవ్వటం కొంతవరకు సముచితమే. కానీ మధ్యలో నా వాసీ వన్నె తరిగిపోయాయి. బ్రతికినంతకాలం ఒకే విధంగా పూసలలో దారంలాగా సతిమదిలో మెదిలే మగడు దొరకటం వెనుకటి జన్మాల నోముఫలంగదా ! ఇంతవరకు నేననుభవించిన భోగాలన్నీ ఇకపై ఏ లతాంగి అనుభవిస్తుందో! ఇన్నాళ్ళు నాతో కలిసి ఆ గోపాల చక్రవర్తి చేసిన క్రీడలు, విహారాలూ ఆ రుక్మిణి మాయలో పడి అతడు ఎలా మరవగలిగాడో ! ప్రాణబంధువు, ఏడుగడా అయిన పతి గతి తప్పితే సతికి మరొక గతి ఏమి ఉంటుంది ? భర్త ఇతర స్త్రీలకు ధనమిచ్చి పుచ్చుకుంటే సహింపగలం. కానీ మనసిచ్చిపుచ్చుకొనే స్థితిని చూచిన పడతి బ్రతుకగలదా ?

ఈ విధంగా సత్యభామ హృదయంలో కుమిలిపోయింది. కోపం పెల్లురేగగా కోపగృహంలోనికి చొరబారింది. మాటామంతీ లేకుండా మాసిన చీర గట్టుకొని, నగలన్నీ దిగవిడచి నిడువాలిక కస్తురి పట్టుపెట్టి మంచం మీదపడి పొరల సాగింది.

**శ్రీకృష్ణుడు సత్యభామ దగ్గరకు రావటం :** అక్కడ కృష్ణుడు కలుగబోయే పరిస్థితినంతా ఊహించాడు. ముని మర్యాదలకు ప్రద్యుమ్నుని ఏర్పరచి నిలుకడలేని మనస్సుతో సత్యభామ యింటికి ఒక్క ఉదుటున చేరుకున్నాడు. సత్యభామ భవనమంతా నిశ్శబ్దంగా ఉంది. దారుకుని (సారథిని) ద్వారం దగ్గరనే నిలిపి తాను నేరుగా అంతఃపురంలోనికి ప్రవేశించాడు. సత్యభామ ఉలుకూ పలుకూలేకుండా కోపగృహంలో ముడుచుకొని పడుకొన్నతీరును గమనించాడు. పరిచారికలనందరినీ మెల్ల మెల్లగా అవతలకు పంపి విసనకర్ర పుచ్చుకొని వీచరటం ప్రారంభించాడు.

క్రొత్త పూవు పరిమళం ఒక్కపెట్టున ముక్కుపుటాలకు తాకగా, ఆమె ముసుగుతీసి చూచింది. ఎదురుగా దీనతతో కృష్ణుడు కన్నులకు కనిపించాడు. ఆమె ఎదనుండి దుఃఖం పొంగిపొరలింది. కన్నీళ్లు ధారలుగా జారుతూ ఉండగా తలవంచి మళ్ళీ ముసుగులో ప్రవేశించింది. కోపంతో శోకంతో ఆమె ఊగిపోతున్నది.

**శ్రీకృష్ణుడు సత్యభామను సాంత్వనపరచటం :** కృష్ణుడు మెల్లగా ఇలా ప్రారంభించాడు. చంద్రముఖీ ! భూషణాలు ధరింపలేదు. సన్నని కావిరంగు చీరలు తప్ప మరొకటి కట్టవు. తెల్లచీరను ఎందుకు కట్టావు. తాంబూలంరాగంతో నీ మోవి ఎరుపెక్కలేదు. ఎందుచేత ? నా మనస్సు తెలుసుకోవటానికి ఏదైనా పరీక్ష పెడుతున్నావా ? నా వలన ఏదైన అపరాధం జరిగిందా ? నీవు దయతో చూడఃపోతే నేను నిల్వగలనా ?

నిజానికి ఏదో లాంఛనంగా తక్కిన స్త్రీలను మన్నించినట్లు నటిస్తాను గాని నా నిజమైన ప్రేమ నీమీదనేకదా ! ఒక్కసారి అనురాగంతో వాలుకంటితో నన్ను వీక్షించు అని లాలనతో ఎంతో దీనంగా పలికాడు. ఆమె బిగువు సడలనీయలేదు. ఎంత ప్రయత్నించినా ఆమె ప్రసన్నురాలు కాకపోతే చివరకు ఆ జగన్నాటక సూత్రధారి మెత్తని ఆమె పాదాలకు తనతల తాకించి మ్రొక్కాడు. అయినా ఆమె మెత్తబడక ఎడమకాలితో బ్రహ్మాదుల మాన్యతకు యోగ్యమైన కృష్ణుని తలను తొలగించింది. అప్పుడా మహానుభావుడు దానిని కూడా ఒక మహాభాగ్యంగా భావించి నీ దాసుడనైన తన్నినా నాకు నొప్పికలుగదు. నీ సుకుమారమైన పాదం నా గగుర్పొడిచిన దేహం తాకి నీకేమైనా బాధకలిగిందేమో అని నేను విచారిస్తున్నాను - అని పలికాడు.

అప్పుడు సత్యభామ ముసుగునుండి కొంచెంగా వెలుపలికి వచ్చి జుట్టుముడి వేసుకుంటూ, పై చెఱుగును ఎదమీద సరిజేసుకుంటూ జంకించే చూపులతో మెల్లగా ఇలా పలుకసాగింది.

**సత్యభామ నిందా వాక్యాలు :** ఎందుకయ్యా ! ఈ ఇచ్చకపు ప్రేమలు ? నిన్ను నమ్మినందుకు నాకు సరియైన ఫలమే లభించింది. నామీద ఒట్టు, నన్ను ముట్టుకోకు పసుల కాపరికి మన్మథుని రహస్య వ్యాపారాలు తెలుస్తాయా ? ఇంకా నిన్ను నమ్ముతానా ? ఎందుకు ఊరకే నా వెంట బడతావు. నీ ప్రేమ కలాపాలు ఇక్కడ పనికిరావు. అవన్నీ రుక్మిణికి ప్రాణపదాలు అయిపోయాయి. చాలు చాలు నన్నింక ఉడికించకు. లేనిప్రేమలు నటింపకు. వంచనలు, కపటపు మాటలూ నీతోనే పుట్టాయి. మాయలు నీకు వెన్నతో పెట్టిన విద్దెలు. నిన్ను నమ్మటం నా తెలివితక్కువతనం. నాగుట్టు రట్టయింది. ఇపుడింక నేనేమి చేయగలను ?

ఆ నారదుడు వచ్చి పూవిచ్చి నీ ప్రియాంగనను పొగడుతూ ఉంటే అవన్నీ నీ చెవులకు విందుగా ఉన్నాయి. వానికి మా మాటలు చవిగా ఉంటాయా ? ఇక్కడకు ఇప్పుడు నీవు వచ్చి పారిజాతం వాసన చూపించటం నన్ను వెక్కిరించటానికే కదా !

స్త్రీలకు మానమే నగ. మానమే ప్రాణంకంటే గొప్ప. అన్ని సమ్మానాలకు అదే మూలం. ఆ మానం మంట గలిసిన బ్రతుకు మానినికెందుకు ? మీ అమ్మగారు దేవకీదేవి కోడండ్రలో నన్నెక్కువగా మన్నిస్తూ ఉంటుంది. ఇప్పుడా సాధ్వీసేవ చేయటానికి పోవాలంటే సిగ్గుగా ఉంది.

ఇంతవరకు నేను నీతోపాటు అనుభవించిన ఆనంద విహారసీమలన్నీ ఇటుపై ఎవరికి దక్కుతాయో ఏమో ! నన్నెవ్వరమకున్నావో !

అని పట్టనలవికాని కోపంతో దుఃఖంతో సత్యభామ కుమిలి కుమిలి ఏడ్చింది. కృష్ణుడు ఆమె దుఃఖాన్ని తొలగించటానికై గట్టిగా కౌగిలించుకొని చెక్కిళ్ళ మీది కన్నీటిని చేతులతో తుడిచి ప్రియం నిండారగా ఇలా పలికాడు.

"ఇంద్రనీల మణుల కాంతులను తలదన్నే కురుల సౌభాగ్యంగల ఓ ప్రియురాలా ! ఈ పువ్వుకోసం ఇంత దుఃఖం నీకెందుకు ? విను దేవతల ఉద్యానవనంలోనికి ప్రవేశించి, ఇంద్రుడు స్వయంగా వచ్చి ఎదిరించినా నీకా పారిజాత వృక్షాన్ని తెచ్చియిస్తాను. నీ పెరటిలో నాటుతాను. దుఃఖాన్ని విడనాడు."

ఆ మాటలు విన్న సత్యభామ కోపం జారిపోయింది. మోములో వికాస దీధితులు వెల్లివిరిశాయి. చెలికత్తెలందరు అడవి నెమళ్ళలాగా ఆనందంతో కేరింతలు కొట్టారు.

## 4. కఠినపదాలకు అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 62. | కువలయము | = | నల్లకలువ |
| | నెఱ | = | అందమైన |
| | చరణ సారసయుగ్మము | = | పద్మములవంటి పాదముల జంట |
| | ధవుడు | = | భర్త |
| | అఱలేని | = | కొరతలేని |
| | కూర్మి | = | ప్రేమ |
| 63. | నిచ్చ | = | ఎల్లప్పుడు |

| | | | |
|---|---|---|---|
| 64. | ఉగ్గలము | = | అధికము |
| 66. | స్రుక్కక | = | దుఃఖింపక |
| 67. | ధమ్మిల్లము | = | కొప్పు |
| 68. | అరసి | = | విచారించి |
| 69. | కుందుట | = | దుఃఖించుట |
| 71. | పూదేనియ | = | మకరందము |
| | బోటి | = | చెలి |
| 72. | అవికులధావముల్ | = | తుమ్మెద మూకల యొక్క రొదలు |
| | తెమ్మెరలు | = | గాలులు |
| 73. | చెయ్దము | = | చేష్ట |
| 74. | చయ్యన | = | వేగముగా |
| 75. | సురముని | = | దేవముని అయిన నారదుడు |
| 77. | మిన్ను | = | ఆకాశము |
| 78. | మకరాంకుడు | = | మన్మథుడు |
| 79. | మచ్చరము | = | అసూయ |
| | గద్దియ | = | ఆసనము |
| 80. | శౌరి | = | కృష్ణుడు |
| 81. | వారిజము | = | పద్మము |
| | మతకములు | = | మాయలు |
| | మురాంతకుడు | = | మురుడను రాక్షసుని చంపిన కృష్ణుడు |
| | చెయ్వులు | = | కార్యములు |
| 85. | ముల్లమాటలు | = | నొప్పి పుట్టించే పలుకులు |
| | వల్లభుఁడు | = | ప్రియుడు (కృష్ణుడు) |
| 86. | ధూర్త గోపాలుడు | = | దుడుకు గొల్లవాడు (కృష్ణుడు) |
| | చెయిదము | = | చేష్ట |
| | ఎరియదె | = | మండిపోదా ? |
| 87. | శరద్ + అంబుద, చలచిత్తులు | = | శరత్కాలమునందలి మబ్బులవలె చంచలమైన మనస్సు కలవారు. |
| 91. | నరక + అసుర, దమనుడు | = | నరకుడను రక్కసుని అణచివేసినవాడు; |
| | భోజకన్య | = | రుక్మిణి |

| | | | |
|---|---|---|---|
| 93. | తోయజనేత్రా ! | = | పద్మముల వంటి కనులు గలదానా ! |
| 94. | ఇగురుఁబోడి | = | చిగురువలె సుకుమారమైన దేహము కలదానా ! |
| | అరమరలు | = | భేదభావములు |
| | కూరిమి | = | ప్రేమ |
| 95. | కృతక + అద్రి | = | కృత్రిమంగా నిర్మించుకొన్న కొండ |
| | నిగూహనం | = | కౌగిలింత |
| | పోషిత | = | పెంచుకొన్న |
| | పరిణయ + ఉత్సవ | = | పెండ్లివేడుక |
| | చాతురీ, నిర్జిత, ద్యూత, పణ + ఆదాన, కవిత, | | |
| | చేలా + అంచల కర్షణములు | = | నేర్పుతో గెలుచుకొన్న జూదంలోని పందెపు సొమ్మును గ్రహించటంలో భాగంగా వస్త్రం అంచును లాగటాలు. |
| | చంద్రికా కేళి చంక్రమములు | = | వెన్నెల ఆటలలోని గంతులు. |
| | విధు, శిలామయ వేదికా విశ్రమములు | = | చంద్రకాంతమణులతో నిర్మించిన అరుగులమీద విశ్రాంతి కైకొనుటలు. |
| | ఫలక చిత్రిత నిజరూప భావనములు | = | పలకలమీద వ్రాసిన తన రూపంలోని అంశాలను భావించుటలు; |
| 96. | ఏడుగడ | = | ఏడు విధములైన రక్ష. (గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవము దాత - ఇవి ఏడు విధములు) |
| 98. | జనిత + అమర్షమునన్ | = | పుట్టిన కోపంతో, |
| | హరిచందన కోటరమునకున్ | = | మంచిగంధపు చెట్టు తొర్రలోనికి; |
| | నాగతరుణి | = | ఆడుపాము |
| 102. | సాత్రాజితి | = | సత్రాజిత్తుని బిడ్డ సత్యభామ. |
| | కోప + ఉద్యోగమునన్ | = | కోపము ఎక్కువగా పెరుగుట వలన; |
| 105. | కక్ష్యాంతరములు | = | ఇంటిలోని గదులు, శాలలలోపలి వరుసలు |
| | అలబలము | = | కలకలము |
| | నగరు | = | అంతఃపురము |
| 106. | కరతాళగతులన్ | = | చేతులతో మ్రోగించు తాళముల పద్ధతులతో; |
| | కలికి రాయంచ బోదలన్ | = | అందమైన రాజహంసల పిల్లలను; |
| 107. | ఒయ్యనన్ | = | మెల్లగా |
| 111. | లవలీదళ పతిత మరంద బిందుతతిన్ | = | లవలిఅను తీగె ఆకులపై పడిన పూదేనె బిందువుల సముదాయమును |
| | పురుడింపన్ | = | పోలగా; |
| 114. | కుమారిలి | = | నొచ్చుకొని |

అంబుజ + ఉదరుడు = పద్మమును పొట్టయందు (బొడ్డునందు) కలవాడు - కృష్ణుడు

122. కోపన పదహతిన్ = కోపముగల సత్యభామ కాలిదెబ్బ చేత,

కుహనా గోపాలుడు = మాయగొల్లవాడు

ఉద్దీపిత మన్మథ రాజ్య ప్రాపితుడు = పొంగి వచ్చెడు మన్మథుని రాజ్యమును పొందింపబడినవాడు (పెరిగిన కామము కలవాడు)

129. తొడవు = నగ;

130. సాధ్వి = ఉత్తమ స్వభాముగల వనిత;

131. ఉవిద = స్త్రీ

రైవతక శైల చారుకూట విటంక కేలికిన్ = రైవతకమనే కొండయొక్క అందమైన శిఖరాల గూడులలో ఆడెడు ఆటకు;

వంసత + ఆ రామ, కర్పూరక దళికా + అగారవసతి = వసంత వైభవంగల తోటలోని ఏడాకుల అరటిచెట్లతో ఏర్పడిన ఇంటిలో ఉండటం.

132. అంతర్, భాష్ప = లోలోన కన్నీరు కలది

అవనతముఖి = వంచినతల గలది ;

ఘనతర గద్గదికా నిస్స్వనమునన్ = మిక్కిలి ఎక్కువ అయిన పెగులని గొంతునుండి వచ్చెడు ధ్వనితో

137. అంబుదశ్యాముని = నల్లని మేఘము వలె నీలి వర్ణముగల కృష్ణుని

నీపలతిక = కడిమిచెట్టు, (లేక) మంకెన తీగ

## 5. ప్రతిపదార్థ తాత్పర్యాలు

ఈ పాఠ్యభాగంలో ఉత్పలమాల మొదలైన వృత్తపద్యాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. అందులో ముఖ్యమైన వృత్తపద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలనిస్తున్నాం. కొంతవరకు సులభంగా ఉన్న వృత్త పద్యాలకు తాత్పర్యాలనిస్తూ, అవసరమైన మేరకు అర్థాలు ఇక్కడ ఇస్తున్నాం.

ప. 82 అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలెనేయివోయ భ
గ్గన దరికొన్న భీషణ హుతాశన కేలయనంగలేచి, హె
చ్చిన కనుదోయి కెంపుఁదన చెక్కులఁ గుంకుమ పత్రభంగసం
జనిత నవీన కాంతి వెదజల్లగ గద్గద ఖిన్న కంఠియై.

ఈ పద్యం పారిజాతాపహరణం ప్రథమాశ్వాసంలోనిది. ఈ పాఠంలోని పద్యాలన్నింటికీ ఈ పరిచయం వ్రాయాలి.

**ప్రతిపదార్థం :** చెలికత్తె తెచ్చిన వార్త విన్న సత్యభామకు కలిగిన కోపదుఃఖాలు ఇందులో వర్ణితమయ్యాయి.

సత్యభామ,

అనన్ = చెలికత్తె అట్లు పలుకగా

విని = విని

వ్రేటు + పడ్డ, ఉరగ + అంగనయున్‌బలెన్ = దెబ్బతిన్న ఆడుపాము విధంగా

| | | |
|---|---|---|
| నేయి | = | నెయ్యి |
| పోయన్ | = | పోయగా; |
| భగ్గు + అనన్ | = | భగ్గుమని; |
| దరికొన్న | = | మండిన; |
| భీషణ, హుతాశన, కీల, యనంగన్ | = | వెరపుగొలిపే అగ్నిజ్వాలయా యన్నట్లు |
| లేచి | = | పైకి లేచి |
| హెచ్చిన, కనుదోయి, కెంపు | = | పెరిగిన కన్నుల జంటలోని ఎరుపు; |
| తన చెక్కులన్ | = | తన బుగ్గలమీద; |
| కుంకుమ, పత్రభంగ, సంజనిత, నవీన కాంతి | = | కుంకుమతో వ్రాసిన ఆకుల రేఖల వలన పుట్టిన క్రొత్త వెలుగును |
| వెదజల్లగన్ | = | వ్యాపింపజేయగా; |
| గద్గద ఖిన్నకంఠి + ఐ | = | మాట పెగిలిరాని దుఃఖంతో నిండిన కంఠం కలదియై; |

**తాత్పర్యం** : సత్యభామ చెలికత్తె మాట విన్నవెంటనే కఱ్ఱదెబ్బ తిన్న త్రాచులా, నేయిపోయగా భగ్గునమండే అగ్నిజ్వాలలాగా ఒక్క పెట్టున లేచి, పెరిగిన కన్నుల ఎఱ్ఱదనం చెక్కులమీద లిఖించిన ఆకుల గీతల కాంతిని వ్యాపింపచేస్తూ ఉండగా పెగిలిరాని కంఠంతో (ఇలా అన్నది).

ప. 83 ఏమేమీ కలహాశనుం డచటికై యేతెంచి యీట్లాడెనా ?
యామాటల్ చెవియొగ్గి తా వినియెనా ఆ గోపికావల్లభుం
డేమేమాడెను రుక్మిణీ సతియు, నీవింకేటికిన్ దాచెదే?
నీ మోమోటలు మాని నీరజముఖీ నిక్కం బెఱింగింపవే!

**అర్థాలు** : కలహ + అశనుండు - కయ్యాలే తిండిగాగల నారదుడు;
గోపికా, వల్లభుఁడు - గొల్లభామల ప్రియుడు - కృష్ణుడు;
నీరజముఖీ - పద్మమువంటి మోముకలదానా !

**తాత్పర్యం** : "ఏమిటేమిటి ? ఆ కయ్యాలమారి ముని అక్కడకు వచ్చి ఇలా పలికాడా ! ఆ మాటలన్నీ ఆదరంతో ఆ గొల్లభామల ప్రియుడు విన్నాడా ? ఆ రుక్మిణమ్మ ఏమన్నదేమిటి ? నీవు ఇంకా దాస్తావెందుకు ? మొగమాటాలుమాని నిజమంతా స్పష్టంగా చెప్పు" అని సత్యభామ చెలికత్తెతో అంటున్నది.

ప. 84 అతులమహానుభావ మని యవ్విరిఁ దానొక పెద్దచేసి య
చ్యుతునకు నిచ్చుకంబొదవ సూఁడిద యిచ్చిన నిచ్చెఁగాక తా
నతఁడు ప్రియంబు గల్గునెడ కర్పణ సేసినఁ జేసెఁగాక యా
మతకరి వేలుపుందపసి మమ్ముఁ దలంపఁగనేల యచ్చుటన్.

**అర్థాలు** : అతుల, మహా + అనుభావము = సాటిలేని గొప్పతనం కలది;

ఆ + విరిన్ = ఆ పూవును;

అచ్యుతునకున్ = కృష్ణునకు;

సూడిద = కానుక

మతకరివేలుపు, తపసి = మాయలాడైన దేవతల ఋషి - నారదుడు

**తాత్పర్యము** : "అదొక పెద్ద మహిమ కలదని ఆ పూవును గొప్పగా చేసి నారదుడు ఇచ్చకంతో కృష్ణునికిస్తే ఇచ్చాడుగాక ! ఆయన తనకు ప్రేమ ఉన్నచోట దానిని అర్పిస్తే అర్పించనీ. మధ్యలో ఆ మాయలమారి నారదుడు మమ్మల్ని అక్కడ ఎందుకు ప్రస్తావించాలి?" అని సత్యభామ చెలికత్తెతో అంటున్నది.

ప. 88 ఇన్ని దినంబులున్ సవతు లిందరిలోఁగడు గారవంబునం
గన్నియ నన్ను వల్లభుఁడు గన్నులఁ గప్పుకొనంగనుండి, యా
వన్నెయు వాసియుం దఱిగి వారు ననుందల లెత్తిచూడఁగా
సన్నలఁజాయలం బలుక సైతునె ! ప్రాణము లెంత తీపొకో.

**అర్థాలు** : వల్లభుఁడు - ప్రియుడు ;

కన్నులన్, కప్పుకొనంగన్ - గొప్పగా మన్ననతో చూస్తు ఉండగా

**తాత్పర్యం** : "ఇన్నాళ్ళు ప్రియుడు సవతులందరిలో నన్నెంత గౌరవంతో కంటికి రెప్పలా కాపాడుతుండగా తిరిగాను. కానీ ఇప్పుడు ఆ వన్నె వాసి నాశనమై పోయాయి. ఆ సవతులందరూ ఏదో సాధించినవారి లాగా తలలెత్తుకొని తిరుగుతూ చాటుమాటుగా నన్నుగూర్చి అవమానకరంగా మాటాడతారు. దానిని సహించటం ఎలా ? పోనీ చనిపోదామనుకుంటే ఈ ప్రాణాలు ఎంత తీపివోగానీ పోగొట్టుకొనే బుద్ధికలగటంలేదు" అని సత్యభామ దుఃఖంతో కుమిలిపోతూ చెలికత్తెతో పలికినది.

ప. 89 నామొగమాటకై వలనినాటకముల్ ఘటియించి, రుక్మిణీ
కామిని మీఁదటం గలుగు గౌరవముం గృపయున్ బ్రియంబుఁ దా
నేమియుఁ గాననీక, యిట నిన్నిదినంబులు నన్నుఁదేల్చెనో
తామరసాక్షి ! మెచ్చవలదా మురదానవభేది కృత్యముల్.

**అర్థాలు** : తామరస + అక్షి ! - తామరపూవులవంటి కన్నులు గలదానా !

మురదానదభేది కృత్యముల్ - మురుడనే రాక్షసుని చంపిన కృష్ణుని చేష్టలు

**తాత్పర్యం** : ఆ కృష్ణుడు ఇన్నాళ్ళు పనికిమాలిన నాటకాలు కూర్చి రుక్మిణీ భామమీద ఉన్న గౌరవం, జాలి, ప్రేమలను కనబడనీయ కుండాచేసి నన్ను మోసగించాడు. ఆహా ! ఆ కృష్ణుని చేష్టలను తప్పక మెచ్చుకోవాలి.

ప. 90 ఓ చెలి ! శౌరికిచ్చెనటి యొక్కలతాంతము దెచ్చి నారదుం
డా చపలాక్షి కిచ్చె నటె యాతఁడు నవ్విరి, యిట్టిమాట లా
హా చెవుల న్వినంబడియుఁ బ్రాణముఁ దాల్చెద మేన; నింతఁగా
నోచితి, నింక నెట్టివి కనుంగొన నెమ్మెయి నున్నదాననో

**అర్థాలు :** శౌరికిన్ - శూరవంశంలో పుట్టిన వానికి - కృష్ణునకు;

లతాంతము = పూవు;

ఏ + మెయిన్ = ఏ విధంగా;

**తాత్పర్యం :** "చెలీ ! నారదుడొక పూవు తెచ్చి కృష్ణుని కిచ్చాడట. ఆయన దానిని ఆ త్రిప్పుకనుల రుక్మిణికి ఇచ్చాడట. ఇటువంటి మాటలు చెవులబడి కూడా నేను దేహంలో ప్రాణాలు నిలుపుకొంటున్నాను. ఇటువంటి నోములు నోచాను. ఇంకా ఏమేమి ఏ విధంగా చూడబోతున్నానో !" అని సత్యభామ చెలికత్తెతో పలికినది.

ప. 91 ఆ సరసీరుహాక్షి నిలయంబునఁ బంకజనాభుఁ డుండుటం
జేసి యొసంగెఁబో తగవు సేకొని యొక్కలతాంత, మింతలో
వాసియు వన్నెయుం దగవు వైభవముం, జలము న్వివేకమున్
బో సవతు ల్భజించుటకుఁబో వెఱగయ్యెడు, నేమి సెప్పుదున్

**అర్థాలు :** సరసీరుహ + అక్షి నిలయంబునన్ = పద్మములవంటి కనులు గల ఆ రుక్మిణి యింటిలో;

| | | |
|---|---|---|
| పంకజనాభుఁడు | = | పద్మము బొడ్డునందు కలవాడు - కృష్ణుడు. |
| తగవు | = | పాడి |
| చలము | = | పట్టుదల - బింకము. |

**తాత్పర్యం :** "కృష్ణుడు ఆ రుక్మిణి యింటిలో ఉన్నాడు కనుక న్యాయాన్ని అనుసరించి ఒక పూవును ఆమెకు ఇచ్చాడు. కానీ నా వాసీ, వన్నె, గౌరవమూ, అధికారమూ, బింకము, వివేకము పోయాయే ! ఇప్పుడు సవతులను కలుసుకోవటానికి వెళ్లాలంటే భయం కలుగుతున్నది. ఏమి చెప్పను?" అని సత్యభామ చెలితో పలికినది.

ప.99 మాసిన చీర గట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై
వాసెన కట్టు గట్టి, నిడువాలిక కస్తురి బొట్టు వెట్టి, లో
గాసిలి, చీఁకటింటి కడ కంకటిపై జలదాంత చంద్రరే
ఖా సదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాదవేదనన్.

**ప్రతిపదార్థం :** సత్యభామ కోపంతో చేసిన చేష్టలను ఇందు కవి వర్ణిస్తున్నాడు.

సత్యభామ :

| | | |
|---|---|---|
| మాసిన చీరన్ | = | మాసిపోయిన చీరను; |
| కట్టుకొని | = | తాల్చి |

| | | |
|---|---|---|
| వెడవెడన్ | = | మెల్లమెల్లగా |
| కన్నుమూయున్ | = | కంటిని మూసుకొంటున్నది; |
| కనున్ విచ్చున్ | = | కన్ను తెరుస్తున్నది; |
| నగున్ | = | నవ్వుతున్నది; |
| తల, ఊచున్ | = | తలను కదిలిస్తున్నది; |
| పాన్పుపైన్ | = | పడకపై; |
| పడున్ | = | పడిపోతున్నది; |
| ఉసురు + అంచున్ | = | ఉస్సు ఉస్సు అంటూ; |
| లేచున్ | = | లేచుచున్నది; |

**తాత్పర్యము** : మనస్సులో దేహంలో నిలకడ లేకపోవటం వలన సత్యభామ భరింపనలవికాని బాధలతో మదించిన ఏనుగు తొండానికి చిక్కిన తామరతీగలాగా కళాకాంతులు లేనిదై మెల్లమెల్లగా కళ్ళుమూస్తున్నది, తెరుస్తున్నది. నవ్వుతున్నది, తల ఊపుచున్నది. పాన్పుమీద పడిపోతున్నది ఉస్సురుమని లేస్తున్నది.

ప. 103 ముని నా కిచ్చిన పూవుచందమును, నేమున్నాడి యీ భోజనం
దన కల్పించిన జాడయుం దెలియఁజెంతం బొంచి వీక్షించిపో
యిన సాత్రాజితి బోటి నావలనఁ దానేమేమి కల్పించెనో
యని ప్రద్యుమ్నుని మౌనిదండ నిడి చింతాయత్త చిత్తంబునన్.

**అర్థాలు** :

| | | |
|---|---|---|
| ముని | = | నారదుడు; |
| భోజనందనకున్ | = | భోజుని కూతురు రుక్మిణికి; |
| సాత్రాజితి బోటి | = | సత్యభామ చెలి; |
| మౌనిదండన్ | = | ముని దగ్గర; |
| చింతా + ఆయత్త, చిత్తంబునన్ | = | చింతతో కూడిన మనస్సుతో |

**తాత్పర్యము** : ముని నాకిచ్చిన పూవు తీరును, నేను ముందుగా దానిని రుక్మిణి కిచ్చిన విధాన్ని మెలకువగా దగ్గరగా పొంచి చూచిన ఆ సత్యభామ చెలికత్తె నా విషయంలో ఏమేమి విషయాలు ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పిందో అని మర్యాదకోసం నారదుని దగ్గరగా తన కుమారుడు ప్రద్యుమ్నుని ఉంచి చింతతో కూడిన చిత్తంతో (కృష్ణుడు సత్యభామ యింటికి బయలుదేరాడు).

ప. 104 అరదము నెక్కి కేతన పటాంచల చంచలమైన తాల్మితోఁ
దురగజవంబు మున్గడవఁద్రోచి కడంగెడు తత్తరంబుతోఁ
దిరిగెడు బండికండ్ల పగిదిన్ భ్రమియించు మనంబుతోడ నా
హరి సనుదెంచె సత్యసముదంచిత కాంచన సౌధవీధికిన్.

**ప్రతిపదార్థం** : కృష్ణుడు సత్యభామ ఇంటికి వెళ్ళిన తీరును ఈ పద్యం తెలియ చెబుతున్నది.

| | | |
|---|---|---|
| ఆ హరి | = | ఆ శ్రీకృష్ణుడు |
| అరదమున్ | = | రథమును |
| ఎక్కి | = | అధిరోహించి |
| కేతన, పట + అంచల, చంచలము | = | పతాక వస్త్రం అంచువలె మిక్కిలిగా కదలుచున్నది. |
| ఐన తాల్మితోన్ | = | అయిన ధైర్యముతో |
| తురగజవంబున్ | = | గుఱ్ఱాల వేగాన్ని |
| మున్ | = | ముందుగా |
| కడవన్ ద్రోచి | = | పోవుటకు త్రోసివేసి |
| కడంగెడు తత్తరంబుతో | = | పోవాలి అనే తొందరపాటుతనంతో |
| తిరిగెడు బండి కండ్ల పగిదిన్ | = | గుండ్రంగా తిరుగుతున్న రథచక్రాల ఆకులలాగా |
| భ్రమియించు మనంబుతోడన్ | = | తిరుగుతున్న మనస్సుతో |
| సత్య | = | సత్యభామ యొక్క |
| సముదంచిత కాంచన సౌధవీధికిన్ | = | గొప్పగా ప్రకాశిస్తున్న బంగారు మేడలు గల వీధిలోనికి |
| చనుదెంచెన్ | = | వచ్చెను |

**తాత్పర్యము :** కృష్ణుడు గబగబా రథం ఎక్కాడు. అతని ధైర్యం గాలికి రెపరెపలాడే జెండాగుడ్డ అంచులాగా ఊగిపోతున్నది. వేగంగా పోతున్న గుఱ్ఱాలు ఇంకా వేగంగా పోవాలనే సంభ్రమం కలుగుతున్నది. బండి చక్రాల ఆకులు వేగం వలన ఎంత తీవ్రంగా తిరుగుతున్నాయో అంత వేగంగా పరిభ్రమిస్తున్నది అతని మనస్సు. ఇట్టి స్థితిలో ఆయన సత్యభామ నివసించే బంగారు భవనాల వీధికి వచ్చాడు.

ప.109 ఈ లలితాంగి చంద మొకయించుక చూచెద నంచు ధూర్తగో
పాలుఁడు తాలవృంత మొకభామిని సత్య పిఱుంద నుండి మం
దాలస లీలమై విసర నాదటఁ గైకొని వీచెఁ దద్వపుః
కీలిత పంచసాయక శిఖిం దరికొల్పుచు నున్న కైవడిన్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| లలిత + అంగి | = | సుకుమారమైన దేహం కలది |
| ధూర్తగోపాలుఁడు | = | చిలిపి గొల్లవాడు |
| పిఱుందన్ | = | వెనుకవైపుగా |
| మంద + అలస లీలమైన్ | = | మెల్లగా, అలసినట్లుగా ఉన్న విలాసంతో |
| ఆదటన్ | = | ప్రేమతో |
| తద్, వపుః, కీలిత, పంచసాయక శిఖిన్ | = | ఆమె సుకుమారమైన దేహంలో ఎగసిపడుతున్న మన్మథుడనే అగ్నిని; |
| దరికొల్పుచున్ | = | మరింతగా విజృంభించే విధంగా చేస్తూ |

**తాత్పర్యము :** 'ఈ సుకుమారి విధం కొంచెం చూస్తాను' అనుకొని చిలిపి కృష్ణుడు ఒక విసర కఱ్ఱ తీసుకొని వెనుకవైపుగా మెల్లమెల్లగా వీస్తున్న చెలికత్తె నుండి ప్రేమతో దానిని తీసుకొని ఆమె దేహంలో జ్వాలలతో కూడిన కామమనే అగ్నిని మరింత మండిస్తున్నాడా ! అన్నట్లుగా విసరటం ప్రారంభించాడు కృష్ణుడు సత్యభామను అనునయించిన విధమిది.

ప. 110 అంతటఁ బారిజాత కుసుమాగత నూతన దివ్యవాసన
ల్వింతలు సేయఁ దావి యిది విస్మయ మంచు ముసుంగు ద్రోచియ
క్కాంత గృహంబు నల్లడలు గన్గొని సంభృత తాలవృంతునిం
గాంతునిఁ జూచి బాష్పకణికా తరళీకృత లోచనాంతయై.

**అర్థాలు :**

పారిజాత, కుసుమ + ఆగత, నూతన, దివ్య, వాసనల్ = పారిజాత పూవునుండి వచ్చే క్రొత్తవీ, దివ్యమైనవీ అయిన వాసనలు,

| | | |
|---|---|---|
| నల్, కడలు | = | నాలుగు దిక్కులు |
| సంభృత, తాలవృంతునిన్ | = | పట్టుకొని ఉన్న విసనకఱ్ఱ కలవానిని, |
| కాంతునిన్ | = | భర్తను |

బాష్పకణికా తరళీకృతలోచన + అంత + ఐ = కన్నీటి బిందువులచేత కదలాడునట్లు చేయబడిన కన్నుల తుదలు కలదియై

**తాత్పర్యం :** అప్పుడు పారిజాత పుష్పంనుండి వస్తున్న స్వర్గ సంబంధమైన వాసనలు అబ్బురపరుపగా ఈ వాసన ఏదో ఆశ్చర్యంగా ఉందే అనుకొంటూ సత్యభామ ముసుగు తొలగించి నాలుగు వైపులా తేరిపార జూచి ఎదురుగా విసనకఱ్ఱ పట్టుకొని ఉన్న నాథుని చూచి కన్నీటితో కదలాడి పోతున్న కంటి తుదలు కలది అయి (ముందు పద్యంతో అన్వయం )

ప. 112. ఓర్పొకయింతలేని వికచోత్పలలోచన చిత్త వీథిఁజ
ల్లార్పంగ నీలనీరద శుభాంగుఁడు వే చనుదెంచె నంచుఁగం
దర్పహుతాశను న్వెలికిఁదార్చు సఖుండును బోలె వేఁడి ని
ట్టూర్పు దళంబుగా నిగిడె నున్నమితాదరణాంశుకాంతమై

**ప్రతిపదార్థం :** కోపంతో ఉడికిపోతున్న సత్య వికారాన్ని ఈ పద్యం వివరిస్తున్నది.

| | | |
|---|---|---|
| ఓర్పు | = | సహనం |
| ఒక + ఇంత, లేని | = | కొంచెం కూడా లేనట్టి; |
| వికచ + ఉత్పలలోచన చిత్తవీథిన్ | = | వికసించిన కలువల వంటి కనులుగల సత్యభామ మనస్సు అనే వీధిని; |
| చల్లార్పఁగన్ | = | చల్లగా చేయుటకు |
| నీల నీరద శుభ + అంగుడు | = | నల్లని మేఘం వంటి సుందరమైన దేహంగల కృష్ణుడు |
| వే | = | వడిగా; |
| చనుదెంచెన్ | = | వచ్చెను; |

| | | |
|---|---|---|
| అంచున్ | = | అంటూ; |
| వేఁడి, నిడు + ఊర్పు | = | వెచ్చని పొడవైన నిఃశ్వాసం అనే గాలి; |
| కందర్ప, హుత + అశనున్ | = | మన్మథుడనే అగ్నిని: |
| వెలికిన్ | = | వెలుపలికి; |
| తార్చు | = | తీసికొని వచ్చే; |
| సఖుండును బోలెన్ | = | చెలికాని విధంగా; |
| ఉన్నమిత + ఆవరణ + అంశుల్ + అంతము + ఐ | = | పైకి ఎగురగొట్టుచున్న పయ్యెట వస్త్రం అంచులు గలదియై; |
| దళంబుగాన్ | = | దట్టంగా; |
| నిగిడెన్ | = | వ్యాపించింది. |

**తాత్పర్యం :** సత్యభామలో ఓర్పు కొంచెం కూడా లేదు. కోపంతో అలా ఉడికిపోతున్న ఆమె మనస్సును చల్లబరచటానికి కృష్ణుడు తొందరతో వచ్చాడు. అతని సంకల్పం నెరవేరగూడదు అని ఆమె హృదయంలో ఉన్న అగ్నిని పైకి తెచ్చే చెలికాని విధంగా వేడి ముక్కునుండి వెలువడే గాలి ఆమె ముసుగుగా తాల్చిన పయ్యెట అంచులను పైకి త్రోసివేస్తూ వ్యాపించింది.

ప. 113 వనిత కుచద్వయంబు పయి వ్రాసిన కుంకుమ పత్ర భంగముల్
జనిత నితాంత ఘర్మకణజాలముచేతఁ గరంగి మెల్లమె
ల్లన వెలిపట్టు పయ్యెద కెలంకుల జాఱుట యొప్పె మానసం
బున నెలకొన్న క్రోధరసము న్వడఁబెట్టుచు నున్న కైవడిన్.

**ప్రతిపదార్థము :** సత్యభామ కోపవర్ణన

| | | |
|---|---|---|
| వనిత కుచద్వయంబుపయిన్ | = | ఆ యింతి చన్నుల జంట మీద; |
| వ్రాసిన కుంకుమ పత్ర భంగముల్ | = | అలంకారంగా కుంకుమ ద్రవంతో గీసిన ఆకుల వంటి గీతలు ; |
| జనిత, నితాంత, ఘర్మ, కణజాలము చేతన్ | = | పుట్టిన మిక్కుటమైన చెమట బిందువుల సముదాయంచేత; |
| కరంగి | = | కరిగిపోయి; |
| మెల్లమెల్లనన్ | = | మెల్లమెల్లగా; |
| వెలి, పట్టుపయ్యెద కెలంకులన్ | = | తెల్లని పట్టుపైట ప్రక్కభాగాలలో; |
| జాఱుట | = | జారిపోవటం; |
| మానసంబునన్ | = | హృదయంలో; |
| నెలకొన్న | = | ఏర్పడియున్న; |
| క్రోధరసమున్ | = | కోపమనే (ద్రవపదార్థాన్ని) రసాన్ని; |
| వడన్ + పెట్టుచున్ | = | వడపోస్తూ; |
| ఉన్న, కైవడిన్ | = | ఉన్న విధంగా; |
| ఒప్పెన్ | = | అందగించింది |

**తాత్పర్యము :** సత్యభామ చన్నులమీద అలంకారంగా తీర్చుకున్న ఆకుల వంటి గీతలు గట్టిగా పట్టిన చెమట బిందువులతో కరిగిపోయి మెల్లమెల్లగా తెల్లని పట్టుపైట అంచులమీద జారటం, ఆమె హృదయంలో నిలిచియున్న క్రోధమనే రసాన్ని వడపోస్తున్న తీరుగా ఒప్పింది.

ప. 115 ఇందునిభాస్య ! మై తొడవు లేల ధరింపవు ? సన్నగావు లీ
వెందును మానలేవు, తెలుపేటికిఁ గట్టితి ? వీటికారుచుల్
కెంధలిరాకు మోవిఁ దులకింపఁగ ఁజేయక యున్కి యేల? నీ
చందము వింత యయ్యెడు: నిజంబుగ నాకెఱుఁగంగఁ జెప్పుమా?

**అర్థాలు :** శ్రీకృష్ణుడు సత్యభామను అనునయిస్తున్న మాటల లోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| ఇందు. నిభ + ఆస్య | = | చంద్రునితో పోలెడు ముఖము గలదానా ! |
| మై తొడవులు | = | నగలు; |
| సన్నకావులు | = | సన్నని కావిరంగు చీరలు; |
| వీటికారుచుల్ | = | తాంబూలపు కాంతులు; |
| కెంపు + తలిరు + ఆకు మోవిన్ | = | ఎర్రని చిగురు ఆకు వంటి పెదవిని; |
| తులకింపఁగన్ | = | ప్రకాశించునట్లు; |

**తాత్పర్యము :** చంద్రవదనా ! నగలను ఎందుకు పెట్టుకోలేదు? నీ వెప్పుడూ సన్నని కావిరంగు చీరలు తప్ప కట్టవే, తెల్లని బట్ట ఎందుకు ధరించావు ? తాంబూలం కాంతులు నీ ఎర్రని చిగురాకు వంటి పెదవిని ప్రకాశింప జేయకుండటం ఏల ? నీ ధోరణి విచిత్రంగా ఉంది ? దానిలో ఉన్న స్థితిని నాకు తెలియజెప్పు.

ప. 116 మన మరయం దలచి యొక మార్గము పన్నితొ, నవ్వుటాలకో,
నను వెఱపించెదో యకట ! నా యెడ నిక్కపుఁదప్పు కల్గెనో
వనజదళాయతాక్షి, పగవాఁడనె, నన్నిటు లేల చూడ ? వొ
క్క నిముసమైన నీవు దయఁ గన్గొనకుండిన నిల్వనేర్తునే !

**అర్థాలు :** వనజదళ + ఆయుత + అక్షి - పద్మాల రేకులవలె విశాలమైన కన్నులు గలదానా ?

**తాత్పర్యం :** 'ఓ పద్మాక్షీ ! నా మనస్సును పరీక్షించేదారిగా దీనిని చేశావా ? నవ్వుటాలకు ఇలా ఉన్నవా? నన్ను భయపెడుతున్నావా? నిజంగా నానుండి దోషం కలిగిందా ? నీకు నేను పగవాడనా ? నా వైపు చూడవేమి ? ఒక్కనిముషమైనా నీవు దయతో చూడకపోతే నేను నిలువ గలనా?, అని కృష్ణుని అనునయంతో కూడిన మాటలు.

ప. 116 పలుకులఁదేనె లుట్టిపడఁ బల్కవు నేఁడిదియేమి? వాలుఁ
న్నుల ననుసిగ్గు నూల్కొనఁ గనుంగొన వేల? యురఃస్థలంబుఁజ
న్నుల నెదురొత్తి మక్కువ ననుం బిగి కౌ గిటఁ జేర్పవేటికే
చిలుకలకొల్కి, యెవ్వరెడసేసిరి, నీకిటు లేల చింతలన్.

| | | |
|---|---|---|
| **అర్థాలు :** నూల్కొనన్ | = | తగులునట్లుగా; |
| ఉరఃస్థలంబున్ | = | నా ఎదురొమ్మును |

ఎడ + చేసిరి = తప్పు చేశారు

**తాత్పర్యం :** " ఓ చిలుకల కొలికీ ! పలుకులలో తేనెలుట్టిపడేలా పలుకవేల ? అందమైన క్రిందికి వంగిన కన్నులలో సిగ్గు తోచే విధంగా నన్ను చూడవేమి ? నా రొమ్మును నీ చన్నులతో నేరుగా గట్టిగా తాకించి బిగికౌగిటిలోనికి నన్ను తీసుకోవేమి ? నీ కెవరు అపకారం చేశారు? ఈ దుఃఖాలు నీకెందుకు ?" అని సత్యభామను కృష్ణుడు అనునయిస్తున్నాడు.

ప. 117 మనమున మాటలన్ క్రియల వీ నొకనాడు నెట్టికా
మినులకు గారవంబు మెఱమెచ్చులకై పచరింతుఁగాని, పా
యని యనురక్తి నీ యెడల యగ్గలమై కనుపట్టు నాకు, నీ
పనిచిన పంపు సేయుటయ ప్రాభవ మౌటది నీవెఱుంగవే ?

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కామినులకున్ | = | వనితలకు; |
| మెఱమెచ్చులకై | = | పైకి మాత్రమే కనపడు మెప్పులకోసం; |
| పచరింతున్ | = | కూర్తును; |
| పాయని + అనురక్తి | = | వదలని అనురాగం; |
| అగ్గలము | = | అధికము; |
| పంపు | = | ఆజ్ఞ; |
| ప్రాభవము | = | దొరతనం. |

**తాత్పర్యము :** 'వనితా ! నేను మనస్సు, మాట, చేష్టలు అనే మూడు కరణాలతో ఏ యింతులకు గౌరవం ఇవ్వలేదు. పై మెప్పులకు వానిని చేస్తూ ఉంటాను. నీ విషయంలో మాత్రం అనురాగం వదల కుండా ఎల్లవేళలా ఉంటుంది. నీ ఆజ్ఞను పాటించటమే నాకు ప్రభుత్వం వంటిది. ఇది నీవెరుగవా ?' అని కృష్ణుడు సత్యభామను బ్రతిమాలుతున్నాడు.

ప. 119 పడఁతీ, నీమధురాధరామృతము నీ బాహాపరీరంభముం
బడయన్ ధన్యుఁడఁగాకయుండిన ననున్ బాటించి యొక్కింత నీ
నిడువాలుంగడగంటఁ జూడు మనుచు నిల్పోపమింబై చెఱం
గొడియం జేవిరిదమ్మి వ్రేయుటకునై యుంకించి జంకించినన్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మధుర + అధర + అమృతము | = | తీయని క్రింద పెదవి అనే అమృతాన్ని; |
| నీ బాహా పరీరంభమున్ | = | నీ చేతుల కౌగిలింతను; |
| నిడు, వాలున్ + కడకంటన్ | = | పొడవైన, వంకర అయిన, కంటి చివరిభాగంతో; |
| నిల్పు + ఓపమిన్ | = | ధైర్యాన్ని నిలుపుకోలేకపోవటం చేత, |
| పై చెఱంగు + పయ్యటను, ఒడియన్ | = | గట్టిగా పట్టుకోగా ; |

| | | |
|---|---|---|
| చే, విరి + తమ్మిన్ | = | చేతిలోని వికసించిన తామరపూవును ; |
| ఉంకించి | = | ప్రయత్నించి; |
| జంకించినన్ | = | భయపెట్టగా ; |

**తాత్పర్యము :** 'ఇంతీ ! నీ తీయని మోవి అమృతాన్ని, నీ అందమైన చేతుల కౌగిలింతనూ పొందే ధన్యుణ్ణి కాకుండా ఉన్న నన్ను మన్నించి కనీసం, నీ పొడవైన వాలు చూపులతోనైనా ఒక్కమారు చూడు, అని ధైర్యాన్ని నిలద్రొక్కుకోలేక పై చెఱగును కృష్ణుడు పట్టుకోగా సత్యభామ చేతిలోని వికసించిన తామరపూవుతో కొట్టటానికి ప్రయత్నించి భయపెట్టింది'. అని కృష్ణుడు సత్యభామను బ్రతిమాలుతున్నాడు.

ప. 120 పాటలగంధి చిత్తమునఁ బాటిలు కోపభరంబు దీర్ప నె
ప్పాటను బాటుగామి, మృదు పల్లవ కోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళి మణి పంక్తికి వన్నియ బెట్ట నా జగ
న్నాటక సూత్ర ధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె, మ్రొక్కినన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఆ జగత్ + నాటక సూత్రధారి | = | జగత్తు అనే నాటకానికి ప్రధాన నిర్వాహకుడు - అయిన |
| యదునందునుఁడు | = | యదువంశంలో పుట్టిన శ్రీ కృష్ణుడు; |
| పాటల గంధి చిత్తమునన్ | = | కలిగొట్టు పువ్వు వాసనవంటి సువాసన గల ఆ సత్యభామ హృదయంలో; |
| పాటిలు, కోపభరంబున్ | = | నిలిచియున్న కోపం బరువును; |
| తీర్పన్ | = | పోగొట్టటం |
| ఏ+పాటునన్ | = | ఏ విధంగాను |
| పాటుగామిన్ | = | కుదరక పోవటం వల్ల |

మృదు, పల్లవ, కోమల, తత్, పద, ద్వయీ, పాటల, కాంతి = మెత్తని చిగురు వలె సుకుమారమైన ఆమె పాదాల జంట యందలి పాటల పుష్పం వంటి మెరుగు ;

| | | |
|---|---|---|
| మౌళి మణి పంక్తికిన్ | = | తలపై నున్న మణుల వరుసకు ; |
| వన్నియ + పెట్టన్ | = | కాంతిని కూర్పగా ; |
| అర్మిలిన్ | = | ప్రేమతో ; |
| మ్రొక్కెన్ | = | మ్రొక్కెను ; |
| మ్రొక్కినన్ | = | మ్రొక్కగా ; |

**తాత్పర్యం :** కమ్మని దేహ వాసనగల ఆ సత్యభామ హృదయంలో చెలరేగే కోపం భారాన్ని తొలగించటానికి ఏ మార్గమూ కుదరక జగన్నాటక సూత్రధారి శ్రీ కృష్ణుడు సుకుమారమైన ఆమె పాదాల జంట మీది పాటల పుష్పం వంటి కాంతి తన శిరో భూషణాలైన మణుల వరుసలకు కాంతులను కూర్పగా ప్రేమతో ఆమెకు మ్రొక్కాడు. ఇది సత్యభామ కోపాన్ని తీర్చటానికి కృష్ణుడు చేసిన చేష్ట.

ప. 121 జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిర మచ్చో వామపాదంబునం
దొలఁగం ద్రోచె లతాంగి ; యట్ల యగు నాథుల్ నేరము ల్సేయఁబే
రలు కం జెందిన యట్టి కాంత లుచిత వ్యాపారముల్ నేర్తురే ?

**ప్రతిపదార్థం :**

లతా + అంగి = తీగవంటి దేహం గల ఆ సత్యభామ
ఆ + చోన్ = ఆ సందర్భంలో;
జలజాత + ఆసన, వాసవ + అది, సుర, పూజా భాజనంబు = బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన దేవతల పూజలకు పాత్రం;
ఐ, తనర్చు = అయి ఒప్పారు
లతా + అంత + ఆయుధు కన్నతండ్రి శిరమున్ = పూవులు బాణాలుగా గల మన్మథుని కన్నతండ్రి అయిన విష్ణువు తలను
వామపాదంబునన్ = ఎడమ కాలితో
తొలఁగన్ = ప్రక్కకు వెళ్ళునట్లుగా;
త్రోచెన్ = త్రోసెను;
అట్లు + అ = ఆ విధంగానే;
అగున్ = అవుతుంది;
నాథుల్ = భర్తలు;
నేరముల్ = తప్పిదాలు;
చేయన్ = చేస్తే;
పేరు + అలుకన్ = పెద్దకోపం;
చెందిన + అట్టి కాంతలు = పొందిన యింతులు;
ఉచిత, వ్యాపారముల్ = తగిన చేష్టలను,
నేర్తురే = తెలుసుకోగలరా ?

**తాత్పర్యము :** ఆ సత్యభామ బ్రహ్మ, దేవేంద్రుడు మొదలైన దేవతల పూజకు పాత్రమైన, మన్మథుని కన్నతండ్రి తలను అప్పుడు ఎడమకాలితో ప్రక్కకు త్రోసివేసింది. అది అంతే ! తీవ్రమైన కోపంగల కాంతలు మగలు తప్పులు చేస్తే మంచి చెడు అనే విచారం చేయటానికి సమర్థులు కారు. - కృష్ణుడు మ్రొక్కగా సత్యభామ బింకంతో చేసిన చేష్టను కవి సమర్థిస్తున్నాడు.

ప. 123 నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁ గిన్కబూని తా
చినయది నాకు మన్ననయ; చెల్వగు నీ పదపల్లవంబు మ
త్తనుపుల కాగ్ర కంటక వితానము దాకిన నొచ్చునంచు నే
నని యెద నల్క మానవుగదా ! యిఁకనైన నరాళకుంతలా !

**ప్రతిపదార్థము :**

అరాళకుంతలా = వంపులుగల అలకలు గలదానా !

| | | |
|---|---|---|
| భవదీయదాసునిన్ | = | నీ సేవకుడనైన; |
| ననుం | = | నన్ను; |
| మనంబునన్ | = | హృదయంలో; |
| నెయ్యము + కిన్కన్ | = | ప్రేమతో కూడిన అలుకను; |
| పూని | = | పెట్టుకొని; |
| తాచిన యది | = | తన్నటం; |
| నాకున్ | = | నాకు; |
| మన్ననయ | = | గౌరవమే; |
| చెల్వు + అగు, నీ, పద పల్లవంబు | = | అందమైన చిగురువంటి నీ పాదం; |
| మత్ + తను, పులక + అగ్ర కంటక వితానము | = | నా దేహమందలి పులకల చివరలనే ముళ్ల సముదాయం; |
| తాకినన్ | = | తాకితే; |
| నొచ్చున్ | = | బాధపొందుతుంది; |
| అంచున్ | = | అని; |
| నేన్ | = | నేను; |
| అనియెదన్ | = | అంటున్నాను; |
| ఇఁకన్ + ఐనన్ | = | ఇప్పటికైనా; |
| అల్క | = | కోపం; |
| మానవు + కదా | = | వదలవు కదా ! |

**తాత్పర్యము** : 'నన్ను నీ దాసుణ్ణి ప్రేమ కోపంతో తంతే అది నాకు గౌరవమే. కానీ చిగురాకువంటి నీ పాదం నా దేహంమీద నీ స్పర్శవలన కలిగిన గగుర్పాటుతో నిక్కబొడుచుకొన్న ముండ్లవంటి వెంట్రుకలు తాకి నొప్పి పొందుతుందేమో అని పలుకుతున్నాను. ఇకనైనా కోపం మానవా !' అని సత్యభామను కృష్ణుడు అనునయిస్తున్నాడు.

ప. 124 అనవిని మానినీ తిలక మప్పుడు మే యఱదోఁప నిక్కి, వీ
డిన కచపంక్తిఁ బల్మఱు ముడి న్వెడఁదోపుచుఁబై చెఱంగుఁగ్ర
క్కునఁ జనుదోయిఁ జేర్చుచు, మొగంబున లేఁజెమటంకురింప, జం
కెననెఱచూపు చూచి పలికెం జలితాధర పల్ల వాగ్రయై

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మానినీతిలకము | = | అభిమానవతులలో శ్రేష్ఠురాలు; |
| వీడిన కచపంక్తిన్ | = | ఊడిన కేశముల వరుసను; |
| ముడిన్ | = | కొప్పులో; |
| వెడన్ | = | అలవోకగా; |
| జంకెన, నెఱ, చూపు | = | తర్జించే వాడిచూపును; |
| చలిత + అధర పల్లవ + అగ్ర | = | వణకుతున్న క్రింది పెదవి అనే చిగురుచివళ్లు కలదియై. |

**తాత్పర్యము** : కృష్ణుని మాటలు విన్న సత్యభామ ముసుగునుండి తన దేహం కొంచెం కనపడే విధంగా **లేచి, ఊడిపోయిన** కేశాలను కొప్పులో విలాసంగా దోపుకుంటూ, పయ్యెటను రొమ్ముమీద సరిచేసుకుంటూ, మొగం మీద కొంచెంపాటి చెమట బిందువులు క్రమ్ముతూ ఉండగా, గ్రుచ్చుతున్నవా అన్నట్టి చూపులతో, వణకుతున్న క్రింది పెదవితో కూడినదై ఇలా పలికింది.

ప. 125 ఈ నయగారవుం బ్రియము, పీపస, పీమొగ మిచ్చ మాటలే
లా ? నిను నమ్మియుండిన ఫలంబిదె తోడనె కల్గె నాకు, నీ
యానసుమీ ననుంజెనకి యాఱడి వెట్టిన, నవ్వువారలం
గాన; వెఱుంగునే పసులకాపరి భావజమర్మ కర్మముల్

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నయగారము + ప్రియములు | = | మెత్తమెత్తని ప్రియమైన చేష్టలు ; |
| పసలు | = | నేర్పులు |
| మొగమిచ్చమాటలు | = | మొగం మీద (ఎదురుగా) ప్రీతి కలిగించే మాటలు - హృదయంలో ప్రీతిలేకుండా పైకి ప్రీతివి నటించే మాటలు, |
| ఆఱడి | = | అల్లరి |
| భావజ, మర్మ, కర్మముల్ | = | మన్మథుని రహస్యపు పనులు |

**తాత్పర్యం** : 'ఈ మెత్తని ప్రియాలూ, ఈ నేర్పులు, కనబడినప్పుడు ప్రేమ ఉన్నట్లు నటించే మాటలు ఎందుకయ్యా ? నిన్ను నమ్మినదానికి ఫలం ఇదిగో ఇప్పుడే నాకు కలిగింది. నన్నల్లరిపెడితే ఒట్టు. నన్ను వెక్కిరించే వారిని నీవు చూడటం లేదు. అయినా గొడ్లను కాసుకొనే వానికి మన్మథుని గుట్టులు తెలుస్తాయా ?' అని సత్యభామ కృష్ణుని కోపంతో నిందిస్తున్నది.

ప. 126 ఇంకిటు నిన్ను నమ్మ, నను నేమిటికిం గెరలించె, దెంతయున్
బొంకముగాని యీవలని బొంకులు మాచవి గావు, రుక్మిణీ
పంకజ పత్ర నేత్రకును ప్రాణపదంబులు గాని, వల్లవీ
కింకర ! చాలుఁజాలు నడకింపకు, నింపకు లేని కూరుముల్

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కెరలించెదు | = | కవ్విస్తావు |
| పొంకము | = | సరిపడునది |
| ఈ వలని బొంకులు | = | ఇటువైపు అబద్ధపు మాటలు; |
| పంకజ పత్ర నేత్రకును | = | పద్మము రేకులవంటి కనులుగలది; |
| ప్రాణపదంబులు | = | ఆయువు పట్టులు; |
| వల్లవీకింకర ! | = | గొల్లభామల సేవకుడా ! |
| అడకించకు | = | వెక్కిరించవద్దు; |
| లేని కూరుముల్ | = | లేని ప్రేమలు |

**తాత్పర్యం :** 'ఓగొల్లభామల కింకరుడా ! ఇక నేను నిన్ను నమ్మను. నన్నెందుకు ఇబ్బంది పెడతావు. అందుకని యీ అబద్ధపు మాటలు మాకు రుచించవు. అవి ఆ రుక్మిణమ్మకు ప్రాణపదాలు. చాలుచాలు. నన్ను వెక్కిరించవద్దు, హృదయంలో లేని ప్రేమలను నింపవద్దు,' అని సత్యభామ కృష్ణుని నిందిస్తున్నది.

ప. 127 గట్టివ చేతలుం బగులుఁ గల్లదనంబులు నీవు పుట్టగాఁ
బుట్టిన ; వెందులేని పలుపోకల మాయలు నీకు వెన్నతోఁ
బెట్టిన వౌటెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మినా
గుట్టును దేజమున్మిగుల గొల్పడి పోయితి నేమి సేయుదున్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కల్లదనంబులు | = | మోసాలు |
| పలుపోకల మాయలు | = | పెక్కుతీరులైన వంచనలు |
| గుట్టు | = | దాచుకొన్న రహస్యము |

**తాత్పర్యం :** 'ఇట్టి చేతలు, నేర్పులు, అబద్ధాలూ - ఇవన్నీ నీ తోనే పుట్టాయి. ఎక్కడాలేని పెక్కుతీరులు, మోసాలు నీకు వెన్నతో పెట్టిన విద్యలు. ఇలా కావటం తెలిసికూడా అమాయకంగా నిన్ను నమ్మి నా గుట్టునూ, నా మహిమనూ జారవిడుచుకున్నాను. ఇప్పుడేమి చేయగలను ?' అని సత్యభామ పలికినది.

ప.128 మునిపతి వచ్చి పూవొసఁగి మోదముతోడ భవత్ప్రియాంగన
న్వినుతి యొనర్పగా వినిన వీనుల మాచవిగాని మాటల
న్వినవలసెం గదా ! యిపుడు నీవిట వచ్చుట పారిజాతవా
సనఁ బ్రకటించి నాకు వెకసక్కెము సేయనకాదె ; చెప్పుమా !

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| భవత్, ప్రియా + అంగనన్ | = | నీకు మిక్కిలి ప్రియురాలైన యింతిని; |
| ప్రకటంచి | = | చక్కగా తెలియునట్టు చేసి; |
| వెకసక్కెము | = | వేళాకోళము; |

**తాత్పర్యం :** 'ఆ నారదుడు వచ్చి పూవునిచ్చాడు. పొంగిపోతూ నీ ప్రియమైన భార్యను నోటికొలదీ పొగిడాడు. అది విన్న నీ చెవులకు మా రుచిలేని మాటలు వినవలసిన కర్మపట్టింది. ఇప్పుడు నీవు ఇక్కడకు రావటం పారిజాత పరిమళాన్ని మాకు తెలియజేసి వెక్కిరించటానికే కదా ! చెప్పు' అని సత్యభామ కోపంతో పల్కినది.

ప. 133 ఈసునఁ బుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబు చేఁ
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి, పంకజ
శ్రీ సఖమైన మోము పయిఁ జేల చెఱంగిడి బాలపల్లవ
గ్రా సకషాయ కంఠ కలకంఠవధూ కల కాకలీ ధ్వనిన్.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| లలిత + అంగి | = | సుకుమారమైన అవయవాలు గల ఆ సత్యభామ; |
| ఈసునన్ | = | అసహనభావంతో; |
| పుట్టి | = | ఏర్పడి; |
| హెచ్చిన | = | పెరిగిన; |
| కోప, దవ + అనలంబుచేన్ | = | కోపమనే అడవిమంట (కారుచిచ్చు) చేత; |
| గాసిలి | = | కుమిలిపోయి; |
| ప్రాణవిభు | = | ప్రియుడైన పతియొక్క; |
| కడు + ఎదుటన్ | = | ఎట్టయెదురుగా; |
| పంకజ శ్రీ సఖము | = | పద్మాల సొంపునకు మిత్రము; |
| అయిన మోము పయిన్ | = | అయిన మొగం మీద; |
| చేలచెఱంగున్ | = | పయ్యెట అంచును |
| ఇడి | = | పెట్టుకొని |

బాల, పల్లవ, గ్రాస, కషాయ, కంఠ, కలకంఠ వధూ కల కాకలీ ధ్వనిన్ = లేత చిగుళ్ళుతిండితో వగరెక్కిన గొంతుకగల ఆడుకోకిలదైన మోహనమైన సన్నని ఎలుగుతో;

| | | |
|---|---|---|
| ఏడ్చెన్ | = | ఏడ్చెను. |

**తాత్పర్యం :** ఆ సత్యభామ దుఃఖం ఈర్ష్యవల్ల పుట్టింది. హృదయంలో మెల్లమెల్లగా దావాగ్నిలాగా మండసాగింది. దానితో ఆమె తామరపూవు శోభకు చెలి అయిన మొగంమీద పయ్యెట చివరిభాగం పెట్టుకొని లేతచిగుళ్ళు తిండిగా గల ఆడుకోయిల నోటినుండి కమ్మగా వెలువడే సన్నని నాదంవంటి నాదంతో ఏడ్చింది.

ప. 132 ఆ రమణీలలామ మది నంటిన కోపభరంబు నిల్వఁగా
నేరక నెవ్వగం బొగుల, నీరజనాభుఁడు నిండుఁగౌఁగిటం
జేరిచి బుజ్జగించి నునుఁజెక్కుల ( జాలుకొనంగ జాఱు క
న్నీరు కరంబునం దుడిచి నెయ్యముఁ ది య్యముఁ దో పనిట్లనున్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నెఱ + వగన్ | = | పెద్దదుఃఖంతో; |
| నీరజ నాభుఁడు | = | పద్మము బొడ్డునందుఁ గలవాడు; |
| నును + చెక్కులన్ | = | నున్నటి బుగ్గలమీద; |
| నెయ్యము | = | స్నేహము; |
| తియ్యము | = | ప్రియము |

**తాత్పర్యము :** స్త్రీ రత్నం అయిన ఆ సత్యభామ హృదయంలో లోతుగా పాతుకొన్న దుఃఖాన్ని ఆపుకోలేక ఆ విధంగా కుమిలిపోతూ ఉంటే కృష్ణుడు నిండైన కౌగిలిలోనికి తీసుకొని లాలింపుమాటలు పలికి నున్నగానున్న బుగ్గలమీద జాలువారుతున్న కన్నీటిని చేతితో తుడిచి స్నేహంతో, ప్రియంతో ఇలా పలికాడు.

ప. 122 ఓ లలితేంద్ర నీల శకలో పమకైశిక ! యింత వంత నీ
కేల లతాంత మాత్రమున కేఁగలుగన్ ? విను నీకు దేవతా
కేలివనంబు సొచ్చి, యనికిన్ బలసూదనుఁ డెత్తివచ్చినన్
దీలు పడంగఁ దోలి, యిటఁ దెచ్చెద నిచ్చెదఁ బారిజాతమున్.

**ప్రతిపదార్థము :**

ఓ లలిత +ఇంద్రనీల, శకల, ఉపమ, కైశిక = సుకుమారమైన ఇంద్రనీల మణి ముక్కయే సాటిగా గల కేశపాశము గల ఓ సత్యా!

| | | |
|---|---|---|
| ఏన్ | = | నేను; |
| కలుగన్ | = | ఉండగా; |
| లతాంతమాత్రమునకున్ | = | కేవలం ఒక్కపువ్వుకోసం; |
| ఇంత, వంత | = | ఇంత దుఃఖం; |
| నీకున్ | = | నీకు; |
| ఏల? | = | ఎందుకు |
| విను | = | ఆలకించు |
| దేవతా కేలివనంబున్ | = | దేవతల ఉద్యానవనాన్ని; |
| చొచ్చి | = | ప్రవేశించి; |
| అనికిన్ | = | పోరాటానికి; |
| బలసూదనుడు | = | బలుడనే రక్కసుని చంపిన ఇంద్రుడు |
| ఎత్తి, వచ్చినన్ | = | దండెత్తి వచ్చినా; |
| దీలు పడంగన్ | = | పసచెడునట్లుగా; |
| తోలి | = | తరిమికొట్టి; |
| పారిజాతమున్ | = | పారిజాతం అనే చెట్టును; |
| తెచ్చెదన్ | = | తెస్తాను; |
| నీకున్ | = | నీకు; |
| ఇచ్చెదన్ | = | ఇస్తాను. |

**తాత్పర్యము :** 'నల్లగా నిగనిగలాడే ఇంద్రనీలమణుల కాంతులను పోలే కేశపాశంగల ఓ సత్యా ! నేనుండగా ఒక పువ్వు కోసం నీవు ఇంత దుఃఖం పొందటం ఎందుకు ? నా మాట విను. నేను దేవతల ఉద్యానవనమైన నందనంలో ప్రవేశించి, పోరాటానికి దేవేంద్రుడు దండెత్తి వచ్చినా అతనిని క్రుంగదీసి తరిమికొట్టి ఆ పారిజాత వృక్షాన్ని తెస్తాను, నీకిస్తాను' అని సత్యభామతో శ్రీ కృష్ణుడు పలికాడు.

**5. సందర్భ సహిత వ్యాఖ్యలు :**

సాధరణంగా పాఠ్యాంశం మీద విద్యార్థి సాధించిన పట్టు ఎటువంటిదో పరీక్షించటానికి సందర్భ సహిత వ్యాఖ్య బాగా పనికివస్తుంది. దీని తీరు తెన్నులను మొదటి పాఠంలో గమనించాం. ఈ పాఠ్యంలోని అట్టి వాక్యాలను కొన్నింటిని పరిశీలిద్దాం. వీనిని ఆధారంగా చేసుకొని విద్యార్థులు మరికొన్నింటిని రూపొందించుకోవాలి.

1. మన మెరియదె ప్రాణమైన మగ డట్లయినన్

**పరిచయము :** ఈ వాక్యం ముక్కు తిమ్మన రచించిన పారిజాతాపహరణం అనే కావ్యంలోని ప్రథమాశ్వాసం లోనిది.

**సందర్భం :** తన చెలికత్తె వలన పారిజాతపుష్పం రుక్మిణికి దక్కిందని ఎరిగిన సత్యభామ కోపమూ దుఃఖమూ పెనగొనగా ఆమెతో అంటున్న సన్నివేశం.

**వివరణ :** పాపం ఆ ముని ఏమి చేస్తాడు ? మగడు ప్రియమార పూవునిస్తే తీసుకొని ధరించటం ఏ స్త్రీకయినా సహజం కనుక రుక్మిణి అంతకంటె ఏమి చేస్తుంది. కానీ అల్లరి గొల్లవాడు నాపై ఎంతో ప్రేమ నటిస్తున్నవాడు ఈ విధంగా ప్రవర్తించటం సరియైన పద్ధతి కాదు. ఇదంతా తెలిసినప్పుడు అతడే ప్రాణమని చూచుకొంటున్న నా వంటిదానికి మనస్సు మండిపోదా ? - అని సత్య దుఃఖంతో అంటున్నది.

2. ప్రాణము లెంత తీపొకో

**పరిచయం :** హరివంశంలోని కథను ఆధారంగా తీసుకొని నంది తిమ్మన రచించిన పారిజాతాపహరణం ప్రథమాశ్వాసం లోనిది ఈ వాక్యం.

**సందర్భం :** నారదుడొక అద్భుతమైన పూవు తెచ్చి కృష్ణునకు కానుకగా ఇవ్వటం, దానినతడు రుక్మిణికి ప్రేమతో సమర్పించటం చెలి ద్వారా తెలిసికొన్న సత్యభామ పలుకుతున్న మాటలలోనిది ఈ వాక్యం.

**వివరణ :** ఆమె ఇలా అంటున్నది. నేను శ్రీకృష్ణుని వివాహమాడినది మొదలు ఇన్నాళ్ళు సవతులలో గౌరవం పొందుతూ ఉన్నాను. నా భర్త నన్ను కన్నులలో కప్పుకొని మన్నిస్తూ ఉన్నారు. ఈ జరిగిన పూవు కథతో నా పరువూ, ప్రతిష్ఠా జారిపోయాయి. నేటి నుండి వారంతా, ఆ సత్యదేమి సౌభాగ్యంలే, రుక్మిణియే అందరినీ తలదన్నే స్థితిలో ఉంది అని చాటునా మాటునా సన్నసన్నగా అంటారు. దీనిని సహించటం సాధ్యమా ! పోనీ ప్రాణాలు వదలివేద్దామా అంటే బుద్ధి పుట్టటం లేదు. మనిషికి వానిమీద ఎంత ఆదరమో కదా !

3. తొలిజన్మము నోము ఫలము తోయజనేత్రా !

**పరిచయము :** నందితిమ్మన రచించిన పారిజాతపహరణం ప్రథమాశ్వాసం లోని సత్యభామ సాంత్వనం అనే ఘట్టంలోనిది ఈ వాక్యం. తిమ్మన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవి.

**సందర్భం :** పారిజాతం రుక్మిణికి నారదుడు మొదలైన అందరూ చూస్తుండగా దక్కిందని ఈర్ష్యతో కుములుతున్న సత్యభామ అంటున్న మాట ఇది.

**వివరణ :** భార్యాభర్తలు బ్రతికి ఉన్నంతకాలం పరమానురాగంతో ఒకేవిధంగా ఉండాలి. పూసలలో దారంలాగా పతి సతిమదిలో మెలగాలి. అటువంటి గొప్ప అదృష్టం ఆడదానికి వెనుకటి జన్మలలో చేసిన నోముల ఫలంగా దక్కాలి. ఆ అనురాగం ఇప్పుడు తరిగిపోయిందంటే నేను అట్టి గొప్ప నోములు చేయలేదేమో ! - అని నిర్వేదంతో మాటాడుతున్నది సత్య.

4. నీ చందము వింత యయ్యెడున్

**పరిచయం :** నందితిమ్మన రచించిన పారిజాతాపహరణ కావ్యంలోని ప్రథమశ్వాసంలోనిది ఈ వాక్యం.

**సందర్భం :** పారిజాతాన్ని తప్పని పరిస్థితులలో రుక్మిణికి ఇచ్చి సత్యభామ స్వభావం తెలిసినవాడు కనుక కృష్ణుడు ఆందోళనతో ఆమె ఇంటికి వచ్చి ఆమె దుఃఖాన్ని పరిశీలించి, మెల్లగా ఆమెను అనునయించే ప్రయత్నంలో పలికిన వాక్యం.

**వివరణ :** చంద్రముఖీ ! ఆభరణాలు ధరించని కారణం ఏల ? ఎప్పుడూ సన్నని కావిరంగు చీరలు తప్ప కట్టవు. తెల్లచీర కట్టుకోవటం ఎందుకు ? తాంబూలరాగం నీ చక్కని పెదవులను అలంకరించ లేదేమి ? ఈ నీ తీరు నాకు చాలా వింతగా కనబడుతున్నది. నిజమేమిటో నాకు చెప్పు - అని కృష్ణుడు అన్నాడు.

**5. పేరలుకం జెందిన యట్టి కాంత లుచిత వ్యాపారముల్ నేర్తురే**

**పరిచయం :** ఈ వాక్యం శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానకవి నంది తిమ్మన రచించిన పారిజాతాపహరణం ప్రథమశ్వాసం లోనిది.

**సందర్భం :** శ్రీ కృష్ణుడు తన ప్రియురాలి కోపం పోగొట్టటానికి చేసిన ప్రయత్నాలన్నీ చేసి చివరికి తన తలను ఆమె పాదాలకు తాకించి మ్రొక్కాడు. ఆమె దానిని కూడా లెక్కపెట్టక ఆ తలను ఎడమ పాదంతో తొలగద్రోసింది. ఆ విషయాన్ని సమర్థిస్తూ కవి అన్న మాట ఇది.

**వివరణ :** కృష్ణుడు తన మౌళిని ఆమె పాదాలకు తాకించి మ్రొక్కాడు. ఆ శిరస్సు సాధారణమైనది కాదు. బ్రహ్మ ఇంద్రుడు, దిక్పాలకులు మొదలైన వారంతా మహా గౌరవంతో పూజించే శ్రీ కృష్ణపరమాత్మ తల. అంతేకాదు ఆయన సర్వజీవులలో ామాన్ని ఉద్రేకింపజేసే మన్మథుని తండ్రి. అట్టివాని తలను ఆమె ఎడమ కాలితో త్రోసివేసింది. ఇది సహజమే, అతి తీవ్రమైన కోపం గల కాంతలు ఆ కోపావేశంలో ఇది తగునా, తగదా అని విచారం చేయలేరు- అని కవి సత్యా చేష్టను సమర్థిస్తున్నాడు.

**6. ఎఱుంగునే పసుల కాపరి భావజ మర్మ కర్మముల్.**

**పరిచయం :** పారిజాతాపహరణం అనే ప్రబంధంలోని ప్రథమాశ్వాసం నుండి ఈ వాక్యాన్ని గ్రహించారు. రచయిత నంది తిమ్మన.

**సందర్భం :** కృష్ణుడు అనునయిస్తూ ఆమె కొంగు పట్టుకున్నాడు. పాదాలకు ప్రణామం చేశాడు. ఆమె తొలగద్రోచింది. అయినా కోపించక ఆమెను మెత్తని మాటలతో ప్రసన్నను చేసుకోవటానికి ప్రయత్నించాడు. ఆ సందర్భంలో సత్యభామ అన్న వాక్యం.

**వివరణ :** కృష్ణా ! నీవన్నీ ఇచ్చకాలు. నీవు చాలా తెలివితో నన్ను వంచిస్తున్నావు. నేను నీ నాటకాలన్నీ నిజమే అని నమ్ముకొని ఉన్నాను. అవన్నీ బూటకాలని ఇప్పుడు తెలిసింది. నన్నింకా అల్లరిపెడితే నీమీద ఒట్టు. అందరూ నన్ను చూచి చులకనగా నవ్వుతున్నారు. నీవు మాత్రం వారిని చూడటం లేదు. అయినా గొడ్లను కాచుకుంటూ మోటుగా తిరిగేవానికి మన్మథుని మర్మకార్యాలను గురించి ఏమి తెలుస్తుంది. దానికి ఎంతో సంస్కారం కావాలి. అది నీకు లేదు - అని కోపావేశంతో సత్యభామ పలికింది.

**7. మానరహితమైన బ్రదుకు మానినికేలా ?**

**పరిచయం :** ఇది నంది తిమ్మన ప్రబంధం పారిజాతాపహరణంలోని ప్రథమాశ్వాసం నుండి గ్రహించిన వాక్యం.

**సందర్భం :** కృష్ణుడు కోపోద్దీపితయైన సత్యభామను అనునయిస్తూ ఉండగా ఇంకా ఉడికిపోతున్న సత్య అతనితో అంటున్న మాట.

**వివరణ :** అభిమానం గల అతివకు మానమే భూషణం. అది ప్రాణం కంటె మిన్న. ఎన్ని సమ్మానాలు చేసినా మానం పోతే అన్నీ పోయినట్లే. ఎందుకంటే సమ్మానాలకు మానమే మూలం. అది పోయినప్పుడు బ్రదుకు ఉన్నా ఒకటే పోయినా ఒకటే అని సత్య పలికింది.

8. **"సేవ సేయంగఁ బోవంగ సిగ్గుగాదె"**

**పరిచయం :** పారిజాతాపహరణం ప్రథమాశ్వాసం నుండి గ్రహించినది ఈ వాక్యం. రచయిత నంది తిమ్మన.

**సందర్భం :** సత్యభామ తన అత్తగారు తనను మన్నించే తీరును స్మరించి దుఃఖపడుతున్న సన్నివేశం లోనిది ఈ వాక్యం.

**వివరణ :** దేవకీదేవి, మీ తల్లి, మా అత్తగారు చాలా దొడ్డ ఇల్లాలు. ఆమె తన కోడండ్రందరిలో నాకు పెద్దపీట వేసి మన్నించేది. అదంతా నీవు మునుపు నాకు ఇచ్చిన చనువువలన కలిగిన సౌభాగ్యం. ఇప్పుడది దారితప్పింది. ఈ దశలో నేను వెనుకటి విధంగా ఆ గొప్ప యిల్లాలి సేవ చేయటానికి వెళ్ళటం సిగ్గుగదా ! - అని సత్యభామ అంటున్నది.

**సూచన :** ఈ పై వివరణలను ఆధారంగా చేసుకొని విద్యార్థులు ఈ క్రింది వాక్యాలకు వ్యాఖ్యలు వ్రాయటం అభ్యసించాలి.

1. మెచ్చవలదా మురదానవ భేది కృత్యముల్
2. ఇంక నెట్టివి కనుంగొన నెమ్మొయి నున్న దాననో
3. మఱచెనో కాక రుక్మిణీ మాయఁదగిలి
4. గతి కుల కాంతలకు వేఱుగలదే చెపుమా
5. మదహస్తి హస్తగత పద్మినియింబలె సొంపుపెంపఱన్
6. క్రోధరసమున్ వడఁబెట్టుచు నున్నకైవడిన్

## 7. ప్రశ్నలు - సమాధానాలు

**ప్ర. 1. సత్యభామ హృదయా వేదనను వివరించండి.**

దేవలోకం నుండి నారదుడు ఒక అపురూపమైన పూవును, పారిజాతాన్ని తెచ్చి కృష్ణునికి కానుకగా ఇచ్చాడు. దాని గొప్పతనాన్ని వివరించాడు. ఆ సమయంలో కృష్ణుడు రుక్మిణి యింటిలో ఉన్నాడు. వెంటనే ఆ పుష్పాన్ని ఆమెకు అందించాడు. నారదుడు రుక్మిణిని కొనియాడి సత్యభామను గూర్చి కొన్ని తేలిక మాటలు పలికాడు. ఇదంతా ప్రత్యక్షంగా చూచిన సత్యభామ పరిచారిక పూసగ్రుచ్చినట్లు దానిని సత్యభామ చెవిలో ఊదింది. దానితో సత్యభామకు పట్టరాని కోపమూ, దుఃఖమూ కలిగాయి. తన హృదయంలోని ఆరాటాన్ని ఆమె ఈ విధంగా వెళ్ళ గ్రక్కింది.

ఏమిటేమిటి ? ఆ కయ్యాలమారి ముని అక్కడ ఇలా అన్నాడా ? ఆ మాటలన్నింటినీ కృష్ణుడు - ఆ గొల్లభామల వల్లభుడు - చెవియొగ్గి విన్నాడా ? ఆ కులుకులాడి రుక్మిణి ఏమన్నది ? చెలీ ! నీవు దాపరికం లేకుండా అన్నీ చెప్పు. ఆ పువ్వు చాలా గొప్పదని నారదుడు అంటే అననీ. కృష్ణునకు ఇచ్చకంతో ఇస్తే ఇవ్వనీ. ఆయనగారు తనకు అనురాగం ఉన్నచోట దానిని సమర్పించనీ మధ్యలో ఆ మాయమౌని మమ్మల్ని గురించి మాటాడటం ఎందుకు ? ఆ ముని స్వభావమే అంత. ముళ్ళమాటలు, కయ్యాలే కళ్యాణాలు అయి లోకాల మీదబడి తిరిగే ఆయనకు అది సహజమే. కానీ అయ్యా ! నా సత్యను గురించి మీరలా మాటాడవద్దు అని వారించవద్దా ! ముని యేమిచేస్తాడు ? రుక్మిణి ఏమిచేస్తుంది ? ఈ దుడుకు గోపాలుడు చేసిన చేష్టను స్మరిస్తే మనసు మండిపోతున్నది. మగవాండ్లందరు ఇంతే. పైగా ఆడవారిని నమ్మరాదంటారు. శరత్కాలంలో మేఘంవలె చపలమైన చిత్తం గలవారు పురుషులు. వారిని నమ్మరాదు.

ఇంత ఘోరమైన అవమానం జరిగిన తరువాత చనిపోతే మంచిదనిపిస్తున్నది. కానీ ప్రాణాలు పోవే ! ఇన్నాళ్లు నన్ను నా సవతులు గౌరవంగా మన్నించారు. అదంతా ఇప్పుడు పాడైపోయింది. నా యెదుటనే వారు తలలెత్తుకొని తిరుగుతూ సన్నసన్నగా ఏమేమో పలుకుతుంటే సహించటం ఎలా ?

ఆయనకు నామీద నిజమైన ప్రేమలేదు. నాటకాలు చేశారు. రుక్మిణి మీదనే ఆయనకు గౌరవం, కృప, ప్రేమ. ఆహాహా! ఆయన చేష్టలను తప్పక మెచ్చుకోవాలిగదా ! ఓ చెలీ ! నారదుడొకపూవు తెచ్చి శౌరికిచ్చాడట ! అతడు దానిని ఆ త్రిప్పుకళ్ళదానికి దోచి పెట్టాడట. ఈ మాటలు వినికూడా నా ప్రాణాలు పోకుండా ఉన్నాయి. ఆలోచిస్తే జరిగినదానిలో పెద్ద అపచారం లేదనిపిస్తున్నది. కానీ అనవసరంగా నా పరువు, ప్రతిష్టలు పాడైనాయని వేదన కలుగుతుంది. నా సవతులు ఇకపై నన్ను మునుపటిలాగా మన్నిస్తారా? అని భయం కలుగుతున్నది. భార్యాభర్తలు కలకాలం పూసలలో దారంలాగా మెలగాలి. దానికి వెనుక జన్మలలో నోచిన నోములు కారణంగా ఉంటాయి.

ఇన్నాళ్లూ నేననుభవించిన ఈ భోగాలన్నీ ఇకపై ఎవరి పాలౌతాయో ! నాతో హాయిగా ఆ నల్లనివాడనుభవించిన **సుఖాలన్నింటిని** ఒక్కపెట్టున ఆ రుక్మిణి మాయలోబడి మరచిపోయాడు.

స్త్రీకి పతియే చుట్టం. పతియేదైవం. పతియే అన్నీ. అట్టి పతియే హద్దు మీరితే కులకాంతలకు గతియేది? ధనం ఇచ్చి పుచ్చుకుంటే సహించవచ్చు. మగడు వేరుకాంతలకు చనవిచ్చి పుచ్చుకుంటే బ్రదుకగలమా?

ఈ విధంగా సత్యభామ ఈర్ష్యతో, దుఃఖంతో కుమిలిపోతూ పరిపరి విధాల భావనలను చెలిముందు వెళ్ళబోసుకున్నది. మాసిన చీర కట్టుకొని మాటా మంతీ లేక చీకటి కొంపలో మంచం మీదపడి దొరలసాగింది. ఆమె మనస్సులో దేహంలో శోకకోప చిహ్నాలు చాల కనబడసాగాయి. కళ్ళుమూయటం, తెరవటం, పిచ్చిపిచ్చిగా నవ్వటం, పాన్పుమీద పడి దొరలటం మొదలైన వికారాలతో ఏనుగు తొండానికి అందిన పద్మలతలాగా అవస్థలు పడింది.

**ప్ర. 2. సత్యభామ కృష్ణుని అధిక్షేపించిన తీరును, కృష్ణుడు అనునయించిన విధాన్ని విశదీకరించండి.**

కృష్ణుడు ఏదో కీడు మూడుతున్నదని అనుమానించాడు. మాని మర్యాదల కోసం ప్రద్యుమ్నుని ఏర్పాటుచేసి హుటాహుటిగా సత్యభామ మందిరానికి చేరుకున్నాడు. ఆమె కోప తీవ్రతను, దుఃఖసాంద్రతనూ గుర్తించాడు. చెలి చేతిలో నున్న తాల వృంతాన్ని తాను గ్రహించి విసరటం ప్రారంభించాడు. అప్పుడప్పుడే తాను స్పృశించిన పారిజాతపు వాసనలు గుప్పుమని గుభాళింపగా, సత్య ఒక్కసారి పైకిలేచి, దిక్కులన్నీ కలయజూచి కృష్ణుణ్ణి గమనించింది. తలవాల్చి మళ్ళీ ముసుగులో దూరిపోయింది.

కృష్ణుడు మెల్లగా ఆమెను అనునయిస్తూ ఎన్నో మాటలు పలికాడు. ఆభరణాలను ఎందుకు పెట్టుకోలేదు. తాంబూల చర్వణం ఏల చేయలేదు? నీ తీరు వేరుగా ఉన్నది. కారణం చెప్పు అని బ్రతిమాలాడు. నామనస్సును పరీక్షించే మార్గమా ఇది, నిజంగా నావలన ఏదైనా అపచారం జరిగిందా? నీవు దయతో కడకంటితోనైనా చూడకపోతే నేను నిలువలేనన్నాడు. తక్కిన తరుణులయందు నేను చూపే అనురాగమంతా ఇచ్చకమే కానీ నిజమైన ప్రేమాదరాలు నీయందే అని ప్రకటించాడు. ధైర్యం నిలుపుకోలేక చివరకు చీర చెరగు పట్టుకున్నాడు. ఆమె చేతి విరిదమ్మిని విసరటానికి ఉంకించి జంకించింది.

ఇక మరొకదారిలేదని తన కిరీటరత్నాల కాంతులు ఆమె సుకుమార పాదాలకు వింతకాంతిని కలిగిస్తూ ఉండగా మ్రొక్కాడు. అప్పటికీ ఆమె కోపం చల్లారక ఆ దివ్యమైన, బ్రహ్మాదులకు పూజ్యమైన తలను ఎడమకాలితో ఆవలకు త్రోసి వేసింది.

అయినా జగన్నాటక సూత్రధారికి కోపం రాలేదు. నా గగుర్పాటు ఒడలు తాకి నీ పాదాలకు నొప్పి పుట్టిందేమో అని మెత్తగా పలికాడు. సత్యభామ కోపశోకాలతో కుతకుతలాడిపోతూ పైకి లేచి యిలా పలికింది.

ఎందుకయ్యా ! ఈ వంచన చేష్టలు, ఆ మెత్తని మాటలు ? నిన్ను సమ్మినదానికి ఫలం వెంటనే కలిగింది. నన్నింకా అల్లరిపెట్టకు నీమాద ఒట్టు సుమా ! అందరూ నన్ను చూచి వెక్కిరిస్తున్నారు. అది నీకు కనబడటం లేదా ? అయినా గొల్లవానికి మన్మథుని మర్మాలు తెలుస్తాయా ! ఇంకా నిన్ను నమ్ముతానా ? ఊరకే నన్నెందుకు విసిగిస్తావు ? ఈ పనికిమాలిన కల్లలు మాకు రుచింపవు. అవన్నీ ఆ రుక్మిణికి చెల్లుతాయి. నిజానికి నీవు పుట్టగా వంచనలు, నేర్పులు, కపటచేష్టలు పుట్టాయి. ఆ మాయలన్నీ నీకు వెన్నతో పెట్టిన విద్యలు. తెలిసి తెలిసి నేను నిన్ను నమ్మి నా గుట్టురట్టు చేసుకున్నాను. ఆ ముని ఇచ్చిన పూవు వాసన నాకు ప్రకటించి నన్ను వెక్కిరించటానికే కదా నీ విక్కడకు వచ్చావు !.

మహానుభావా ! మానమే మానినికి ప్రాణం. అదే భూషణం అది ఉంటే అన్ని సమ్మానాలు జరిగినట్లే, ఇప్పుడు నామానం మంట గలిసింది. ఇంక నాకు బ్రతుకెందుకు. మా అత్తగారు దేవకీదేవి కోడండ్రందరిలో నన్ను గొప్పగా చూచేది. ఇప్పుడు ఆమెను సేవించడానికి పోవాలంటే సిగ్గుగా ఉన్నది.

అని ఈ విధంగా సత్యభామ తన అక్కసునంతా కృష్ణుని ముందు కక్కింది. పైటకొంగు ముఖంమీద కప్పుకొని తీవ్రంగా ఏడ్చింది.

అది చూచి కృష్ణుడు నొచ్చుకొని ప్రియురాలా! ఒక పూవుకోసం నీవింతగా దుఃఖించాలా? దేవలోకానికి వెళ్లి దేవేంద్రుని ఉద్యానవనంలో ప్రవేశించి పారిజాత వృక్షాన్నే పెకలించి తెచ్చి నీ పెరటిలో నాటుతాను - అన్నాడు. దానితో ఆమె కోపం శాంతించింది.

**ప్ర. 3. నంది తిమ్మన కవితా విశేషాలు :**

తెలుగులో తిమ్మనకు ఒక ప్రత్యేకస్థానం ఉన్నది. "ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు" అనే మాట లోకంలో ప్రసిద్ధి కెక్కింది. అతని కవిత్వంలోని విశేషాలను ఇక్కడ సమీక్షించుకుందాం.

1. పారిజాతాపహరణ కావ్యంలో నంది తిమ్మన ప్రసన్న గంభీరమైన శైలిని ప్రయోగించాడు. ప్రసన్నత అంటే చదివిన వెంటనే భావం ప్రస్ఫుటంగా తెలియటం. గంభీరత అంటే ఆలోచించిన కొలదీ రమణీయార్థాలు స్ఫురించటం. ఒక ఉదాహరణ చూద్దాం.

"నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్క బూని తా
చిన యిది నాకు మన్ననయ"

అనే యీ కృష్ణుని మాటల భావన సుఖంగానే పాఠకునకు తెలుస్తున్నది. మారుమూల పదాలు ఇందులో ఏమీ లేవు. పద్యాన్వయంలో క్లేశం ఏ మాత్రమూ లేదు. దీనినే ప్రసన్నత అంటారు. కాగా ఇందులో భావించిన కొలదీ అనేక విశేషార్థాలు స్ఫురిస్తాయి. భవదీయ దాసుని అనటంలో నేను నీ అనుగ్రహం లేకపోతే బికారినవుతాను - అనే అర్థం స్ఫురిస్తుంది. 'నెయ్యపుకిన్క' అనటంవలన నీ కోపం నిజమైనది కాదు. తెచ్చి పెట్టుకొన్నదే సుమా ! అందువలన నేను నిరాశతో తిరిగి పోవలసిన అవసరం లేదు - అనే అర్థం తోస్తుంది. ఆమె తొలగఁద్రోసింది. ఇతడు దానిని 'తాచినయిది' అని తన్నుగా చెప్పుకున్నాడు. ఇది ఆమె అనురాగాన్ని తొందరగా పొందటంలో ఉపకరించే మాటనైఖరి. ఇలా ఎన్నో రమణీయార్థాలు కూర్పులో పాఠకునకు తోచటమే రచనలోని గాంభీర్యం.

2. పదాలను అభిప్రాయ గర్భితంగా వాడటం ఇతని కవిత్వంలో సాధారణంగా కనిపిస్తుంది.

i. "ఆ చపలాక్షి కిచ్చెనట యాతడు నవ్విరిన్" అన్నచోట 'చపలాక్షి' - త్రిప్పుకన్నులది - అనేమాట సత్యభామ హృదయంలో ఉన్న ఈర్ష్యను చక్కగా అభివ్యక్తం చేస్తుంది.

ii. హరిచందనకోటరమునకు నాగతరుణియుఁబోలెన్ - అన్న చోట 'తరుణి' అనే శబ్దం మంచి వయస్సులో చాలా బింకంగా ఉన్న త్రాచుపాము తీరుతెన్నులు సత్యభామలో ఎలా ఉన్నాయో తెలుపుతుంది.

iii. ఇటువంటివే అరాళకుంతలా ! వామలోచన ! ఓలలితేంద్ర నీలశకలోపమ కైశిక ! మున్నగు సంబోధనలు.

3. ఆయా వ్యక్తుల స్వభావాల కనుగుణమైన పదాల కూర్పును నిబంధించటంలో తిమ్మనకు మంచి ప్రజ్ఞ ఉంది. ముఖ్యంగా స్త్రీ స్వభావ చిత్రణలో అతనిది ఒక ప్రత్యేక ప్రజ్ఞ.

చేవిరిదమ్మిని వ్రేయుటకు ఉంకించటం, జంకెన నెఱిచూపు చూడటం, తానునుభవించిన భోగాలు ఇటుపై ఎవరి పాలౌతాయో అని వానిని నెమరు వేసుకోవటం మొదలైనవి దీనికి నిదర్శనాలు.

4. పాత్రలను సజీవంగా పాఠకుని కన్నులముందు సాక్షాత్కరింప జేయటం ఉత్తమకవుల లక్షణం. తిమ్మనలో అది పుష్కలంగా ఉంది.

"తలవాంచి మగుడ ముసుగిడెఁ
గొలకుల డిగజాఱి జాలుకొను బాష్పంబుల్
పలుచని చెక్కుల లవలీ
దళ పతిత మరంద బిందుతతి బురుడింపన్"

ఈ పద్యాన్ని చదువుతున్న సమకాలంలో పాఠకుడు తన పరిసరాలను మరచిపోయి దేశకాల పరిధులను దాటి సాక్షాత్తు సత్యభామ దగ్గర నిలుచుండి చూస్తున్న అనుభూతిని పొందుతాడు.

5. సమయోచితంగా స్వభావోక్తులను నిబంధించటం కావ్యానికి చక్కని సౌందర్యాన్ని కూరుస్తుంది.

"మాసిన చీర గట్టుకొని మౌనము తోడ నిరస్తభూషయై
వాసెన కట్టు గట్టి" వంటి పద్యాలలో ఈ సౌందర్యాన్ని మనం నిండుగా చూడవచ్చు.

ఇట్టి అనేక విధములైన విశిష్ట గుణాలతో తిమ్మన కావ్యం తెలుగు పాఠకుల హృదయాలను చక్కగా అలరిస్తున్నది.

## ఛందస్సు

**1. ఉత్పలమాల :** ఈ వృత్తమునందు భ,ర,న,భ,భ,ర,వ అను గణములు వరుసగా నుండును. యతి 10 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా : | U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| | స్రుక్కక | యున్నెనీ | మహిమ | సూచిన | బోటులు | విన్నవిం | చినన్ |
| | భ | ర | న | భ | భ | ర | వ |

'సు - సూ' లకు యతి.

**2. చంపకమాల :** ఈ వృత్తమునందు ప్రతిపాదమున న,జ,భ,జ,జ,జ,ర అను గుణములు వరుసగా నుండును. యతి 11 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
| ఉదా : | నుతక | రివేలు | పుండప | సిమమ్ముం | దలంప | గసేల | యచ్చటన్ |
| | న | జ | భ | జ | జ | జ | ర |

'మ - మ' లకు యతి.

**3. శార్దూలము :** ఈ వృత్తమునందు ప్రతిపాదమున మ,స,జ,స,త,త,గ అను గణములుండును. యతి 13 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| ఉదా : | ఏమేమీ | కలహ్ | శనుండ | చటక్షై | యేతెంచి | యిట్లాడె | నా |
| | మ | స | జ | స | త | త | గ |

'ఏ - యే' లకు యతి

**4. మత్తేభము :** ఈ వృత్తమునందు స,భ,ర,న,మ,య,వ అను గణములు ప్రతిపాదమునందును వరుసగానుండును. యతి 14 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | IIU | UII | UIU | III | UUU | IUU | IU |
| ఉదా : | జలజా | తాసన | వాసవా | దిసుర | పూజాభా | జనంబై | తన, ర్చు |
| | స | భ | ర | న | మ | య | వ |

'జ - జా' లకు యతి

**5. ఆటవెలది :** ఇందు నాలుగు పాదములలో 1-3 పాదాలలో 3 సూర్యగణములు, తరువాత రెండు ఇంద్రగణములు వరుసగా నుండును. 2-4 పాదాలలో ఐదు సూర్యగణములు ఉండును. ప్రతిపాదమున నాల్గవ గణాద్యక్షరము యతిస్థానము. ప్రాసనియమము లేదు. ప్రాసయతి వేయవచ్చును.

ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభము, ఆటవెలది, తేటగీతి, కందము, సీసము - ఇవి మాత్రమే సిలబస్‌లో నిర్దేశించిన ఛందో భేదాలు.

ఆట వెలది 'సత్యభామాసాంత్వన' పాఠ్యభాగంలో ప్రయోగింపబడలేదు.

**6. తేటగీతి :** ఇందు నాల్గు పాదములుండును వరుసగా 1 సూర్యగణము, 2 ఇంద్రగణాలు, 2 సూర్య గణాలు ఉంటాయి. 1-4 గణాల మొదటి అక్షరాలకు యతి చెల్లుతుంది. ప్రాసనియమం లేదు. ప్రాసయతి వేయవచ్చు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | UI | UII | UII | UI | UI |
| ఉదా : | విన్న | వించిన | వారును | జిన్న | వోయి |
| | గల | భ | భ | గల | గల |
| | (హ) | | | (హ) | (హ) |

'వి - జి' లకు యతి

విన్న - జిన్న - ప్రాసయతి

7. **కందము :** గగ, భ,జ,స,నల అను 5 గణములతో కంద పద్యమేర్పడును. 1 - 3 పాదములందు 3 గణములు, 2 - 4 పాదములందు 5 గణములు ఉండును. 1-3 పాదములను పూర్వార్థమనియు, 2-4 పాదములను ఉత్తరార్థమనియు అందురు. అనగా పూర్వార్థమున 8 గణములు, ఉత్తరార్థమున 8 గణములు ఉండును. బేసి గణములలో (1,3,5,7) జగణము ఉండరాదు. 6 వ గణముగా జగణము కాని, నలము కాని తప్పక ఉండవలెను. పూర్వార్థము చివర, ఉత్తరార్థము చివర తప్పక గురువు ఉండవలెను. 2-4 పాదములందు నాల్గవ గణాద్యక్షరమునకు యతి. ప్రాసనియమము కలదు.

| | | | |
|---|---|---|---|
| | U I I | I U I | U I I |
| ఉదా: | [illegible] | [illegible] | మానని |
| | [illegible] | [illegible] | భ |

| | | | | |
|---|---|---|---|---|
| U U | U I I | I U I | U I I | U U |
| మాన | క్రోధము | లచేఁగు | మారిలి | చింతా |
| గగ | భ | జ | భ | గగ |

'మా - మా' లకు యతి

8. **సీసము :** సీసపద్యములోనాలుగు పెద్దపాదాలు ఉండి తరువాత ఆటవెలది కాని, తేటగీతి కాని ఉంటుంది.

సీసములోని పెద్ద పాదములలో వరుసగా ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలు ఉంటాయి. పాదానికి మొత్తం 8 గణాలు. 1-3-5-7 గణాల మొదటి అక్షరాలకు యతి చెల్లుతుంది. ప్రాసనియమము లేదు. ప్రాసయతి వేయవచ్చు.

సీస పద్యపాదాలను రెండుగా విభజిస్తే మొదటిభాగంలో 4 ఇంద్రగణాలు, రెండవభాగంలో 2 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు వరుసగా ఉంటాయి.

| | | | | |
|---|---|---|---|---|
| | I I I U | I I U I | I I I U | I I U I |
| ఉదా : | కనక పం | జరశారి | కలకుఁ జ | క్కెరవెట్టి |
| | నగ | సల | నగ | సల |
| | I I U I | U I U | I I I | I I I |
| | చదివింప | రేలకో | సకియ | లిపుడు |
| | సల | ర | న | న |

మొదటి భాగంలో 'క - క' లకు యతి

రెండవ భాగంలో 'చ - స' లకు యతి

### అలంకారాలు

**అర్థాలంకారాలు :** ఉపమ, రూపకము, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, అర్థాంతరన్యాసము, స్వభావోక్తి, శ్లేష, దృష్టాంతము - ఇవి మాత్రమే సిలబస్ నిర్దేశించిన అలంకారాలు.

1. **ఉపమాలంకారము :** ఉపమానోపమేయములకు మనోహరమైన సాదృశ్యము (పోలిక) వర్ణింప బడినచో ఉపమాలంకారమగును.

ఉదా : అని వగవ మిగులఁ బొగులుచు
జనితా మర్షమునఁ గోప సదనంబునకున్
జనియెను లతాంగి హరిచం
దన కోటరమునకు నాగ తరుణియుఁ బోలెన్.

అధికమైన కోపము చేత పసుపు వర్ణముగల చందన వృక్షము యొక్క తొఱ్ఱయందు ప్రవేశించు ఆడుపాము వలె, సత్యభామ కోపగృహమునందు ప్రవేశించెననుటచే ఈ పద్యమున ఉపమాలంకారము కలదు.

ఉపమేయము - సత్యభామ - కోపగృహము
ఉపమానము - ఆడుపాము - చందనపు చెట్టు తొఱ్ఱ
ఉపమావాచకము - పోలెన్
సమానధర్మము - చనియెను.

2. **రూపకాలంకారము :** ఉపమానమునకు, ఉపమేయమునకు అభేదము చెప్పుటను రూపకాలంకారము అందురు.

ఉదా : అని పలుకు నంబుద శ్యా
ముని గర్జిత మధుర వాక్యములు సత్యామా
నిని నీపలతికవోలెం
గనుపట్టె సఖీ మయూరికలు సెలరేగన్.

ఈ పద్యములో చివరి పాదమున రూపకాలంకారము ఉన్నది. చెలికత్తెలకు, నెమళ్ళకు, అభేదము చెప్పబడినది కావున ఇది రూపకము.
ఉపమానము - మయూరికలు ; ఉపమేయము - సఖులు

3. **ఉత్ప్రేక్షాలంకారము :** ఉపమాన ధర్మములు ఉపమేయమునందు ఉండుటను బట్టి, ఉపమేయమును ఉపమానముగా ఊహించుట ఉత్ప్రేక్షాలంకారమగును.

ఉదా : అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె నేయివోయభ
గ్గన దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి హె
చ్చిన కనుదోయి కెంపు తన చెక్కుల కుంకుమ పత్రభంగసం
జనిత నవీన కాంతి వెదచల్లగ గద్గద ఖిన్నకంఠియై.

నేయిపోయగా భగ్గున మండినట్టి భయంకరమైన అగ్నిజ్వాలయేమో అనునట్లుగా సత్యభామ లేచినదని భావము. చెలికత్తె మాటలు విని కోపంతో పైకి లేచిన సత్యభామ అను ఉపమేయమును, దెబ్బతిన్న నాగాంగనగా, నెయ్యిపోయగా భగ్గుమన్న అగ్ని జ్వాలగా ఊహించినందున ఇది 'ఉత్ప్రేక్షాలంకార'మగుచున్నది.

ఉదా : "రాజబింబాస్య రుక్మిణి తేజరిల్లె
సానఁబట్టిన మకరాంకు శస్త్రమనగ"
ఈ పద్యమందును ఉత్ప్రేక్షాలంకారము కలదు.

చంద్రబింబము వంటి ముఖము కల రుక్మిణిని, సానబట్టిన మన్మథ బాణముగా ఊహించుట చేత ఇది ఉత్ప్రేక్షాలంకార మగుచున్నది.

ఉపమానము : సానబట్టిన మకరాంకు శస్త్రము

ఉపమేయము : రాజబింబాస్య రుక్మిణి.

**4. అతిశయోక్తి :** ఒక వస్తువును గురించి కాని, సందర్భాన్ని గురించి కాని ఉన్నదాని కంటె ఎక్కువ చేసి చెప్పుటను అతిశయోక్తి అలంకారమందురు. సంబంధము లేకున్నను సంబంధమున్నట్లుగా చెప్పుట అతిశయోక్తియగును.

ఉదా : "చెల్వగు నీ పద పల్లవంబు మత్తను పులకాగ్ర
కంటక వితానము సోకిన నొచ్చునంచు"

ఇచట పులకాంకురముల తాకిడికి దేహము (పాదము) నొప్పిచెందుట ఎక్కడను ఉండదు. సంబంధము లేనిచోట సంబంధము ఉన్నట్లుగా వర్ణించుటచే ఈ సందర్భమున అతిశయోక్తి సిద్ధించుచున్నది.

**5. స్వభావోక్తి :** వస్తువు యొక్క జాతి, గుణాదుల యందున్న స్వభావమును సహృదయ హృదయంగమముగా వర్ణించినచో స్వభావోక్తి అలంకారమగును.

ఉదా : మాసిన చీరగట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై
వాసెన కట్టుగట్టి, నిడువాలిక కస్తురి పట్టువెట్టి, లో
గాసిలి, చీఁకటింటి కడకంటిపై జలదాంత చంద్రరే
ఖా సదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాద వేదనన్.

ఇందులో మాసిన చీర దాల్చుట, ఆభరణములు విడనాడుట, వాసెన కట్టుగట్టుట మొదలైనవి స్వభావ రమణీయ చిత్రణలు కనుక స్వభావోక్తి అలంకారమిందులో కలదు.

**6. అర్థాంతరన్యాసము :** సామాన్యమును విశేషము చేతగాని, విశేషమును సామాన్యము చేతగాని సమర్థించుట అర్థాంతరన్యాసాలంకారమగును.

ఉదా: జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్న తండ్రి శిరమచ్చో వామపాదంబునన్
దొలగంద్రోచె లతాంగి యట్లయగు నాథుల్ నేరముల్ సేయఁబే
రలుకం జెందిన యట్టి కాంతలుచితవ్యాపారముల్ నేర్తురే.

ఈ పద్యమున సత్యభామ కోపముతో కృష్ణుని శిరస్సును వామపాదముతో తొలగద్రోయుట విశేషము. దానిని 'పేరలుకంజెందిన యట్టి కాంతలుచిత వ్యాపారముల్ నేర్తురే' అనే సాధారణాంశము చేత సమర్థించుటచేత ఇక్కడ అర్థాంతరన్యాసాలంకారము సిద్ధించుచున్నది. అనగా విశేషము సామాన్యముచేత సమర్థింపబడినది.

శ్లేష, దృష్టాంతము అను అలంకారములకు లక్ష్యములీ పాఠ్యభాగమున లేవు.

**7. శ్లేష:** నానార్థ సంశ్రయము శ్లేష. అనేకమైన అర్థాలుగల శబ్దాలను ఉపయోగించినచో శ్లేషాలంకారమగును.

ఉదా : రాజు కువలయానందకరుడు

ఇట రాజు శబ్దమునకు ప్రభువు, చంద్రుడు అనే రెండర్థాలు ఉన్నాయి. కువలయ శబ్దమునకు భూమి, కలువపూవు అనే రెండర్థాలు ఉన్నాయి.

అనగా పై వాక్యమునకు ప్రభువు భూమికి ఆనందము కలిగించునని ఒక అర్థము, చంద్రుడు కలువ పూలకు ఆనందము కలిగించునని మరియొక అర్థము ఉండుటచే ఇది శ్లేషాలంకారము.

8. **దృష్టాంతము :** ఉపమాన, ఉపమేయ వాక్యముల యొక్క వేరు వేరు ధర్మాలను బింబ ప్రతిబింబ భావముతో వర్ణించి చెప్పినచో దృష్టాంతాలంకారము అనబడును.

ఉదా : రాజా ! నీవే కీర్తిమంతుడవు. చంద్రుడే కాంతిమంతుడు.

ఇందు రాజు ఉపమేయము. చంద్రుడు ఉపమానము. ఉపమేయమైన రాజు యొక్క ధర్మము కీర్తి. ఉపమానమైన చంద్రుని యొక్క ధర్మము కాంతి. కీర్తి - కాంతి అనే భిన్న ధర్మాలకు దిక్కుల వరకు వ్యాపించడం సమానధర్మం. ఈ రెండూ బింబ ప్రతిబింబ భావంతో వర్ణించబడ్డాయి కాబట్టి ఇది దృష్టాంతాలంకారం.

## సారాంశం :

రుక్మిణి గృహంలో జరిగిన పారిజాత పుష్ప వృత్తాంతంతో కోపంతో భగ్గుమన్న సత్యభామ హృదయ పరితాపాన్ని, కృష్ణుడు ఆమెను అనునయించిన విధాన్ని తిమ్మన సత్యభామా సాంత్వన ఘట్టంలో పరమ రమణీయంగా వర్ణించాడు.

**ప్రశ్నలు :** 1. సత్యభామా సాంత్వనంలో కృష్ణుని పాత్ర చిత్రణ

2. కోపనయగు సత్యభామను కృష్ణుడు అనునయించిన తీరు ఎట్టిది ?

**- ఆచార్య శలాక రఘునాథశర్మ**
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపూర్.

ఖండం - 1

# ప్రాచీన పద్యభాగము

పాఠం : 3

## నిగమశర్మ అక్క

- తెనాలి రామకృష్ణుడు
పాండురంగ మాహాత్మ్యము
తృతీయాశ్వాసము 24-50 పద్యాలు

**శీర్షికలు :**

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు అర్థాలు
5. ప్రతిపదార్థ తాత్పర్యములు
6. సందర్భ సహిత వ్యాఖ్యలు
7. ప్రశ్నలు - సమాధానాలు
8. ఛందస్సు
9. అలంకారాలు

**లక్ష్యం :** దుర్వ్యసన లోలుడైన నిగమశర్మను సరియైన మార్గములో పెట్టుటకై, అతనిలో ఆత్మగౌరవమును పురికొల్పుటకై నిగమశర్మ అక్క ఓర్పుతో, నేర్పుతో చేసిన ప్రయత్నము ఈ పాఠములో మనకు కనబడుతుంది.

**1. కవి పరిచయం :** తెనాలి రామకృష్ణుడు ఒక విలక్షణమైన కవి. రామకృష్ణుడు 16 వ శతాబ్దివాడు. ఆయన కూడా తక్కిన తెలుగు కవులలో చాలామంది లాగ పురాణాలనుండి కథను స్వీకరించి ఒక మహాకావ్యం నిర్మించాడు. కానీ అతని పద్ధతి అతనిదే అన్నట్లు ఉంటుంది అతని రచన. అతని ప్రసిద్ధరచన 'పాండురంగ మహాత్మ్యం'. ఇది ఒక క్షేత్రమహాత్మ్యాన్ని అభివర్ణించే క్షేత్రం.

ఈ కథకు మూలం స్కాంధపురాణం అని అతడు ప్రకటించాడు. నిర్మాణంలో అతని ప్రతిభ మనకు అడుగడుగునా గోచరిస్తుంది.

'శారద నీ రూపము' అని కృతిపతి రామకృష్ణుని నుతించాడు. అట్టివాని రచనను అధ్యయనం చేయటం వలన శబ్దార్థజ్ఞానం, పల్లెపట్టు సంప్రదాయాలు, చక్కని పదబంధాల నిర్మాణ సామర్థ్యం, జాతీయాలు, సామెతలు మొదలైన వాని శక్తిని తెలుసుకోగలగటం మొదలైన ప్రయోజనాలు నెరవేరతాయి. ఉద్భటారాధ్య చరిత్రము, ఘటికాచల మాహాత్మ్యము రామకృష్ణుని ఇతర రచనలు.

తెనాలి రామకృష్ణుని మూడు కావ్యములలో ఆయన కీర్తికి నిధానమైనది పాండురంగ మహాత్మ్యము. ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న 'నిగమశర్మ అక్క' అను శీర్షికగల ఈ పాఠ్యభాగం 'పాండురంగ మాహాత్మ్యం' లోని తృతీయాశ్వాసమునందలి 24 వ వచనము నుండి 50 వ పద్యం వరకు గల భాగం.

## 2. పాఠ్యభాగ సందర్భం :

కళింగ దేశమునందలి పీఠికాపురములో సకల శాస్త్రములకు నెలవైన సభాపతియను బ్రాహ్మణ శ్రేష్ఠుడుండెను. ఆతనికి నిగమశర్మయను పుత్రుడు కలడు. వేదాధ్యయనము చేసినవాడైనను నిగమశర్మ మనసును కామమునందే లగ్నము కావించి విశృంఖలముగా విహరింపజొచ్చినాడు. వివిధములైన అలంకరణములను ధరించి, సుగంధ ద్రవ్యములను అలదుకొని, పుష్పమాలలు ధరించి, తాంబూలము సేవించుచు విలాసముగా తిరుగుచుండెడివాడు. నిగమశర్మ సంధ్యావందనాదులకు స్వస్తి పలికి, నిరంతరము వేశ్యాలోలుడై, ధనమంతయు మద్యపానమునకు, జూదమునకు దుర్వ్యయము చేసి గౌరవహీనుడై తిరుగుచుండెను. నీచవర్తనుడై తిరుగుచున్న సోదరుని శిక్షించి, వంశప్రతిష్ఠను కాపాడుటకై ఆ నిగమశర్మ అక్క పుట్టింటికి వచ్చు ఘట్టముతో మన పాఠ్యభాగ మారంభమగుచున్నది.

## 3. పాఠ్యభాగ సారాంశం :

నిగమశర్మ ఒక మంచి సంప్రదాయ ఆచారలక్షణాలు గల కుటుంబంలో పుట్టినవాడు అయినా నేతిబీరకాయలో నెయ్యిలాగా అతనిలో నిగమాలేమీ లేకపోగా దుర్గుణాలు కొల్లలుగా ఏర్పడ్డాయి. ముఖ్యంగా అందమైన గుణవతి అయిన అర్ధాంగి ఉన్నా వేశ్యలను మరగి ఆస్తిని మెల్ల మెల్లగా అమ్ముకుంటూ ఇల్లు గుల్ల చేస్తున్నాడు.

అతనికి ఒక అక్క ఉన్నది. ఆమెకు పెండ్లి అయింది. పిల్లలు ఉన్నారు. పుట్టిన ఊరికి అయిదారు ఆమడల దూరంలో అత్తగారింటిలో ఆమె మంచి గృహిణిగా మసలుకొంటున్నది. తమ్ముని నీతి మాలినతనం తెలిసి ఆమె వానిని చక్కదిద్దగలననే విశ్వాసంతో మగనితో, పిల్లలతో పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులకు ఆమె వలన కొంత ఊరట లభించింది.

ఒకనాడు తెగిపడిన చుక్కలా నిగమశర్మ యింటికి వచ్చాడు. అక్కను చూచి ఉలిక్కిపడ్డాడు. ఆమెకు చిక్కి తప్పించుకోలేక కొంచెం అవస్థపడ్డాడు. ఆమె మాటలనేర్పుతో అతనిని చిక్కబట్టుకొని నిలిపివేయగలిగింది. స్నానభోజనాలు చక్కగా చేయించింది. తానుకూడా భోజనాదులు ముగించి బుద్ధిగా కూర్చున్న తమ్ముణ్ణి బుద్ధిమంతుని చేయాలనే పట్టుదలతో బుద్ధులు చెప్పటం ప్రారంభించింది. కులమర్యాదను, వెలయాండ్రవలన కలిగే అనర్థాలను, గొప్ప కుటుంబంలో పుట్టినవాని కర్తవ్యాలను చక్కగా ఉపదేశించింది.

అతడు శ్రద్ధగా విన్నట్లే కనిపించాడు. బుద్ధిమంతుడైనట్లే అనిపించాడు. కొన్నాళ్ళు అక్క కనుసన్నలలో ఇంటి నిర్వహణ చేయటం, గ్రంథాలు చదవటం, బావగారిని పలకరించడం మొదలైనవి అందరికీ నమ్మకం కలిగేలా చేశాడు. చివరకు ఒక రోజున తల్లిదండ్రులవీ, అక్కబావలవీ, భార్యవీ నగలన్నీ మూటగట్టుకొని ఉడాయించాడు. అక్కతోపాటు అందరూ గొల్లుమని ఏడ్చారు.

ఇదీ స్థూలంగా ప్రస్తుత పాఠ్యభాగ సారాంశం.

## 4. కఠిన పదాలకు అర్థాలు :

**24. వచనం**

ఇట్లు పంచష యోజనమాత్ర దూరంబగు ............ నేత్ర సంజ్ఞయొసంగుటయు

**అర్థాలు** : పంచష యోజన మాత్ర దూరంబు = అయిదారు ఆమడల దూరంలో ఉన్నది.

పితృభవనంబు = తండ్రి యిల్లు

అడలు కడలిన్ = దుఃఖమనే సముద్రంలో

తీండ్ర = పట్టు

| | | |
|---|---|---|
| ఉదార, ముద్ + ఆరోపణ, కరణ + ఉపచారంబులన్ | = | గొప్పదియగు సంతోషాన్ని కలిగించటానికి సాధనాలైన సేవలచేత, |
| మందిర, ముకుంద + ఆరాధన + ఆది సంతర్పణంబులు | = | ఇంటిలోని విష్ణువును పూజించడం మొదలైన తృప్తి కలిగించే పనులు, |
| జనయిత్రీ, దర్శితము | = | తల్లి చేత చూపబడిన, |
| మూలవిత్తంబు | = | నికరంగా ఉండేధనం, |
| నష్ట + అవశిష్టము | = | పోగా మిగిలినది, |
| నలంకువలకున్ | = | కష్టాలకు |
| నిజభర్తృ, హస్త + అంతరంబునన్ | = | తన మగని చేతిమీదుగా |
| ఆశుశుక్షణి, శిథిలబంధ, యాచక, ప్రముఖ + ఉపద్రవంబుల వలనన్ | = | అగ్ని, కట్టిన(త్రాళ్ళు వదులుకావడం, అడుగుకొనే వారు మొదలైన ఇబ్బందులనుండి |
| విగళిత సన్నాహంబు | = | తొలగిన బాగుపడే ప్రయత్నంగల, |
| యథాపూర్వ మనోహరంబుగాన్ | = | వెనుకటివలె మనస్సునకు సంతోషం కలిగించే దానినిగా, |
| అనుసంధించి | = | ఏర్పరచి |
| నిజ + అనుజు, దుర్వ్యసనంబువలనన్ | = | తన తమ్ముని చెడు అలవాటుల వలన |
| గాసిన్ + పొందని | = | చెడిపోని |
| ఏకభోగ గ్రామంబులు | = | ఒక వ్యక్తికి అనుభవించదగిన ఊళ్ళు (అగ్రహారాలు) |
| తప్పిదారిన | = | పొరపాటున మిగిలిపోయిన |
| మడి, మ(ట. చేనుపట్లు | = | మడులు, పాదులు, చేలు మొదలైన తావులు. |
| గుట్టు + ఈక | = | రహస్యాన్ని వెలువరించక |
| అనివార్య జృంభణంబు | = | ఆపనలవికాని పెరుగుదల కల, |
| వనచంద్రికా వైభవంబును | = | అడవి గాచిన వెన్నెల గొప్పతనం, |
| అవకేశీ, పలాశి, దోహదంబు | = | గొడ్డువోయిన చెట్టుకు చేసే పూతపూయించే పని, |
| తెగచి | = | తెగించి |
| కడుపు చుమ్మలు చుట్టన్ | = | కడుపులో దుఃఖం పొంగిరాగా |
| పొట్టపొరలగుచుండునంతన్ | = | కష్టపడుచున్న సమయంలో |
| కొంచియున్ | = | వెనుకాడియును |
| కొదమ నెలవంకల వంకలు | = | విదియనాటి చంద్రుని రేఖలవలె వంపులుగలవి, |
| కుకవిపదబంధంబునున్, పోలెన్ | = | అధములైన కవులు కూర్చిన పదాల కూర్పులవలె. |
| అసకల ప్రవృత్తంబులు | = | కళలతో కూడని తీరులుగలవి, |

| | | |
|---|---|---|
| మద + ఉన్మత్త మత్తకాశినీ దత్తంబులు | = | మదంతో పిచ్చిగా ప్రవర్తించే ఆడువారి చేత ఈయబడినవి |
| నఖ + అంకంబులకతనన్ | = | గోటిగుర్తులు కారణంగా |
| సీమంతిని | = | పుణ్య స్త్రీ |
| ఋజుస్వాంత | = | సరిచేసికొన్న మనస్సు కలది. |
| దుర్విదగ్ధున్ | = | పాడుపనులలో పాండిత్యం కలవానిని |
| విదగ్ధ + ఆలాపంబులు | = | ప్రజ్ఞతో కూడిన మాటలు |
| హేతు, గర్భితంబు | = | హేతువు లోపల గూఢంగా ఉన్నట్టిది |
| తమకంబు గమకంబునన్ | = | కోరిక ప్రేరణ చేత |
| ఉంకించినన్ | = | పూనుకొనగా |
| సోఁకు + ఓర్వమి | = | సంసారం తగులును సహింపక పోవటం |
| తరంగిత, వినయ, సౌహార్ద, మార్దవ, మధురంబులు | = | అలలు అలలుగా ఏర్పడిన మంచినేర్పు, స్నేహము, మెత్తదనము, తీయదనము కలవి. |
| ఇందు, బింబము | = | చంద్రుని మండలము |
| తత్, కళత్రమునకు | = | వాని భార్యకు |
| నేత్రసంజ్ఞ | = | కంటి సన్న |

## 5. ప్రతిపదార్థ తాత్పర్యములు

ఇందులో ముఖ్యమైన పద్యములకు ప్రతిపదార్థ తాత్పర్యాలు, సులభమైన పద్యములకు అర్థతాత్పర్యములు ఇవ్వబడినవి.

**25. వ పద్యం**

అర్థాలు

| | | |
|---|---|---|
| పైఁదలి | = | ఇంతి |
| శీతలవారిన్ | = | చల్లని నీటితో |
| వ్యాప్పృత, నిజ, నిశ్వాస జతాపంబున్ | = | విస్తరించిన తన నిట్టూర్పుల వలన పుట్టిన వేడితో, |

**తాత్పర్యం :** ఆ వనిత తన నిట్టూర్పుల వలన పుట్టిన వేడికి కొంచెం వెచ్చబడిన చల్లని నీటితో తన భర్త పాదాలజంటను శుద్ధి చేసింది.

**26 వ పద్యం**

అర్థాలు

| | | |
|---|---|---|
| మెచ్చు | = | తృప్తి |
| బలువిందు | = | గొప్ప అతిధి |
| అగ్రజాత | = | అక్క |

**తాత్పర్యం :** ఆ అక్క దేవతకు కూడ తృప్తిపడని గొప్ప అతిథికి లాగా అన్ని విధాలయిన వంటకాలను కన్నుగీటినంత కాలంలో చక్కగా ఏర్పాటు చేసి (ముందు పద్యంతో అన్వయం)

***27 వ పద్యం :**

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| తల + కడిగించి | = | తలంటుస్నానము చేయించి |
| ధౌత పరిధానమున్ | = | ఉదికిన దోవతిని |
| కట్టఁగన్ | = | కట్టటానికి |
| ఇచ్చి | = | ఒసగి |
| లెస్సగాన్ | = | చక్కగా |
| అలకలయందున్ | = | కురులలోని (తల వెంట్రుకలయందలి) |
| తడి | = | చెమ్మను |
| ఆరిచి | = | ఆరునట్లు చేసి |
| క్రొత్త + విరులు | = | క్రొత్తవియైన పూవులను |
| ఆవటించి | = | అలంకరించి |
| మైన్ | = | ఒడలిపై |
| మలయజ చర్చ | = | మంచిగంధపు పూతను |
| చేసి | = | కావించి |
| గృహ, మాధవ, దత్త, మనోజ్ఞ భోజనంబులు | = | ఇంటి వేలుపు అయిన విష్ణువునకు నివేదించిన రుచికరమయిన ఆహారాలను |
| తల్లి | = | అమ్మయు |
| తండ్రి | = | నాన్నయు |
| నిజపుత్త్రులు | = | తన కొడుకులు |
| భర్తయున్ | = | తన మగడును |
| తోన | = | అతనితో కలిసి |
| భుజింపగన్ | = | తినగా |
| ఒసగెన్ | = | పెట్టెను. |

**తాత్పర్యం :** ఆ అక్క తమ్మునికి తలంటు స్నానం చేయించింది. చక్కగా ఉతికిన బట్టలు కట్టుకోవటానికి ఇచ్చింది. తలలోని తడియారేట్లుగా చేసింది. క్రొత్త పూవులు తురిమింది. ఒడలిపై మంచిగంధం పూత పెట్టింది. ఇలవేలుపు అయిన విష్ణువునకు నైవేద్యం పెట్టిన మనోహరమైన భోజనాలు తల్లిదండ్రులు, తన కొడుకులు, తన మగడును కలిసి తింటుండగా వానికి పెట్టింది.

**28 వ పద్యం**

ఇష్టములైన వంటకము లిట్లు భుజించు యతండు వార్చి సం
తుష్ట మనస్కుఁడై తనదు తొయ్యలి వీడ్యము చుట్టియీ మహా
శిష్టుఁడు బోలెఁ దిన్నెపయి చిర్నగ వొప్పఁగఁ గూరుచున్నచోఁ
బుష్టి సమస్తముం గడిపి పుచ్చి తదగ్రజ పూర్ణచిత్తయై

లు :

వార్చి = ఆచమనం చేసి (భగవన్నామాలు పలుకుతూ నీటిని మూడు పర్యాయాలు కొంచెం కొంచెంగా లోపలికి తీసుకోవటం ఆచమనం)

వీడ్యము = తాంబూలం

మహాశిష్టుఁడు = గొప్ప ఆచార లక్షణాలు కలవాడు

పుష్టిన్ = తృప్తిని

సమస్తమున్ = అంతటిని

తద్ + అగ్రజ = అతని అక్క

పూర్ణ చిత్త = నిండుమనసు కలది

**తాత్పర్యం :** అతడు ఇష్టంగా ఉన్న వంటకాలన్నీ చక్కగా భుజించి ఆచమనం చేసి తృప్తికల మనస్సుకలవాడై తన భార్య తాంబూలం చుట్టియివ్వగా గొప్ప మంచి లక్షణాలు కలవానివలె అరుగుమీద చిరునగవు మొగం మీద మెరుస్తూ ఉండగా కూర్చున్నాడు. పిదప ఆ అక్కనిండుమనస్సుతో ఇలా అతనికి పుష్టినంతా కలిగించి (ముందుకు అన్వయం).

**29 వ పద్యం**

ఇంతలు నంతలు నగు తన
సంతానము చంట వెంట సందడి సేయన్
బ్రాంతమున నిలిచి తమ్ముని
కుంతల బంధంబు విడిచి కుశలాశయ యై

**అర్థాలు :**

ఇంతలు నంతలు నగు తన సంతానము = ఇంత వయస్సు అంత వయస్సు గల తన బిడ్డలు

చంటన్, వెంటన్ = పసివాడు పాలుత్రాగుతూ, తక్కినవాళ్ళు సమీపంలోను

కుంతల బంధంబున్ = జుట్టు ముడిని

విడిచి = విప్పి

కుశల + ఆశయ = దొడ్డబుద్ధి కలది

**తాత్పర్యం :** తన పసివాడు పాలు త్రాగటానికి రొమ్ముదగ్గరా, తక్కినవాళ్లు తనకటూ ఇటూ తిరుగుతూ సందడి చేయగా దగ్గరగా నిలిచి ఆమె తమ్ముని జుట్టుముడి విప్పి మంచి మనసు కలదియై (మీది పద్యంతో అన్వయం)

**30 వ పద్యం**

ఎలయు సీత్కారములతోడ నీళ్ల గ్రుక్కి

యంటు నంటుల పరికించి యంట్లు( బొడిచి

గోరుముక్కుల దిగదువ్వి తూరుపెత్తి

నెఱుల( గలగిన పేల నన్నింటి ( దిగిచి

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ఎలయు సీత్కారములతోడన్ | = | పైకి వచ్చెడు ఒక విధమగు నోటి చప్పుడులతో |
| ఈళ్ళు | = | పేనుల గ్రుడ్లలను |
| క్రుక్కి | = | గోళ్లతో నొక్కి (చచ్చునట్లు చేసి) |
| అంటున్ + అంటులన్ | = | వెంట్రుకల కుదురుభాగములను |
| అంట్లున్ | = | అంటు పేలను |
| గోరుముక్కులన్ | = | గోటిచివళ్లతో |
| తూరుపెత్తి | = | వెంట్రుకలను పాయలుగా తీసి అడ్డముగా మీదికెత్తి పట్టుకొని |
| నెఱులన్ | = | వెంట్రుకలలో |

**తాత్పర్యం :** సీత్కారాలు చేస్తూ పేను గ్రుడ్లనన్నింటిని గోళ్లతో క్రుక్కి సందుసందులలో మెలకువగా చూచి పేనులను వెదకి గోరు చివళ్లతో నలిపి రాలగొట్టి వెంట్రుకలు పాయలుగా తీసి పేలనన్నింటిని పోగొట్టింది.

**31 పద్యం**

మెడమన్ను మలచి యలకలు

ముడిగొని నిజపాణి పద్మములు గరగరగా(

గడిగికొని తనకు మరదలు

విడె మొస(గుచు( బసిమి పసిడి వీవన వీవన్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అలకలు | = | కేశములు |
| నిజపాణిపద్మములు | = | తన చేతులనే పద్మాలు |
| గరగరగాన్ | = | శుభ్రంగా |
| విడెము | = | తాంబూలం |
| పసిమి సపిడి వీవనన్ | = | పచ్చని బంగారు విసనకర్రతో |

**తాత్పర్యం :** తమ్ముని మెడ మీది మన్ను నలచి, వెంట్రుకలు చక్కగా ముడిగా ఏర్పరచి, చేతులను శుభ్రంగా కడుగుకొని, తనకు మరదలు తాంబూలం ఇచ్చి బంగారు వీవనతో విసరుతుండగా (మీది పద్యంతో అన్వయం)

**32 వ పద్యం**

చేటి కానీత పీఠికాసీన యగుచుఁ

బద్మకర్ణికఁ గొలువున్న పద్మవోలెఁ

గుడివలన నింత యొరఁగాఁ గొమరు మెఱసి

బిడ్డ చనుద్రావ నిట్లను బిసరుహాక్షి

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| బిసరుహ + అక్షి | = | పద్మాలవంటి కనులు గల ఆ వనిత |
| చేటికా + ఆ నీత, పీఠికా + ఆసీన | = | పనిమనిషి తెచ్చిపెట్టిన పీఠం మీద కూర్చున్నది |
| పద్మకర్ణికన్ | = | పద్మం దుద్దునందు |
| కుడివలనన్ | = | కుడి వైపున |
| కొమరు | = | అందం |

**తాత్పర్యం :** ఆ వనిత పనిమనిషి తెచ్చిపెట్టిన పీటమీద పద్మం నడిమిభాగంలో కూర్చున్న లక్ష్మివలె కూర్చుండి, గుడివైపున ఒక ప్రక్కకు ఒరగి చంటివాడు అందంగా పాలుత్రాగుతుండగా ఇలా పలికింది.

**33 వ పద్యం**

ప్రారంభించిన వేద పాఠమునకుం బ్రత్యూహమౌనంచు నో

యేరా తమ్ముఁడ ! నన్నుఁజూడఁ జనదే వెన్నాళ్ళనో యుండి చ

క్షూ రాజీవయుగంబు వాచె నినుఁగన్గోకున్కి, మీ బావయున్

నీ రాకల్ మది గోరుఁ జంద్రుపొడుపున్ నీరాకరంబుంబలెన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఏరా ! తమ్ముడు ! | = | ఏమిరా తమ్ముడూ ! |
| ప్రారంభించిన | = | మొదలు పెట్టిన |
| వేద పాఠమునకున్ | = | వేదం అధ్యయనానికి |
| ప్రత్యూహము | = | ఆటంకం |
| ఔను | = | అవుతుంది |
| అంచునో | = | అనుకొనియా ఏమి ! |
| ఎన్నాళ్ళనో + ఉండి | = | ఎన్నినాళ్ళనుండియో |

| | | |
|---|---|---|
| నన్నున్ | = | నన్ను |
| చూడన్ | = | చూడటానికి |
| చనుదేవు | = | రావు |
| నినున్ | = | నిన్ను |
| కన్, కోక + ఉన్కి | = | చూడకుండా ఉన్న కారణంగా |
| చక్షుర్ + రాజీవయుగంబు | = | కన్నులనే పద్మాల జంట |
| వాచెన్ | = | వాచిపోయింది |
| మీ బావయున్ | = | మీ బావగారు కూడా; |
| చంద్రు పొడుపున్ | = | చంద్రుని ఉదయాన్ని |
| నీరాకరంబున్, బలెన్ | = | సముద్రంలాగా |
| నీ రాకల్ | = | నీ రాకలను (నీవు ఎప్పుడు వస్తావో అని) |
| మదిన్ | = | మనస్సులో |
| కోరున్ | = | కోరుకుంటున్నాడు |

**తాత్పర్యం :** ఏమిరా తమ్ముడూ మొదలుపెట్టిన వేదపాఠానికి విఘ్నం అవుతుందనా ఏమి ఎన్నాళ్ళనుండియో నన్ను చూడటానికి రాలేదు. నిన్ను చూడక నా కళ్ళు వాచిపోయాయి. మీ బావ కూడా మా బావమరిది ఎప్పుడు వస్తాడా అని సముద్రుడు చంద్రుని ఉదయం కోసం చూచినట్లు ఎదురు చూస్తున్నాడు.

(రాక - అంటే నిండు చంద్రుడు అనే అర్థం కూడా ఉంది)

**34 వ పద్యం**

శ్రీ లాలిత్యము నిత్యశుద్ధియు గుణోత్సేకంబునుంగల్గి యు
ద్వేల స్ఫూర్తిఁదలిర్చు తండ్రియను నబ్ధిం జంద్రుఁడై తోచినన్
బోలుంగాక భవాదృశుం డితరుఁడై పుణ్యంబులం బాసినన్
సాలగ్రామ ఖనిం జనించునె కదా జాత్యల్ప పాషాణముల్

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| భవాదృశుండు | = | నీవంటివాడు |
| శ్రీ లాలిత్యము | = | సంపదతో సుకుమారమైనది (తండ్రి) (లక్ష్మితో విరాజిల్లునది - సముద్రము) |
| నిత్యశుద్ధియున్ | = | ఎల్ల వేళల నిర్మలము |
| గుణ + ఉత్సేకమున్ | = | గుణముల పెంపుదలయు |

| | | |
|---|---|---|
| కల్గి | = | కలిగి |
| ఉద్వేల స్ఫూర్తిన్ | = | మిక్కిలిగా ప్రకాశించు స్ఫురణతో |
| తవిర్చు | = | ఒప్పారునట్టి |
| తండ్రి + అను + అబ్ధిన్ | = | తండ్రియనే సముద్రంలో |
| చంద్రుడు + ఐ | = | చందమామ అయి |
| తోఁచినన్ | = | కన్పట్టునేని |
| పోలున్ | = | ఒప్పును |
| కాక | = | కాక |
| ఇతరుడు + ఐ | = | మరియొక విధంవాడై |
| పుణ్యంబులన్ | = | మంచి పనులన్ |
| పాసినన్ | = | వదలినట్లైతే |
| సాలగ్రామఖనిన్ | = | సాలగ్రామాలగనిలో |
| జాతి + అల్ప, పాషాణముల్ | = | జాతిచేత తక్కువ అయిన గులకరాళ్లు |
| జనించునె కదా | = | పుడతాయి కదా ! |

**తాత్పర్యం :** బాబూ, తండ్రి అనేవాడు ఒక సముద్రం వంటివాడు. సముద్రంలో లక్ష్మి, నిర్మలత్వం, గొప్పగుణాల పెంపు ఉన్నట్లే అతనిలో సంపద, స్వచ్ఛత, సద్గుణాలు ఉంటాయి. నీ వంటివాడు ఆ తండ్రి అనే సముద్రానికి చంద్రుని వంటివాడైతే చక్కగా ఉంటుంది. అలాకాక మరొక విధంగా ప్రవర్తించే వాడయితే పరమ పవిత్రమైన సాలగ్రామాలు పుట్టేగనిలో గులకరాళ్లు పుట్టినట్లవుతుంది.

**35 వ పద్యం :**

ఏనమ్ముడు గడవడఁ ద
త్సూనులు కసుగందు లగ్రజుండవు నీవి
ట్లైనతరి నెంత దుఃఖమొ
యీ నీ ప్రోపాసపడెడు నిరుగురువులకున్

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అమ్ముడు గడవగన్ | = | అమ్ముడుపోగా - మరియొక యింటికి వెళ్లిపోగా; |
| తత్ + సూనులు | = | ఆ తల్లిదండ్రుల తక్కిన కొడుకులు; |
| కసు గందులు | = | మిక్కిలి పసివారు; |
| అగ్రజుండవు | = | అన్నవు; |

| | | |
|---|---|---|
| ప్రోపు | = | అండ |
| ఇరు గురువులకున్ | = | ఇద్దరు గురువులైన తల్లిదండ్రులకు. |

**తాత్పర్యం :** నేను మరొకయింటికి అమ్మడు పోయాను. తక్కిన కొడుకులా చాలా పసివారు. అన్నవైన నీవు భాధ్యత తెలియకుండా ఇలా అయిపోయావు. ఇట్టి సమయంలో నీ అండను కోరుకుంటున్న ఈ తల్లిదండ్రులనే గురువులిద్దరికే ఎంత కష్టమో ఆలోచించు (గురువులు అన్న పదానికి వృద్ధులు అనే అర్థం కూడా భావించవచ్చు.)

**36 వ పద్యం.**

పరమేష్ఠి నుండి నీ తరము దాక విశుద్ధ

తరమైన వంశంబుఁదలఁపవైతి

దఱిఁద్రొక్కియున్న యీ తల్లిదండ్రులఁ జాల

పఱచవై సంతోష పరచవైతి

వగ్ని సాక్షిగఁ బెండ్లి యాడిన యిల్లాలి

నిల్లాలితా కార నొల్లవైతి

ధర్మశాస్త్రార్థ విత్తముల విత్తములచే

నలరించి విఖ్యాతి నందవైతి

శీల మఖిలంబు నిది పిల్లి శీలమనుచుఁ

జదువు లివి యెల్లఁ జిల్కల చదువు లనుచుఁ

దోడివారలు నవ్వ నాతోడ యేల

బేల వైతివి యీ గుణం బేల నీకు.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పరమేష్ఠి | = | బ్రహ్మ |
| తఱిన్ + త్రొక్కియున్న | = | మరణ వేళను సమీపించి ఉన్న; |
| పఱచ | = | అల్పుడు; |
| ధర్మశాస్త్ర + అర్థవిత్, తములు | = | ధర్మశాస్త్రాల అర్థాలను బాగుగా తెలిసినవారు. |
| విత్తములు | = | ధనాలు; |
| ఈ + లాలిత + ఆకారన్ | = | మనోహరమైన ఆకారంగల యీామెను, |
| నా తోడ | = | నా తమ్ముడా ! |

**తాత్పర్యం :** నా తమ్ముడా ! బ్రహ్మతరంనుండి మిక్కిలి పవిత్రమైన నీ వంశాన్ని తలపవు. ముసలితనం ముదిరి చావునకు సమీపంలో ఉన్నయీ తల్లిదండ్రులను సంతోషపరచవు. అగ్ని దేవుడు సాక్షిగా పెండ్లి చేసికొన్న అందచందాలతో అలరారే యీ

యిల్లాలిని కాదన్నావు. ధర్మశాస్త్రాల అర్థాలలో పాండిత్యం గడించిన వారిని సమ్మానించి కీర్తి పొందకున్నావు. వినిదంతా పిల్లి శీలం. చదువు చిల్కల చదువులు అని నీతోడి వారంతా నిన్ను చూచి నవ్వుకుంటున్నారు. ఇలా మూఢుడ వయ్యావేమి? ఈ గుణం నీకు ఎందుకు?

**విశేషం :** పిల్లిశీలం - బుద్ధిగా ఉందామని అనుకోవటమే తప్ప వస్తువు కనపడిన వెంటనే దాని అనుభవం కోసం వ్యామోహంతో ప్రవర్తించటం - అనే స్వభావం.

చిల్కల చదువులు - అన్నమాట అనటమే కానీ భావనతో పెంపొందించుకోవటం లేని బండచదువు.

**37 వ వచనం :**

అనిత దీయ దురాచరణ స్మరణ సంతప్త స్వాంతాయై యక్కంఠీ
రవమధ్య యమర్షో త్కంఠ కలకంఠ కులకంఠ కాకలీ పాక లీలా పహంబగు
నెలుంగు చెలంగం గలంగి కుంఠిత ప్రబోధుండగు నా శుంఠునిం
గెరలి పలికియు నలుక మగిడించి యుదంచిత ప్రయోజన ఘటనా
పారవశ్యంబున సామరస్యంబు మీఱ నిట్లనియె.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| దురాచరణ, స్మరణ, సంతప్త, స్వాంత | = | తప్పుడు పనులను గుర్తు తెచ్చుకోవటం చేత ఉడికిపోయిన మనస్సు కలది; |
| ఆ + కంఠీరవ మధ్య | = | సింహానికి వలె సన్నగా ఉన్న నడుము కల ఆమె |
| అమర్ష + ఉత్కంఠ; కలకంఠ కుల, కంఠ కాకలీ పాక లీలా + అపహంబు | = | కోపం వలన పెద్దగా మాటాడటంచేత, కోకిలల సముదాయం యొక్క అతి మనోహరమైన పాకంలోని లీలలను తొలగించేది; |
| ఎలుంగు | = | కంఠధ్వని; |
| కుంఠిత ప్రబోధుండు | = | పనికి మాలిన తెలివి గలవాడు; |
| శుంఠుడు | = | మూర్ఖుడు; |
| కెరలి | = | కోపించి; |
| ఉదంచిత, ప్రయోజన, ఘటనా, పార వశ్యంబునన్ | = | మిక్కిలి ఎక్కువ అయిన ప్రయోజనాన్ని కూర్చటంలో ఉన్న పట్టుదల చేత; |
| సామరస్యంబు | = | ఎగుడు దిగుళ్లు లేని సమరస భావం. |

**తాత్పర్యం :** ఆ అక్క ఇలా పలికి వాని పాపాలు గుర్తుకురావటం చేత కుతకుతలాడిన మనస్సు కలదియై, కోపంతో పెరిగిన గొంతు కోకిలల అవ్యక్త మధుర నాదం విలాసాన్ని పోగొట్టేదిగా ఉండగా పనికిమాలిన తెలివి తేటలుగల వానిని కోపించి పలికి కూడా, కోపాన్ని మరలించుకొని తాను భావించే ప్రయోజనాన్ని సాధించటం లక్ష్యంగా గల పట్టుదల చేత మాములు స్థితికి వచ్చి మళ్లీ ఇలా పలికింది.

38 వ పద్యం :

పడఁబడఁ బాఱుచున్ వడకు పట్టిన తల్లిని దండ్రి నేలలో
వెడలని తమ్ముఁ గుఱ్ఱల నవీన కులాంగన నోరు లేనియే
తొడుకుల బంటుఁబైద విడఁద్రోవక ప్రోవగ నెందునీక పా
ఱ్రిడినది; కర్ణు నౌఁదలనె భారత సంహిత నిల్చు చాడ్పునన్.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| కర్ణు + ఔదలనె | = | కర్ణుని నెత్తి మీదనే; |
| భారత, సంహిత | = | భారతమనే కథల సముదాయం; |
| నిల్చు చాడ్పునన్ | = | నిల్చిన విధంగా; |
| పడన్ + పడన్ | = | పడుతూ పడుతూ; |
| పాఱుచున్ | = | సరిగా నడవలేక వేగంగా తూలుతూ పోతూ; |
| వడకు పట్టిన | = | వణకటానికి వశమైన; |
| తల్లినిన్ | = | అమ్మను ; |
| తండ్రిన్ | = | నాయనను |
| నేలలో, వెడలని, తమ్ము + కుఱ్ఱలన్ | = | ఇంకా నేలనుండి పైకిరాని (ప్రాకటం వంటి దశలో ఉన్న) కుర్రవాండ్రైన తమ్ములను; |
| నవీన కుల + అంగనన్ | = | క్రొత్తగా వచ్చిన కులకాంత అయిన భార్యనూ; |
| నోరు లేని యీ తొడుకులన్ | = | నోరులేనట్టి యీ ఆవులను; |
| బంటున్ + పైదన్ | = | పనిమనుషులను, పిల్లలను; |
| విడన్ + త్రోవక | = | వదలి వేయక; |
| ప్రోవఁగన్ | = | రక్షించటానికి; |
| నీకున్ + అ | = | నీకే; |
| పా + పడినది | = | ఏర్పడినది; |

**తాత్పర్యం :** నడవలేక తూగుతూ ముందరకు పడిపోతూ వణకిపోతున్న తల్లిదండ్రులను, ఇంకా నేల సొంటు వదలని కుర్ర తమ్ములను, క్రొత్తగా వచ్చిన కులకాంతను, నోరులేని గొడ్డు గోదలను బంటు బిడ్డలను వదలి వేయకుండా కాపాడ వలసిన బాధ్యత, భారత కథ అంతా కర్ణుని మీద పడినట్లుగా, నీ మీదనే పడింది.

**విశేషం :** కర్ణుడు భారతంలో దుర్యోధనాదుల దుష్టప్రవృత్తిని ఎగసన్రదోసి ఆ కథ అంతా అలా జరగటానికి మూలకారణం అయ్యాడు. అందుచేత కర్ణుడు లేని భారతమా? అని ఒక నానుడి లోకంలో ఏర్పడింది.

39 వ పద్యం :

నాదు సహోదరుండు సుజన స్తవనీయ నయ ప్రసక్తి బ్ర
హ్మాదుల మెచ్చఁడే నతని యజ్ఞమునం గడుఁబూజ్యారాలనై
వేది యలంకరింతు నని వేవురి లోపల నాడుకొందు నీ
వేదియు లేక సర్వగుణ హీనుఁడ వౌట యెఱుంగఁ దమ్ముఁడా !

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| తమ్ముఁడా! | = | ఓరీ తమ్ముడా ! |
| నాదు, సహోదరుండు | = | నా తోడబుట్టినవాడు; |
| సుజన, స్తవనీయ, నయ, ప్రసక్తిన్ | = | మంచివారు కొనియాడే నీతి ప్రసంగంలో; |
| బ్రహ్మ + ఆదులన్ | = | బ్రహ్మ మొదలైన వారిని; |
| మెచ్చఁడు | = | మెచ్చుకోడు; |
| ఏన్ | = | నేను; |
| అతని యజ్ఞమునన్ | = | అతడు చేసే యజ్ఞంలో; |
| కడున్ | = | ఎక్కువగా; |
| పూజ్యారాలను + ఐ | = | మన్నింపబడే దాననై; |
| వేది | = | యజ్ఞం చేసే అరుగును; |
| అలంకరింతున్ | = | అలంకరిస్తాను; |
| అని; | | |
| వేవురిలోపలన్ | = | చాలమంది జనుల సముదాయంలో; |
| ఆడుకొందున్ | = | చెప్పుకుంటూ ఉంటాను; |
| నీవు | = | నీవు; |
| ఏదియున్ | = | ఏదీ; |
| లేక | = | లేకుండా; |
| సర్వ, గుణ, హీనుఁడవు | = | అన్ని గుణాలూ లేనివాడవు; |
| ఔట | = | కావటం; |
| ఎఱుంగన్ | = | ఎరుగను. |

తాత్పర్యం : ఓరీ తమ్ముడూ ! నాతమ్ముడు సజ్జనులు కొనియాడే నీతిశాస్త్ర పాండిత్యంలో బ్రహ్మ మొదలైన వారిని కూడా మెచ్చుకోడు. (వారికంటె మించినవాడు కనుక). అతని యజ్ఞంలో నన్నందరూ 'యజమానుని అక్క' అని మన్నిస్తూ ఉంటే మురిసిపోతూ

వేదిక మీద అలంకారంగా కూర్చుంటాను - అని పదిమందిలో చెప్పుకుంటూ ఉంటాను. నీవేమో అవి ఏమీ లేక, ఇక్కడ సర్వగుణ భ్రష్టుడవై ఉండటం ఎరుగను.

**40 వ పద్యం;**

వీరావేశము దాల్చి సర్వధనమున్ వెచ్చింతుఁ గాకేమి ము
క్కారుంబండు నఖండ సేతు వృతముల్ కాశ్మీర ఖండంపుఁగే
దారంబుల్ దెగ నమ్మఁగాఁజనునె? నిర్దారుండవే? వెన్కనె
వ్వారున్ లేరె? సహోదరాదులు కులధ్వంసంబు నీ కర్హమే?

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| వీర + ఆవేశము | = | అలవిమాలిన తొందరపాటు తనం; |
| తాల్చి | = | పూని; |
| సర్వధనమున్ | = | మొత్తం ధనాన్ని; |
| వెచ్చింతు | = | ఖర్చు పెడుతున్నావు; |
| కాక + ఏమి | = | పోనీలే అనుకుందాం; |
| మూడు + కారున్ | = | మూడు కాలాలలో (ఏటికి మూడు పంటలుగా) |
| పండు | = | పండే |
| అఖండ, సేతు, వృతమున్ | = | ముక్కలు కాని కట్టలతో ఆవరింపబడిన; |
| కాశ్మీర ఖండము + కేదారంబుల్ | = | కుంకుమ పువ్వు పండే దేశభాగం వంటి పంట పొలాలను (మాగాణి భూములను) |
| తెగన్, అమ్మఁగాన్ + చనునె | = | వచ్చిన కాడికి అమ్ముకోవటం తగునా? |
| నిర్దారుండవే | = | పెళ్లాం లేనివాడవే; |
| వెన్కన్ | = | నీ వెనుక; |
| సహోదర + ఆదులు | = | తమ్ములు మొదలైన వాళ్లు; |
| ఎవ్వారున్ | = | ఎవ్వరూ |
| లేరె | = | లేరా? |
| కుల ధ్వంసంబు | = | కులాన్ని నాశనం చేయటం; |
| నీకున్ | = | నీకు; |
| అర్హమే | = | తగునా? |

**తాత్పర్యం :** ఒడ లెరుగని తొందరపాటు తనంతో ఉన్న ధనం మొత్తం ఖర్చు చేస్తున్నావు. పోనీ ! అక్కడికి ఆగక రాజనాలు పండే మంచి మాగాణి క్షేత్రాలను తెగనమ్మటం నీకు తగునా? పెళ్లాం లేనివాడవా? నీలాగానే అనుభవించవలసిన తమ్ముళ్లు లేరా? కులాన్ని నాశనం చేయటం నీకు తగిన పనియేనా?

**విశేషం :** కాశ్మీర ఖండం - కుంకుమ పువ్వు చాలా విలువ అయినది. అది పండే పొలానికి దానికి వలెనే చాలా ధర ఉంటుంది. అటువంటి క్షేత్రాలు నీవి - అని భావన;

ముక్కారున్ = కారు అంటే పంట కాలం. ముక్కారు = అంటే సంవత్సరానికి మూడు కాలాలలోను అని అర్థం.

తెగనమ్ముట = ఇది ఒక నుడికారం. చాలా విలువైన వస్తువు అవసరం కోసం చాలా తక్కువ ధరకు అమ్మివేయటం.

**41 వ పద్యం:**

కామవికార మాత్మ నవగాఢతఁ దాల్చినయేని నిర్భర
శ్రీ మెరయంగ రూపగుణ శీలకులోన్నతి గల్గు విప్రక
న్యామణులన్ సహస్రమయినన్ వరియించి రమించరాదె? యే
మీ మునులే గృహస్థులు రమించుట యెగ్గె? కులాంగనాతతిన్?

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| కామ వికారము | = | కామం పొంగు |
| ఆత్మన్ | = | హృదయంలో; |
| అవగాఢతన్ | = | చాలా ఎక్కువగా; |
| తాల్చిన యేని | = | పేరుకొని ఉంటే; |
| నిర్భర శ్రీ | = | నిండైన సంపద; |
| మెఱయుంగన్ | = | ఒప్పగా; |
| రూప, గుణ, శీల, కుల + ఉన్నతి | = | అందము, గుణము, మంచినడవడి, కులము అనేవాని గొప్పతనం; |
| కల్గు | = | ఉండే |
| విప్ర, కన్యా, మణులన్ | = | బ్రాహ్మణ కన్యలలో మేలైన వారిని; |
| సహస్రము | = | వేయి మందిని; |
| అయినన్ | = | అయినా; |
| వరియించి | = | ఎన్నుకొని వివాహం చేసికొని; |
| రమించరాదె | = | అనుభవించవచ్చు గదా ! |
| గృహస్థులు | = | గృహస్థ ధర్మంలో ఉన్నవారు |
| మునులే, ఏమి | = | మునులలాగా కోరికలు చంపుకొనవలసినవారా? |
| కుల + అంగనాతతిన్ | = | కులకాంతల సముదాయాన్ని |
| రమించుట | = | అనుభవించటం; |
| ఎగ్గె | = | తప్పా? |

**తాత్పర్యం :** హృదయంలో కామం పొంగి పొరలుతూ ఉంటే సంపద ఉన్నది కనుక వేయిమందినైనా మన విప్రకులంలో పుట్టిన కన్యారత్నాలను వరించి రమించు. అదేమీ తప్పు కాదు. గృహస్థులు మునులు కాదు కాదా! కులకాంతలతో సుఖించటం తప్పు కాదే!

**విశేషం :** నిజానికి ఆ విధంగా రమించమని ప్రోత్సహించటం అక్క ఉద్దేశం కాదు. కామము పురుషార్థం, కనక దానిని ధర్మబద్ధంగా అనుభవించటం తప్పుకాదని చెప్పటమే ఆమె తాత్పర్యం.

**42 వ పద్యం :**

లోలత్వంబున మత్తకాశినుల కిల్లుం బొల్లునుం జెల్లఁగా
నేలా? వెచ్చముసేయ నెవ్వలన మన్నీ లాఢ్యులుం జాలరే?
కోలంబో జనియించు వేడినను వీడ్కో లాభ మో తండ్రి! దు
శ్శీలాగారము వారయౌవతము నిన్నీ! మేటి వాటించునే?

**ప్రతి పదార్థం :**

లోలత్వంబునన్ = మనస్సు చాంచల్యంతో;
మత్తకాశినులకున్ = సాని వాండ్రకు;
ఇల్లున్ = కొంపా;
పొల్లునున్ = చివరికి ఎందుకూ పని రాని ఊక కూడా
చెల్లఁగాన్, ఏలా = దక్కిపోవటం ఏల?
వెచ్చము + చేయన్ = ఖర్చు పెట్టటం మొదలు పెడితే;
మన్నీలు = మహారాజులు;
ఆఢ్యులున్ = గొప్ప పేరు ప్రఖ్యాతులు కలవారునూ;
చాలరే = చాలరు గదా! (ఆస్తి పాస్తులను నిలుపుకోలేరు గదా అని భావం)
కోలంబో = ఇదియేమైన ఆటయా !
వేడినను = కోరితే;
జనియించున్ = పుడుతుంది;
వీడ్కోన్ = వదలిపెడితే;
లాభము = ప్రయోజనం (కలుగుతుంది)
ఓ తండ్రి = ఓ నాయనా !
వార యౌవతము = వేశ్య యువతుల మంద;
దుశ్శీల + అగారము = చెడు నడవడి కొంప

ఇస్సీ = ఛీ ఛీ;

మేటి = ఉత్తముడు ;

పాటించునే = ఆదరిస్తాడా !

**తాత్పర్యం :** చపలచిత్తంతో ఇల్లూ పొలాలూ వేశ్యలకు సమర్పించటం ఏల? వెచ్చించటం సాగితే రాజులూ ఆగరు ? మహాపురుషులూ నిలువరు (సర్వనాశనమై పోతారు). ఇది ఏమైనా వినోదం కోసం కాసేపు ఆడే ఆట కాదు కదా ! నీ కోర్కెను పట్టి ఏర్పడేది కనుక వద్దనుకుంటే ఎంతో లాభం కలుగుతుంది. వేశ్య యువతుల మంద పాడు నడవడికి నిలయం. ఉత్తముడు వారిని ఆదరిస్తాడా ?

**విశేషాలు :** వేశ్యలకు ధనం ఇవ్వటంలో ఒక హద్దు ఉండదు. మడిమాన్యాలు, కీర్తి ప్రతిష్ఠలు నిండుగాగల సంపన్నులు కూడా సర్వ దరిద్రులై తిండికి కూడా ముష్టి ఎత్తవలసిన స్థితిలోనికి చేరుకున్నారని రెండవపాదంలోని భావం.

కోలంబో జనియించు - అనేది కొంచెం అస్పష్టంగా ఉంది. 'కోలాభోఽ జని' అనే పాఠాన్ని కొందరు ఆదరించారు. వేశ్యల వలన ఏమిలాభం పుట్టింది అని దానికి అర్థం బాగానే ఉంది. అయితే ప్రధానంగా 'కోలంబో' అనే దానిని గ్రంథంలో చూస్తున్నాం. దానికి ఇది ఒక ఆట కాదుకదా ! వినోదం కలుగుతుందని పోనీలే అనుకోవటానికి. నీవు వేడితే కలిగింది. దానిని వదలివేస్తే మహా ప్రయోజనం కలుగుతుంది - అనే అర్థాన్ని ఇక్కడ గ్రహించవచ్చు.

**43 వ పద్యం**

నర్మగర్భోక్తులు నక్కటక్కులు వింత
        నయగారములు బహు నాటకములు
పిలుపిచ్చు విద్యలు పీఁకవన్నియలును
        బెలుచఁ దనంబులు ప్రేలడములు
వక్ర భావంబులు వలకారిబాగులు
        వలసి యొల్ల ములును వట్టి పసలు
కేరడంబులు సొళగింపులు కిల్బిషా
        క్రీడనంబులు నడకించు వగలు
బాసపోసనములు విడంబములు భ్రమలు
లేని మచ్చిక వివియాదియైన వివిధ
దుర్గుణంబుల ప్రోవులు ద్రోహమతులు
వారకాంతలఁ దడవిన వచ్చుఁ గీడు.

**అర్థాలు :**

నర్మగర్భ + ఉక్తులు = మదిలో మరొక భావం కల మాటలు;

నయగారములు = మోసంతో కూడిన మెత్తదనాలు ;

| | | |
|---|---|---|
| పిలుపిచ్చ | = | పరమనీచమైన; |
| పీఁకవన్నియలు | = | పై పై మెఱుఁగులు ; |
| పెలుచదనంబులు | = | కరకుతనాలు ; |
| ప్రేలడములు | = | పలవరించటాలు ; |
| వక్ర భావంబులు | = | వంకర భావాలు ; |
| వలకారి బాగులు | = | వలపించే సోయగాలు ; |
| కేరడంబులు | = | పరిహాసాలు ; |
| సాళగింపులు | = | కలుపుకోలు తనాలు ; |
| కిల్బిష + ఆ క్రీడనములు | = | పాపాలతో కూడిన ఆటలు; |
| అడకించు వగలు | = | వంచన చేసే విలాసాలు ; |
| బాస పోసనములు | = | నమ్మబలికే కూతలు ; |
| విడంబములు | = | మోస పుచ్చటాలు ; |
| తడవినన్ | = | మనస్సులో అనుకున్నా |

**తాత్పర్యం :** నాయనా ! వారకాంతలు ద్రోహబుద్ధి మాత్రమే కలవారు. దుర్గుణాల పుట్టలు. లోపల ఏవో భావాలు దాచుకొని మాటాడటం, నక్కల టెక్కులూ, వింత నయగారాలు, పెక్కు నాటకాలు, నీచమైన చదువులు, పై పై మెఱుగులూ, లోపల కరుకుదనాలూ, ఏవో ఏవో కారులు కూయటం, వంకర భావాలు, వలపించే సోయగాలు, అంతలోనే కావాలి అనుకోవటం, అంతలోనే వద్దనుకోవటం, సారంలేని పసలూ, వేళాకోళపు వ్యవహారాలూ, కలుపుగోలుతనాలూ, తప్పుడు ఆటలు, వంచనతో కూడిన ఒయ్యారాలూ, నమ్మించే దొంగమాటలు, వంచనలూ, భ్రమలూ, లేని ప్రేమలు - ఈ మొదలైన మహాదుర్గుణాల ప్రోవులైన, ద్రోహబుద్ధికల భోగం పిల్లలను తలచినా పాపమే.

**44 వ పద్యం**

విడు మింకనైన నిట్టి యవివేకము; మామక బుద్ధి పద్ధతిన్
నడువుము; నీకుఁగా వలసెనా హరికేస్తుభమైనఁ దెచ్చెదన్
గడుసరి అచ్చకూళ పలుగాకుల వీడుము; చేయి మీఁడ గా
నడచిన పూర్ణకాముఁడవు నా యనుజన్ముఁడ విట్లు సేయదే ?

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఇఁకన్ + ఐనన్ | = | ఇకనైనా |
| ఇట్టి అవివేకమున్ | = | ఇట్టి తెలివి తక్కువతనాన్ని |
| విడుము | = | వదలిపెట్టు |
| మామకబుద్ధి పద్ధతిన్ | = | నాదైన తెలివి దారిలో |

| | | |
|---|---|---|
| నడువుము | = | ప్రవర్తించు |
| కావలసెనా | = | కావాలంటే |
| హారికౌస్తుభము + ఐనన్ | = | విష్ణువు మణికౌస్తుభాన్నయినా, |
| నీకున్ | = | నీకు |
| ఇచ్చెదన్ | = | ఇస్తాను |
| గడుసరి, అచ్చకూళ పలు గాకులన్ | = | గడుసుదనంగల అచ్చమైనక్రౌర్యం గల దుష్ట మూకలను |
| వీడుము | = | వదలిపెట్టు |
| చేయి | = | నీ చేయి |
| మీదుగాన్ | = | పైన ఉండే విధంగా |
| నడచిన | = | సాగిన |
| పూర్ణకాముఁడవు | = | నిండిన కోరికలు కలవాడవు |
| నా అనుజన్ముఁడవు | = | నా తమ్ముడవు |
| ఇట్లు | = | ఈ విధంగా |
| చేయుదే | = | చేస్తావా ? |

**తాత్పర్యం :** ఇకనైనా ఈ బుద్ధిహీనతను వదలిపెట్టు. నేను చెప్పినట్లు నడుచుకో. నీకు కావాలంటే విష్ణువు వక్షఃస్థలం మీది కౌస్తుభ మణినైనా తెచ్చి యిస్తాను. గడుసుతనంతో దోచుకొనే వేశ్యలను, దుష్టులనూ దూరం చేసికో. ఎప్పుడు పై చేయిగా ఉండే నిండిన కోరికలు గల నా తమ్ముడవు నీవు ఇలా ప్రవర్తించవచ్చునా ?

**విశేషం :**

చేయి మీదుగా - అంటే ఇవ్వటమే కానీ అడుగుకొనే స్వభావం లేకుండా అని ఈ నుడికారానికి తాత్పర్యం.

నా - అనటంలో ఉత్తమ గుణశీలాలు గల వంశంలో నాతోపాటు పుట్టిన వాడవు - అని భావం.

**45 వ పద్యం**

అక్క యీరీతి నయము ప్రియంబు గలుగ
నాన తిచ్చిన సద్బుద్ధి యాదరించెఁ
జాల దినములనుండియు మైలపడిన
బడుగుగా వున్న వాఁడన్న పానకాంక్షః

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| నయము | = | నీతి |
| బడుగు | = | ఒక్కవాడు |
| అన్నపాన కాంక్షన్ | = | తిండి మీదా, నీటి మీదా ఉన్న కోరికతో |

**తాత్పర్యం :** అక్క ఈ విధంగా ప్రియంతో నీతిని బోధిస్తే, చాలా దినాలనుండీ పాడైపోయి బక్కచిక్కినవాడు కనుక అన్నమూ, నీరూ దొరకుతుందనే ఆశతో దానిని ఆదరించాడు.



మౌనముతోడన్ = పలుకులేకుండ

నిరస్త భూష + ఐ = తొలగించిన నగలు కలదియై;

వాసెన కట్టు = తలకు అడ్డముగా గుడ్డకట్టు;

కట్టి = ధరించి;

నిడు వాలిక కస్తురి బొట్టున్ = పొడవుగా సన్నగా కస్తురి బొట్టును,

పెట్టి = పెట్టి;

లోన్ = హృదయంలో

గాసిలి = కుమిలిపోయి

చీఁకటి + ఇంటి కడ కంకటపైన్ = వెలుతురులేని యింటిలో చివరి భాగాన ఉన్న మంచంమీద;

జలద + అంత చంద్రరేఖా, సదృశ + అంగి + ఐ = మేఘం చివర ఉన్న చంద్రకళవంటి శరీరం కలదై ;

గాఢ మనోజ విషాద వేదనన్ = మిక్కిలి ఎక్కువ అయిన మనస్సులో పుట్టిన దుఃఖం బాధతో (మన్మథుడు కలిగించిన దుఃఖం బాధతో);

పొరలెన్ = అటూఇటూ కదలాడింది ;

**తాత్పర్యము :** సత్యభామ మాసిపోయిన చీరకట్టుకొని, మాటాపలుకూ లేక, నగలు తీసివేసి, తలకు అడ్డంగా గుడ్డ బిగించి, సన్నగా పొడవుగా కస్తూరితో పట్టు (బొట్టు) పెట్టుకొని హృదయములో కుమిలి పోతూ చీకటి యింటిలో మూలనున్న మంచంమీద మేఘం చివర ఉన్న చంద్రరేఖయా యన్నట్లు గాఢమైన విరహ దుఃఖంతో పొరలసాగింది.

ప. 100 బిసరుహ పత్రలోచనకుఁ బెల్లగు మోహము సంఘటిల్లె, వె
క్కసమగు నెవ్వగ ల్వొడమె ఁగంపము పుట్టెఁ జెమర్చె మేను, మా
నసమున విన్న బాటొదవె, నాటెఁగడుంబరితాప వేదనల్
మసకపుఁబాముకాటు గతి మచ్చర మన్విస మగ్గలింపఁగన్.

**ప్రతిపదార్థము :** సత్యభామకు దుఃఖంవలన కలిగిన వికారాలను కవి ఇందు వర్ణిస్తున్నాడు.

మసకము + పాముకాటుగతిన్ = కామవాంఛగల పాము కాటు విధంగా,

మచ్చరము, అన్, విసము = ద్వేషం అనే విషం,

అగ్గలింపగన్ = ఎక్కువ కాగా;

బిసరుహ పత్రలోచనకున్ = తామర రేకులవంటి కన్నులుగల ఆ సత్యభామకు;

ఎల్లు + అగు, మోహము = ఎక్కువ అయిన ఒడలు తెలియని తనం ;

సంఘటిల్లెన్ = కలిగింది

వెక్కసము, అగు, నెవ్వగలు (నెఱ + వగలు) = భరింపజాలని పెను దుఃఖాలు

పొడమెన్ = పుట్టాయి

కంపము = వణకు;

**తాత్పర్యం :** తేనె పూసిన కత్తివంటి ఆ బాపనయ్య అక్క మాటలు విని మెల్లమెల్లగా రాజమందిరానికి రాకపోకలు ప్రారంభించాడు. మరచిన విద్యలన్నింటినీ మళ్ళీ చదువుతున్నాడు. ఇంతవరకు మిత్రులుగా ఉన్నవారెదురైనపుడు సిగ్గుతో తల దించుకుంటున్నాడు. భార్యను సంతోషపెడుతున్నాడు. గురువులను ప్రతిదినం మన్ననతో చూస్తున్నాడు. దేవతార్చనలు చేస్తున్నాడు. భోజనం వేళకు వచ్చిన అతిథులను ఆదరిస్తున్నాడు. పాడిపంటలను చూచుకుంటున్నాడు. తండ్రి కట్టి విడిచిన ధోవతులను తానే ఉదుకుతున్నాడు. బావగారితో చిన్నగా మాటాడుతున్నాడు. రచ్చబండ దగ్గరకు వచ్చి ఊరి పనులను నిర్వహిస్తున్నాడు.

**విశేషం :** తేనె పూసిన కత్తి - ఇది ఒక జాతీయం. తేనె ఉన్నది కదా అని ఆశతో నాకితే నాలుక తెగిపోతుంది. అలా ఊరించి ప్రమాదం కలిగించేవానిని ఈ పదబంధంతో వ్యవహరిస్తారు.

**48 వ పద్యం**

గోమేధికోపలాంకుర మానితంబులు
పుష్యరాగచ్ఛటా పుంఖితములు
వైడూర్య సంధాన వర్ణనీయంబులు
హరినీల కీలనా భ్యంచితములు
కురువింద సందర్భ గురుతరంబులు చతు
ర్విధ వజ్రదళ సమావేల్లితములు
మహనీయతర హరిన్మణి పరీతంబులు
నకలుష స్థూల మౌక్తిక యుతములు
పద్మరాగ పరీరంభ భాస్వరములు
దంత విద్రుమకృత సముద్గక భృతములు
మాతృభూషలు నత్తి కా మండనములు
నిజ యువతి దాల్పు సొమ్ములన్నియు హరించి.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| గోమేధిక + ఉపల + అంకుర మానితంబులు | = | పసుపువన్నె గల గోమేధికములనే రత్నాల పొడితో విలువకలవిగా చేయబడినవి. |
| పుష్యరాగచ్ఛటా పుంఖితములు | = | పుష్యరాగాలనే రత్నాలు పొదిగినవి |
| వైఢూర్యసంధాన వర్ణనీయంబులు | = | వైఢూర్యములనే రత్నాల కూర్పుతో మిలమిల మెరుస్తున్నవి |
| హరినీల కీలన + అభ్యంచితములు | = | ఇంద్రనీలమణుల చెక్కడములతో ప్రకాశిస్తున్నవి |
| కురువింద సందర్భ గురుతరంబులు | = | కురువిందాలనే మణుల కూర్పుచేత మిక్కిలిగా గొప్పవైనవి. |
| చతుర్విధ వజ్రదళ సమావేల్లితములు | = | నాలుగు విధాలైన వజ్రపు ముక్కలతో చుట్టబడినవి |
| మహనీయతర హరిత్ + మణి, పరీతంబులు | = | చాలా గొప్పవైన పచ్చని వన్నెగల మణులతో కూడినవి |
| అకలుష, స్థూల మౌక్తిక యుతములు | = | మచ్చలేని లావైన ముత్యాలతో కూడినవి |

| | | |
|---|---|---|
| సొంపు | = | వికాసం; |
| పెంపఱన్ | = | నశింపగా; |

పద్మరాగ, పరీరంభ, భాస్వరములు = పద్మరాగాలను పొదగటం చేత ప్రకాశిస్తున్నవి

దంత విద్రుమకృత సముద్గక భృతములు = దంతాలతో, పగడాలతో చేసిన భరణులలో ఉంచబడినవి

మాతృ భూషలు = అమ్మ సొమ్ములు

అత్తికా మండనములు = అక్కగారి ఆభరణాలు

నిజ యువతి = తన భార్య

**తాత్పర్యం :** ఆ భ్రష్టుడు ఒకరోజు అమ్మ, అక్క, భార్య ధరించే ఆభరణాలన్నింటినీ దంతాల, పగడాల భరిణలలో ఉన్న వానిని, తొమ్మిది విధాలైన రత్నాలతో చేసిన వానిని అన్నింటిని దొంగిలించి (పారిపోయాడు.)

**49 వ పద్యం**

ఒకనాటి రాత్రి పడుపడు
కకుఁజెప్పక యిల్లు వెడలి గాఢ తమ తమో
నికరమ తన దగు తోడుగ
నొకరుఁడుఁ బేరడవి త్రోవ నూడనిఁ బాడెన్

**అర్థాలు :**

గాఢతమ, తమస్ + నికరము + అ = మిక్కిలి దట్టమైన చీకటుల సముదాయమే

పేరు + అడవి = పెద్ద అడవి

ఊడనిఁబాడెన్ = పారిపోయెను

**తాత్పర్యం :** ఒకనాటి రాత్రి తాను పడుకున్న పాన్పుకు కూడా చెప్పకుండా ఇల్లు వదలి గాఢమైన చీకట్లు సముదాయమే తోడుగా ఒంటరివాడై పెద్ద అడవి త్రోవ బట్టి పారిపోయాడు.

విశేషం : పడకకు చెప్పక అనేది ప్రౌఢ ప్రయోగం. ఎవ్వరికీ తెలియకుండా అని భావం.

**50 వ పద్యం :**

శోకించు వృద్ధ భూ సురుఁడాత్మ పితృదత్త
    దర్భముద్రికకుఁ జిత్తంబు గలఁగ
నత్తగారిచ్చిన హరిసుదర్శనపుఁ బే
    రునకు ముత్తయిదువ వనటఁ బొందుఁ
గ్రొత్తగాఁ జేయించు కొన్న ముక్కరకునై
    యడలు దుర్వారయై యాడు బిడ్డ
జామాత వెతబొందు వ్యామోహియై నవ
    గ్రహ కర్ణవేష్టన భ్రంశమునకు

నెంత దుర్బుద్ధి యెంత దుర్భ్రాంతి యహహ

సర్వధనములు నద్దురాచారశీలుఁ

డూచముట్టుగ నిలుదోచి యుఱికి చనుట

యెఱుగరో గాక యెవ్వేళ యెఱుకగలదె.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| వృద్ధభూసురుఁడు | = | పెద్దవాడయిన బ్రాహ్మణుడు (నిగమశర్మ తండ్రి) |
| ఆత్మపితృదత్త దర్భముద్రి కకున్ | = | తన తండ్రి యిచ్చిన దర్భముడి. ఉంగరంకోసం |
| హరి సుదర్శనము + పేరు | = | విష్ణువు సుదర్శనం వంటి ఆకారం గల హారం. |
| ముత్తయిదువ | = | (ఇక్కడ) నిగమశర్మ తల్లి |
| వనటన్ | = | దుఃఖాన్ని |
| దుర్వార | = | వారింపనలవి కానిదై |
| జామాత | = | అల్లుడు |
| వ్యామోహి | = | ఒళ్ళు తెలియనంతటి దుఃఖం కలవాడై |
| నవగ్రహకర్ణ వేష్టన భ్రంశము | = | తొమ్మిది గ్రహాల బొమ్మలు గల చెవికుండలం పోవటానికి |
| ఊచముట్టుగన్ | = | కొంచెం కూడా మిగులు లేకుండా |

**తాత్పర్యం :** ఇంటి యజమాని అయిన ముదుసలి బాపడు తన తండ్రి ప్రేమతో ఇచ్చిన దర్భముడి ఉంగరం పోయిందని గుండెలు అదిరే విధంగా దుఃఖించాడు. అత్తగారిచ్చిన హరిసుదర్శనం హారం పోయిందని పెద్ద ముత్తైదువ పెద్దగా దుఃఖించింది. క్రొత్తగా చేయించుకొన్న ముక్కర కోసం ఆడుబిడ్డ ఆపరాని విధంగా అలమటించిపోయింది. క్రొత్తదియైన నవగ్రహాల బొమ్మలుగల కర్ణాభరణం కోసం అల్లుడు ఒళ్లు తెలియకుండా ఏడువసాగాడు. వాడెంత పాడైన బుద్ధిగలవాడో, ఎంత చెడు తిరుగుళ్ల కలవాడో గానీ అన్ని సొమ్ములూ, కొంచెం కూడా మిగుల్చకుండా ఎత్తుకొని పారిపోయాడు. అన్ని సమయాలలో అందరికీ ఎరుక ఉండదు కదా ! పోయిన సంగతి ఎవ్వరూ తెలుసుకోలేకపోయారు.

### 6. సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. నీ రాకల్ మదిఁగోరుఁ జంద్రు పొడుపున్ నీరాకరంబుంబలెన్**

**పరిచయం :** ఇది తెనాలిరామకృష్ణుడు రచించిన పాండురంగ మహాత్మ్యం తృతీయాశ్వాసంలోని నిగమశర్మ కథలోనిది.

**సందర్భం :** అక్క చెడునడవడి గల తమ్ముని సరిచేసే ప్రయత్నంలో అతనితో సంభాషణ చేస్తున్న ఘట్టం.

**వివరణ :** తమ్ముడు చదువులను సర్వనాశనం చేశాడని తెలిసిన అక్క వ్యంగ్యంగా అతనిని అధిక్షేపిస్తున్నది. ఏరా తమ్ముడా ! పాఠాలకు అంతరాయం కలుగుతుంది అనా నన్ను చూడటానికి ఇన్నాళ్లుగా రాలేదు. మీ బావగారి కోసమైనా రావచ్చును గదా ! నెలకు ఒకసారి మాత్రమే నిండు దర్శనం ఇచ్చే చంద్రుని కోసం సముద్రుడు ఆరాటపడినట్లుగా మీ బావగారు మా బావమరిది ఎప్పుడు వస్తాడో ఎదురు చూస్తూ ఉన్నారు. అంటున్నది.

**2. "సాలగ్రామ ఖనిం జనించునె కదా ! జాత్యల్ప పాషాణముల్"**

**పరిచయం :** తెనాలి రామకృష్ణుడు వ్రాసిన పాండురంగ మహాత్మ్యం తృతీయాశ్వాసంలోని నిగమశర్మ కథలోనిది యీ వాక్యం.

**సందర్భం :** అక్క తమ్మునికి హితబోధ చేస్తున్న సందర్భం

**వివరణ :** సాలగ్రామాలంటే పరమ పవిత్రమైన విష్ణు స్వరూపాలు. వాని వెల రత్నాలవెలవలె చాలా అధికంగా ఉంటుంది. అక్కడే గులకరాళ్లవంటివి కూడా పుడతాయి. అలాగే చాలా గొప్ప లక్షణాలతో అందరి మన్ననలకు పాత్రమైన వంశంలో నీవు చెడబుట్టావు అని అక్క మందలిస్తున్నది.

**3. కర్ణునౌదలనె భారత సంహిత నిల్చు చాడ్పునన్**

**పరిచయం :** ఇది తెనాలి రామకృష్ణుడు రచించిన 'పాండురంగ మహాత్మ్యం' తృతీయాశ్వాసంలోని నిగమశర్మ కథలోనిది.

**సందర్భం :** వేశ్యాకాంతాలోలుడై ఇల్లుగుల్ల చేయుచున్న తమ్మునికి నిగమశర్మ అక్క హితోపదేశం చేయు సందర్భంలోనిదీ వాక్యము.

**వివరణ :** శౌర్యములో అర్జునునకు కర్ణుడు సమానుడని దుర్యోధనుడు భావించుటచేతనే కురుక్షేత్రమున నాశనమైపోయినాడు. కర్ణుడు స్వామిభక్తితో దుర్యోధనుని దుష్టచేష్టలకు దోహదము చేసినాడు. కర్ణుడే అట్లు చేయనిచో భారత యుద్ధమే జరిగి యుండెడిది కాదు. కావుననే కర్ణుని తలపైననే భారత కథ నడచినదని ప్రతీతి ఏర్పడినది.

"కర్ణుని తలపై భారత కథ ఆధారపడినట్లే, తల్లిదండ్రులను, తమ్ములను, భార్యను, పనివారికి, పశువులను చక్కగా చూచి కుటుంబమును నిర్వహింపవలసిన బాధ్యత నీపై ఉన్నదని" నిగమశర్మ అక్క పలుకుల భావము.

**4. కులధ్వంసంబు నీ కర్జమే ?**

**పరిచయం :** తెనాలి రామకృష్ణ కవి రచించిన 'పాండురంగ మహాత్మ్యము'లో తృతీయాశ్వాసంలోని 'నిగమశర్మ అక్క' అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** నిగమశర్మ దుష్ట వర్తనమునుండి మంచి మార్గమునకు త్రిప్పుటకై పుట్టింటికి వచ్చిన అక్క హితోపదేశము చేయుచు కుటుంబ పరిస్థితిని చక్కదిద్దు బాధ్యత నీదేనని చెప్పు సందర్భములోనిదీ వాక్యము.

**వివరణ :** "తమ్ముడా ! ధనవ్యయ మటుండనిమ్ము. ముక్కారులలో పండు పంటకాల్వలు గల కాశ్మీర కేదార ఖండములను తెగనమ్ముట తగినపనియేనా ? నీకు భార్యలేదా ? సోదరులు లేరా ? వంశనాశనము నీకు తగునా ?" అని అక్క పలికెను.

**5. రమించుట యొగ్గె కులాంగనాతతిన్.**

**పరిచయం :** తెనాలి రామకృష్ణ కవి రచించిన 'పాండురంగ మహాత్మ్యము'లో తృతీయాశ్వాసంలోని 'నిగమశర్మ అక్క' అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** వేశ్యాసంగమముతో చెడు నడవడికకు లోనై విశృంఖలముగా విహరించుచున్న తమ్మునికి అక్క హితోపదేశము చేయుచున్న సందర్భములోనిదీ పద్యపాదము.

**వివరణ :** "కామవికారము అతిశయించినచో నిరుపమానమైన శోభతో రూపగుణ శీలాదులచేత ఉన్నతులైన బ్రాహ్మణకాంతలను వేయిమందినైన వరించి సుఖింపుము. గృహస్థులు, మునీశ్వరులు కాదుకదా ! మంచివంశమునందు పుట్టిన స్త్రీలతో కూడి సుఖించుట తప్పు కాదు." అని నిగమశర్మ అక్క పలికెను

**6. తేనె పూసిన కత్తి ధాత్రీసురుండు**

**పరిచయం :** తెనాలి రామకృష్ణకవి రచించిన 'పాండురంగ మహాత్మ్యము'లో తృతీయాశ్వాసంలోని 'నిగమశర్మ అక్క' పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** నిగమశర్మ అక్కగారి నీతియుతమైన, ప్రేమ పూరితమైన మాటలు విని తాత్కాలికముగా తన బుద్ధిని మార్చుకొనినట్లుగా నటించెను. రాజమందిరమునకు రాకపోకలు సాగించెను. మానివేసిన చదువులు మరల చదువసాగెను. భార్యను ఆదరించుచుండెను. గురువులను గౌరవించుచుండెను. గ్రామసభకు వెళ్లి గ్రామకార్యములను తీర్చుచుండెను. అని ఈ విధముగా నిగమశర్మ నటనను వర్ణించి అతడు తేనె పూసిన కత్తివంటి వాడని కవి వ్యాఖ్యానించెను.

**7. ఎంత దుర్బుద్ధి ! ఎంత దుర్భ్రాంతి**

**పరిచయం :** తెనాలి రామకృష్ణకవి రచించిన 'పాండురంగ మహాత్మ్యము'లో తృతీయాశ్వాసంలోని 'నిగమశర్మ అక్క' అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భము :** నిగమశర్మ అక్క హితబోధ విని, మనసు మారినట్లు నటించుచు ఒకనాటి రాత్రి ఇంటిలోనున్న సొమ్ములన్నియు అపహరించి చీకటియే తోడుకాగా అరణ్యమార్గమున పడి పారిపోయెను.

**వివరణ :** తెల్లవారి తన తండ్రి యిచ్చిన దర్భముడి ఉంగరము పోయినందుకు తండ్రి, రత్నహారము పోయినందుకు తల్లి, ముక్కెర పోయినందుకు అక్క దుఃఖించిన సమయమున అతని వేశ్యాలోలత్వము ఎంత దుర్భ్రాంతియా అని కవి వ్యాఖ్యానించినాడు.

## ప్రశ్నలు - సమాధానాలు

**1. తెనాలి రామకృష్ణుని కవితా వైభవాన్ని వర్ణించండి.**

తెనాలి రామకృష్ణుడు తెలుగు వాఙ్మయంలో ఒక విలక్షణత గల కవి. అందువలననే విశ్వనాథ సత్యనారాయణ ఆయనను "రామకృష్ణుడు సురారామ గజము" అని అభివర్ణించారు. అంటే ఐరావతం అని అర్థం. ఐరావతం ఒక్కటే ఏనుగులలో తెల్లగా ఉంటుంది. ఆ విధంగా అతడు తక్కిన కవులందరికంటె భిన్నంగా ఉంటాడని ఆ వర్ణనలోని భావం. పదాలకూర్పులో, భావాల సౌందర్యంలో వర్ణ్య వస్తువు స్వభావ నిరూపణలో అతనిది ఒక వింత ధోరణి.

1. పదాల కూర్పు : "పాండురంగ విభుని పదగుంభనము" అనేమాట లోకంలో ప్రసిద్ధి కెక్కింది. అతడు పదాలను కూర్చటంలో ఒక ప్రత్యేకతను మనకు స్ఫురింపజేస్తాడు. ఒకటి రెండు ఉదాహరణలను చూద్దాం.

అక్క వచ్చినది తెలియక ఆకలిని తీర్చుకొనటం కోసం నిగమశర్మ ఇంటికి రావటం 'చుక్కతెగిన వడుపున' ఉందట. ఆకాశంనుండి అప్పుడప్పుడు ఉల్కలవంటివి రాలుతూ ఉంటాయి. ఎప్పుడు, ఎందుకు, ఎలా అనేది ఎవరూ ఊహించలేరు. అతడు ఆ విధంగా వచ్చిపడ్డాడట.

వచ్చిన తమ్ముడు ఎప్పుడు ఎలా పోతాడో అని అక్క దిగులు. అతనిని ఆపటానికి ఆమె వంటకాలన్నింటినీ 'కనుగీటినంత లోపల' సిద్ధం చేసిందట. ఈ పదం ద్వారా వండటంలోని ఆమె అతి నైపుణ్యం, తమ్ముణ్ణి కట్టిపడవేసే వ్యగ్రతా రెండూ ఏకకాలంలో అభివ్యక్తమవుతున్నాయి.

ఇలాగే "నీకు కావలసెనా హరికేస్తుభమైన నిచ్చెదన్" అంటుంది. అది అసాధ్యమైన పని. అయినా కార్యసాధనకు సాధారణంగా తోడ్పడే వైఖరిని అది తెలియజేస్తుంది. ఇట్టివే ఇరుగురులు, పిల్లి శీలము, 'చంద్రుపొడుపున్ నీ రాకరంబుంబలె మీ బావ నీ రాకల్ మదిగోరు' మొదలైన పదవాక్యబంధాల అందాలు అందరూ భావించదగినవి.

2. భావాల సౌందర్యం : i) అక్క మైలపడిన తమ్మునికి చిఱుతవాని మేనల్లుని నిందమని చంకకిచ్చిందట. ఇది సాధారణంగా మనం చూస్తుండే ఒక మనోజ్ఞ దృశ్యం.

ii) సీత్కారముల తోడ నీళ్ల గ్రుక్కుట, అంట్లను బొడుచుట, గోరుముక్కుల దిగదువ్వుట, తూరుపెత్తుట అనే కమనీయదృశ్యం పల్లెలలో ప్రేమాదరాలు పొంగి పొరలే వ్యక్తులలో అతి సుందరంగా కనిపించే దృశ్యాలు.

iii) క్రొత్త పెండ్లికూతురు నలుగురిలో మగనికి ఉపచారాలు చేయటానికి సిగ్గుతో జంకుతూ ఉంటుంది. పెద్దవయసుగల ఆడుబిడ్డలు చొరవ తీసుకొని వారిని ఆ జంకునుండి తప్పించి కార్యరంగంలోనికి దింపటానికి విచిత్రమైన తీరులో ప్రయత్నిస్తారు. అటువంటిదే నిగమశర్మ అక్క తనకు 'వెనుక దెస నెడ గలిగియున్న తత్కళత్రంబునకు నేత్ర సంజ్ఞ' చేయటం.

3) స్వభావచిత్రణ : స్వభావచిత్రణ చేత విషయాన్ని కనులముందు నడుస్తున్న విధంగా రూపొందించటం కొందరు కవులకు మాత్రమే తెలిసిన విషయం. రామలింగడు అందులో అందెవేసిన చేయి.

i) "మలయజ చర్చచేసి గృహమాధ వదత్తు మనోజ్ఞ భోజనంబు లొసఁగెఁ దల్లి దండ్రి నిజపుత్రులు భర్తయుఁదో భుజింపగన్" ఇది ఒక సంప్రదాయ కుటుంబంలో అందరూ కలసిమెలసి భోజనం చేస్తూ ఆనందించే ఒక మధుర సన్నివేశం. ఈ వర్ణన అక్షరరూపంలో ఉన్నా మనకు కనులకు గట్టినట్లు ఉండటం గమనించదగిన విషయం.

ii) అమ్మసొమ్ములు, అక్కసొమ్ములు, ఆలిసొమ్ములు హరించిన సన్నివేశంలో వారు వారు ఒక్కొక్కదానికై విలపిస్తున్న ఘట్టఁ కూడా వారి రూపురేఖలను మన కనులముందు కదలాడే విధంగా చేస్తుంది.

రామకృష్ణుని కవిత్వాన్ని ఈ విధంగా రేఖా మాత్రంగా చూశాం.

**2. నిగమశర్మ అక్క పాత్ర చిత్రణము**

నిగమశర్మ అక్కకు తెనాలి రామకృష్ణకవి పేరుపెట్టలేదు. పేరులేని ఈ పాత్రను అపూర్వమైన అమృతమూర్తిగా రామకృష్ణకః తీర్చిదిద్దాడు. ఈమె సభాపతిగారి పెద్దకూతురు. ధర్మార్థములయందు జాగ్రత్త, తెలివితేటలు, వాక్చాతుర్యము, నిర్మల శీలము, పనిపాటలలో నైపుణ్యము అనేవి ఈమెకు వెన్నతో పెట్టిన విద్యలు.

వ్యసనపరుడై పుట్టింటివారికి వేదన కలిగిస్తున్న తమ్ముడైన నిగమశర్మను గూర్చిన వార్తలు నిగమశర్మ అక్క చెవినపడ్డాయి. నిగమశర్మకు బుద్ధిచెప్పి ఇంటినీ, తమ్ముణ్ణీ సరయిన మార్గంలో పెట్టగలననే ధైర్యంతో ఈ ఇల్లాలు పిల్లలనూ, భర్తనూ వెంటబెట్టుకొని పుట్టింటికి వచ్చింది. తన మాటలు పెడచెవిన పెట్టటానికి ప్రయత్నిస్తాడేమో, బావగారి ముఖం చూసి అయినా సిగ్గుతో, అవమానంతో తమ్ముడు మారవచ్చునని, తన పిల్లలను చూసి మార్పుకలిగి తానుకూడ పిల్లలు కలవాడై సంసారం సాగిస్తాడేమోననే ఆశతో నిగమశర్మ అక్క సకుటుంబంగా వచ్చింది. దీనిలోనే ఆమె కార్యసాధనా ప్రజ్ఞ తెలుస్తోంది.

పుట్టింటికి రాగానే మిగిలిన వారితో ఏడుస్తూ కూర్చోక మెల్లగా ఇంటి కళ్ళాలు తన చేతిలోకి తెచ్చుకోడం ప్రారంభించింది. ఇంటికి మూలస్థంభాలైన తల్లిదండ్రులను ముందు సముదాయించింది. దైవపూజ సక్రమంగా జరిగేలా ఏర్పాటుచేసి, అతిథి సత్కారాలు, పాడిపంటలతో విలసిల్లేట్లుగా మూలధనాన్ని భద్రంచేసి, గ్రంథాలయ రక్షణను భర్తకు అప్పగించి, పొలాలకు తన పిల్లలను కాపలాపెట్టింది. కాని అంతులేని దుఃఖసముద్రంలో ఉన్న మరదలిని చూడగానే ఆమెకు దుఃఖం ఆగలేదు.

ఇంతలో 'చుక్క తెగిపడినట్లు' ఒకరోజున నిగమశర్మ ఇంటికి వచ్చి అక్కను చూసి పారిపోలేక నమస్కరించి తలవంచుకుని నిలిచాడు. నిగమశర్మ అక్క తమ్ముణ్ని ప్రేమతో ఆలింగనం చేసుకోబోయి, వేశ్యకాంతల నఖక్షతాలతో కూడిన అతని శరీరాన్ని చూచి ఏవగించుకుంది. అది అణచుకొని "సీమంతపు పెండ్లి కొడుకువు కమ్ము" అని తమ్ముని హేతుగర్భంగా ఆశీర్వదించింది. భార్యతో కాపురంచేసి సుపుత్రుని పొందుమని ఆమె దీవెనలోని భావం. ఆ దుర్విదగ్ధునికి ఈ ఆశీస్సు ఒక చెంపపెట్టు లాంటిది.

వేశ్యకాంతా మోహంతో అక్కడినుండి వెళ్ళిపోవడానికై తొందరపడుతున్న నిగమశర్మకు, [illegible] తమ్ముని ముఖంలో ఆకలి గమనించి, తమ్ముని నిలబెట్టటానికి అదే దారి అని 'క్షణంలో వంట సిద్ధం చేస్తాను. మీ బావతోపాటు తిందువుకాని' అని పలికి, మరదలికి కనుసైగచేసింది. మరదలిచేత సపర్యలు చేయించి, తమ్ముడికి తలంటించి, కొత్తబట్టలిచ్చి, చందనాదులతో సత్కరించి, విందున కాహ్వానించింది. తమ్ముని పంక్తిలో భర్తనూ, పిల్లలనూ, తలిదండ్రులనూ కూర్చుండబెట్టి తనే తృప్తిగా వడ్డించింది. భోజనానంతరం నిగమశర్మకు భార్య తాంబూలం ఇచ్చింది. ఇప్పుడు ఏది చెప్పినా వినడానికి శాంతంగా, సిద్ధంగా ఉన్న తమ్మునికి ఉపదేశం చేయడానికై నిగమశర్మ జుట్టుముడి విప్పి పేలుకుక్కి, మెడమన్నునలచి, చేతులు కడుగుకొంది - ఈ సేవలన్నీ తమ్ముని మనసు మార్చుటకై ఓర్పుగా, ప్రేమ వ్యక్తమగునట్లుగా చేయుటలో ఆమె కార్యసాధనా నైపుణ్యం వెల్లడి అవుతూంది.

అప్పుడు దాసి తెచ్చిన పీటమీద, పద్మకర్ణికమీద కొలువున్న లక్ష్మీదేవి వలె కూర్చుండి తమ్మునికి ఉపదేశం ప్రారంభించింది. "ఏరా! తమ్ముడా ! నీవు ప్రారంభించిన వేద పాఠమునకు ఆటంకము కలుగుననియా నన్ను చూచుటకు రాలేదు." అని ప్రేమతో ఆరంభించి 'సాలగ్రామాల ఖనిలో గులక రాయివలె ఆ తండ్రి కడుపులో ఎలా పుట్టావు ?' అని కోపంతో ప్రశ్నించింది తమ్మునితోడి వారు తమ్ముని శీలము పిల్లి శీలమనీ, అతని చదువు చిల్కల చదువు అనీ నవ్వుతున్నారనీ అలా ఎందుకు బేలవయ్యావు అని కుటుంబ గౌరవాన్ని కాపాడమని బాధ్యత గుర్తుచేసింది.

నిగమశర్మ అక్క ప్రజ్ఞావంతురాలు కనుక చెడిన వారిని తిట్టినచో మరింత చెడిపోవుదురని, కార్యసాధన ప్రధానమని భావించి, సామరస్యముగ మాట్లాడనారంభించింది. భారతానికి కర్ణుడివలె నీవే ఈ ఇంటికి ఆధారమని తమ్ముడిని పొగిడింది. నీవు యజ్ఞం చేస్తే ఆ వేదికపై కూర్చుంటానని గంపెడాశతో వేయిమందిలో చెప్పుకున్నానని సౌభ్రాతాన్ని చూపి, కన్నీరు పెట్టుకోబోయింది. వారకాంతా సంసర్గాన్ని వీడుమని నీ కవసరమైనచో హరికొస్తుభమైన తెచ్చియిత్తునని ధీరంగా ప్రతిజ్ఞ చేసింది.

ఈమె చివరకు తన ముక్కరను అపహరించాడని దుఃఖం ఆపుకోలేక ఏడ్చింది. రామకృష్ణ కవి పరిహాస ప్రియత్వానికి ఇదొక మచ్చుతునక.

ఆత్మవిశ్వాసము, వంశగౌరవము, సంభాషణా నైపుణ్యము, సామర్థ్యము, హృదయ కోమలత్వము, లోకజ్ఞత మూర్తీభవించిన నిగమశర్మ అక్క ఒక అపూర్వ సృష్టి అనుటలో సందేహములేదు.

## ఛందస్సు

**1. ఉత్పలమాల :** ప్రతిపాదమునకు భ,ర,న,భ,భ,ర,వ అను గణములు వరుసగా నుండును. యతి 10 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| ఉదా : | పుష్టిస | మస్తముం | గడపి | పుచ్ఛి త | ఉగ్రజా | పూర్ణ చి | త్తయై |
| | భ | ర | న | భ | భ | ర | వ |

**2. చంపకమాల :** న,జ,భ,జ,జ,జ,ర అను గుణములు నాలుగు పాదములందును వరుసగా నుండును. యతి 11 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| ఉదా : | పడప | డంబాలు | చున్వడ | కుపట్టి | న తల్లి | నిదండ్రి | నేలలో |
| | న | జ | భ | జ | జ | జ | ర |

3. **శార్దూలము :** మ,స,జ,స,త,త,గ అను గణములు వరుసగా నుండును. యతి 13 వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ఉదా : | ప్రారంభిం | చినవే | దపాఠ | మునకున్ | బ్రత్యూహ | మౌనంచు | నో |
| | మ | స | జ | స | త | త | గ |

4. **తేటగీతి :** 1 సూర్యగణము, 2 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు ప్రతిపాదమునను ఉండును. యతి 4 వ గణము మొదటి అక్షరము. ప్రాసనియమము లేదు. ప్రాసయతి వేయవచ్చు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | U I | I I U I | I I U I | U I | I I I |
| ఉదా : | శీల | మఖిలంబు | నిదిపిల్లి | శీల | మనుచు |

5. **కందము :** గగ, భ,జ,స,నల అను 5 గణములతో కూడి యుండును. 1, 2 పాదములను పూర్వార్థముగా 3, 4 పాదములను ఉత్తరార్థముగా వ్యవహరించుదురు. పుర్వార్థమున 8 గణములు (అనగా మొదటి పాదమున 3 గణములు, రెండవ పాదమున 5 గణములు) ఉత్తరార్ధమున 8 గణములు (3 వ పాదమున 3 గణములు, 4 వ పాదమున 5 గణములు) ఉండును. బేసి గణములలో 'జ' గణము (అనగా 1, 3, 5, 7 స్థానములలో) ఉండరాదు. 6 వ గణముగా నలము కాని, జగణము కాని తప్పనిసరిగా ఉండవలెను. 8 వ గణముగా గగము కాని, సగణము కాని ఉండవలెను. 4 వ గణము మొదటి అక్షరమునకు యతి. ప్రాసనియమము కలదు.

| | | | |
|---|---|---|---|
| | U I I | U I I | I I I I |
| ఉదా: | ఇంతలు | నంతలు | నగుతన |
| | భ | భ | నల |

| | | | | |
|---|---|---|---|---|
| U U | I I U | I U I | U I I | U U |
| సంతా | నముచం | ట వెంట | సందడి | సేయన్ |
| గగ | స | జ | భ | గగ |

6. **సీసము :** 6 ఇంద్రగణములు, 2 సూర్యగణములు వరుసగా నుండును. 1, 3, 5, 7 గణముల మొదటి అక్షరములకు యతి. ప్రాసయతి లేదు. ప్రాస యతి వేయవచ్చు. సీసము తరువాత ఆటవెలది కాని, తేటగీతిని కాని రచింపవలెను.

| | | | | |
|---|---|---|---|---|
| | I I U I | U I U | I I I U | I I U I |
| ఉదా : | పరమేష్ఠి | నుండి నీ | తరముదా | కవిశుద్ధ |
| | సల | ర | సల | సల |

| | | | |
|---|---|---|---|
| I I U I | U U I | I I I | U I |
| తరమైన | వంశంబు | దలప | వైతి |
| సల | త | న | హ |

మత్తేభము, ఆటవెలది ఈ పాఠ్యభాగంలో ప్రయోగింపబడలేదు.

## అలంకారములు

**I. ఉపమాలంకారము :** ఉపమానోపమేయములకు మనోహరమైన సాదృశ్యము (పోలిక) వర్ణింపబడినచో ఉపమాలంకారమగును.

ఉదా : "మీ బావయున్ నీ రాకల్ మదిఁగోరు చంద్రుపొడుపున్ నీరాకరంబుంబలెన్"

ఈ పద్యపాదమునందలి అలంకారము 'ఉపమ'

చంద్రోదయము కొరకై సముద్రుడు ఎదురుచూచునట్లుగా, మీ బావ నీ రాక కొరకై ఎదురు చూచుచుండునని నిగమశర్మ అక్క తమ్మునితో పలికెను.

ఉపమేయము - బావ, ఉపమానము - సముద్రుడు (నీరాకరము)

మదిఁగోరుట - సమానధర్మము, ఉపమావాచకము - బలెన్.

నిగమశర్మ బావగారిని నీరాకరముతో (సముద్రునితో) పోల్చుటవలన ఉపమాలంకారము.

ii. ఉదా : చేటికానీత పీఠికాసీన యగుచు

బద్మకర్ణిక కొలువున్న పద్మవోలెఁ

గుడివలన నింతయోరగా ఁగొమరు మెఱసి

బిడ్డ చనుఁద్రావ నిట్లను బిసరుహాక్షి.

నిగమశర్మ అక్కను లక్ష్మీదేవితో పోల్చుటవలన ఈ పద్యమున ఉపమాలంకారము కలదు.

ఉపమేయము - పీటమీద కూర్చున్న నిగమశర్మ అక్క

ఉపమానము - పద్మ కర్ణిక మీద కొలువున్న లక్ష్మీదేవి

సామాన్య ధర్మము - కొలువు తీరియుండుట (కూర్చుండుట)

ఉపమావాచకము - పోలెన్

**2. రూపకాలంకారము :** ఉపమానోపమేయములకు అభేదమును వర్ణింపబడినను, ఉపమాన ధర్మమును ఉపమేయముపై ఆరోపించినను "రూపకాలంకారమగును."

i. ఉదా : "తండ్రియను నబ్ధిం జంద్రుఁడై తోచినన్ బోలున్ గాక."

ఈ పద్యపాదమున తండ్రికి - సముద్రమునకు;

తనయునకు - చంద్రునకు అభేదము చెప్పి

ఉపమేయము మీద ఉపమానమును ఆరోపించిన కారణముగా రూపకాలంకారము ఏర్పడుచున్నది.

ii. ఉదా : "తేనె పూసిన కత్తి ధాత్రీ సురుండు"

కత్తికి తేనెపూసినను దాని సహజగుణము నశింపదు. నిగమశర్మ తేనెపూసిన కత్తి అని చెప్పుటచేత వాని కపట నటనము సూచింపబడినది.

ధాత్రీసురునకు (నిగమశర్మకు), తేనెపూసిన కత్తికి అభేదము వర్ణింపబడుటచే ఇది రూపకాలంకారము.

3. **అతిశయోక్తి :** ఉన్న విషయమును అధికము చేసి చెప్పుట అతిశయోక్తి.

ఉదా : "ఆ పైదలి వ్యాపృత నిజనిశ్వాస జతాపంబునన్ కొంత కొంత తప్తము కాగన్ శీతలవారిన్ ప్రాణేశ్వరు శ్రీపాదద్వయము కడిగెన్"

నిగమశర్మ భార్య భర్త పాదాలను తన నిట్టూర్పుల వలన పుట్టిన వేడికి కొంచెం వెచ్చబడిన చల్లని నీటితో శుద్ధిచేసినది.

నిట్టూర్పులతో చల్లగా ఉన్న నీళ్ళు వేడెక్కుట ఉండదు. కనుక సంబంధం లేనిచోట ఉన్నట్లుగా వర్ణించుట వలన అతిశయోక్తి.

4. **స్వభావోక్తి :** వస్తువుయొక్క జాతి, గుణాదుల యందున్న స్వభావమును సహృదయ రంజకముగా వర్ణించుట 'స్వభావోక్తి' యగును.

ఉదా i : ఎలయ సీత్కారములతోడ నీళ్ళు గ్రుక్కి
యంటు నంటులు పరికించి యంట్లఁబొడిచి
ధోర్ధుముక్కల దిగదువ్వి తూరుపెత్తి
నెఱులఁగతిగిన పేల నన్నింటిఁ దిగిచి

నిగమశర్మ అక్క నిగమశర్మ తలలోని పేనుగ్రుడ్లను క్రుక్కి, అంటుపేలను వెదకి చూచి క్రుక్కి, గోటికొనలతో జుట్టును క్రిందికి దువ్వి వెంట్రుకలు జాడించి, వెండ్రుకలలోని పేలను అన్నింటినీ ఏరివేసింది

నిగమశర్మ అక్క తమ్మునకు చేసిన ఉపచారములను యథాతథముగా మనోరంజకంగా కవి వర్ణించాడు కాబట్టి ఇది "స్వభావోక్తి" అలంకారము.

ఉదా ii : మెడమన్ను నలచి యలకలు
ముడిగొని నిజపాణి పద్మములు గరగరగా
గడిగికొని తనకు మరదలు
విడెమొ సంగుచు ఁబసిమి పసిడి వీవన వీవన్.

నిగమశర్మ అక్క, తమ్ముని మెడమన్ను నలచి, తలవెంట్రుకలు ముడివేసి, చేతులు కడుగుకొని, తమ్ముని భార్య తనకు తాంబూలము ఇస్తూ పచ్చని బంగారు విసనకర్రతో విసురుతున్న సందర్భములోని ఈ పద్యమున నిగమశర్మ అక్క తమ్మునకు చేసిన ఉపచారములు కవి మనోరంజకముగా వర్ణించుటచే 'స్వభావోక్తి' అలంకారమీ పద్యమున కలదు.

**సారాంశము :** వేద శాస్త్రాధ్యయన సంపన్నుని యింట ఉద్భవించిన నిగమశర్మకు పేరులేని అతని అక్క చేసిన ఉపదేశమే పాఠ్యభాగమున మిక్కిలి రమణీయముగా వర్ణింపబడినది. అయినను తేనె పూసిన కత్తిగా నిగమశర్మ తనను తాను నిరూపించుకొనినాడు.

**ప్రశ్నలు :**

1. నిగమశర్మ అక్క తమ్ముని వల్ల పాడయిన తన పుట్టింటిని చక్కదిద్దిన విధమేమి ?

2. నిగమశర్మ అక్క తమ్మునకు కావించిన ఉపదేశ సారాంశాన్ని వ్రాయండి ?

రచయిత :

- ఆచార్య శలాక రఘునాథశర్మ
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం,
అనంతపూర్.

**తాత్పర్యం :** అక్క ఈ విధంగా ప్రియంతో నీతిని బోధిస్తే, చాలా దినాలనుండీ పాడైపోయి బక్కచిక్కినవాడు కనుక అన్నమూ, నీరూ దొరకుతుందనే ఆశతో దానిని ఆదరించాడు.

**విశేషం :** బుద్ధిలో మారలేదు. పబ్బం గడుపుకోవటానికి మాత్రమే ఆదరించాడని పద్య తాత్పర్యం.

**46 వ పద్యం**

రాజాలయమునకు రాకపోకలు సేయు
మాసిన చదువులు మరలఁజదువు
నిన్నాళ్ళ నెచ్చెలు లెదురైన తలవంచు
కులవధూ రత్నంబుఁ గుస్తరించు
నాచార్యజనము ప్రత్యహము సంభావించు
నర్చావళికి నుపహార మిచ్చు
నర్చించు కుతపవేళా గతాతిథికోటిఁ
బసి నేదు దర్శించుఁ బైరు పచ్చఁ
దండ్రి యుద్గమనీయంబు తానె యుదుకు,
నత్తికా భర్తతో నవ్వు నల్పసరణి
గ్రామ కార్యంబు దీర్చు నంగడికి వచ్చి
తేనె పూసిన కత్తి ధాత్రీసురుండు.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కులవధూ రత్నంబు | = | రత్నంవంటి భార్యను |
| కుస్తరించున్ | = | సంతోషపెట్టును |
| ప్రత్యహము | = | ప్రతిదినము |
| అర్చ + ఆవళికిన్ | = | అర్చింపబడే దేవతల సముదాయానికి |
| ఉపహారము | = | నైవేద్యం |
| కుతప, వేళా + ఆగత + అతిథికోటిన్ | = | పగలు రెండున్నరజాములు గడచిన కాలంలో వచ్చిన అతిథుల సముదాయాన్ని |
| పసిన్ | = | పశువులను |
| ఏదున్ | = | పాలిస్తూ ఉన్నాడు |
| ఉద్గమనీయంబు | = | ధోవతిని |
| అత్తికా భర్తతోన్ | = | అక్క భర్త అయిన బావతో |
| అంగడికిన్ | = | నలుగురు కలిసే రచ్చబండ దగ్గరకు |

**తాత్పర్యం :** తేనె పూసిన కత్తివంటి ఆ బాపనయ్య అక్క మాటలు విని మెల్లమెల్లగా రాజమందిరానికి రాకపోకలు ప్రారంభించాడు. మరచిన విద్యలన్నింటినీ మళ్ళీ చదువుతున్నాడు. ఇంతవరకు మిత్రులుగా ఉన్నవారెదురైనపుడు సిగ్గుతో తల దించుకుంటున్నాడు. భార్యను సంతోషపెడుతున్నాడు. గురువులను ప్రతిదినం మన్ననతో చూస్తున్నాడు. దేవతార్చనలు చేస్తున్నాడు. భోజనం వేళకు వచ్చిన అతిథులను ఆదరిస్తున్నాడు. పాడిపంటలను చూచుకుంటున్నాడు. తండ్రి కట్టి విడిచిన ధోవతులను తానే ఉదుకుతున్నాడు. బావగారితో చిన్నగా మాటాడుతున్నాడు. రచ్చబండ దగ్గరకు వచ్చి ఊరి పనులను నిర్వహిస్తున్నాడు.

**విశేషం :** తేనె పూసిన కత్తి - ఇది ఒక జాతీయం. తేనె ఉన్నది కదా అని ఆశతో నాకితే నాలుక తెగిపోతుంది. అలా ఊరించి ప్రమాదం కలిగించేవానిని ఈ పదబంధంతో వ్యవహరిస్తారు.

**48 వ పద్యం**

గోమేధికోపలాంకుర మానితంబులు
పుష్యరాగచ్ఛటా పుంఖితములు
వైడూర్య సంధాన వర్ణనీయంబులు
హరినీల కీలనా భ్యంచితములు
కురువింద సందర్భ గురుతరంబులు చతు
ర్విధ వజ్రదళ సమావేల్లితములు
మహనీయతర హరిన్మణి పరీతంబులు
నకలుష స్థూల మౌక్తిక యుతములు
పద్మరాగ పరీరంభ భాస్వరములు
దంత విద్రుమకృత సముద్గక భృతములు
మాతృభూషలు నత్తి కా మండనములు
నిజ యువతి దాల్చు సొమ్ములన్నియు హరించి.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| గోమేధిక + ఉపల + అంకుర మానితంబులు | = | పసుపువన్నె గల గోమేధికములనే రత్నాల పొడితో విలువకలవిగా చేయబడినవి. |
| పుష్యరాగచ్ఛటా పుంఖితములు | = | పుష్యరాగాలనే రత్నాలు పొదిగినవి |
| వైఢూర్యసంధాన వర్ణనీయంబులు | = | వైఢూర్యములనే రత్నాల కూర్పుతో మిలమిల మెరుస్తున్నవి |
| హరినీల కీలన + అభ్యంచితములు | = | ఇంద్రనీలమణుల చెక్కడములతో ప్రకాశిస్తున్నవి |
| కురువింద సందర్భ గురుతరంబులు | = | కురువిందాలనే మణుల కూర్పుచేత మిక్కిలిగా గొప్పవైనవి. |
| చతుర్విధ వజ్రదళ సమావేల్లితములు | = | నాలుగు విధాలైన వజ్రపు ముక్కలతో చుట్టబడినవి |
| మహనీయతర హరిత్ + మణి, పరీతంబులు | = | చాలా గొప్పవైన పచ్చని వన్నెగల మణులతో కూడినవి |
| అకలుష, స్థూల మౌక్తిక యుతములు | = | మచ్చలేని లావైన ముత్యాలతో కూడినవి |

ఖండం : 1

# ప్రాచీన పద్యభాగము

పాఠం : 4

# "సీతా పరిత్యాగము"

- కంకంటి పాపరాజు

(ఉత్తర రామాయణము, షష్ఠాశ్వాసము - 266 - 295 పద్యాలు)

**శీర్షికలు :**

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠినపదాలకు అర్థాలు
5. ప్రతిపదార్థ తాత్పర్యములు
6. సందర్భ సహిత వ్యాఖ్యలు
7. ప్రశ్నలు - సమాధానాలు
8. ఛందస్సు
9. అలంకారములు

**లక్ష్యం :** కావ్యం రసమయంగా ఉంటుంది. అందులోను కరుణరసం అతి శీఘ్రంగా హృదయాన్ని లోకొంటుంది. ఉత్తర రామాయణ కావ్యంలోని కరుణరసాత్మకమైన సీతా పరిత్యాగ ఘట్టాన్ని పాఠకుని హృదయం దుఃఖమయ్యేట్లు రచించిన పాపరాజు అద్వితీయ భావనా శక్తిని ఈ పాఠం నిరూపిస్తుంది.

## 1. కవి పరిచయం :

ఈ పాఠ్య భాగం కంకంటి పాపరాజు రచించిన ఉత్తర రామాయణం కావ్యంలోనిది. తెలుగులో ఎందరో రామాయణ కథను ఆధారంగా చేసికొని అనేక కావ్యాలు వ్రాశారు. మొత్తం కథను కొందరూ, అక్కడక్కడ ఘట్టాలను తీసుకొని కొందరు గ్రహించి కవితా రూపంలో శ్రీమద్రామాయణాన్ని వెలయించారు.

రామాయణంలో ఏడవది ఉత్తరకాండం. రావణ వధానంతరం జరిగిన రామకథ ఇందులో వర్ణితమైనది. ముఖ్యంగా పూర్వ రామాయణంలో ఉన్న అనేక ప్రశ్నలకు సమాధాన గర్భితంగా రూపొందిన ఉత్తర రామాయణం ఉత్తర-సమాధాన- రూపమైన రామాయణం అనుకోవటం కూడా సమంజసమే.

తెలుగులో ఉత్తర రామకథను మహాకవి తిక్కన కూడా రచించాడు. అయినా ప్రసన్న మధురంగా ఉండటం చేత కంకంటి పాపరాజు రామాయణానికి కూడా మంచి ప్రశస్తి ఏర్పడింది.

కంకంటి పాపరాజు 16, 17 శతాబ్దాలకు సంబంధించినవాడనీ, నెల్లూరి సీమకు చెందినవాడనీ కవిచరిత్రకారుల నిర్ణయం. తండ్రి అప్పయమంత్రి, తల్లి నరసమాంబ మదనగోపాల నామక శ్రీకృష్ణుడు ఈయనకు ఇష్ట దైవం "విష్ణు మాయా విలాసం" ఇతని మరొక రచన. ఈ కావ్యరచనలో పుష్పగిరి తిమ్మన ఇతనికి తోడుపడ్డట్లు తెలియవస్తున్నది.

ఇతడు తన రచనా ప్రవృత్తిని గూర్చి రెండు పద్యాలు మనోజ్ఞంగా చెప్పాడు.

"మానవ కర్మ భూమి పయి మానుష దేహముతో హితాహిత
జ్ఞాన మెఱుంగు బ్రాహ్మణుడు చారుకవిత్వము నేర్చి జానకీ
జాని కథల్ రచింపక యసత్కథ లెన్ని రచించె నేనియున్
వాని వివేక మేమిటికి వాని కవిత్వ మహత్వమేటికిన్"

రామకథ వ్రాయకపోతే బ్రదుకే వ్యర్థం కవులకు- అన్నట్లు ఉగ్గడించాడీ మహా భక్తుడు.

తిక్కన మహాకవి ఉత్తరరామాయణ కథ వ్రాశాడు కదా! మళ్ళీ యిదెందుకని నిరసించకండి అంటూ ఇలా అన్నాడు.

వరుసం దిక్కన యజ్వ నిర్వచన కావ్యంబై తగం జెసె ను
త్తరరామాయణ మందున న్మతి ప్రబంధంబూని నిర్మించు టే
సరసత్వంబని ప్రాజ్ఞులార! నిరసింపం బోకుడీ రాఘవే
శ్వరు చారిత్రము నెంద రెన్ని గతులన్ వర్ణించినం గ్రాలదే..

ఇవి కవి మంచితనానికి, రామాయణ రసమాధురీ పారవశ్యతకూ చక్కని ప్రకటన.

ఇతడు రచించిన సీతాపరిత్యాగ ఘట్టం మనకు ప్రస్తుత పాఠ్యాంశం.

## 2. పాఠ్య భాగ సందర్భం :

సీత నిండు గర్భిణి. శ్రీరామచంద్రుడు ఆమెను అనునయంగా లాలిస్తూ నీ మనసులో ఏదైనా కోరిక ఉంటే తెలుపుమని అడిగాడు. అరణ్యంలో మునికాంతలతో పాటు ఫలాదులను భుజిస్తూ ఒక దినం గడపాలని సీత తన కోరికను వెలువరించింది. రాముడు దానికి సంతోషపడి మరునాటి ఉదయమే పంపుతానని చెప్పాడు. తరువాత ఆయన కొలువులోనికి ప్రవేశించాడు. అక్కడ అతడు తన చారుడు భద్రుని ద్వారా పౌరులు సీతను గూర్చి పలికిన నిందా వాక్యాలను తెలుసుకొని చాలా దుఃఖపడ్డాడు. ఒక ఏడు కాలం పరస్థలం లంకలో ఉన్న సీతయందు వ్యామోహం వదలలేక ఆమెను తెచ్చి మరల ఏలుకుంటున్నాడనేది ఆ నింద. ఆదర్శ ప్రాయుడైన రాజు ప్రజల మనో భావాలను మన్నించాలనే సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మి ఆచరణలో పెట్టే స్వభావముగల రాముడు సీతను అరణ్యంలో వదలి రమ్మని లక్ష్మణుని ఆదేశించాడు. రాజాజ్ఞ అనుల్లంఘనీయం కనుక లక్ష్మణుడు తనకు సీత శీలం మీద ఎంతో గౌరవం ఉన్నా సీతను అరణ్యంలో వదలటానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ మెల్లగా శ్రీరాముని మనోభావాన్ని వెల్లడించటం, సీత స్పందన మొదలైనవి ప్రకృత పాఠ్యాంశాలు.

## 3. పాఠ్యభాగం సారాంశం :

లక్ష్మణుడు రాముని ఆజ్ఞను శిరసావహించి సీతను రథముపై నెక్కించుకొని, దీనవదనుడై, చెప్పుటకు నోరురాక, చెప్పక తప్పక కన్నీరు కారుస్తూ రామాజ్ఞను సీతాదేవికిట్లు నివేదించెను.

"తల్లీ! ఇంత పనిచేయడానికి సిద్ధపడి వచ్చి నీకు విషయం చెప్పకుండా ఉంటానా? వినుము : రావణునిచేత అపహరింపబడ్డ సీతను రాముడు మరల ఏలుకుంటున్నాడని దుష్టబుద్ధులు నిందింపగా, ఆ పలుకులు హృదయంలో బాణాల్లాగా నాటుకోగా రాముడు నిన్ను అరణ్యాలలో విడిచిపెట్టి రమ్మని చెప్పాడు. మునీశ్వరులు నివసించు ఈ అడవులలో నీవెట్లు కాలము గడిపెదవో? లోకనిందకు భయపడి శ్రీరాముడు నిన్ను అడవులలో దింపి రమ్మనగా విని, సహించి కానన సీమలకు తీసికొనివచ్చిన నావంటి మూర్ఖుని బ్రహ్మ ఎట్లు సృష్టించెనో కదా.

ఇకముందు నీవియోగ సముద్రాన్ని రాముడెట్లు దాటగలడు? శత్రువులకైనా ఇట్టి దుఃఖం సంభవిస్తే చూడగలమా? కఠిన హృదయుడవని తెలిసే రాముడు ఈ దారుణ కార్యానికి నన్ను నియోగించాడేమో.

ఓ జననీ! అంతులేని ఈ క్రూరమృగాలే నీకు చెలికత్తెలా? భయావహమైన ఈ అరణ్యాలే నీకు ఉద్యాన వనములా? మొసళ్ళలో, పాములతో నిండిన ఈ మడుగులే నీకు క్రీడా సరస్సులా? ఒంటరిగా నీ విక్కడ ఎట్లుండగలవో!

అమ్మా! నీవు మహాపతివ్రతవు. నీ నడవడి స్త్రీలకు ఒరవడియైనది. రాముని పాదములనే స్మరించు చుండుమని చెప్పుటకు నేనెవ్వడను? పతిని దూరముచేసి నిన్నొంటరిగా కానలలో విడిచి వెళ్ళుచున్న పాపాత్ముడను. అయోధ్యకు వెళ్ళుమని నాకు సెలవిస్తావా? తల్లీ!" అని రామాజ్ఞను వివరింపగా, సీత లక్ష్మణుని వాక్యములు విని మొదలు నరకిన అరటిచెట్టువలె మూర్ఛపోయి క్రిందపడెను.

కొంతసేపటికి తెలివి తెచ్చుకొని సీత కన్నులు తెరచింది. కన్నీళ్ళు ధారగా స్రవింపసాగాయి. నిట్టూర్పు సెగలతో ఆమె చిగురువంటి పెదవి తుకతుక ఉడికింది. పాపటబొట్టు చెదరింది. పూదండలతో అలంకరింపబడిన కేశపాశం వీడి భుజాలపై పరచుకొంది. చెమటతో నిండిన శరీరం వణుకుచుండగా సీత ముఖం చిన్నబోయింది. దుఃఖమనే దావాగ్నితో కాలిపోయి, శోకరసం ఆకారం దాల్చినట్లు, భయం పతివ్రతా రూపం ధరించినట్లు, కరుణరసం ఇంద్రియాలను పొందినట్లు సీతాదేవి వెక్కి వెక్కి ఏడ్చినది. కొంతసేపు మౌనందాల్చినది. అంతలో మౌనాన్ని వీడి తనలో తాను నవ్వుకొంది. తలపంకించింది. ముక్కుపై వ్రేలిడికొని హాహాకారాలు చేసింది. "ఎన్నడును ఊహింపని విషయములెట్లా సంభవించాయో చూశావా! లక్ష్మణా!" అని సీతాదేవి ఈ విధంగా లక్ష్మణునితో పలికింది.

"తండ్రీ లక్ష్మణా! దుఃఖింపకుము. నీకు రాముని ఆజ్ఞ అతిక్రమింపజాలనిది. బాధలనుభవించుమని బ్రహ్మదేవుడు నన్ను సృష్టించినాడు. తప్పించుట ఎవ్వరికి సాధ్యము? అరణ్యవాసంతోనే ఆపదలన్నీ దాటానని భావించాను. చివరకు ఇటువంటి ఆపద దాపురిస్తుందని నేను భావించలేదు. ప్రయాణంలోని దుశ్శకునాల ప్రభావం ఈ మాత్రమైనా ఉండదా? పూర్వజన్మలో దంపతులను విడదీసి పరిహసించి ఉంటాను. ఆ పాపం ఎక్కడికి పోతుంది. పూర్వం అరణ్యవాసం రాముని సన్నిధిలో గడిపాను. అనాథనై ఇప్పుడు ఈ అడవిలో ప్రాణాలనెలా భరిస్తాను?

లక్ష్మణా! పతివ్రతనైన నన్ను అందరు ప్రశంసిస్తారని సంతసించానుగాని, ఇట్టి అపనిందలు పుట్టి రాముడు నన్ను అడవిలో విడిచి పెడతాడని నాకు తెలియదు. పిడుగుకంటె క్రూరమైన మాటలు విన్నప్పటికీ నా గుండె పగిలిపోలేదు. ఈ అడవిలో ఇంకా ఎటువంటి ఆపదలననుభవించాలో. నువ్వు రాముని మాటలను తప్పుగా విన్నావా. రాముడు కలలోనైనా నన్ను కానలకు పంపునా? లక్ష్మణా! నీకు మతి భ్రమ కలగలేదుకదా! అయ్యో! దుఃఖాతిశయంతో ఏమేమో మాటలాడాను. నీ యంతటి వానికి మతిభ్రమించుట ఉండునా! ఎన్నటికైనా నాకు, రామునకు పరస్పర సందర్శన భాగ్యం కలుగునా? అట్లు కానిచో ప్రాణాలు నిలుచునా! రామునకు స్పష్టముగా చెప్పుము. "నా శరీరమున్నది - చెంతనే గంగానదియున్నది. ఏది ఎట్లుకావలెనో అట్లే జరుగును" అని సీతాదేవి భరింపరాని దుఃఖముతో పలికినది.

పూర్వ స్మృతులను తలచుచు సీతాదేవి మరల ఇట్లు పలుకసాగినది. "లక్ష్మణా! తన్ను విడిచి నేను అశోకవనములో ఉంటినని పతి భావించెనేమో. అప్పుడు ప్రభువు వచ్చి రాక్షసులను సంహరించి నన్ను గైకొని పోవుననెడి ఆశతో నేను జీవించియుంటిని. ఈనాడు ఏ ఆశతో ఈయడవిలో జీవింతును? మూఢులు పలికిన నిందా వాక్యములకు భయపడి ప్రభువు నన్ను అడవులకు పంపి యుండవచ్చును. కాని విషయమును వివరించి నన్ను సేదదీర్చి పంపవచ్చును గదా. నిన్ను నేను మరువను అని చెప్పి పంపవచ్చును గదా! ఆనాటి ప్రేమాదరములు లోకాపవాదముతో నశించెనా.

ఓ లక్ష్మణా! రామచంద్రుని సుందర వదనారవిందమును చూచుభాగ్యం జన్మలో కలగదేమో. అయోనిజగాపుట్టి, జనకుని ఇంటిలో పెరిగి, అనసూయాది పవివ్రతల ప్రశంసలనందిన విషయం, అగ్ని ప్రవేశ సమయంలో బ్రహ్మాదులు 'సీత నిర్దోషి' యని పలికిన విషయం ప్రజలు వినలేదా! ఇది నా దురదృష్టం. ఇతరులను నిందించి పనిఏమి?

లక్ష్మణా! దుఃఖాతి శయంతో ఏదేదో అన్నాను. శ్రీరాముని లోకులు నిందించేట్లు చేస్తానా? ఆయన ఆజ్ఞ శిరసావహించి నా శరీరమున్నంత వరకూ అడవులలో ఉంటాను. ముగ్గురత్తలకు నమస్కారములు చెప్పుము. దయామూర్తి అయిన శ్రీరామునికి నాకుమారుగా నమస్కరింపుము. ప్రజలను, బంధువులను సంరక్షింపుమనుము. రాముడే నాకు దిక్కని తెలుపుము. నా హృదయము రాముని రూపమును వీడదనుము. నాపై ఒకింత ప్రేమ చూపుమని చెప్పుము. లక్ష్మణా! వెళ్ళిరా. నీకు శుభాలుకలుగుతాయి. నన్ను మరచిపోకుము." అని సీత కన్నీరు కారుస్తూ లక్ష్మణునితో పలికింది.

లక్ష్మణుడు దుఃఖంతో మునికాంతలను సీతాదేవిని రక్షింపుమని వేడుచు దీనవదనుడై అయోధ్యకు బయలుదేరాడు.

## 4. కఠినపదాలకు అర్థాలు - 5. ప్రతిపదార్థ తాత్పర్యములు

ఈ పాఠ్యభాగంలో అన్ని పద్యాలకు అర్థ తాత్పర్యములు ఇవ్వబడినవి. ఆ వరుసలోనే ముఖ్యమైన పద్యములకు ప్రతి పదార్థ తాత్పర్యములు కూడ ఇవ్వబడినవి.

ఇంతకుఁ బూని వచ్చి వచియింపక పోదునె విన్ము తల్లి దు
శ్చింతులు దైత్యు చేఁబడిన సీతను గ్రమ్మఱ నేలు చున్నవా
డెంత విమోహి రాముఁడని యెగ్గులు పల్కిన నాలకించి భూ
కాంతుడు నిందఁజెంది నినుఁగానలలోపల డించి రమ్మనెన్.

**అర్థాలు :**

దుశ్చింతులు = పాడు భావనలు కలవారు;
విమోహి = పెద్దదైన వ్యామోహం కలవాడు;
భూ కాంతుఁడు = రాజు-రాముడు;

**తాత్పర్యం :** అమ్మా! ఇంత దూరం వచ్చి నీకు చెప్పకుండానే పోతానా? విను. పాపచింతన కల పౌరులు, "రాముడు ఎంత వ్యామోహం కలవాడు! రాక్షసుని చేతికి చిక్కిన సీతను తెచ్చి మళ్ళీ ఏలుకుంటున్నాడు" అని పాడు మాటలు పలికితే విని రాజు నిందపడి నిన్ను అడవులలో వదలి రమ్మన్నాడు.

**267వ పద్యం :**

క్షుల్లకజన దుష్టవచో
భల్ల కదంబముల హృదయ పద్మ మగల భూ
వల్లభుఁ డోరిచె భవదా
యల్లక భర మేమి వినియె దమ్మరొ యింకన్

**అర్థాలు :**

క్షుల్లక, జన, దుష్ట, వచః, భల్ల, కదంబములన్ = నీచులైన ప్రజల చెడు మాటలనే బాణాల సముదాయాల చేత;
భూ వల్లభుఁడు - భూమికి ప్రియుడు = రాజు;
భవద్ + ఆయల్లక భరము = నీ ఎడబాటు బరువును;

**తాత్పర్యం :** నీచులైన జనుల నిందలనేమాటలను అమ్ముల పరంపరలతో హృదయపద్మం పగిలిపోగా భూకాంతుడు నీ ఎడబాటు భారాన్ని సహించాడమ్మా! ఇంకా నీవు ఏమి వింటావు?

**268 వ పద్యం :**

మునులు మహాతపో నిధు లమోఘ దయాంబుధు లాశ్రయించుకా
ననములు చేరి నీవిఁక దినమ్ములు త్రోయఁగదమ్మ యంచునీ
యునికి కనర్హమైన యెడలొప్ప గణింపగ నొగ్గె నాల్క నీ
యనదతనంబు సైచె మది యమ్మరొ! యెంతటికైతిఁ జూపుమా!

**అర్థాలు :**

మహాతపస్ + నిధులు = గొప్ప తపస్సువకు గనులవంటి వారు;

| | | |
|---|---|---|
| అమోఘ, దయా+అంబుధులు | = | మొక్కవోని దయకు సముద్రముల వంటివారు; |
| కాననములు | = | అడవులు; |
| ఎడలు | = | తావులు; |
| ఒగ్గెన్ | = | సిద్ధపడెను |
| అనదతనంబు | = | దిక్కుమాలిన తనము; |

**తాత్పర్యం :** అమ్మా! గొప్ప తపస్సునకు నిండుతావులనదగిన మునులు, మొక్కవోని దయకు సముద్రములైనవారు ఆశ్రయించే అడవులకు చేరి నీవిక దినాలు గడపుమమ్మా అని నీవు ఉండటానికి తగని తావులను పేర్కొనటానికి నా నాలుక సిద్ధమైంది. నా హృదయం ఈ దిక్కుమాలిన తనాన్ని సహిస్తున్నది. ఎంతగా దిగజారి పోయానో చూడు.

**269 వ పద్యం :**

జనపతి లోకనిందఁ బడజాలక నిన్ వనిఁద్రోయు మన్నచో
విని, సహియించి కానలకు వేగమునన్ గొని తెచ్చి నిల్వఁగాఁ
జనునెడ లుగ్గడించి ధృతి సంపదఁ బొంపిరి వోవుచున్న వాఁ
డను నమవంటి మూర్ఖు నకటా విధి యేగతి సృష్టి సేసెనో!

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| జనపతి | = | రాజు - రాముడు; |
| లోకనిందన్ | = | లోకుల నిందను; |
| పడన్ + చాలక | = | పడలేక; |
| నిన్ | = | నిన్ను; |
| వనిన్ | = | అడవిలో; |
| త్రోయుము | = | త్రోసి |
| అన్నచోన్ | = | అంటే, |
| విని - విని; | | |
| సహియించి | = | తట్టుకొని; |
| కానలకున్ | = | అడవులకు; |
| వేగమునన్ | = | తొందరతో; |
| కొని, తెచ్చి | = | తీసికొనివచ్చి; |
| నిల్వగాన్ | = | ఉండటానికి; |
| తగు + ఎడలు | = | తగినతావులను; |
| ఉగ్గడించి | = | పేర్కొని; |
| ధృతి సంపదన్ | = | ధైర్యమనే సంపదతో; |
| పొంపిరిపోవుచున్న వాడను | = | మురిసిపోతున్నాను; |
| అకటా | = | అయ్యో! |
| ననువంటి మూర్ఖున్ | = | నావంటి మొండిమనిషిని; |
| విధి | = | బ్రహ్మ |
| ఏగతిన్ | = | ఏవిధంగా; |
| సృష్టిచేసెనో | = | పుట్టించాడో! |

**తాత్పర్యం :** రాజు లోకులనిందను తట్టుకోలేక నిన్ను అడవిలోత్రోసి రమ్మంటే తగుదునమ్మా! అని ఆ మాట వినటమేకాదు, సహించుటయే కాదు, వడివడిగా నిన్ను అడవులకు తేవటమేకాదు, ఉండటానికి తగని తావులను కూడా తెలియజేసి దిట్టమైన మనస్సుతో మురిసిపోతున్నాను. నావంటి మొండిమనిషిని ఆ బ్రహ్మదేవుడు ఎలా సృష్టించాడో!

**విశేషం :** చేయరాని పనులు చేయవలసి వచ్చినందుకు తన్నుతాను నిందించుకుంటున్నాడు లక్ష్మణుడు. మురిసిపోవటం వెక్కిరింత మాట.

**270 వ పద్యం**

అంచిత వామలూరుజ వనాంతర భూముల నిన్నుడించి ర
మ్మంచు రఘూద్వహుం డనిచె నక్కట యెక్కడ నిల్చియెట్లు వే
గించెద వమ్మ యెవ్వరు సఖీజను లయ్యెద రమ్మ యేమి యూ
హించి దినమ్ము లింకఁ గ్రమియించెద వమ్మ పతివ్రతామణీ!

**ప్రతి పదార్థం :**

పతివ్రతామణీ = పతివ్రతలలో గొప్ప దానా!
రఘు + ఉద్వహుండు = రఘు వంశము వారిలో గొప్పవాడైన రాముడు;
అంచిత, వామలూరు జ వన + అంతర, భూములన్ = గొప్పవియైన వాల్మీకి నివసించే అడవి మధ్యలో ఉన్న ప్రదేశాలలో,
నిన్నున్ = నిన్ను;
డించి = దింపి;
రమ్ము = రా
అంచున్ = అని చెప్పి
అనిచెన్ = పంపెను;
అక్కట = అయ్యో;
ఎక్కడన్ = ఏ ప్రదేశంలో;
నిల్చి = ఉండి
ఎట్లు = ఏ విధంగా;
వేగించెదవమ్మ = కాలం పుచ్చుతావు
ఎవ్వరు = ఏ స్త్రీలు,
సఖీజనులు = నీకు చెలికత్తెలు;
అయ్యెదరమ్మ = అవుతారు.
ఏమి = దేనిని;
ఊహించి = భావించి;
ఇంకన్ = ఇటుపై
దినంబులు = రోజులు;
క్రమియించెదవమ్మ = గడపుతావమ్మా!

**తాత్పర్యం :** ఓ పతివ్రతామతల్లీ! ఆ శ్రీరాముడు వాల్మీకి నివసించే అడవులలో నిన్ను దింపి రమ్మని పంపాడు. అయ్యో! ఎక్కడ ఉండి ఏ విధంగా కాలం గడుపుతావు? నీ కెవ్వరు సఖులవుతారు? ఏ ఆశతో దినాలు గడుపుతావు?

**271 వ పద్యం :**

నీ విమల ప్రభావమును నీ వినయాదిన్ సద్గుణంబులున్
దేవుఁడెరింగి యుండియును నిందలకున్ బుయిలోడి యోజగ
త్పావని నీవు గోరిన నెపంబున నిచ్చటి కన్పినాఁడు గా
కీవిరహాబ్ధి నేకరణి నీఁదగలాఁడతఁ డింక మీఁదటన్

**అర్థాలు :**

నీ విమల ప్రభావమును = స్వచ్ఛమైన నీ మహిమను;
దేవుఁడు = రాముడు;
పుయిలోడి = జంకి;
విరహా + అబ్ధిన్ = ఎడబాటనే సముద్రాన్ని

**తాత్పర్యం :** తల్లీ! లోకపావనీ! రాముడు నీ స్వచ్ఛమైన శీలాన్నీ, వినయం మొదలైన సద్గుణాలను తెలిసి ఉండి కూడా నిందలకు జంకి నీవడిగావనే నెపంతో ఇచ్చటికి పంపాడు గానీ నీ యెడబాటు సముద్రాన్ని ఇకమీద ఎలా భరిస్తాడో కదా!

**272 వ పద్యం :**

దాయలకైన నిట్టి వెత దార్కొన నేగతిఁ జూడ వచ్చు ని
న్నీ యటవీ స్థలిన్ విడిచి యే నెటు లేగుదు నన్ను నేల భూ
నాయకుఁ డిట్టి బెట్టిద మొనర్పఁగఁ బొమ్మనె నెద్దియైనచోఁ
జేయఁగ నోడఁడీ కఠిన చిత్తుఁ డటంచు నెఱింగి పంచెనో.

**అర్థాలు :** దాయలు = పగవారు;
వెత = దుఃఖం;
అటవీస్థలిన్ = అరణ్య ప్రదేశంలో;
భూ నాయకుఁడు = రాజు;
బెట్టిదము = ఘోరమైనపని;
ఓడఁడు = సంకోచించడు.

**తాత్పర్యం :** అమ్మా! పగవారికైనా యిటువంటి దుఃఖం కలిగితే ఎలా చూడగలం. నిన్ను అడవి భూములలో విడిచి నేనెట్లు పోగలను. ఆ మహారాజు ఈ ఘోరకార్యం చేయమని నన్నెందుకు పంపాడు? ఈ కఠినచిత్తుడు ఏ పని చేయటానికైనా సంకోచించడని తెలిసికొని పంపాడనుకుంటాను.

**273 వ పద్యం :**

మితిలేని యీ మిడి మేలంపు మెకములు
సకి యలబలగమే జనని నీకుఁ
బరికింపరాని యీ బలుమలల్ న వరత్న
మయ చంద్ర శాలలే మాత నీకుఁ
గడు భీతి ముంచు నీగహనముల్ విహరింపఁ
దగిన పూఁదోటలే తల్లి నీకు
ఘోరనక్ర భుజంగ కోటితో మలయునీ
హ్రదములు కొలఁకులే యంబనీకు

బంధురములైన యీ మహా ప్రస్తరంబు
విందుమణి వేదికలె జనయిత్రి నీకుఁ
గటకటా! యొంటి నిచ్చోట నెటుల నిలిచె
దమ్మ నీయున్కి కేమందు నమ్మ నేను

**అర్థాలు :**

మితిలేని = మిక్కలి ఎక్కువ అయిన;
మిడి మేలము + మెకములు = మిడిసిపడే క్రూరమృగాలు;
బలగము = పరిజనం
బలు మలల్ = పెద్ద కొండలు;
నవరత్నమయ చంద్రశాలలు = తొమ్మిది రత్నాలతో ఏర్పడిన విశాలమైన చల్లని శాలలు;
గహనముల్ = తేలికగా చొరరాని చోటులు;
ఘోరనక్ర భుజంగ కోటితోన్ = అతిక్రూరమైన మొసళ్ళు, పాములు అనువాని సముదాయంతో;
హ్రదములు = పెద్ద చెఱువులు;
కొలఁకులు = విహరించే సరస్సులు;
బంధురములు = కఠినమైన;
మహాప్రస్తరములు = పెద్ద బండలు;
ఇందు మణి వేదికలు = చంద్రకాంత మణుల అరుగులు;

**తాత్పర్యం :**

అమ్మా! ఇక్కడ ఇంత అని చెప్పరాని మిడిసిపడే క్రూర మృగాలే నీ చెలికత్తెలు. చూడటానికే అలవికాని పెద్ద కొండలే నవరత్నాల విహార శాలలు. చాలా భయంతో ముంచివేసే యీ చొరరాని ప్రదేశాలు నీకు హాయిగా విహరించే ఉద్యానవనాలు. క్రూరమైన మొసళ్ళతో, పాములతో నిండిన లోతైన జలాశయాలే నీకు స్నానాదులకోసమైన సరస్సులు. కఠినమైన యీ పెద్ద బండలే నీకు చంద్రకాంతాల అరుగులు. అయ్యయ్యో! ఇటువంటి చోట ఎలా ఉంటావమ్మా! నేను నీ నివాసంగురించి ఏమి పలుకగలనమ్మా!

**274 వ పద్యం**

జననీ నీవు మహా పతివ్రతవు నీ సౌశీల్య మిల్లాంద్ర కె
ల్లను మేల్బంతి రఘూద్వహాంఘ్రి యుగళీ లగ్నాత్మవై యుండుమీ
యని నేనెవ్వఁడ విన్నవింపఁ బతిఁ బాయన్ జేసి నిన్నొంటి డిం
చిన పాపాత్ముఁడ నూరి కేగు మనుచున్ సెల్విచ్చెదే నావుడున్

**ప్రతిపదార్థం :**

జననీ = తల్లీ;
నీవు = నీవు;
మహా పతివ్రతవు = గొప్ప పతిభక్తి కలదానవు;
నీ సౌశీల్యము = నీ మంచి శీలం;
ఇల్లాంద్రకున్ = గృహిణులకు;
ఎల్లను = అందరకు
మేల్ బంతి = ఆదర్శ ప్రాయమైనది;

రఘు + ఉద్వహ + అంఘ్రి, యుగళీ, లగ్న + ఆత్మవు + ఐ = రఘువంశము వారిలో శ్రేష్ఠుడైన శ్రీరాముని పాదముల జంటయందు తగులు కొన్న హృదయం కలదానవై

| | | |
|---|---|---|
| ఉండుమీ | = | ఉండుమా! |
| అని | = | అని |
| విన్నవింపన్ | = | వినయంతో చెప్పటానికి; |
| నేను | = | నేను; |
| ఎవ్వఁడన్ | = | ఎవడిని ( ఆ అర్హత నాకు లేదు - అని భావం) |
| పతిన్ | = | భర్తను; |
| పాయన్ + చేసి | = | తొలగునట్లుగా చేసి; |
| నిన్నున్ | = | నిన్ను; |
| ఒంటిన్ | = | ఒంటరిగా; |
| డించిన | = | దింపివైచిన; |
| పాప + ఆత్ముఁడన్ | = | పాప భావంగలవాడను; |
| ఊరికిన్ | = | ఊరికి; |
| ఏగుము | = | వెళ్ళు; |
| అని | = | అని; |
| సెల్వు | = | అనుమతి; |
| ఇచ్చెదే | = | ఇస్తావా! |
| నావుడున్ | = | అనగా |

**తాత్పర్యం** : అమ్మా! నీవు గొప్ప పతివ్రతవు. నీ చక్కని శీలం గృహస్థ ధర్మంలో ఉన్న స్త్రీలందరికి ఆదర్శప్రాయమైనది. (నిన్ను ఇంత క్రూరంగా శిక్షించిన) శ్రీరాముని పాదముల జంటయందు లగ్నమైన హృదయం కలిగిఉండు అని విన్న వించటానికి నాకేమి అర్హత ఉంది. నిన్ను దయలేకుండా ఒంటరిగా అడవిలో వదలిపెట్టి పోతున్న పాపాత్ముడను. ఊరికి పో నాయనా అని నాకు అనుమతి నిస్తావా? అనగా.

275 వ పద్యం

అల్లలన యతని వచనము
వెల్లన్ విని మొదలు నఱుక నించుకవడిలోఁ
ద్రెళ్లెడి కదళిక వలె హా
తల్లీయని బెట్టు సొరిగి ధరపైఁ బడియెన్

**అర్థాలు** :

| | | |
|---|---|---|
| అ+లలన | = | ఆ వనిత; |
| త్రెళ్ళెడి కదళిక | = | కూలిపోయే అరటిచెట్టు; |
| బెట్టు | = | పెద్దగా; |
| సొరిగి | = | మూర్ఛ పోయి; |
| ధరపైన్ | = | నేలమీద. |

**తాత్పర్యం** : ఆ సీత అతని మాటలన్నీ విని మొదలు నరుకగా క్షణంలో కూలిపోయే అరటిబోదెలాగా హా తల్లీ అంటూ పెద్దగా మూర్ఛిల్లి నేలమీద పడిపోయింది.

**276 వ వచనం :**

పడి చేడ్పడి బడిబడిన్ బొడము బడలిక నొడ లెఱుంగన్ రెండు గడియ లుండి కొండొక తెలిసి వెండియు నలసి యవశ యై దీనదశన్ బొరసి యాకృశాంగి మరలఁ గన్నుఁ దామరలు విచ్చి విచ్చలవిడి వెడలెడి యశ్రు జలధారా ప్రవాహంబులు చెక్కుటద్దంబులపై జాలువాఱి జాళువామెఱుంగు పయ్యెద చెఱంగు మీదికి దిగజాఱి యుత్తుంగతర స్తన కనక కలశంబులు నిండుకొన మెండుకొను నిట్టూర్పు సెగలన్ దగిలి చిగురు వాతెఱ తుకతుక నుడుక నుడుగణంబుల బెడంగు నడంగఁ ద్రొక్కు చేర్చుక్క దెరలఁ దరళ తరచికుర నికరంబు లలికఫలకంబునఁ జెరలాడఁ దుఱిమిన విరుల సరులతో నొఱవిన కొప్పు పెన్నెఱు లంస భాగంబులం బొరలిపడ జడుపు చెమ్మటలన్ గ్రమ్ముకొని నెమ్మేను గడగడ వడంకఁగడంక దక్కి చిన్నమొగంబు విన్నఁదనంబున కిమ్ముజూపఁ బరితాప దవానలంబునఁబడి పురపురఁ బొక్కుచుఁ దాల్మి తూలి స్రుక్కుచు లేచి కూర్చుండి శోకరసం బాకారంబు దాల్చిన చందంబునఁ జిత్రంబు గాత్రంబు గైకొన్న చెన్నున సాధ్వసంబు సాధ్వియైన కరణిన్ గరుణంబు కరణంబు లొందిన తెఱంగున నూరక వెక్కి వెక్కి యేడ్చుచు నేడుపు విడిచి మౌనంబు పూనుచు మౌనంబు మాని తనలోఁ దానగుచు నగవుడిగి తల యూచుచుఁ దలయూచుట విడిచి ముక్కుపై వ్రేలు గీలు కొలుపుచు జాలిగొని హాహాకారంబు సలుపుచుఁ దలపని తలపు లివిగో చూచితే లక్ష్మణా యని యతనిదిక్కు చూడ్కులు నిగిడించి యిట్లనియె.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| చేడ్పడి | = | బాధపడి |
| కృశ + అంగి | = | సన్నని దేహం కలది; |
| చెక్కు + అద్దంబులు | = | అద్దములవంటి చెక్కిళ్ళు |
| జాళువా | = | బంగారు; |
| ఉత్తుంగతర | = | మిక్కిలి ఎత్తైన; |
| చిగురు వాతెఱ | = | చిగురువంటి పెదవి; |
| ఉడుగణంబులు | = | నక్షత్రముల మొత్తములు; |
| చేర్చుక్క | = | పాపట బొట్టు |
| తెరలన్ | = | కరగిపోగా; |
| విరులసరులు | = | పూలమాలలు; |
| పెద్ద + నెఱులు | = | పొడవైన కురులు; |
| అంసభాగంబులన్ | = | భుజముల మీద; |
| పరితాప, దవ + అనలంబు | = | దుఃఖమైన కారుచిచ్చు; |
| తాల్మి | = | ఓర్పు; |
| సాధ్వసంబు | = | భయము; |
| కరుణంబు | = | దుఃఖం; |
| కొలుకొలుపుచున్ | = | తాకించుచు; |

**భావం :** సీత తాను విన్న ఘోరమైన మాటలవలన పొందిన దుఃఖానుభూతిని ఇది స్పష్టం చేస్తున్నది.

**277 వ పద్యం :**

అడలకు మన్న నీకు వసుధాధిపు నానతి దాట వచ్చునే
యిడుమలఁ జెందు మంచు విధి యాధర నన్ను సృజించి యుండఁగా
గడవఁగ నెవ్వరోపుదురు కానల కేగిననాడె యాపదల్
గడచితినంచు నుంటి నెఱుఁగన్ దుది నిట్లగు నంచు నా యెదన్

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అడలకు మన్న | = | ఏడవకయ్యా! |
| వసుధా + అధిపు + ఆనతి | = | భూమికి ఏలిక అయిన రాజు ఆజ్ఞ |
| ఇడుమలన్ | = | కష్టాలను; |
| విధి | = | బ్రహ్మ |
| ధరన్ | = | భూమియందు; |

**తాత్పర్యం :**

బాబూ దుఃఖపడకు. రాజు ఆజ్ఞను దాటరాదు గదా! బ్రహ్మ నీవు కష్టాలే అనుభవించు అని నన్ను ఈ భూమిలో పుట్టించి ఉండగా దానిని ఎవరు తప్పుకోగలరు? వెనుక అరణ్యాలకు వెళ్ళినపుడు కష్టాలు గడచి గట్టెక్కామని అనుకున్నాను. చివరకు ఇలా అవుతుందని నా మనస్సులో ఎరుగను.

**278 వ పద్యం**

ఆదుర్ని మిత్తముల ఫల
మీ దుఃఖము సేయకున్నె యీ దుఃఖము లా
పాదింప విధి తలంచియె
కాదే యాకోర్కె నాకుఁ గలిగించుటయున్

**అర్థాలు :** దుర్నిమిత్తముల ఫలము ఆపాడు శకునాల ఫలం; ఆపాదింపన్ - కలిగింపగా;

**తాత్పర్యం :** నాకు చూపట్టిన ఆపాడు శకునాల ఫలం ఈ దుఃఖాన్ని కలుగజేయకుండా ఉంటుందా? ఈ దుఃఖాలను కలిగించటం కోసమే విధి నాకు ఆ కోరికను (వనాలలో మునిపత్నుల కడ మెలగాలనే కోరికను) గలిగించి ఉంటాడు.

**279 వ పద్యం**

ఎడపక పూర్వజన్మముల నే మిథునంబులఁ బాయఁజేసి వా
రడలఁగ నవ్వుచుండితినొ యాయఘ మూరకపోనె; నాఁడు కా
అడవుల రామ పాద జలజాప్తి వసించితి; నేఁడు నాథు పాం
దెడసి యనాథనై యిచట నేగతి మేన భరింతుఁ బ్రాణముల్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మిథునంబులన్ | = | జంటలను (భార్యా భర్తలను) |
| అడలఁగన్ | = | దుఃఖంతో కుమిలిపోతూ ఉండగా; |
| అఘము | = | పాపం; |
| రామ పాద, జలజ + ఆప్తిన్ | = | రాముని పాదాలనే పద్మాల చేరువలో |
| అనాథను | = | దిక్కుమాలిన దానను; |

**తాత్పర్యం :**

వెనుకటి జన్మలలో ఏ జంటలనైనా జంకు గొంకులు లేక విడదీసి, వారు దుఃఖపడుతూ ఉంటే నవ్వుతూ ఉన్నానేమో! పాపం ఊరకే పోతుందా? మునుపు అరణ్యవాసం చేసినప్పుడు శ్రీరామచంద్రుని పాద పద్మాల దగ్గర ఉన్నాను. (అందువలన అది కష్టమని పించ లేదు). ఇప్పుడు భర్తపొందు కోల్పోయి దిక్కులేని దాన్నై ఏ విధంగా దేహంలో ప్రాణాలను భరించగలను?

**280 వ పద్యం**

ఏను సాధ్వి ననుచు నెల్లవారలు నన్ను
సన్నుతింతు రనుచు సంతసింతుఁ
గాని నడుమ నిట్టి కటిక నిందలు పుట్టి
యడవిఁ ద్రోచు రాముఁడనుచు నెఱుఁగ

**అర్థం :** సాధ్వి = మంచినడవడి కలది; పతివ్రత;

**తాత్పర్యం :** ఈమె పతివ్రత అని జనులందరూ నన్ను మెచ్చుకుంటారని ఎప్పుడూ సంతోషిస్తూ ఉండేదానను. కానీ మధ్యలో ఈ ఘోరమైన అపవాదులు పుట్టి రాముడు నన్ను అడవికి త్రోసివేస్తాడని ఎప్పుడూ ఊహించలేదు.

**281 వ పద్యం**

కటకటా లక్ష్మణా పిడుగుకంటెను బెట్టిదమైన మాట నేఁ
డిటు విని యుండియున్ బగుల దింతలు నింతలు గాదు గుండె యె
ప్పటివలె నున్న దీకటిక భావముతో నసువుల్ భరించి యి
య్యటవిని యింక నేవలన నాపద లొందఁగ నున్న దాననో!

| | | |
|---|---|---|
| **అర్థాలు :** | బెట్టిదము = | కఠోరము; |
| | అసువుల్ = | ప్రాణాలు |

**తాత్పర్యం :** అయ్యో లక్ష్మణా! పిడుగు కంటే ఘోరమైన యిట్టి వార్త వినికూడా నా గుండె పగిలిపోలేదు. చిన్న చిన్న ముక్కలుగా నై పోలేదు. వెనుకటివలెనే ఉన్నది. ఇంత కఠినభావంతో ప్రాణాలను భరించి యీ అడవిలో ఏ వైపు నుండి ఏ కష్టాలు పొందవలసి వస్తుందో!

**281 వ పద్యం**

కళవళమంది తెల్పితివొ, కాక పరాకునఁ దప్పు వింటివో
కలనయినన్ రఘూద్వహుఁడు కానలలో ననుఁ ద్రోయ బంచున్
తెలిసి గణింపు లక్ష్మణ మతిభ్రమ యైనదొ! హో సహింపుమి
ప్పలుకు లెఱుంగ కంటి వెతఁ బాటిలె నీకొక భ్రాంతి యున్నదే

| | | |
|---|---|---|
| **అర్థాలు :** కళవళము | = | కంగారు; |
| పరాకునన్ | = | పరధ్యానంతో; |
| తప్పన్ | = | పొరపాటుగా; |
| వెత | = | దుఃఖం. |

**తాత్పర్యం :**

లక్ష్మణా! నీవు కంగారులో తెలుప లేదుగదా! పొరపాటున ఒక మాటకు ఒకమాటగా విన్నావా? ఆ శ్రీరామచంద్రుడు కలలోగూడా నన్ను అడవులకు పంపడే! మనసు కుదురు కొల్పుకొని ఒక్కసారి ఆలోచించు నాయనా! నీకు మతి చలించలేదు గదా! అయ్యయ్యో! ఈ సహించు. తెలియక ఇలా పలికాను. నీకు ఎప్పుడైనా భ్రాంతి ఉన్నదా?

**283వ పద్యం :**

ఎన్నటికిన్ రఘూద్వహుని నేనును నన్నిక రామచంద్రుఁడున్
గన్నులఁ జూడఁగల్గదాకా, కల్గకయుండినఁ బ్రాణమేల పో
దన్న; రఘు ప్రవీరు చెవు లారఁగ నింతయుఁ దెల్పు; నాదు మే
[illegible]గున్నది; యైనటులయ్యెడు లదుదివ్.

**తాత్పర్యం :**

ఇక శ్రీరాముని నేనూ, శ్రీరాముడు నన్ను చూచుకొనే భాగ్యం కలుగదా? కల్గకపోతే ప్రాణాలు ఏల పోవయ్యా! ఆ రఘు వంశవీరుడు చెవులారా వింటూ ఉండగా ఇదంతా చెప్పు. ఇక్కడ నా దేహం ఉంది. దగ్గరలోనే గంగమడుగున్నది. చివరకు తెయ్యేది అవుతుంది.

**విశేషం :** దుఃఖం తట్టుకోలేని దశలో గంగలో దూకి ప్రాణాలు పోగొట్టుకోవటమే నాకు శరణ్యం - అని భావన.

**284 వ పద్యం :**

పతి మతి నెంచెనేమొ తనుఁబాసి యశోకవనంబు లోపలన్
బ్రతుకదె పెక్కు నాళ్ళనుచుఁ గ్రమ్మఱఁ దాఁజనుదెంచి శత్రునిన్
హతునిగఁ జేయు నేలు వసు వాసగదా బ్రతికించె నాటి కా
గతి నిఁక నేమి యాసగొని కాయము నిల్పుదుఁ దెల్పు లక్ష్మణా!

**తాత్పర్యం :**

ఒకవేళ శ్రీరాముడు అనుకుంటున్నాడేమో! ఇది వరకు నేను లేకుండా అశోకవనంలో పెక్కు దినాలు బ్రదుకలేదా - అని. అప్పుడు తాను వచ్చి పగవానిని పరిమార్చి నన్నేలుకుంటాడన్న ఆశ బ్రదికించింది. ఇప్పుడేమి ఆశ పెట్టుకొని ప్రాణాలు నిల్పుకోవాలి? లక్ష్మణా! చెప్పు.

**285 వ పద్యం**

ఎఱుఁగని మూఢులాడుకొను నెగ్గులకున్ భయమంది యప్పుడే
కలఁకుమనంబుతో విభుఁడు కానన సీమకుఁ బంచెఁగాక య
త్తెఱఁగొకసారి నన్ బిలిచి తెల్పి మనోవ్యధ తీర్చి నిన్ను నే
మఱ నని పంపడయ్యె నభి మానముఁ గూర్మియు నెందుఁ బోయెనో!

**అర్థాలు :**

ఎగ్గులు = నిందలు;
కానన సీమకున్ = అడవి ప్రాంతానికి;
తెఱగు = పద్ధతి;

**తాత్పర్యం :** ఏమీ తెలియని మూర్ఖులు పలికిన నిందలకు భయపడి వెనువెంటనే బిరుసెక్కిన హృదయంతో నా ప్రభువు అడవులకు పంపివేశాడు గానీ, ఒక్కసారి నన్ను పిలిచి నా మనస్సులోని వేదనను పోగొట్టి నిన్ను ఏమరను అని చెప్పి పంపలేదు. నాపై ఉన్న అభిమానమూ, ప్రేమా ఎక్కడకు పోయాయో!

**286వ పద్యం**

ఆ కరుణ ఆ ప్రసన్నత
యాకూరిమి యాప్రియోక్తి యాగౌరవమున్
కాకుత్థ్సుఁడు మరచెఁ గదా :
ఆకస్మికముగ జనించు నపవాదమునన్

**అర్థాలు :**

కరుణ = జాలి;
ప్రసన్నత = కల్లాకపటం లేని మనస్సు తీరు;

కూరిమి = ప్రేమ;

ప్రియ + ఉక్తి = ప్రియంగా ఉండే మాట;

కాకుత్థ్సుఁడు = కకుత్‌స్థుడనే వాని వంశంలో జన్మించిన రాముడు.

**తాత్పర్యం :** ఆ శ్రీరామ చంద్రుడు మునుపు నాయందు ఆయనకుగల దయను, ప్రసన్నతనూ, ప్రేమను, ప్రేమ మాటలన మన్ననమూ హఠాత్తుగా పుట్టిన నిందవలన మరచిపోయాడు గదా!

**287 వ పద్యం :**

ఆ కర్ణాయత నేత్రమై మణిమయోద్య త్కుండల ద్వంద్వ శో
భా కీర్ణాంచిత గల్లమై సురదనంబై సుందరభ్రూ యుతం
బై క్రమ స్మిత చంద్రికా విలసితంబై యొప్పు శ్రీరాము మో
మీ కాయంబునఁ జూచు భాగ్య మిఁక లేదేమీ సుమిత్రాత్మజా!

**ప్రతిపదార్థం :**

సుమిత్రా + ఆత్మజా = సుమిత్ర బిడ్డవైన ఓ లక్ష్మణా!

ఆ కర్ణ + ఆ యత నేత్రము + ఐ = చెవుల దాక పెద్దగా సాగిన కన్నులు గలదై;

మణిమయ + ఉద్యత్, కుండల, ద్వంద్వ, శోభా + ఆకీర్ణ + అంచిత గల్లము + ఐ = మణులతో నిండిన పైకి లేచి పడుచున్న కుండలాల జంట యొక్క కాంతితో బాగుగా వ్యాపించిన ఒప్పారుచున్న చెక్కిళ్లు కలదియై;

సు, రదనంబు + ఐ = చక్కని పలువరుస కలదియై;

సుందర, భ్రూ, యుతంబు + ఐ = అందమైన కనుబొమలతో కూడినదై;

క్రమ, స్మిత, చంద్రికా, విలసితంబు + ఐ= మనోహరమైన చిరునగవనెడు వెన్నెలతో ఒప్పారునదై;

ఒప్పు = విరాజిల్లు;

శ్రీరాము మోము = శ్రీరాముని ముఖాన్ని;

ఈ కాయంబునన్ = ఈ దేహంతో;

చూచు భాగ్యము = చూచే అదృష్టం;

ఇఁకన్ = ఇటుపై

లేదు + ఏమో = లేదనుకుంటాను.

**తాత్పర్యం :** లక్ష్మణ స్వామీ! ఆ శ్రీరాముని మొగం చెవులదాకా సాగి విశాలమైన కన్నులు, మణులతో నిండిన ఊగులాడుచున్న కుండలాల జంట అందాలు చక్కగా క్రమ్ముకొన్న చెక్కిళ్ళు, చూడముచ్చట అయిన పలువరుస, అతి సుందరమైన కనుబొమలు, మనోజ్ఞమైన చిరునగవు అనే వెన్నెలా కలిగి అతి సుందరంగా ఉంటుంది. అట్టి మోమును ఈ దేహంతో చూచే భాగ్యం ఇక నాకు లేదనుకుంటాను.

**288 వ పద్యం :**

అవనిన యోనిజనై పుట్టి మిథిలేంద్రు
　　వీట నేఁబెరిగిన విధము వినరా
యంగరాగము విచ్చి యనసూయ మొదలైన
　　సతు లెంచుకొన్నది చాల వినరా
యాలంకలోఁ దొల్లి త్రైలోక్యము నుతింప
　　వహ్ని నేఁజొచ్చిన వార్త వినరా

యీ సీత నిర్దోషి యేలుకొమ్మని రాము
బ్రహ్మాదు లపుడన్న పలుకు వినరొ

వినియుఁ గనియుఁ బ్రజలు నను నింద సేసిన
అంత మాత్రమునకె యధిపుఁ డులికి
యింత తెగువ సేయ నిచ్ఛగించుట నాయ
భాగ్యమింతె యొకరిఁ బల్కనేల?

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అయోనిజ | = | స్త్రీ గర్భం నుండి పుట్టనిది - (ఇది పవిత్రతకు ఒక గుర్తుగా చెపుతారు) |
| వీటన్ | = | నగరంలో; |
| అంగరాగములు | = | మై పూతలు |
| ఎంచుకొన్నది | = | మన్ననతో భావించినది; |
| త్రైలోక్యము | = | మూడులోకాల సముదాయము |
| అధిపుఁడు | = | రాజు |
| తెగువ | = | సాహసము |

**తాత్పర్యం :**

భూమిలో నేను అయోనిజగా పుట్టి జ్ఞానమూర్తి అయిన మిథిలానగర రాజు జనకుని నగరంలో పెరిగిన మాటా, మై పూతలు ఇచ్చి అనసూయ మొదలైన పతివ్రతలు సాదరంగా మన్నించిన సంగతీ, ఆలంకలో మునుపు మూడు లోకాలూ కొనియాడే విధంగా అగ్నిప్రవేశం చేసిన వార్తా, ఈ సీత ఏ తప్పు ఎరుగనిది, ఈమెను ఏలుకోవయ్యా అని బ్రహ్మ మొదలైన దేవతలు పలికిన పలుకూ ఈ జనాలు వినలేదా? కొందరు చూచి కూడా ఉంటారు. అయినా ఏదో నిందవేశారు. ఆ మాత్రానికే ప్రభువు భయపడి ఇంత సాహసం చేయటానికి నిర్ణయించటం నా దురదృష్టం ఇప్పుడు మరొకరిని నిందించటం ఎందుకు?

**విశేషం** : అనసూయ ఇచ్చిన మైపూత ద్రవ్యం చాలా మహిమ గలది. దానితో సీతా సౌందర్యం ఇనుమడించటమే కాదు; దాని మహిమ బహుకాలం ఉంటుంది.

**289 వ పద్యం :**

వనముల కేల వచ్చితివి వల్లభునిం బెడఁబాసి యొంటిగా
నని మునిపత్ను లెల్ల గుమియై యడుగన్ ధృతి మావి వారికే
మని వివరింతు నింత విపదంబుధి నేకరణిన్ దరింతు నే
యనువున నీ ప్రతి క్షణ మహా యుగముల్ క్రమియింతు లక్ష్మణా!

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| వల్లభునిన్ | = | ప్రియుని; |
| పెడన్ + పాసి | = | వదలి పెట్టి; |
| ధృతి | = | ధైర్యము; |
| విపద్ + అంబుధి | = | ఆపద అనే సముద్రం; |
| ప్రతిక్షణ మహా యుగముల్ | = | ఒక్కొక్క క్షణము గొప్ప యుగమంత ప్రమాణంగా ఉండే కాలాలను; |
| క్రమియింతున్ | = | దాటుకుంటాను. |

**తాత్పర్యం :**

ముని పత్నులందరూ గుంపుగా వచ్చి అమ్మా పతిని వదలి ఒంటరిగా ఇక్కడకు ఎందుకు వచ్చావు తల్లీ! అని అడిగితే ధైర్యం చిక్కబట్టుకోలేని నేను వారికేమని వివరించగలను? ఇంత ఘోరమైన ఆపద అనే మహా సముద్రాన్ని ఎలా దాటను. ఒక్కొక్క క్షణం ఒక్కొక్క మహాయుగంగా అయ్యే ఈ కాలాన్ని ఎలా గడపగలను?

**విశేషం :** కృతము, త్రేత, ద్వాపరము, కవి అనే నాలుగు యుగాలు మొత్తం కాలాన్ని ఒక మహాయుగం అంటారు.

**290 వ పద్యం :**

పొగిలి = కుమిలి;
తెగువ = సాహసము;
పరితపించియున్ = మిక్కిలిగా దుఃఖించి కూడా;
బహిర్+లిఖిత చిత్రంబు కొమరు = వెలుపల గీసిన బొమ్మ విధం.

**291 వ పద్యం :**

వగపునఁ దోచినన్నియు నవారణఁ బల్కితిఁగాని భర్తకున్
జగదప వాదమున్ గడువ శక్యమె నేను వియోగమగ్నతన్
దెగువకుఁ జొచ్చి రాము జననిందితుఁ జేయుదునే తారాజ్ఞయె
ల్ల గతులఁబూని కానల మెలంగెద మేను గలంత కాలమున్.

**అర్థాలు :**

వగపునన్ = దుఃఖంతో;
అవారణన్ = ఆపటానికి వీలులేని విధంగా;
జగత్ + అపవాదమున్ = లోకనిందను;
వియోగమగ్నతన్ = ఎడబాటులో మునిగిన కారణంగా;
తదే + ఆజ్ఞ = అతని ఆనతిని;

**తాత్పర్యం :**

దుఃఖంలో కూరుకొని పోయి ఆపకుండా తోచిన మాటలన్నీ అన్నాను. కానీ ఆయనకు లోకాపవాదాన్ని దాటటం సాధ్యమా? నేను ఎడబాటులో మునిగిన కారణంగా రాముని జనుల తిట్టులకు పాలు చేస్తానా? అతని ఆజ్ఞను ఎన్ని తీరులతోనైనా సరే భరించి ప్రాణాలున్నంత వరకు అడవులలో వుండిపోతాను.

**292వ పద్యం :**

అతి కృపాళునకున్ = మిక్కిలి దయగలవాడగు
రామ + అవనీ + ఇంద్రునకున్ = రామ ప్రభువునకు;
ఏడు గడ = ఏడు విధములైన రక్షణ;

**తాత్పర్యం :**

అన్నా! లక్ష్మణా! ఇంకా ఆలస్యం ఎందుకు? నీవు అయోధ్యకు వెళ్ళు. అత్తలకు ముగ్గురికీ మ్రొక్కానని చెప్పు. అక్కడి బంధువుల నందరినీ అడిగినట్లు తెలియచెయ్యి. గొప్ప దయగల శ్రీరామ ప్రభువునకు నా మాటగా మిక్కిలి భక్తితో నీవు మ్రొక్కు. తన ఆజ్ఞను తలపై ధరించి జననింద అతనికి చెందకుండా అడవులలో తిరుగుతాననీ, ప్రజలను చుట్టాలవలె రక్షింపుమనీ, నాకు అన్ని విధములైన రక్షణా తానే అనీ, నా భావం ఎప్పుడూ అతని మూర్తిని వదలి ఉండదనీ, నా మీద కొంచెం పాటి ప్రేమనైనా ఉంచమనీ శ్రీరామచంద్రునకు తెలుపు.

**293 వ పద్యం :**

పోయి రమ్ము శుభంబులు పొందు నిన్ను
నన్ను మఱువక యుండుమా యన్న యనుచుఁ
గన్నుగవ నశ్రుధారలు గ్రమ్ముకొనఁగ
నన్నెలంతుక దీనయై యడలు చున్న

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కన్ను + కవ | = | కన్నుల జంట; |
| అశ్రు ధారలు | = | కన్నీటి ప్రవాహాలు; |
| ఆ + నెలంతున్ | = | ఆ వనిత; |
| అడలు చున్నన్ | = | దుఃఖంతో కుమిలిపోతూ ఉండగా; |

**తాత్పర్యం :** పోయిరా! నాయనా! నీకు శుభాలు కలుగుగాక! నన్ను మరచిపోకు తండ్రీ! అంటూ కన్నీరు కాలువలు గడుతూ ఉండగా ఆ యమ దీనంగా దుఃఖిస్తూ ఉన్నది.

**294 వ పద్యం :**

చనఁగాళ్ళు రాక చన కేఁకఁ
జనదని ధేనువును బాయఁ జాలని నత్సం
బును బోలి జాలిగొని యో
జననీ! జననాథుఁ గొలువ జనుదునె యనుచున్

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ధేనువు | = | ఆవు; |
| వత్సంబు | = | దూడ |

**తాత్పర్యం :** వెళ్ళటానికి కాళ్ళు రావటం లేదు. వెళ్ళక తప్పదు - అని ఆవును వదలిపోలేని దూడలాగా లక్ష్మణుడు దీనంగా తల్లీ! ప్రభువును సేవించటానికి పోదునా? అన్నాడు.

**295 వ పద్యం**

అల్లన మ్రొక్కి కాళ్ళు వడఁకాడఁ బ్రదక్షిణ మాచరించి మే
నెల్లఁ జలింప హోరుమని యేడ్చుచుఁ బెద్ద యెలుంగుతోడ మా
తల్లిని డించి పోయెదను దాపస కామినులార కూర్మి సం
ధిల్లఁగఁ బ్రోవరే యనుచు దీనత లక్ష్మణు డేగె నయ్యెడన్.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| ప్రదక్షిణం - వలగొనటం | = | తనకు కుడిగా పూజ్యులను ఉంచుకొని చుట్టూ తిరగటం; |
| ఎలుంగు | = | కంఠం సవ్వడి; |
| తాపస కామినులార! | = | తపస్వుల ధర్మపత్నులారా! |
| కూర్మి | = | ప్రేమ; |
| సంధిల్లన్ | = | చక్కగా అతుకునట్లుగా! |

**తాత్పర్యం :**

మెల్లగా మ్రొక్కి కాళ్ళు వణకుతూ ఉండగా ప్రదక్షిణం చేసి ఒడలంతా కదలిపోతూ ఉండగా అయ్యో అని యేడుస్తూ మా తల్లిని వదలి పోతున్నాను. తాపసుల ధర్మపత్నులారా! ప్రేమను నింపి కాపాడరూ! అని దీనతతో లక్ష్మణుడు వెళ్ళాడు.

## 6. సందర్భ సహిత వ్యాఖ్యలు:

1. ననువంటి మూర్ఖు నకటా! విధి యే గతి సృష్టిసేసెనో

**పరిచయం :** కంకంటి పాపరాజు రచించిన "ఉత్తర రామాయణము" నుండి గ్రహింపబడిన "సీతా పరిత్యాగము" అను పాఠ్యభాగము నందలిదీ పద్య పాదము.

**సందర్భము :** లక్ష్మణుడు సీతను గంగానదిని దాటించి, రామాజ్ఞను సత్ తెలుపుచు "అమ్మా! లోకనిందను భరింపజాలక రాముడు నిన్ను అడవిలో దించి రమ్మనగా, విని, సహించి, ఇక్కడకు నిన్ను తీసికొని వచ్చి ఇంకను ధైర్యముతో నుంటిని" అని తన్ను తాను నిందించుకొను సందర్భము.

**వివరణ :** "బ్రహ్మ దేవుడు నావంటి మూర్ఖుని ఏ రీతిగ సృష్టించినాడో గదా!" - సీతను అడవిలో విడిచిపెట్టు బాధ్యత దురదృష్ట వంతుడనైన నామీదనే పెట్టబడినదను మనోవ్యథతో లక్ష్మణుడు పలికివాడు.

2. ఈ విరహాబ్ధి నే కరణి నీదగలాడంతడింకమీదటన్.

**పరిచయం :** పై వలెనే

**సందర్భం :** రామాజ్ఞను సీతకెరిగించుచు లక్ష్మణుడు "నీ నిర్మలమైన నడవడిని, నీ సద్గుణములను తెలిసియు లోకనిందకు భయపడి నీవు కోరితివన్న నెపముతో నిన్ను ఈ అడవులకు రాముడు పంపినాడ"ని పలుకు సందర్భము.

**వివరణ :** ఆ రాముడు నీ వియోగము అనెడి సముద్రమును ఇకపై ఎట్లు దాటగలడో అని లక్ష్మణుని భావము.

3. "నీ సౌశీల్య మిల్లాంండ్ర కెల్లను మేల్బంతి."

**పరిచయం :** పైవలెనే

**సందర్భం :** రామాజ్ఞను తెలుపుచు లక్ష్మణుడు సీతతో 'లోకనిందకు భయపడి రాముడీ పని చేసెనే తప్ప ఇంకొకటి కాదు. నీవు మహా పతివ్రతవు" అని పలుకు సందర్భము.

**వివరణ :** 'నీ సౌశీల్యము స్త్రీలోకమున కంతటికిని మార్గదర్శకమైనది.' అట్టి నిన్ను భర్తనుండి దూరము చేసిన పాపాత్ముడనని లక్ష్మణుడు తన్నుతాను నిందించుకొనుచున్నాడు.

4. "అయఘమూరక పోనె."

**పరిచయం :** పై వలెనే

**సందర్భము :** లోకనిందా భయముచే రాముడు తన్ను అరణ్యములో విడిచిరమ్మనెనని లక్ష్మణుని ద్వారా విని, దుఃఖాతిశయంతో తన దురదృష్టమును తానే నిందించుకొను సందర్భము.

**వివరణ :** పూర్వజన్మములో ఏ దంపతులనో విడదీసి, వారు దుఃఖించుచుండగా చూచి నేను నవ్వియుందును. "ఆ పాప ఫలము అనుభవింపక తప్పునా" అని సీత పలికినది.

5. నాదు మేనున్నది. చెంత గంగమడుగున్నది.

**పరిచయం :** పైవలెనే

**సందర్భము :** రామాజ్ఞను లక్ష్మణుని ద్వారా విని సీత మూర్ఛిల్లి, తెప్పరిల్లిన పిదప దుఃఖించుచు తాను పతివ్రతనని ప్రజలందరు మెచ్చుకొందురని సంతసించుచుండగా, ఈ వియోగము సంభవించుట పూర్వ జన్మలో చేసిన పాప ఫలితమేమోయని భావించినది. రాముని చూచు భాగ్యం ఎప్పటికైనా కలుగుతుందా? అట్లు కానిచో నేను బ్రతుకగలనా? అని లక్ష్మణునితో సీత పలుకు సందర్భము.

**భావము :** "నా శరీరమున్నది. సమీపమునందే గంగానదియున్నది. ఏది ఎట్లు జరుగవలెనో అట్లే జరుగునని నా మాటగా రామునకు తెల్పు"మని సీత లక్ష్మణునికి చెప్పుచున్నది.

6. నెమ్మియొకయింత నా మీద నిల్పుమనుము.

**పరిచయం :** పైవలెనే

**సందర్భము :** లక్ష్మణుని అయోధ్యకు వెళ్ళుమని చెపుతూ తన హృదయంలో రాముని రూపమే ఎప్పుడూ నిలిచి ఉంటుందని, రామాజ్ఞను శిరసావహించి శరీరంలో ప్రాణమున్నంతవరకు అడవిలోనే యుందునని తెలుపుచు సీత లక్ష్మణునికి సందేశమిచ్చు సందర్భములోనిదీ వాక్యము.

**వివరణ :** లక్ష్మణా! నీవు అయోధ్యకు వెడలుము. ముప్పురు అత్తలకు మొక్కితిననుము. దయాసముద్రుడైన రామునికి నాకుమారుగా నమస్కరింపుము. రాముడే నాకు దిక్కని తెలుపుము. నా మనస్సు ఆయన రూపమునందే లగ్నమైయుందునని చెప్పుము. 'నాపై ఒకింత ప్రేమనుంచుమని చెప్పుము' అని సీతాదేవి పలికెను.

## 7. ప్రశ్నలు - సమాధానాలు

**1. లక్ష్మణుని స్వభావ చిత్రణము గావించునది.**

రామాయణంలో సుమిత్ర ఒక విచిత్రమైన మనస్తత్వంగల వనిత. ఆమె దశరథునకు ఒక భార్య అయినా తన సర్వస్వమూ తక్కిన వారికి సేవ చేయటం కోసమే వినియోగించి ఆనందించిన అతివ. ఆమె కొడుకుగా సౌమిత్రి అని మురిపెంగా పిలువబడే లక్ష్మణుడు మూర్తీభవించిన సేవా ధర్మం. సీతారాములు అతనికి ప్రత్యక్ష దైవ స్వరూపాలు. వారిని సేవించటమే అతనికి సుఖం. వేరే సుఖాలేమీ అతడు కోరలేదు, పొందలేదు.

రాముడు జానకిని అడవులలో వదలి రమ్మని అతికఠోరమైన ఆజ్ఞ అతనికి ఇచ్చాడు. అది అతనికి ఎంత మాత్రమూ ఇష్టం కాని విషయం. అంతేకాదు మహాదుఃఖకరమైన విషయం. అయినా ప్రభుశాసనంగా తన ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండా నిర్వహించాడు. ఒక వంక అన్న - ప్రభువు. మరొక వంక మహాసాధ్వి - తన తల్లికంటె అధికంగా తను మన్నించే మహనీయురాలు. ఈ ఇద్దరి నడుమ లక్ష్మణుడు తిరుగలిరాళ్ల మధ్యలో పడిన ధాన్యం గింజలా నలిగిపోయాడు. అయినా కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నిర్వహించి ఇద్దరి మన్ననకూ పాత్రుడయ్యాడు.

నీతో రాముని యాజ్ఞ చెప్పగల ధైర్యం నాకు కలిగింది. ఎంతటి వాడనయ్యానో చూడు - అనీ, "ననువంటి మూర్ఖు నకటా విధి ఏ గతి సృష్టి చేసెనో" అనీ , "ఈ విరహాబ్ధి సేకరణి నీదగలాడు అతడు" అనీ తన్ను నిందించుకుంటూ తన ఆరాధ్యులు జానకీరాముల దుఃఖాన్ని గురించి హృదయంలో ఆదవదలైపోయాడు. నిజానికి తన తప్పు లేకపోయినా "నిన్నొంటి డించిన పాపాత్ముఁడు" అని దోషం తనపై వేసుకుని దుఃఖించిన సుకుమార హృదయుడు సుమిత్ర కొడుకు.

అడవులలోని మహాభయంకర స్థితిగతులను పేర్కొని అక్కడ ఆ మహాసాధ్వి ఎలా ఉంటుంది. అని ఆవటిల్లి పోయిన ఉదాత్త వ్యక్తిత్వం లక్ష్మణునిది.

సీతమాటలన్నీ విని నగరానికి పోక తప్పని స్థితిలో ఆమె యనుమతి గైకొని పోతూ తనకు చేతనైనంతలో ఆమెను ఆదుకోవాలనే తపనతో తాపసవనతలను గొంతెత్తి పిలిచి రక్షించవలసినదిగా ప్రార్థించిన దయాశాలి రామానుజుడు. తిరిగి నగరానికి వెళ్ళే సందర్భంలో అతనికి వెళ్లటానికి కాళ్లు రాలేదట. అవును వదలిపోలేని దూడవలె వ్రేలాడి పోయాడట. ఆమెను ప్రత్యక్ష దైవంగా భావించేవాడు కనుక కడసారిగా ప్రదక్షిణం చేశాడు. తల్లిఉల్లి పోతూ తల్లిని వదలి వెళ్లలేక వెళ్లలేక కాళ్లీడ్చుకుంటూ ఇంటి పోయిన ఆర్ద్రమూర్తి.

సీతాపరిత్యాగ ఘట్టంలో లక్ష్మణుడు ఒక కరుణరసం మూర్తిని ధరించిందా అన్నట్లు ఉండే మహానుభావుడుగా మనకు కనిపిస్తాడు.

**2. సీత శీలము నభి వర్ణింపుడు.**

సీత అయోనిజ. భూమిలో నాగటిబాలునుండి వెలువడిన మహనీయ చరిత్ర. ఆమె జనకుని బిడ్డగా పెరిగింది. జనకుడు పండిన నిండిన వైరాగ్యంతో ప్రశస్తి కన్నవాడు. ఆ పెంపకం చేత ఆమె కూడా దివ్యమైన మనస్తత్వంతో జీవించింది.

జనపవాదంతో సీతాపరిత్యాగం చేయటానికి నిర్ణయించాడు రాముడు. ఆ నిర్ణయం అతని గుండెలో నిలిపిన కుమ్ముమవంటిది. అయినా రాజధర్మం అతిక్రూరమైనది. కనుక ఆచరించటానికే పూనుకొన్నాడు. ఆ పని లక్ష్మణుని మీద పెట్టాడు. లక్ష్మణుడు ఆమెను అరణ్యంలో దింపాడు. ఆమె తన ప్రియభర్త తన కోరికను తీర్చటానికి అడవికి పంపాడనుకుంటున్న సమయంలో పిడుగువంటి మాటను వినిపించాడు లక్ష్మన్న. ఆమెకు అదివినగా కలిగిన దుఃఖం అవధులు లేనిది. అయినా కొంతసేపటికి తేరుకొని తన దుఃఖాన్ని పెక్కువిధాలుగా వ్యక్తం చేసింది.

శ్రీరాముని పెద్దగా నిందించలేదు. "ఇడుమలఁ జెందుమంచు విధి యీధర నన్ను సృజించాడన్నది." నా కోరికయే నాకు ప్రమాదకరంగా పరిణమించిందని వాపోయింది. పిడుగుకంటె భయంకరమైన వార్త విని కూడా గుండె చిద్రుపలు కాలేదని పలవించింది. ఒక దశలో ఆశాపాశంలాగుతూ ఉండగా నీవు పొరపాటున వినలేదు కదా! అని లక్ష్మణునితో అన్నది. అని మళ్ళీ అంత ఉత్తమవ్యక్తిని శంకించినందుకు దుఃఖపడింది. తనకు గంగయే గతి అని మరణ వ్యవసాయాన్ని కూడా భావించింది. వెనకటి అడవుల వాసానికి ఇప్పటికీ తేడా ఉన్నదని సహేతుకంగా ప్రకటించింది. రాముడు తన్ను విశ్వాసంలోనికి తీసుకొని సంగతిని తెలియజేసి ఒప్పించి పంపితే ఎంత బాగుండును - అన్నది. అయినా శ్రీరామచంద్రుని అసదృశమైన సౌందర్యంగల ముఖాన్ని తనివి తీరా వర్ణించి అట్టిముఖాన్ని మళ్ళీ చూచే భాగ్యం ఈ దేహం ఉండగా కలుగదేమో అని శోకార్తయై పోయింది.

తన పవిత్రతను పుట్టినది మొదలు అగ్ని ప్రవేశం వరకు జరిగిన సంగతులను స్మరించి ప్రకటించింది. మునిపత్నులు ఒంటరిగా అడవులకు ఎందుకు వచ్చావు అంటే ఏమి సమాధానం చెప్పాలో తోచక చస్తున్నానని సతమతమై పోయింది.

చివరకు రామునికి జనాపవాదం సహిస్తానని వెల్లడించింది. అత్తలకు, భర్తకు గౌరవం చెడకుండా నమస్కారాలు తెలియజేసింది.

ఈ విధంగా సీత ఉత్తమశీలం మనకు ఈ పాఠ్యంలో చక్కగా వ్యక్తమౌతున్నది. ఒక వ్యక్తి గుణశీలాలు సంతోష సమయాలలో కంటె ఆ పత్సమయాలలోనే చక్కగా నిరూపణకు వస్తాయి. ఏ వ్యక్తి వలన తనకు మరణ వేదనను మించిన వేదన కలుగుతున్నదో ఆ వ్యక్తియందలి ప్రేమాదిభావాలను ఏ మాత్రమూ చెడకుండా నిలుపుకోవటం పరమోత్తమ శీలంగా మనం పరిగణిస్తే అట్టి మహోన్నత శీలం కల వ్యక్తి సీత అని మనకు ఈ పాఠ్యం ద్వారా తెలియవస్తుంది.

**3. కంకంటి పాపరాజు కవితావిశేషాలను వెల్లడించండి.**

కంకంటి పాపరాజు కవిత్వం ప్రసన్న మధురంగా ఉంటుంది. సులభంగా అర్థం కావటం ప్రసన్నతకు లక్షణం. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించటం మాధుర్య లక్షణం.

సాధారణంగా తేటతెలుగుపదాలు సందర్భోచితంగా ప్రయోగించటంలో పాపరాజు అందె వేసిన చేయి - సంస్కృత పదాలను కూడా సమయోచితంగా ప్రయోగించటంలో దిట్ట. వీనికి వరుసగా రెండు ఉదాహరణలను చూద్దాం.

"మితి లేని యీ మిడి మేలంపు మెకములు
సకియలబలగమే జనని నీకు"

ఇందులో 'జనని' అనేది తప్ప తక్కిన వన్నీ అచ్చ తెలుగుపదాలే. అటువంటి పదాలకూర్పు కరుణరసాదులలో కమనీయంగా అదుకుతుంది.

"ఆకర్ణాయత నేత్రమై మణిమయోద్య త్కుండలద్వంద్వశో
భా కీర్ణాంచితగల్లమై సురదనంబై సుందర భ్రూయితం
బై కమ్ర స్మిత చంద్రికా విలసితంబై యొప్పు శ్రీరాము మో
మీ కాయంబునఁజూచు భాగ్యమిక లేదేమో సుమిత్రాత్మజా"

అనే యీ పద్యంలో సంస్కృత సమాసాలు అధికంగా, కొంచెం దీర్ఘంగా ఉండటం గమనింపదగిన విషయం. ఈ కూర్పు వర్ణించే వస్తువు యొక్క మహిమను తెలుపటానికి చక్కగా ఉపకరిస్తుంది.

చక్కని నుడికారాలు కవిత్వానికి సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాయి. పాఠకులను పట్టి నిలిపే సామర్థ్యం వానికి ఉంటుంది. పాపరాజు అట్టివానిని ప్రయోగించటంలో దిట్ట.

1. ఒకరి (బల్కనేల
2. ఆ యఘ మూరక పోనె
3. ఇంతకుఁ బూని వచ్చి
4. పోయి రమ్మ
5. ఆజ్ఞఁ దల(దాల్చి

మొదలైనవి సందర్భోచితంగా రూపుదిద్దుకున్నాయి. రసస్ఫూర్తి కలిగించే విధంగా రచన చేయటం ఉత్తమ కవుల లక్షణం. ప్రధానంగా ఈ పాఠ్యంలో కరుణరసం అనుభూతికి వస్తుంది. దానికి తగిన విభావాదులను పాపరాజు చక్కగా కూర్చాడు. పాఠం చదువుతున్నంతసేపూ సహృదయుల హృదయాలలో దుఃఖం ఎగదన్నుకుంటూ రావటం కనిపిస్తుంది.

"ఎడపక పూర్వజన్మముల"

"ఎన్నటికిన్ రఘాద్వహుని నేనును"

"అవని నయోనిజనై పుట్టి" మొదలైన పద్యాలను చదువుతున్నప్పుడు సాధారణంగా చాలామంది కన్నీరు పెడతారు. రసమయ కవిత్వమంటే ఇటువంటిదే.

ఈ విధంగా కంకంటి పాపరాజు కవిత్వం సరస ప్రసన్న మధురంగా జాలు వారింది.

## 8. ఛందస్సు

1. **ఉత్పలమాల :** ప్రతిపాదమునను భ, ర, న, భ, భ, ర, వ అను గణములు ఉండును. 10 వ అక్షరము యతి. ప్రాస నియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | U I I | U I U | I I I | U I I | U I I | U I I | I U |
| ఉదా : | కాంతుడు | నిందజెం | దినినుఁ | గానల | లోపల | డించిర | మ్మనెన్ |
| | భ | ర | న | భ | భ | ర | వ |

'కా - గా' లకు యతి.

2. **చంపకమాల :** ప్రతి పాదమునకు న, జ, భ, జ, జ, జ, ర అను గణములు వరుసగా నుండును. 11వ అక్షరము యతి ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| ఉదా : | వనము | లకేల | వచ్చితి | వివల్ల | భువింబె | డఁబాసి | యొంటిగా |
| | న | జ | భ | జ | జ | జ | ర |

'వ - వ' లకు యతి.

3. **శార్దూలము :** ఈ వృత్తమందలి నాల్గు పాదములందును వరుసగా మ, స, జ, స, త, త, గ అను గణములుండును. యతి 13వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ఉదా : | ఈ కాయం | బునఁజా | చుభాగ్య | మింకలే | దేమోను | మిత్రాత్మ | జా |
| | మ | స | జ | స | త | త | గ |

'ఈ - దే' లకు యతి.

4. **మత్తేభము :** ప్రతి పద్యపాదమున స, భ, ర, న, మ, య, వ అను గణములు వరుసగా నుండును. యతి 14వ అక్షరము. ప్రాసనియమము కలదు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | IIU | UII | UIU | III | UUU | IUU | IU | |
| ఉదా : | జననీ | నీవుమ | హాపతి | వ్రతవు | నీసాశీ | ల్యమిల్లాం | డ్రకై | , ల్ల |
| | స | భ | ర | న | మ | య | వ | |

'జ - సా' లకు యతి.

5. **ఆట వెలది :** 1 - 3 పాదములందు 3 సూర్య గణములు, 2 సూర్య గణములు వరుసగా నుండును. 2 - 4 పాదములందు వరుసగా 5 సూర్య గణములుండును. నాలుగు పాదములందును. 4వ గణము మొదటి అక్షరము యతి. ప్రాసనియమము లేదు. ప్రాసయతి వేయవచ్చును.

సూర్య గణములు (2) - హ గణము (UI), న గణము (III)

ఇంద్ర గణములు (6) - నల (IIII), నగ (IIIU), సల (IIUI), భ (UII), ర (UIU), త (UUI).

ఆటవెలది ఉదాహరణము :-

| | | | | |
|---|---|---|---|---|
| III | III | III | IIUI | UII |
| వినియుఁ | గనియుఁ | బ్రజలు | ననునిందఁ | జేసిఁ |
| న | న | న | సల | భ |

| | | | | |
|---|---|---|---|---|
| UI | UI | III | III | III |
| యంత | మాత్ర | మునకె | యధిపుఁ | డులికి |
| హ | హ | న | న | న |

మొదటి పాదమున 'వి - న' లకు యతి. ఈ పాదమున ప్రాసయతి కలదు.
రెండవ పాదమున 'య - య' లకు యతి
ప్రాసయతి అనగా ప్రాసాక్షరమునకు మైత్రి కలిగిన అక్షరమును యతి స్థానమునకు తరువాతి అక్షర స్థానమున ఉపయోగించుట. పై పద్య పాదములలో మొదట పాదమున ప్రాసయతి చెల్లినది.

వి 'ని' - న 'ను'

6. **తేటగీతి :-** పద్యమందలి 4పాదములందును 1 సూర్య గణము, 2 ఇంద్ర గణములు, 2 సూర్య గణములు వరుసగా ఉండును. ప్రతి పాదమున 4వ గణము మొదటి అక్షరము యతి స్థానము. ప్రాసనియమము లేదు. ప్రాసయతి వేయవచ్చును.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | UI | IIUI | UIU | UI | UI |
| ఉదా : | బంధు | రములైన | యా మహా | ప్రస్త | రంబు |
| | హ | సల | ర | హ | హ |

7. **కందము :** గగ, భ, జ, స, నల అను గణములతో కందపద్య మేర్పడును. 1 - 2 పాదాలను కలిపి పూర్వార్థ మందురు. 2 - 4 పాదాలను కలిపి ఉత్తరార్థమందురు. పూర్వార్థమున 8 గణములు, ఉత్తరార్థమున 8 గణములు ఉండును. (1,3 పాదములలో 5 గణములు ఉండును.) పూర్వర్థము చివర, ఉత్తరార్థము చివర గురువు తప్పక ఉండవలెను. అనగా 8వ గణముగా 'గగ'ము కాని 'స' గణము కాని

ఉండవలెను. 6 వ గణముగా జ గణము కాని, నలము కాని ఉండవలెను. బేసి గణములలో (1 - 3 - 5 - 7) జ గణము ఉండరాదు. 2, 4 పాదములలో 4వ గణాద్యక్షరమునకు యతి వేయబడును. ప్రాసనియమము కలదు.

ఉదా :

| | | |
|---|---|---|
| U I I | I I I I | I I I I |
| అల్లన | నయతని | వచనము |
| భ | నల | నల |

| | | | | |
|---|---|---|---|---|
| U U | I I I I | I I I I | U I I | I I U |
| లెల్లన్ | వినిమొద | లునఱుక | నించుక | వడిలో |
| గగ | నల | నల | భ | స |

'లె - ని' లకు యతి.

8. సీసము : సీస పద్యమునందు నాలుగు పాదములందును వరుసగా 6 ఇంద్ర గణములు, 2 సూర్య గణములు ఉండును. 1 - 3 - 5 - 7 గణాద్యక్షరములకు యతి చెల్లును. ప్రాసనియమము లేదు. ప్రాసయతి వేయవచ్చును. సీస పద్యము తరువాత ఆటవెలదిని కాని, తేటగీతిని గాని రచింపవలెను.

ఉదా:

| | | | |
|---|---|---|---|
| U IU | I I U I | U IU | I I I U |
| ఘోరన | క్రభుజంగ | కోటితో | మలయునీ |
| ర | సల | ర | నగ |

| | | | |
|---|---|---|---|
| I I I I | I I I U | U I | UI |
| ప్రాదములు | కొలంకులే | యంబ | నీకు |
| నల | నగ | హ | హ |

సీస పద్య పాదములో మొదటి భాగమున 'ఘో - కో'లకు యతి. రెండవ భాగమున 'ప్ర - య' లకు యతి.

## 9. అలంకారములు :

1. **ఉపమాలంకారము :** ఉపమానో పమేయములకు మనోహరమైన పోలిక వర్ణింపబడినచో ఉపమాలంకారము.

ఉదా :- అల్లలన యతని వచనము
లెల్లన్ విని మొదలు నఱుక నించుక వడిలోఁ
ద్రెళ్ళిడి కదళిక వలె, హా
తల్లీ! యని బెట్టు సొరిగి ధరపైఁబడియెన్.

లక్ష్మణుని పలుకులు విన్న సీతాదేవి మొదలు నరుకగా కొలది వేగముతో కూలెడి అరటిచెట్టు వలె మూర్ఛిల్లి భూమిపై పడెనని పద్య భావము.

ఉపమేయము - సీతాదేవి
ఉపమానము - కదళిక (అరటిచెట్టు)
సామాన్య ధర్మము - ధరణిపై పడుట
ఉపమా వాచకము - వలె

మొదలునరుకగా ధరణిపై పడుట అరటిచెట్టు నందు, అట్టి ఘోరమైన వచనములు విని నలకూలుట సీత యందును కనబడుచుండుటచే ...పమాలంకారమే పద్యమున కలదు.

**(2) రూపకాలంకారము :-** ఉపమాన, ఉపమేయములకు అభేదమునుగాని, తాద్రూప్యమును గాని వర్ణించుటచే రూపకాలంకారము మేర్పడును.

ఉదా :- క్షుల్లక జన దుష్టవచో
భల్ల కదంబముల హృదయ పద్మమగల భూ
వల్ల భుఁడోరిచె భవదా
యల్లక భారమేమి వినియెదమ్మ రొ యింకన్

ఉపమేయములు - 1. క్షుల్లక జనుల దుష్ట వచనములు
2. హృదయము

ఉపమానములు : 1. భల్ల కదంబములు
2. పద్మము

నీచుల చెడు మాటలు అనెడి బల్లెములచే హృదయము అనే పద్మము బ్రద్దలైనది. ఇక్కడ బల్లెములకు, చెడు మాటలకు అభేదము చెప్పబడినది. అట్లే హృదయమునకు, పద్మమునకు అభేదము చెప్పబడినది. కనుక ఇది రూపకాలంకారము.

**(3) ఉత్ప్రేక్షాలంకారము :-** ధర్మ సంబంధమును బట్టి ఉపమేయమును ఉపమానముగా ఊహించుట 'ఉత్ప్రేక్ష'

ఉదా :- "పురపుర బొక్కుచు దాల్మిదూలి స్రుక్కుచు లేచి కూర్చుండి
శోకర సంబాకారంబు దాల్చిన చందంబున, చిత్రంబు గాత్రంబు
గైకొన్న చెన్నున, సాధ్వసంబు సాధ్వియైన కరణిన్,
కరుణంబు కరణంబు లొందిన తెఱంగున......."

ఉపమేయము - పురపుర పొక్కుచు లేచి కూర్చుండిన సీత

ఉపమానములు - 1. శోకరసంబు ఆకారంబు దాల్చిన చందంబు
2. చిత్తరువు శరీరమును పొందినట్లు
3. సాధ్వసము సాధ్వియైన కరణి
4. కరుణరసము ఇంద్రియములు పొందిన తెఱంగు

ఇచ్చట ఉపమానములన్నియు కవి ఊహలు. ఇవి అప్రసిద్ధమైన ఉపమానములు. అ ప్రసిద్ధమైన ఉపమానాలు ఉన్నందున, దుఃఖంతో ఏడుస్తూ లేచి కూర్చున్న సీతను, శోకరసము ఆకారము ధరించినదా అన్నట్లు ఊహించబడింది. కావున ఇది ఉత్ప్రేక్షాలంకారము. అట్లే సీత "చిత్తరువు శరీరమును పొందినట్లు" ఊహించబడడం వల్ల, మరల "సాధ్వసము సాధ్వియైన కరణి" సీత ఊహించబడడం వల్ల, అట్లే "కరుణరసము ఇంద్రియములు పొందిన తెరంగు" సీత ఊహించబడడం వల్ల ఇది ఉత్ప్రేక్షాలంకారము.

సిలబస్‌లో ఉన్న అర్థాంతర న్యాసము, అంశయోక్తి, స్వభావోక్తి, శ్లేష, దృష్టాంతము అను 5 అలంకారములకు ఈ పాఠ్య భాగమున ఉదాహరణములు లేకపోవుటచే ఇతరములైన ఉదాహరణములు ప్రదర్శింపబడుచున్నవి.

**4. అర్థాంతర న్యాసాలంకారము :-** సామాన్యమును విశేషము చేతగాని, విశేషమును సామాన్యము చేతగాని సమర్థించుట అర్థాంతర న్యాసము.

ఉదా :- (1) హనుమంతుడు సముద్రమును దాటెను.
మహాత్ములకు సాధ్యము కాని దేమున్నది?

ఇందు మొదట వాక్యము విశేషము. రెండవది సామాన్యము. విశేషము సామాన్యముచే సమర్థింపబడెను కావున అర్థాంతర న్యాసము.

**(ii)** గుణవంతులతో స్నేహము చేసిన అల్పులకు కూడ ఘనత లభించును. పూవులతో కూడియుండుట వలన దారము కూడ తలమీద ధరింపబడుచున్నది.

ఇందు మొదట వాక్యము సామాన్యము. రెండవది విశేషము. విశేషము చేత సామాన్యము సమర్థింపబడినది కావున అర్థాంతర న్యాసము.

**(5) స్వభావోక్తి :-** వస్తువు యొక్కజాతి గుణాదుల యందున్న స్వభావమును సహృదయ హృదయంగమముగా వర్ణించినచో 'స్వభావోక్తి' అలంకారమగును.

ఉదా :- మిక్కిలి చంచలములైన కళ్ళు కలవియై, నిశ్చలమైన చెవులు కలవియై జింకలు చూచెను.

ఇచట జింకలు చూచునప్పటి స్థితి స్వాభావికముగా వర్ణింపబడుటచే స్వభావోక్తి.

**(6) అతిశయోక్తి :-** సంబధము లేకున్నను, ఉన్న విషయమును అధికము చేసి చెప్పుట 'అతిశయోక్తి' అలంకారమగును.

ఉదా :- "ఈ పట్టణమునందలి మేడలు చంద్ర మండలమును తాకుచున్నవి." మేడకు, చంద్ర మండలమునకు సంబంధము లేక పోయినను సంబంధమున్నట్లు (తాకుచున్నట్లు) వర్ణింపబడినది కావున అతిశయోక్తి.

**(7) శ్లేష :-** అనే కార్థములను ప్రతిపాదించుట శ్లేషాలంకారమగును. (నానార్థ సంశ్రయము శ్లేష)

ఉదా :- రాజు కువలయానంద కరుడు.

ఇచట రాజు శబ్దమునకు ప్రభువు, చంద్రుడు అను రెండర్థములు గలవు. కువలయ శబ్దమునకు భూమి, నల్లకలువ అను రెండర్థములు గలవు. ప్రభువు భూమికి (భూప్రజలకు) ఆనందమును కలిగించుననియు, చంద్రుడు కలువకు ఆనందమును కలిగించుననియు రెండు అర్థములు శ్లేషాలంకారముచే ఏకకాలమున సిద్ధించుచున్నవి.

**(8) దృష్టాంతము :-** ఉపమాన ఉపమేయ వాక్యాల యొక్క వేరు ధర్మాలను బింబ ప్రతిబింబ భావముతో వర్ణించి చెప్పినచో 'దృష్టాంతాలంకారము" అనబడును.

ఉదా :- రాజా! నీవే కీర్తిమంతుడవు. చంద్రుడే కాంతిమంతుడు.

ఇందు రాజు ఉపమేయము. చంద్రుడు ఉపమానము. ఉపమేయమైన రాజు యొక ధర్మము కీర్తి. చంద్రుని యొక్క ధర్మము కాంతి. కీర్తి - కాంతి అనునవి రెండును భిన్న ధర్మములను కలిగియున్నవి. దిక్కుల చివరి వరకు వ్యాపించుట వీని సమాన ధర్మము. ఈ రెండును బింబ ప్రతిబింబ భావముతో వర్ణించబడినవి కావున ఇది దృష్టాంతాలంకారమగుచున్నది.

## సారాంశము :-

ఈ పాఠ్యభాగమున అన్నియు కరుణ రసాత్మకమైన సన్నివేశములే. లక్ష్మణుడు రామాజ్ఞను సీతకు తెలుపు ఘట్టమును, అది విన్న సీత మూర్ఛిల్లి తెప్పరిల్లిన సన్నివేశమును, అతి వేలముగా దుఃఖించిన సీత తన దురదృష్టమును తానే నిందించుకొను ఘట్టమును కంకంటి పాపరాజు హృదయము కరుగునట్లు చిత్రించినాడు.

ప్రశ్నలు :- (1) సీతా పరిత్యాగ వృత్తాంతమును తెలుపునది.

(2) రామాజ్ఞ విన్న సీత లక్ష్మణునితో చెప్పిన మాటలను వివరించండి.

రచయిత
**ఆచార్య శలాక రఘునాథశర్మ**
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపూర్.

# ఖండం : 2

## పాఠం : 1 ఆధునిక పద్య భాగము

## ప్రతిజ్ఞ

- శ్రీశ్రీ

### శీర్షికలు :

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు అర్థాలు
5. సందర్భ సహిత వ్యాఖ్యలు
6. ప్రశ్నలు - సమాధానాలు

### లక్ష్యం :

ఈ పాఠంలో శ్రమైక జీవన సౌందర్యాన్ని గానంచేస్తూ దానికి సమానమైన సౌందర్యం ముల్లోకాలలో, మూడు కాలాలలో లేనేలేదని చాటిచెప్పడం అభ్యుదయ కవితా యుగకర్త శ్రీశ్రీ ధ్యేయంగా కన్పిస్తుంది.

### 1. కవి పరిచయం :

తెలుగు కవిత్వానికి అంతర్జాతీయ దృక్పథాన్ని, ఖ్యాతిని కలిగించిన మొట్టమొదటి కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. ఈయన 1910 ఫిబ్రవరిలో విశాఖపట్నంలో జన్మించాడు. ఈ సంవత్సరం గురజాడ అప్పారావు ముత్యాలసరాలు రాసిన సంవత్సరం, బరంపురంలో సామూహిక వర్ణాంతర భోజనం ఏర్పాటు చేసిన సంవత్సరం కావడం విశేషం. అయితే ఈయన పుట్టిన తేదీ, నెల విషయాలలో భిన్నాభిప్రాయాలున్నాయి. 15.4.1910 అని కొందరు, 30.4.1910 అని ఇంకా కొందరు అంటున్నారు. తాను మాత్రం 2.1. 1910న పుట్టినట్లు శ్రీశ్రీ నమ్ముతున్నాడు. అప్పలకొండ, పూడిపెద్ది వేంకట రమణయ్యలు ఈయన తల్లిదండ్రులు. శ్రీరంగం సూర్యనారాయణకు ఈయనను దత్తత ఇవ్వడం వల్ల ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. 1925 - 27 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్, 1928 - 31 సంవత్సరాల మధ్య మద్రాసులో బి.ఏ పూర్తిచేశాడు.

తొలితరం రచయితలలా శ్రీశ్రీ కూడా బాల్యంలో గ్రాంథిక పద్యాలు, నాటకాలు, ఆనాటి అనువాద నవలల ఫక్కీ రచనలు చేశాడు. ఎనిమిదవ ఏటనే పొట్టి, పొడుగు పాదాలతో కందపద్యం రాశాడు. అందులో యతిప్రాసలు లేనందువల్ల తండ్రి ఆదేశాన్ననుసరించి అప్పకవీయ, సులక్షణ సారాలను అధ్యయనం చేశాడు. చిన్న వయసులోని 'సావిత్రీ సత్యవంతులు' అనే పద్యనాటకాన్ని, 'వీర నరసింహ విజయ సింహులు' అనే నవలను రాశాడు. పదిహేనేళ్ళ వయసులో 'పరిణయ రహస్యము' అనే నవలా రచన చేశాడు. అది నేడు అలభ్యం. పదహారు ఖండికలతో 'ప్రభవ' పద్య సంపుటి 1928 లోను, సుప్తాస్థికలు పద్యరచన 1929 లోను వెలువడ్డాయి.

బతుకుతెరువు కోసం శ్రీశ్రీ అనేక ఉద్యోగాలు చేశాడు. విశాఖపట్నంలోని మిసెస్ ఎ.వి.ఎన్ కళాశాలలో ఒక సంవత్సరం పాటు డెమాన్‌స్ట్రేటర్‌గా, హార్బర్‌లో గుమాస్తాగా, 'విశాఖ' పత్రికలో రిపోర్టర్‌గా, ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్‌గా, ఆకాశవాణిలో ఉద్యోగిగా ఆనందవాణిలో సబ్ ఎడిటర్‌గా చేసి చివరికి సినిమా రచయితగా స్థిరపడ్డాడు.

కవితలు, కథానికలు, నాటికలు, విమర్శ వ్యాసాలు, శతకాలు, గ్రంథసమీక్షలు, అసంపూర్ణమైన ఆత్మకథలాంటి విభిన్న సాహితీ ప్రక్రియల్లో రచనలు చేశాడు.

**శ్రీశ్రీ రచనలు :**

ప్రభవ, వారం వారం, సంపెంగతోట, 41 ఖండికలున్న మహాప్రస్థానం, అమ్మ, మేమే, మరో ప్రపంచం, త్రీ ఛీర్స్ ఫర్ మ్యాన్, చరమరాత్రి, మానవుడి పాట్లు, సౌదామిని, గురజాడ, మూడు యాభైలు, ఖడ్గసృష్టి, వ్యూలు - రివ్యూలు, శ్రీశ్రీ సాహిత్యం, శ్రీశ్రీ మిసిలినీ, లెనిన్, రెక్క విప్పిన రివల్యూషన్, వ్యాసక్రీడలు, మరో మూడు యాభైలు, చైనా యానం, మరో ప్రస్థానం, పాడవోయి భారతీయుడా! న్యూ ఫ్రాంటియర్స్, అనంతం ప్ర-జ, సిప్రాలి (సిరిసిరిమువ్వ శతకం, ప్రాసక్రీడలు, లిమరిక్కులు), తెలుగువీర లేవరా, రుక్కుటేశ్వర శతకం మొదలైనవి.

సాహితీరంగంలోని చిన్నా పెద్దా రచయితల కావ్యాలను తెలుగు నుంచి ఇంగ్లీషులోకి, ఇంగ్లీషు నుంచి తెలుగులోకీ అనువదించాడు.

మహాప్రస్థానం శ్రీశ్రీని 'శబ్దబ్రహ్మ'గా నిలిపింది. శ్రీశ్రీ ప్రజాకవి. అంతర్జాతీయ కవి. అభ్యుదయ సాహిత్య రథసారథి. 1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్రసాహిత్యలోకాన్ని ఉత్తేజపరిచిన అభ్యుదయ కవిత్వోద్యమ మూల విరాట్టు. ఈయనకు 'సాహిత్యాచార్య' 'మహాకవి' అనే రెండు బిరుదులున్నాయి.

1954 లో స్టాక్‌హోంలో జరిగిన ప్రపంచశాంతి మహాసభలకు భారత ప్రతినిధిగా హాజరయినాడు. 1971 లో అభ్యుదయ రచయితల సంఘంలో చీలిక వచ్చినపుడు విప్లవ రచయితల సంఘస్థాపకుల్లో ఒకడిగా ఆ ఉద్యమానికి అండగా నిలిచి అధ్యక్ష పీఠాన్ని అలంకరించాడు. కవిగా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, సోవియట్‌లాండ్ నెహ్రూ అవార్డు లాంటి అత్యుత్తమ పురస్కారాల్ని పొంది, ఆకాశమంత ఎత్తు ఎదిగిన మహాకవి శ్రీశ్రీ 1983 లో మరణించాడు.

'కవిత్వమున్నంతకాలం, కవిత్వ రసాస్వాదన ఉన్నంతకాలం కవితానుభూతి ఉన్నంతకాలం అతడు ఉంటా'డని బూదరాజు రాధాకృష్ణ అన్నమాటలు ప్రత్యక్షరసత్యాలు.

## 2. పాఠ్యభాగ సందర్భం :

ఆధునికాంధ్ర సాహిత్యం గర్వించదగ్గ మహాకావ్యం మహాప్రస్థానం. 1930 ప్రాంతంలో అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం మొత్తం ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. 1926 - 40 ల నడుమ ప్రపంచ వ్యాప్తంగా మానవ జాతి ఎదుర్కొన్న ఆర్థిక మాంద్యాన్ని, నాటి రాజకీయ పరిస్థితులను ఆకళింపు చేసుకొని మార్క్సిస్టు దృక్పథంతో 'మహాప్రస్థానం' రచించాడు శ్రీశ్రీ.

వర్గ సంఘర్షణ ఫలితమే మానవజాతి చరిత్ర అన్న మార్క్సు సిద్ధాంతాన్ని, అందులోని సారాన్ని గ్రహించి "పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను" అని సంక్షిప్తంగా తెలియజేశాడు శ్రీశ్రీ. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి అయ్యినకొద్దీ దానితో సమంగా కార్మిక వ్యవస్థ బలపడక తప్పదు. క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడక తప్పదు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీ విధానాన్ని నిర్మూలించడానికి విశ్వశ్రామికులంతా ఏకం కావాలన్న మార్క్సు ప్రబోధాన్ని అంగీకరిస్తూ "ఖండాంతర నానాజాతులు చారిత్రక యథార్థతత్వం చాటిస్తారొక గొంతుకతో" అని విశ్వశ్రామికుల సమిష్టి చైతన్యాన్ని గానం చేశాడు.

శ్రీ అంటే ఒక వ్యక్తికి గౌరవ వాచకమైతే శ్రీశ్రీ అంటే ఒక జాతికే గౌరవ వాచకమని మనందరి మనో భావాన్ని కవిత్వీకరించాడు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. కొవ్వొత్తిని రెండువైపులా వెలిగించాను అది శ్రీశ్రీలా వెలిగింది అంటాడు ప్రసిద్ధ విమర్శకుడు పురిపండా అప్పలస్వామి.

మహాప్రస్థానం గేయసంపుటిలో మహాప్రస్థానం, వాడు, మిథ్యావాది, వ్యత్యాసం, దేశ చరిత్రలు అనే ఖండికలు శ్రీశ్రీ ప్రాపంచిక దృక్పథానికి; 'ఋక్కులు', 'నవకవిత' కవిత్వానికి; అవతారం అనే గేయం దార్శనికతకు; బాటసారి, భిక్షువర్షీయసి గేయాలు సమాజిక స్పృహకు, మానవతాదృష్టికి; జగన్నాథుని రథచక్రాలు తాడిత పీడిత పక్షపాతానికి; మానవుడా గేయం మానవ ప్రాముఖ్యతకు; జయభేరి, ప్రతిజ్ఞ ఖండికలు శ్రమ జీవన సౌందర్యానికి ప్రతీకలు. మహాప్రస్థానంలోని గేయాలన్నీ యువకుల్ని విపరీతంగా ఆకర్షించాయి.

'ప్రతిజ్ఞ' గేయం 1937 లో వెలువడింది. 'అభ్యుదయ రచయితల మేనిఫెస్టో' ఈ గేయానికి ప్రేరణ. మహాప్రస్థానంలోని ఒక ప్రముఖ కవితా ఖండిక 'ప్రతిజ్ఞ' ప్రస్తుత పాఠ్యభాగం.

## 3. పాఠ్యభాగ సారాంశం :

ప్రతిజ్ఞ ఖండికలో కర్షకుల చెమట బిందువులకు ఖరీదు లేదనీ, కార్మిక ధీరుల విలాపాగ్నులకు, విషాదాశ్రులకు వెలకట్టగల వ్యాపారి లేడనీ, ఎందరెందరో అనాథులు, అశాంతులంతా ఈ వ్యవస్థ మీద తిరగబడతారనీ చెబుతూ, కవిగా తాను వాళ్ళకు జరుగుతున్న అన్యాయాల్ని అణచడానికి తనవంతు కర్తవ్యంగా కావ్యరచన చేస్తాననీ ఆ కావ్యంలోని కొత్త వస్తువుకూ, ఆ కావ్య రచనలోని కొత్త ధోరణికీ అన్ని వృత్తుల వాళ్ళ లక్షల పనిముట్లు మూలాధారాలవుతాయనీ ప్రతిజ్ఞ చేశాడు కవి.

## 4. కఠిన పదాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| పొలాలు (పొలము+లు) | = | భూములు |
| హలాలు (హలము+లు) | = | నాగళ్ళు |
| ఇలాంతలం | = | భూతలం |
| హేమం | = | బంగారం |
| జగానికి | = | లోకానికి |
| విరామం | = | విశ్రాంతి |
| పరిశ్రమించే | = | విశేషంగా పనిచేసే |
| ధరిత్రి | = | భూమి |
| బలి | = | సమర్పణ |
| కర్షకవీరులు | = | రైతువీరులు |
| కాయం | = | శరీరం |
| కాలువకట్టు | = | ప్రవహించు |
| ఘర్మజలం | = | చెమట బిందువులు |
| ఖరీదు | = | వెల |
| నరాలు (నరము+లు) | = | నాడులు |
| బిగువు | = | గట్టితనం |
| కరాలు (కరము+లు) | = | చేతులు |
| సత్తువ | = | శక్తి |
| వరాలు | = | కాసులు |
| గని | = | బంగారం మొదలైన వాటికి నిలయమైన చోటు |

| | | |
|---|---|---|
| వని | = | అడవి, వనం |
| కర్ఖానా | = | కర్మాగారం |
| పరిక్లమిస్తూ | = | ఎక్కువగా శ్రమిస్తూ |
| పరిప్లవిస్తూ | = | ఎక్కువగా కదులుతూ |
| ధనికస్వామి | = | ధనవంతుడు, పెట్టుబడిదారుడు |
| దాస్యం | = | ఊడిగం |
| యంత్రభూతములు | = | యంత్రాలు అనే భూతాలు |
| కోర | = | పొడుగాటి పల్లు |
| ధీరులు | = | ధైర్యం కలిగిన వాళ్ళు |
| తొణకు | = | పొంగిపొర్లు |
| విలాపాగ్నులు | = | ఏడుపు అనే అగ్నులు |
| విషాదాశ్రులు (విషాద+అశ్రులు) | = | దుఃఖ బాష్పాలు |
| షరాబు | = | విలువకట్టేవాడు |
| నిరపరాధులు | = | తప్పుచెయ్యని వారు |
| దురదృష్టం | = | అదృష్టం లేకపోవడం |
| చెరసాల | = | జైలు |
| లోహ రాక్షసుల | = | లోహం అనే రాక్షసుల, యంత్రాల |
| పదఘట్టన | = | పాదాల తాకిడి |
| కొన ప్రాణం | = | పోబోతున్న ప్రాణం |
| కనలేవాళ్ళు | = | కాలేవాళ్ళు |
| కడుపుమంట | = | ఆకలిచిచ్చు |
| తెగించి | = | ధైర్యం చేసి |
| సమ్మె | = | తిరుగుబాటు |
| నిష్ఫలం | = | ఫలితం లేనిది |
| జని | = | (జన్మ, పుట్టుక) బతుకు |
| నిష్ఠురం | = | కష్టం, భారం |
| నూయి | = | దిగుడు బావి |
| గోయి | = | పెద్ద గుంత |
| అనేకులు | = | చాలామంది |
| అభాగ్యులు | = | భాగ్యంలేని వాళ్ల (పేదవాళ్ళు) |
| అనాథులు | = | దిక్కులేని వాళ్ళు |
| అశాంతులు | = | శాంతిలేని వాళ్ళు |
| దీర్ఘశ్రుతి | = | ఎక్కువగా వినిపించేటట్లు |

| | | |
|---|---|---|
| తీవ్రధ్వని | = | మిక్కిలి శబ్దం |
| విప్లవ శంఖం | = | విప్లవం అనే శంఖం |
| లోకం | = | ప్రపంచం |
| అన్యాయం | = | న్యాయంలేనిది |
| కూల్చే | = | కుంగదీసే |
| వేదన | = | బాధ |
| దారిద్ర్యం | = | పేదరికం |
| దౌర్జన్యం | = | చెడ్డతనం, (క్రూరంగా ఆలోచించడం.) |
| పరిష్కరించు | = | చక్కబెట్టు |
| బహిష్కరించు | = | విడిచిపెట్టు |
| బాట | = | దారి |
| కదలే | = | మెదలే |
| నవ్యకవిత్వం | = | కొత్త తరహా కవిత్వం |
| కల్యాణం | = | శుభం |
| సౌభాగ్యం | = | భాగ్యవంతం |
| సమర్పణం | = | బాగా అప్పగించడం |
| సమర్చనం | = | సరైన రీతిలో పూజించడం |
| త్రిలోకాలు | = | మూడు లోకాలు |
| త్రికాలాలు | = | మూడు కాలాలు (భూత భవిష్య ద్వర్త మానాలు) |
| శ్రమైక జీవనం | = | ఎల్లప్పుడు శ్రమతో కూడిన జీవనం. |
| సౌందర్యం | = | అందం, చక్కదనం |
| సమానం | = | సాటి |
| కష్టజీవులు | = | శ్రమపడే మనుషులు (శ్రామికులు) |
| కర్మవీరులు | = | పనిని నమ్ముకొని బతికే వాళ్ళు |
| నిత్య మంగళం | = | నిరంతర శుభం |
| నిర్దేశిస్తూ | = | నిర్ణయిస్తూ |
| స్వస్తి (సు+అస్తి) | = | మేలు, మంచి |
| వాక్యములు | = | పలుకులు |
| సంధానిస్తూ | = | సమకూరుస్తూ |
| స్వర్ణవాద్యములు | = | బంగారం లాంటి వాద్యాలు (మంచి వాద్యాలు) |
| సంరావిస్తూ | = | మోగిస్తూ |

| | | |
|---|---|---|
| వ్యథార్థ (వ్యథ+ఆర్త) | = | కష్టాలతో కూడిన బాధ |
| యథార్థ దృశ్యం | = | కనులకు కనిపిస్తున్న సంఘటన |
| పునాదిగా | = | మూలంగా |
| జనించబోయే | = | పుట్టబోయే |
| భావి | = | రాబోయే |
| వేదముల | = | జ్ఞానాల |
| జీవనాదములు | = | ప్రాణస్పందనలు |
| జగత్తుకంతా | = | ప్రపంచానికంతా |
| చవులిస్తానోయ్ | = | రుచి చూపిస్తానోయ్ |
| కమ్మరి | = | ఇనుప పనిముట్లు చేసేవాడు |
| కొలిమి | = | కమ్మరి నిప్పునుంచే పల్లం |
| కుమ్మరి | = | కుండలు చేసేవాడు |
| చక్రం | = | మట్టితో కుండలు చేసే సాధనం |
| జాలరి | = | చేపలు పట్టువాడు |
| పగ్గం | = | వల |
| సాలెలు | = | బట్టలు నేసేవాళ్లు |
| మగ్గం | = | వస్త్రాల నేతకు ఉపకరించే సాధనం |
| శరీర కష్టం | = | శారీరక శ్రమ |
| స్ఫురింపజేసే | = | గుర్తుకు తెచ్చే |
| సహస్రవృత్తుల | = | వేలవేల పనుల |
| సమస్త చిహ్నాలు | = | అన్ని గుర్తులు |
| వినుతించే | = | ఎక్కువగా పొగిడే |
| నవీనగీతి | = | కొత్త కవిత్వం |
| విరుతించే | = | విశేషంగా ధ్వనించే |
| నవీనరీతి | = | కొత్త విధానం |
| భావం | = | ఆలోచన |
| భాగ్యం | = | సంపద |
| ప్రాణం | = | జీవం |
| ప్రణవం (ప్ర+నవం) | = | మిక్కిలి నవ్యం, మిక్కిలి కొత్తది, ఓంకారం. |

## 5. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. ఘర్మజలానికి ఖరీదు లేదోయ్

**పరిచయం :** ఈ కవిత్వ పాదం మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కావ్యం నుంచి గ్రహించబడిన 'ప్రతిజ్ఞ' అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :** నాగళ్ళతో పొలాలనన్నింటినీ దున్ని, భూతలంలో బంగారు పంటల్ని పండించి, లోకం నిండా సుఖ సంతోషాల్ని నింపే రైతుల నిరంతర శ్రమ జీవనాన్ని ప్రశంసించే సందర్భంలో కవి చెప్పిన కవితా మయమైన పలుకులివి.

**వివరణ :** మన దేశవాసులకు వ్యవసాయం ప్రధాన వృత్తి. ఇక్కడ రైతులే దేశానికి వెన్నెముకలు. అంతేకాదు రైతులే రాజులు. రైతులు తాము బతుకుతూ ఇతరుల్ని బతికిస్తున్నారు. వాళ్ళు చేస్తున్నది వ్యవసాయమే కానీ వాళ్ళు సమాజానికి సాయం చేస్తున్నారు. అందుకే నిరంతరం అనంతమైన శ్రమకు గురి అయి పొలాలన్నిటినీ నాగళ్ళతో దున్నుతున్నారు. తమ బలాన్నంతా భూమాతకు బలి చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతువీరుల శరీరాల నిండా కాలువల్లాగా ప్రవహించే చెమట బిందువుల పరంపరకు - ధర్మఘర్మ జలానికి - ఖరీదు లేదని కవి నిర్ద్వంద్వంగా అంటున్నాడు. అంటే అవి ఎంతో విలువైనవనీ, వేటితోనూ వాటిని కొనడానికి వీలుకాదని అర్థం

**విశేషాంశం :** ఘర్మజలం అంటే చెమట బిందువులు. ఇవి సామాన్యులకు ఒకే రకంగా కనిపిస్తే మహాకవికి రెండు రకాలుగా కనిపించాయి. ధర్మఘర్మ జలంగా, అధర్మ ఘర్మ జలంగా. శ్రమించడం వల్ల వచ్చిన చెమట బిందువులు ధర్మఘర్మజలం. భయభ్రాంతుల వల్ల కలిగిన స్వేదబిందువులు అధర్మ ఘర్మజలం. కవి తానిక్కడ శ్రమించడం వల్ల వచ్చిన చెమట బిందువులను - ధర్మ ఘర్మ జలాన్ని - గూర్చి పేర్కొంటున్నాని సూచిస్తున్నాడు.

## 2. విలాపాగ్నులకు, విషాదాశ్రులకు ఖరీదు కట్టే షరాబు లేడోయ్

**పరిచయం :** ఈ కవితా పాదాలు శ్రీశ్రీ మహాకవి రచించిన మహాప్రస్థానం నుంచి స్వీకరించడిన ప్రతిజ్ఞ ఖండికలోనివి.

**సందర్భం :** ప్రపంచ భాగ్యం అభివృద్ధి కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి శక్తివంచన లేకుండా శ్రమించే శ్రామికుల విలాప విషాదాలకు వెలకట్టగలిగిన వ్యాపారి (నేర్పరి) లేడని కవి చెబుతున్న సందర్భంలోని పంక్తులివి.

**వివరణ :** ప్రపంచ భాగ్యాన్ని పెంచడంలో కార్మికుల పాత్ర అసదృశమైంది.

నరాల పటిష్టతతో, చేతుల శక్తితో వరాల వాన కురిపించి తద్వారా సర్వ ప్రపంచపు సౌభాగ్యపు పంటలు పండించాలని గనుల్లో వనాల్లో, పరిశ్రమల్లో విశేషంగా శ్రమపడుతూ, పరుగులు తీస్తూ, పడుతూ లేస్తూ ధనికస్వాములకు దాస్యం చేస్తూ ప్రాణాలకు తెగించి యంత్రాల భూతాల వదన గహ్వరాల్లోకి దూసుకు వెళ్ళే ధీరులైన కార్మికుల కణకణమండే విలాపాగ్నులకు, గలగల తొణికే విషాదాశ్రులకు విలువ కట్టగల నేర్పరి అయిన వ్యాపారి లేడు. అంటే శ్రామికుల శ్రమ ఊహకందనిది, వర్ణనాతీతమైనది అని అర్థం.

**విశేషాంశం :** కణకణమండే (1) గలగలతొణికే (2)
విలాపాగ్నులకు (1) విషాదాశ్రులకు (2)

అనే పంక్తుల్లో యథాసంఖ్యాలంకారముంది. కణకణమండే విలాపాగ్నులకు, గలగల తొణకే విషాదాశ్రులకు అని అర్థం. సాదాసీదా వాక్యాలు అలంకారయుతాలై, అర్థవంతాలై పరితల్ని ఆకట్టుకుంటున్నాయి.

3. దీర్ఘ శ్రుతిలో తీవ్ర ధ్వనితో
విప్లవ శంఖం వినిపిస్తారోయ్

**పరిచయం :** ఈ కవిత్వ పాదద్వయం శ్రీరంగం శ్రీనివాసరావు రచించిన మహాప్రస్థానంలోని ప్రతిజ్ఞ పాఠ్యభాగం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా కన్నీళ్ళ కడళ్ళను ఈది ఈది, ఇంక ఈదలేక దిక్కూ మొక్కూలేని దీనులంతా వ్యవస్థ మీద తిరగబడతారని చెప్పే సందర్భంలో హెచ్చరిక రూపంలో కవి విసిరిన మాటల ఈటెలివి.

**వివరణ :** అపరాధులకు అరదండలకు (సంకెళ్ళకు), చెరసాలలకు అవినాభావ సంబంధం. నిరపరాధులకు వాటితో సంబంధం లేదు. అయితే కొందరు నిరపరాధులు చెరసాలల్లో బంధీలవుతారు. దానికి కారణం వాళ్ళ దురదృష్టం. ఆ దురదృష్టం ఆర్థిక స్థోమత,

అధికారపు అండదండలు లేకపోవడంవల్ల దాపురించింది. యంత్రాల తాకిడితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విలవిలలాడిపోతారు. చేసిన కష్టంతో వచ్చే నాలుగు రాళ్ళతో కడుపు నిండక ఆకలి మంటతో గత్యంతరం లేక సమ్మెలు చేస్తారు. శ్రమ అంతా వ్యర్థమై, బతుకు భారమై ఆత్మహత్యలకు పాల్పడతారు. ఇలా అలజడికి లోనైన వాళ్ళు, దీనులు, దిక్కులేనివాళ్ళు అనేకానేకులు అర్జున పర్జన్య గర్జనతో విప్లవ శంఖాన్ని పూరిస్తారు. వ్యవస్థ మీద తిరగబడి విజయఢంకా మోగిస్తారనే హెచ్చరిక చేస్తున్నాడు కవి.

4. భావి వేదముల జీవనాదములు
జగత్తుకంతా చవులిస్తానోయ్

**పరిచయం :** సుందరమైన ఈ కవితా పాదాలు శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంలో నుంచి గ్రహించబడిన ప్రతిజ్ఞ అనే పాఠ్యభాగం లోనివి.

**సందర్భం :** రాబోయే విజ్ఞాన సంపదల ప్రాణస్పందనలు లోకానికంతా రుచి చూపిస్తాననే సందర్భంలో కవి పలికిన పలుకులివి.

**వివరణ :** సమాజంలోని అన్యాయాలను, దహించివేసే ఆకలినీ, కూల్చివేసే వేదననూ, దారిద్ర్యాల్నీ, దౌర్జన్యాల్నీ రూపమాపే దారులు వెతుకుతూ, పాటలు రాస్తూ తనలో పొడ సూపుతున్న కొత్త కవిత్వం శ్రామికుల సంక్షేమం కోసం సమర్పించబోతున్నానంటున్నాడు కవి. శ్రమతో కూడిన బతుకులోని అందానికి పోలికగా నిలిచేది ముల్లోకాలలో, మూడు కాలాలలో ఏదీ లేదని శ్రామిక వీరులకు నిరంతర శుభాన్ని కాంక్షిస్తూ, మంచి కలగాలనే వాక్యాల్నీ సమకూరుస్తూ బాధాతప్త జీవితాల వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఇకముందు పుట్టబోయే నూత్న జ్ఞాన సంపదల ప్రాణస్పందనలు జగానికంతా రుచి చూపిస్తానంటున్నాడు.

5. నా వినిపించే నవీనగీతికి
నా విరచించే నవీన రీతికి
భావం! భాగ్యం! ప్రాణం! ప్రణవం!

**పరిచయం :** కవితామయమైన ఈ పాదాలు శ్రీశ్రీ మహాప్రస్థానం నుంచి గ్రహించబడిన ప్రతిజ్ఞ అనే పాఠ్యాంశం లోనివి.

**సందర్భం :** లోకంలోని అన్ని వృత్తుల అన్ని పనిముట్లు తన నూత్న కవిత్వానికి ఆధారాలని చెప్పే సందర్భంలో కవి నుడివిన మంచి నుడువులివి.

**వివరణ :** కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి వల, సాలెల మగ్గం ఇలా కాయకష్టాన్ని గుర్తుకు తెచ్చే గొడ్డలీ, కొడవలీ, రంపం, నాగలీ లాంటి వేనవేల వృత్తుల లక్షలాది పనిముట్లన్నీ తాను విశేషంగా ప్రస్తుతించే, ధ్వనింపజేసే, తాను వినిపించే కొత్త తరహా గీతానికి, తాను రచించే నూతన విధానానికి భావంగా నిలుస్తాయనీ, భాగ్యంగా వెలుస్తాయనీ, ప్రాణంగా స్పందిస్తాయనీ ప్రణవంగా పరిణమిస్తాయని కవి ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు.

**విశేషాంశం :** అంతకు ముందంతా దేవుడు, రాజు, రాణి, సేనానాయకుడు ఇలా అసామాన్యులే కథానాయకులు. తన కవిత్వంలో కమ్మరి, కుమ్మరి, జాలరి, సాలెలలాంటి సామాన్యులు కథానాయకులు, వాళ్ళ సాధక బాధకాలే ఇతివృత్తం. అంతకు ముందటి ఛందోలంకారాదులన్నీ ఇప్పుడు లేవు. అన్నీ మారాయి. సులభతరాలయ్యాయి. విషయమూ, వివరించే విధానమూ రెండూ మారాయి అనడాన్ని నవీన గీతికి, నవీన రీతికి అనే మాటలు ధ్వనిస్తున్నాయి.

## 6. ప్రశ్నలు - సమాధానాలు

1. అభ్యుదయ కవితా లక్షణాలను 'ప్రతిజ్ఞ' పాఠ్యాంశానికి అన్వయించండి.

(లేదా)

'ప్రపంచపు బాధ అంతా శ్రీ శ్రీ బాధ' - చర్చించండి.

అభ్యుదయ కవిత్వం 1935 నుంచి 1955 దాకా రెండు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యాన్ని రాజ్యమేలింది. శ్రీ శ్రీ మహాకవి రచించిన మహాప్రస్థానం కావ్యంలోని కొన్ని ప్రముఖ ఖండికలలో 'ప్రతిజ్ఞ' ఒకటి. 1933 లో రాసిన 'జయభేరి' గీతం నుంచే తెలుగులో అభ్యుదయ కవిత్వం ప్రారంభమైనా 1937 లో రాసిన 'ప్రతిజ్ఞ' గీతమే అభ్యుదయ కవితా లక్షణాల్ని సమగ్రంగా సంతరించుకుంది. శ్రీ శ్రీ ప్రపంచ సాహిత్యాన్ని అంతటినీ ఆపోశన పట్టడానికి ప్రయత్నించిన అగస్త్యుడు. అందులో భాగంగానే ఆంధ్రవిశ్వకళాపరిషత్తు గ్రంధాలయంలో అధ్యయనం చేసే సందర్భంలో అబ్బూరి రామకృష్ణరావు లండన్ నగరం నుంచి వెలువడిన అభ్యుదయ రచయితల మేనిఫెస్టో (Progressive writers Manifesto) ను శ్రీ శ్రీ కి అందించాడు. అందులోని ఆలోచనల్ని సమగ్రంగా ఆకళింపు చేసుకొని శ్రీ శ్రీ వాటికి 'ప్రతిజ్ఞ' కవితా రూపాన్ని కల్పించాడు.

అభ్యుదయ రచన అంటే ఏమిటో ప్రముఖ రచయితలిలా అభిప్రాయపడ్డారు. 'అభ్యుదయ రచన సమకాలికమైన జీవన పరిస్థితులకు, రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు, నైతిక సందర్భాలకు, ఐహిక ఆముష్మిక సిద్ధాంతాలకు, వైజ్ఞానిక విశేషాలకనుగుణంగా అనుకూలంగా తగినట్టి, అవసరమైనట్టి మార్పులతో విలసిల్లవలెను.' (పి.వి. రాజమన్నారు)

'పీడింపబడేవాళ్లు, పీడించేవాళ్లు వున్న ఈ వర్గసమాజం వుండాలని ఎవరూ కోరరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటదారి, పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించేవారు ఎప్పుడూ అభ్యుదయ వాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొని వ్రాసేది అభ్యుదయ రచన' (దేవులపల్లి కృష్ణశాస్త్రి).

'అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు, రసాస్వాదనకు సంబంధించినది. సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటు పడుతున్నారు.' (శ్రీ శ్రీ)

ఈ మూడు అభిప్రాయాల్ని పరిశీలిస్తే అభ్యుదయ రచన అంటే సారాంశంగా మనకు తెలిసే విషయాలివి :

1. సమకాలికమైన సర్వ పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందడం.
2. పురోగమనాన్ని పురికొల్పడం (తిరోగమనాన్ని తిప్పి కొట్టడం)
3. సామాన్యుణ్ణి మాన్యునిగా పరిగణించడం
4. సాహిత్యాన్ని సామాన్యులకు సన్నిహితంగా తీసుకురావడం ( సామాన్యుల్ని సాహిత్యంలోకి తీసుకురావడం)

1930-40 ల మధ్య కాలాన్ని ఆర్థికమాంద్యం కారణంగా ఆకలి ముప్ఫైలు (Hungry thirties) అంటారు. మహాప్రస్థానం గీతాలన్నీ దాదాపుగా ఆ కాలంలోనే రచించడం విశేషం. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే ఆ తర్వాతనుంచి దాన్ని నేనే నడిపిస్తున్నానంటాడు శ్రీ శ్రీ ఎంతో ఆత్మవిశ్వాసంతో. చాలామంది రచయితలు గోగోల్ 'ఓవర్ కోట్' లోంచి పుట్టినవాళ్ళే అనే సూక్తి ఉంది రష్యాలో. ఆ మాటే తెలుగులో మహాకవి శ్రీ శ్రీ కి కూడా వర్తిస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అభ్యుదయ కవులుగా ప్రసిద్ధి పొందిన చాలామంది తెలుగు కవులు 'మహా ప్రస్థానం' నుంచి పుట్టినవాళ్ళే కావడం వల్ల.

అభ్యుదయం అనేది ఆకాశంనుంచి ఊడిపడదు అది త్యాగాన్ని కోరుతుంది. స్వార్థం వల్ల జీవనం మరణం. త్యాగం వల్ల మరణం జీవనం. ఈ సత్యాన్ని విశ్వసించి, పాటించినవాళ్ళే మహానుభావులయ్యారు. మహాకవులు కూడా ఈ మార్గాన్నే ఎంపిక చేసుకున్నారు. ఈ వరుసలో శ్రీ శ్రీ ముందున్నాడు.

వాళ్ళు ఏడ్చే ఏడ్పును బట్టి ఆ వ్యక్తుల తాహతును నిర్ణయించవచ్చు. వాళ్ళ బాగోగుల కోసమే ఏడిస్తే వాళ్ల మామూలు మనుషులు. పరులు బాగుపడి పోతున్నారే అని వాపోతే వాళ్ల దుర్మార్గులు. ఇతరులు బాగుపడడం లేదే అని విలపిస్తే, పలవిస్తే వాళ్ల మహాత్ములు. మహాత్ములలాగే మహా కవులు కూడా సమాజం బాగుకోసం శోకిస్తారు.

మహాకవి శ్రీ శ్రీ 'నేను దుఃఖింతు మానవాజ్ఞానమునకు
నేను హర్షింతు మానవ జ్ఞానమునకు
అఖిల మనుజ దుఃఖ ప్రమోదాశ్రు సలిల
ధార భరియింతు' నంటాడు. శ్రీ శ్రీ తన కోసం, తన అభ్యున్నతి కోసం ఏడ్వలేదు. మనిషి ఏ రూపంలో, ఏ మారుమూలలో ఉన్నా అతను అజ్ఞానంలో ఉంటే దానికి ఏడుస్తానన్నాడు. ఇలా ఇతరుల అజ్ఞానానికి ఎందరేడ్వగలరు? శ్రీ శ్రీ లాంటి అభ్యుదయ మహాకవులు తప్ప.

సామాన్య మానవుణ్ణి అనవరతం వేధిస్తున్న, కలవరపెడుతున్న ప్రతి విషయం వాస్తవిక వాదులకు కవితా వస్తువయింది.

సామాన్య ప్రజలు మెచ్చుకోని సాహిత్యం అర్థరహితమనే వాదం మొదలైంది. 'కళను కానీ, కవిత్వాన్ని కానీ సమాజం నుంచి విడదీసి విమర్శించి ఇది ఇదని నిర్ణయించడానికి వీలులేదు. అలా విడదీస్తే అది అగమ్య గోచరమవుతుంది. దానికి మారకం లేని కరెన్సీనోటు గతిపడుతుంది' అంటుంది కమ్యూనిస్టుపార్టీ మ్యానిఫెస్టో.

'శ్రమే సంస్కృతికి, విజ్ఞానానికి కూడా మూలకారణం' అన్న మాక్సింగోర్కీ మాటలు, 'వ్యవసాయం చేయడమే మానవుని ప్రధానమైన శ్రమ - ఎప్పుడైతే మానవుడు భూమిని దున్ని పంట పండించడం మొదలు పెట్టాడో అప్పుడే వేరే కళలు పొడసూపాయి. అందువల్ల వ్యవసాయదారులే నాగరికతా సూత్రదారులన్న సత్యాన్ని మనం మరువకూడదు.' (The cultivation of the earth is the important labour of man. When tillage begins other arts follow. Therefore, let us never forget that the farmers are the founders of civilization) అన్న డేనియల్ వెబ్‌స్టర్ వాక్యాల ఆధారంగా వ్యవసాయం ప్రధాన వృత్తిగా గలిగిన ఈ దేశం సంక్షేమమంటే రైతుకూలీల సంక్షేమమే అని గ్రహించి శ్రీ శ్రీ వాళ్ళగురించే ముందుగా ఆలోచించాడు. మనుషులు రెండు రకాలు శ్రమించే వాళ్ళు, విశ్రమించే వాళ్ళు అని. శ్రమలేకుండా విశ్రమించడం పనిలేని పని. శ్రీ శ్రీ కి పూర్వపు కవిత్వం అంతా దాదాపు విశ్రమించే వాళ్ళ గురించే రాసింది. శ్రీ శ్రీ యే తొలిసారిగా శ్రమించే వాళ్ళ గురించి రాశాడు. అదే అభ్యుదయ కవిత్వానికి ఆధారం.

రైతు శ్రమ అనే ఇంధనం వల్లనే దేశమనే వాహనం పరుగులు పెడుతుంది. లోకకళ్యాణం కోసం నిరంతరం శ్రమించే రైతు చెమట బిందువులకు ఖరీదు లేదు. అలాగే కార్మికుల వేదనలకు, రోదనలకు వెలకట్ట గల వ్యాపార పారంగతుడు కూడా లేడు. వీళ్లతోబాటే ఇంకా ఎందరెందరో దిక్కుదివాణం లేని వాళ్లంతా తిరగబడతారు. తనవంతు కర్తవ్యంగా ఆ అనాథుల, అశాంతుల ఆక్రందనలకు మూలమైన అన్యాయాక్రమాలను తొలగించే ప్రయత్నం చేస్తూ, శ్రమైక జీవన సౌందర్యాన్ని గానం చేస్తూ అభ్యుదయ కవిత్వాన్ని లోకానికంతా రుచి చూపిస్తానంటున్నాడు. వేనవేల వృత్తుల గుర్తులన్నీ నూత్న శైలిలో రాసే తన వినూత్న కవిత్వానికి సర్వస్వం అంటున్నాడు. ముల్లోకాలలోగాని, భూత భవిష్యద్వర్తమాన కాలాలలోగానీ శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైన

సౌందర్యం లేనేలేదని చాటి చెప్పటం అభ్యుదయ కవిత్వపు అత్యంత విలువైన లక్షణం. శ్రమ అనేది సమస్త సంపదలకు మూలమనీ, మానవుని మనుగడకూ అస్తిత్వానికి శ్రమే ఆధారమనీ, శ్రమే మానవుణ్ణి రూపొందించిందనీ చెప్పిన ఎంగెల్సు మాటలకిది కవితాత్మకమైన వ్యాఖ్యానం.

సమాజంలోని దోపిడే అన్ని వ్యథలకూ మూలమనీ, ఈ దోపిడిని తుదముట్టించడానికి కవిత్వమొక మంచి పదునైన ఆయుధమనీ అభ్యుదయకవి విశ్వసిస్తాడు; ఋజువు చేసే ప్రయత్నం చేస్తాడు. తానుంటున్న ఎగుడుదిగుడు సమాజం స్థానంలో సమసమాజాన్ని నిర్మించడానికి కార్మికులను, శ్రామికులను సన్నద్ధం చేస్తాడు. అందుకోసం అంతకు ముందులేని భావి వేదాల జీవనాదాల్ని వినిపిస్తాడు. ఆ భావివేదాలు ఏవో కాదు. సామ్యవాదనాదాలే !

శరీర కష్టాన్ని స్ఫురింపజేసే సహస్రవృత్తుల సమస్త చిహ్నాల్ని తన గీతికీ, రీతికీ భావంగా, భాగ్యంగా, ప్రాణంగా, ప్రణవంగా స్వీకరించడం అభ్యుదయ కవితా లక్షణం.

శ్రీశ్రీ ఈ మాటలకు 'We must make labour the principal hero of our books' అన్న మాక్సింగోర్కీ మాటలు మూలాలుగా నిలుస్తాయి.

ఇలా అభ్యుదయ కవితా లక్షణాలు 'ప్రతిజ్ఞ' ఖండిక నిండా నిండి వున్నాయి.

**2. ప్రతిజ్ఞ ఆధారంగా శ్రీ శ్రీ ఇతివృత్త శైలీ వైశిష్ట్యాల్ని వివరించండి ?**

చదువు స్వార్థం, రాత పదార్థం. పరార్థమై చేసే రచనకు ఒక అర్థం, పరమార్థం తప్పక వుండి తీరాలి. అలా వుంటేనే ఆ రచన గొప్పదవుతుంది.

'మణి చేత కడియం, కడియం చేత మణి ప్రకాశిస్తా' యన్నట్లు కథచేత కవి, కవిచేత కథ ప్రసిద్ధి పొందుతాయనేది ప్రాచీన కావ్యాలకు వర్తించేమాట. ప్రస్తుతం కథకు అంతగా ప్రాధాన్యం లేని కారణంగా మంచి ఇతివృత్తం వల్ల రచయిత, రచయిత వల్ల ఇతివృత్తం గణన కెక్కుతాయి అని అర్థం.

'Art of writing is art of selection' ఒక రచయిత ఒక గొప్ప రచన చేస్తున్నాడంటే అది అతను ఎన్నుకొనే ఇతివృత్తం మీద ఆధారపడి వుంటుంది. అలాంటి ఇతివృత్తం కోసం శ్రీ శ్రీ ఎంతో శ్రమ పడ్డాడు. సుమారు పదేళ్ళపాటు ప్రధానంగా బీభత్సాలను అనుభవాలలో వడబోస్తూ జీవితాన్ని కవిత్వంలోకి తర్జుమా చేస్తూ, ఆవేశాలకి ఆకారాలు వెతుకుతూ, తన గుహలో, కుటిలో, చీకటిలో, ఒక్కడే స్రుక్కి, మహాప్రస్థానం సాగించాడు. ఎట్టకేలకు ఆకాశపు దారులంట హడావిడిగా వెళ్లిపోయే, అరచుకుంటూ వెళ్ళిపోయే కవితారథాన్ని భూమార్గం పట్టించాడు. తన 'ఆకాశాలను లోకానికి చేరువగా' తీసుకువచ్చాడు. ఏ కొందరికో పరిమితమైన కవిత్వాన్ని సామాన్యులకు అందేట్లు చేశాడు.

ఆధునిక ఛందస్సంతా 1. త్రిస్ర (3+3+3+3 మొత్తం పాదం 12 మాత్రలు) 2. చతురస్ర (4+4+4+4 మొత్తం పాదం 16 మాత్రలు) 3. మిశ్ర (త్రిస్ర చతురస్ర గతుల మిశ్రమం 3+4+3+4 మొత్తం పాదం 14 మాత్రలు) 4. ఖండ (5+5+5+5 మొత్తం పాదం 20 మాత్రలు) గతులని నాలుగు రకాలుగా వుంటుంది. ప్రతిజ్ఞ ఖండిక ఆద్యంతం చతురస్రగతిలో నడిచింది. ఈ చతురస్రగతి శ్రీ శ్రీ ఎనిమిదేళ్ళ చిన్న వయసులో రాసిన కందపద్యం నడకను పోలిన నడక కలిగింది. కందపద్యంలోని గణాలు గగ,భ,జ,స,నల అనేవి. (రెండు గురువులు U U , ఆది గురువు UII , మధ్య గురువు IUI, అంత్య గురువు IIU, నాలుగు లఘువులు IIII) ఒక గురువుకు రెండు మాత్రలు. అందువల్ల గగ (UU), భగణం (UII), జగణం (IUI) , సగణం (IIU) , నల (IIII) అన్నీ చతుర్మాత్రా గణాలే.

కందపద్యంలోని మొదటి రెండు పాదాల్ని పూర్వార్థమనీ, చివరి రెండు పాదాల్ని ఉత్తరార్థమనీ అంటారు. పూర్వార్థంల నూ ఉత్తరార్థంలోనూ ఎనిమిదేసి గణాలుంటాయి. ఈ రెండు సగభాగాల్లోనూ నాల్గవగణం జగణంగా వుంటే ఆ కందపద్యానికి ఒక వింత సొబగు వస్తుందంటాడు శ్రీ శ్రీ.

IU / IUI (లగ ప్రయోగం లేదా జగణ సదృశం) వీటిని ఈ గేయం ప్రారంభంలో నుంచే వినియోగించుకొని ఒక లయను సిద్ధింప జేశాడు కవి.

పొలాలనన్నీ హలాల దున్నీ
ఇలా తలంలో హేమం పిండగ
జగాని కంతా సౌఖ్యం నిండగ
బలం ధరిత్రికి బలికావించే

సంస్కృత పదాల్ని, అన్యదేశాల్ని (ఖరీదు, షరాబు), తెలుగుపదాల్ని (లు,ల,నల సంధి ద్వారా సాధించుకొన్న పదాలను) వాడి ఆ తూగు సాధించడం జరిగింది. సంస్కృత పదాలకు ఉదాహరణలు : ఇలాతలం, విరామం, పరిక్లమిస్తూ, పరిప్లవిస్తూ అనేకులు, అనాధులు, అశాంతులు, త్రిలోకాలు, త్రికాలాలు, శ్రమైక, సమాన, సహస్ర మొదలైనవి.

కర్షక వీరుల కాయంనిండా
కాలువకట్టే ఘర్మజలానికి
ఘర్మ జలానికి
ధర్మ జలానికి
ఘర్మ జలానికి ఖరీదులేదోయ్ !

రైతు వీరుల శరీరాల నిండా కాలువల్లాగా ప్రవహించే చెమట బిందువుల పరుగుల ధ్వనిని ఈ శబ్ద సంయోజనం వల్ల వినిపింపజేశాడు కవి. మనకు చెమట బిందువులు ఒకేవిధంగా కనిపిస్తే మహాకవికి రెండు రకాలుగా కనిపించాయి. ధర్మ ఘర్మజలం, అధర్మఘర్మజలం. శ్రమపడడం వల్ల వచ్చిన చెమట బిందువులు ధర్మఘర్మజలం. భయభ్రాంతుల వల్ల వచ్చిన చెమట బిందువులు అధర్మఘర్మజలం. శ్రమపడడం వల్ల కారిన చెమట బిందువులనే తానిక్కడ పేర్కొంటున్నానని ధ్వనింప జేస్తున్నాడు కవి. పరుషాక్షరాల ఆవృత్తి వల్ల పఠితను ఆకట్టుకోవడం జరిగింది.

కార్మిక ధీరుల కన్నుల నిండా
కణకణమండే ........

**అంత్యానుప్రాసం :**

1. ఇలాతలంలో హేమం పిండగ
   జగానికంతా సౌఖ్యం నిండగ
2. పరిక్లమిస్తూ
   పరిప్లవిస్తూ
3. జాలరి పగ్గం
   సాలెల మగ్గం

4. నా వినుతించే
నా విధుతించే
నా వినిపించే నవీనగీతికి
నా విరచించే నవీనరీతికి

5. శ్రమ నిష్ఫలమై
జని నిష్ఠురమై

6. బాటలు తీస్తూ
పాటలు రాస్తూ

**యధాసంఖ్యాలంకారం :**

కార్మిక ధీరుల కన్నులనిండా
కణకణమండే
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్ !

కణకణమండే ① గలగల తొణకే ②
↓ ↓
విలాపాగ్నులకు ① విషాదాశ్రులకు ②

కణకణమండే విలాపాగ్నులకు, గలగల తొణకే విషాదాశ్రులకు అని చదువుకుంటేనే ఈ పంక్తులు అర్థసహితాలవుతాయి.

ఇలా ఇతివృత్తం ఉదాత్తమై, తదనుగుణమైన శైలితో ప్రతిజ్ఞ ఖండిక శ్రీ శ్రీ ప్రతిభాపాటవాలకు అద్దం పడుతున్నది.

3. శ్రీ శ్రీ తన కవితలో చేసిన ప్రతిజ్ఞ ఏమిటి ?

లేదా

శ్రీ శ్రీ గావించిన ప్రతిజ్ఞా సారాంశాన్ని వెల్లడించండి.

లండన్ మహానగరం నుంచి వెలువడిన అభ్యుదయ రచయితల మేనిఫెస్టోలోని అభ్యుదయ భావాలను ఆకళింపు చేసుకొని మహాకవి శ్రీ శ్రీ తెలుగులో 'ప్రతిజ్ఞ' ఖండికగా 1937 లో రూపొందించాడు.

ఇందులో కవి కర్షకుల, కార్మికుల, దరిద్రుల, దురదృష్టవంతుల, అనాధుల, అభాగ్యుల సాధక బాధకాలే తన కవిత్వానికి నూతన ఇతివృత్తమనీ, వినూత్న రచనా విధానమనీ విస్పష్టం చేశాడు.

భారతదేశం వ్యావసాయికదేశం. ఈ దేశానికి రైతులే వెన్నెముకలు. ఆ కారణంగా ఇక్కడ రైతుల, రైతు కూలీల కష్ట నిష్ఠురాల్ని గురించిన ఆలోచన అత్యవసరం, అవశ్యం. ముళ్ళనన్నిటినీ నాగళ్ళతో దున్ని భూతలమంతా బంగారు పంటలు పండించి, లోకమంతా సుఖ సంతోషాల్ని నింపడం కోసం తమ బలాన్ని భూమికి బలి ఇస్తూ శక్తి వంచనలేకుండా, విశ్రమించకుండా నిరంతరం శ్రమించే కర్షకవీరుల శరీరాల నిండా కాలువల్లాగా ప్రవహించే చెమట బిందువులకు వెలలేదు. అవి అమూల్యాలు దేనితోనూ వాటిని కొనలేం.

కర్షక ధీరుల తర్వాత పేర్కొనదగిన వాళ్ళు కార్మికధీరులు. తమ నరాల పటుత్వం, చేతుల శక్తి వల్లనే వరాల వాన కురుస్తుందనీ, తద్వారా ప్రపంచ సంపద పెంపొందుతుందనీ కార్మికులకు తెలుసు. అందుకే గనుల్లో, అరణ్యాల్లో, పరిశ్రమల్లో, పనిచేస్తూ, పడుతూ లేస్తూ బానిసలుగా భయంభయంతో బతుకులు ఈడ్చేవాళ్ళ కళ్ళ నిండా కణకణమండే ఏడుపులనే మంటలకు, గలగల తొణికే విషాద భరితమైన కన్నీటికి విలువ కట్టగల నేర్పరి అయిన వ్యాపారి లేడు.

కొందరు తప్పుచేసి బహిరంగంగా, దర్జాగా తిరుగుతుంటారు. మరికొందరు ఏ నేరం, ఘోరం చేయకుండానే ఆర్థిక స్తోమత, అధికారపు అండదండలు లేకపోవడం వల్ల అరదండలకు, చెరసాలలకు గురి అవుతుంటారు. పెద్దపెద్ద యంత్రాల తాకిడితో యమయాతననుభవించే వాళ్ళు, చేసిన శ్రమకు చెల్లించే జీతం జీవితాన్ని గడపడానికి సరిపడక, ఏమయితే అది కానీ లెమ్మని సమ్మెలు చేసేవాళ్లు, పడిన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరై బతుకు భారమై నుయ్యోగొయ్యో చూసుకునేవాళ్ళు - ఇలాంటి వాళ్ళు ఒకరా యిద్దరా ? దరిద్రులు, దిక్కులేని వాళ్ళు, అశాంతికి ఆలవాలమైన వాళ్ళు అనేకానేకులు ఉచ్చైశ్రుతిలో, భూనంభోంతరాళాలు దద్దరిల్లే శబ్దంతో విప్లవ శంఖాన్ని పూరిస్తారు. విజయ దుందుభులు మోగిస్తారు.

కాబట్టి లోకంలో జరిగే అన్యాయాలను, కడుపుల్ని కాల్చేసే ఆకలిని, మనసుల్ని కూల్చేసే ఆవేదనను, దారిద్ర్యాల్ని, దౌర్జన్యాలను, దుర్మార్గాలను తుడిచేసే, దూరం చేసే మార్గాలు వెతుకుతూ, గీతాలు రాస్తూ తనలో కదిలే కొత్తకవిత్వం కార్మిక, శ్రామిక సమూహాల సుఖసంతోషాలకు పూజాకుసుమ ద్రవ్యాలుగా సమర్పిస్తానంటున్నాడు కవి.

శ్రమే జీవనమైన సౌందర్యానికి సరితూగ గలిగింది ముల్లోకాలలో, మూడు కాలాలలో (భూత భవిష్యద్వర్త మానాలలో) ఇంకొకటి లేనేలేదని కర్మవీరులైన కష్టజీవులకు నిరంతరం శుభపరంపరలను కోరుకుంటూ, మంచి వాద్యాలను మోగిస్తూ, బాధతో దుఃఖాన్ని పొందిన వాళ్ళ నిజ జీవిత చిత్రణే ఇతివృత్తంగా వెలువడబోయే కొత్తవేదాల ప్రాణధ్వనులు జగానికంతా రుచి చూపిస్తానంటున్నాడు మహాకవి.

కమ్మరుల కొలిమిలూ, కుమ్మరుల చక్రాలు, జాలర్ల పగ్గాలు, సాలెల మగ్గాలు శారీరక శ్రమను గుర్తుకుతెచ్చే గొడ్డళ్ళు, కొడవళ్ళు, నాగళ్ళు, రంపాలు ఇలావేలాది వృత్తుల మొత్తం పనిముట్లు తాను కొత్త శైలీ విన్యాసంతో రాసే కొత్త ఇతివృత్త మున్న గీతానికి భావాలవుతాయి, భాగ్యాలవుతాయి, ప్రాణాలవుతాయి, ప్రణవాలవుతాయని కవి ప్రతిజ్ఞాపూర్వకంగా చెబుతున్నాడు.

**సారాంశం :**

భారతదేశాకి వెన్నెముక అయిన కర్షక వీరుల చెమట బిందువులక. గనుల్లో పరిశ్రమల్లో పడుతూ, లేస్తూ భయం భయంగా బతికే కార్మిక ధీరుల కన్నీటికి విలువ కట్టలేమని, వారుపయోగించే పనిముట్లే తన కవిత్వానికి ఆలంబనమౌతాయని శ్రీ శ్రీ ప్రతిజ్ఞ.

**ప్రశ్నలు :**

1. "ప్రపంచపు బాధ అంతా శ్రీ శ్రీ బాధ" - ఈ వాక్యంలోని సామంజస్యాన్ని గూర్చి మీ పాఠ్యభాగం ఆధారంగా చర్చించండి.
2. 'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని' చాటి చెప్పిన కవితా ఖండిక వైశిష్ట్యాన్ని విశదీకరించండి ?
3. "ప్రపంచం పట్టనంతటి మహాకవి శ్రీ శ్రీ" - మీ పాఠ్యభాగం ఆధారంగా నిరూపించండి ?
4. "శ్రీ శ్రీ పీడిత జనపక్షపాతి" - మీ పాఠ్యభాగం ఆధారంగా ఈ వాక్యాన్ని విశ్లేషించండి.

రచయిత
**ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి**
తెలుగు శాఖ
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపూర్.

# ఖండం : 2

# ఆధునిక పద్యభాగము

## పాఠం : 2 "ఆర్తగీతం"

- దేవరకొండ బాలగంగాధరతిలక్

**శీర్షికలు :**

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు అర్థాలు
5. సందర్భ సహిత వ్యాఖ్యలు
6. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :** ఈ పాఠంలో దేవరకొండ బాలగంగాధరతిలక్ ఏ రోజైతే పేదల కష్టాలు అంతరిస్తాయో ఆనాడే తనకు శాంతి కలుగుతుందనే ఆశను 'ఆర్తగీతం' ద్వారా వెల్లడించారు.

**1. కవిపరిచయం :**

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న నవకవి శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్. ఇతను పశ్చిమగోదావరి జిల్లా తణుకు దగ్గర మండపాకలో 1921 ఆగస్టు 20 న ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. తణుకు హైస్కూల్లో స్కూలు ఫైనల్ పాసై తర్వాత మద్రాసు వెళ్లి ఇంటర్మీడియట్ పూర్తి చెయ్యకుండా తిరిగి వచ్చి విశాఖపట్నం ఎ.వి.యన్. కళాశాలలో చేరాడు. అక్కడా ఇంటర్మీడియట్ పూర్తి చెయ్యకుండా తణుకు వచ్చేసి సాహిత్యం చదువుతూ, కవిత్వం రాస్తూ గడిపాడు. 'తెలుగురాజు'గా పేరు గడించిన పండిత పెన్మెత్స సత్యనారాయణ రాజు తిలక్‌కి గురువు. ఆయన వద్ద ఛందస్సు, వ్యాకరణం, ప్రబంధాలు నేర్చుకొన్నాడు, చదివాడు. ఆ తరువాత నవ్యసాహిత్య పరిషత్తులో సభ్యుడై ఆధునిక భావాలు అలవరచుకొన్నాడు.

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"

అంటూ తన కవితా లక్షణాల్ని వ్యక్తం చేసిన తిలక్ శ్రీ శ్రీ అన్నట్లు "కవితాసతి నొసట నిత్య రసగంగాధర తిలకమే".

ఊహాలోకాల్లో విహరిస్తూ స్వర్గ సౌఖ్యాలను కాంక్షిస్తూ కవితా సృష్టి చేయక, సామాన్య మానవునిమీద, అతని అభ్యుదయం మీద దృష్టిసారించి కవితాసృష్టి చేసిన గొప్ప మానవతావాది తిలక్. సంస్కృతాంధ్ర భాషలలో తిలక్‌కు మంచి పటుత్వం ఉంది. భావానికి అనుగుణమైన భాషను ప్రయోగించడంలో తిలక్ దిట్ట. ఆంధ్రసాహిత్యంలో వచన గేయ కవితా ప్రక్రియలో తనదైన మార్గాన్ని ఏర్పరచినవాడు తిలక్.

అభ్యుదయ భావన, సౌందర్యం తిలక్ కవిత్వంలో కలగలసిపోయి మానవతను పెంపొందించాయి. తిలక్ కవితల్లో కరుణరసం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఏ సిద్ధాంతాలకూ తాను నిబద్ధుడను కానని ప్రకటించుకున్నాడు తిలక్.

**రచనలు :** అందరు కవుల్లా తిలక్ కూడా మొదట సంప్రదాయ కవితా మార్గాన్ని అనుసరించి తర్వాత వచన కవిత వైపు మొగ్గు చూపాడు. ప్రభాతమూ - సంధ్య (కవితా సంకలనం), గోరువంకలు (కవితా సంకలనం), సుశీలపెళ్ళి, సుప్తశిల (నాటకాలు), సాలెపురుగు, సుచిత్ర పరిణయం, ఇరుగు పొరుగు అనే నాటికలు, కావ్యసృష్టి, యుద్ధము - రచయిత్రులు, హేమంత హసంతిక, తిలక్ కథలు, అమృతం కురిసిన రాత్రి, ఊర్మిళ, విషణ్ణ వైదేహి, అద్వైత మాన్మథము, ఆటవెలది, మేగ్నకార్టా.

ఆధునికాంధ్ర సాహిత్యంలో 'అమృతం కురిసిన రాత్రి' కి విశిష్టస్థానం ఉంది. తిలక్ రచించిన వచనగేయాలను ఆయన మరణానంతరం 'అమృతం కురిసిన రాత్రి' అనే కవితా సంపుటిగా ప్రచురించారు. 1968 నుండి 1999 వరకు ఈ పుస్తకం దాదాపు పదిసార్లు ప్రచురితమైంది. దీన్ని బట్టి తిలక్ రచనలకున్న ఆదరణ వ్యక్తమవుతుంది. ఈ కవితా సంపుటికి 1965 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డు, 1977 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి.

అఖిలాంధ్ర ప్రేక్షకుల మన్ననలను చూరగొన్న తిలక్ అతి చిన్న వయసులోనే అంటే కేవలం 45 సంవత్సరాలు మాత్రమే జీవించి 1.7.1966 న మరణించాడు.

**2. పాఠ్యభాగ సందర్భం :**

వచన కవితకు తనదైన మార్గాన్ని వేసిన కవి తిలక్. అప్పటికి విస్తృతంగా ఉన్న భావకవిత్వాన్ని పక్కకు పెట్టి మానవతా వాదం వైపు దృష్టి మళ్లించాడు. సామాన్య ప్రజల సాధక బాధకాలను తన రచనలకు ఇతివృత్తంగా తీసుకున్నాడు. తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' గొప్ప కవితా సంపుటి. తెలుగు సాహిత్య చరిత్రలో ఈ కవితా సంపుటి విశిష్టస్థానాన్ని ఆక్రమించింది. 89 కవితా ఖండికలున్న 'అమృతం కురిసిన రాత్రి' నుంచి స్వీకరించిన ఒక ప్రసిద్ధ ఖండిక ఆర్తగీతం.

సామాన్య ప్రజల వాస్తవ జీవితాలలోని సంఘటనలే 'ఆర్తగీతం' లోని కవితా వస్తువు. తన మిత్రునితో మాట్లాడుతున్నట్లు "నా దేశాన్ని గూర్చి పాడలేను, నీ ఆదేశాన్ని మన్నించలేను, ఈ విపంచికకు శ్రుతి కలపలేను" అంటూ ఈ కవితా ఖండికను ఆరంభించాడు తిలక్.

**3. పాఠ్యభాగ సారాంశం :**

దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న ప్రజలను చూసి, నీ ఆదేశాన్ని మన్నించి ఈ దేశాన్ని గురించి గొప్పగా పాడలేనని, గత వైభవాలను గురించి తనకు చెప్పవద్దని, అలంకారాలు, చిత్ర కవితా శిల్పాలు లాంటివి తనకు వద్దని మిత్రునితో చెబుతాడు కవి. తాను చూసిన సంఘటనలను వర్ణిస్తూ మానవత్వం లేని లోకాన్ని పొగడలేను, మనిషిగా నేను తలెత్తుకు తిరగలేను అంటాడు. ఏ రోజైతే పేదల కష్టాలు అంతరిస్తాయో ఆనాడే తనకు శాంతి కలుగుతుందంటాడు కవి.

రాజకీయ నాయకులకు గాని, భోగవంతులకు గాని, ఆఖరికి భగవంతునికి గాని తన ఆర్తి వినపడితే పేదల కష్టాలు సమసిపోతాయేమోననే ఆశతో తన ఆర్తగీతాన్ని వినిపించాడు తిలక్.

## 4. కఠినపదాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| ఆదేశం | = | ఆజ్ఞ |
| విపంచిక | = | వీణ |
| శ్రుతి | = | ధ్వని యొక్క స్థాయి |
| విషాద స్మృతి | = | దుఃఖం యొక్క తలపు |
| విధి | = | దైవం, కాలం |
| తమస్సులు | = | చీకట్లు |
| దివాంధము (దివ+అంధం) | = | గుడ్లగూబ |
| రుతి | = | ధ్వని, ఘూకరింపు |
| ఎడద | = | హృదయం |
| మోడగు (మోడు+అగు) | = | మొద్దుబారు |
| దుస్థితి | = | చెడ్డ స్థితి |
| సింగారమ్ము | = | అలంకారం |
| వలదు | = | వద్దు |
| ఉదాత్త | = | మనోజ్ఞమైన, మంచి, గొప్పదైన |
| సురభిళాత్త (సురభిళ+ఆత్త) | = | సువాసనను పొందిన |
| శయ్య | = | పడక |
| సజ్జితం | = | అలంకరించబడింది |
| రసప్లావితం | = | రసంచేత తడపబడింది |
| చిత్ర | = | చిత్రకవిత్వం |
| శిల్ప | = | శిల్పానికి సంబంధించిన |
| ప్రసక్తి | = | ప్రస్తావన, ప్రసంగం |
| వాంఛించు | = | కోరు |
| తత్వసూత్ర | = | తత్వ సంబంధమైన సూత్రాలు |
| వాదోక్తి (వాద+ఉక్తి) | = | వాదానికి సంబంధించిన మాటలు |
| చలించు | = | కదలు |
| సుందర | = | అందమైన |
| వధూ | = | స్త్రీల |
| కదుష్ణ | = | గోరు వెచ్చని |
| పరిరంభములు | = | కౌగిళ్లు |
| రసించు | = | ఓలలాడు, రసానందాన్ని పొందు |
| గత | = | గతించిన కాలపు |
| చారిత్రక | = | చరిత్ర సంబంధమైవ |
| యశః | = | కీర్తి |

| | | |
|---|---|---|
| కలాపం | = | సమూహం |
| వివరింపకు | = | చెప్పకు |
| బహుళ | = | ఎన్నో, చాలా |
| వీర | = | వీరుల యొక్క |
| అనేక | = | ఎందరో |
| గాథా సహస్రమ్ము | = | వేనవేల కథలు |
| వినిపింపకు | = | వినిపించవద్దు |
| విసిగింపకు | = | విసుగు తెప్పించకు |
| కరిగిన | = | కరిగిపోయిన |
| గీతికను | = | పాటను |
| అంతరాంతర (అంతర + అంతర) | = | మిక్కిలి లోపల |
| దగ్ధమైన | = | కాలిపోయిన |
| దైవము | = | దేవుడు |
| జవాబు | = | సమాధానం |
| రసాతలమంట | = | పాతాళలోకాన్ని తాకే విధంగా |
| శిరస్సు | = | తల |
| విధి | = | దైవం |
| జాగృతి | = | అభ్యుదయం |
| హేతి వాదర | = | కత్తి అంచు |
| రుధిరం | = | రక్తం |
| నీరంధ్ర (నిర్ + రంధ్ర) | = | ఎడతెరిపిలేని, నిరంతరం |
| నిండు చూలాలు | = | నిండు గర్భవతి |
| ప్రసవించు | = | కను |
| మూర్ఛిల్లు | = | మూర్ఛపోవు |
| దృశ్యం | = | సంఘటన |
| ముంజేతులు | = | అరచేతులు వాటిపై భాగాలు |
| నిరాహారుడు | = | ఆహారం లేనివాడు |
| రుద్ధ | = | చుట్టబడిన, నిండిన |
| బాష్పాకులిత (బాష్ప+ఆకులిత) | = | కన్నీటితో చెదిరిన |
| నయనుడై | = | కన్నులు కలవాడు |
| ప్యూన్ | = | బంట్రోతు |
| క్షయగ్రస్త | = | క్షయరోగం చేత తినబడిన, మింగబడిన |
| ప్రచండ | = | భయంకరమైన |
| వాతూల హత | = | గాలి తాకిడి చేత |
| నీపశాఖ | = | దిరిశెన పూల చెట్టు కొమ్మ |

| | | |
|---|---|---|
| వణికిపోవు | = | చలించిపోవు |
| అరక్త | = | రక్త హీనమైన |
| అశక్త | = | శక్తి హీనమైన |
| గుమాస్తా | = | కింది ఉద్యోగస్థుడు |
| మూర్తీ భవత్ | = | రూపం దాల్చిన |
| దైన్యాన్ని | = | దీనత్వాన్ని |
| హైన్యాన్ని | = | హీనత్వాన్ని |
| క్షుభితము | = | కలతబెట్టబడిన |
| అశ్రువులు | = | కన్నీరు |
| కల్లోల | = | పెద్ద అలలతో కూడిన |
| నీరధులు | = | సముద్రాలు |
| గచ్ఛత్ | = | నడుస్తున్న |
| శవాకార (శవ+ఆకార) | = | శవాల ఆకారంతో వున్న |
| వికారులు | = | వికార స్వరూపం కలవాళ్ళు |
| నాగరికత | = | నాజూకుతనం |
| ఫలశ్రుతి | = | కావ్యం విన్నందువల్ల కలిగే ఫలితం |
| విజ్ఞాన ప్రకర్షకు | = | వైజ్ఞానికాభివృద్ధికి |
| ప్రకృతి | = | మూలం |
| గర్వస్మృతి | = | గర్వంతో గుర్తుంచుకోదగింది |
| నిర్బంధించు | = | బలత్కారం చేయు |
| నేస్తం ! | = | మిత్రమా ! స్నేహితుడా ! |
| కృత్రిమ వేషం | = | అసహజమైన వేషం |
| అభినయించు | = | నటించు |
| స్తుతింపలేను | = | పొగడలేను |
| శిరసెత్తు | = | తలయెత్తు |
| అరణ్యావాసం | = | అడవిలో నివసించడం |
| భరించలేను | = | మోయలేను |
| నిరుపేద | = | మిక్కిలి బీద వ్యక్తి |
| మలినం | = | స్వచ్ఛం కాని |
| అశ్రుబిందువు | = | కన్నీటి చుక్క |
| ఒరిగినంత వరకు | = | ఒలికినంత దాకా |
| కనలినంత వరకు | = | కాలినంత దాకా |
| శుష్క | = | ఎండిన |
| స్తన్య | = | చనుబాలు (పాలిండ్లు) |

| | | |
|---|---|---|
| సన్నిధి | = | దగ్గర |
| క్షుధార్తి (క్షుధ+ఆర్తి) | = | ఆకలి బాధ |
| నీరవ (నిర్ + రవ) | = | ధ్వనిలేని, చప్పుడుకాని |
| ఆక్రోశరవం | = | బాధతో కూడిన శబ్దం |
| క్షత | = | దెబ్బదిన్న |
| దుఃఖిత | = | దుఃఖాన్ని పొందిన |
| ఊరడిల్లు | = | ఓదార్పు పొందు |
| నిగర్వి | = | గర్వంలేనివాడు |
| గూడుపట్లు | = | గూడు యొక్క సూత్రాలు, మూలాలు |
| కదలినవి | = | అల్లాడినవి |
| వరదలై | = | ప్రవాహాలై |
| పారినవి | = | ప్రవహించినాయి |
| ఆర్తి | = | దుఃఖం |
| సౌధాంతరాలు (సౌధ + అంతరాలు) | = | మేడల లోపలి భాగాలు |
| పయనించు | = | వెళ్లు |
| స్పృశించు | = | తాకు |
| భోగవంతుడు | = | విలాసజీవితాన్ని గడిపేవాడు, ధనవంతుడు |
| విచలింపజేయు | = | స్పందింపజేయు |
| భగవంతునికి | = | దేవునికి |
| నివేదించుకొను | = | వినయపూర్వకంగా చెప్పు |

5. సందర్భ సహిత వ్యాఖ్యలు :

1. నా యెడద మ్రోడైన ఒక దుస్థితి

**పరిచయం :** ఈ కవితా పంక్తులు దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి నుంచి స్వీకరించిన 'ఆర్తగీతం' లోనివి.

**సందర్భం :** అభివృద్ధి చెందుతున్న మన భారతదేశంలోని చాలామంది ప్రజలు పనిలేక, తిండి దొరకక ఎన్నో కష్టనష్టాలు అనుభవిస్తున్నారు. ఒకవేళ పని దొరికినా చాలీచాలని సంపాదనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ దేశంలో ఒక్కొక్కరు ఒక్కో సమస్యతో సతమతమవుతున్నారు. వారి వాస్తవ సామాజిక జీవితాన్ని, ఇబ్బందులను చూసి స్పందించిన కవి, ఆ పరిస్థితులను సామాన్య పాఠకుల కళ్ళముందు సాక్షాత్కరింప చేయడానికి పూనుకున్నాడు. ఈ దేశాన్ని గూర్చి పాడలేననీ, నీ ఆదేశాన్ని మన్నించలేనని కవి తన మిత్రుడితో వేదనతో పలుకుతున్న సందర్భంలోనివి ఈ వాక్యాలు.

**వివరణ :** ఒకప్పుడు సంస్కృతీ సంప్రదాయాలకు, భోగాలకు ఆలవాలమైన భారతదేశంలో నేడు దారిద్ర్యదేవత అడుగడుగునా తాండవించడాన్ని చూసిన కవి తన మిత్రునితో 'నీ ఆదేశాన్ని మన్నించలేనని, ఈ దేశాన్ని గూర్చి పాడలేనని, ఈ

వీణకు శ్రుతి కలపలేనని' అంటూ తన నిరసనను వ్యక్తం చేస్తున్నాడు. ఈ రోజు తనకు విషాద స్మృతి అనీ, గుడ్లగూబల అరుపులతో నిండివున్న నిశీధిలో తన హృదయం మోడుబారిందని కవి తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు.

**విశేషాంశం :** ఆర్తగీతంలో తిలక్ అభ్యుదయ భావ కవితా లక్షణాలు రెండింటిని పొందుపరిచాడు. కొన్నిచోట్ల అభ్యుదయ భావాలు కనిపిస్తే, కొన్నిచోట్ల భావకవితా ఛాయలు కనిపిస్తున్నాయి. పై పంక్తులలో భావకవితా ఛాయలు స్పష్టంగా కనిపిస్తుంది. తన దేశాన్ని గురించి కవి పాడలేకపోవడానికి కారణం అతని మనసులో అలముకున్న విషాదమే. 'ఈ రోజు నాకు విషాదస్మృతి' అని చెప్పడంలో ఆత్మాశ్రయ ధోరణి వ్యక్తమవుతుంది.

**2. ఈ రోజు నేను చూసినదేమి ? విధి యిన్ని కత్తులను దూసినదేమి ? జాగృతి హేతివాదరల రుధిరమేమి ?**

**పరిచయం :** పై పంక్తులు దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి నుంచి స్వీకరించిన 'ఆర్తగీతం' అనే కవితలోనివి.

**సందర్భం :** ప్రజలు పడుతున్న కష్టనష్టాలను స్వయంగా చూసిన కవి అలంకారాలు, శైలీ విన్యాసాలు, చిత్రకవితా శిల్పాలు, తత్త్వసూత్ర వాదోపవాదాలు, అందగత్తెల కౌగిళ్ళు ఇవేవీ తనకు వద్దన్నాడు. అంతేకాదు పూర్వపు వైభవాన్ని, వీరగాథలను చెప్పి తనను విసిగించవద్దన్నాడు. ఎందుకంటే ప్రజల పరిస్థితిని కళ్ళారా చూసిన కవి తాను కన్నీరుగా కరిగిపోయిన గీతికననీ, సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగుననని, మంటల్లో మాడి మసైన బూడిదనని చెప్పాడు. ఈ పరిస్థితిని గురించి తనను ప్రశ్నించే దైవానికి, మానవునికి కూడా జవాబు చెప్పవలసిన వాణ్ణి, సిగ్గుతో రసాతలంలోకి తలవంచినవాణ్ణి అని కవి తన స్థితిని తెలుపుతున్న సందర్భంలోనివి.

**వివరణ :** సామాజిక జన జీవన పరిస్థితులను గుర్తుకు తెచ్చుకుంటూ ఈ రోజు నేను చూసిందేమిటని, విధి ఇన్ని కత్తుల్ని ఎందుకు దూసిందని ఆశ్చర్యపోతున్నాడు. జాగృతిని కత్తితో పోలుస్తూ ఆ కత్తి చివర అంటిన రక్తం ఏమిటని ప్రశ్నిస్తున్నాడు. విధి పేద ప్రజలపై కత్తి దూసిందని అందుకే వాళ్ళ కష్టాలు పడుతున్నారని, మేలు పేరుతో వాళ్లకు కీడు కలగకూడదని కవి భావం.

**విశేషాంశం :** 'ఆర్తగీతం' అనే ఈ కవితలో తిలక్ భావాభ్యుదయ కవితా లక్షణాలు రెండిటిని పొందుపరిచాడు. పై పంక్తులలో అభ్యుదయ భావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సామాన్య ప్రజల జీవితంలో జాగృతి రావాలని కవి ఆశిస్తున్నాడు.

**3. ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి ? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి ? ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వ స్మృతి ?**

**పరిచయం :** పై కవితా పంక్తులు తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' అనే కవితా సంపుటి నుంచి గ్రహించిన 'ఆర్తగీతం' అనే పాఠ్యభాగం లోనివి.

**సందర్భం :** సమాజంలో తాను చూసిన సంఘటనలు వివరిస్తూ ఆకలితో మరణించిన ముసలివాణ్ని, తల దాచుకోవడానికి ఇల్లులేక వర్షంలో వంతెన కింద ఒక బిడ్డకు జన్మనిచ్చి మూర్ఛపోయిన పచ్చిబాలింతను, తల్లిదండ్రులు లేక ఆదరించే దిక్కులేక మురికి కాలువ పక్కనే నిద్రపోయిన మూడేళ్ళ పసివాడ్ని, ఉన్న కొంచెం గంజి పిల్లలకు పోసి, తాను నిరాహారుడై ఆఫీసుకు వచ్చిన ముసలి ఫ్యూన్ వీరన్నని, క్షయతో తన భార్య బతకదని డాక్టరు చెప్పినప్పుడు భయంతో వణికిపోయిన అయిదారుగురు పిల్లలు గల అశక్త గుమస్తాని మనకు కళ్ళకు కట్టించాడు కవి. వారిలో మూర్తీభవించిన దైన్యాన్ని, హైన్యాన్ని చూశానని, ఆదరించేవారు కానరాక వారి కంటిలో నీటిని చూసానన్నాడు. ఇన్ని బాధలు భరిస్తూ వారు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారని కవి చెప్తున్న సందర్భంలోనివి ఈ పంక్తులు.

**వివరణ :** భారతదేశ నాగరికత ఉన్నతమైంది. కీర్తింపదగింది. ప్రపంచ ప్రసిద్ధమైంది. అది నేడు హీనావస్థకు చేరుకుంది. దాంతో ప్రజలు దీనస్థితిలో జీవితాన్ని గడుపుతున్నారు.

భారతదేశం విజ్ఞాన ప్రకర్షకు పెట్టింది పేరు. అలాంటి ఈ దేశంలోని ప్రజల దుస్థితి ఏ విజ్ఞాన ప్రకర్షకు మూలమని కవి ప్రశ్నిస్తున్నాడు.

"బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి" అనే ముఖ్య సూత్రాల్ని మనకు నేర్పిన బుద్ధదేవుడు పుట్టిన భూమి అని గుర్తుంచుకోదగిన పరిస్థితా నేటి సామాన్యుల జీవన స్థితి ? అంటున్నాడు కవి.

4. **మానవత లేని లోకాన్ని స్తుతింపలేను**
**మానవునిగా శిరసెత్తుకు తిరగలేను**
**ఈ నాగరికతారణ్యావాసం భరించలేను**

**పరిచయం :** పై పంక్తులు తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' అనే కవితా సంపుటి నుంచి స్వీకరించిన 'ఆర్తగీతం' అనే కవితలోనివి.

**సందర్భం :** సామాన్య ప్రజల జీవన స్థితిని చూసిన కవి తట్టుకోలేక తన మిత్రునితో నన్ను నిర్బంధించకు, ఈ రాత్రి నేను పాడలేను, ఈ లోకం కృత్రిమత్వంతో నిండిపోయింది. నేను అందరిలా ఈ కృత్రిమ వేషం వేయలేను. నన్ను నేను మోసం చేసుకోలేను అంటున్న సందర్భంలోనివి.

**వివరణ :** లోకమంతా కృత్రిమంగా నడుస్తుందనీ, మానవత లోపించిందనీ అన్నాడు. మానవత లేని లోకాన్ని నేను పొగడలేనని, మనిషిగా తలెత్తుకు తిరగలేనని, నాగరికత అనే ముసుగులో ఉన్న ఈ అడవిలో నేను నివసించలేనని అందుకే పాడలేనని కవి తన మిత్రుడితో ఖచ్చితంగా చెప్పాడు.

5. **నాకు శాంతి కలగదింక నేస్తం, నేను నిగర్విసైనాను**

**పరిచయం :** పై కవితా పంక్తులు తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' నుంచి గ్రహించిన 'ఆర్తగీతం' అనే కవితలోనివి.

**సందర్భం :** సామాన్య వాస్తవ జీవితాలను చూసి చలించిన కవి సమాజపరంగా తన బాధ్యతను, నిర్వహించవలసిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంటూ ఒక నిరుపేద ఉన్నంత వరకూ, ఆ నిరుపేద కంటినుంచి ఒక కన్నీటి బిందువు ఒలికినంతవరకు, ఒక ప్రేగు ఆకలితో అల్లాడుతున్నంతవరకు, పాలిండ్లు ఎండిపోయిన తల్లి దగ్గర ఆకలితో ఏడ్చే పసిపాప ఉన్నంతవరకు, ఒక తల్లి దుఃఖిస్తున్నంతవరకు, పేదరికంతో ఒక స్త్రీ బాధపడుతున్నంత వరకు తనకు శాంతిలేదని చెబుతున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** సమాజంలో ప్రజల దారిద్ర్యం నశించాలని తద్వారా వారి దుఃఖం పోవాలని కవి ఆశించాడు. అంతేకాదు వారి ఆకలి బాధలు సమసిపోవాలన్నాడు. ఆకలి సమస్యలు తీరితే పాలకోసం ఏడ్చే పిల్లల ఏడుపులు తగ్గుతాయన్నాడు. పేద ప్రజల ఆకలి సమస్య తీరితే తల్లుల ఏడుపులు తగ్గుతాయని, పేదవారికి ఓదార్పు లభిస్తుందని కవి భావించాడు. అప్పుడే తనకు శాంతి కలుగుతుందన్నాడు. ఈ దేశాన్ని చూసి ఇంతకుముందు గర్వపడేవాణ్ణి. ఇప్పుడా పరిస్థితి లేదు. తాను నిగర్వినయినానంటున్నాడు.

**విశేషాంశం :** "ఏ దేశమేగినా ఎందుకాలిడిన

ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన

పొగడరా నీ తల్లి భూమి భారతిని

నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అని మొదలుపెట్టిన

రాయప్రోలు సుబ్బారావు ఆ గేయం చివర్లోకి వచ్చేటప్పటికి ఏమయిందో ఏమో 'నిలుపరా నీ జాతి నిండు గర్వంబు' అని ముగించాడు.

ఈ గర్వ శబ్దాన్ని పట్టుకునే మహాకవి శ్రీ శ్రీ "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?' అని ఎద్దేవా చేస్తే, ఆ అడుగు జాడలోనే నడుస్తూ తిలక్ నేను "నిగర్వినయినాను" అని ఇంకో అడుగు ముందుకువేశాడు.

6. **ఏ భోగవంతుని విచలింప చేయగలదు ?**

**ఏ భగవంతునికి నివేదించుకొనగలదు ?**

**పరిచయం :** పై కవితా పంక్తులు తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' నుంచి గ్రహించబడిన 'ఆర్తగీతం' అనే కవితలోనివి.

**సందర్భం :** దేశంలో దారిద్ర్యం నశించి, అందరికీ బాధలు తొలగి సమసమాజం ఏర్పాటు కావాలని ఆశించాడు కవి. సామాన్య ప్రజలు అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యం, వారి కష్టనష్టాలు చూశాక, కవి కలలన్నీ కాగితపు ముక్కలుగా రాలిపోయాయి. లోకంలోని పరిస్థితిని చూసిన కవి హృదయం నుంచి వెలువడిన 'ఆర్తగీతం'లో తన ఆర్తి ఏ అంతస్తులకు చేరగలుగుతుందోనని, ఏ రాజకీయవేత్తల గుండెలను కదిలించగలుగుతుందోనని కవి చెబుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** తన ఆర్తి అసెంబ్లీలాంటి సౌధాంతరాలకుగాని, రాజకీయ నాయకులకు గాని చేరితే కనీసం చట్టాల ద్వారా అయినా సామాన్య ప్రజల జీవనస్థితి మెరుగుపడుతుంది అనుకున్నాడు కవి. ఒకవేళ తన ఆర్తి ఏ ఒక్క ధనికుడినైనా కదిలిస్తే బీదలకు న్యాయం జరుగుతుందనుకున్నాడు. వీరెవరికీ కాక భగవంతునికే నివేదించుకొనగలిగితే ఆ భగవంతుడే బీదల బాధల్ని తగ్గిస్తాడేమోనని ఆశించాడు కవి.

**ప్రశ్నలు - సమాధానాలు**

**1. తిలక్ కవితా లక్షణాలను, వైశిష్ట్యాన్ని మీ పాఠ్యాంశం ఆధారంగా తెలియజేయండి ?**

మహాకవులందరూ ప్రజల బాగుకోసమే కన్నీళ్లు కార్చారు. 'ఎంత కన్నీరు మున్నీరుగా కురిశాను మీ కోసమై' అంటాడు తిలక్. పేరు ప్రతిష్టలు పొందిన ఇద్దరు, ముగ్గురు కవుల్లో తిలక్ ఒకడు. ఇది ఆయన గొప్పదనానికి ప్రబల నిదర్శనం. మహాకవులందరిలాగే ప్రజలకోసం కన్నీరు కార్చినందువల్లనే తిలక్ కూడా మహాకవి కాగలడు. 'ఎంత కన్నీరు మున్నీరుగా కురిశాను మీ కోసమై' అన్నాడు తిలక్. మహాకవుల ప్రశంసలు అందుకున్న ప్రతిభా సంపన్నుడు, కరుణామయుడు తిలక్. అలాంటి మహాకవి కవితా లక్షణాల్ని, కవితా వైశిష్ట్యాన్ని పరిశీలిద్దాం.

తిలక్ తన కవితా లక్షణాలను గురించి చెబుతూ సారభూతంగా మూడు వాక్యాలన్నాడు. ఆ మూడు వాక్యాలివి. నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు; నా అక్షరాలు ప్రజాజక్తుల వహించే విజయ ఐరావతాలు; నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు. తన కవిత్వం కన్నీటి ప్రవాహాల్లో తడిసిపోయే 'దయ' అనే పావురాళ్ళనీ, తన కవిత్వం ప్రజాశక్తుల విజయోత్సవంలో ఊరేగింపుగా తీసుకుపోయే ఐరావతాలనే ఏనుగులనీ తన కవిత్వం వెన్నెలలో ఆనందంగా ఆడుకునే అందమైన ఆడపిల్లలనీ అన్నాడు. అంటే తన కవిత్వం ప్రజల కష్టాలకు కడగండ్లకు విశేష ప్రాధాన్యమిస్తుందనీ, తన కవిత్వం ప్రజాశక్తులకు వెన్నుదన్నుగా నిలుస్తుందని, వాళ్ల విజయాన్ని ప్రోత్సహిస్తుందనీ, తన కవిత్వం బడుగు, బలహీన వర్గాల వాళ్ళందరూ సుఖసంతోషాలతో జీవనం సాగించాలని హార్థికంగా కాంక్షిస్తుందనీ సూచించాడు.

కవిలోని రెండక్షరాలూ రెండు ఇంద్రియాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆ రెండు ఇంద్రియాలు కన్ను, వినుకలి (చెవి). ప్రతి కవిలోనూ కన్ను, చెవి ప్రాధాన్యాన్ని వహిస్తాయి. వీటి ఆధారంగా కవులు రెండు రకాలవుతారు. కన్నకవి, విన్నకవి అని. తిలక్ కన్నకవి. తాను చూసిన హృదయవిదారకమైన దృశ్యాలన్నిటినీ మన కనులముందుంచాడు, కాదు మన కనులకు కట్టించాడు. చాలా భయంకరమైన, నమ్మశక్యం కాని విషయాలు కావడంవల్ల 'నేను చూశాను' అనికాక 'నిజంగా' అనే మాటను ప్రతివాక్యంలోనూ తప్పకుండా చేర్చాడు. అతని నిజాయితీకి అది నిలువుటద్దం.

కవి ఊహాలోకాల్లో ఊయలలు ఊగరాదు. కలం కల కనడం మొదలు పెడితే కలకలం కాక మరేమవుతుంది ? కవి వాస్తవిక జగత్తులోనే చరించాలి. భావకవితకు ఆద్యుడైన రాయప్రోలు సుబ్బారావు ఆవేశపూరితంగా దేశభక్తి గీతాన్ని ఆలపిస్తూ -

'ఏ దేశమేగినా ఎందుకాలిడినా

ఏ పీఠమెక్కినా ఏవ్వరేమనినా

పొగడరా నీ తల్లి భూమి భారతిని

నిలుపరా నీ జాతి నిండు గౌరవము' అని మొదలుపెట్టి చివరికి వెళ్ళే సరికి ఆవేశాన్ని ఆపుకోలేక 'నిలుపరా నీ జాతి నిండు గర్వంబు' అని ముగించాడు. ఆ 'గర్వ' శబ్దాన్నే అందుకొని మహాకవి శ్రీ శ్రీ ఈ దేశ చరిత్రను కూడా కలుపుకొని, ' ఏ దేశ చరిత్ర చూసిన ఏమున్నది గర్వకారణం?' అని నిలదీశాడు. ఆ మార్గంలోనే పయనించిన తిలక్,

'ఒక్క శుష్క స్తన్య సన్నిధిని

క్షుధార్తి నేడ్చు పసిపాప ఉన్నంతవరకు

ఒక క్షత దుఃఖిత హృదయమూరడిల్లనంతవరకు

నాకు శాంతి కలుగదింక నేస్తం ! నేను నిగర్వినయ్యాను'

అని ఆ గర్వ శబ్దాన్నే గ్రహించి ఎద్దేవా చేశాడు.

అందుకే కాబోలు మహాకవి శ్రీశ్రీ, తిలక్, అకాలమరణానికి గురి అయితే ఆయనకు నివాళి అర్పిస్తూ 'సమకాలిక సమస్యలకు స్వచ్ఛస్ఫాటికఫలకం' అని ప్రశంసించాడు. 'నడినింగిని మాయమయాడా!' అని నిర్ఘాంతపోయాడు. మామూలు మనుషులకు ఒకటిగా కనిపించినవి కవులకు అనేకంగా కనిపిస్తాయి. ఎందుకంటే కవి చూపు చాలా విలక్షణమయింది కాబట్టి.

'మలినాశ్రుబిందువు' అంటాడు తిలక్ అశ్రుబిందువులంటే కన్నీళ్ళు అనే అర్థమే అందరికీ ! కానీ కవికి మాత్రం అవి (అశ్రుబిందువులు) రెండు విధాలుగా గోచరిస్తాయి. 1) అమలినాశ్రువులు 2) అమలిన అశ్రువులు, అని ఎదుటి వ్యక్తుల

ఇబ్బందులకు, బాధలకు సానుభూతిగా తప్పక రావలసిన అశ్రువులు అమలిన అశ్రువులు. హింసకు గురైనందువల్ల రాకూడని దుస్థితిలో వచ్చే అశ్రువులు అమలినాశ్రువులు. ఈ సున్నితమైన తేడాను పసిగట్టాయి కవి కళ్ళు. ఒక ప్రవాహంలాగ సాగుతుంది తిలక్ కవిత్వం. అభ్యుదయ భావాలను కూడా అందంగా చెప్పింది ఆయన శైలి.

**2. 'ఆర్తగీతం' లో బాలగంగాధర తిలక్ వెలిబుచ్చిన ఆర్తిని వివరించండి.**

తిలక్‌ను ఉద్దేశించి ఒక మిత్రుడు ఈ దేశాన్ని గురించి పాడమని ఆజ్ఞాపించాడు. దానికి సమాధానంగా కవి ఇలా అంటున్నాడు. నా దేశాన్ని గురించి గానం చేయలేను. నీ ఆజ్ఞను శిరసావహించలేను. నీవు మీటుతున్న వీణకు నా గొంతును శ్రుతి కలపలేను. ఇది నాకు విషాదాన్ని గుర్తుకు తెచ్చే దినం. విధి చీకట్లను కప్పేసినప్పటి గుడ్లగూబ ఘూకరింపులు వినిపించే రోజు. నేడు నా హృదయం మోడుబారిన ఒక చెడ్డస్థితి. (అనాదిగా తెలుగు కవిత్వంలో వున్న అవలక్షణాలన్నిటినీ గుర్తుచేసుకొని అవేవీ లేకుండా వుండాలని కోరుకుంటున్నాడు) అమితమైన అలంకారాలు వద్దు. సంస్కృత పదభూయిష్టమైన శైలీ విన్యాసంవద్దు. రసానందంలో ముంచి తేల్చడం వద్దు. చిత్రకవిత్వం, కవితాశిల్పం ఇవేవీ కోరను. తత్త్వసూత్రాల వాదాల ఉక్తి నైపుణ్యంతో ఊగిపోను. సౌందర్యవంతులైన స్త్రీల నులివెచ్చని కౌగిళ్ళ గురించిన కావ్యాలలో రసానందాన్ని పొందను. గడిచిపోయిన చరిత్రలోని కీర్తి ప్రతిష్టల్ని పొందిన ఘట్టాల సమూహాలను గురించి వివరించవద్దు. (మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి' అనొద్దు) ఎందరెందరో వీరుల వేనవేల కథల్ని వినిపించవద్దు. ఇంక నన్ను విసిగించవద్దు.

ఈ వేళ నేను కన్నీరుగా కరిగిపోయిన చిన్నిపాటను. సిగ్గుతో రెండుగా చీలిపోయిన వెదురుబొంగును. మంటల్లో మనస్సు లోలోతులదాక పూర్తిగా కాలిపోయిన బూడిదను. పైన దేవునికీ, కింద మానవునికీ సమాధానం చెప్పవలసినవాణ్ణి. పాతాళలోకం తాకే విధంగా తలను వంచిన వాణ్ణి.

ఈ రోజు నేను చూసిందేమి ? విధి ఇన్ని కత్తుల్ని దూసిందేమి ? అభ్యుదయపు కత్తి అంచుల్లో రక్తమేమి ?

ఆకలితో అల్లాడిపోయి మర్రి చెట్టుకింద మరణించిన ముసలివాణ్ణి నిజంగా నేను చూశాను. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుంభవృష్టిలో వంతెన కింద నిండు గర్భవతి బిడ్డను కని మూర్ఛపోయిన దృశ్యాన్ని నిజంగా నేను చూశాను. తల్లిలేక, తండ్రిలేక తినడానికి తిండికూడా లేక ఏడుస్తూ, ఏడుస్తూ మంజేతులతో కన్నుల్ని తుడుచుకుంటూ మురికికాలువ పక్కనే నిద్రలోకి జారుకున్న మూడేళ్ళ పసిబాలుణ్ణి నిజంగా నేను చూశాను. తాను పస్తులుండి పిల్లలకు గంజిపోసి సుడులు తిరిగే అశ్రువులతో కూడిన కన్నులతో విధి నిర్వహణకై కార్యాలయానికి వచ్చిన ముసలినౌకరు వీరన్నను నిజంగా నేను చూశాను. క్షయరోగం చేత పీల్చిపిప్పి చేయబడిన తన భార్య ఇంక ఎట్టి పరిస్థితుల్లోనూ బతకదని వైద్యుడు చెప్పినప్పుడు భయంకరమైన తాకిడికి దెబ్బతిన్న దిరిశెనపూల చెట్టు కొమ్మలాగా అల్లాడిపోయిన రక్తహీనమైన, శక్తిహీనమైన అయిదారుగురు పిల్లలున్న ఒక గుమస్తాను నిజంగా నేను చూశాను. ఆకారం ధరించిన దీనత్వాన్ని, హీనత్వాన్ని, ఉత్తుంగ తరంగాలతో అల్లకల్లోలమైన కన్నీటి సముద్రాల్ని, నడుస్తున్న శవాకారంలో ఉన్న వికార స్వరూపుల్ని నేను నిజంగా చూశాను.

ఇది ఏ నాగరికత అనే కావ్యం విన్నందువల్ల కలిగే ఫలితం ? ఏ విజ్ఞానాభివృద్ధికి ఇది మూలం ? ఏ బుద్ధదేవుని జన్మస్థలానికి ఇది గర్వ స్మరణం ?

మిత్రమా ? ఇక ఏమాత్రం నన్ను ఇబ్బంది పెట్టకు. ఈ రాత్రి నేను గానం చేయలేను. ఈ కృత్రిమమైన వేషాన్ని అభినయించలేను. మానవత్వం లేని లోకాన్ని పొగడలేను. మనిషిగా నేను తలయెత్తుకొని తిరగలేను. ఈ నాగరికత అనే అరణ్యవాసాన్ని భరించలేను.

ఒకేఒక్క నిరుపేద వ్యక్తి వున్నంతదాకా, ఒక్క ఘోరమైన కన్నీటిబొట్టు రాలినంతదాకా, ఒకేఒక్క పేగు ఆకలితో కుమిలిపోయినంతదాకా, చనుబాలు ఇంకిన ఒక తల్లి దగ్గర ఆకలిబాధతో ఏడ్చే పసిపాప వున్నంతదాకా, ఒక మాతృమూర్తి ధ్వని - రహితమైన వేదన రోదన విన్నంతదాకా, దెబ్బతిని దుఃఖానికి లోనయిన ఒక హృదయం ఓదార్పుకు నోచుకోనంతదాకా నాకు శాంతి కలగనేకలగదు నేస్తం ! నేను ఈ దేశాన్ని గూర్చి ఇంతకుముందు గర్వపడేవాణ్ణి. ఇప్పుడు గర్వం లేనివాణ్ణయ్యాను. ఈ సిగ్గులేని ముఖాన్ని లోకానికి చూపించలేను. ఈ గుండె గూటికి సంబంధించిన కీళ్ళన్నీ పట్టుదప్పిపోయాయి. ఈ కళ్ళు ప్రవాహాలై పారాయి. ఈ కలలు చిరిగిన కాగితాల పీలికలై రాలిపోయాయి.

ఈ ఆర్తి ఏ మేడల లోపలిభాగాలకు ప్రయాణం చేస్తుంది ? ఏ రాజకీయ నాయకుని గుండెలను తాకగలదు ? భోగభాగ్యాలతో తులతూగే ఏ ధనవంతుని మానసికంగా కదిలించగలదు ? ఏ భగవంతునికి విన్నవించుకోగలదు ? అని తన ఆర్తినంతా వెళ్ళగక్కాడు.

**సారాంశం :**

ఆత్మాశ్రయధోరణి వ్యక్తమైన ఈ 'ఆర్తగీతం'లో తిలక్ దారిద్ర్యదేవత తాండవించే భారతదేశాన్ని చూచి అనుభవించిన ఆవేదన పలురీతులలో దర్శనమిచ్చింది.

**ప్రశ్నలు :**

1. మూర్తీభవించిన మానవతావాది తిలక్ - వివరించండి.
2. 'ఆర్తగీతం' ఆధారంగా తిలక్ అభ్యుదయ భావకవితా లక్షణాలను గూర్చి విశదీకరించండి.
3. తిలక్ కవిత్వం కన్నీటిమయం - చర్చించండి.

**రచయిత**
**ఆచార్య పి. ఎల్. శ్రీనివాసరెడ్డి**
**తెలుగు శాఖ**
**శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం**
**అనంతపూర్**

ఖండం : 2

# ఆధునిక పద్యభాగము

పాఠం : 3

## మహేంద్రోదయం

శీర్షికలు :

- దాశరథి

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు అర్థాలు
5. సందర్భ సహిత వ్యాఖ్యలు
6. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంకోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు దాశరథిని మేల్కొల్పగా, తెలుగు వెలుగును దర్శించిన దాశరథి మహేంద్రోదయం కోసం పాటుపడటం ఈ పాఠంలో కన్పిస్తుంది.

### 1. కవి పరిచయం

'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటూ మాతృ భూమిపై మమకారాన్ని ఎలుగెత్తి చాటిన కవి దాశరథి. దాశరథి అనేది ఇంటిపేరు. అసలు పేరు కృష్ణమాచార్యులు. కానీ దాశరథిగానే ప్రసిద్ధుడీయన.

తెలంగాణాలోని ఖమ్మం జిల్లా మానుకోట తాలూకాలోని గూడూరు గ్రామంలో 1927 సెప్టెంబరులో జన్మించాడు. ఈతని తల్లిదండ్రులు వెంకటమ్మ, వెంకటాచార్యులు. పండితవంశంలో పుట్టిన దాశరథి నూనూగు మీసాల నాటికే పాండిత్యం సంపాదించాడు. కవిత్వాన్ని రచించాడు. మెట్రిక్యులేషన్ వరకు ఖమ్మంలో చదివాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంనుంచి ఆంగ్ల సాహిత్యంలో బి.ఏ. డిగ్రీ పొందాడు.

తెలంగాణాలో నిజాం పరిపాలనను ఎదిరించాడు. తెలంగాణా ప్రజల హృదయాలలోని బాధల్ని ప్రతిస్పందింపజేస్తూ రచనలు చేశాడు. తెలంగాణా పోరాటంలో స్వయంగా పాల్గొన్న వీరుడు దాశరథి. "మా నిజాం రాజు జన్మ జన్మాల బూజు" అంటూ "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" ఖబడ్దార్ అని హెచ్చరించి గళమెత్తి చాటిన అభినవాంధ్ర వైతాళికుడీయన. తెలంగాణా ఉద్యమ సందర్భంగా జైలు జీవితాన్ని అనుభవించాడు. తన కవిత్వంతో జాతిలో చైతన్యాన్ని పెంపొందించాడు.

దాశరథి కావ్యాలలో అభ్యుదయ భావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. హృద్యమైన పద్యం నుంచి, శ్రవణపేయమైన గేయం నుంచి, రుచికరమైన వచన కవితదాకా అన్ని ప్రక్రియలనూ ఆహ్వానించాడు. ఉర్దూ, పారశీ భాషలనుంచి ఉత్తమ కవితలను తెలుగు వారికి అందించాడు. పోరాటం నుంచి కళ పుడుతుందని దాశరథి నమ్మకం. ఆగర్భ శ్రీమంతునికీ, అనాథకి మధ్య చిరకాలంనుంచి జరుగుతున్న సంఘర్షణే దాశరథి కవితా వస్తువు.

దాశరథి 1950 నుంచి స్థానిక స్వయం పరిపాలన ప్రభుత్వ శాఖలో గ్రామపంచాయితీ తనిఖీ ఇన్స్పెక్టర్‌గా కొంతకాలం, 1955 నుంచి 1961 దాకా ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో "ప్రవచన సహాయ ప్రయోక్త" గా కొంతకాలం, 1961 నుంచి మద్రాసు ఆలిండియా రేడియోలోను పనిచేశాడు. ఆ తర్వాత సినిమారంగంలో ప్రవేశించి దాదాపు 2, 500 చలనచిత్ర గీతాలు రచించాడు.

ఆర్థిక సమానత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాంఘిక న్యాయం, శాంతి విప్లవం ఆశయాలుగా కలం పట్టాడు దాశరథి.

**రచనలు :** అగ్నిధార, రుద్రవీణ, అనంత సంగ్రామం, మహాంధ్రోదయం, పునర్నవం, అమృతాభిషేకం, కవితాపుష్పకం, నవమి, నవమంజరి, మహాబోధి, దాశరథీ శతకం, తిమిరంతో సమరం, ఆలోచనాలోచనాలు, గాలిబ్ గీతాలు, జ్వాలాలేఖిని మొదలైనవి దాశరథి రచనలు.

'కవితా పుష్పకం' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును, 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్నాయి. 'గాలిబ్ గీతాలు' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ అనువాద బహుమతి లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇచ్చిన కళాప్రపూర్ణతో పాటు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, ఆగ్రా విశ్వవిద్యాలయాలు దాశరథికి డాక్టరేటు బిరుదాన్నిచ్చి సత్కరించాయి. ఈయన 1977 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవిగా నియమితుడయ్యాడు.

దాశరథి అభ్యుదయ దృక్పథమున్న జాతీయకవి. మానవతావాది. సమైక్యతావాది. సామ్రాజ్య వాదానికి, వలస విధానానికి, జాతి విచక్షణకు, మత దురహంకారానికి వ్యతిరేకంగా రచనలు చేసిన వారిలో ప్రముఖుడు దాశరథి. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, తెలంగాణా రచయితల సంఘం అధ్యక్షుడిగా కొత్త కవిత్వాన్ని, సామాజిక అభ్యుదయాన్ని స్పష్టంగా ప్రకటించాడు.

దాశరథి కవితా జ్వాల సమాజ శ్రేయోదాయకమైన మార్గాన్ని చూపుతుంది. శ్రామికుడి శ్రమను గౌరవిస్తుంది. దీనుల ఆర్తికి విలపించి సానుభూతి చూపుతుంది. ఒక్కొక్కప్పుడు నులివెచ్చని ప్రేమగీతమై హృదయాన్ని అలరిస్తుంది. ఉద్యమాల్లో కూడా "ఏనాడెవ్వడు కత్తితో గెల్వలేదీ విశ్వమున్" అంటూ ప్రపంచ శాంతిని ప్రబోధించిన దాశరథి 1987 నవంబరు 5 వ తేదీన మరణించాడు.

## 2. పాఠ్యభాగ సందర్భం :

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రావతరణ కోసం తనవంతు కృషి సల్పిన కవి దాశరథి. తెలంగాణాకు విముక్తి లభించాక ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం అవతరించడం కోసం పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం చేశాడు. ఆ అమరజీవి ఆత్మార్పణ ఫలితంగా 1953 లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత తెలుగు మాట్లాడే ప్రజలు ఉండే ప్రాంతాల్ని ఏకంచేస్తూ 1956 లో హైదరాబాదు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

ఆంధ్ర రాష్ట్రావతరణాన్ని ఆకాంక్షిస్తూ దాశరథి రాసిన 20 ఖండ కావ్యాల సంపుటి మహాంధ్రోదయం. ఈ సంపుటి నుంచి స్వీకరించబడిన 'మహాంధ్రోదయం' అనే కవిత ప్రస్తుత పాఠ్యభాగం.

## 3. పాఠ్యభాగ సారాంశం :

దాశరథి అంతర భావనామయ చైతన్యానికి ఈ కవిత అక్షర రూపం.

"చిమ్మ చీకట్లో దీపంగా వెలుతురును ప్రసరించిన వాడివి ఎవరవయ్యా!" అంటూ పొట్టి శ్రీరాముల్ని ప్రశ్నిస్తాడు కవి. "నేనెవరో నీకు తెలియదా ! నేను పొట్టి శ్రీరాముల్ని. నీలాంటి మానవుడినే. నిద్రించిన ఆంధ్రను మేల్కొల్పడానికి సంసిద్ధమయ్యాను. నిద్రిస్తున్న ప్రజలారా తలుపులు తెరవండి. మనకు ప్రత్యేక ఆంధ్ర అవతరించింది. బానిస జనులారా! నిద్ర వదలండి. ఇదిగో సుప్రభాతం వచ్చింది" **అంటూ** పొట్టి శ్రీరాములు దాశరథిని మేల్కొల్పగా తొలిసారి కళ్ళు విప్పిచూసి తెలుగు వెలుగును దర్శించాడు దాశరథి. నదులు నీటిని ప్రజలందరికీ ఇస్తున్నాయని; సర్కారు, తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలందరినీ ఒక త్రాటిపై నిలబెడతానన్నాడు కవి.

బానిస సంకెళ్ళు తెంచుకొని ఆంధ్ర జాతి మేల్కొందని, తెలుగు భూమిపై వెలుగుపక్షి రెక్కలు విప్పి తరతరాల చీకట్లను తరిమిందని, కవి కళ్ళల్లో వెలుగు నిండిందని, తానే తెలుగునని, వెలుగునని కవి సంతోషించాడు.

చాళుక్యుల, కాకతీయుల, విజయనగర రాజుల ధైర్య స్థైర్యాలు, కాపయనాయకుని శౌర్యం తన రచనల్లో ఉన్నాయన్నాడు. నిజాం నవాబు గుండె పగిలేలా పద్యాలు రాసి ప్రజలను సంకెళ్ళ నుంచి విముక్తి చేస్తాన్నాడు.

తెలుగు కవితాలక్ష్మి తన ఇంటి ఇల్లాలని మూడుకోట్లమంది ప్రజలను ఒక్కటిగా చేసి 'మహేంద్రోదయం' కోసం పాటుపడతానన్నాడు కవి.

## 4. కఠిన పదాలకు అర్థాలు :

| | | |
|---|---|---|
| చిమ్మచీకటి | = | కాంతిలేని ప్రదేశం |
| సెమ్మె | = | స్తంభం |
| దివ్వె | = | దీపం |
| రువ్వినావు | = | విసిరావు |
| బాకు | = | కత్తి |
| ప్రగాఢ | = | మిక్కిలి అధికమైన |
| సాహిత్య మూర్తి | = | రూపుదాల్చిన మేలు ; కలపడమే పరమావధిగా గల వ్యక్తి |
| నిద్రాణ | = | నిదురపోతున్న |
| ఆంధ్ర ధరాస్థలి | = | ఆంధ్ర భూభాగం |
| తాకిడి | = | స్పర్శ |
| విచ్చిన | = | విడిపోయిన |
| కాలరాత్రి | = | నల్లని రేయి |
| రుధిర నిర్ఝరి | = | రక్తం ఆగకుండా ప్రవహించడం (రక్తపు టేరులు) |
| దిగంగనా (దిక్+అంగనా) | = | దిక్కులు అనే స్త్రీ |
| నవ | = | కొత్తదైన |
| ప్రభలు | = | కాంతులు |
| శయించిన | = | నిదురపోతున్న, పడుకొన్న |
| తరుణీ | = | యవ్వనంలో ఉన్న స్త్రీ |
| సుందర | = | అందమైన |
| దంత ఘట్టన | = | దంతాల తాకిడికి |
| లసత్ | = | ప్రకాశిస్తున్న, ఒప్పుతున్న |
| తాంబూల రాగ | = | తాంబూలం వేసుకోవడం వల్ల కలిగిన ఎరుపు |
| ప్రభాస్ఫురణీయ | = | ప్రకాశిస్తున్నట్టు గుర్తుకు తెచ్చే |
| అధరబింబము | = | దొండపండు వంటి పెదాలు |
| ప్రాచీ ధరాధర | = | తూర్పు దిక్కు కొండ |
| కూటమ్ముపై | = | శిఖరంపై |
| ఉర్వర | = | భూమి మీద |

| | | |
|---|---|---|
| సుప్రభాతం | = | కొత్త వెలుగు |
| ప్రాభాత | = | వేకువ జాము |
| నూతన | = | కొత్తదైన |
| గీతావళి | = | పాటల సమూహం |
| నేత్రాలు | = | కన్నులు |
| విచ్చి | = | తెరచి |
| తొల్సారి (తొలి + సారి) | = | మొదటిసారి |
| తెల్గుగా | = | తెలుగు భాషగా |
| భయద | = | భయాన్ని కలిగించిన |
| కంటిన్ | = | చూశాను |
| ఒత్తికొనుచు | = | తుడుచుకుంటూ |
| ఇనుమడించు | = | ఎక్కువ చూపించు, రెట్టించు |
| సమ్మోదం | = | మిక్కిలి సంతోషం |
| ముఖ మార్జనకు (ముఖము + అర్జన) | = | ముఖం శుభ్ర పరచుకోవడానికి |
| జలమ్ములొసంగె (జలమ్ములు + ఒసంగె) | = | నీళ్ళు ఇచ్చింది |
| తుంగమ్మ | = | తుంగభద్రానది |
| మోము | = | ముఖం |
| అడచివేసె | = | పోగొట్టె, తుడిచివేసె |
| పెన్నమ్మ | = | పెన్నానది |
| పయః | = | పాలు, నీరు |
| పీయూషం | = | అమృతం, జున్నుపాలు |
| మూడు చెరుగుల | = | మూడు ప్రాంతాల |
| ముడివడినయట్లు | = | కలసిమెలసినట్లు |
| అందలం | = | పల్లకి |
| యావత్ | = | మొత్తం |
| జనావళి (జన + ఆవలి) | = | ప్రజలందరూ, జనసమూహం |
| సుందర | = | అందమైన |
| విభాతం | = | కాంతికిరణం |
| అంధకార | = | చీకటిమయమైన |
| శయ్యాగృహం | = | నిదురించే స్థలం |
| గురకవెట్టు (గురక + పెట్టు) | = | గుర్రు పెట్టడం |
| సముజ్జ్వలం | = | ఎక్కువ ప్రకాశించడం |
| ప్రభాత పాత్ర | = | ఉదయం అనే పాత్ర |
| ప్రభామధువు | = | కాంతి అనే తేనె |

| | | |
|---|---|---|
| గ్రోలె | = | తాగి |
| నిశా | = | చీకటి |
| కారాగృహ | = | బందిఖానా, జైలు |
| నిగళ | = | సంకెళ్ళు |
| నీరవమ్ముల | = | చప్పుడు లేకుండా ఉండడం |
| నింగి | = | ఆకాశం |
| పులుగు | = | పక్షి |
| రెక్కలార్చి (రెక్కలు + ఆర్చి) | = | రెక్కలు ఊపి |
| చిమ్మివైచె | = | తుడిచివేసె |
| కాంక్ష | = | కోరిక |
| మరొండు | = | వేరొకటి |
| కరాలు | = | చేతులు |
| శిరమూచి (శిరము + ఊచి) | = | తల ఆడించి |
| ధరిత్రి | = | భూమి |
| కాకతి | = | కాకతీయ సామ్రాజ్యం |
| రుద్రమ | = | రుద్రమ దేవి |
| అరి | = | భయంకరంగా |
| శిరస్సులు | = | తలలు |
| ఉత్తరించు | = | తొలగించు, నరుకు |
| అఖిల | = | సమస్త |
| జగములు | = | లోకాలు |
| నవ | = | కొత్తదైన |
| శిరీష ప్రసవ | = | దిరిసెన పూవుల |
| మంజుల | = | మనోజ్ఞమైన |
| భావగుంభిత | = | భావాలచేత కూర్చబడిన |
| కావ్య రాజం | = | కావ్యాలలో మకుటం లేనిది. |
| నవ్య | = | కొత్తదైన |
| సవ్యమార్గ ప్రదర్శకం | = | సరైన మార్గాన్ని చూపించేది. |
| శ్రమిక | = | శ్రామికుల |
| హృదయాంతర (హృదయ + అంతర) | = | మనసులలో |
| మహా బడబాగ్ని | = | నీటిలో పుట్టే పెద్ద అగ్ని |
| ఉరుకులు | = | పరుగులు |

| | | |
|---|---|---|
| కృషిక సీరము | = | రైతు నాగలి |
| నిశాత | = | పదునైన |
| క్రుమ్మ | = | పాడుచు |
| బారులు | = | వరసలు |
| మహా + ఆంధ్ర + ఉర్వర | = | గొప్ప తెలుగు నేల |
| ద్వార బంధం | = | తలుపు |
| రాగ బంధం | = | అనురాగపు లంకె |
| దీపికాతత | = | దీపాల సమూహం |
| ప్రభాధునులు | = | కాంతి ప్రవాహాలు |
| కనుము | = | చూడుము |
| రమణీయ | = | అందమైన |
| ఘంటా | = | గంట |
| నా గళములో | = | నా గొంతులో |
| భేరీరవము | = | దుందుభి ధ్వని |
| హృదయ వీధి | = | మానస వీధి |
| దావాగ్ని (దావ + అగ్ని) | = | అడవిలో పుట్టె అగ్ని |
| లేఖినీ | = | కలం |
| ముఖాంతరం (ముఖ + అంతరం) | = | ముఖం మధ్య |
| దిక్ + దిగంతములు | = | దిక్కుల యొక్క చివరలు |
| జ్యోత్స్న + ఉజ్వల | = | వెన్నెల యొక్క విప్పారిన |
| ప్రభలలో | = | కాంతులలో |
| పోతకవి | = | పోతన మహాకవి |
| కావ్య వారాశి | = | కావ్యమనే సముద్రం |
| తెలగాణ | = | తెలంగాణ |
| నిగళాలు | = | బంధాలు, సంకెళ్ళు |
| ఎత్తార్చు (ఎత్తు + ఆర్చు) | = | పెద్దకేక |
| వేస్తంభాలు | = | వేయి స్తంభాలు |
| సుమాలు | = | పూలు |
| దూసినాను | = | కోశాను |
| కవి + ఈశాను గంటం | = | కవులలో శ్రేష్ఠుడైన పోతన గంటం |
| పడసినాను | = | స్వీకరించాను, పట్టాను |
| తమ్ముల | = | అనుజుల |
| కడ | = | దగ్గర |
| తెల్గుటన్నలు | = | తెలుగు జాతిలోని అగ్రజాలు, పెద్దలు |

| | | |
|---|---|---|
| వృత్తాంతం | = | సమాచారం |
| గీతి | = | గీతం |
| ఇంటి చిన్నది | = | ఇల్లాలు |
| మొలకలెత్తు | = | మొదలగు, ప్రారంభమగు |
| వలపించుకొను | = | ప్రేమింపచేసుకొను |
| పాతకాలంపు | = | పురాతనమైన |
| సౌభాగ్య గరిమ | = | భాగ్యం యొక్క గొప్పదనం |
| ఉంగరమ్ముల జుత్తు | = | ఉంగరాల జుట్టు |
| సింగారాలు | = | అలంకారాలు |
| తలబ్రాలు | = | తలంబ్రాలు |
| ముద్దరాలు | = | స్త్రీ |
| వెలార్చు | = | వెదజల్లు |
| కన్నడింపని | = | వ్యతిరేకించని |
| కవనలక్ష్మి | = | కవిత్వమనే లక్ష్మి |
| రసభర | = | రసంతో నిండిన |
| విజృంభమాణ | = | వికసించిన |
| పూర్ణ | = | నిండైన |
| కుచకుంభ | = | స్తనాలనే కుండలు |
| మహా + ఆంధ్ర + ఉదయం | = | సమగ్రాంధ్రోదయం |
| పారాణి | = | కుంకుమ మొదలైన వాటితో పాదాలకు చేసే అలంకారం. |

## 5. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1 . "ఎవరవయ్యా ? ప్రగాఢ సాహిత్యమూర్తి" :

పరిచయం : ఈ వాక్యం దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'మహాంధ్రోదయం' అనే కవితా సంకలనం నుంచి గ్రహించబడిన 'మహాంధ్రోదయం' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం అవతరించడానికి కారణం తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు. ఆయన చేసిన త్యాగాన్ని పొగుడుతున్నాడు కవి.

వివరణ : అప్పటి వరకు పరాయి పరిపాలనలో ఉన్న ఆంధ్రరాష్ట్రం చిమ్మ చీకటికి సంకేతం. అలాంటి చీకటిలో తూర్పు దిక్కు అనే స్తంభంమీద ఒక దీపాన్ని వెలిగించగా వచ్చిన వెలుతురును బాకుతో పోలుస్తూ ఆ బాకును ఆకాశ మార్గంలోకి విసిరేసిన వాడివి ఎవరవు నీవు? అని ప్రశ్నించాడు. దాశరథి కళ్ళకు పొట్టి శ్రీరాములు మంచితనం మూర్తీభవించిన వ్యక్తిలా ఉన్నాడు.

### 2. " అరి శిరస్సులనుత్తరించిన అలుగు నేనే" :

పరిచయం : ఈ కవితాపంక్తి దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'మహాంధ్రోదయం' అనే కవితా సంకలనం నుంచి స్వీకరించిన 'మహాంధ్రోదయం' అనే కవితలోనిది.

సందర్భం : ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం అవతరించడాన్ని వెలుగుగా భావించిన కవి, చిమ్మ చీకట్లు అలముకొని ఉన్న జగతి, వెలుతురుకు నిద్రలేచి ఒళ్ళు విరుచుకొందని, తెలుగు వెలుగు చీకట్లను తరిమివేసిందని, ఎన్నాళ్ళకు తెల్లవారిందని ఆశ్చర్యం ప్రకటిస్తున్నాడు. ఎక్కడ చూసినా వెలుగు, తెలుగు అంటూ, తెలుగు ప్రజల పరాక్రమాల్ని వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ : కాకతి, రుద్రమ, రాయలు, సింగన లాంటి పరాక్రమవంతుల పరాక్రమాన్ని నేనే ఇముడ్చుకొన్నానని, వారంతా నేనేనని అన్నాడు కవి. అంతేకాదు భయంకరమైన శత్రువుల తలల్ని ఖండించిన కత్తిని నేనేనని, తెలుగు నేనే అని అన్నాడు.

విశేషాంశం : కాకతమ్మ, రుద్రమ దేవి, శ్రీకృష్ణదేవరాయలు, రావుసింగ భూపాలుడు సర్వాంధ్ర యశస్సుకు కారకులు. కాబట్టి వారంతా తెలుగువారే. ప్రతి ఆంధ్రునిలో ఆంధ్రజాతి పౌరుషాన్ని, దేశభక్తిని, కవితాశక్తినీ కనుగొన్న కవి. వారందరి మహోజ్జ్వల శక్తికి తానే వారసుడనని చెప్పుకొన్న దాశరథి కవితాశక్తి మహత్తరమైంది.

### 3. " ప్రతిఫలించే మహాకావ్యం నాకు కావలె " :

పరిచయం : ఈ కవితాపంక్తి దాశరథి రచించిన 'మహాంధ్రోదయం' అనే కవితా సంకలనం నుంచి గ్రహించబడిన 'మహాంధ్రోదయం' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ప్రత్యేక తెలంగాణ అవతరించాక సామాన్య జీవనవిధానానికి సంబంధించిన పుస్తకాలు తెలుగులో రావాలని కవి ఆశిస్తున్న సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ : కొత్తగా విరిసిన పువ్వులో మంజుల భావ సువాసనతో నిండినటువంటి కావ్యరాజం తనకు కావాలనీ అది నూతన జగత్తును సవ్యమార్గంలో నడిపించేటట్లుగా ఉండాలనీ భావించాడు కవి. శ్రామిక సంబంధమైన, కర్షక సంబంధమైన అంటే సామాన్య ప్రజా జీవనాన్ని చూపించే కావ్యం రావాలనీ, ఇంకా తెలుగు ఊర్లు, తెలుగు ప్రజలు ప్రతిఫలించే మహాకావ్యం తనకు కావాలనీ అంటాడు కవి.

విశేషాంశం : ఈ వాక్యం వల్ల దాశరథికి దేశాభిమానం, భాషాభిమానం రెండూ ఉన్నాయని తెలుస్తుంది. మూర్తీభవించిన తెలుగుదనం దాశరథి.

### 4. " పాడినాము మహాంధ్ర సౌభాగ్యగీతి " :

పరిచయం : పై కవితాపంక్తి దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'మహాంధ్రోదయం' అనే కవితా సంకలనం నుండి స్వీకరించిన 'మహాంధ్రోదయం' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : చాళుక్యుల, కాకతీయుల, విజయనగర రాజుల, కాపయనాయకుని వీరలక్షణాలను తనలో చూపించాడు కవి. అంతేకాదు తెలంగాణాలో పోతన నుంచి తనదాకా రాసిన కవిత్వంలో వెన్నెల వచ్చిందన్నాడు. తెలంగాణకు బానిస సంకెళ్ళు తెంచి స్వేచ్ఛను కలుగజేశానని, రాక్షసిలాంటి నైజాం నవాబు గుండె నీరయ్యేటట్లు పద్యాలు పాడానని, వేయిస్తంభాల నీడలో ఒక తెలుగు తోటను నాటి పువ్వులు కోశానని, పోతన కలంనుంచి వెలువడిన మహాభాగవతంలోని ఒడుపులను కొన్నింటిని స్వీకరించానని చెబుతున్న సందర్భంలోనివి.

వివరణ : తెలంగాణలోని ప్రజలు ఒక కోటి. సర్కారు, రాయలసీమలోని ప్రజలు రెండు కోట్లమంది. తెలంగాణలోని కోటిమంది ప్రజల దగ్గర రాయలసీమ, సర్కారు ప్రాంతాల్లోని రెండుకోట్లమంది ప్రజలను గురించి చెప్పి మూడు కోట్ల ప్రజలను ఏకం చేసి, మహాంధ్రదేశపు సౌభాగ్య గీతిని పాడానని చెబుతున్నాడు కవి. ఆంధ్రులంతా ఒకే బాటపై నడవాలని కవి ఆకాంక్ష.

విశేషాంశం : ఆంధ్రజాతి చైతన్యవంతమవడానికి ముఖ్యంగా ప్రతి అడుగులో, ప్రతి పలుకులో ఆంధ్రజాతి ఒకటిగా మెలగడానికి తన వంతుగా కృషి చేస్తానన్నాడు కవి.

## 5. " కోట్లాది జనము తెలుగు లక్ష్మి పాదాలకు వెలుగుల పారాణి నిడిరి " :

పరిచయం : పై కవితా పంక్తులు దాశరథి రచించిన 'మహాంధ్రోదయం' అనే కవితాసంకలనంలోని 'మహాంధ్రోదయం' అనే కవితలోనివి.

సందర్భం : మహాంధ్రోదయం సిద్ధించిన తర్వాత తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కవి అన్న మాటలివి.

వివరణ : ఇన్నాళ్ళకు మహాంధ్ర సిద్ధించింది. కోట్లాది జనం వెలుగుగా వచ్చిన ఆ తెలుగు లక్ష్మి పాదాలకు పారాణి పెట్టి ఆనందించారు.

విశేషాంశం : పారాణి అనేది శుభ సూచకానికి గుర్తు. మహాంధ్ర సిద్ధించగానే ప్రజలు తెలుగుతల్లి పాదాలకు పారాణి పెట్టి ఆమెను ఆహ్వానించారని కవి ఉద్దేశ్యం.

## 6. ప్రశ్నలు - జవాబులు :

1. 'మహాంధ్రోదయం ఆధారంగా దాశరథికి ఆంధ్రరాష్ట్రం పట్ల మక్కువ ఎక్కువ' - విశ్లేషించండి ?

స్వాతంత్ర్యోద్యమం తర్వాత జరిగిన పోరాటాలలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర పోరాటం ఒకటి. ఎంతోమంది తెలుగు ప్రజలు ఈ పోరాటంలో తమవంతు కృషి చేశారు. చివరికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని పొందారు. ఈ పోరాటం కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టిన పొట్టి శ్రీరాముల్ని తలుస్తాడు కవి. ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి మరణించిన పొట్టి శ్రీరాములు చీకటిలో దీపాన్ని వెలిగించి వెలుతురు బాకును ఆకాశవీధిలోకి విసిరాడు. గాఢ నిద్రలో ఉన్న ఆంధ్రభూమిని తట్టి మేల్కొల్పాడు. తెలుగు ప్రజలకు కొత్త సుప్రభాతాన్ని చూపించాడు. ప్రభాత గీతిక పాడుతూ దాశరథిని మేల్కొల్పాడు.

నిద్రనుంచి మేల్కొని కళ్ళు తెరిచిన కవికి కనిపించింది తెలుగు అనే వెలుగు భయాన్ని కలిగించిన రాత్రులు తొలగిపోయి చాలా రోజులకు ఇంటిని, ఇల్లాలిని, పిల్లలను చూశాడు. కృష్ణ, గోదావరి, తుంగభద్ర, పెన్నానదులు స్త్రీ మూర్తులు. అవి కవి జీవితాన్ని ఆనందింపజేశాయి. కృష్ణానది కవిపై ప్రేమను వ్యక్తీకరించింది. గోదావరి ముఖం కడుక్కోవడానికి నీళ్ళిస్తే, తుంగభద్రానది తన కొంగుతో కవి ముఖం తుడిచి నిద్దుర పోగొట్టింది. పెన్నానది అమృతమయమైన నీటితో ఆకలి చల్లార్చింది. రాయలసీమ, సర్కారు, తెలంగాణా ప్రజలు ఏకమైనట్లు కవి భావించాడు. ప్రజలంతా మెచ్చుకొనేట్లు పల్లకీ ఎక్కి అందమైన వెలుగు వచ్చింది. చీకటిగదుల్లో గురుక పెట్టి నిద్రిస్తున్న ఆంధ్రజాతి మేలుకొని ప్రభాతపాత్రలో వెలుగు అనే మధువును ఆస్వాదించింది.

తెలుగు అనే ఆకాశవీధిలో తెలుగుపక్షి రెక్కలు విదిలించి తరతరాల చీకట్లను పారద్రోలింది. ఏనాడో గతించిన తెలుగుజాతి స్వతంత్రం ఇప్పుడు వెలుగులై నిండింది.

ఎన్నాళ్ళకు తెల్లవారి వెలుగు వచ్చింది. ఆ వెలుగే తెలుగై కళ్ళ ఎదుట కనిపించింది. కాకతీదేవి, రుద్రమదేవి, రాయలు, సింగన అంతా తెలుగు వాళ్ళే. వీరంతా తెలుగువాని పౌరుష రూపాలు. శౌర్యరసావతారాలు. ఇంతటి పౌరుషాగ్ని వెలిగించి శత్రువుల శిరస్సుల్ని ఖండించిన వీరుడను నేనేనని, వీరంతా తెలుగు వీరులైతే, ఈ వీరులంతా తానేనన్నాడు కవి. తెలుగుపక్షినై అన్ని లోకాలు చుట్టివచ్చానన్నాడు.

కొత్త భావాలతో మృదుమధురమైన కావ్యరాజం కావాలని, అది కొత్త తెలుగు లోకానికి మార్గదర్శకం నిర్దేశించాలన్నాడు దాశరథి. శ్రామికుల, కర్షకుల శ్రమను, జీవితాల్ని ప్రతిబింబించే రచనలు రావాలన్నాడు.

చాళుక్యుల వైభవాన్ని తన కళ్ళలోనూ, కాకతి రాజ్యంలోని ఘంటారావాలను గొంతులోనూ, విద్యాపురీ రాజ్య సాహితీ విశేషాలను హృదయంలోనూ, కాపయనాయకుని శౌర్యం తన ముఖాంతరంలోనూ చూడమన్నాడు. తెలంగాణా మొత్తం వ్యాపించిన కాంతులతో పోతననుంచి తనదాకా పుట్టిన కావ్య సముద్రాన్ని చూడమన్నాడు. అంటే ఈ తెలుగు జాతిలో ఇవి గతవైభవాలుగా మిగిలి నరనరాన జీర్ణమయ్యాయని కవి స్వీయానుభవాన్ని ప్రకటిస్తూ తెలంగాణా సంకెళ్ళు తెంపి ఆనందంతో గట్టిగా అరిచానని, నిజాం నవాబు గుండె బద్దలయ్యేటట్లు పద్యాలు రాశానని, వేయి స్థంభాల నీడలో తెలుగుతోట నాటి అందులో పూసిన పువ్వులు కోశానన్నాడు. ఆంధ్ర మహాభాగవతంలో పోతన అందించిన అమృత బిందువులను కొన్నింటిని తన కలంలో పోశానన్నాడు. మూడుకోట్ల మంది ప్రజలను ఒక్కటిగా చేసి మహాంధ్ర గీతాన్ని పాడానన్నాడు దాశరథి. తెలంగాణా పోరాటంల్లో తనతో పాల్గొన్న వీరులందరి కృషినీ ఈ పద్యంలో వ్యక్తం చేశాడు.

తన ఇంటి ఇల్లాలైన తెలుగుతల్లి నడుము సన్నమని, కన్నుల్లో సిగ్గు మొలకెత్తగా తనవైపు చూసి తనను వలపించుకొందని, కొత్త వెలుగులు కూడగట్టి, తెలుగు అందాలను తలంబ్రాలు పడేట్లుగా పూలు పెట్టుకొని నవ్విందని, తన ఇంటిమధ్య సొరదీపాన్ని వెలిగించిందని, కన్నడాన్ని వ్యతిరేకించని కవితాలక్ష్మి ఆమె అని తెలుగును ప్రశంసించాడు. మహాంధ్రోదయంతో ప్రతి ఇంటి ఇల్లాళ్ళు ఆనందించారు. పాత సంస్కృతితో పాటు నవ జీవన నాగరికపు విశేషాలు కల్పి కొత్త సంస్కృతి మన మహాంధ్రోదయంలో విస్తరించాలన్నాడు దాశరథి. కన్నడాన్ని ఉపేక్షించని తెలుగు కవిత వర్ధిల్లాలని అభిప్రాయపడ్డాడు.

**2. దాశరథి గారు మహాంధ్రోదయాన్ని గూర్చి ఏమని చెప్పారు ?**

"చిమ్మచీకటిలో తూర్పు అనే దీపపు స్థంభంపై దివ్వె వెలిగించి, వెలుతురు బాకును ఆకాశంలోకి విసిరావు. ఇంతకీ ఎవరయ్యా నీవు? ప్రగాఢ సాహిత్య మూర్తి" అంటూ దాశరథి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం తన ప్రాణాలర్పించిన వీరుడిని అడిగాడు. దానికి సమాధానంగా "నీకు తెలియదా నేనెవరో ? నేను పొట్టి శ్రీరాముల్ని. నీలాగా మనిషినే. చైతన్యం లేకుండా నిద్రపోతున్న ఆంధ్రభూమిని నేడు నిద్ర లేపుతున్నాను. వెలుతురు బాకు తగలడంవల్ల చిక్కని కాళరాత్రి గుండె పగిలి జిల్లు జిల్లుమంటూ నెత్తురు వరదలై పారింది. దిక్కు అనే స్త్రీ ముఖంమీద కొత్త కుంకుమ వెలుగులు తామర మొగ్గలుగా ఉన్నాయి. తలుపులు తెరవండి, రండి, నిద్రిస్తున్న వాళ్ళందరినీ పిలవండి. అదిగో యువతి యొక్క అందమైన దంతఘట్టనల చేత మెరుస్తున్న తాంబూలపు రంగులతో ప్రకాశించే పెదవుల్లా తూర్పు దిక్కునుండి సూర్యుడు ప్రవేశిస్తున్నాడు. భూమికి అందాన్ని తెస్తున్నాడు. తెలుగు ప్రజలారా ! నిద్రలేవండి ! ఇదే మీకు సుప్రభాతం" అంటూ పొట్టి శ్రీరాములు తెలుగు పద్యాలలో ఉదయకాలపు కొత్త పాటలు పాడుతూ దాశరథిని మేల్కొల్పగా దాశరథి కళ్ళు తెరిచి మొదటిసారి తెలుగువాడిగా వెలుగును దర్శించి ఇలా అంటున్నాడు. భయాన్ని కలిగించే రాత్రులు పోయి ఇన్నాళ్ళకు ఇంటిని, ఇల్లాలిని, పిల్లలను ఆనందంగా చూశాను. నా తల్లి కృష్ణవేణమ్మ కన్నీళ్ళు తుడుచుకుంటూ నాపై మిక్కిలి ప్రేమ చూపించింది. గోదావరి ఆనందంతో నాకు ముఖం కడుక్కోవడానికి నీళ్ళిచ్చింది. తుంగభద్రానది తన పైటతో నా మొహం తుడిచి నిద్దుర భారాన్ని వదిలించింది. పెన్నానది తన అమృతమయమైన నీటితో నా ఆకలిమంట చల్లార్చింది. రాయలసీమ, సర్కారు, తెలంగాణా ప్రాంతాల్లోని మూడుకోట్లమంది ప్రజలు ఒక్కటైనట్లు దాశరథి కళ్ళముందు తోచింది. ప్రజలంతా మెచ్చుకోనేట్లు అందమైన వెలుగు పల్లకీ ఎక్కి వచ్చింది.

చీకటి గదిలో గాఢనిద్రలో ఉన్న జగతి, ఉదయమనే పాత్రలోని వెలుగు తేనెను ఆస్వాదించింది. జాతి నిద్రనుంచి మేలుకొంది. చీకటిమయమైన కారాగారపు ఇనుప సంకెళ్ళ ఘలంఘలల శబ్దాలు నీరసించి పొయ్యాయి. తెలుగు నింగిదారులలో వెలుగుపక్షి రెక్కలు విదిలించి తరతరాల నుంచి పేరుకుపోయిన చీకట్లనన్నిటిని చెల్లా చెదురుగా చిమ్మేసింది. తెల్లవారడం కన్నా నాకు ఇంకో కోరిక లేదు. ప్రతి మనిషి స్వయంగా తమ చేతులు చాపి, తలలు ఊపి తమ భూమిని పాలించగలరు. చాలా రోజులకు తెల్లవారింది. వెలుగు కనిపించింది. ఎన్నాళ్ళకో కళ్ళ ఎదుట వెలుగు సాక్షాత్కరించింది. అంతా వెలుగే, అంతా తెలుగే.

కాకతమ్మ, రుద్రమదేవి, శ్రీకృష్ణదేవరాయలు, రావుసింగ భూపాలుడు అందరూ తెలుగువాళ్ళే. అందరూ నాలో ఉన్నారు. అందరిలో నేనున్నాను. శత్రువుల తలల్ని ఖండించిన బల్లెం నేనే. తేజస్సును, శౌర్యాన్ని కూడా నేనే. అన్ని లోకాలు చుట్టివచ్చే తెలుగుపక్షి నేనే. తెలుగు నేనే. వెలుగు నేనే.

దిరిసెన పువ్వువంటి మనోహరమైన భావాలతో నిండిన కావ్యరాజం నాకు కావాలి. అది కొత్త ప్రపంచానికి సక్రమమైన మార్గాన్ని నిర్దేశించాలి.

శ్రామికుల గుండెల్లో మహాబడబాగ్నిలా పరుగులు పెట్టే దారులు, రైతులు తమ నాగళ్ళతో దున్నినట్టి పొలాల బారులు, తెలుగు ఊర్లు, తెలుగువారు ప్రతిఫలించే మహాకావ్యం నాకు కావాలి. అంటే అలాంటి రచనలు వెలువడాలని దాశరథి ఆకాంక్ష. మహేంద్రదేశం నాకు కావాలి. అన్నలారా, రండి తూరుపు దారికి ఎదురుగా తలుపు. మనిషికి మనిషికి స్నేహమనే బంధం.

ధగధగ మెరిసే చాళుక్య ప్రభువుల కీర్తి ప్రకాశాలను నా కళ్ళలో చూడండి. కాకతీయ రాజ్యంలోని జేగంటల ఘణంఘణలు నా గొంతులో వినండి. విజయనగర రాజ్య భేరీరవమ్ములు నా హృదయంలో వినండి. ముసునూరి కాపయనాయకుని శౌర్యం నా రచనల్లో చూడండి. నా తెలుగు తల్లి అన్ని దిక్కులకు ప్రసరింపచేసిన పండు వెన్నెలలోని వెలుగులలో పోతననుంచి నాదాకా పొంగిపొర్లుతూ ప్రవహించే కావ్యవారాశిని తెలుగులోకంలో చూడండి.

నేను తెలంగాణా సంకెళ్ళను తెంపి ఆకాశమంత ఎత్తుకు వినిపించేట్లు అరిచాను. నిజాంనవాబు అనే రాక్షసి గుండె నీరయ్యేట్లుగా పద్యాలు పాడి తెలంగాణా మానవుడిని కాపాడాను. వేయిస్తంభాల నీడలో ఒక తెలుగుతోట నాటి అందులోని పువ్వులు కోశాను. పోతన రచించిన ఆంధ్ర మహాభాగవతంలోని ఒడుపులను కొన్నింటిని నా కలంలో నింపుకొన్నాను. కోటిమంది తమ్ముళ్ళు ఉన్న తెలంగాణాలో; సర్కారు, రాయలసీమల్లోని రెండు కోట్లమంది అన్నలను గురించి చెప్పి మూడుకోట్ల మంది ప్రజలను ఒక్కటిగా కలిపి మహేంద్ర సౌభాగ్యగీతాన్ని పాడాను.

నా యింటి చిన్నది నడుము సన్ననిది. కనులలో తెలుగు సిగ్గులు మొలకెత్తగా నావైపు చూచి పురాతన సౌభాగ్య గరిమతో నన్ను వలపించుకొంది. కొత్త వెలుగులు కూడగట్టినట్లు ఉంగరాల జుట్టునంతా కలిపి కట్టి, తెలుగు సింగారాలను తలంబ్రాలుగా జారేట్టు పూలు పెట్టుకొని ముగ్ధలా నవ్వులు వెదజల్లి నా ఇంటి మధ్యన సొరదీపాన్ని వెలిగించిన తెలుగు పిల్ల. కన్నడ భాషలోని కమనీయతను ఉపేక్షింపక, తెలుగును కలసి కవితలు వెలయించిన లక్ష్మి. రసభరమైన నిండుదనంతో నన్నామె అలరించింది.

నేడు మహేంద్రోదయమైంది. కోట్లాది జనం తెలుగులక్ష్మి పాదాలకు వెలుగుల పారాణి పెట్టారు.

సారంశం : తెలుగుదేశాన్ని ఏలిన రాజవంశీయుల పరాక్రమాన్ని ప్రశంసిస్తూ మూడు కోట్లమంది ప్రజలను ఒక్కటిగా చేసి మహేంద్రగీతాన్ని పాడారు దాశరథి.

## ప్రశ్నలు :-

1. దాశరథిగారు దర్శించిన మహేంద్రశ్రీ ఎట్టిది?
2. 'మూడు కోటుల నొక్కటే ముడిబిగించి పాడినాడ మహేంద్ర సౌభాగ్య గీతి' - దాశరథి గారి గీతి ఎట్టిది?
3. మహేంద్రోదయంలో దాశరథి ఆత్మీయతను ప్రకటించండి?
4. దాశరథి మహేంద్రోదయాన్ని వివరించండి?

ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి,
తెలుగు శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపూర్

ఖండం : 2

# ఆధునిక పద్యభాగము

పాఠం : 4

## లకుమ త్యాగం

- సి. నారాయణ రెడ్డి

(కర్పూర వసంతరాయలు - 5వ ఆశ్వాసం "రాణిమేను తపించె నిప్పున-" నుండి "కర్పూర సౌరభమ్ములు వీచు" వరకు.)

శీర్షికలు :

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు అర్థాలు
5. సందర్భ సహిత వ్యాఖ్యలు
6. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :** కర్తవ్యాన్ని విస్మరించిన కుమారగిరి రెడ్డిని కర్తవ్యోన్ముఖుని చేయడానికి, మహారాణి ప్రోద్బలంతో ఆస్థాన నర్తకి లకుమ చేసిన త్యాగం ఈ పాఠంలో ముఖ్యాంశం.

### 1. కవి పరిచయం :

సినారె గా తెలుగు పాఠకులందరికీ చిరపరిచితుడైన సింగిరెడ్డి నారాయణరెడ్డి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హనుమాజి పేట గ్రామంలో 1931 జూలై 29 న ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి ఇతని తల్లిదండ్రులు. హనుమాజిపేట, సిరిసిల్ల, కరీంనగర్‌లలో పాఠశాలల చదువు చదివాడు. 1949 లో హైదరాబాద్ చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ., ఎం.ఏ. పూర్తి చేసి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో "ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు" అనే అంశంపై పరిశోధించి డాక్టరేట్ పొందాడు.

నిజాం కళాశాలలో తెలుగు లెక్చరరుగా చేరాడు. 1963 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో రీడరుగా, ఆచార్యుడుగా పనిచేశాడు. అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక తెలుగు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షుడుగా, ప్రభుత్వ సాంస్కృతిక భాషా వ్యవహారాల సలహాదారు/గా ఎన్నో పదవులు అధిష్ఠించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షునిగా, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి అధ్యక్షునిగా, రాజ్యసభ సభ్యునిగా పనిచేశాడు. తెలుగు కవులలో మొట్టమొదటిసారి రాజ్యసభకు సభ్యుడైన గౌరవాన్ని పొందిన వ్యక్తి సినారె.

1988 లో ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారం పొందిన రెండవ కవి సి. నారాయణరెడ్డి. 1992 లో భారత ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది. సోవియట్‌లాండ్ నెహ్రూ అవార్డు, కుమారన్ ఆశాన్ అవార్డు, భారతీయ భాషా పరిషత్తు (కలకత్తా) 'బిల్వారా' అవార్డు, రాజా-లక్ష్మీ ఫౌండేషన్ను పురస్కారం, న్యూఢిల్లీ వారి 'Harmony Award' మొదలైన ఎన్నో పురస్కారాలు పొందాడు. 'మంటలూ - మానవుడూ' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. వివిధ సంస్థలు ఎన్నో బిరుదులు ఇచ్చినా ప్రజల, పాఠకుల హృదయాల్లో 'సినారె' అనేదే బిరుదుగా మిగిలిపోయింది.

సినీ గీతరచయితగా ఎన్నో సినిమాలకు అద్భుతమైన పాటలనందించాడు సి. నారాయణ రెడ్డి.

ఆధునికాంధ్ర కవిత్వంలో విలక్షణమైన, విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న ప్రతిభా సంపన్నుడు సినారె. దాదాపు ౫ దశాబ్దాలకు పైగా అవిశ్రాంతంగా కవితా జైత్రయాత్ర కొనసాగిస్తున్న నిత్య సాహిత్య కృషీవలుడు సినారె. ఈయన రచించిన కావ్యసంపుటి 'జలపాతం' 1953 అక్టోబరులో వెలువడింది. ఎం.ఏ. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆంధ్ర రాష్ట్రావతరణంతో పులకరించి, కవితలల్లిన సినారె కావ్య జలపాతం ఒక సజీవ చైతన్య స్రవంతి. ఒక నిరంతర నిర్విరామ కావ్య జలధార.

సినారె కావ్యాలన్నింటిలో అంతర్లీనంగా ప్రవహించే తాత్విక దృక్పథం మానవతావాదం. ఎన్ని ఇతివృత్తాలు, ఇతని కలంనుంచి కావ్యాలుగా జాలువారినా, ఎన్ని వృత్తాలు, ఛందస్సులు, లయలు కావ్య నిర్మాణ శిల్పాన్ని మలచినా అంతిమంగా ఈ కవి అన్వేషణకు మూలధాతువు - మనిషి. ఇతని కవిత్వానికి కేంద్రబిందువు - మానవత.

నారాయణరెడ్డి 1952 నుంచి నేటి దాకా నిరంతరం రచనలు చేస్తూనే ఉన్నాడు. ఇప్పటికి దాదాపు 60 కి పైగా రచనలు చేశాడు.

రచనలు : నవ్వనిపువ్వు, అజంతా సుందరి (గేయనాటికల సంపుటి), నాగార్జున సాగరం, కర్పూర వసంత రాయలు, జాతిరత్నం, విశ్వనాథ నాయకుడు, ఋతుచక్రం (గేయకావ్యాలు), జలపాతం, దివ్వెలమువ్వలు (ఖండ కావ్యాలు), రామప్ప, తరతరాల వెలుగు (గేయ రూపకాలు), అక్షరాల గవాక్షాలు, మధ్య తరగతి మందహాసం, మంటలకూ - మానవుడూ, ఉదయం నా హృదయం, మార్పు నా తీర్పు, ఇంటిపేరు చైతన్యం, రెక్కలు, నడక నా తల్లి, కాలం అంచుమీద, కవిత నా చిరునామా, నిరంతరం ఆరోహణ, దృక్పథం, కలం సాక్షిగా (కవితా సంపుటాలు), విశ్వంభర (సమగ్ర వచనకావ్యం), భూమిక, మట్టీ మనిషీ ఆకాశం (దీర్ఘ కావ్యాలు), సమదర్శనం ( ముక్తకకావ్యం), ప్రపంచపదులు (విశిష్ట కావ్యం), తెలుగుగజళ్ళు, వ్యాస వాహిని, సమీక్షణం, మా వూరు మాట్లాడింది (వ్యాస సంపుటాలు), మీరాబాయి, శిఖరాలు - లోయలు (అనుసృజనాలు), ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోజనములు (సిద్ధాంత గ్రంథం) "ముచ్చటగా మూడు వారాలు మలేషియాలో తెలుగు వాణి," "సోవియట్ రష్యాలో పదిరోజులు," "పాశ్చాత్యదేశాల్లో 50 రోజులు" (యాత్ర సాహిత్యం), పగలే వెన్నెల (చలనచిత్ర గీతసంకలనం), 'పాటలో ఏముంది - నా మాటలో ఏముంది' (సినిమా పాటల విశ్లేషణ) - సినారె ఛలోక్తులు.

## 2. పాఠ్యభాగ సందర్భం :

ఐదు ఆశ్వాసాల చారిత్రక గేయకావ్యం 'కర్పూర వసంతరాయలు' ఈ కావ్యం మల్లంపల్లి సోమ శేఖరశర్మకు అంకితం.

కొండవీటి రెడ్డిరాజు కుమారగిరిరెడ్డి లలిత కళాప్రియుడు. ఇతనికే కర్పూర వసంతరాయలు అనే బిరుదు వుంది. ఇతను చైత్రశుద్ధ దశమిరోజు లకుమ చేసిన నాట్యానికి ముగ్ధుడు కావడం మొదటి ఆశ్వాస కథ. రెండవ ఆశ్వాసంలో లకుమను రాజనర్తకిగా ప్రకటిస్తాడు. మూడవ ఆశ్వాసంలో వసంతరాయలు లకుమతో వివిధ క్షేత్రాల్ని దర్శిస్తాడు. నాల్గవ ఆశ్వాసంలో లకుమ రాజు సరసన ఉండడం చూసి మహారాణికి వేదన కలగడం, లకుమను రాజు తన సర్వస్వంగా భావించడం, రాజు 'వసంతరాజీయమనే' నాట్యశాస్త్రాన్ని రాసి లకుమకు అర్పించడం, వసంతరాయలు భార్య మంచంపట్టడం, రాజును సభకు రమ్మని కాటయవేముడు ప్రార్థించడం, రాజు అయిష్టంగా అంగీకరించడం మొదలైన విశేషాలున్నాయి.

చివరిదైన పంచమాశ్వాసంలో రాజు కొలువు తీరినపుడు లకుమ కాలు బెణికిందనే వార్తవిని రాజు సభను వీడి వెళతాడు. రాజదర్శనం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఆశ్చర్యపోతారు. రాజు లకుమ వద్దన్నా వినకుండా ఆమెకు సేవచేస్తాడు. ఈ వార్త తెలిసిన మహారాణి దుఃఖంతో కాటయవేముని వేడుకుంటుంది. రాణిని ఓదార్చడానికి రాజును రమ్మంటాడు కాటయవేముడు. లకుమ వెళ్ళమన్నా వినకుండా ఆమెవద్దనే ఉంటాడు రాజు. ఆ విషయం విన్న మహారాణి మనస్థితిని వర్ణించడంతో ప్రస్తుత పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.

## 3. పాఠ్యభాగ సారాంశం

రాజ్యాన్ని, ప్రజలను పట్టించుకోకుండా లకుమనే తన సర్వస్వంగా భావిస్తాడు రాజు. రాణి లకుమ పాదాల ముందు మోకరిల్లి విషయాన్ని వివరించి దేశం గొప్పదో, వ్యక్తి గొప్పో నువ్వే తేల్చుకో చెల్లీ అంటుంది. లకుమ పరిస్థితిని గ్రహిస్తుంది. కానీ తనే సర్వస్వంగా

బతుకుతున్న రాజును విడిచి వెళ్ళిపోతే పిచ్చివాడవుతాడేమో అనుకుంటుంది. ఒకరోజు వింతగా అలంకరించుకొని, తానే శివుడినని నాట్యం చేస్తూ బాకుతో గుండెల్లో పొడుచుకొని ప్రాణాలు విడుస్తుంది లకుమ. ఆ బాకు పిడిచుట్టూ ఆమె రాసి ఉంచిన ఉత్తరం చదివి రాజులో పరివర్తన వస్తుంది. వ్యక్తి కన్నా వ్యవస్థే మిన్న అని నిరూపించిన కథ లకుమ త్యాగం.

## 4. కఠిన పదాలకు అర్థాలు :

| | | |
|---|---|---|
| మేను | = | శరీరం |
| రగులు | = | కాలిపోవు |
| పసిడి | = | బంగారు |
| సలాక | = | శలాక, కడ్డీ |
| నిర్వాతము | = | గాలి తాకిడి లేనిది |
| గడియ | = | ఇరవైనాలుగు నిమిషాల కాలం |
| జాము | = | ఏడున్నర గడియలకాలం (24×7 $\frac{1}{2}$= 180 నిముషాలు లేదా 3 గంటలు) |
| సాంతము (స+అంతము) | = | పూర్తిగా (అంతంతో కూడినది) |
| కప్రము | = | కర్పూరం |
| ఆయమ [ఆ + అమ (అమ్మ)] | = | ఆమె |
| రేఖామాత్ర మార్గము | = | సన్నని గీత అంతటి దారి (ఆలోచన) |
| ఉద్భ్రాంత పథికునికి (ఉత్+భ్రాంత) | = | మానసికాందోళనకు గురి అయిన తెరువరికి |
| అనుగు | = | ప్రియమైన, ఇష్టమైన |
| కేళి | = | ప్రియునితో విహారంలోని నాయిక యొక్క క్రీడ, ఆట |
| సౌధరత్న ప్రాంగణము | = | రాజగృహం యొక్క రత్నాల ముంగిలి |
| అల్లన | = | మెల్లగా |
| అద్దరాతిర | = | అర్ధరాత్రి |
| అబ్బురంపడు (అబ్బుర+పడు) | = | ఆశ్చర్యపడు |
| పరిష్వంగము | = | కౌగిలింత |
| నామము | = | పేరు |
| మూర్ధము | = | తల |
| చరణాగ్రముల యందు (చరణ+అగ్రముల+అందు) | = | పాదాల కొనల (వేళ్ళ) లో |
| వినమ్రము | = | పూర్తిగా వాలినది |
| చకితము | = | భయం |
| మస్తకము | = | తల |
| రాజ్ఞి | = | రాణి |
| ఊను | = | ఉంచు, పెట్టు |

| | | |
|---|---|---|
| అశ్రువులు | = | కన్నీరు |
| పయ్యంట | = | పైట |
| గమించు | = | నడుచు |
| భాష్ప | = | కన్నీటితో |
| నిరుద్ధము | = | నిరోధించబడినది, అడ్డగించబడినది |
| తృణమ్మటు (తృణమ్ము+అటు) | = | గడ్డిపోచ మాదిరిగా |
| ఎయ్యది [ఏ+అది - ఏ+యది] | = | ఏది |
| భూపతి | = | రాజు |
| అవశ్యము | = | తప్పనిసరి |
| అస్రములు | = | కన్నీళ్ళు |
| కొలకులు | = | అంచులు |
| పర్యంకము | = | పడక |
| అగ్నినగము | = | అగ్నిపర్వతం |
| పెఠిల్లు | = | విరగడంలోని ధ్వన్యనుకరణ శబ్దం |
| వాదర | = | పదును |
| అత్యగ్రము (అతి+అగ్రము) | = | మిక్కిలి ఎక్కువ |
| ఊహాపోహలు (ఊహ + అపోహలు) | = | ఆలోచనలు, సందేహాలు |
| పుండువడ్డ (పుండు+పడ్డ) | = | పుండైన, గాయమైన |
| హాలాహలమ్ము | = | విషం |
| పానమ్ముసేయు (పానమ్ము+చేయు) | = | తాగు |
| ఫణి ఫణమ్ము | = | పాముపడగ |
| కేలుసాచు (కేలు+చాచు) | = | చేయిచాచడం |
| అపర | = | ఇతర |
| బెంబేలువడు (బెంబేలు+పడు) | = | దిగులుపడు |
| సానిదానికి | = | వేశ్యకు |
| ఈ విధిని | = | ఈ విధంగా |
| ఇరులు | = | చీకట్లు |
| కురులు | = | వెంట్రుకలు |
| విరిసెను | = | విస్తరించెను |
| సంకల్పము | = | నిశ్చయం, కోరిక |
| చండిక | = | పార్వతీదేవి వలె |
| భయదము | = | భయాన్ని కలిగించే |
| సాఠించు | = | ప్రకాశించు |

| | | |
|---|---|---|
| నిర్వేణి (నిర్+వేణి) | = | కదలిక లేకుండా |
| కోపితగ్లాని | = | కోపంచేత కలిగిన వణుకుతో |
| రూపించు | = | కనిపించు |
| అలికము | = | నుదురు |
| సింధూర తిలకము | = | ఎరుపు రంగులోని బొట్టు |
| కాకోల కంఠము | = | భయంకరమైన విషం |
| అభినయమ్ము | = | నటన |
| ఆగామి | = | భవిష్యత్తు |
| నిజ | = | తనదైన |
| ఉరఃపీఠి | = | రొమ్ము అనే పీఠం |
| వినీల | = | నల్లని |
| ప్రణయోన్మాదిని (ప్రణయ+ఉన్మాదిని) | = | ప్రేమ అనే పిచ్చిపట్టిన స్త్రీ |
| అపూర్వము (పూర్వంలేనిది) | = | అంతకుముందు లేనిది, కొత్తది. |
| అసుర సంధ్య | = | సాయం సంధ్య |
| రక్తాంబరము | = | ఎఱ్ఱటి చీర |
| మదవతీ | = | స్త్రీ |
| శివాలాస్యము | = | పార్వతి నాట్యం |
| సుమనోంతరాళం (సుమనస్+అంతరాళం) | = | మనస్సనే పుష్పం |
| కోకనదము | = | నీటిలో పుట్టిన పుష్పాలు (కలువ పూలు) |
| మృడుడు | = | శివుడు |
| ఆకృతి | = | ఆకారం |
| తోచు | = | కనిపించు |
| ఒడలు | = | శరీరం |
| పటహ | = | డప్పు |
| బంభాది (బంభ+ఆది) | = | ఢమఢమ అనే |
| ఝంఝూ నిలము | = | ప్రళయ కాలంలోని గాలి |
| అబ్ధి | = | సముద్రం |
| వీచులు (వీచి+లు) | = | గాలులు |
| చెందిర | = | కుంకుమ, సింధూరం |
| శోణితము | = | ఎఱ్ఱని |
| చిత్తాబ్జము (చిత్త+అప్+జము) | = | మనసనే పద్మం. |

| | | |
|---|---|---|
| పరికంపితము | = | మిక్కిలి చలించినది |
| మేఖల | = | ఒడ్డాణం |
| చకితుడు | = | ఆశ్చర్యం చెందినవాడు |
| పిడి బాకు | = | పిడి కలిగిన కత్తి |
| వదనము | = | ముఖం |
| గ్రస్తము | = | ఆక్రమించిన, కబళించిన |
| బింబాంతస్థ (బింబ+అంత+అస్థ) | = | ముఖం వలె |
| చరమకళ | = | ఆఖరి దశ |
| సాధ్వి | = | పతివ్రత |
| కరాంభోరుహము (కర+అంభస్+రుహం) | = | చేయి అనే పద్మం |
| కుహరము | = | గుహ, గోయి |
| ఛురిక | = | కత్తి |
| రక్తసిక్తాక్షరములు (రక్తసిక్త+అక్షరములు) | = | రక్తంతో తడిసిన అక్షరాలు |
| విస్మయము | = | ఆశ్చర్యం |
| శిబి | = | శిబి చక్రవర్తి |
| దధీచి | = | దధీచ మహర్షి |
| తనువు | = | శరీరం |
| లజ్జాపిహితము | = | సిగ్గుతో కూడినది |
| స్వర్ణాసనము (స్వర్ణ+ఆసనం) | = | బంగారు గద్దె |
| వ్యష్టి (వి+అష్టి) | = | వ్యక్తి, ఒక్కడు |
| గరిష్ఠము | = | అధికం, మిన్న, ఎక్కువ |
| వాపోవుట | = | ఏడ్చుట |
| జనమహాంభోధి | = | జనమనే మహాసముద్రం |
| అందెల | = | గజ్జెల |
| ఝణత్కారము | = | ధ్వని, చప్పుడు |
| శిశిరము | = | ఆకు రాలే కాలం |
| పాదుకొను | = | వేళ్ళూను, ఉండు |
| సౌరభము | = | సువాసన |

**5. సందర్భ సహిత వ్యాఖ్యలు :**

1. దేశ సౌఖ్యము కొరకు క్రమము
   తీరుగా జ్వలియించె నాయమ.

**పరిచయం :** పై కవితా పంక్తులు డాక్టర్ సి. నారాయణరెడ్డి రచించిన 'కర్పూర వసంతరాయలు' కావ్యంలోని పంచమాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'లకుమ త్యాగం' అనే పాఠ్యభాగం లోనివి.

సందర్భ : 'లకుమ' అనే నాట్యకత్తెను (ఆస్థాన నర్తకిని) తన సర్వస్వంగా భావించిన రాజు కుమార గిరిరెడ్డి తన రాజ్యాన్ని, రాణిని నిర్లక్ష్యం చేస్తాడు. అందుకు ప్రజలు, మహా రాణి మధన పడతారు. ఆ సందర్భంలో కూడా ఆమె దేశ సౌఖ్యాన్ని కాంక్షిస్తుందని కవి చెబుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** మహారాణి మనసు, శరీరం కూడా నిప్పులా కాలుతుంది. ఎన్నో ఊహలు ఆమెపై దాడి చేశాయి. అయినా ఆమె చలించకుండా దేశ క్షేమాన్ని గురించి, తీవ్రంగా ఆలోచిస్తూ కర్పూరం తీరుగా కరిగిపోయింది. ప్రజల శ్రేయస్సు ఆమెకు ముఖ్యం.

2. పాలముంతువా, నీట ముంతువా

బాధ్యతను గమనించి తల్లీ !

**పరిచయం :** పై కవితా పంక్తులు సి. నారాయణ రెడ్డి రచించిన "కర్పూర వసంతరాయలు" కావ్యంలోని పంచమాశ్వాసం నుంచి గ్రహించబడిన 'లకుమ త్యాగం' అనే పాఠ్యభాగంలోనివి.

**సందర్భం :** రాజనర్తకి అయిన లకుమ దగ్గరే రాజు కాలాన్ని గడపడం చూసిన మహారాణికి మంచి ఆలోచన రాగా, ఆమె వెంటనే రాజు కేళీ సౌధం దగ్గరకు వెళ్ళి తలుపు తడుతుంది. లకుమ తలుపు తీసి పేరు అడగగా రాణి తన పేరు చెప్పి లకుమ కాళ్ళపై పడుతుంది. లకుమ వెంటనే ఆమెను లేపి 'ఎంత పాపం చేశావు మహారాణీ!' అంటూ లకుమ రాణి కాళ్ళపైబడి విలపిస్తుంది. రాణి లకుమను లేపి తన చెంగుతో ఆమె కన్నీరు తుడిచి లకుమకు రాజ్యం సంగతి వివరిస్తుంది. రాజును కర్తవ్యోన్ముఖుని చేయమంటుంది. లకుమ దానికోసం తన ప్రాణాన్ని పణంగానైనా పెడతానంటుంది. ఆ సందర్భంలో రాణి వెళ్ళిపోతూ అన్న మాటలివి.

**వివరణ :** "చెల్లీ ! నీ మీద ఒక పెద్ద భారాన్ని ఉంచాను పాలముంచుతావో, నీటముంచుతావో నీ ఇష్టం. బాధ్యతను గమనించి మసలుకో" అంది రాణి.... అంటే మంచైనా, చెడైనా ప్రస్తుతం నీ చేతిలో ఉంది. రాజ్యానికి మంచి చేస్తావో, కీడు కలిగిస్తావో, అంతా నీ ఇష్టం అని అర్థం.

**విశేషాంశం :** 'పాలముంతువో, నీటముంతువో' అనేది ఒక పలుకుబడి. ఈ పలుకుబడిని ముత్యాలసరం ఛందస్సులో ఒప్పుకున్నట్లుగా రచించాడు. సి. నారాయణ రెడ్డి.

3. వ్యక్తి సంఘములందు ఎయ్యది

ప్రథమ గణ్యమొ చెప్పవమ్మా !

**పరిచయం :** ఈ వాక్యాలు సి. నారాయణరెడ్డి రచించిన 'కర్పూర వసంతరాయలు' కావ్యంలోని పంచమాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'లకుమ త్యాగం' అనే పాఠ్యభాగం లోనివి.

**సందర్భం :** రాజ్యాన్ని కాపాడుకోటానికి తన ప్రాణాలైనా అర్పిస్తాసన్న లకుమతో రాణి చెల్లీ ! నీ మీద ఒక పెద్ద భారాన్ని మోపుతున్నాను. మంచి చేస్తావో, చెడు చేస్తావో, నీ ఇష్టం. నీ మీద రాయలు మనసు పడినందుకు నాకు బాధ లేదు. కాని దేశాన్ని తృణప్రాయంగా భావించడాన్ని సహించలేకపోతున్నాను అంటూ రాజ్యశ్రేయస్సు కోసం తాను చెప్పినట్లు ,చెయ్యమని లకుమను వేడుకుంటున్న సందర్భంలోనివి ఈ వాక్యాలు.

**వివరణ :** రాజుకు దేశం ఒకవైపు, నీవు మరోవైపు, ఉన్నారు. కానీ రాజు నీవైపు తిరుగుతున్నాడు. తేల్చుకో ఎవరు గొప్పో. వ్యక్తి, సంఘం ఈ రెండింటిలో దేనికి ప్రథమ స్థానం ఇవ్వాలో నువ్వే నిశ్చయించుకో అంది రాణి.

విశేషాంశం: ఇక్కడ స్వార్థత్యాగాన్ని గురించి పాఠకులకు చెప్పాడు కవి. వ్యక్తి, సంఘాలలో సంఘానికి ప్రథమస్థానముందని, అలాంటి సంఘం కోసం ప్రతివ్యక్తికి స్వార్థం లేకుండా త్యాగం చేయగలిగిన మనసు ఉండాలని కవి ఆకాంక్షించాడు.

4. ఎందుకీ హృదయమ్ము నిచ్చితి
   ఈశ్వరా ! ఈ సాని దానికి?

పరిచయం : ఈ వాక్యాలు డాక్టర్ సినారె రచించిన 'కర్పూర వసంతరాయలు' పంచమాశ్వాసం నుంచి గ్రహించబడిన 'లకుమత్యాగం' అనే పాఠ్యభాగంలోనివి.

సందర్భం : రాణి లకుమ చేయవలసిన కర్తవ్యాన్ని ఉపదేశించి వెళ్ళాక లకుమ తలుపులు మూసి పడుకొని ఆలోచిస్తుంటుంది. తనను ప్రాణంకన్నా మిన్నగా, ఇష్ట దైవంగా ఎంచి మనసులో గౌరవ, ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు రాజు. అలాంటి రాజును వదిలి వెళ్తే పిచ్చివాడిగా మారతాడు. నేను రాయని విడిచిన మరు నిముషం అతనికి లోకం నరకకూపమవుతుంది. మహారాణిని, రాజ్యాన్ని నాకోసం అవతలికి తోసేసిన ప్రభువును వదిలి వెళ్ళడానికి నాకు మనసు రావడంలేదు. కాని రాణికి ఇచ్చిన మాటను ఎలా నిలుపుకోవాలి, ఎలా రాయని విడిచివెళ్ళాలి అని లకుమ అనుకుంటున్న సందర్భంలోనివి ఈ వాక్యాలు.

వివరణ : "రాణికి ఇచ్చిన వాగ్దానం తీర్చడమెలా? రాజును విడిచి ఎలా వెళ్ళడం? ఈశ్వరా! ఈ సానిదానికి ఎందుకయ్యా ఇలాంటి మెత్తని మనసును ఇచ్చావు" అని తనకు ఇంతటి నిస్సహాయ స్థితిని కల్పించిన దేవుని నిందిస్తుంది లకుమ.

5. మన బ్రతుకులో నేడపూర్వమైన దినమురా

పరిచయం : ఈ వాక్యం డా॥ సినారె రచించిన 'కర్పూర వసంతరాయలు' ప్రథమాశ్వాసం నుంచి గ్రహించిన 'లకుమ త్యాగం' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : ఆత్మత్యాగానికి సిద్ధపడిన లకుమ ఒకరోజు జుట్టు విరబోసుకొని, తలపై ఒక పూలచెండు ఉంచుకొని నేనే శివుడినని, నుదుట బొట్టు పెట్టుకొని, ఇదిగో అగ్ని నేత్రమని, గొంతుమీద కస్తూరి రేఖ దిద్ది ఇదిగో విషము అని, తన శరీరాన్ని రెండుగా విభజించినట్లు గీత గీసి ఈ వైపు అమృతం, ఆ వైపు విషం అంటూ వింతగా ప్రవర్తిస్తుంది. రాజు ఆమెనుచూసి ఆశ్చర్యంతో ఇదేమి నాటకం పిచ్చిదానా ! లకుమ అంటాడు. 'నిజమే మహారాజా ! నేను పిచ్చిదానినే' అంటుంది లకుమ. 'ఓసి ! ప్రణయోన్మాదినీ ! నేడు అపూర్వమైన అనుభూతిని ఇచ్చావు' అన్న రాజుతో లకుమ ఈ మాటలన్నది.

వివరణ : "నా మనస్సు దోచుకున్న దొరా ! నిజమే, మన బ్రతుకులో ఈ రోజు అపూర్వమైనది" అంది లకుమ. ఆ రోజు తాను ప్రాణ త్యాగం చేసుకోవడానికి సిద్ధపడింది. అందుకే ఆ రోజును ఆమె అపూర్వదినంగా కీర్తించింది.

విశేషాంశం : ఆ రోజు తన మరణంతో మహారాణి, ప్రజల కష్టాలు తీరబోతున్నాయి. రాజు కర్తవ్యాన్ని గుర్తిస్తాడు. ఇక కొండవీటి రాజ్యం సుఖసంతోషాలకు నిలయమవుతుందని అందుకే ఈ రోజు చాలా మంచిరోజని లకుమ రాజుతో అంది.

6. ఓ సఖీ ! యేమందువో నీవు? ఇంకేమి?
   వ్యష్టి కన్నను దేశ దృష్టియె గరిష్ఠమని

పరిచయం : ఈ కవితాపంక్తులు డాక్టర్ సి. నారాయణరెడ్డి రచించిన 'కర్పూర వసంతరాయలు' కావ్యంలోని పంచమాశ్వాసం నుంచి గ్రహించబడిన 'లకుమ త్యాగం' పాఠ్యభాగం లోనివి.

సందర్భం: రాజ్యం కోసం ప్రాణత్యాగం చేసిన తర్వాత పిడిబాకుకు కట్టిన ఆమె రాసిన ఉత్తరం చదివిన రాజుకు దుఃఖంతో పాటు ఆశ్చర్యం కలుగుతుంది, ఆమె చేసిన త్యాగానికి. అప్పుడు రాజు "శిబిదధీచులను మించిన త్యాగం నీది" అని అనుకుంటున్న సందర్భంలోనివి ఈ వాక్యాలు. శిబి చక్రవర్తి తన తొడ భాగాన్ని, దధీ మహర్షి తన ఎముకను మాత్రమే పరులకు త్యాగం చేస్తే, లకుమ తన ప్రాణాన్నే త్యాగం చేసింది.

వివరణ : ఓ లకుమ ! ఎక్కడ ఉన్నావు. ఇంకెక్కడ ఉంటావు. పరమసాధ్వి అనే బంగారు సింహాసనంపైన ఉంటావు. ఓ సఖీ ! నీవు వ్యక్తి కన్నా దేశమే మిన్న అంటున్నావు అన్నాడు. ఒక వ్యక్తికి గౌరవమివ్వడం కన్నా దేశాన్ని సుభిక్షంగా పరిపాలించడమే రాజు కర్తవ్యం అని లకుమ త్యాగాన్ని బట్టి అర్థమవుతుంది.

**విశేషాంశం** : వ్యక్తి కన్నా దేశదృష్టే గొప్పదని సి. నారాయణరెడ్డి ఈ కావ్యం ద్వారా సందేశమిచ్చాడు. దేశంకోసం స్వార్థరహితంగా త్యాగం చేయడానికి దేశంలోని ప్రజలంతా సిద్ధమవ్వాలనే సందేశం ఉంది ఈ కావ్యంలో.

## 6. ప్రశ్నలు - సమాధానాలు

**1. లకుమ త్యాగం పాఠ్యభాగం ఆధారంగా నారాయణ రెడ్డి గేయకవితా వైశిష్ట్యాన్ని పరామర్శించండి.**

తెలుగు సాహితీ సామ్రాజ్యాన్ని చాలాకాలం పద్యమే యేలింది. సి.నా.రె లాంటి ఆధునిక కవులు కూడా మొదట తమ కవిత్వాన్ని పద్యాలలోనే వెలువరించారు. ఆధునికేతివృత్తానికి పద్యం కన్నా గేయమే బాగా నప్పుతుందని కవులు ఆ తర్వాత గేయకవిత్వం రాయడం మొదలుపెట్టారు. నారాయణరెడ్డి పద్యగేయ రచనలలో సవ్యసాచి. ఆయన గేయాలలో నాటికలను కూడా రచించాడు. ఆయన పద్యకవి కన్నా గేయకవిగానే తెలుగువాళ్ళకు సుపరిచితుడు. 'ఈ కావ్యాన్ని నేను చిరకాలం నుండి అనుసరిస్తున్న మాత్రా ఛందస్సులోనే వ్రాసినాను' అని ఆయనే చెప్పుకున్నాడు.

కావ్యం గురించి విచారించేటపుడు ప్రధానంగా రెండు విషయాలే దృష్టిలో వుంటాయి. ఒకటి ఏం చెప్పారన్నది. రెండవది ఎలా చెప్పారన్నది. ఏం చెప్పారన్నది ఇతివృత్తానికి సంబంధించిన వ్యవహారం. ఎలా చెప్పారన్నది ఆ రచయిత శైలికి సంబంధించినది. ఇందులో ఛందస్సు ప్రాధాన్యాన్ని వహిస్తుంది.

ఛందస్సు గురించి మహాకవి శ్రీశ్రీ ఇలా అంటాడు "ఛందస్సు గుర్రం వంటిది. గుర్రం ఎటు తీసుకుపోతే అటల్లా వెళ్ళిపోయేవాడు అశ్వికుడు కానట్లే ఛందస్సు లాగుకుపోయినట్లు వ్రాసేవాడు సంవిధానజ్ఞుడు కాడు. మరి ఆ ఛందస్సును లొంగించుకొని దానిచేత చిత్ర విచిత్ర రీతులలో కదం త్రొక్కించిన వారినే ప్రశంసిస్తాము" అని. (మన గురజాడ - శ్రీశ్రీ పుట. 22)

ఈ పాఠ్యాంశంలో సినారె ప్రయోగించిన ఛందో వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని గూర్చి పరామర్శిద్దాం.

ఆధునిక ఛందస్సంతా ప్రధానంగా నాలుగు విధాలే. అవి - త్రిశ, చతురస్ర, మిశ్ర, ఖండగతులు. ఇవి వరుసగా స్థూలంగా పాదానికి 12, 16, 14, 20 మాత్రల్ని కలిగి వుంటాయి.

ఈ పాఠ్యభాగంలో కవి ఎక్కువగా మిశ్రగతినే వాడుకున్నాడు. (మిశ్రగతికే ఇంకొక పేరు ముత్యాలసరం)

ఈ పాఠ్యభాగం ముత్యాలసరంతోనే ఆరంభమైంది.

| | | | |
|---|---|---|---|
| 2 1 | 2 1 1 | 2 1 | 2 1 1 |
| రాణి | మేనుత | పించె | నిప్పున |
| 1 1 1 | 1 1 1 | 1 2 1 | 2 1 1 |
| రగులు | పసిడి | సలాక | పోలిక |
| 2 1 | 2 1 1 | 2 1 | 1 1 1 |
| రాణి | ఆత్మవె | లింగె | నొకని |
| 2 1 | 2 2 | 2 1 | 2 1 1 |
| ర్వాత | దీప | జ్యోతి | పోలిక |

ముత్యాల సరం లక్షణం 3+4+3+4 మాత్రలతో నడవడం. ప్రతి పాదానికి 14 మాత్రలు వుంటాయి. పై ఉదాహరణలో ఒకటి రెండు పాదాల తొలి అక్షరాలకు యతి (రా.ర) అలాగే మూడు నాలుగు పాదాల తొలి అక్షరాలకు (రా-ర్వాలోని'రా'కు) కూడా యతి. రెండు నాలుగు పాదాలకు అంత్యప్రాస కూర్చబడింది (పోలిక, పోలిక లతో)

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 2 1 | 2 2 | 1 1 1 | 2 1 1 | 2 1 | 2 1 1 | 2 1 | 2 1 1 |
| ఆమె | విచ్చుం | గనుల | రెప్పలు | ఎన్నో | ఊహలు | దాడి | చేసెను |
| 1 1 1 | 2 2 | 2 1 | 2 1 1 | 2 1 | 1 1 1 1 | | |
| తుదకు | రేఖా | మాత్ర | మార్గము | రాత్రి | సగముగ | | |
| 2 1 | 2 1 1 | 1 1 1 | 2 2 | 2 1 | 2 2 | 2 1 | 2 1 1 |
| చీలి | పోయెను | ప్రభుని | కేళీ | సౌధ | రత్న | ప్రాంగ | ణమ్మున |

మొదలైనవన్నీ ఈ గతిలో నడిచేవే. ఇలా ఏకబిగిన 28 ముత్యాల సరాలు కూర్చబడ్డాయి. చివరకి

| | | |
|---|---|---|
| 2 1 | 2 1 1 | 2 1 |
| పాల | ముంతువా | నీట |

| |
|---|
| 2 1 1 |
| ముంతవా |

అనే నానుడి కూడా ముత్యాలసరంలోకి ఒదిగి పోయింది. ఊహాపోహాలు లాంటి పదబంధం కూడా ఊహాపోహాలుగా రూపాన్ని సవరించుకోక తప్పలేదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 2 2 1 | 1 1 1 | 2 1 | 1 2 2 | 1 1 | 2 1 |
| ఆనాడు | లకుమ | రమ్య | శరీర | మున | చండి |

| | | | |
|---|---|---|---|
| 2 1 1 1 | 2 2 1 | 2 1 1 1 | 2 2 1 |
| కాభయద | సౌందర్య | కాంతులుపి | పాళాంచె |

ఇది ఖండగతి. ఒకటి మూడు గణాల తొలి అక్షరాలకు యతి. ఇక్కడ మొదలైన ఖండగతి

| | | | |
|---|---|---|---|
| 212 | 1121 | 1121 | 1121 |
| ఒక్కమా | టుగ నామె | ఒడిలోన | చెయివేసే |

| | | | |
|---|---|---|---|
| 11111 | 2111 | 1112 | 1121 |
| నృపుని కను | లొందక మె | రుపు తళు | క్కున దూసె |

అనే వరకు సాగింది.

| | | | |
|---|---|---|---|
| 11111 | 11111 | 1112 | 21 |
| మరునిముస | మున లకుమ | ధరణిపై | గూలె |

| | | | |
|---|---|---|---|
| 1112 | 212 | 1121 | 21 |
| చకితుడై | రాజు ముం | దుకు దూకి | వ్రాలె |

ప్రతి పాదంలోని మొదట మూడు గణాలు పంచమాత్రా గణాలతో కూడిన ద్విపదగా తయారయింది. రెండు పాదాల్లోనూ ప్రాసయతి చోటు చేసుకుంది. రెండు పాదాలకు అంత్యప్రాస పాటించబడింది (కూలె, వ్రాలె)

అన్ని గతుల్లో లాగే ఖండగతిలో కూడా నాలుగు గణాలుండడం పరిపాటి. అయితే కొన్నిచోట్ల ఖండగతి ముచ్చటగా మూడు గణాలతోనే ముగిసింది.

ఉదాహరణకు :

| | | | |
|---|---|---|---|
| 112 | 1112 | 11 | 111 |
| ప్రభువామె | తలను చే | తుల | నిలిపె |

| | | |
|---|---|---|
| 1121 | 1121 | 11111 |
| లకుమాయ | నుచు బిగ్గ | రగ పిలిచె |

| | | |
|---|---|---|
| 11111 | 11 21 | 1121 |
| లకుమ బరు | వగు రెప్ప | లను విప్ప |

| | | |
|---|---|---|
| 2111 | 212 | 11 21 |
| రాయనికి | పోవు ప్రా | ణము వచ్చె |

ఇది కవి బుద్ధిపూర్వకంగా చేసిన మార్పు. 'ఒకే రకమైన గతిలో కొన్నిచోట్ల మాత్రలను పెంచినాను. కొన్నిచోట్ల తగ్గించినాను. వెంటవెంటనే గతులను మారుస్తూ పోయినాను. ఛందోవైవిధ్యం, గతివైచిత్రి, పఠితలో నవనవోన్మేషమైన ఉల్లాసాన్ని కలిగిస్తాయనే అభిప్రాయంతో ఇట్లా చేసినాను' అని కవే కంఠోక్తిగా పీఠికలో చెప్పుకున్నాడు.

| | | | |
|---|---|---|---|
| 212 | 11 111 | 212 | 212 |
| పాల సం | ద్రపు తరగ | లీల ఉ | ప్పొంగి ఆ |

| | | | |
|---|---|---|---|
| 1121 | 2111 | 11111 | 2111 |
| మెను మాటి | మాటికిని | తనకనుల | కద్దుకొనె |

దగ్గరినుంచి పాఠ్యాంశం చివరిదాకా ఖండగతిలోనే నడిచింది.

కవి చెప్పదలచుకున్న విషయాన్ని పఠితలకు అందంగా అందించడానికి ఒక గతిలోంచి ఇంకొక గతిలోకి మార్చిన మార్పు, గతుల కుదింపు, హెచ్చింపు ఎంతగానో దోహదం చేస్తాయి.

**2. 'వ్యష్టికన్నా సమిష్టి మిన్న' - ఈ వాక్యాన్ని మీ పాఠ్యభాగం ఆధారంగా విశదీకరించండి.**

వ్యష్టి అంటే ఒక వ్యక్తికి పరిమితమైంది. వ్యక్తిగతమైంది. కాని సమిష్టి అంటే సమాజానికంతటికీ వర్తించేది అని అర్థం.

"ఒకటీ, రెండూ, మూడూ అవి విడివిడిగా వుంటే అంతే
ఒకటిగ కలిపి చూడు
అవి నూటా ఇరవై మూడు" అని సి. నారాయణరెడ్డి ఒక సందర్భంలో అన్నాడు.

"నీ, నా అంటే
నిమ్మకు నీరెత్తినట్టుండే పెదాలు
ఎంతబాగా పొంది పొసగుతాయో
ఏదీ ఒక్కసారి పలికి చూడు
మీ, మా అనే మాటలు" అన్నాడు ఇంకొక కవి.
ఇవన్నీ సమిష్టి యొక్క గొప్పతనాన్ని గురించి చెప్పేవే.

దేశం కోసం రాష్ట్రాన్ని, రాష్ట్రంకోసం మండలాన్ని, మండలంకోసం గ్రామాన్ని, గ్రామంకోసం ఇంటిని, ఇంటికోసం తనను త్యాగం చేయవలసి వుంటుందని ఒక సాదాసీదా మాట వుంది. అంటే వ్యక్తి తన స్వార్థంకంటే సమాజానికే విలువ ఇవ్వాలి. దీనికి స్వార్థత్యాగం ఎంతైనా అవసరం.

త్యాగం గురించి మనదేశంలో వేద కాలం నుంచి చెప్పబడుతూ ఉంది. "ఏకః స్వాదు న భుంజీత" అంటుంది వేదం. దాన్నే శ్రీనాధుడు అనువదించాడు. 'ఒకడు భుజియించు టెన్నడు ఒప్పదు' అని. "They alone live who live for others, the rest are more dead than alive" అని వివేకానందుడన్నాడు. 'ఏవాడు జీవింపనేకులు జీవింతురో వాని మనుగడయే మనుగడ' అన్నాడు చిన్నయసూరి. "సొంతలాభం కొంతమానుకు పొరుగువాడికి తోడుపడవోయ్" అని గురజాడ అప్పారావు, "స్వార్థమే అనర్థ కారణం అది చంపుకొనుటె క్షేమదాయకం' అని శ్రీశ్రీ కవిత్వీకరించారు. అందరూ అన్న అన్ని మాటలకూ అర్థం ఒక్కటే-స్వార్థం నశించాలని, త్యాగం వర్ధిల్లాలని.

కర్పూర వసంతరాయల బిరుదాంకితుడైన కుమార గిరిరెడ్డి ఆస్థాన నర్తకి లకుమ. ఆమె నాట్యానికి ఆకర్షితుడైన రాజు ఆమెను మోహించాడు. ఆమె వ్యామోహంలో పడిపోయిన కుమారగిరి తన పట్టపు రాణినీ, రాజ్యాన్నీ, ప్రజల్నీ పట్టించుకోవడం మానేశాడు. మహారాణి మంచం పట్టింది. ఆమె మనలో వుంటుందన్న ఆశ లేదనేదాకా వెళ్ళింది ఆమె ఆరోగ్యస్థితి. కాటయ వేముడు వచ్చి ప్రార్థించినా, లకుమ స్వయంగా చెప్పినా రాజులో చలనం లేదు. అతను ఉలకలేదు, పలకలేదు. రాణి శరీరం నిప్పులో సలసలకాగే బంగారు కడ్డీలాగా కాలింది. కళ్ళలో నీళ్ళు కారుతూ పగలంతా గడిచిపోయింది. ఎన్నెన్నో ఊహలు దండెత్తివచ్చినా ఆమె కొంచెమైనా చలించలేదు. దేశం కోసం ఆమె కర్పూరంలా వెలిగింది. చివరికి ఆమెకొక ఆలోచన వచ్చింది. రాజు ఉంటున్న కేళీ సౌధాన్ని చేరి, చెలికత్తెల్ని పక్కకు పంపి, తలుపు తట్టింది. రాజు నిద్రలో ఉన్నాడు. తలుపు తెరిచిన లకుమకు తలుపు తట్టింది మహారాణి అని తెలిసి అవాక్కయింది. నిశ్చేష్టురాలయింది. ఒళ్ళు జలదరించింది; ఆశ్చర్యపోయింది. రాణి తల లకుమ పాదాలమీద వాలింది. దిక్కుతోచక లకుమ దాగ్రాంతికిలోనై రాణి తలను పట్టుకొని చేతుల్తో పైకి లేవనెత్తింది. "మహారాణీ ! ఎంత పనిచేశారు?" అని రాణి పాదాలమీద తలపెట్టి వలవలా ఏడ్చింది. రాణి లకుమను లేవనెత్తి కన్నీళ్ళను కడకొంగుతో వొత్తింది. చివరికి తన ప్రాణాలైనా ఇవ్వడానికి లకుమ సంసిద్ధతను వ్యక్తంచేసి, రాణికి అభయం ఇచ్చింది. రాణి నాలుగడుగులు నడిచింది, లకుమ ఆమెను వెంబడించింది. రాణి గొంతులోంచి మాటల్ని లాగి "నీ మీద ఒక భారం మోపడానికి వచ్చానని నీవు పాలలో ముంచుతావో, నీటిలో ముంచుతావో నీ ఇష్టమని, రాయలు నిన్ను సర్వస్వంగా భావించి రాజ్యాన్ని పట్టించుకోవడం లేదని ప్రస్తుతం రాజుకు దేశం ఒకవైపు, నీవు ఒక వైపు ఉన్నారు. వ్యక్తి, సమాజం ఈ రెండింటిలో ఏది ముఖ్యమనది నువే ఆలోచించుకో అనీ

ఏ విధంగా చూసినా నువ్వు రాజును విడిచి ఉండడం మంచిదనీ" లకుమతో చెప్పి వెళ్ళిపోయింది. తలుపులు మూసి పక్కమీద వాలి ఆలోచించ సాగింది లకుమ. రాణి మాటలు పిడుగుల్లా అనిపించాయామెకు. పక్కనే రాజు నిద్ర మత్తులో ఉన్నాడు. ప్రాణంకన్నా ఎక్కువగా తనను ప్రేమిస్తున్న రాజును వదిలి వెళ్ళడానికి ఆమె మనసు అంగీకరించడంలేదు. కాని "రాణికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమెలా?" అని ఆమె మనసు ఆలోచనలో పడింది. తెల్లవారేసరికి ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది.

లకుమ ఆ రోజు వింతగా అలంకరించుకొంది. తలపై పూలమాల ధరించి తానే చంద్రశేఖరుడంది. నుదుటన సింధూరం దిద్దుకొని అగ్నినేత్రమంది. కంఠంపై కస్తూరి రేఖలు దిద్ది కాకోల కంఠమిదిగో అంది. ఆమె అలంకరణ చూసిన రాయలు "పిచ్చిదానా? ఏమిటీ వింత ప్రవర్తన ?" అన్నాడు. "అవును నేను పిచ్చిదాన్నే" అంది లకుమ. "ఈరోజు అపూర్వమైన అనుభూతి ఇచ్చావు" అన్న రాయలతో "అవును, ఈరోజు నిజంగా అపూర్వమైందే" అంటూ అతను వేసిన ప్రశ్నల్నే సమాధానాలుగా చెప్పింది. రాజుమీద పువ్వులు చల్లి నాట్యం చేయటం ప్రారంభించింది. ఆమె కళ్లు, శరీరం, మనసు ఎరుపెక్కాయి. ఆమె కాలి అందియలు చెదిరి పడ్డాయి. మొలనూలు తెగిపోయింది. ఒక్కసారిగా ఆమె ఒడిలో చెయ్యిపెట్టుకోగానే రాజు కళ్ళు మెరిశాయి. మరుక్షణంలో 'లకుమ' తూలి కిందపడింది. ఆమె ఎదలో పిడిబాకు మెరిసింది. 'లకుమా' అంటూ రాజు ఆమెను పిలిచాడు. కళ్ళు తెరిచి చూసింది లకుమ. రాజు ఆమె ఎదలోని బాకును బయటకు లాగడంతోనే ఆమె శాశ్వతంగా కన్నుమూసింది. బాకు పిడిచుట్టూ లకుమ రాసిన ఉత్తరం ఆమె రక్తంతో తడిసి పోయింది. ఆ ఉత్తరాన్ని చదివిన రాజు చలించిపోయాడు. 'వ్యక్తి కన్నా దేశదృష్టియే మిన్న' అని ఆత్మార్పణ చేసిన లకుమ సాహసాన్ని హృదయ పూర్వకంగా అభినందించాడు. ఆమె త్యాగాన్ని శిబి దధీచుల త్యాగం కన్నా మిన్నగా పేర్కొన్నాడు. అతనికి ప్రజలు, మహారాణి కన్పించారు. రాజ్యం కనులముందు సాక్షాత్కరించింది.

కర్తవ్యాన్ని విస్మరించి ఆస్థాననర్తకిని సర్వస్వంగా భావించిన రాజుకు అతని కర్తవ్యాన్ని గుర్తు చేయడానికి మహారాణి లకుమ దగ్గరికి వెళ్ళి ఆమె పాదాలకు నమస్కరిస్తుంది. ఒక మహారాణి దేశంకోసం అభిమానాన్ని త్యజించి, ఒక వేశ్య పాదాల మీద పడడం అనితరసాధ్యం; నభూతో నభవిష్యతి. ఇంత త్యాగాన్ని అవలీలగా చేసిన రాణి, తననే సర్వస్వంగా భావించిన రాజును కర్తవ్యోన్ముఖుని చేయడానికి తన ప్రాణాలను తృణ ప్రాయంగా త్యాగం చేసిన లకుమ ఈ కావ్యంలో స్వార్థ త్యాగానికి ప్రతీకలుగా నిలిచిన పాత్రలు.

"వ్యష్టి కన్న దేశదృష్టే మిన్న" - దేశానికి ఈ మహోదాత్తమైన సందేశాన్ని అందివ్వడానికే ఈ కావ్యాన్ని రచించాడు సి. నారాయణరెడ్డి.

**3. 'లకుమ త్యాగశీల' నిరూపించండి. లేదా లకుమ త్యాగ వృత్తాంతాన్ని వివరించండి.**

లకుమను సర్వస్వంగా భావించిన రాజు మహారాణి మంచం పట్టిందన్న వార్త విని ఓదార్చడానికి రాకపోయేసరికి రాణి దుఃఖించింది. ఆమె శరీరం నిప్పులో సలసలకాగే బంగారు కడ్డీలాగా కాలింది. కళ్లలో నీళ్ల కారుతూ పగలంతా గడిచిపోయింది. ఎన్నెన్నో ఊహలు దండెత్తినా ఆమె కొంచెం కూడా చలించలేదు. దేశ సుఖంకోసం ఆమె కర్పూరంలా వెలిగింది. చివరికి ఆమెకు ఒక ఆలోచన వచ్చింది. వెంటనే చెలికత్తెలు వెంటరాగా ఆమె రాజు కేళీ సౌధాన్ని చేరుకొని చెలికత్తెల్ని పక్కకుపంపి తలుపు తట్టింది. తలుపు తీసిన లకుమకు తలుపు తట్టింది మహారాణి అని తెలిసి నిశ్చేష్టురాలయింది. రాణి తన తలను లకుమ పాదాలపై వాల్చింది. దిగ్భ్రాంతికి లోనైన లకుమ రాణిని పైకిలేపి "మహారాణీ! ఎంత పని చేశారు !" అని రాణి పాదాలమీద తలపెట్టి ఏడ్చింది. రాణి లకుమను లేవనెత్తి కడకొంగుతో ఆమె కన్నీటిని తుడిచింది. చివరికి తన ప్రాణాలనైనా ఇవ్వడానికి లకుమ సంసిద్ధతను వ్యక్తం చేసింది. రాణి నాలుగడుగులు వేసింది. లకుమ ఆమెను అనుసరించింది. రాణి లకుమతో ఇలా అంది "నీ పైన ఒక పెద్ద భారాన్ని మోపడానికి వచ్చాను చెల్లీ ! పాలలో ముంచుతావో, నీటిలో ముంచుతావో నీ ఇష్టం. రాయలు నిన్ను తన ప్రాణం కన్నా ఎక్కువగా చూస్తున్నందుకు నాకు బాధలేదు. కాని రాజ్యాన్ని తృణప్రాయంగా కూలదోయడం సహించలేను. దేశం ఒకవైపు. నీవు ఒకవైపు ఏది ముఖ్యమో తేల్చుకో. వ్యక్తి, సంఘం ఈ రెంటిలో దేనికి ప్రథమ స్థానం ఇస్తావో చెప్పమ్మా ! ఆఖరిగా గుండె రాయి చేసుకొని ఒక మాట చెబుతాను విను. నీవు రాజును విడిచి వెళ్ళడం అవశ్యం" అని రాణి వెళ్ళిపోయింది. లకుమ నెత్తిమీద పిడుగు పడినట్లయింది. కన్నీళ్ళు వస్తుండగా ఆమె తలుపులు మూసి పక్కమీద వాలింది. ఆమె కనులు మూసుకున్నా, మనసు మాత్రం మూయలేక ఏడ్చింది. ఆమె పక్కన రాయలు నిద్రమత్తులో ఉన్నాడు. ఆమె ఎదలో అగ్నిపర్వతం బద్దలైంది. కత్తిపోటు కన్నా బలమైన ఆలోచనలు పుండుపడిన ఆమె హృదయాన్ని మరింతగా కెలకసాగాయి. "తెలిసి తెలిసి విషాన్ని ఎలా తాగాలి?

పడగ ఎత్తిన పాము ఎదురుగా చెయ్యి ఎలా పెట్టాలి? నన్నే ప్రాణంగా భావించిన రాజును విడిచి వెళ్తే అతను పిచ్చివాడిలా మారతాడు. రాజు నా కన్నులను వెలిగించిన రసానంద దీపం. నేను రాజును విడిచిపెట్టిన మరునిముషం లోకం నరకకూపమవుతుంది. రాణిని, రాజ్యాన్ని నా కోసం అవతలికి తోసేసిన ప్రభువును విడవడానికి నా మనసు అంగీకరించడం లేదు. కాని రాణికి ఇచ్చిన వాగ్దానం ఎలా నెరవేర్చాలి? ఈశ్వరా ! ఈ సానిదానికి ఎందుకు ఇలాంటి సంకట పరిస్థితిని కల్పించావు" అని వాపోయింది. ఆమె ఆలోచనలతో రేయి గడిచిపోయింది. తెల్లవారేసరికి ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది.

ఆ రోజు లకుమ శరీరంలో చండికా భయద సౌందర్య కాంతులు కనిపించాయి. ఆమె వింతగా అలంకరించుకుంది. జుట్టు విరబోసుకొని తలపై పూలమాల ధరించి 'చంద్రశేఖరుడను నేనే' అంది. నొసట సింధూర తిలకం దిద్ది ఇదిగో అగ్ని నేత్రమంది. కంఠంపై కస్తూరి రేఖ దిద్ది కాకోల కంఠమిదిగో చూడు అంది. తన శరీరం నిలువుగా గీత గీసుకొని ఈ వైపు అమృతం, ఆ వైపు విషం అంది. ఆమె చేష్టలు చూసిన రాజు ఆశ్చర్యంగా 'ఇదేమి నటన చెలీ'! అన్నాడు. 'అభినయం కాదు ఇది ఆగామి సూచకం' అనబోయి నాలుక కరుచుకొంది. ఏంటీ అన్న రాజుతో ఏమీలేదంది లకుమ. రాజు ఆమెను తన ఒడిలోకి లాగి 'పిచ్చిదానా' అన్నాడు. 'నిజమే మహారాజా ! నేను పిచ్చిదాన్నే' అంది. 'ప్రణయోన్మాదినీ ! ఈ రోజు అపూర్వమైన అనుభూతిని ఇచ్చావు' అన్నాడు రాజు. 'నిజం ! ఈ రోజు మన బతుకులో అపూర్వమైనది' అంటూ రాజు వేసిన ప్రశ్నలనే సమాధానాలుగా చెప్పింది. ఆ రోజు సాయంత్రం ఆమె శివతాండం చేయసాగింది. శివుని పాదాలు పూజిస్తున్నట్లు రాజు పాదాలను పుష్పాలతో అలంకరించింది. ఢమరుకం మ్రోగిస్తూ చిరుగంటల గజ్జెలు కాళ్ళకు కట్టుకొని నాట్యం చేసింది. ఆమె శరీరం, మనసు, కళ్లు ఎర్రబడ్డాయి. నాట్యమందిరం ఎరుపెక్కింది. రాజు మనసు కంపించింది. లకుమ కాలికి కట్టిన గజ్జెలు చెదిరి ఆ గది అంతా వ్యాపించాయి. మొలనూలు తెగిపోయింది. ఆమె హఠాత్తుగా ఒడిలో చెయ్యి పెట్టుకోగానే రాజు కళ్ళు మెరిసాయి. మరు నిముషంలో లకుమ భూమిమీద కుప్పకూలింది. ఆశ్చర్యంతో రాజు పెద్దగా అరుస్తూ ముందుకు దూకి చూడగా ఆమె ఎదలో ఒక పిడిబాకు మెరిసింది. రాజు ఆమె తలను చేతులలోకి తీసుకొని 'లకుమా ' అంటూ పిలిచాడు. లకుమ కళ్ళు తెరచింది. రాజు ఆమెను దగ్గరకు తీసుకొన్నాడు. రాజుకు లకుమ మొహంలో మృత్యుకళ కనిపించింది. దాంతో ఏం తోచక ఆమె ఎదలో గుచ్చుకున్న బాకును లాగాడు. వెంటనే లకుమ మరణించింది. రాజు తనువు, మనసు, సర్వస్వం అయిన లకుమ శాశ్వతంగా అతన్ని విడిచి వెళ్ళిపోయింది. ప్రాణానికి ప్రాణమైన లకుమను బలిగొన్న బాకును కోపంగా చూసిన రాజుకు దాని పిడిచుట్టు రక్తంతో తడిసిన ఉత్తరం కనిపించింది. దానిని చదివిన రాజుకు దు:ఖంతో పాటు విస్మయం కలిగింది. శిబి చక్రవర్తి, దధీచ మహర్షులు కేవలం తమ శరీరంలోని భాగాలని మాత్రమే త్యాగం చేస్తే లకుమ అంతకుమించి తన ప్రాణాన్నే త్యాగం చేసిందని తెలిసి రాజు శరీరం సిగ్గుతో కుంగిపోయింది. "లకుమా ! ఎక్కడున్నావో నువ్వు ? ఇంకెక్కడ ? పరమ సాధ్వి అనే స్వర్ణ సింహాసనంపై "ఏమంటావో నీవు? వ్యక్తి కన్నా దేశ దృష్టే మిన్న అని" అనుకున్నాడు. లకుమ అందించిన సందేశం, కర్తవ్యోపదేశం అతన్ని హెచ్చరించాయి. అప్పుడు ప్రభువు కన్నులకు కొండవీడు రాజ్యం, మహారాణి, ప్రజలు కనులముందు మెదిలాయి. ఇప్పటికీ లకుమ అందెల శబ్దాలు కొండవీడులో వీచే గాలులలో వినిపిస్తుంటాయి. కుమార గిరిరెడ్డి చరిత్ర కొండవీడులో శిశిరాన్ని సైతం వసంతంగా మారుస్తుంది. కొండవీడులోని మట్టిలోంచి కర్పూరమయమైన సువాసనలు వస్తూనే ఉంటాయి.

సారాంశం :- తననే సర్వస్వంగా భావించిన రాజును కర్తవ్యోన్ముఖుని చేయడానికి తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన లకుమ త్యాగనిరతికి ప్రతీకగా నిలిచింది.

ప్రశ్నలు: 1. లకుమ త్యాగనిరతిని వర్ణించండి

2. రాణి లకుమ నుండి రాయలను విడిచి వెళ్ళడానికి వాగ్దానం తీసికొన్న వృత్తాంతం వివరించండి.

రచయిత :

**ఆచార్య పి. ఎల్. శ్రీనివాసరెడ్డి**

తెలుగు శాఖ

శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపూర్.

ఖండం : 2

# ఆధునిక పద్యభాగం

పాఠం : 5

## నా దేశం నా ప్రజలు

## (మొదటి సర్గ)

శీర్షికలు : - గుంటూరు శేషేంద్ర శర్మ

1. కవి పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠినపదాలకు అర్థాలు
5. సందర్భ సహిత వ్యాఖ్యలు
6. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :**

'నా దేశం - నా ప్రజలు' అనే మహాకావ్యంలోని మొదటిసర్గలో కర్షకుల, శ్రామికుల జీవన విధానాన్ని, వారి సమస్యలను ప్రతిబింబిస్తూ చేసిన తన రచనలు భావిభారత పౌరులకు ఉపయోగపడాలని శేషేంద్ర భావించారు.

## 1. కవి పరిచయం

### గుంటూరు శేషేంద్ర శర్మ

నవ్యకవిత్వానికి శక్తిమంతమైన ఒక నూతన శైలిని, ఒక అధునాతన అభివ్యక్తిని ప్రసాదించిన కవి గుంటూరు శేషేంద్ర శర్మ. శుద్ధ కవితావాది అయిన శేషేంద్ర 20.10.1927 న నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకా నాగరాజుపాడులో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు అనసూయమ్మ, సుబ్రహ్మణ్యం దంపతులు. 10-18 సంవత్సరాల మధ్య శ్రీ నేతి కృష్ణశాస్త్రి దగ్గర సంస్కృత వ్యాకరణ కావ్యాలు, ఆ తర్వాత బ్రహ్మశ్రీ వావిలాల వేంకటేశ్వరశాస్త్రి వద్ద తర్క, అలంకార, ఉపనిషద్భాష్యాలు, వేదాంతపంచదశి మొదలైనవి అభ్యసించాడు. 1947 లో గుంటూరు ఎ.సి. కళాశాలలో బి.ఏ. పట్టా పొందాడు. 1948-49 లో మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఎల్. పూర్తి చేశాడు. 1949 నుండి 1985 వరకు విభిన్న ప్రాంతాల్లో వివిధ ఉద్యోగాలు చేశాడు. పిఠాపురంలో డిప్యూటీ పంచాయితీ అధికారిగా, ఆ తర్వాత కందుకూరు, పొదిలి మొదలైన ప్రాంతాల్లో పనిచేశాడు. ఆ తర్వాత కమీషనర్, హైదరాబాదు కార్పొరేషన్‌లో అసిస్టెంటు కమీషనరుగా, డిప్యూటీ కమీషనరుగా, సెక్రటరీగా ఉద్యోగం చేసి 1985 లో పదవీ విరమణ చేశాడు.

ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని, సంస్కృత సాహిత్యాన్ని, ఆంగ్ల సాహిత్యాన్ని, వేదాల్ని, పురాణాల్ని, మంత్ర శాస్త్రాన్ని, ఆధునిక రాజకీయాల్ని, ప్రపంచ చరిత్రని బాగా మథించిన గొప్ప పండిత కవి. శేషేంద్ర ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, గ్రీస్, తూర్పు ఆఫ్రికాదేశాలు పర్యటించాడు.

శేషేంద్ర సృష్టించిన కవిత్వం భారతీయ సాంస్కృతిక నేపథ్యంతో కూడిన విశిష్టమైనదిగా, గంభీరమైనదిగా రూపొందింది. ఈయన రచనలు హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ, కన్నడ, బెంగాలీ మొదలైన భారతీయ భాషల్లోకే కాక గ్రీకులాంటి పాశ్చాత్య భాషల్లోకి కూడా అనువదించబడి ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందాయి. శేషేంద్ర వల్ల తెలుగు కవిత్వం ఆంధ్రరాష్ట్రాన్ని, భారతదేశాన్ని దాటి సుదూర తీరాలకు

పయనించి, అనేక కవి విమర్శకుల మెప్పును పొందింది. కేవలం ఒక ప్రాంతం, ఒక దేశం కాకుండా ప్రపంచ మానవుల బాధలన్నీ శేషేంద్రకు కవితావస్తువులయ్యాయి. అందువల్ల శేషేంద్ర కేవలం ఆంధ్రకవీంద్రుడు, భారతకవీంద్రుడు కాక విశ్వకవీంద్రుడయ్యాడు.

**రచనలు :** శేషేంద్ర బహుగ్రంథకర్త. బహుముఖ ప్రజ్ఞా ధురీణుడు. పద్యాన్నైనా, వచన కవితనైనా, విమర్శనైనా తనధోరణిలో వెలువరిస్తాడు.

**కవితలు :** చంపూవినోదిని, ఋతుఘోష, పక్షులు, శేష జ్యోత్స్న, మండేసూర్యుడు, నీరై పారిపోయింది, గొరిల్లా, సముద్రం నా పేరు, ప్రేమలేఖలు, నేను నా నెమలి, నా రస్తా.

**ఇతిహాసం :** నా దేశం - నా ప్రజలు

**చిన్నకథలు :** విహ్వల

**నాటిక :** మబ్బులో దర్బారు

**విమర్శ :** షోడశి, స్వర్ణహంస, వాల్మీకి విమర్శ

**వ్యాసాలు :** సాహిత్య కౌముది, కవిసేన మేనిఫెస్టో, నరుడు నక్షత్రాలు, ఊహలో, విశ్వవివేచనం.

**డైరీలు :** రక్తరేఖ, కలారేఖ, జీవన రేఖ.

శేషేంద్ర దేశవిదేశాల్లో జరిగిన సభల్లో, సమావేశాల్లో, చర్చల్లో, గోష్ఠుల్లో పాల్గొన్నాడు. అనేక పత్రాలు, సమర్పించాడు. తన రచనలకు ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందాడు.

## పురస్కారాలు, అవార్డులు, బిరుదులు :-

1993 లో కలకత్తాలోని రాష్ట్రీయ హిందీ అకాడమి వారి పురస్కారం

1994 లో భారత దేశీయాంగ శాఖలో అంతర్భాగమైన రాజభాషా సమ్మేళనం వారి రాష్ట్రీయ సంస్కృత ఏక్తా పురస్కారం, రాష్ట్రేందు బిరుదు.

1994 లో తెలుగు యూనివర్శిటీ వారి గౌరవ డాక్టరేట్

1994 సంవత్సరానికి గాను కాలరేఖ రచనకు సాహిత్య అకాడమి అవార్డు

1995 లో కాశీనాథుని నాగేశ్వరరావు పురస్కారం (మద్రాసులో)

1995 కోటరెడ్డి ఫౌండేషన్ వారి అవార్డు, గూడూరు

1995 ఉండేలా విజ్ఞానపీఠం అవార్డు

1996 సహృదయ సాహిత్య సమితి వారి గురజాడ అవార్డు

1997 తెలుగు అకాడమి వారి ఆజాద్ అవార్డు

1997 కాకినాడ వారి నవకవితా పితామహ బిరుదు

ఈయన రాసిన 'నా దేశం నా ప్రజలు' కావ్యం ఈ ఏటి నోబెల్ పురస్కారానికి నామినేట్ చేయబడింది. ఒక తెలుగు కావ్యం ఈ స్థాయికి ఎదగడం ఇదే మొదలు కావడం విశేషం.

ప్రారంభంలో సంప్రదాయ మార్గాన్ని అనుసరించినా, తర్వాతకాలంలో వచన కవితను స్వీకరించాడు. పద్యకవిత్వాన్ని, గద్యకవిత్వాన్ని ఒకే విధంగా నడపగల సమర్థుడు శేషేంద్ర. కవిత్వరచనకీ, కవిత్వపఠనానికీ తనదైన ఒరవడిని ఏర్పరచుకొని సమకాలీన కవుల కాల్పనికలోకాన్ని

మార్చినవాడు శేషేంద్ర. శేషేంద్ర వాల్మీకి రామాయణంలోని సుందరకాండకు తన 'షోడశి'లో తాంత్రిక భాష్యాన్ని రాశాడు. హర్షనైషధానికి మంత్ర, తంత్ర, యోగ, వేదాంత పరమైన వ్యాఖ్యారూపమే స్వర్ణహంస.

1970 లో జర్మనీలో గోటెంజన్ నగరంలోని ఇండోలాజికల్ రిసెర్చి యూనివర్సిటీ పండిత సదస్సులో "కాళిదాసు మేఘదూతానికి వాల్మీకి రామాయణానికి ఉన్న సంబంధం" అనే అంశంపై సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించాడు. 1986 లో ఉజ్జయినీ కాళిదాసు అకాడమిలో 'ఇద్దరు ఋషులు - ఒక కవి" అనే శీర్షికతో వాల్మీకి, వ్యాస - కాళిదాసుల కవిత్వానుబంధాలను విశదం చేస్తూ పరిశోధనా పత్రం సమర్పించాడు.

తెలుగు సాహిత్యంలో శేషేంద్ర నిరంతర వివాదాస్పదుడు. ఇది ఆయనలో జ్వలిస్తున్న చైతన్యానికి సంకేతం. తెలుగు సాహిత్యాకాశంలో ఈయన ప్రవేశం ఒక కొత్త అరుణోదయాన్ని ఆవిష్కరించింది. శేషేంద్ర రచించిన కవిత్వాన్ని గురించి మహాకవి శ్రీ శ్రీ

శేషేన్ శేషేన్
నీ పోయెమ్స్ చూసేన్
పసందుచేసేన్
....................
నీది మంచి పద్యమా !
లేక ఫ్రెంచి మద్యమా !

శేషేంద్ర రచించిన వ్యాసాలు, ఉత్తరాలు, ఆయనతో జరిపిన ఇంటర్వ్యూల సమాహారం శేషేంద్ర సాహిత్యదర్శిని. శేషేంద్ర రచన నా దేశం-నా ప్రజలు ఆధునిక ఇతిహాసం. ఉర్దూ అనువాదానికి ఉర్దూ అకాడమీ బహుమతి, ముక్దూం మెమోరియల్ అవార్డు, హిందీ అనువాదానికి హిందీ ప్రతిష్ఠాన్ బహుమతి లభించాయి. తెలుగు కవిని మొదట తెలుగువారే గుర్తించక పోవడం దురదృష్టకరం.

## 2. పాఠ్యభాగ సందర్భం

శేషేంద్ర రాసిన 'నా దేశం నా ప్రజలు' అనే ఆధునిక ఇతిహాసం 1975 లో వెలుగు చూసింది. 'అన్ని భాషల ప్రజలు, అన్ని దేశాల ప్రజలూ మన ప్రజలే' అనేంత విస్తృతమైంది ఆయన ఆలోచనా విధానం. ఆయన ఈ కావ్యానికి రాసిన తొలిపలుకుల్లోనే కావ్యం సంకుచితమైన రాష్ట్రదేశాల పరిధుల్ని అధిగమించి విశ్వశ్రేయాన్ని కాంక్షిస్తుందన్న విషయాన్ని విస్పష్టం చేశాడు. "నేనెప్పుడు గొంతెత్తినా నా కోసంకాదు, ఐదుకోట్లమంది కోసమూ కాదు, యాభై కోట్లమంది కోసం గొంతెత్తాను. నేను పడుతున్న బాధలే నాదేశం పడుతోంది, నా మానవజాతి అంతా పడుతోంది. కనుకనే నా జ్వాలిక నా దేశపు నాలిక! ఇదే 'నా దేశం-నా ప్రజలు.' ఇంకా ఇలా అన్నాడు "నా వయస్సు, నా పాండిత్యం, నా ప్రతిభ, నా అనుభవం సర్వం పిండి, మాటల గొంతుల్లో పోసిన నా రక్తం ఈ ఇతిహాసం. ప్రపంచమానవుల్నీ, వాళ్ళ చరిత్రల్నీ, వాళ్ళ జయాపజయాల్నీ, వాళ్ళ భూత భవిష్యద్వర్త మానాలనీ అన్నిటినీ అనుభవ జ్ఞాననేత్ర ద్వంద్వంతో అవలోకనచేసి ఆ విశ్వదృశ్యంనుంచి ఈ తాత్పర్యం పిండాను" అని.

ఒక ఇతిహాసాన్ని లోకానికి సమర్పిస్తున్నానన్నాడు కవి. అందులో కథానాయకుడు కర్షకుడు. అందులోని ఇతివృత్తం ఆ కర్షకుని జీవితగాధే.

'కృషి చేస్తేగానీ బతుకు గడవనివాడు కర్షకుడు. నాగలి పట్టుకొని నేల దున్నేవాడు ఆ జాతికంతా చిహ్నం. కర్షకుడి జీవితంలో ఏగాథ లుంటాయి? శ్రమ, శ్రమ, శ్రమ తప్ప - కనుక ఈ ఇతిహాసంలో కథకోసం చూడకూడదు' అని ఈ కావ్యాన్ని ఏ దృష్టితో చూడాలో చెప్పాడు.

ఇతిహాసమనేది ఒక కావ్యరచనా ప్రక్రియ. ఆంగ్లంలో 'ఎపిక్' అనే పదాన్ని తెలుగులో ఇతిహాసమంటున్నారు. దీన్నే మహాకావ్యమని కూడా అంటారు. మహాకావ్యంలో ఎనిమిదికి తగ్గకుండా ముప్పయికి మించకుండా సర్గలు ఉండాలి. 'నా దేశం - నా ప్రజలు'లో ఎనిమిది సర్గలున్నాయి.

కాలమనే శ్రామికుని చేయిగా సూర్యుణ్ణి, శ్రామిక లోకానికి గుర్తుగా చేతిని సూచిస్తూ ఈ కావ్యం మొదలవుతుంది. కర్షకుని ఇతివృత్తం చాలా పాతది కావడంవల్ల ఇది ఐతిహాసికత్వాన్ని పొందుతున్నది. ఇందులోని నాయకుడైన కర్షకుడు భారత రామాయణాల్లోని నాయకులలాగా ధీరోదాత్తుడు, ధీరశాంతుడు మొదలైన లక్షణాలన్నీ కలిగి వున్నవాడు. వాళ్ళున్న ఒక్కొక్క యుగంలోని బాధల్నే వాళ్ళు అనుభవించారు. ఇతను మాత్రం యుగయుగాల బాధల్ని అనుభవిస్తూ ధీరత్వాన్ని విడిచిపెట్టకుండా లోకాన్ని రక్షించే కృషి చేస్తూనే వున్నాడు. అందువల్ల ఇతిహాసానికి ఇంతకన్నా ఉత్తమ నాయకుడు ఉండడు. ఇందులో నగరాల్ని, సముద్రాల్ని, పర్వతాల్ని, సూర్యచంద్రోదయాల్ని వర్ణించడం కూడా ఉంది. ఈ అన్ని కారణాలవల్ల దీన్ని మహాకావ్యమనీ, ఇతిహాసమనీ అనవచ్చునన్నాడు కవి.

ఉదయకాంతుల్లోనుంచి ఒక హస్తం లేస్తోందనీ, ఆ హస్తం కాలమనే నిరంతర శ్రామికుని సమస్తమనీ, ఆ చేయి మనిషి అనే పొలాల్లో పారే చెమటలో, రక్తంలో మునిగిలేస్తోందనీ, అది దూరదూరాలకు ఎర్రని కాంతులను చిందుతూ వుందనీ అంటూ ఈ పాఠ్యాంశం మొదలవుతుంది.

## 3. పాఠ్యభాగ సారాంశం

కర్షక, శ్రామికుల జీవన విధానాన్ని, వారి సమస్యలను ఇతివృత్తంగా తీసుకొన్నాడు కవి. కర్షకుల గురించి వివరిస్తూ తాను ధాన్యంలో నుంచి పుట్టాననీ, ధాన్యం కోసమే బతుకుతాననీ, మరణించిన తర్వాత ధాన్యంలోకే వెళ్ళిపోతాననీ చెబుతున్నాడు కవి.

శ్రామికుడిని సూర్యునితో పోల్చాడు. కాలం అనే నిరంతర శ్రామికుడి చెయ్యి సూర్యుడు అంటాడు. స్వేద బిందువులు తాగి సూర్యుడు మరింత తేజస్వి అవుతున్నాడు అంటాడు.

కవి తనమాట భావితరాలకు వారసత్వంగా సంక్రమిస్తుంది అంటాడు. అంటే తన రచనలు భావిభారత పౌరులకు ఉపయోగపడాలని కవి ఉద్దేశ్యం.

కర్షక కార్మికులు తమ బాధలు తీరడానికి విప్లవమార్గాన్ని అనుసరించాలన్నాడు. విప్లవమార్గంలో పయనిస్తే ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని 'నా దేశం-నా ప్రజలు' ద్వారా సందేశమిచ్చాడు.

## 4. కఠినపదాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| ఉషఃకాంతులు | = | సూర్యుడు ఉదయించడానికి ముందు ఉండే వెలుగులు |
| సింధూర కాంతులు | = | లేత ఎరుపురంగులో ఉండే కాంతులు |
| నిశ్వాసం | = | నిట్టూరుపు |
| దినం | = | రోజు, పగలు |
| మధుర ధ్వనులు | = | వినసొంపుగా ఉండే శబ్దాలు |
| కోకలు | = | చీరలు |
| వనసీమలు | = | అందమైన తోటలు |
| రస్తా | = | మార్గం, తోవ |
| కుడ్యాలు | = | గోడలు |
| నావలు | = | పడవలు |
| రూపాలు | = | ఆకారాలు |
| తావు | = | స్థానం |

| | | |
|---|---|---|
| డాములు | = | ఆనకట్టలు |
| బంధురం | = | ........ |
| రిక్తహస్తాలు | = | ఏమీలేని చేతులు (ఖాళీ చేతులు) |
| అనుచరులు | = | తనమార్గంలోనే నడిచేవారు. |
| ఎర్రకోరిక | = | (విప్లవ సంకేతం) గాఢమైన కోరిక |
| పరివారం | = | ఊడిగం చేసే జనులు |
| మహత్తు | = | మహిమ |
| పర్వత బ్రహ్మ | = | కొండలా స్థిరంగా |
| నిట్టూర్పు (నిడు + ఊర్పు) | = | అశాంతిగా గాలి వదలడం |
| క్షుద్రబాధ | = | భయంకరమైన బాధ |
| స్వేదబిందువులు | = | చెమట చుక్కలు |
| తేజస్వి | = | మిక్కిలి ప్రకాశవంతం |
| మిలియన్ | = | పదిలక్షలు |
| బాహువులు | = | భుజాలు |
| అశాంతి | = | శాంతి లేకపోవడం |
| ఝంఝూమారుతం | = | వానతో పాటుగా వచ్చేగాలి. |
| స్వప్నం | = | కల |
| మహత్తర | = | గొప్పదైన |
| దిగంతం (దిక్ + అంతం) | = | దిక్కుల చివర |
| శకం | = | ....... |
| ఉద్రిక్త రక్తం | = | భయంకరమైన రక్తం |
| చతుర్భుజ | = | ........ |
| స్పృహ | = | ఆలోచన |
| శతాబ్దము | = | వంద సంవత్సరాలు |
| భావితరాలు | = | భవిష్యత్తులో రాబోయే తరాలు |
| వసంతం | = | వసంతకాలం |
| తోపులు | = | తోటలు |
| దొడ్లో | = | పెరట్లో, ఇంటివెనుక భాగంలో ఉండే ఖాళీస్థలం |
| నిరుడు | = | గడిచిపోయిన సంవత్సరం |
| గురుతులు | = | గుర్తులు |
| కుటీరం | = | గుడిసె |

| | | |
|---|---|---|
| అతిథి | = | అనుకోకుండా వచ్చే వ్యక్తి |
| ప్రభాతపూర్వస్వప్నం | = | తెల్లవారుజామున వచ్చే కల |
| తలపాగా | = | తలకు రక్షణగా చుట్టుకునే వస్త్రం |
| ఉత్తరీయం | = | కండువా |
| రూపాలు | = | ఆకారాలు |
| నిరీక్షించడం | = | వేచి ఉండడం, ఎదురుచూడడం |
| మకుటాలు | = | కిరీటాలు |
| ఇతిహాసాలు | = | మహాకావ్యాలు (పూరాతన కథలు) |
| పూలవాన | = | పూలు వర్షంలా కురవడం. |

## 5. సందర్భ సహిత వ్యాఖ్యలు

### 1. సూర్యుడిచ్చిన ప్రియమైన కానుక నా దినం

**పరిచయం :-** ఈ వాక్యం గుంటూరు శేషేంద్రశర్మ రచించిన 'నా దేశం - నా ప్రజలు' అనే ఆధునిక ఇతిహాసంలోని 'ఒకటో సర్గ' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :-** కాలం అనే నిరంతర శ్రామికుడి హస్తం ఉషఃకాంతుల్లోంచి పైకి లేస్తోందని, మనిషి అనే పొలాల్లో ప్రవహించే, అంటే మానవుడి శ్రమలోని రక్తంలో ఆ హస్తం మునిగి లేస్తుందని, దూరదూరాలకు ఆ హస్తం తన సిందూరకాంతులు చిందుతూ ఉందన్నాడు. అలా ఉదయించిన సూర్యుని వెలుతురుకు కవి నిద్రలేచి పక్షులకు, మేఘాలకు సుప్రభాతం చెబుతానంటున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

**వివరణ :-** సూర్యోదయం కాగానే నిద్ర మేల్కొన్న కవి పక్షులకు, మేఘాలకు సుప్రభాతం చెబుతానని, తన కలలన్నీ ఆ పక్షుల రెక్కలే అంటానన్నాడు. సూర్యుడు తనకు ఇచ్చిన ప్రియమైన కానుక నా దినం అన్నాడు. పగటికి వుండే ప్రాధాన్యాన్ని కవి ఇక్కడ స్పష్టంగా తెలియజేస్తున్నాడు. వెలుగు అనేది లేకపోతే లోకమంతా చీకటే. అందుకే వెలుగునిచ్చే సూర్యుడికున్న ప్రాధాన్యాన్ని కవి విభిన్నంగా వ్యక్తం చేస్తున్నాడు.

### 2. నేను ధాన్యంలో నుంచి పుట్టాను. ధాన్యం కోసమే బ్రతుకుతాను; మరణించి ధాన్యంలోకే వెళ్ళిపోతాను.

**పరిచయం :-** పై వాక్యాలు గుంటూరు శేషేంద్రశర్మ రచించిన 'నా దేశం - నా ప్రజలు' అనే ఆధునిక ఇతిహాసంలోని ఒకటో సర్గ నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :-** భారతదేశం వ్యావసాయికదేశం. వ్యవసాయమే ఈ దేశ ప్రజల ముఖ్యాధారం. భూమిదున్ని, విత్తనంవేసి పంటలు పండించే కర్షకులే ఈ దేశ సంపదకు మూలం. అలాంటి కర్షకులను ఉద్దేశించి కవి ఈ మాటలు వ్యక్తం చేస్తున్నాడు.

**వివరణ :-** భారతదేశ ప్రజలకు అన్నం పరబ్రహ్మస్వరూపం. భూమి నుంచి ధాన్యం పుడుతుంది. ఆ ధాన్యాన్ని బాగుచేస్తే బియ్యం అవుతాయి. అంటే ధాన్యంలో నుంచి పుట్టాను అని కవి అనడం వల్ల అన్నానికి, ఆ అన్నం పెట్టే రైతుకు కవి ఇచ్చిన ప్రాధాన్యం తెలుస్తుంది. అన్నం కోసమే బతుకుతాను అని అనడం వల్ల కర్షకుడు తన జీవిత కాలాన్నంతా ధాన్యం పండించడానికే వినియోగిస్తాడని, ఈ దేశ ప్రజలకు జీవితాంతం అన్నానికి కొరతలేకుండా చూస్తాడని కవి వివరిస్తున్నాడు. మరణించి ధాన్యంలోకే వెళ్ళిపోతాను అనడంవల్ల మరణించాక ఆ ధాన్యం ఇచ్చే భూమిలోకి వెళ్తానని అర్థం. అంటే మట్టిని నమ్ముకొన్న కర్షకుడు జీవితాంతం మట్టే ఆధారంగా బ్రతికి, చివరకు ఆ మట్టిలోనే కలిసిపోతాడంటాడు కవి.

3. నేను మానవ జీవిత పొలాన్నీ దున్నుతా

పరిచయం : ఈ వాక్యం గుంటూరు శేషేంద్ర శర్మ రచించిన 'నాదేశం - నా ప్రజలు' కావ్యంలోని 'ఒకటోసర్గ'లోనిది.

సందర్భం : శబ్దాలనే అణువులతో పద్యాలు రాస్తానని, ఇసుక రేణువులతో చేసిన గ్లాసుల్లా మృదుమధురమైన శబ్దాల్ని పలికిస్తానని, రంగురంగుల నూలుతో చీరలు నేసి సీతాకోకచిలకల్లా నాదేశ స్త్రీలను తయారు చేస్తానని, జీవనం అనే తోటలో ఎగరేస్తానని, కల్లోకి మార్గంవేసి, మబ్బుల్లో భవనాలు కడతానని, ప్రాణాలతో తన దేశ సరిహద్దులలో గోడలు లేపి శత్రువులను వెనక్కి పంపిస్తానని కవి అంటున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ :- శిలలకు రూపంతోపాటు గొంతునిచ్చి అంటే ప్రాణంపోసి వాటిని నిశ్శబ్దం నుంచి విడుదల చేస్తానన్నాడు. మానవ జీవితాన్ని పొలాలుగా భావించి వాటిని దున్నుతాను అన్నాడు కవి. మానవుల జీవితం దున్ని, బాగుచేస్తానని అర్థం. అంటే మానవులలో మార్పును ఆశిస్తున్నాడు.

4. రగిలే నా ఎర్రకోరికే ఒక జెండాగా !

పరిచయం : ఈ వాక్యం గుంటూరు శేషేంద్ర శర్మ రచించిన 'నాదేశం నా ప్రజలు, అనే కావ్యంలోని 'ఒకటో సర్గ' నుంచి గ్రహించబడింది.

సందర్భం : వేర్పే కాళ్ళుగా నడిచే చెట్టును మనిషితో పోలుస్తూ, చెట్టుగా ఉంటే ఏడాదికి ఒక వసంతమన్నా తనకు దక్కేదని, కాని మనిషిగా పుట్టి అన్ని వసంతాలు కోల్పోయానని, తన బతుకు సున్నా అని బాధను వ్యక్తం చేస్తున్నాడు కవి. తను చిన్నవాడిగా ఉన్నప్పటినుంచి తనతోపాటు చెట్లు పెరుగుతున్నాయని, దారులు నడుస్తున్నాయని, పల్లెలు పట్నాలు అందంగా పరుగు పెడుతున్నాయని, కాని తాను మాత్రం ఖాళీ చేతులతో దేశం కాని దేశంలో నడుస్తున్నానని కవి అంటున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ :- కవి జ్ఞాపకాలే ఆయన అనుచరులు. అందుకే తన జ్ఞాపకాల ఊరేగింపుకు తానే నాయకుడినని, నాయకుడిగా అతనిలో రగిలే ఎర్రకోరికే ఒక జెండా అని కవి వ్యక్తం చేస్తున్నాడు. 'ఎరుపు' అంటేనే విప్లవ సంకేతం. తనలో రగిలే ఎర్రకోరిక అంటే విప్లవం రావాలనే కోరిక కవికున్నట్లు తెలుస్తుంది. ఆ విప్లవంతో తన దేశంలో మార్పు రావాలని కవి ఆశించాడు. ఆ విప్లవం రాకపోతే తన దేశాన్ని కూడా పరాయి దేశంలా భావించాడు. విప్లవం రావాలని, తద్వారా ప్రజల్లో మార్పురావాలని కవి ఆకాంక్ష.

5. స్వేద బిందువులు తాగి సూర్యుడు మరింత తేజస్వి అవుతున్నాడు

పరిచయం : ఈ వాక్యం గుంటూరు శేషేంద్రశర్మ రచించిన 'నాదేశం - నా ప్రజలు' అనే కావ్యంలోని 'ఒకటోసర్గ' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం :- క్షణాలు అనేవి కేవలం కాలాన్ని అనుసరించే పరివారం కాదు. కొన్ని లక్షణాలు మానవ చరిత్రనే మార్చగలిగేంత శక్తి కలిగి ఉంటాయి. నేను నిశ్శబ్దంగా కూర్చోలేను. నన్ను పిలుస్తున్న క్షణాన్ని వదులు కోలేను. కొండలతో, సముద్రాలతో బతికే వాడికి తుఫాను ఒక లెక్కకాదు. బాధలు ఈగల్లా ఎగురుతున్నాయన్నాడు కవి. బాధలు అనుభవిస్తున్న మానవుడు ఆ బాధల్ని వదిలించుకోవడానికి విప్లవ మార్గాన్ని అనుసరిస్తున్నాడు. కవి కూడా తాను నిశ్శబ్దంగా కూర్చోనని విప్లవ మార్గాన్ని ప్రజలకు చూపిస్తానని, ఈగల్లా ముసురుకున్న బాధలనుంచి మానవుడిని తొలగించాలంటే ప్రజలంతా విప్లవ పంథాను అనుసరించాలని కవి చెబుతున్న సందర్భంలోనిది.

వివరణ :- ఈ పాఠం మొదట్లోనే సూర్యుడిని శ్రామికునితో పోల్చాడు కవి. స్వేదబిందువులు తాగిన సూర్యుడు మరింత తేజస్వి అవుతున్నాడు అంటే మానవుల నిరంతర శ్రమతో ప్రకృతి పులకిస్తుంది. దాన్ని చూసి కర్మసాక్షి అయిన సూర్యుడు ఎంతో సంబరపడతాడు. నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడు తన శ్రమకు తగిన ఫలితం దొరకక కష్టపడుతున్నాడు. శ్రమలో పుట్టి, శ్రమలో బతికే కార్మికుడికి శ్రమ ఒక లెక్కకాదు. ఈగల్లా ముసిరిన బాధలనుంచి తొలగడానికి శ్రామికుడు విప్లవపంథాని అనుసరిస్తాడు. విప్లవ భావాలు శ్రామికుడిలో నానాటికీ బలపడుతున్నాయని కవి వ్యక్తం చేస్తున్నాడు.

**6. నామాట భావి తరాలకు వారసత్వంగా సంక్రమిస్తుంది.**

**పరిచయం :-** పై వాక్యం గుంటూరు శేషేంద్ర శర్మ రచించిన 'నా దేశం - నా ప్రజలు' అనే కావ్యంలోని ఒకటోసర్గం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :-** కవి కాలాన్ని కాగితంలా చేసి, ఆ కాగితంపై లోకానికి ఒక సందేశం రాసి ఇస్తానని, దానికింద తన ఊపిరితో సంతకం చేస్తానని, మనిషి కళ్ళల్లో ఉండే శక్తినంతా తీసి ఒక శిల్పంగా చెక్కి భూమిపై నిలుపుతానని అన్నాడు. అతనికున్న కోరిక గొంతెత్తి అరుస్తూ కాలానికున్న వెన్నెముక విరుస్తూ, దిగంతరేఖల్ని చింపుతూ ఒక కొత్త శకాన్ని లోకం మీదికి విసిరేస్తుంది. ఆ కోరికే మనిషిని అశాంతిగా ఉంచుతుంది. నిద్రపోతున్న దారుల్లో ఉద్రిక్తరక్తంలా పారుతుందంటాడు కవి. అంటే కవి రచనలు నిద్రిస్తున్న ప్రజలను మేల్కొలుపుతాయని, ప్రపంచానికి ఒక కొత్త శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తాయని కవి అంటున్న సందర్భంలోనిది ఈ కావ్యం.

**వివరణ :** కవిరాసిన పద్యాలు దేశ ప్రజల కష్టాలు తీర్చడానికే అని, తాను నేర్చిన, చూసిన విషయాలను తన భాషలోనే రాస్తానని కవి అంటున్నాడు. తన భాషలో రాసినా ఆ కవితలు, అందులో అతను చెప్పిన సందేశాలు భావితరాలకు వారసత్వంగా సంక్రమిస్తాయన్నాడు. అంతకన్నా తన పద్యాలను పొందే అర్హత ఒక్క తెలుగు ప్రజలకే కాక భూగోళం మీద అన్ని జాతులకూ, అన్ని దేశాలకూ ఉంటుందన్నాడు. కవి రచనలు సార్వకాలికాలు, సార్వజనీనాలు అవుతాయని ఆత్మ విశ్వాసంతో సూచిస్తున్నాడు.

**7. అలసిన నా ప్రయాణంలో ఒక చెట్టునీడే నా కుటీరం; రాలిన ఒక పువ్వే నా అతిథి**

**పరిచయం :-** పైవాక్యం శేషేంద్ర శర్మ రచించిన 'నాదేశం - నా ప్రజలు' కావ్యంలోని 'ఒకటోసర్గ' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :-** నదీ ప్రవాహంలాగా కాలం కూడా నిరంతరం ప్రవహిస్తుంది. నదిలా కాలం కూడా ఆగకుండా కదులుతూనే ఉంటుంది. కిందటి సంవత్సరం పారిపోయిన వసంతం మళ్ళీ వచ్చింది. కొమ్మల్లో ఆకులచాటున చూస్తే నిరుడు నివసించి ఎగిరిపోయిన పక్షుల అడుగులు కనిపిస్తున్నాయని, ఎగిరిపోయిన నిమిషాల గుర్తులు కూడా కనిపిస్తున్నాయని కవి అంటున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

**వివరణ :-** కాలం చాలా వేగంగా పరుగు పెడుతుందని, కవి ఆ కాలంతోపాటు ప్రయాణించి అలసిపోయానని, సేద తీర్చుకోవడానికి ఒక చెట్టు నీడను ఆశ్రయించానన్నాడు. కార్మికుల, కర్షకుల సామాన్య ప్రజల జీవన సమస్యలను అవగతం చేసుకొని వారికి శాంతి కలగడానికి ఒక చెట్టు నీడైనా చాలు, అదే కుటీరంలా భావిస్తానన్నాడు. చెట్టు ఆదరణతో ఆశ్రయమిస్తుంది, సేద తీరుస్తుంది. ఒక పుష్పాన్ని త్యాగం చేస్తుంది. దీన్నంతటినీ మనుషులు ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నాడు కవి.

**8. సూర్యుడు కిరణాల బండ్లు తోలుకొని వస్తున్నాడు.**

**పరిచయం :** ఈ వాక్యం గుంటూరు శేషేంద్ర శర్మ రచించిన 'నాదేశం - నా ప్రజలు' అనే కావ్యంలోని 'ఒకటో సర్గ' నుంచి గ్రహించ బడింది.

**సందర్భం :** సంవత్సరం మొదట్లో వచ్చే వసంతం గురించేకాక దేశంలోని అడవుల్ని, నదుల్ని, దారుల్ని వర్ణిస్తున్నాడు కవి. ఆ వసంతంలో ఏడుస్తున్న పొలాల్ని ఓదారుస్తున్నానని, దేశపు పర్వతాలను సింహాలుగా, ఏనుగులుగా, ఒంటెలుగా, శ్రామికులుగా, ప్రేమికులుగా, వాటి మకుటాల్లాంటి ఇతిహాసాలుగా మలుస్తానని మాట ఇస్తానంటున్న సందర్భంలోనిది.

**వివరణ :** పొలాలు కర్షకులకు గుర్తు అయితే, సింహాలు, ఏనుగులు, ఒంటెలు శ్రామికులకు ప్రతీకలుగా చూపాడు కవి. సూర్యుడు కిరణాల బండ్లు తోలుకొని వస్తున్నాడు-అన్నాడు కవి. అంటే కిరణాలు వెలుతురుకు చిహ్నం. అంటే కర్షక, శ్రామిక జీవితాల్లో మార్పు రావాలని, ఆ మార్పు అనేది కిరణాల వెలుగుకు వస్తుందని, అప్పుడు దేశంలోని కర్షక, శ్రామికులు, సామాన్య జనులు సుఖసంతోషాలతో తమ జీవితాన్ని గడుపుతారని కవి ఆశిస్తున్నాడు.

6. ప్రశ్నలు - సమాధానాలు

# నాదేశం - నా ప్రజలు

- గుంటూరు శేషేంద్రశర్మ

ప్ర. 1. నాదేశం - నా ప్రజలు ఒక ఇతిహాసంగా శేషేంద్ర వర్ణించడంలో గల ఔచిత్యాన్ని వివరించండి?

ప్రాచీన ఇతిహాసాలు రామాయణ, మహాభారతాలు ఆనాటి మత, సాంఘిక, నైతిక తత్వాలపై ఆధారపడి ప్రజా ప్రయోజనాలను నెరవేర్చడానికి ఉద్దేశించబడ్డాయి.

"ధర్మార్థ కామమోక్షాణాముపదేశ సమన్వితం, పూర్వ వృత్తం కథాయుక్తం ఇతిహాసం ప్రచక్షతే" అని ప్రాచీనుల ప్రమాణోక్తి. 'నాదేశం - నా ప్రజలు' కావ్యం నాల్గు, ఐదు, ఆరు సర్గలలో ధర్మార్థ కామ మోక్షాల గురించి ప్రస్తావించ బడ్డాయి. ఇతివృత్తం అనాదిగా వస్తున్న కర్షక జీవితం. పూర్వ వృత్తమంటే ప్రాచీన ఇతివృత్తమే.

ఇతిహాసమనే మాట ఆంగ్లపదం 'ఎపిక్' అనే మాటకు ప్రత్యమ్నాయం.

"అష్ట సర్గాన్నతు న్యూనం త్రింశత్సర్గాచ్చనాధికం నాత్యంత విస్తరః సర్గః త్రిశంతో వనచోనతా - దండి.

మహాకావ్య సర్గ సంఖ్య ఎనిమిదికి తక్కువగానీ, ముప్పయికి ఎక్కువగాని కాకూడదు. నాదేశం-నా ప్రజలు లో సర్గలు ఎనిమిది.

"లేస్తోంది ఉషఃకాంతుల్లోనుంచి ఒక హస్తం, ఆ హస్తం కాలం అనే నిరంతర శ్రామికుడి సమస్తం" అంటూ కాలం శ్రామిక హస్తంగా సూర్యుడ్ని, శ్రామికలోక చిహ్నంగా హస్తాన్ని సూచిస్తూ వ్యంగ్య భంగ్యా నమస్క్రియా వస్తు నిర్దేశాలతో కృత్యారంభం జరిగింది. చతుర్వర్గ ఫలోపేతంగా కర్షకుడి ఇతివృత్తం ఐతిహాసికం... అనడం జరిగింది. నగర, గిరి, చంద్రోదయ, ఋతు వర్ణనలు కూడా ఉండడం, అంతటా భిన్న వృత్తాలతో పేతంగా, ఆలంకారిక ప్రమాణాల్నీ బట్టి దీన్ని మహాకావ్యమని, ఇతిహాసమని అనాలని శేషేంద్ర అంటాడు.

వర్తమాన ఆంధ్ర కవిత్వంలో ఇతిహాసం ఒక అచుంబిత ప్రక్రియ. ఇప్పుడు నేను ఈ ఇతిహాసం సమర్పిస్తున్నాను. దేంట్లో ఒక సామాన్య కర్షకుడు నాయకుడో అతడి జీవిత గాథే, దాని ఇతివృత్తమే ఆ ఇతిహాసం.

కృషి చేస్తేగాని బతుకు గడవని వాడు కర్షకుడు. నాగలి పట్టుకొని నేలదున్నేవాడు ఆ జాతికంతా చిహ్నం. కర్షకుడి జీవితంలో ఏ గాధలుంటాయి. శ్రమ, శ్రమ, శ్రమ తప్ప - కనుక ఈ ఇతిహాసంలో కథకోసం చూడకూడదు అని అంటాడు శేషేంద్ర.

"నేనెప్పుడు గొంతెత్తినా నా కోసం కాదు
అరవైకోట్లమంది కోసం గొంతెత్తాను
నేను పడుతున్న బాధలే నాదేశమంతా పడుతోంది
మానవజాతి అంతా పడుతోంది
కనుకనే నా జ్వాలిక నాదేశపు నాలిక
అదే నాదేశం, నా ప్రజలు,
అదే ఆధునిక మహాభారతం" -అని

శేషేంద్ర తన కావ్యాన్ని ఆధునిక ఇతిహాసంగా పేర్కొన్నాడు.

అనాది నుండి మట్టికీ - మనిషికీ అవినాభావ సంబంధం ఉంది. భూమాత ఎదపై పోరాడుతూ స్వేదంతో పొలాల్ని, బతుకును పండించుకోవడం అలవరుచుకున్నాడు మనిషి. ఇలాంటి వాళ్లను కొందరు స్వార్థపరులు భూమాత ఆత్మీయతకు దూరంగా ఉంచారు. దీంతో ఆవేదన, అశాంతి, ఆక్రోషం, తిరుగుబాటు మట్టి మనిషిలో చోటు చేసుకోవడం, భూపోరాటాలు జరగడం తప్పనిసరి అయింది. ఈ పోరాటాలకు సరిగ్గా ఇక్కడే కవి మద్దతు పలకడం జరుగుతుంది. తన వాడి, వేడి అక్షర ఆయుధాల్ని వాళ్ళకు మద్దతుగా అందిస్తాడు. ఈ కోవకు చెందిందే నాదేశం - నా ప్రజలు.

నాదేశం - నా ప్రజలు పీఠికలో (1975) శేషేంద్ర ఇలా అంటాడు. "ఇతిహాస నిర్మాణానికి బాధానుపూర్వక బలి కావాలి. నేనే ఆ బలి! నావయస్సు, నా పాండిత్యం, నా ప్రతిభ, నా అనుభవం సర్వం పిండి మాటల గొంతుల్లో పోసిన నారక్తం ఈ ఇతిహాసం. ప్రపంచ మానవుల్ని, వాళ్ళ చరిత్రల్నీ, వాళ్ళ జయాపజయాల్ని వాళ్ళ భూత భవిష్యద్వర్తమానాల్నీ అన్నిటినీ అనుభవ జ్ఞాన నేత్ర ద్వంద్వంతో అవలోకన చేసి ఆ విశ్వదృశ్యంనుంచి ఈ తాత్పర్యం పిండాను. గత మే నెల నీలగిరి కొండల్లో కూర్చుని-ఇది ఈ శతాబ్దం ఇచ్చిన పాట - అని అంటారు శేషేంద్ర శర్మగారు.

**2. నాదేశం - నా ప్రజలు మొదటి సర్గ ఆధారంగా శ్రామిక చైతన్యాన్ని గురించి వివరించండి?**

నాదేశం - నా ప్రజలు ఒక ఆధునిక ఇతిహాసం. ఇందులో నాయకుడు శ్రామికుడు. ఇతిహాసంలో నాయకులుగా రాజులుంటారు. రాణులుంటారు. శేషేంద్ర రచించిన ఇతిహాసంలో కర్షకుడు నిలబడడంతో ఈ రచన ఒక నవ్యత్వాన్ని ప్రదర్శించింది. ఈ దేశానికి నాగలి ప్రతీక. ఈ దేశపు భౌగోళికాకృత నాగలిని పోలి ఉంటుంది. నాగలిని ఉపయోగించే రైతు ఈ దేశపు జీవన ప్రధాత కావడంతో ఈ ఇతిహాసంలో నాయకత్వానికి అర్హత పొందినట్లయింది. ఈ దేశపు రైతే ఈ దేశానికి రాజు. అతని చరిత్రే ఈ దేశపు చరిత్ర. అతని దైనందిన జీవితం ఈ కావ్యంలో గానం చేయబడింది. అందుకే ఈ కావ్యాన్ని ఆధునిక ఇతిహాసంగా శేషేంద్ర అభివర్ణించాడు.

"లేస్తోంది ఉషఃకాంతుల్లో నించి ఒక హస్తం-
ఆ హస్తం - ఆ హస్తం కాలం అనే నిరంతర
శ్రామికుడి సమస్తం
మనిషి పొలాల్లో ప్రవహించే చెమటతో
రక్తంలో మునిగి లేస్తోంది.
దూర దూరాలకు సింధూర కాంతులు చిందుతూ ఉంది"

శ్రమకు సంకేతాలు సూర్యుడు, శ్రామికుని హస్తం. నిరంతరం సంచలించే కాలం అంటే కష్టపడే శ్రామికునికి హస్తం అన్నీ తానవుతుంది. కష్టపడాలంటే చేతులుండాలి. శ్రమశక్తివల్ల సౌభాగ్యం లభిస్తుంది. అంటే శ్రమ మానవ నాగరికతకు మూలం. కాలమనేది శ్రామికుడిగా, శ్రామికుడి హస్తంగా, సూర్యుడిగా సూచించడమైంది. శ్రమకు స్వేదానికి ఉన్నత పీఠం వేస్తూ ఈ కావ్యరచన కొనసాగింది.

"నేను ధాన్యంలో నించి పుట్టాను
ధాన్యం కొసమే బ్రతుకుతాను
మరణించి ధాన్యంలోకే వెళ్ళిపోతాను"

ఇదే నిజమైన కర్షక జీవితం. పుట్టడం, బ్రతకడం, చావడం అనేవి పూర్తిగా ధాన్యం (పంట)తోనే ముడిపడి ఉన్నాయి. అలాంటి కర్షకుడి కోసం శబ్దాల అణువులతో పద్యాలు చేసి మధుర నాదాలు వినిపిస్తానని శేషేంద్ర తన ఆశయాన్ని తెలిపాడు. వస్త్రదాతగా, సైనికుడిగా, నావికుడిగా, శిల్పిగా, శ్రామికుని వివిధ రూపాల్ని మనకళ్ళముందు సాక్షాత్కరింప చేశాడు.

"నేను మానవ జీవిత పొలాలన్నీ దున్నుతా
ఈ చేత్తో నేను ఏ అందాన్ని సృష్టించలేదు?
ఏది ఈ భూమి మీద ఈ చేతికి లొంగలేదు?
కానీ ఈ చెయ్యి ఖాళీగానే ఉండిపోయింది శాశ్వతంగా"

ఇక్కడ శ్రామికుడు ఉత్పత్తిదారుడు మాత్రమే. అయితే ఆ ఉత్పత్తిని అనుభవించేది మరొకడు. శ్రామికుడి చేతికి ఎలాంటి లాభం రాదు. అందుకే అది శాశ్వతంగా ఖాళీగా ఉండిపోవలసి వచ్చింది.

"గడచిన చరిత్రలో నాకు తావు లేదు
ఇప్పుడు నడిచే చరిత్రకు నీతిలేదు"

అలాగని చేతులు కట్టుకుని కూర్చోమనడం లేదు శేషేంద్ర.

డాములు కట్టినా, భూములు దున్నుతున్నా శ్రామికుడి బ్రతుకులో వెలుగు లేదు. అయినా తన వృత్తిని కొనసాగిస్తున్నాడు. మట్టిపై మొలిచిన చెట్టుకే సంవత్సరానికొకక వసంతం దక్కుతోంది. కాని మట్టిలోని వసంతాన్ని వెలికి తీసే మనిషికి ఆ వసంతపు వాసనైనా తగలక పోవడం ఎంతఘోరం.

అంతటా అభివృద్ధి కనిపిస్తున్నా శ్రామికుడి జీవితంలో ఎలాంటి ఎదుగుబొదుగు కనపడలేదని అంటాడు. అందుకే అతని మనస్సులో ఉన్నకోరిక ఒక్కటే. అది విప్లవం. "ఎర్రకోరిక" అనే అద్భుతమైన సమాస ప్రయోగం విప్లవ ప్రతీకగా సూచింపబడింది.

"చూడు స్వేద బిందువులు తాగి సూర్యుడు
మరింత తేజస్వి అవుతున్నాడు. సుత్తులు
కొడవళ్ళులాంటి కిరణాలు మిలియన్ల మిలి
యన్ల ప్రదానం చేస్తున్నాడు."

శ్రమ జీవుల స్వేద బిందువుల్ని ఆస్వాదించడం వల్ల సూర్యుడు తేజస్విలా ఉన్నాడట! అందుకు ప్రతిఫలంగా వాళ్ళకు సుత్తులు, కొడవళ్ళూ లాంటి కిరణాల్ని తరలిస్తున్నాడట! కాలం అనంతమైంది. దాన్ని దొరికినంతమేరకు కవి కాగితంగా మలచుకొని దానిపై దేశ ప్రజలకొక అభ్యుదయ స్వప్నాన్ని రాసి, తన ఊపిరితో దాని క్రింద సంతకం చేస్తాడట! తద్వారా తరతరాల బానిసత్వంతో నిదురించే భారతంలో చైతన్యపు రక్తం ప్రవహింపచేస్తాడట!

వసంతం రావడం, పోవడం సహజం, వసంతకాలంలో చెట్లు అందంగా ఉంటాయి. కొమ్మల్లో ఆకుల మాటున కనిపించే పక్షుల అడుగుల్ని, కాల చక్రం గుర్తుల్ని శేషేంద్ర సునిశితంగా పరిశీలించాడు.

విజ్ఞాన వంతుడైన సూర్యుడు జ్ఞానప్రదాలైన కిరణాల్ని ప్రసరింప చేస్తున్నాడు. మేధావివర్గం ఆ కిరణాల్ని పేదల ముంగిళ్ళకు తరలించుకు వస్తున్నారు. కవి ప్రజా అభ్యుదయాన్ని కాంక్షిస్తున్నారు. అందుకే శ్రామికుల్ని ఎవరెస్టు శిఖరపు అంచులపై కూర్చోబెడుతూ, వారికోసం ఇతిహాసం రాయలనుకుంటున్నాడు. అందుకే కాబోలు వసంతానికి కూడా నోచుకోని చెట్టు కవి కలపై పూలు రాలుస్తోంది.

"మొదట నన్ను చూచి కన్నీరు కార్చిన చెట్టు ఇప్పుడు నా కల మీద పూల వాన కురిసింది" అంటాడు శేషేంద్ర. "నా చతుర్భుజ పద్యాలతో ఆ స్పృహ నాదేశానికి నేను దానం చేస్తున్నాను. నేను అడవుల కడుపుల్లో నేర్చుకున్న భాషలోనే ఇక శతాబ్దాలు మాట్లాడు కుంటాయి. నా మాట భావితరాలకు వారసత్వంగా సంక్రమిస్తుంది. నా పద్యాలను పొందే అర్హత భూగోళం మీద జాతులకూ, దేశాలకీ ఉంటుంది"- అని శేషేంద్ర తన అభ్యుదయ భావాలు ఎలా చైతన్యమవుతాయో వివరించాడు.

3. 'నాదేశం - నా ప్రజలు' కవితాఖండిక సారాంశము వ్రాయండి (లేదా)
'నాదేశం - నా ప్రజలు' కవితాఖండికలో శేషేంద్ర అందించిన సందేశమేమిటి?

'నాదేశం - నా ప్రజలు' ఎనిమిది సర్గలలో సాగిన ఆధునిక ఇతిహాసం. ఇందులోని మొదటి సర్గ ప్రస్తుత పాఠ్యాంశం.

కాలమనే నిరంతర శ్రామికుని సమస్తమైన హస్తం ఉషఃకాంతుల్లో నుంచి లేస్తోంది. ఆ చేయి మనిషి అనే పొలాల్లో ప్రవహించే స్వేదంలో, రక్తంలో మునిగిలేస్తోంది. అది సుదూర తీరాలకు అరుణారుణ కాంతుల్ని చిందుతూవుంది.

కవి తాను కళ్ళు తెరిచి, ఆవులిస్తూ లేస్తానంటున్నాడు. తన చిన్న కిటికీలోనుంచి పక్షులకూ, మబ్బులకూ సుప్రభాతం చెబుతాడట. తాను కన్న కలలన్నీ వాటి రెక్కలంటూ ఒక విశ్వాసాన్ని విసిరేస్తానంటున్నాడు. దినాన్ని సూర్యుడిచ్చిన ప్రియమైన కానుకగా పేర్కొంటూ దాన్ని వాటితో కలిసి పంచుకుంటానంటాడు.

తాను ధాన్యంలో నుంచి పుట్టాననీ, ధాన్యం కోసమే బతుకుతాననీ, మరణించిన తర్వాత ధాన్యంలోకే వెళ్ళిపోతానని చెబుతున్నాడు.

తాను శబ్దాల అణువులతో పద్యాలను తయారు చేస్తాడట. ఇసుక రేణువులతో చేసిన గ్లాసులలాగా మధురమైన ధ్వనుల్ని పలికిస్తానంటున్నాడు.

తన దేశపు స్త్రీలకు రంగురంగుల కలలు కనే దారంతో చీరల్ని నేసి సీతాకోకచిలుకల్ని చేస్తాడట, వాటిని జీవనమనే వనసీమల్లో ఎగరేస్తాడట.

కలలోకి దారులు వేస్తాడట. మేఘాల్లోకి చొచ్చుకు పోయేటట్లు భవనాలు నిర్మిస్తాడట. శత్రువుల గుండెల్లోకి తన ప్రాణాలతో తన దేశపు సరిహద్దు గోడల్ని లేపుతాడట.

నావలు చేసి వాటిని సముద్రాల్లోకి వదిలి తన దేశపు జండాలెగరేస్తూ పొండి అని పంపిస్తానంటున్నాడు.

శిలలకు రూపాలనిచ్చి, గొంతుల్ని సమకూర్చి వాటిని నిశ్శబ్దాల్లోనుంచి విడుదల చేస్తానని వక్కాణిస్తున్నాడు.

తాను మానవ జీవితమనే పొలాలన్నిటినీ దున్నుతానంటున్నాడు.

తన చేత్తోతాను ఏ అందాన్ని సృష్టించలేదు? ఈ భూమిమీద ఏది తన చేతికి లొంగి పోలేదు? అయినా తన చెయ్యి శాశ్వతంగా ఖాళీగానే వుండిపోయింది.

గతించిపోయిన చరిత్రలో తనకు తావులేదు. ప్రస్తుతం నడిచే చరిత్రకు నీతి లేదు.

డాములెందుకు కడుతున్నారో, భూములెందుకు దున్నుతున్నారో తనకే తెలియదంటున్నాడు కవి.

తన బతుకొక సున్న, అయినా నడుస్తున్నానంటాడు. వేళ్ళను కాళ్ళుగా చేసుకొని నడిచే చెట్టుమనిషి. చెట్టుగా ఉంటే ఏడాదికొక వసంతమైనా దక్కేది. మనిషై తాను అన్ని వసంతాలను కోల్పోయానని వాపోతున్నాడు కవి.

తన బాల్యం నుంచీ చెట్లు పెరుగుతున్నాయంటూ, దారులు నడుస్తున్నాయంటాడు. పల్లెటూళ్ళు, పట్టణాలూ సుందరంగా బంధురంగా పరుగులు తీస్తున్నాయట.

తన దేశం కాని దేశంలో, తనకేమీ లేని ప్రదేశంలో, తన జ్ఞాపకాలు తన అనుచరులుగా, తన జ్ఞాపకాల ఊరేగింపుకు తానే నాయకుడిగా, రగిలే తన ఎర్రటి కోరికే ఒక జెండాగా గ్రహించి తాను మాత్రం ఏమీలేని చేతుల్తో నడుస్తున్నానంటాడు.

క్షణాలు కేవలం కాలం వెంబడి బడి నడిచే సేవకులు కాదు. మొత్తం మానవ చరిత్రనే మార్చివేయగల మహత్తు (శక్తి) గలిగిన క్షణాలు కొన్ని వుంటాయి.

తన చేతులతో తానే తనను ఒక నిశ్శబ్దమైన సమాధిలో పాతిపెట్టుకోలేడు. ఒక పర్వతమనే బ్రహ్మలాగా కూర్చొని వుండలేడు. తనను చేయెత్తి పిలుస్తున్న ఒకానొక క్షణాన్ని వట్టి పనికిమాలిన నిట్టూర్పులకు వదిలేసుకోలేనంటున్నాడు.

పర్వతాలతో, సముద్రాలతో కలిసి బ్రతికే వాడికి తుఫానులేం లెక్క? తుఫానులు తుఫానులే ఎగిరిపోతుంటే ఈగల లాగ ఎగిరే ఈ క్షుద్రమైన బాధలు ఒక లెక్కా?

చూడు. జాగ్రత్తగా గమనించు! చెమట బిందువుల్ని ఆస్వాదించి, సూర్యుడు అంతకు ముందున్న దానికంటె భిన్నంగా ఎంతో తేజోవంతుడవుతున్నాడు. సుత్తులు, కొడవళ్ళు లాంటి కిరణాలను మిలియన్ల మిలియన్ల దానం చేస్తున్నాడు. గాలులు అధ్యాయాలు అధ్యాయాలుగా వీచే చరిత్రలోతాను వాటి చంకల్లో చిక్కుకొని ఏలవిల కొట్టుకునే కొమ్మల మాదిరిగా వుండిపోలేనంటున్నాడు.

తనకెందుకింత అశాంతి? తనకెందుకింత ఆవేశం అని అంటే ఏం చెప్పాలి? సముద్రాల్ని అడగమంటాడట దానికెందుకంత అశాంతి? అని. ప్రళయకాలంలోని గాలిని అడగమంటాడట దానికెందుకంత ఆవేశమని?

కాలాన్ని తను కాగితం లాగా చేసుకొని, దాని మీద లోకానికి ఒక కలను రాసిస్తాడట, దానికింద తన ఊపిరితో సంతకం చేస్తాడట.

మనిషి కండలలో నుంచి ఒక భయంకరమైన రాక్షస శక్తిని సృష్టించి, దాన్నొక మహత్తరమైన శిల్పంగా చెక్కి భూమిమీద నిలబెడతాడట.

తన కోరిక గొంతెత్తి అరుస్తుంది. అది కాలం యొక్క వెన్నెముకను విరగ్గొడుతుంది; దిక్కుల చివర్లలో వుండే రేఖలను చింపేస్తుంది; ఒక నూతన శకాన్ని లోకం మీదికి విసిరేస్తుంది; అది మానవునికి అశాంతిని విధిస్తుంది; నిద్రించే గ్రామాల దారుల్లో ఉద్రిక్తతకు లోనయిన రక్తంలాగా పాకుతుంది. నాలుగు భుజాలు కలిగిన తన పద్యాలతో ఆ స్వప్నాను తనదేశానికి తాను దానం చేస్తాడు. తాను అడవుల కడుపులలో నేర్చుకొన్న భాషలోనే ఇంక వందల సంవత్సరాలు మాట్లాడుకుంటాయి. తన మాట రాబోయే తరాలకు వారసత్వంగా మిగిలిపోతుంది. తన పద్యాలను పొందే అర్హత భూగోళం మీద వున్న అన్ని జాతులకూ, దేశాలకూ వుంటుంది. నిన్నటి సంవత్సరపు వసంతం ఒక నదిలాగా ఎలా పారిపోయిందో, అలా అలా వెళ్ళి ఏ తోపుల్లో నిద్రపోయిందో తనకు తెలియదు. అయితే తమ దొడ్డిలోని మామిడి చెట్టును వెతుక్కుంటూ మళ్ళీ వచ్చింది. ఈ లోకంలోకి వచ్చిన ప్రతీదీ మళ్ళీ పోతుంది ఈ లోకంలో. కానీ, అందాన్ని వెతుక్కుంటూ మళ్ళీ మళ్ళీ వస్తూవుంటుంది.

పక్షుల అడుగులూ, గడచిన సంవత్సరం ఎగిరిపోయిన నిమిషాల గుర్తులూ కొమ్మల్లో ఆకుల వెనకాల చూస్తే కనిపిస్తాయి.

అలసిన తన పయనంలో ఒక చెట్టునీడే తన కుటీరం; రాలిన ఒక పువ్వే తన అతిథి.

ఇది వసంతం. సంవత్సరం కనిన కలలో ఇదే మొదటిది. ఆ కలలో వేకువ జామున వచ్చిన కలలాగా - తన దేశం యొక్క శరీరం మీద తాను నడుస్తున్నాడు. అడవుల్ని కప్పుకొని, నదుల్ని తలపాగాలాగా చుట్టుకొని, రస్తాను వల్లెవాటుగా (ఉత్తరీయంగా) వేసుకొని నడుస్తున్నాడు. ఆ నడకలో ఏడుస్తున్న పొలాల్ని ఆడిస్తూ పోతున్నాడు. రూపాలకోసం ఎదురుచూస్తున్న తన దేశపు కొండల్ని సింహాలుగా, ఏనుగులుగా, ఒంటెలుగా, శ్రామికులుగా, ప్రేమికులుగా వాటి కిరీటాల్లాంటి ఇతిహాసాలుగా మలచదలుచుకున్నాడు; వాటికి మాటల్ని ఇవ్వదలుచుకున్నాడు.

సూర్యుడు కిరణాల బండ్లు తోలుకొని వస్తున్నాడు. మొదట తనను చూసి కన్నీరు కార్చిన చెట్టు ప్రస్తుతం తన కలమీద పూలవాన కురిసింది.

## సారాంశం :

కర్షక, కార్మికుల సమస్యలు విప్లవమార్గంలో పయనిస్తేనే పరిష్కరింపబడతాయని శేషేంద్ర సందేశమిచ్చారు.

## ప్రశ్నలు :

1. నా దేశం-నా ప్రజలు కవితాఖండికలో శ్రామిక, కర్షకుల ఆవేదనలను శేషేంద్రగారు ఎట్లు ప్రతిధ్వనించారు?
2. శేషేంద్ర కవితా శిల్పాన్ని మీ పాఠ్య భాగం ఆధారంగా నిరూపించండి?

రచయిత :
**ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి**
తెలుగుశాఖ
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపూర్.

## ఖండం : 3

# గద్యభాగం

**పాఠం : 1**

## స్వభాష

**- పానుగంటి లక్ష్మీనరసింహారావు**

**శీర్షికలు :**

1. రచయిత పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు వివరణలు.
5. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :** గద్యభాగంలోని మొదటి పాఠమైన 'స్వభాష' అనే వ్యాసంలో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు ఆంధ్రాభిమానాన్ని చాటి చెప్పడం, ఆంధ్ర భాషాభిమానాన్ని ప్రోత్సహించడం, మాతృభాషాభిమానం పెరగడానికి జంఘాలశాస్త్రి రూపంలో దర్శనమిచ్చి ఉపన్యాసం గావించడం కానవస్తుంది.

### 1. రచయిత పరిచయం :

'స్వభాష' అనే శీర్షికతోడి వ్యాసం 'సాక్షి' వ్యాసాలలో అరవై తొమ్మిదవ వ్యాసం. ఈ వ్యాసాల రచయిత శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు. పానుగంటివారు రత్నమాంబా, వేంకట రమణయ్యల కుమారుడు. వీరు 11.2.1865 వ తేదిన జన్మించి 1.1.1940 దాకా జీవించిన ఆయుష్మంతులు. వీరి జన్మస్థలం రాజమహేంద్రవరం సీతానగరమయినా, పిఠాపురంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. వీరు బి.ఏ. పట్టభద్రులు.

పెద్దాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా, ఒక వెలమ దొరగారి ఇంట్లో ట్యూటర్‌గా, తర్వాత లక్ష్మీనరసాపురం, ఉర్లాం, ఆనెగొంది సంస్థానాలలో దివానుగా పని చేశారు. చివరి పిఠాపురం రాజాగారి ఆస్థానంలో నాటక కవిగా కుదురుకొన్నారు.

పానుగంటి వారికి గీతకవి, ఆంధ్రా ఎడిసన్, ఆంధ్రా షేక్స్పియర్, అభినవ కాళిదాసు అనే బిరుదులు కలవు. వీరు సంస్కరణ వాదులు. సంఘంలోని అవినీతిని, మూఢ నమ్మకాలను, రచనలలో తీవ్రంగా విమర్శించిన రచయిత. ఆత్మ విమర్శ వీరి ప్రత్యేక లక్షణం. పద్యం కంటె గద్యం వీరికి ఇష్టం. ఛార్లస్ డికెన్స్, ఎడిసన్, షేక్స్పియర్ రచనలలోని హాస్యం ఒరవడిని అందుకొని రచనలు చేశారు. అయినా వీరు గ్రాంథిక భాషావాదులు.

పానుగంటి వారు రోజుకు ఒక్క గ్రంథం వ్రాయగల సమర్థులు. లభ్యమవుతున్న వీరి గ్రంథాలలో మొదటిది 'శ్రీవిష్ణు నామమాల స్తోత్రం'. తొలినాటకం 'నర్మదా పురుకుత్సీయం'. వీరి కోకిల, రాధాకృష్ణ ప్రచండ చాణక్యం, విప్రనారాయణ, బుద్ధ బోధసుధ, రాతిస్తంభం, కంఠాభరణం నాటకాలు బహుళ ప్రఖ్యాతి పొందాయి. సాక్షి సంపుటాలు ఆంధ్ర వచన సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. వీరి సాహిత్య సృష్టిని సవిమర్శకంగా పరిశీలించి పరిశోధన గ్రంథం రచించిన వారు డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రిగారు. పానుగంటి వారిని ప్రశంసించిన వారిలో శ్రీశ్రీ ప్రముఖులు. వీరి రచనలన్నిటిని పీఠికాపురాధీశ్వరులే అచ్చు వేయించారు. ఆంధ్ర జాతి గర్వించదగ్గ రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు.

**2. పాఠ్యభాగ సందర్భం :**

పానుగంటి వారి సాక్షి వ్యాసాలకు మార్గదర్శకం 'స్పెక్టేటర్.' సాక్షి వ్యాసాలు 1913-14 సంవత్సరాల మధ్య సువర్ణలేఖ వార పత్రికలోను, 1920-22, 1927, 1933 సంవత్సరాలలో ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధంలో ప్రచురింపబడ్డాయి. వీరి ప్రథమ సాక్షి వ్యాసం పేరు 'సాక్షి సంఘ నిర్మాణము.' సాక్షి వ్యాసాలకున్న ప్రశస్తి ఇతర వ్యాసాలకు ఆనాడు లేదు. పానుగంటి వారు సుమారు 148 వ్యాసాలు రచించారు. సమకాలీన అంశాలను, చతురోక్తులతో, గంభీరంగా ప్రకటించడం సాక్షి వ్యాసాల ప్రధానాంశం.

**3. పాఠ్యభాగ సారాంశం :**

'సాక్షి' అనే వ్యక్తి సంఘ స్థాపకుడు. ఈ సంఘంలో కాలాచార్యులు, జంఘాలశాస్త్రి, వాశీదాసు, బొర్రయ్యలు సభ్యులు. సాక్షి తాము ఒక సంఘాన్ని స్థాపించినట్లు చెపుతూ తమ ఆశయాలను, సంఘాన్ని నడిపే విధానాన్ని స్పష్టం చేసి 'సాక్షి సంస్థ' తరపున ఒక పత్రిక కూడా ప్రకటిస్తామని, ఆ పత్రిక పేరు 'సాక్షి' అని ప్రకటిస్తాడు. ఈ సాక్షి సభ పరీధావి సంవత్సర బహుళ చతుర్దశీ శివరాత్రి గురువారం నాడు లింగోద్భవ కాలంలో పుట్టిందని, తమది సత్యపురమని, సాక్షి స్థానం తపాలా కచేరీకి ఎదురుగా ఉందని ప్రకటిస్తాడు. ఆ సభలో అనేకాంశాలు. సంఘ దురాచారాలు, చరిత్రాది అంశాలు, రాజభక్తి, మత సంబంధ అంశాలు, ఆరోగ్య విషయాలు, నేరం, శిక్షల సహజ స్వరూప స్వభావాలు, కాలానుగుణంగా అప్పటికప్పుడు చోటు చేసుకొనే అనేక అంశాలుంటాయని సాక్షి వివరించాడు. ఈ సాక్షి సంఘ సభ్యులందరూ ప్రతి రాత్రి సమావేశమై అనేక అంశాలపై చర్చ సాగిస్తారు. ఈ సంఘంలో సభ్యులు ఐదుగురు. అయినా వారిలో జంఘాల శాస్త్రి ఉపన్యాస చతురుడు. అతని భాషా పాటవం అసమానం. అతడు ప్రతిపాదించే తీరులో నిర్భీకత ఉంది. ఎదుటి వ్యక్తిని ఆలోచింపజేసి తమవైపు త్రిప్పుకొనే నైపుణ్యం ఉంది. భాషలో వ్యంగ్యం, హాస్యం, మృదువైన మందలింపు జంఘాలశాస్త్రి ప్రత్యేకతలు.

ప్రస్తుత పాఠ్యభాగం ఆరు సంపుటాలుగా ప్రకటింపబడ్డ సాక్షి వ్యాసాలలో మూడవ సంపుటం నుండి గ్రహింపబడ్డది. ఈ వ్యాసంలో మాతృభాష ప్రాశస్త్యం మాతృభాష చదువవలసిన ఆవశ్యకత, మాతృభాషలో చక్కగా మాటలాడడం, వ్రాయడం మొదలయినవి చర్చింపబడ్డాయి. మాతృభాషను చిన్న చూపు చూచేవారు ఎంతటి విద్యాధికులయినా గౌరవనీయులు కాదని ఈ వ్యాస సారాంశం. మాతృ భాషలో చదివినవారు వృద్ధిలోకి రాగలరని ఈ వ్యాస సందేశం.

**4. కఠిన పదాలకు అర్థాలు, వివరణలు :**

**మిల్టన్:** (క్రీ.శ. 1608-1674) ఆంగ్ల సాహిత్యంలో షేక్స్పియర్ తరువాత అంతటి మహాకవి. పారడైజ్ లాస్ట్, పారడైజ్ రీ గెయిన్డ్ అనేవి ఇతని ప్రసిద్ధ రచనలు.

**బర్క్:** (క్రీ.శ. 1729-1797) ఐరిష్ దేశీయుడు. బ్రిటన్‌లో 1765 నుండి జీవితాంతం అన్ని విధాల రాజకీయ ఉద్యమాలలో ప్రముఖంగా పాల్గొన్న మేధావి. మహా వక్త.

**సిసిరో:** క్రీస్తు పూర్వం మొదటి శతాబ్దంలోని గొప్ప రోమన్ రాజకీయ వేత్త, మహా వక్త. ఆయన శైలి 'సిసిరోనియన్ రెటారిక్' అని ప్రసిద్ధం.

**డెమాస్థనీసు:** (క్రీ.పూ. 330) గ్రీకు రాజకీయవేత్త, మహా వక్త. on the crown అనే ఆయన ఉపన్యాసం సుప్రసిద్ధం. ఏథెన్స్‌లో 30 సంవత్సరాలు ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించినవారు.

**గ్లాడ్‌స్టన్:** (క్రీ.శ. 1809 - 1898) 19 వ శతాబ్దపు బ్రిటన్ రాజకీయ చతురులలో గొప్పవాడు. లిబరల్ పార్టీ నాయకుడుగా నాలుగు మార్లు ప్రధాని అయినవాడు. గొప్పవక్త. బెంజిమన్‌కు ప్రతిద్వంది.

**సి.పి.బ్రౌన్:** తెలుగు నేర్చుకొని తెలుగు భాషకు ఎంతో సేవ చేసిన పాశ్చాత్యుడు. జీవితంలో ప్రతి దమ్మిడీని, జీవిత కాలంలో ప్రతి నిమిషాన్ని తెలుగు వాఙ్మయ వికాసానికి కృషి చేసిన మహా వ్యక్తి. తెలుగు - ఆంగ్ల నిఘంటువు, ఆంగ్లం - తెలుగు నిఘంటువులే కాకుండా ఎన్నో గ్రంథాలను పరిష్కరించిన మహానుభావుడు.

**హగుంపశ్యుచిషత్:** సంధ్యావందన మంత్ర భాగంలోని పవిత్ర మంత్రం.

**ఇడియం:** జాతీయత, పలుకుబడి, నుడికారం

**ఒరిజనాలిటి:** మౌలికత

**వర్నాక్యులర్:** మాతృభాష

**అయాంబిక్ మీటర్:** ఆంగ్ల ఛంద్ రీతులలో ఒకటి. తెలుగులోని లగ వంటి గణాలతో నడిచే ఛందస్సు.

**ఇన్‌మెమోరియం:** ఇది స్మృతి కవిత. టెన్నిసన్ రచన. తన మిత్రుని మృతికి దు:ఖిస్తూ వ్రాసిన కవిత.

**క్రిమినల్ ప్రొసీజర్ కోడ్:** శిక్షా సంహిత.

**ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ:** ఆస్తి బదలాయింపు

**ఎవిడెన్స్:** సాక్ష్యాధారాలు

**గాల్ బ్లాడర్:** పిత్తాశయం తిత్తి

**లివర్:** కాలేయం

**డైజెషన్:** జీర్ణ ప్రక్రియ

**జడ్జిమెంటు:** తీర్పు

**బారిష్టరు:** న్యాయవాది

**చంద్రబుల్లి:** పాశ్చాత్య జానపద గాథలో వర్ణింపబడిన సిండరెల్లా

**కంకంటి రామాయణం:** 17 వ శతాబ్ది కవి. 'కంకంటి పాపరాజు' కృతి ఉత్తర రామాయణం.

**సీతారామాంజనేయ సంవాదం:** రచయిత పరశురామ పంతుల లింగమూర్తి. ఓరుగల్లు నివాసి.

**తారాశశాంక విజయం:** ఇది ఒక మోహ శృంగారకావ్యం. రచయిత కూచిమంచి జగ్గకవి.

| | | |
|---|---|---|
| శుద్ధశ్రోత్రియ కుటుంబం | = | స్వచ్ఛమైన వేదాలు చదివిన బ్రాహ్మణ కుటుంబం |
| నిరాఘాటంగా | = | హద్దు లేకుండా |
| నిరంకుశంగా | = | అడ్డు లేకుండా (ఏనుగును అదుపులో తెచ్చుకోవడానికి వాడే ఆయుధం. మావటీడు అంకుశంతో పొడుస్తూ ఏనుగును అదుపులో పెడతాడు.) |
| దీర్ఘ నిశ్వాసం | = | నిట్టూర్పు |
| దేహసాధన | = | శరీర వ్యాయామం. |
| ప్రతి + ఉత్తరము | = | సమాధానము |
| అసందర్భ + ఆలాపములు | = | సందర్భానికి తగని మాటలు. |
| 'హరహరా మహాదేవ శంభూ' | = | వినరాని మాటలు విన్నప్పుడు అలవోకగా శైవులు స్మరించే నామావళి. |
| మాతాపితలు | = | తల్లిదండ్రులు. |

అసువులు = ప్రాణములు.
పరమపదము = స్వర్గము
ఉన్మాదము = వెఱ్ఱి
మాణిక్యము = కెంపు
మౌక్తికములపేట = ముత్యాల దండలోని వరుస
మకరందం = పూవులలోని తేనె
ప్రణవం = ఓంకారం
ఆలాప కలాపం = మాటల సమూహం
సు+ఉక్తి. సూక్తి = చక్కని మాట.
ఆస్య గహ్వరము = గుహవంటి నోరు
ఆగమములు = సామాజిక వ్యవహారములను నిరూపించు శాస్త్రము.
వావదూకత = యుక్తాయుక్తంగా మాటలాడే నేర్పు.
కాలాంబర కవచధారి = నల్లటి వస్త్రమనే కవచం ధరించినవారు
వాక్ ధోరణీ ధీరులు = మాటల కూర్పులో ధీరులు.
కర్కశ తర్కవాక్ మోహినీకరణ దక్షులు = కఠినమయిన మాటల ప్రవాహంతో వశం చేసుకోవడంలో సమర్థులు.
ఆంధ్రదేశీయ వాయు నిరాహార పారణము = తెలుగు దేశమునకు సంబంధించిన గాలిని పీల్చినవాడు. వ్రతాంత పారణము చేసినవాడు
అవిశ్వసనీయము = నమ్మదగనిది.
శిలాక్షరము = రాతి మీది వ్రాత
అనార్యకరణము = చేయరాని పనిని చేయుట.
సచేలస్నానము = కట్టుకొన్న బట్టలతో చేసే స్నానం.
యజ్ఞోపవీత విసర్జనము = జందెమును తీసి వేయుట.
జీవప్రాయశ్చిత్తము = ప్రాణాలతో ఉండగనే పాపపరిహారానికి శిక్ష వంటి కర్మకాండ
మహా దురవస్థాగ్రగణ్యము = గొప్ప హీన స్థితిలో మొట్టమొదటిది
మహీస్థలి = భూమండలం
మకరంద బిందు బృంద నిష్యందన సుందరము = మకరందపు చుక్కల సమూహపు ప్రవాహం లాగ అందమయినది.
మహానందకందళ సందోహ సంధాన తుందిలము = గొప్ప ఆనందము యొక్క మొలకల సమూహమును కలిగించునట్టిది
క్రమత = మనోహరత్వం

| | | |
|---|---|---|
| సాబాలు | = | సగము భాగము. |
| ఉపజ్ఞ | = | ప్రజ్ఞ |
| వ్యాస పీఠ ఆధిపత్యము | = | అగ్రస్థానము |
| అస్థిగత రోగము | = | ఎముకలకు పట్టిన వ్యాధి |
| యాయవారము | = | భిక్ష. |

5. **ప్రశ్నలు - జవాబులు**

1. **జంఘాలశాస్త్రి తన ఉపన్యాసంలో ప్రస్తావించిన అంశాలను వివరించండి.**

**లేదా**

**ఎంత నేర్చినా పరాయి భాష పరాయి భాష స్వభాష కన్నా మిన్న కాదు' అనడాన్ని జంఘాల శాస్త్రి నిరూపించిన విధం విశదీకరించండి**

**లేదా**

**అధ్యక్షుని, జంఘాలశాస్త్రి అధిక్షేపించిన తీరు తెలపండి** తెలుగు రాదన్న

**లేదా**

**ఆంధ్ర భాషాభిమానం పెంచుకోవడానికి జంఘాలశాస్త్రి సూచించిన అంశాలను విపులీకరించండి.**

సాక్షి సంఘంలో జంఘాలశాస్త్రి ప్రధానమయిన వ్యక్తి. స్వభాషాభిమానం అతని ఊపిరి. ఎంత కష్టపడి నేర్చినా పరభాషలో పాండిత్యము సంపాదించలేమని అతని విశ్వాసం. పరభాష నేర్చినా స్వభాషను మరచిపోకూడదని, మరచిపోయినట్లు నటించరాదని అతని ప్రబోధం. అంతేగాక ఇప్పటికయినా స్వభాషాభిమానం పెంచుకోవాలని, పెంచుకోవడానికి సూచనలివ్వడం జంఘాలశాస్త్రి ఉపన్యాస అంశాలు.

అది ఒక పాఠశాల. ప్రముఖులు నిర్వహించే విద్యాలయం. నిర్వాహకులు ఒక సభా కార్యక్రమానికి తెలుగు మాతృభాషగా గల, న్యాయవాద వృత్తిలో రాణించిన ఒక విశిష్ట వ్యక్తిని ఆహ్వానించారు. ఆ సమావేశానికి పుర ప్రముఖులు కూడా విచ్చేశారు. వారిలో జంఘాలశాస్త్రి ఒకడు. ఆహ్వానింపబడిన వ్యక్తి అధ్యక్షస్థానం అలంకరించాడు. ఏ కార్యక్రమానికి తన్ను ఆహ్వానించారో తెలిసిన వ్యక్తి. ఎవరిని ఉద్దేశించి ప్రసంగించాలో కూడా తెలిసిన వ్యక్తి. అతడు అచ్చం ఆంధ్రుడయినా, కృష్ణానదీ తీరంలో జన్మించినవాడయినా, శుద్ధ శ్రోత్రియ కుటుంబంలో పుట్టినవాడయినా తనకు తెలుగురాదని, ఆంధ్రభాషలో ప్రసంగించలేనని, ఇష్టమయితే ఆంగ్లంలో మాట్లాడగలననే అర్థంలో సంభాషణ మొదలెట్టాడు. పావుగంట సేపు గడిచింది. పిల్లలు బిక్కుబిక్కుమంటూ భయంతో వింటున్నారు. అధ్యక్షుడు తన ప్రసంగం ఆపి చివరకు 'విల్ ఎని జంటిల్మెన్ కం ఫార్వర్డ్ టు స్పీక్' అని ప్రశ్నించాడు. ఎవరూ లేవలేదు. అపుడు జంఘాలశాస్త్రి శ్రోతలనుండి లేచి వేదికవైపు అడుగులు వేశారు. అతనిని గుర్తించినవారు జంఘాలశాస్త్రిని అభినందించారు. శాస్త్రి వేదిక నెక్కి అధ్యక్షులవారిని వ్యంగ్యంగా, అతనిలో అంతర్మథనం కలిగేలాగా, కర్తవ్యం నిశ్చయించుకొనేలాగా శ్రోతలకు కర్ణపేయంగా ఉపన్యసించాడు.

అధ్యక్షులు ఆంధ్రభాషలో మాటలాడలేననడం వింతగా ఉంది. అతడు నంగి కాదు. మూగవాడూ కాదు. ఆంధ్ర దేశంలో పుట్టినవాడు. కృష్ణా తీరంలో శ్రోత్రియుల కుటుంబంలో జన్మించినవాడు. సహజమయిన ఆంధ్ర వాతావరణంలో జీవించినవాడు. మ్యావు మ్యావు అనడం పిల్లికి ఏలాగో, కిచకిచ లాడడం కోతికి సహజమెలాగో, పుట్టగానే క్యార్:మనడం పురిటి బిడ్డకు ఏలాగో, ఆలాగే పుట్టుక నుండి తెలుగు భాషా పరిచయం ఏర్పడుతుంది. అయినా 'దేశీయుల దౌర్భాగ్యంతో' తెచ్చుకొన్న నైచ్యతతో, కులహీనతతో తెలుగు వాడనని చెప్పుకోవడానికి సిగ్గుపడడం తగదు. స్వభాషను వదలి పరభాషను, పర భాషీయుల అలవాట్లను నేర్చుకోవడం తగదు. తల్లిని పూజింపని వానికి పొరుగువాని ఆన పాటించడం సమంజసం కాదు. తండ్రిని తన్నిన తనయుడు మామగారి మొగానికి మంగళ హారతి పట్టినట్లే స్వభాషను మరచి అన్య భాషను ఆదరించడం. ఇది తగదు. పైగా అధ్యక్షులు 'బర్కు సిసిరో' 'డెమాస్థెనీసు' 'గ్లాడ్స్టన్'

లాంటి వ్యక్తుల వాదనాబలాన్ని, వైదుష్యాన్ని నమిలి, చప్పళించి, మింగిన మేటి. అంతేగాక స్వయంగా మహా వక్త. పైగా న్యాయవాద వృత్తిలో గడితేరినవారు. ఇది అశక్తత కాదు. అనిష్టత, అసహ్యత, కృత్రిమ గౌరవము నిలుపుకోవడాని కోసం ఆరాటం.

తెలుగు రానివారు తెలుగును విమర్శించడం సహజమే. కంఠాభరణంలో నవాబుగారు తెలుగు బాస వట్టి గడ్డి బాస. 'ఉస్ మే రస్ నహీ ఔర్ జీవ్ నహీ' అని ఈసడించాడు. కారణం అతనికి తెలుగు మాధుర్యం తెలియదు. మాతృభాషలో స్వారస్యముంది. వదలునకు వదలు, బిగికి బిగి, జోరుకు జోరు, వన్నెచిన్నెలున్నాయి. ఇవన్నీ సహజ సిద్ధములు. పరభాషలో పరిచయం కలిగినా ప్రావీణ్యం రాదు. మిల్టన్ వ్రాసిన ల్యాటిన్ పద్యాలను ల్యాటిన్ మాతృభాషగా కలవారు తక్కువగానే భావిస్తారు. అలాగే తెలుగుపట్ల మమకారం పెంచుకొన్న బ్రౌన్‌ను తెలుగు భాషలో పండితుడనలేము. ఎంత నేర్చినా ఆయా భాషలకున్న సహజోచ్చారణం రాదు.

తెలుగు నేర్వడం కష్టమనడం కూడా సరికాదు. ప్రయత్నమవసరం. క్రిమినల్ ప్రొసీజర్కోడ్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ, మెయిన్సు పీనల్కోడు చదవడానికి, అరిగించుకోవడానికి ప్రయత్నం, ఇష్టం ఎంత అవసరమో, ఆ ప్రయత్నంలో ఆ ఇష్టంతో తారాశశాంక విజయం, మను చరిత్రలో ఒక ఆశ్వాసం అర్థం చేసుకోగలరు. ప్రసిద్ధ న్యాయవాద గ్రంథాల పేర్లతోబాటు జనక చక్రవర్తి రాజనీతిని, కంకంటి రామాయణ ఖ్యాతిని, సీతారామాంజనేయ గ్రంథ ప్రశస్తిని అవగతం చేసుకోవచ్చు. భారత భాగవతాదులు చదువనివాడు బారిష్టరయినా వ్యర్థమే.

ఒక అంశాన్ని ఆంగ్లంలో చెప్పినప్పుడే అర్థమవుతుందనుకోవడం కూడా పొరబాటే. అలాగే ఆంగ్లం వచ్చీరానివాడు ఏది చెప్పినా అతని మాటలకు ఊ, కొట్టడం, విశ్వాసం పెంచుకోవడం ఈనాటి వారి అలవాటు, మచ్చుకకు 'కరివేపాకు పొడుముతో పథ్యము పుచ్చుకోనుమంటే' చిరాకు చెప్పిన వ్యక్తిపై అనాదర భావం. కాని ఎల్.ఎం.పి., 'కరివేపాకు' గాల్ బ్లాడర్‌కు సత్తువ నిస్తుందని, ధనియాలు డైజెషన్‌కు మంచివని, మిరియాలు లివర్ మీద 'ఆక్టు' చేస్తుందని చెబితే ఆదరము, గౌరవం కూడా. బిచ్చగాడు 'అయ్యా' అని అరవక "బాయ్, రూములో నున్న పాకెట్‌లో రైస్ యేమైన నున్నదేమో, కైన్డ్లీ గెటిట్ హియర్ థాంయూ ఇన్ ఆంటిసిపేషన్" అంటే ఏలాగుంటుందో అలాగే అర్థం లేని అవసరంలేని సంభాషణ. అంచేత సహజ పద్ధతిలో సహజంగా మాటలాడడం గౌరవప్రదం.

జంఘాలశాస్త్రి తన ఉపన్యాసంలో ఆంధ్రాభిమానం పెంచుకోవడానికి తగిన సూచనలు కూడా చేశాడు. తెలుగు బొత్తిగా రానివానితో ఆంగ్లంలో మాటలాడడం తప్పుకాదు. తెలుగువానితో తెలుగులోనే మాటలాడడం అలవరచుకోవాలి. స్నేహితులకు వ్రాసే ఉత్తరాలలో డియర్ ఫ్రెండ్, యువర్స్ ట్రూలీ లాంటివి కాక ప్రారంభంలో బ్రహ్మశ్రీ లేదా మహారాజశ్రీ అని, చివర చిత్తగింప వలయును అని ముగించడం మంచిది. తెలుగు తెలిసిన వారికి తెలుగులోనే ఉత్తరం వ్రాయాలి. స్వభాషా పత్రికల్ని చదవడం, ప్రత్యేకించి ఇంటిల్లిపాది సమక్షంలో చదవడం కుటుంబీకులలో స్వభాషాభిమానం పెంచుతుంది. స్వభాషా పత్రికల్ని చదవకుండా పారవేయడం తగదు. కొత్తగా వస్తున్న ఆంధ్ర గ్రంథాలను విమర్శనా బుద్ధితో చదవడం నేర్చుకోవాలి. తొందరపడి ఎవరిని గాని ఏ పుస్తకాన్ని గాని విమర్శించకూడదు. శని, ఆది వారాలలో రాత్రివేళ తప్పక రెండుగంటలు పురాణ పఠన కాలక్షేపం చేయడం మంచిది. ఆంగ్ల గ్రంథాలు చదివేవేళ స్వభాషకు పనికివచ్చే అంశాలున్నాయో లేదో అని తర్కించి పనికివచ్చే అంశాలను పదిలపరచుకోవాలి. ఈ నియమాలు పాటిస్తే పుట్టుకతో మాత్రమే కాదు బుద్ధి చేత, స్వభావం చేత, యోగ్యత చేత, అచ్చమయిన ఆంధ్రులని అనిపించుకోవచ్చు.

**2. పానుగంటివారు నిరూపించిన స్వభాష - పర భాషల తారతమ్యాలను తెలుగు భాష ప్రశస్తిని వివరించండి.**

పానుగంటివారు సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలలో పండితులు. కవితా రంగంలోను, నాటక రచనలోను సిద్ధహస్తులు. వచన రచనలో కొత్త పుంతలు తొక్కినవారు. వారి సాక్షి వ్యాసాలు వ్యంగ్యవిలసితములు. సంఘ సంస్కరణాత్మకములు. వారు స్వభాష అనే వ్యాసంలో స్వభాష - పరభాషల తారతమ్యం నిరూపించారు.

స్వభాష అంటే తన భాష. పుట్టుకతో అలవడే భాష. తల్లి గర్భమునుండి శరీరంలో అణువణువున జీర్ణించిన భాష. మ్యావు మనని పిల్లి, కిచకిచలాడని కోతి, ఈతరాని కప్ప కనిపించవు. అలాగే మాతృ భాషరాని మానవుడు ఉండడు. సులభంగా నేర్చుకోగల భాష

మాతృభాష. ఈ భాష నేర్చుకోవడానికి పరిసరం తోడ్పడుతుంది. కొస్త పట్టుదలతో నేర్చుకొంటే ప్రావీణ్యం సాధించుకోవడానికి వీలయిన భాష. మాతృభాష నేర్చినవాడు తన వారికి, తన చుట్టు పక్కల ఉన్నవారికి సేవ చేయగలడు.

పరభాష అంటే తనది కాని భాష, ఇతరుల భాష. పానుగంటివారి దృష్టిలో ఆంగ్ల భాష. పరభాష నేర్చుకోవడంలో శ్రమ ఉన్నది. పరభాషలోని నుడి కారములు, జీవం, తత్త్వం, శక్తి ఉచ్చారణా విధానం ఇతరులకు పట్టుపడడం కష్టం. భాష నేర్చినవాడంటే నడికారాదులు తెలిసినవాడని భావం. ఇవి తెలియనివారు భాష నేర్చుకొన్న వారుగా పరిగణింపబడరు.

మిల్టన్ మహాకవి. కాని అతనికి 'లాటిన్' పరభాష. స్వభాషలోని సౌందర్యాన్ని ఆ భాషలో సాధించలేకపోయాడు. అలాగే ఆంగ్లాది భాషలలో అనర్గళంగా ఉపన్యాసాలిచ్చేవారుండవచ్చును. వేల కొలది పుటల పుస్తకాలు వ్రాసి వుండవచ్చును. కాని ఆ భాషలో సహజంగా వ్రాసినవారి వ్రాతలకు ఇవి సరిపోవు. పరభాషలను నేర్వడంవల్ల పరభాషలలోని విశేషాంశములను గుర్తించడంవల్ల మన భాషలను సంపద్యుక్తం చేయడానికి వీలుంది. పరభాషలో రచనలు చేసి పేరు సంపాదించుకోవాలని పాటుపడేవారు పదునారో వంతు శ్రమతో స్వభాషలో రచనలు చేయవచ్చు. ప్రఖ్యాతి పొందవచ్చు.

పానుగంటివారు ఆంధ్ర భాషాభిమానులు. 'కంఠాభరణ' మనే నాటకంలో ఒక నవాబు 'తెలుగు బాస గడ్డి బాస' అన్నాడు. 'ఉస్ మే రస్ నహీఁ ఔర్ జీవ్ నహీఁ' అన్నాడు. మాతృ భాషాభిమానంతో ఆ నవాబు తెలుగును ఈసడించి వుండవచ్చు. కాని తెలుగు మాటలాడ నేర్వగలిగిన వారు, పుట్టుకతో తెలుగువారు తెలుగును ఈసడించడం తగదు. తెలుగు మకరంద బిందువుల లాంటిది. ఎంతో తీయనిది. తెలుగు వింటుంటే పులకాంకురములు పొడసూపుటలో వింత లేదు. ఆహ్లాదకరమయినది తెలుగు. కమ్మదనం కలది తెలుగు. భాషలో కఠినత్వంతో బాటు మృదుత్వమున్నది. వేగంతోబాటు మందత ఉంది. మాటల తీరులో పలుకుబడిలో అందమున్నది. తెలుగు ఠీవి, విలాసం, జిలుగు ఇతర భాషలకు లేదు. వ్యాస రచనకు అనుకూలమైనది. ఉపన్యాసానికి అనువయినది, కవిత్వానికి తగినది, పాటకు సంగీతానికి ఒదిగినది తెలుగు. ఎందరో మహనీయులు తెలుగుదేశంలో పుట్టి తెలుగు దేశపు గాలిపీల్చి తెలుగు సంస్కృతిలో భాగమై తెలుగులో ఉత్తమ గ్రంథాలు రచించారు. తెలుగుతల్లికి అనేక ప్రక్రియలలో అలంకారాలు కూర్చారు. ప్రత్యేకించి పాశ్చాత్యులు తెలుగును అభిమానించి తెలుగు వాఙ్మయ వికాసానికి సహకరించారు. ప్రత్యేకించి ఈ రంగంలో కృషి చేసిన 'చార్లెస్ ఫిలిప్ బ్రౌన్' సేవ మరువరానిది. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అనే ప్రశస్తి ఆనాటిదే కాదు, ఈ నాటిది కూడా, అందువల్ల ఆంధ్ర భాషా నిరసనమూ పనికిరాదు.

**3. పానుగంటివారు 'ఆంధ్ర భాషానిరసనం' గురించి విశదీకరించిన అంశాలను తెలపండి.**

భాషాభిమానమన్నది ఒక వరమే. అది శాపం కాదు. కాని కొందరు పరభాషా వ్యామోహంతో స్వభాషను కించపరచడమో లేదా స్వభాష తెలియని వారిలాగా మాటలాడడమో చేస్తుంటారు. ఇది అనుచితం. ఆంగ్లంలో మాటలాడడం, వ్రాయడం కృత్రిమంగా ఉన్నా మానడంలేదు. ఇతరులు ఆంగ్లంలో ఉపన్యసిస్తే గౌరవిస్తారు. తెలుగు తెలిసిన వారయినా ఆంగ్లంలోనే ఉపన్యాసాలు కొనసాగిస్తుంటారు.

ఆంధ్ర బాలక సంబంధమయిన ఒక సభలో న్యాయవాద వృత్తి చేపట్టిన యువకుడు 'నాకు ఆంధ్రభాష రాదు. నేను ఆంధ్రమున మాటలాడలేను. మీ యిష్టమగునెడల ఆంగ్లేయ భాషలో మాటలాడుదును అనే అర్థం వచ్చేలాగున ఆంగ్లేయ భాషలో మాట్లాడినాడు. చివరకు 'విల్ ఎని జంటిల్మెన్ కం ఫార్వర్డు టు స్పీక్' అని ఆంగ్లంలోనే అభ్యర్థించినాడు. ఇది దేశీయ దౌర్భాగ్యం.

ఆంగ్ల గ్రంథములర్థము చేసుకొనుట కష్టము. కాని తెలుగు గ్రంథములర్థము చేసుకొనుట సులభం. ట్రాన్స్ఫర్ ఆఫ్ ప్రాపర్టీ వల్లె -వేసిన వారికి 'తారాశశాంక విజయము' సులభ గ్రాహ్యము. 'మెయిన్సు పీనల్కోడ్' చదువుకోవడానికి ఓపిక ఉన్న వ్యక్తికి మను చరిత్రంలోని ఒక్క ఆశ్వాసం చదవడం కష్టం కాదు. కన్నింగ్హామ్సు ఎవిడెన్సు ఆక్టువల్ల కలిగే ఆనందం కన్న కంకంటి రామాయణం చదవడం వల్ల కలిగే ఆనందం ఎక్కువ. జస్టిస్ హాలోవే జడ్జిమెంట్ చెప్పగలవారు జనక చక్రవర్తి ప్రవచించిన నీతి తెలియదనడం వింత. 'సివిల్ ప్రొసీజర్కోడు లేటెస్టు ఎడిషన్' కు కర్త ఎవడో తెలుసుకొన్న వ్యక్తికి 'సీతారామాంజనేయం' రచయిత తెలియదనడం, తెలుసుకోక పోవడం వింతలో వింత. ఆంధ్రదేశంలో పుట్టినవారు ప్రసిద్ధ ఆంధ్ర గ్రంథాలను, ప్రచారంలోని ఆంధ్ర సాహిత్యాన్ని అవగతం చేసుకోవడం అవసరం.

ఆంగ్లంలో ప్రకటించడం 'ఆంధ్రభాషా నిరసనం' లోని భాగమే.

తెలుగులో బాగా ప్రచారంలో ఉన్న పదాలను, భావాలను కూడా ఆంగ్లంలో ప్రకటించడం 'ఆంధ్రభాషా నిరసనం' లోని భాగమే. కరివేపాకు 'గాల్ బ్లాడర్' కు సత్తువ ఇచ్చును లాంటివి. ధనియాలు 'డైజషన్'కు మంచివి. మిరియాలు 'లివర్' మీద 'ఆక్టు' చేయును. కరివేపాకు 'గాల్ బ్లాడర్' కు సత్తువ ఇచ్చును లాంటివి. అలాగే ఎదుటివాడు ఆంగ్ల పదాలను ప్రయోగించే వేళ సహజంగా 'అసహనం' కలగడం సబబే. ఒక ముష్టివాడు 'బాయ్, రూములోనున్న పాట్‌లో రైస్ యేమైన నున్నదేమో, కైన్డ్లీ గెటిట్ హియర్ థాంకు యూ ఇన్ ఆంటిసిపేషన్' అంటే ఎంత అసహనం కలుగుతుందో వినే వారికే ఎరుక.

మెహర్బానీలకు పోకుండా తెలుగుదనానికి జోహారు లర్పించడం అవసరం. బ్రహ్మశ్రీతోనే మహారాజశ్రీతోనే ఆరంభించి చిత్తగించవలయునుతో పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికిని, డియర్ ఫ్రెండ్‌తో మొదలెట్టి యువర్సు ట్రూలీతో పూర్తి చేయడం ఆంధ్రభాషా నిరసనంలో ఒక భాగమే. అలాగే తెలుగు పత్రికల స్థాయి తక్కువని తిరస్కరించడం, ఆంగ్ల పత్రికలను అభిమానించడం తగదు.

సి.పి. బ్రౌన్ లాంటి వారు ఆంధ్రభాషాభిమానం పెంచుకొని తెలుగుకు ఎంతో సేవ చేశారు. ప్రాచీన గ్రంథాలు పరిష్కరించారు. నిఘంటువుల్ని కూర్చారు. పండితుల చేత వ్యాఖ్యానాలు వ్రాయించారు. తెలుగు నేర్చుకొని తెలుగులో రచనలు చేశారు. అందుచేత 'ఆంధ్రభాషా నిరసనం' తగదని శ్రీ పానుగంటి వారి అభిప్రాయం. వారి వాదనలో వ్యంగ్యమున్నా సత్యమున్నది. కాఠిన్యమున్నా విషయ మృదుత్వమున్నది. ఆంగ్లంపై అధికారమున్నా ఆంధ్రభాషను ప్రేమించడం, ఇతరులు ఆ బాటలో నడవాలని ఆకాంక్షించడం సాక్షి ప్రత్యేకాంశాలు.

**సారాంశం:**

ఆంధ్రాభిమానం, జాతీయాభిమానం రేకెత్తింపజేసే ఈ పాఠంలో సాక్షి వ్యాసాల పుట్టుక మాతృభాష ప్రాశస్త్యం, మాతృభాషలో చదివినవారు వృద్ధిలోకి రాగలరనే ఆకాంక్ష ఈ పాఠంలో వ్యక్తమైంది.

**ప్రశ్నలు:**

1. సభాధ్యక్షుని పరభాషా వ్యామోహమును జంఘాల శాస్త్రి విమర్శించిన విధము
2. స్వభాష నేర్చుకొనుటకై చేయవలసిన కృషి ఎట్టిది?
3. మాతృభాషాభిమానం పెరుగుటకు పానుగంటివారు చేసిన సూచనలను వివరించండి.
4. జంఘాల శాస్త్రి బాలురకు ఇచ్చిన సందేశమేమి?
5. ఆంధ్ర భాషా సౌందర్యాన్ని స్వభాష ఆధారంగా పేర్కొనండి.

రచయిత
ఆచార్య కె. సర్వోత్తమరావు
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

# ఖండం : 3

## గద్యభాగం

## పాఠం : 2 రాయల నాటి రసికత

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శీర్షికలు : 1. రచయిత పరిచయం

2. పాఠ్యభాగ సందర్భం

3. పాఠ్యభాగ సారాంశం

3. కఠిన పదాలకు అర్థాలు

4. పాఠ్యభాగంలోని పద్యాల భావార్థ వివరణలు

5. ప్రశ్నలు - సమాధానాలు

లక్ష్యం : గద్యభాగంలోని రెండవ పాఠమైన ' రాయలనాటి రసికత' అనే వ్యాసంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఆముక్తమాల్యద మొదలైన ప్రబంధాలనాధారంగా చేసికొని రాయల కాలంనాటి జన జీవితాన్ని సాక్షాత్కరింపజేసే ప్రయత్నం కానవస్తుంది.

### 1. రచయిత పరిచయం

'రాయల నాటి రసికత' అనే వ్యాసం రచించినవారు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. శ్రీ శర్మగారి తల్లిదండ్రులు అలివేలు మంగమ్మ, కర్ణమడకల కృష్ణమాచార్యులు. దత్తత తండ్రి అనంతాచార్యులు. జన్మస్థలం అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గము తాలూకా రాళ్ళపల్లి గ్రామం. 23 - 01 - 1893 నుండి 11 - 03 - 1979 వరకు జీవించారు.

1912 వ సంవత్సరం నుండి 1949 వ సంవత్సరం దాకా మైసూరు మహారాజా వారి కళాశాలలో తెలుగు పండితులుగా పని చేశారు. తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాచ్యపరిశోధన సంస్థలో తాళ్ళపాక సంకీర్తనల పరిష్కరణ బాధ్యతను 1957 దాకా నిర్వహించారు.

సంస్కృతంలో స్పర్ధాకావ్యమ్, మహీశూర రాజ్యాభ్యుదయ దర్శనమ్, కన్నడంలో జీవనమత్తుకలె, తెలుగులో తారాదేవి అనే ఖండ కావ్యాల్ని రచించారు. శాలివాహన గాథాసప్తశతిని అనువదించారు. సుందర పాండ్యుని ' ఆర్యలను' తెనిగించారు. వీరి విమర్శనా పటిమకు వేమన, నాటకోపన్యాసములు, సారస్వతోపన్యాసములు సారస్వతాలోకము సాక్ష్యాలు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి బహుమానంతోబాటు గానకళాప్రపూర్ణ, గానకళాసింధు, కేంద్ర సంగీత నాటక అకాడమి ఫెలోషిప్‌లు శర్మ వైదుష్యానికి గీటురాళ్ళు.

సంగీత సాహిత్యాలలో సమధిక ప్రావీణ్యం గతించి సారస్వత విమర్శనలో ఉత్తమ ప్రమాణాలు చూపిన రచయిత శర్మగారు. అన్నమాచార్య కీర్తనల పరిష్కరణ బాధ్యత వహించి ఎన్నో కీర్తనలకు స్వరకల్పన చేశారు. సుస్మిత హాస్యం, సునిశిత పరిశీలన వీరి ప్రత్యేకత. వ్యావహారికానికి దగ్గరగా వచనం వ్రాయడం, అల్పాక్షరాలతో అనల్పమైన అర్థాన్ని ఇమడ్చటం వీరి వచనగుణాలు. వీరిని అభినందిస్తూ 'అనంతరాగం' పేరుతో ఒక అభినందన సంచిక కూడా వెలువడింది. కట్టమంచి రామలింగారెడ్డి గారికి గౌరవప్రాతులయిన పండితవరేణ్యులు. చిలుకూరి నారాయణరావుగారు మెచ్చుకొన్న 'కీర్తనీయ చరితులు'

బొలసినని యెట్టినరునైన గులముఁదెలియఁ
బ్రభుత సెడి పల్లవుఁడు వేదవడిన నేద
నృపతి వెలియ తిపురముగా నెన్న మెలగ
బాసఁ గృతి సెప్ప వలఁతు లప్పద్మముఖులు 1-60

విలుబుత్తూరులోని పద్మముఖులు సామాన్యులు కారు. జాణలు. సుందరులు. సొగసులు తెలిసినవారు. వారు తాంబూల ప్రియులు. తాంబూలం నమలినందువల్ల పండ్లు కూడా ఎరుపెక్కాయి. ఒక వరిగింజతో ఆ ఎరుపు పోయే విధంగా తోము కొనగలిగిన సొగసుకత్తెలు. ఆ ఆటకత్తెలు పసుపుతో జలకమాడేవారు. తదనంతరం పరిశుద్ధ వస్త్రం దాల్చేవారు. ఆ వస్త్రాలు వారి దేహాన్ని ఆచ్ఛాదింపజేసినా పసుపు డాలు కనిపిస్తూనే ఉండేది. దేహకాంతి, వస్త్ర కాంతి, లేపన కాంతులన్నీ విలాస ప్రదమని భావం. పలుచగా పయ్యెదలోని స్తనాలకు పరిమళ ద్రవ్య మిశ్రిత చందన మలదుకొనేవారు. వారి ఇండ్లు రాణివాసాల లాంటివి. అక్కడ భోగాలకు కొదువలేదు. కులము, ఐశ్వర్యము చెడగా విటుడు పేద వాడయినను పోషించుటకు సమర్థలు వారు. దేశ భాషలయందు కావ్యము సెప్ప గల నేర్పరులు.

9. చెడుగు దాన! కాళ్ళ ఁబడినాఁడు నీపతి
నింకనైన లేవ నెత్తవేల?
వలపు లెంత గట్టి వా టినవయ్యును
ఇదియె వినుము వాని కెల్ల మేర
శాలి వాహన గాథాసప్తసతి 4-90

ఓ దుష్టురాల! నీ మగడు తన తప్పిదం తెలుసుకొన్నాడు. నీపట్ల అతని కున్న అనురాగం నీకు తెలియనిది కాదు. కాళ్ళబడి క్షమాభిక్ష అడుగుతున్నా నిర్లక్ష్యంతో నీవు లేవనెత్తకుండడం సబబు కాదు. వలపులకు, వలపు సొలపులకు మేర ఉంది. ఆ మేర దాటడం తగదు. 'దాసరి తప్పు దండంతో సరి' అన్నట్లు కాళ్ళ పడ్డాక ఇతరాంశాలు పట్టించుకోవడం ఏమాత్రము తగదు. ఒక చెలికత్తె తన నాయికను మందలించడం ఈ పద్యంలోని ముఖ్యార్థం. గాథా సప్తసతి ఆంధ్రుల జీవన విధానానికి దర్పణం.

## 6. ప్రశ్నలు - జవాబులు

1. రాయల నాటి రసికతను వివరించండి

లేదా

రాయల కాలము నాటి ప్రజల ప్రవృత్తి, నివృత్తి, భోగానురక్తిని వివరించండి.

'రాయల నాటి రసికత' అనే వ్యాసం వ్రాసినవారు శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో వెలువడ్డ ఆముక్తమాల్యద. పారిజాతాపహరణము, మనుచరిత్ర గ్రంథాల ఆధారంగా శ్రీశర్మగారు 'రాయల నాటి రసికతను' విశదీకరించారు. సాహిత్య జీవులకు సత్యాసత్యముల పట్ల గౌరవముంది. కవులు జీవించిన సంఘము సత్యము. సంఘజీవి అయిన కవి అసత్యం మాత్రం చెప్పడం ప్రధాన ధ్యేయంగా భావించడు. అందుచేత ఈ కావ్యాల ఆధారంగా 'రసికతను' చెప్పడం నేల విడిచిన సాము కాదు.

రసికుడంటే భోగి. భోగాదులు అనుభవించే వాడు భోగి. రాయల కాలము నాటికి ఇహభోగాదులు ఎనిమిది, వాటినే అష్టభోగాలంటారు. ఇల్లు, వస్త్రం, ఆభరణం, గంధం, పుష్పం, తాంబూలం, శయ్య, స్త్రీ అనేవి అష్ట భోగాలు. వీటితో అన్నం, పానం, స్నానం కలుపుకొంటే భోగాలు పదకొండు. అయితే ఇవన్నీ ప్రవృత్తి భోగాలు. రాయల కాలంలోని ప్రజలకు ప్రవృత్తి భోగాల పట్ల రాసిక్యం ఉన్నా నివృత్తి భోగాల పట్ల గౌరము ఉంది. అదే వారి ధ్యేయం.

గృహభోగం:- రాయల కాలంనాటి గ్రంథాలలో రాజ గృహాలు, సామాన్యుల గృహాల వర్ణనలున్నాయి. అరుణాస్పదం, ద్వారక, మధురలలో రాజగృహాలు, శ్రీవిల్లి పుత్తూరులో వైష్ణవుల గృహాల వర్ణనలు కనిపిస్తాయి. రాజగృహాలు ఊహాతీతంగా కనిపించడం ఒక ప్రత్యేకత. రత్నాల గోడలు, వజ్రాల స్థంభాలు, అన్ని కాలాలకు తగినట్లుండడం గృహనిర్మాణము యొక్క ప్రత్యేకత అయితే గోడలపై చిత్తరువులు, చంద్రశాలలు, కలశములు, ధ్వజములు, చుట్టూ తోటలో నీటిని వెదజల్లే యంత్రాలు మొదలయినవి ఆనాటికి ఊహాతీత అంశాలే. పూలతోట, అందులో చెంగలువల కొలను, వీలుబట్టి క్రీడా పర్వతం, ఇంట్లో చిలుకలకు బంగారు పంజరాలు, నెమళ్ళకు యష్టి అనే పేరుతో ఏర్పాటు చేసిన కూటములు ఉండడం ఒక విశేషం. చిలుకలకు మాటలు నేర్పడం, నెమళ్ళకు నాట్యం నేర్పడం ఆనాటి మహిళామణుల వినోదాలు. అన్నిటికంటె 'కోప గృహ' నిర్మాణం విశేషం. యజమానురాలికి కోపం హద్దు మీరినవేళ అలక ప్రదర్శించే గృహం.

వస్త్ర భోగం : రాయల కాలంనాటి జనులకు వన్నెల వస్త్రం ఇష్టం. తెల్లని వస్త్రాలు పురుషులు ఇష్టపడేవారు. కాని స్త్రీలు ఇష్టపడేవారుకారు. కాని సత్యభామ కోపం వచ్చినపుడు 'తెల్లచీర ' కట్టింది. చెంగావి వస్త్రాలు ప్రత్యేకించి బంగారపు అంచులవి ఆనాటి వస్త్రాలు. ప్రవరుడు నీర్కావి పింజ ధోవతి కట్టినా అరుణాంశుకోత్తరీయంతో దర్శనమివ్వడం ప్రత్యేకత. మువ్వన్నె చుంగులు కొందరి కిష్టమయితే, ఊదిన‹ బాఉ వస్త్రాలు కొందరివి.

ఆభరణ భోగం : రాయల కాలం నాటి స్త్రీ పురుషులకు ఆభరణాల మోజు సమానం. స్త్రీలకు లాగే మగవారికి వారాల సొమ్ములు నియమం. ప్రత్యేకించి హారాలు, భుజకీర్తులు, ఉంగరాలు, ఒడ్డాణం, కాళ్ళు చేతులకు కడియాలు, చెవులకు కుండలాలు, శిరోమణి ఆడ మగ వారికి సమానమే. కాకపోతే మగవారికి కిరీటం, ఆడవారికి ముక్కెర ప్రత్యేక అలంకరణలు.

గంధ పుష్ప సుగంధాల భోగం : రాయల కాలం నాటి రాసిక్య జీవనంలో గంధపుష్ప సుగంధాలకు ప్రత్యేక స్థానముంది. ఇతర దేశాలనుండి సుగంధ ద్రవ్యాలు దిగుమతి చేసుకోవడానికి ప్రత్యేక వ్యవస్థ ఉండేది. రాజధానులలో సుగంధాలకు ఒక పెద్ద భాండాగారం ఉండేది. వీథులలో గంధపునీళ్ళు చల్లడం, కస్తూరి, పునుగు, జవ్వాజి. పచ్చ కర్పూరం, కుంకుమ పూవు, అగరు, పన్నీరు వాడడం సహజంగా ఉండేది. మనుచరిత్రలోని 'సద్యోవినిర్భిన్న' పద్యం పై వాదానికి బలం చేకూరుస్తుంది. సుగంధద్రవ్యాలను పరస్పరం కలిపి తయారు చేసుకొనే 'కలపములు' కూడా ఆనాడు ఎక్కువే.

భారతీయ నాగరికత 'పూల వాగరికత' : ఉద్యానవనంలో రకరకాల పూల తీగలు పెంచడం. చిత్రవిచిత్ర హారాలుగా తయారు చేసి మెడలో ధరించడం, తలలో ముడుచుకోవడం ఆనాటి అలంకరణ విశేషం కూడా. ఇంటి ముందర ఉదయం, అస్తమానం పూలు చల్లడం, తోరణాలుగా వేలాడదీయడం కూడా ఉంది. చెండ్లు చేసి సరసక్రీడలాడడం ఆనాటి వారి వినోదం. పూల పాన్పులు, విసన కర్రలుగా పూలు ఆనాటి ప్రజల రసికతకు చిహ్నాలు.

తాంబూల భోగం : అజీర్ణం పోగొట్టే ఔషధం తాంబూలం. బ్రహ్మచారి, వితంతువు, సన్యాసి తప్ప మిగతావాళ్ళు సేవించేవారు. తాంబూలంలో సుగంధ ద్రవ్యాలు తప్పనిసరి. ఇంటికి వచ్చినవారికి తాంబూలం ఇవ్వడం ఆచారం. 'రమణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము' కోరుకొన్నవాడు అల్లసానిపెద్దన. అంతే కాదు తాంబూల వాసన పసిగట్టి ప్రవరుడు తచ్చాడుతూ వరూధిని ఉన్న ప్రదేశం చేరుకొన్నాడు.

వనితా భోగం : రాయల కాలము నాటి రసికతలో ప్రధానాంశంగా వనితా భోగం కనిపిస్తుంది. స్త్రీని భోగవస్తువుగా భావించడం, అలాగే పురుషులను ఆకర్షించడం, విరివిగా కనిపిస్తుంది. బహుభార్యా లోలత్వం రసిక చిహ్నంగా నిలిచింది. మనుచరిత్ర, ఆముక్తమాల్యదలలో వేశ్యల విలాసాలు వర్ణితం.

ఇక రాళ్ళపల్లి వారు అష్టభోగాలతో చేర్చిన అన్న, పాన, స్నాన భోగాదులను కూడా చర్చించడం సమంజసం.

అన్న పాన భోగాలు : రాయల కాలం నాటి వారికి అన్న పానీయాలపై ఉన్న అనురక్తి అతివేలం. అమృతం తాగి ఆకలిదప్పులు లేని దేవతలకు కూడా నాలుకకు పట్టిన తుప్పు పోయే విందులు కావాలట. ఆయా ఋతువులకు తగిన అన్న పానీయ సేవనం ఈనాటి వారికి

రాయల కాలం వారు జాగరూకులు. పరిపాలకుల ఔన్నత్యం బేరీజు చేసుకోగల సమర్థులు. గూఢచారులున్నారని తెలిసినా వానవెలిసే దాకా ఒక చోట ఆగిన దాగినవారు అశ్వపతి, గజపతి, నరపతులలోఎవరు బలవంతులో చర్చించేవారని రాయలు ఆముక్తమాల్యదలో ఉటంకించినాడు. భయమున్నా కొన్ని విషయాలలో నిర్భయత్వం వారి సొత్తు. ఈ విధానం నేడు కానరాదు.

రాయల కాలంలో కలవారి యిండ్లలో కోపగృహాలు ఉండేవి. కోపగించిన యాజమానురాలిని అనునయించడానికి యజమానులు ఆ గృహాల వైపు నడక సాగించడం సహజం. ఈ అంశం ప్రస్తావిస్తూ రాళ్లపల్లి వారు 'ఏ బుద్ధిమంతుడు దీనిని కల్పించెనో కాని యిది చాలా మంచి పద్ధతి. తక్కినవారు తమ తమ పనులు తకరారు లేకుండ చేసుకోవచ్చును', అని మెచ్చుకొన్నారు.

శర్మగారు ప్రశంసించిన మరో అంశం ఆనాటి వారి కేశసంపద. సాంద్రకేశ సంపదను అలంకారంగా భావించినవారు రాయల నాటి రసికులు. తలవెండ్రుకల సొంపును సొగసును గుర్తించి సంతసించిన వారిలో పెద్దన ఒకడు. కాని నేడు వెంట్రుకలు అలంకారం కాదు. వికారమనే భావన కూడా ఉంది. పైగా పాశ్చాత్య నాగరికతా వాసనల ప్రభావంతో స్త్రీలు కూడా తల కత్తరించుకోవడాన్ని నాగరికతగా భావిస్తున్నారని శర్మగారు నొచ్చుకొన్నారు.

శర్మగారు తన ఆవేదనను ప్రకటించుకొన్న మరొక అంశం. ముతక ఖద్దరు ధారణ. రాయల కాలంలో పురుషులు తెల్ల వస్త్రాలను అపురూపంగా ధరించేవారు. గంధర్వుడు నీర్కావిపింజెధోవతి గట్టిన వ్యక్తి. పాము పొరల లాంటి వస్త్రాలు కూడా లేక పోలేదు. ఈ అంశాలను ప్రస్తావిస్తూ రాళ్ళపల్లి వారు 'ఆ కాలమున నట్టి నూలు, అట్టి నేత సాధ్యములైనవి. ఇప్పటి ఖద్దరు ధారులనేకులు తాము కట్టుకొను వస్త్రము లెంత ముతకగానున్న నంత దేశాభిమాన మెక్కువ చూపినట్లు, స్వరాజ్యమున కంత దగ్గర బోయినట్లు భావించెదరు' అని విసురు ప్రదర్శించారు. అలాగే సర్జునూటులు, ఇస్త్రీ చెడని వస్త్రధారణం లాంటివి ఇతరుల మెప్పు కోసం ధరిస్తున్నారని భావించారు.

రాళ్ళపల్లి వారు ప్రస్తావించిన ఇంకొక అంశం ఆనాటి వారికి నగల మీదున్న ప్రీతి. సమానములైన అభరణముల ఆశ వలన సంసారంలో శాంతి. కాని నేడు నగల మీద ఆశ మగవారికి చాలా వరకు తగ్గింది. దీని వల్ల ఆర్జించే శ్రమ ఒకరికి, అలంకారం ఒకరికి అనే భావం ఏర్పడింది. నగల సమానత్వం నశించి మగవారి గుండీలు, గడియారం, గొలుసులు, ఉంగరాల సొగసులలో రూపపరివర్తనం చెందిందని శర్మగారన్నారు.

శర్మగారు ఘాటుగా విమర్శించిన మరొక అంశం నేటి వారికున్న సుగంధ ద్రవ్యాల ప్రీతి. రాయల నాటి వారికి సుగంధ ద్రవ్య సేవనం, తపనం ఎక్కువ. కాని ఈ భావం నేడు లేదు, దిగుమతి చేసుకున్న సెంటులో సారాయి కంపు తప్ప మరేమీ లేదు. ఒక వేళ ఆశపడినా స్వతంత్రంగా పూసుకొను ధైర్యము లేదు. వస్త్రధారణలోని మార్పు కూడా దీనికి కారణం. అలాగే 'పూల పెంపకం' లో కూడా "నిర్గంధకుసుమాలకే అగ్ర తాంబూలం" అని శర్మగారు ఆవేదన పడ్డారు.

'రాయల నాటి రసికత' పాఠంలో ప్రస్తావించిన మరో అంశం నాటి, నేటి కాలం వారి 'ఆహార' విషయం. శర్మగారు నాగరిక అనాగరికుల భోజనాదుల్ని, శాఖాహార మాంసాహార రకాల్ని, ఆయా ఋతువులలో ఆరగించే పానీయాలను పేర్కొంటూ అన్ని కాలములందును ఒకటే విధముగా అత్యాహారమో అల్పాహారమో చేసి అజీర్ణ రోగములను వరమడిగి తెచ్చుకొన్నవారము మనము' అని అంచనా వేశారు.

'తాంబూల' సేవనంలో కూడా ఔషధ ప్రయోజనం ఉన్నది. కాని తాంబూలంలోని పరిమళ ద్రవ్యాలను వదలి పెట్టి 'పొగాకు' చేర్చడం నేటి వారికి అలవాటయింది.

చివరగా శర్మగారు ప్రస్తావించిన అంశం రాయల కాలం నాటి భోగతృష్ణ. ఎన్నిటినో సమర్థించిన శర్మగారు ఈ అంశములో మాత్రం కుండ బద్దలు కొట్టినట్లుగా 'రాయల కాలపు వారి యీ భోగతృష్ణను మనదానితో పోల్చికొని చూచిన మనము వారికన్న నెంతో మేలుగా నున్నామనిపించును' అన్నారు. స్త్రీల పట్ల మగవారి అభిప్రాయాలు మారడం 'శ్లాఘ్యవిషయం' అన్నారు.

ఖండం : 3

# గద్యభాగం

## పాఠం : 2 రాయల నాటి రసికత

- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శీర్షికలు : 1. రచయిత పరిచయం

2. పాఠ్యభాగ సందర్భం

3. పాఠ్యభాగ సారాంశం

3. కఠిన పదాలకు అర్థాలు

4. పాఠ్యభాగంలోని పద్యాల భావార్థ వివరణలు

5. ప్రశ్నలు - సమాధానాలు

లక్ష్యం : గద్యభాగంలోని రెండవ పాఠమైన ' రాయలనాటి రసికత' అనే వ్యాసంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఆముక్తమాల్యద మొదలైన ప్రబంధాలనాధారంగా చేసికొని రాయల కాలంనాటి జన జీవితాన్ని సాక్షాత్కరింపజేసే ప్రయత్నం కానవస్తుంది.

## 1. రచయిత పరిచయం

'రాయల నాటి రసికత' అనే వ్యాసం రచించినవారు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. శ్రీ శర్మగారి తల్లిదండ్రులు అలివేలు మంగమ్మ, కర్ణమడకల కృష్ణమాచార్యులు. దత్తత తండ్రి అనంతాచార్యులు. జన్మస్థలం అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గము తాలూకా రాళ్ళపల్లి గ్రామం. 23 - 01 - 1893 నుండి 11 - 03 - 1979 వరకు జీవించారు.

1912 వ సంవత్సరం నుండి 1949 వ సంవత్సరం దాకా మైసూరు మహారాజా వారి కళాశాలలో తెలుగు పండితులుగా పని చేశారు. తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాచ్యపరిశోధన సంస్థలో తాళ్ళపాక సంకీర్తనల పరిష్కరణ బాధ్యతను 1957 దాకా నిర్వహించారు.

సంస్కృతంలో స్వర్ధాకావ్యమ్, మహీశూర రాజ్యాభ్యుదయ దర్శనమ్, కన్నడంలో జీవనమత్తుకలె, తెలుగులో తారాదేవి అనే ఖండ కావ్యాల్ని రచించారు. శాలివాహన గాథాసప్తశతిని అనువదించారు. సుందర పాండ్యుని ' ఆర్యలను' తెనిగించారు. వీరి విమర్శనా పటిమకు వేమన, నాటకోపన్యాసములు, సారస్వతోపన్యాసములు సారస్వతాలోకము సాక్ష్యాలు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి బహుమానంతోబాటు గానకళాప్రపూర్ణ, గానకళాసింధు, కేంద్ర సంగీత నాటక అకాడమి ఫెలోషిప్‌లు శర్మ వైదుష్యానికి గీటురాళ్ళు.

సంగీత సాహిత్యాలలో సమధిక ప్రావీణ్యం గతించి సారస్వత విమర్శనలో ఉత్తమ ప్రమాణాలు చూపిన రచయిత శర్మగారు. అన్నమాచార్య కీర్తనల పరిష్కరణ బాధ్యత వహించి ఎన్నో కీర్తనలకు స్వరకల్పన చేశారు. సున్నిత హాస్యం, సునిశిత పరిశీలన వీరి ప్రత్యేకత. వ్యావహారికానికి దగ్గరగా వచనం వ్రాయడం, అల్పాక్షరాలతో అనల్పమైన అర్థాన్ని ఇమడ్చటం వీరి వచనగుణాలు. వీరిని అభినందిస్తూ 'అనంతరాగం' పేరుతో ఒక అభినందన సంచిక కూడా వెలువడింది. కట్టమంచి రామలింగారెడ్డి గారికి గౌరవప్రాతులయిన పండితవరేణ్యులు. చిలుకూరి నారాయణరావుగారు మెచ్చుకొన్న 'కీర్తనీయ చరితులు'

## 2. పాఠ్యభాగ సందర్భం

'రాయల నాటి రసికత' అనే వ్యాసం ' సారస్వతాలోకం' వ్యాస సంపుటిలోనిది. రాళ్ళపల్లివారు రాయలసీమ వారు కావడం, వారికి రాయల నాటి ప్రబంధాలపై మక్కువ ఎక్కువ ఉండడం, ప్రత్యేకించి పెద్దన మనుచరిత్ర, నంది తిమ్మన పారిజాతాపహరణం, శ్రీ కృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలపై అభిమానం పెంచుకొన్నవారు కావడంతో ఈ వ్యాసం వ్రాశారు. ఆంగ్లాది సాహిత్యాలలో సాటిపండితులు తమ తమ భాషలలోని సువర్ణయుగాలను తర్కిస్తుంటే తెలుగు సాహిత్యానికి ' రాయల యుగం సువర్ణయుగమని' నిరూపించడం కూడా రాళ్ళపల్లి వారి ధ్యేయం కావచ్చు. రాళ్ళపల్లి వారు వైష్ణవులు. రాయల యుగంలో వైష్ణవానికే ప్రాబల్యం. పెద్దన తొలుత స్మార్తుడయినా తరువాత వైష్ణవుడయినవాడు. మనుచరిత్రలో వైష్ణవ ఛాయలున్నాయి. ఇక నంది తిమ్మన పారిజాతాపహరణం కృష్ణచరితమే. అవతార పురుషుని అనంతకళ్యాణ గుణాలను భక్తజన పరాధీనతను వ్యక్తం చేసిన ప్రబంధం. ఇక ఆముక్తమాల్యద పెరియాళ్వార్, ఆండాళ్‌ల చరిత్ర.

రాయల నాటి రసికత ఎలా ఉండేదో సప్రమాణంగా నిరూపించినవారు రాళ్ళపల్లివారు. ఒకనాటి ఆంధ్రుల జీవన విధానానికి దర్పణం లాంటిది ఈ వ్యాసం.

## 3. 'రాయల నాటి రసికత ' పాఠ్యభాగ సారాంశం

రాయల కాలం నాటి జన జీవితాన్ని యథాతథంగా చిత్రీకరించిన గ్రంథాలు లేవు. కాని ఆ జన జీవితాన్ని పరోక్షంగా ప్రతిఫలింపజేసిన గ్రంథాలున్నాయి. వాటిలో పెద్దన మనుచరిత్ర. నంది తిమ్మన పారిజాతాపహరణం, రాయల ఆముక్తమాల్యదలు ప్రమాణ గ్రంథాలు. ఇవన్నీ ప్రబంధాలు. పైగా కవిత్వధర్మాన్ని వదలుకోనివి. అందువల్ల ఈ గ్రంథంలోని అంశాలు చాల వరకు పాక్షిక సత్యాలే. సాహిత్యజగత్తులో సత్యములేని అసత్యముగాని, అసత్యములేని సత్యముగాని ఉండదు.

రాయల కాలం నాటి గ్రంథాలలోని ప్రదేశాలు, వ్యక్తుల వర్ణనాదులలో అలౌకికత్వం లేకపోలేదు. శ్రీవిల్లి పుత్తూరు ఒక గ్రామమయినా కవి ఆ ఊరినిండ వజ్రకుట్టిమాలు, మణితోరణాలు, సువర్ణ సౌధాలను కవి వర్ణించాడు. ఆలాగే విష్ణుచిత్తుడు తన భార్య సంక్షేమం కోరి టెంకాయ బొండాలను ఎండించి సిద్ధంగా ఉంచాడు. పచ్చివయితే 'పొగ' లకు భార్య కన్నులు నొచ్చునేమో అని జాగరూకత వహించాడు. తాను సామాన్యుడయినా. రంగనాథుడే గోదాదేవిని వలచినా లోకమర్యాదను గుర్తుచేసి 'మాయింటనే పెండ్లి' అని ఖండితంగా చెప్పాడు. ఆలాగే పెద్దన హిమగిరి సానువులలో ద్రాక్షాపక్వ ఫల గుచ్ఛాలను వర్ణించిన సన్నివేశం హిమవత్పర్వత ప్రాంతాలలో ఈ పంట అసంభవం. పెనుగొండలోనో, హంపిలోనో ఇది సాధ్యం. ఆలాగే ' వరూధిని ' దేవాంగన అయినా సామాన్య స్త్రీలాగే ప్రవర్తించడం. ఆలాగే స్వరోచి నిర్ధనుడయినా వేటలో అతని పందివలలు మోసికొని వెళ్ళిన వారు రాయలసీమ బోయలే.

రసికుడంటే భోగి. భోగాలు అనుభవించడంలో కష్టసుఖాలు, లాభనష్టాలు, ధర్మాధర్మాలు లెక్కపెట్టనివాడు రసికుడు. భోగాలు ప్రవృత్తి భోగాలని నివృత్తి భోగాలని, రెండు రకాలు. ప్రాపంచికమైన గృహశయ్యాదులు ప్రవృత్తి భోగాలు. భక్తి, త్యాగ, వైరాగ్యాదులు నివృత్తి మార్గాలు. అనుభవంలో ఆనందం రసికత్వ లక్షణం. రసికత్వమెంత ఉంటుందో అంత గొప్పతనం మనుష్య జాతిలో సహజం. సాత్త్విక భావాలు అతిశయంగా కలవారే రసికులే.

ప్రవృత్తి భోగాలు 8 రకాలు. గృహం, వస్త్రం, ఆభరణం, గంధం, పుష్పం, తాంబూలం, శయ్య, స్త్రీ కాని అన్న పానాదులు, స్నానం కూడా భోగాలే.

పెద్దన కాలం నాటి ప్రజల ప్రవృత్తికి మనుచరిత్రంలోని మాయాప్రవరుని సంభాషణం ఒక మచ్చుతునక. కామినీ సాంగత్యమా లేదా కఠిన తపశ్చర్యమా అనడమే వారి ముందున్న సమస్య. ఎవరి భావాలు వారివి కావడం రాయల నాటి ప్రజల స్వభావం. పాండ్యరాజుకు 'వెర్రిశైవం' ముదిరితే భార్యకు 'వైష్ణవం'. ఆలాగే వానకాలంలో తలదాచుకొన్న వారు యథేచ్ఛగా ఎవరు బలవంతులో తర్కించుకోవడం. చివరకు పట్టింపులేక వ్యర్థవాదనను పెంచుకోకుండా ఎవరికి వారు తమ దారి పోవడం. ఆలాగే యామునాచార్యుడు బ్రహ్మచారిగా వాదప్రతివాదాలు చేయడం, తదనంతరం, రాజ భోగాసక్తి చివర అన్నీ వదిలి సన్యాసి కావడం. అందువల్ల ఆనాటికి భోగాసక్తి, భోగవిరక్తి రెండూ మానసాధీన అంశాలనక తప్పదు.

రాయల కాలం నాటి 'గృహభోగం'లో అతిశయోక్తులను కొన్నిటిని విడనాడితే అన్ని ఋతువులకు అనువుగా ' ఇండ్లు ' ఉన్నమాట వాస్తవం. ఇరుపక్కల అరుగులు కంబాలపై బొమ్మలు, గోడలపై చిత్తరువులు, ఎత్తైన మేడలు అక్కడే వెన్నెల సుఖానుభవానికి చంద్రశాలలు, కలశాలు. ఇంటికొకతోట, ఆ తోటలో కొలను. ఆ పక్క క్రీడాద్రి, ధారాజల యంత్రాలు, వేసవిలో ప్రత్యేకమయిన చలువ గృహాలు, ఇంటిలో చిలుకలు, హంసలు, నెమళ్ళు పావురాలు, లేళ్ళు, నెమళ్ళకు విశాల కూటములు. చిలుకలకు మాటలు నేర్పడం, నెమళ్ళకు ఆటలు నేర్పడం ఆనాటి వారి వినోదాలు. అన్నిటికంటె గొప్ప వింత ' కోపగృహం' యజమానురాలి కోపాన్ని గుర్తించి యజమానుడు అనునయించడానికి వీలయిన గృహం. నంది తిమ్మన పారిజాతాపహరణంలోని ' కోపగృహం ' సత్యభామకి విజయం ప్రసాదించింది.

స్నానమంటే అభ్యంజనం. నిత్యాభ్యంజనం వైద్య శాస్త్ర విహితం. విష్ణు చిత్తునింట దొప్పల నిండ నూనె. ఉద్వర్తనానికి ఇప్పపిండి పరదేశ వైష్ణవులకు. కలవారింట సంపంగె నూనె తలంటు. వెంట్రుకల సంరక్షణకు మందీ మార్బలం. గొజ్జగి నీటి వెల్లువలు గోవ జవాదులు. పలుచని వలిపంతో తడియొత్తు. ఆ కాలం వారికి 'నిడుద వెండ్రుకలు' సహజం. పెద్దన కూడా ప్రవరునికి 'తెగబారెడు వెండ్రుకలు' ఉన్నట్లు వర్ణించాడు. భగీరథుని వర్ణించు పట్టులకూడా 'నిడుదపెన్నెరి వేణిని ' పెద్దన మరచిపోలేదు. అభ్యంగమే వెంట్రుకలు పెరగడానికి కారణమని రాళ్ళపల్లి వారి అభిప్రాయం.

ఇక వస్త్రాలంకరణ. తెల్లవస్త్రాలను పురుషులు అపురూపంగా ధరించేవారు. కాని స్త్రీలకు ఇవి సహజం కావు. కోపగించుకొన్నవేళ 'సత్య' తెల్ల చీర ధరించినది. ఇతర సమయాలలో 'చెంగావి' చీరలే. అందును బంగారు సరిగల చెంగావి చీరలు. మాయా ప్రవరుడు కూడా పసిడివ్రాత చెరంగు మిసిమి దోప చెలంగు అరుణాంశు కోత్తరీయంబుతో వచ్చినవాడే. అతడు కట్టిన ధోవతి నర్మావిపింజ. కొందరికి 'ముప్పన్నె చుంగు' ఇష్టం. ఇవన్నీ పాము పొరలలాగా సూక్ష్మం, సౌకుమార్యం, అపేక్షించే రసికజనం ఉండడం వల్ల ఆ నేత సాధ్యం కాగలిగిందని రాళ్ళపల్లి వారి అభిప్రాయం.

రాయల కాలంలో సొమ్ముల విషయంలో స్త్రీ పురుషులకు ఎక్కువ భేదం లేదన వచ్చు. స్త్రీలు తప్పక సొమ్ములు ధరించాలని శాస్త్రం చెబుతుంది. భర్త ఆయుస్సును వృద్ధి చేస్తుందనే నమ్మకమే దీనికి కారణం. 'హారాల సొమ్ము' మగ వారికి కూడా ఉన్నట్లు చెప్పవచ్చు. హారాలు, భుజకీర్తులు, ఉంగరాలు, ఒడ్డాణం, కాళ్ళ చేతుల కడియాలు, చెవుల కుండలాలు, శిరోమణి మొదలయినవి సమాన ఆభరణాలు. మగవారికి కిరీటం, ఆడవారికి 'ముక్కెర' మొదలయిన వాటిలో కొంత భేదమున్నది. నగలపట్ల సమాన అనురాగం ఉండడం వల్ల ఆనాటి గృహస్థుల మధ్య పేచీ లేదు. ఆడువారి నగలలో మార్పు పెద్దగా రాలేదు కాని మగవారి నగలలో మార్పు వచ్చిందని రాళ్ళపల్లి వారు అభిప్రాయపడ్డారు.

రాయల కాలం నాటి వేషరచనల్లో పువ్వులకు ప్రాధాన్యముంది. విదేశాల నుండి సుగంధద్రవ్యాల దిగుమతికి రాజానుమతి ఉంది. రాచనగరిలో సుగంధాలకు ఒక పెద్ద భాండాగారముంది. గంధపునీళ్ళతో కలయంపి చల్లడం ఆచారం, కస్తూరి, పునుగు, జవ్వాజి, పచ్చ కర్పూరం, కుంకుమపూవు, శ్రీగంధం, అగరు, పన్నీరు మొదలయిన వాటి వాడకం అతివేలం. మనుచరిత్రలో వరూధిని ప్రవరునికి చూపిన పరిమళవస్తువుల ఘుమఘుమలలో కస్తూరి, జవాజులున్నాయి. ఇవేకాక, 'కలపాల' తయారీకి కూడా ప్రాధాన్యముండేది. సుగంధద్రవ్యాల తయారీలో ఆంధ్రులు ప్రసిద్ధులు. అయినా తరువాతి కాలంలో ఈ కళలో మహమ్మదీయులు ఆరితేరినారు. నేటి కాలం వారికి సుగంధద్రవ్యాల సేవనం, కలపం పట్ల ఆసక్తి లేదని, ఉన్నా వారి దుస్తుల నిర్మాణం, సహకరించదని రాళ్ళపల్లి వారు అభిప్రాయపడ్డారు.

రాయల కాలం వారికి పూలపై మక్కువ ఎక్కువ. తోటల పెంపకం ఆనాటి వారి కిష్టం. జాజి, విరజాజి, మల్లె, మొల్లలు ఆనాటి వారు మెచ్చిన పుష్పాలు. ఆనాటి వారి పుష్పప్రీతికి 'పుష్పలావికలు' నిదర్శనాలు. మెడలో చిత్ర విచిత్రహారముల ధారణ, తలలో ఎత్తులు గట్టిన పూల చెండు ప్రాతస్సాయం కాలాలలో ఇండ్ల ముందర పూలు చల్లడం, సరాలు గట్టి తోరణాలుగా వేలాడదీయడం, చెండ్లతో సరసక్రీడ, విసనకర్రలుగా పూల కూర్పు, పాన్పుపై గంపల కొద్ది పూలు మొదలయినవి ఆనాటి పుష్పవిలాసాలు. నేడు పుష్పప్రీతి తగ్గిందని, పెద్ద ఉద్యానవనంలో కూడా 'సుగంధి' పూల పెంపకం లేదని రాళ్లపల్లి వారి ఆవేదన.

రాయల కాలంనాటి వారి అన్నపానభోగాదులు ఆశ్చర్యకరమయినవి. కాలానికి తగిన **'ఆహారపానీయాలు' ఆనాడు అలవాటులో** ఉన్నట్లు ఆముక్తమాల్యదలోని పద్యాలు సాక్ష్యమిస్తున్నాయి. రాయల వారు వైష్ణవుల ఇండ్లలోని ఆహారం మాత్రం వర్ణించలేదు. దోర మామిడి ముక్కలలో అపుడే తడిఆర్చిన చేపలు తరిగి వేసి నువ్వులు నూనె తిరుగబోత వేసి తాలింపు చేసి తినే వైనాన్ని , చేపకూర తిన్న కసరు పోవడానికి సంధ్యా కాలంలో ఇసుకలో పూడ్చి పెట్టిన చల్లని ఎడనీళ్ళు సేవనం లాంటి వాటిని రాయలు వర్ణించారు. నాగరికుల భోజనాలు వర్ణించిన రాయలు అనాగరికుల ఇండ్ల భోజనాన్ని కూడా ' గురుగుం జెంచలి' పద్యంలో వర్ణించారు. ఆనాటి వారు ఆహార సేవన నియమం కలవారు. పైగా అజీర్ణాది రోగాలు తెలియని వారు.

రాయల కాలం నాడు గుర్తించదగ్గ మరో అంశం తాంబూలసేవనం. కర్పూరం, కస్తూరి, ఏలకులతో కూడిన తాంబూలం వారికిష్టం. మర్యాదలలో 'కర్పూరతాంబూలం' పెట్టడం సామాన్య ఆచారం. ఆనాటి 'తాంబూల తావి' కూడా గొప్పదే. ప్రవరునికి దారి చూపిన 'తావి' అది. పెద్దన అడిగిన అభ్యర్థనలో ' రమణీ ప్రియదూతక తెచ్చియిచ్చు కప్పురవిడెము ' కూడా ఉంది.

రాయల కాలంనాటి ధనికుల శయ్యాభోగం కూడా చిత్రమయినదే. వారికిష్టమయిన పానుపులు మూడు - పూలపాన్పు, చిగురాకుల పాన్పు, హంసతూలికాతల్పం. హంసల ఒడలి పైని చిన్న ఈకెలను తెచ్చి ఈనెలు తీసి పత్తికి బదులుగా ఉపయోగించి కూర్చిన లేపు ఆనాటి ధనికులలో ఎక్కువ.

రాయల కాలం నాటి రసికులప్రవృత్తులలో స్త్రీ భోగం ఒకటి. కవుల స్త్రీల వర్ణనలు ఇందుకు సాక్ష్యం. బాధతో పరుగెత్తుకొని వచ్చు మనోరమ వర్ణనలో కూడా ' ఆంగిక సౌందర్యం' వర్ణించడం దీనికి తార్కాణం. వారి ఏడ్పులలో కూడా ' సంగీతాన్ని' చవి చూచిన వారు ఆనాటి కవులు. ఆనాటి వారి రసికతలో ' బహుపత్నీవ్రతం' ఆదర్శమన్నా తప్పులేదు. కవులు రాయల్ని 'ఇతోధిక బహు ప్రేయసీ ప్రాప్తి రస్తు' అని దీవించడం ఇందుకు ఉదాహరణ. మగవారికి అవసరమయిన సేవలన్నీ స్త్రీలే చేయడంలోనే ఆనాటి వారు సంతృప్తి పడేవారు. తలంటుట, నీరుపోయుట, తడియొత్తుట, అలంకరించుట, అడపం పట్టుట, పావుకోళ్ళు అందిచ్చుట లాంటివి స్త్రీలు చేయడంలో మగవారికి ఇష్టం. అందువల్లనే రాజుల వివాహాలలో అమ్మాయిలతో పరిచారికాగణం పంపడం అలవాటయింది. ఆ పరిచారికలు యువతులు, మాటకారులు, సొగసు సొంపులు తెలిసిన వారని మనుచరిత్రలో మనోరమ చెలికత్తెలను బట్టి తెలుస్తున్నది. అంతఃపురాలలో రాచరికపు కన్నెలకు అవకాశం లేకపోవడంతో వేశ్యల నియామకం అవసరమయింది. దేవాలయ ఉత్సవాలలో సంగీత నాట్య ప్రదర్శనలలో 'వేశ్యల' వారి స్థానం పదిలం. ప్రజలు, విటులు మెచ్చే అంశం కూడా. మగవారి పాటల కన్న ఆడువారి పాటలకు గౌరవం, ప్రీతి కూడా.

రాయల కాలం నాటి వారికి కులసతులంటే ఉన్న గౌరవం, ప్రీతి కూడా అసమానమే. కులసతులు కోపపడితే కాళ్ళకు మొక్కి క్షమాపణ అడగడం 'నామోషీ' కానే కాదు. దీనికి తగిన ఉదాహరణ పారిజాతాపహరణంలోని 'సత్యభామ సాంత్వనం'. వ్యాపారానికి, ధర్మకార్యాలకు స్త్రీలను నియోగించడం ఆనాటి వారి విధివిధానంగా కనిపిస్తుంది. స్త్రీల విషయంలో ఈనాటి వారి ఆలోచనలు మెచ్చుకోదగ్గవని రాళ్ళపల్లి వారు అభిప్రాయపడ్డారు. స్త్రీలకు మానమర్యాదలు, సుఖ దుఃఖములున్నాయని భావించడం 'శ్లాఘ్యవిషయంగా' అనంతకృష్ణశర్మగారు విశదీకరించారు.

రాయల కాలంలోని వారికి ప్రవృత్తి భోగాలెంతో నివృత్తి భోగాలు కూడా అంతే ఇష్టం. ఆముక్తమాల్యదలోని 'మత్స్యధ్వజమహారాజు' వృత్తాంతం ఇందుకు సాక్ష్యం. భోగిని యింటికి బయలుదేరిన రాజు అరుగు మీది బ్రాహ్మణుని 'తాత్త్విక శ్లోకం' విని మనసు మార్చుకొని అంతఃపురం వైపు కదలివెళ్ళాడు. పండిత చర్చ చేసి సత్యం కనుగొన్నాడు. ఇలాగే వరూధిని మీద పడినా 'శ్రీహరీ' అని త్రోసి వేసి తన పరస్త్రీ వైముఖ్యాన్ని ప్రవరుడు ప్రకటించుకొన్నాడు. ఈలాంటి నిర్ణయాలు ఆకస్మికమయిన మార్పులు స్వాభావికమని రాళ్ళపల్లివారు భావించారు. గాంధీమహాత్ముని చరిత్ర చదివి అన్ని భోగాలను వదలి వచ్చిన మిస్. ఎమ్. స్లేడ్ చరిత్రను ఉదాహరణగా తమ వ్యాసంలో ఇచ్చారు.

రాయల కాలం నాటి వారు కేవలం భోగులో లేదా యోగులో అని భావించనక్కరలేదు. వారికున్న 'ప్రజాహితం' ప్రశంసార్హం, రాజ్యవిస్తరణ, సురక్షితపాలన, తటాకాది నిర్మాణం, అమూహ్యభవన నిర్మాణం, పంటలకవసరమయిన చెరువుల త్రవ్వకం, కాలువల త్రవ్వకం

లాంటివి చేశారు. వారి భోగతృష్ణలాగే దయ, శౌర్య, పాండిత్య, వైరాగ్యాదులు కూడా గొప్పవి. ఎన్ని దోషాలున్నా 'రసికత్వం' తిరస్కరించ తగ్గది కాదు. అది నాగరికతకు నిదానం. పౌరుషానికి ఫలం, అభ్యుదయానికి ఆధారమనక తప్పదు.

## 4. కఠిన పదాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| త్రికరణ ప్రవృత్తులు | = | మనోవాక్కాయ ప్రవృత్తులు |
| శ్రీవిల్లిపుత్తూరు | = | తమిళనాడులో మధురైకి దగ్గరలోని దివ్యతిరుపతులలో ఒకటి. శ్రీధన్విపురమని పేరు. |
| వజ్రకుట్టిమము | = | వజ్రాలతో కట్టబడిన నేల |
| అబుద్ధేక్షుధను: పత్రుడు | = | చెఱకువిలుకాని బాణములను ఎరుగని వాడు |
| ద్రాక్షాగుళుచ్ఛంబులు | = | ద్రాక్షల గుత్తులు |
| సాత్త్వికభావములు | = | రోమాంచాది భావములు |
| రోమాంచము | = | వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం |
| దంభం | = | కపటం, గర్వం |
| అశ్వపతి | = | గుర్రాలకు రాజు |
| గజపతి | = | ఏనుగులకు రాజు |
| నరపతి | = | నరులకు రాజు |
| ఉదాసీనము | = | తటస్థ విధానము |
| కలశములు | = | కుండలు |
| ధ్వజములు | = | జెండాలు |
| చెంగలువ | = | ఎర్ర కలువ |
| ధారాజల యంత్రములు | = | నీటిని చిమ్మే యంత్రాలు |
| యష్టి | = | నెమళ్ళ నివాసములు |
| అభ్యంజనము | = | తలంటు |
| పరదేశ వైష్ణవులు | = | ఇతర దేశాల నుంచి వచ్చిన వైష్ణవులు |
| ఉద్వర్తనం | = | నలుగు పెట్టడం |
| వలిపం | = | సన్న వస్త్రం |
| భుజకీర్తులు | = | భుజాలకు అలంకరించుకొనే ఆభరణ విశేషాలు |
| ఒడ్డాణము | = | నడుముకు పెట్టుకొనే ఆభరణ విశేషం, |
| కటకం | = | కడియం |
| మేఖలము | = | మొలనూలు |
| పరిమళకారక విద్య | = | సుగంధ పరిమళాలను రకరకాలుగా సమ్మేళనం చేయగలిగిన విద్య |
| కనరు | = | వెగటు |
| తూలిక | = | ఈక |
| ఏకాదశి | = | తిథులలో పదుకొండవది |
| చూడమ్మ | = | శూడికొడుత్త అమ్మకు సంగ్రహరూపం (గోద) |

| | | |
|---|---|---|
| శేషమాల్యం | = | విడిచినదంత |
| ఆతపం | = | తాంబూలపు పెట్టె |
| దేవళం | = | గుడి |
| మెరవణి | = | ఊరేగింపు (అణి = గుంపు, మెరిసే గుంపు) |
| అరణము | = | వివాహ కాలంలో వధూవరులకు ఇచ్చే కానుకలు |
| గాణిక్యములు | = | వేశ్యా సమూహాలు |
| చెలువలు | = | స్త్రీలు |
| ఆనుషంశికము | = | ఒక దానిని ఉద్దేశించి ప్రవర్తించేవేళ మరి ఒకటి లభించడం |
| అపేక్ష | = | కోరిక |
| అతిథి | = | తిథి నియమాలు లేకుండా వచ్చేవాడు |
| అగ్రహారము | = | బ్రాహ్మణులకు దానంగా ఇచ్చే గ్రామం (అగ్ర భాగంలో హరిహరుల ఆలయాలున్న ఊరు అని విశేషార్థం) |
| కోశము | = | ధనాగారము |
| అవతారము | = | దిగివచ్చుట |

## 5. 'రాయల నాటి రసికత ' పాఠ్యభాగంలోని పద్యాల భావార్థ వివరణ.

1. నీ చనుదోయి సంకుమద నిర్భర వాసన మేన నూన న
యొ్యా ! చిర సౌఖ్యముల్ గనుటనె యో మృగేక్షణా 3 - 105

మనుచరిత్రలోనిదీ పద్యం. మాయాప్రవరుడు వరూధినితో తన కోరికను ప్రకటించుకోవడం ఈ పద్య సారాంశం. వరూదినీ జవ్వాజి వాసనలు గుబాళించే నీ చనుగవను గట్టిగా కౌగలించుకొని చిరకాలం సుఖం అనుభవించాలి లేదా తపం కొనసాగించి పాపవినాశనం చేసుకోవాలి. నేను రెంటికి చెడిన రేవడను, కాదలచుకోలేదు. అందువల్ల నాకై నేను నిన్ను వదలిపోవునంత వరకు నన్ను వదలనని నీవు బాస చేసినట్లయితే నీతో కలసి మెలసి వుంటాను. ఆలా చేయడానికి నీవు ఇష్టపడకపోతే నా దారి నేను చూసుకొంటాను.

2. సద్యోవినిర్భిన్న సారంగ నాభికా
 హృతమై పిసాళించు మృగమదంబు
కసటువ్ బీరెండ ఁగరణి కట్టల నంటి
 గమగమ వలచు చొక్కపు జవాజి
పారలెత్తి ఘనసారతరువుల ఁదను దాన
 తొరఁగిన పచ్చ కప్పురపు సిరము
గొజ్జంగి పూఁబోదల్ గురియంగ ఁబటికంపు
 దొనల నిండిన యట్టి తుహిన జలము
వివిధ కుసుమ కదంబంబు 2. 55

మను చరిత్రలో వరూధిని ప్రవరునితో తన కోరికను ప్రకటించి పరిసర ప్రదేశ సౌభాగ్యాన్ని వర్ణించడం ఈ పద్య సారాంశం.

ఓ బ్రాహ్మణుడా ! ఇక్కడ భోగ వస్తువులయిన కస్తూరి, జవ్వాజి, పచ్చ కర్పూరం, పన్నీరు, పూలు, పండ్లు, మృదు వస్త్రాలు, రత్నాభరణాలు, పానీయాలు అన్నీ సమృద్ధిగా ఉన్నాయి. వీటిని అనుభవిస్తూ అనుదినం రమిస్తూ కాలం గడుపు.

3. తెలి నులి వెచ్చ యోగిరము తియ్యని చారులుఁదిమ్మనంబులున్

బలుచని యంబళుల్ చెఱకు పాలెడ నీళ్ళు రసావళుల్ ఫలం

బులును సుగంధి శీతజలముల్ వడపిందెలు నీరుఁజల్లయున్

వెలయఁగ బెట్టు భోజనము వేసవిఁ జందన చర్చ మున్నుగన్ 1 - 81

ఈ పద్యం ఆముక్తమాల్యదలోనిది. శ్రీవిల్లి పుత్తూరులోని విష్ణుచిత్తుని ఇంటి నిత్య సమారాధనలోని వేసవి భోజనం ఈ పద్యంలో వర్ణితం.

ముందుగా గంధపుఁబూత - తెల్లనిది ఇంచుక వేడిది అయిన అన్నం, తియ్యని చారులు, మజ్జిగ పులుసులు, పలచని అంబళ్ళు, చెఱకు పాలు, లేత టెంకాయలోని తియ్యని నీరు, భక్ష్య విశేషాలు, సువాసనతో కూడిన చల్లని నీరు, తాపాన్ని పోగొట్టే ఊరవేసిన మామిడి పిందెలు, నీరు మజ్జిగ మొదలయిన వాటితో విష్ణుచిత్తుడు అనుదినం వేసవిలో ' సమారాధన' నిర్వహిస్తాడని భావం.

4. పరిపక్వ సురభి రంభాఫలంబులతోడ

దళమెక్కు పనస పెండోలల తోడ

ఘృత పిండనిభ కర్కరీ ఖండముల తోడ

బలుదెఱంగుల మావి పండ్ల తోడ

గోస్తనీ మృదుగుళుచ్ఛ స్తోమముల తోడ

గప్పు లేటిన వడ ప్రప్పు తోడ

సుమధుర స్థూల దాడిమబీజముల తోడ

దనుపారు రసదాడిగ నెల తోడ

బానకం బతిథుల కిడ్డఁ దాను గ్రోలి

యర్చనా దత్త చందన చర్చఁదేలి

విరులు సిగ ఁదాల్చి కర్పూర వీటిఁ జౌరు

కొట్టుచు ద్విజుండు వెన్నెల బిట్టు గాయ

ఈ పద్యం ఆముక్తమాల్యదలోనిది. రాజపురోహితుని ఇంట సాగెడి ' పానక పూజ' ఈ పద్యంలో వర్ణితం.

బాగా పండిన సుగంధి అరటిపండ్లతో లావైన పెద్ద పెద్ద పనస తొనలతో, కోసి పెట్టిన గడ్డనేతి ముక్కలో అన్నట్లున్న తెల్ల చెఱకు ముక్కలతో రకరకాలయిన మామిడిపండ్లతో, మెత్తని ద్రాక్షపండ్ల గుత్తులతో తాపాన్ని పోగొట్టే నాన బెట్టిన పెసరపప్పుతో, తీపైన దానిమ్మ గింజలతో రసదాడి పేరుతోడి అరటిపండ్లతో అతిథులకు పానకాదులు సమర్పిస్తూ తానూ సేవిస్తూ, పూజార్థమిచ్చిన చందనాదుల పూతతో, సిగల చుట్టిన పూలతో, పచ్చకర్పూరము కలసిన తాంబూల సేవనంతో విష్ణుచిత్తుడు వేసవిలో అతిథి అభ్యాగతుల సేవ చేస్తున్నాడని రాయలు వర్ణించాడు.

గురుగుం జెంచలి తుమ్మ లేదగరి పాకుం దింత్రిశీ పల్లవో

త్కరముం గూడ బొరంటి నూనియలతో గట్టానిఁగుట్టారికా

గిరముల్ మెక్కి, తమిం బసుల్ పొలమువోఁ(గ్రేఁపుల్మెయిన్నాక,మే

కెరువుం గుంపరు మంచ మెక్కిరి ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్ 4 - 134

ఈ పద్యం ఆముక్తమాల్యదలోనిది. వర్షాకాలంలో ఒకచోట రాయలు దర్శించిన రెడ్ల జీవనాన్ని ఈ పద్యం వర్ణిస్తుంది. రెడ్డిదొరలు స్వతంత్ర భూజీవనం కలవారు. వారికి చిన్నారుగ బియ్యపుటన్నం ఇష్టం. గురుగాకు, చెంచలాకు, తుమ్మియాకు, లేత తంటెపాకు లాంటి ఆకులతో చింతచిగురు చేర్చి సమృద్ధిగా నూనె పోసిన కూరను కలుపుకొని తృప్తిగా సేవిస్తారు. మంచం కింద ' మేకెరువు కుంపటి' రాజుకొంటుండగా పరుపుపై సేద తీర్చుకొంటారు. సేవకులు తమ యాజమానుల పశువుల్ని పొలాలకు తోలుకొని పోతారు. దూడలు రెడ్ల శరీరాల్ని నాకుతుండగా మంచాలపై పవళిస్తారు.

5. మృగమద సౌరభ విభవ

ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీ గంధ

స్థగితేతర పరిమళమై

మగువ పొలుపు దెలుపు నొక్క మారుత మొలసెన్ 2 -24

మనుచరిత్రలోని పద్యమిది. ప్రవరుడు కాలికి పూసిన పసరు కరిగిపోగా దారి తెలియక తచ్చాడు వేళ ఒక 'గాలి' వీచింది. ఆ గాలి వైనాన్ని కవి ఈ పద్యంలో వర్ణించాడు.

కస్తూరి, పచ్చ కర్పూరం మొదలయిన పరిమళ ద్రవ్యాలు కలిసిన తాంబూల వాసన ఇతర పరిమళాలను కప్పివేస్తే దగ్గరలో ఎవరో ఒక జవరాలు ఉన్న జాడ తెలిపే విధంగా గాలి వీచింది.

6. మట్టెల్ మ్రోయఁగ గబ్బిచన్ను ఁగవ కంపంబంద వేణీభరం

బట్టిట్టె కటిఁజిమ్మ చీఁకటులుగా నశ్రు వ్రజం బోడిక

ల్గట్టన్ జూపులు చిమ్మరేఁగి దివి రోలం బాళిఁగల్పింపఁగా

మిట్టాడంగ నరుండు లేని యడవిన్ మీనాక్షి దీనాకృతిన్ 4-68

మను చరిత్రలో స్వరోచి వేటకు వెళ్ళిన సమయంలో 'ఆక్రందన' వినబడింది. 'ఎవరికి ఏ ఆపదనో' అని స్వరోచి కలవరపడుతుంటే రాక్షసుడు తరుముకొని వస్తుండగా ఏడుస్తున్న మనోరమ కనిపించింది. ఆ మనోరమ వర్ణన ఇది.

కాలి మట్టెలు మ్రోగుతుంటే, స్తనద్వయం కదలుతుంటే, వీడినజడ పిరుదుల దాకా వేలాడుతూ చీకటి కమ్మినట్లుంటే, కన్నీరు ఏకధారగా కారుతుంటే, చూపులు తుమ్మెదల పంక్తుల లాగా ప్రసరిస్తుంటే జనసంచారం లేని వనంలో దైన్యాకారంతో ఒక స్త్రీ కనబడింది.

బిసరుహనయనా నవవిధ కుసుమాయుధ - మను 2-80

పద్మనేత్రలగు స్త్రీలకు కొత్త రీతులుగల మన్మధుని లాంటివాడా'

విలోకి వధూజన సూన శరాసన - మను 2.81

చూచెడి స్త్రీ జనానికి మన్మథుని లాంటివాడా

ప్రకృతి విలోచనా కుసుమ బాణ - పారి. 1.140

7. సవలయ ధ్వనిగాఁగ సారె వ్రేయు నడల్పు
యతినైన గుండె జల్లనఁగలంప
సుడిసిన మొగమెత్తి చూడకుండు పరాకు
కుసుమ బాణునినైన ఁగువిటుఁజేయ
శ్రీకార్య పరులఁగాంచిన లేచి మ్రొక్కునం
జలికి నింద్రుండు న క్కొలువుఁగోర
హరి గృహావసర శంఖాకర్ణనకు ఁద్రిప్పుఁ
శతకంటి జిగి ప్రజఁగాఁడి పాఱఁ
గవఱ లుంకించి వ్రేయ ఁగొప్పువియ నవలి
కరమున నమర్చ ఁబైఁటలో మరుని బటువు
బిల్ల క్రియఁబట్టు ఁగంచెల బిగువు చన్ను
నిక్క ఁదిన్నెల ఁబాఁత్రాళి నెత్త మాడు 1.59

ఈ పద్యం ఆముక్తమాల్యద లోనిది. విలుబుత్తూరి వర్ణనలోని పద్యం. తిన్నెల మీద జూదమాడే వైనాన్ని తెలిపేది. రాయల కాలం నాటి రసికులను వశపరచుకొనే వేశ్యల అందచందాలను వర్ణించే పద్యమిది.

చేతికంకణాల క్వణనంతో పాచికలు వైచేవైనం విరక్తులయిన సన్యాసులకు సయితం మారవికారం కలిగిస్తూవుంది. ఎదురైనా మొగమెత్తక నిర్లక్ష్యం చూపడం మన్మథుని కొఱగాని విటునిగా చేస్తున్నది. భగవత్సేవాసక్తుల్ని చూస్తే ఆట నిలిపి అంజలి ఘటించే ఆట వెలదుల్ని దర్శించి ఇంద్రుడు కూడా ఆ కైంకర్యాన్ని కోరుతున్నట్లున్నది. ఇంద్రునైనా వారు లెక్క పెట్టరని భావం. అందువల్ల భగవత్సేవా కైంకర్యపరుడయితే వారి మొక్కులు లభిస్తాయని విశేషార్థం. ఆటవెలదులకు 'సేవాపరులపట్ల మాత్రం' గౌరవముందని భావం. విష్ణ్వాలయంలో పూజాసమయాలలో మోగే శంఖ ధ్వనుల్ని వినడానికి సిద్ధమవుతున్నప్పుడు వారి కంటి జిగి ప్రజల్ని చీకాకు పరుస్తూవుంది. పాచికల్ని కదిపి వేస్తుంటే కొప్పు సడలింది రెండవ చేతితో కొప్పు సవరించుకొనే వేళ మన్మథుని బిల్ల తలగడలాంటి బిగువు చనులు పట్టురవికలోనుండి నిక్కుతుండగా ఆటవెలదులు పాచికలు ఆడుతున్నారని వర్ణన.

8. వీడెంపు ఁబలుకెంపు విరిసి వెన్నెల గాయ
వరిగింజ నొకట ఁబల్వరుస ఁదోమ
నొరసి యొత్తిన ఘణుం గొందక మైవెని
గ్గులు దేర ఁబసుపిడి జలక మాడ
ముదుక గాకుండఁ బయ్యెదలోనె గేలార్చి
కలయఁ జంటను నొట్టఁ గలఁపమలఁద
తతిరయచ్చిన్న సూత్రమున ఁజిక్కక ముత్తె
ములు రాల గరగరికలు వహింపఁ

బొలసిననె యెట్టినరునైన ఁగులముఁదెలియఁ

బ్రభుత సెడి పల్లవుఁడు వేదవడిన నేద

నృపతి వెలియ తిపురముగా నెన్న మెలగ

బాసఁ గృతి సెప్ప వలఁతు లప్పద్మముఖులు 1-60

విలుబుత్తూరులోని పద్మముఖులు సామాన్యులు కారు. జాణలు. సుందరులు. సొగసులు తెలిసినవారు. వారు తాంబూల ప్రియులు. తాంబూలం నమలినందువల్ల పండ్లు కూడా ఎరుపెక్కాయి. ఒక వరిగింజతో ఆ ఎరుపు పోయే విధంగా తోము కొనగలిగిన సొగసుకత్తెలు. ఆ ఆటకత్తెలు పసుపుతో జలకమాడేవారు. తదనంతరం పరిశుద్ధ వస్త్రం దాల్చేవారు. ఆ వస్త్రాలు వారి దేహాన్ని ఆచ్ఛాదింపజేసినా పసుపు డాలు కనిపిస్తూనే ఉండేది. దేహకాంతి, వస్త్ర కాంతి, లేపన కాంతులన్నీ విలాస ప్రదమని భావం. పలుచగా పయ్యెదలోని స్తనాలకు పరిమళ ద్రవ్య మిశ్రిత చందన మలదుకొనేవారు. వారి ఇండ్లు రాణివాసాల లాంటివి. అక్కడ భోగాలకు కొదువలేదు. కులము, ఐశ్వర్యము చెడగా విటుడు పేద వాడయినను పోషించుటకు సమర్థులు వారు. దేశ భాషలయందు కావ్యము సెప్ప గల నేర్పరులు.

9. చెడుగు దాన! కాళ్ళ ఁబడినాఁడు నీపతి

నింకనైన లేవ నెత్తవేల?

వలపు లెంత గట్టి వా టినవయ్యును

ఇదియె వినుము వాని కెల్ల మేర

శాలి వాహన గాథాసప్తసతి 4-90

ఓ దుష్టురాల! నీ మగడు తన తప్పిదం తెలుసుకొన్నాడు. నీపట్ల అతని కున్న అనురాగం నీకు తెలియనిది కాదు. కాళ్ళబడి క్షమాభిక్ష అడుగుతున్నా నిర్లక్ష్యంతో నీవు లేవనెత్తకుండడం సబబు కాదు. వలపులకు, వలపు సొలపులకు మేర ఉంది. ఆ మేర దాటడం తగదు. 'దాసరి తప్పు దండంతో సరి' అన్నట్లు కాళ్ళ పడ్డాక ఇతరాంశాలు పట్టించుకోవడం ఏమాత్రము తగదు. ఒక చెలికత్తె తన నాయికను మందలించడం ఈ పద్యంలోని ముఖ్యార్థం. గాథా సప్తసతి ఆంధ్రుల జీవన విధానానికి దర్పణం.

## 6. ప్రశ్నలు - జవాబులు

1. రాయల నాటి రసికతను వివరించండి

లేదా

రాయల కాలము నాటి ప్రజల ప్రవృత్తి, నివృత్తి, భోగానురక్తిని వివరించండి.

'రాయల నాటి రసికత' అనే వ్యాసం వ్రాసినవారు శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో వెలువడ్డ ఆముక్తమాల్యద. పారిజాతాపహరణము, మనుచరిత్ర గ్రంథాల ఆధారంగా శ్రీశర్మగారు 'రాయల నాటి రసికతను' విశదీకరించారు. సాహిత్య జీవులకు సత్యాసత్యముల పట్ల గౌరవముంది. కవులు జీవించిన సంఘము సత్యము. సంఘజీవి అయిన కవి అసత్యం మాత్రం చెప్పడం ప్రధాన ధ్యేయంగా భావించడు. అందుచేత ఈ కావ్యాల ఆధారంగా 'రసికతను' చెప్పడం నేల విడిచిన సాము కాదు.

రసికుడంటే భోగి. భోగాదులు అనుభవించే వాడు భోగి. రాయల కాలము నాటికి ఇహభోగాదులు ఎనిమిది, వాటినే అష్టభోగాలంటారు. ఇల్లు, వస్త్రం, ఆభరణం, గంధం, పుష్పం, తాంబూలం, శయ్య, స్త్రీ అనేవి అష్ట భోగాలు. వీటితో అన్నం, పానం, స్నానం కలుపుకొంటే భోగాలు పదకొండు. అయితే ఇవన్నీ ప్రవృత్తి భోగాలు. రాయల కాలంలోని ప్రజలకు ప్రవృత్తి భోగాల పట్ల రాసిక్యం ఉన్నా నివృత్తి భోగాల పట్ల గౌరము ఉంది. అదే వారి ధ్యేయం.

గృహభోగం:- రాయల కాలంనాటి గ్రంథాలలో రాజ గృహాలు, సామాన్యుల గృహాల వర్ణనలున్నాయి. అరుణాస్పదం, ద్వారక, మధురలలో రాజగృహాలు, శ్రీవిల్లి పుత్తూరులో వైష్ణవుల గృహాల వర్ణనలు కనిపిస్తాయి. రాజగృహాలు ఊహాతీతంగా కనిపించడం ఒక ప్రత్యేకత. రత్నాల గోడలు, వజ్రాల స్తంభాలు, అన్ని కాలాలకు తగినట్లుండడం గృహనిర్మాణము యొక్క ప్రత్యేకత అయితే గోడలపై చిత్తరువులు, చంద్రశాలలు, కలశములు, ధ్వజములు, చుట్టూ తోటలో నీటిని వెదజల్లే యంత్రాలు మొదలయినవి ఆనాటికి ఊహాతీత అంశాలే. పూలతోట, అందులో చెంగలువల కొలను, వీలుబట్టి క్రీడా పర్వతం, ఇంట్లో చిలుకలకు బంగారు పంజరాలు, నెమళ్ళకు యష్టి అనే పేరుతో ఏర్పాటు చేసిన కూటములు ఉండడం ఒక విశేషం. చిలుకలకు మాటలు నేర్పడం, నెమళ్ళకు నాట్యం నేర్పడం ఆనాటి మహిళామణుల వినోదాలు. అన్నిటికంటె 'కోప గృహ' నిర్మాణం విశేషం. యజమానురాలికి కోపం హద్దు మీరినవేళ అలక ప్రదర్శించే గృహం.

వస్త్ర భోగం : రాయల కాలంనాటి జనులకు వన్నెల వస్త్రం ఇష్టం. తెల్లని వస్త్రాలు పురుషులు ఇష్టపడేవారు. కాని స్త్రీలు ఇష్టపడేవారుకారు. కాని సత్యభామ కోపం వచ్చినపుడు 'తెల్లచీర ' కట్టింది. చెంగావి వస్త్రాలు ప్రత్యేకించి బంగారపు అంచులవి ఆనాటి వస్త్రాలు. ప్రవరుడు నీర్కావి పింజ ధోవతి కట్టినా అరుణాంశుకోత్తరీయంతో దర్శనమివ్వడం ప్రత్యేకత. మువ్వన్నె చుంగులు కొందరి కిష్టమయితే, ఊదినం బాఱు వస్త్రాలు కొందరివి.

**ఆభరణ భోగం** : రాయల కాలం నాటి స్త్రీ పురుషులకు ఆభరణాల మోజు సమానం. స్త్రీలకు లాగే మగవారికి వారాల సొమ్ములు నియమం. ప్రత్యేకించి హారాలు, భుజకీర్తులు, ఉంగరాలు, ఒడ్డాణం, కాళ్ళు చేతులకు కడియాలు, చెవులకు కుండలాలు, శిరోమణి ఆడ మగ వారికి సమానమే. కాకపోతే మగవారికి కిరీటం, ఆడవారికి ముక్కెర ప్రత్యేక అలంకరణలు.

**గంధ పుష్ప సుగంధాల భోగం** : రాయల కాలం నాటి రాసిక్య జీవనంలో గంధపుష్ప సుగంధాలకు ప్రత్యేక స్థానముంది. ఇతర దేశాలనుండి సుగంధ ద్రవ్యాలు దిగుమతి చేసుకోవడానికి ప్రత్యేక వ్యవస్థ ఉండేది. రాజధానులలో సుగంధాలకు ఒక పెద్ద భాండాగారం ఉండేది. వీథులలో గంధపునీళ్ళు చల్లడం, కస్తూరి, పునుగు, జవ్వాజి. పచ్చ కర్పూరం, కుంకుమ పూవు, అగరు, పన్నీరు వాడడం సహజంగా ఉండేది. మనుచరిత్రలోని 'సద్యోవివిర్భిన్న' పద్యం పై వాదానికి బలం చేకూరుస్తుంది. సుగంధద్రవ్యాలను పరస్పరం కలిపి తయారు చేసుకొనే 'కలపములు' కూడా ఆనాడు ఎక్కువే.

**భారతీయ నాగరికత 'పూల నాగరికత'** : ఉద్యానవనంలో రకరకాల పూల తీగలు పెంచడం. చిత్రవిచిత్ర హారాలుగా తయారు చేసి మెడలో ధరించడం, తలలో ముడుచుకోవడం ఆనాటి అలంకరణ విశేషం కూడా. ఇంటి ముందర ఉదయం, అస్తమానం పూలు చల్లడం, తోరణాలుగా వేలాడదీయడం కూడా ఉంది. చెండ్లు చేసి సరసక్రీడలాడడం ఆనాటి వారి వినోదం. పూల పాన్పులు, విసన కర్రలుగా పూలు ఆనాటి ప్రజల రసికతకు చిహ్నాలు.

**తాంబూల భోగం** : అజీర్ణం పోగొట్టే ఔషధం తాంబూలం. బ్రహ్మచారి, వితంతువు, సన్యాసి తప్ప మిగతావాళ్ళు సేవించేవారు. తాంబూలంలో సుగంధ ద్రవ్యాలు తప్పనిసరి. ఇంటికి వచ్చినవారికి తాంబూలం ఇవ్వడం ఆచారం. 'రమణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము' కోరుకొన్నవాడు అల్లసానిపెద్దన. అంతే కాదు తాంబూల వాసన పసిగట్టి ప్రవరుడు తచ్చాడుతూ వరూధిని ఉన్న ప్రదేశం చేరుకొన్నాడు.

**వనితా భోగం** : రాయల కాలము నాటి రసికతలో ప్రధానాంశంగా వనితా భోగం కనిపిస్తుంది. స్త్రీని భోగవస్తువుగా భావించడం, అలాగే పురుషులను ఆకర్షించడం, విరివిగా కనిపిస్తుంది. బహుభార్యా లోలత్వం రసిక చిహ్నంగా నిలిచింది. మనుచరిత్ర, ఆముక్తమాల్యదలలో వేశ్యల విలాసాలు వర్ణితం.

ఇక రాళ్ళపల్లి వారు అష్టభోగాలతో చేర్చిన అన్న, పాన, స్నాన భోగాదులను కూడా చర్చించడం సమంజసం.

**అన్న పాన భోగాలు** : రాయల కాలం నాటి వారికి అన్న పానీయాలపై ఉన్న అనురక్తి అతివేలం. అమృతం తాగి ఆకలిదప్పులు లేని దేవతలకు కూడా నాలుకకు పట్టిన తుప్పు పోయే విందులు కావాలట. ఆయా ఋతువులకు తగిన అన్న పానీయ సేవనం ఈనాటి వారికి

తెలియదనడం వాస్తవం. వేసవి కాలంలో చందన గంధం, తెల్లగా కొద్దిపాటి వేడిగా ఉండే అన్నం, తియ్యని చారు, మజ్జిగపులుసు, పల్చగా ఉండే గంజి, చెరుకురసం, లేత కొబ్బరినీళ్ళు, భక్ష్యాలు, వడమామిడి పిందెల ఊరగాయలు, నీరు మజ్జిగలు సేవించేవారు. సుగంధ అరటిపళ్ళతో, లావైన పెద్ద పనసతొనలతో, నేతి ముద్దల లాంటి తెల్లని చెరుకు ముక్కలతో కూడిన వివిధ మామిడి కాయలతో, ద్రాక్షా పానకంతో నానబెట్టిన పెసర పప్పుతో, దానిమ్మ గింజలతో, రసదాడి అరటిపళ్ళతో అతిథులకు పానకం ఇచ్చేవారు. దోరమామిడి ముక్కల్లో అప్పుడే తడియార్చిన చేపలు తరిగివేసి నువ్వులనూనె తిరగమాతవేసి తాలింపు వేసి చక్కగా చేపలకూరతో మాంసాహారం సేవించేవారట. ఆ కూర వెగటు పోవడానికి, సాయంకాల సమయంలో ఇసుకలో పూడ్చి పెట్టిన కొబ్బరి బోండాలు తీసి చల్లని ఆ లేత కొబ్బరినీళ్ళు త్రాగేవారట. అలాగే వర్షాకాలంలో రెడ్లు గురుగాకు, చెంచలి ఆకు, తుమ్మ ఆకు, లేత తగిరపాకు మొదలగు వాటిని చింతచిగురుతో కలిపి నూనెలో ఇగురు కూరవేసి, వేడిగా ఉండే చిన్నారుగ బియ్యపు అన్నాన్ని సంతృప్తిగా కుడిచి, గొడ్లు పొలానికి పోగా దూడలు రెడ్ల దేహాన్ని నాకుతుండగా మేక ఎరువు కుంపటి వెచ్చదనాన్ని అనుభవిస్తూ మంచం ఎక్కేవారట.

**స్నాన భోగం :** అభ్యంగన స్నానమే ఆనాటి స్నానం. విష్ణు చిత్తుని ఇంటిలో ప్రతి శనివారం పరదేశి వైష్ణవులకు తలంటునీళ్ళు సాగేవి. స్నానానంతరం సొగసయిన కేశాలంకరణ నియతం కూడా.

**నివృత్తి భోగాలు :** నివృత్తి భోగాలలో భక్తి, త్యాగ, వైరాగ్యాలు ముఖ్యమయినవి. రాయలు పరమవైష్ణవుడు. పెద్దన నందవరీకుడయినా వైష్ణవం పుచ్చుకొన్నవాడే. మనుచరిత్ర అంతటా వైష్ణవ పరిభాషలు, మతవాతావరణం, సిద్ధాంతాల సూచనలున్నాయి. పాండ్యరాజుకు శైవాభిమానమయితే అతని పత్నికి వైష్ణవ అభిమానం ఉంది. రాయల 'ఆముక్తమాల్యద' ఆండాళ పెరియాళ్వారుల చరిత్రలే. అలాగే మనుచరిత్రలో ప్రవరుడు నివృత్తి భోగానికే ప్రాధాన్యం ఇవ్వడం. ఆముక్తమాల్యదలో యామునాచార్యులు భోగతృష్ణను వదలిపెట్టడం లాంటివి ఆనాటి ప్రబల నివృత్తి భోగాపేక్షను సూచిస్తాయి.

రాయల యుగంలో శౌర్యం ఉంది. రాజ్యవిస్తరణ కాంక్ష ఉంది. రాజభక్తి ఉంది. సురక్షితంగా దేశాన్ని కాపాడుకొనే సామర్థ్యం ఉంది. కర్షకజనానికి అవసరమయిన నీటి పారుదల సౌకర్యం ఉంది. పైగా కళాతృష్ణ ఉంది. అందుచేతనే శిలలపై శిల్పాలు రమణీయంగా చెక్కినారు. కళలను పోషించారు. ఇవన్నీ రసిక జీవన ఫలం. భోగ దృష్టితో బాటు విరాగదృష్టిని కూడా మరవకుండా ప్రజలను సమతౌల్యంలో నిలపడం రాయల నాటి రసికతలో భాగమే.

## 2. స్త్రీలకు సంబంధించిన రాయల నాటి రసికతను వివరించండి.

రసికుడంటే 'భోగి'. రసికత అంటే భోగం. ఆ భోగం రెండురకాలు. ప్రవృత్తి భోగం, నివృత్తి భోగం అని ప్రాపంచికములయిన గృహశయ్యాదులు ప్రవృత్తి భోగాలు. రాయలకాలం నాటికి మగవారికి స్త్రీ భోగ్యవస్తువు. దీనికి ప్రధానకారణం మగవారి స్వార్థ పరత ఒక కారణం కాగా స్త్రీపరంగా ఈనాటివలె హక్కుల పోరాటం లేకుండడమే.

రాయలనాటి కవులు స్త్రీలలో అందచందాలను వర్ణించినట్లు వారి మనోభావాలను వర్ణించలేదు. తరముకొని వచ్చు రాక్షసునికి భయపడి పరుగెత్తు మనోరమ వర్ణనలో కూడా పెద్దన 'ఆంగిక చలనానికి' ప్రాధాన్యమిచ్చాడు. చివరకు ఆడువారి ఏడుపులో కూడా వారికి 'సంగీతం' వినిపించడం ఇలాంటిదే. 'కలస్వనముతో' వరూధిని ఏడ్పు 'బాలపల్లవ గ్రాసకషాయకంఠ కలకంఠ వధూకల కాకలీ ధ్వనుల' తో సత్యభామ రోదన, 'కిన్నరవధూరాజత్కరాంభోజ కాంభోజీ రాగవిపంచి కారవ సుధాపూరంబు తోరంబుగా' గిరిక ఏడ్చినదని పెద్దన తిమ్మన రామరాజభూషణులు వర్ణించి సంతృప్తిపడ్డారు.

రాయల కాలం నాటివారికి సంపదకు కొదువలేదు. భోగ్యదృష్టి ఎక్కువ. ఆ భోగ్యదృష్టిని ప్రదర్శించడానికి బహుపత్నీవ్రతం వేశ్యాలంపటత్వం సాధనాలుగా మారాయి. స్త్రీల హృదయం ఆకర్షించడం మహాపురుష లక్షణంగా మారింది. అందుచేతనే కవులు తమ ఆశ్రయదాతల్ని 'బిసరుహనయనా నవవిధ కుసుమాయుధ' 'విలోకి వధూజన సూనశరాసన' 'ప్రసృత విలోచనా కుసుమబాణ' అని వర్ణించారు. పైగా రాయలను శ్రీకాకుళంలో 'ఇతోధిక బహుప్రేయసీ ప్రాప్తిరస్తు' అని నోరార దీవించారు. బహుపత్నీవ్రతంలో 'జాతిమత శీలాదుల

తకరారులు', ఉండడం వల్ల వేశ్యాలోలుపత్వాన్ని, వేశ్యల పరిచారికత్వాన్ని అంగీకరించారు. పైగా నాయికల చెలికత్తెలను సుందరాంగులుగా వర్ణించి వారి సేవలు స్వీకరించడం పురుష లక్షణంగా భావించి స్త్రీ భోగవస్తువని నిరూపించారు. ఇందుకు మనుచరిత్రలోని 'రసికత' ఎప్పుడూ 'ప్రయోజనాకాంక్షి'. ఆ ప్రయోజనం నానారకాలు. వలచిన వనితను 'తల పెట్టుకోవడం' ఒక రకం. అలిగిన వేళ అనునయించడం మరో రకం. కోప గృహంలోని కోమలిని ప్రసన్నురాలుగా తిప్పుకోవడం ఇంకొక రకం. ఈ లాలింపులో, కొసరులో చిలిపి చేతలలో 'మగతనం' సౌందర్యానికి బానిస అవుతుంది. నచ్చిన మెచ్చిన నెలత చీవాట్లు ఎడమకాలి తన్నులు బుజ్జగింపు వైపే మొకరిల్లుతాయి. ఈ అంశానికి నంది తిమ్మన పారిజాతాపహరణం లోని శ్రీకృష్ణుని చేతలే సాక్ష్యం. ఈ రసిక ధర్మరహస్యం రాయల కాలంనాటి సహజ స్వభావం.

వ్యాపారానికి, ధర్మకార్యాలకు 'వనితానియోగం' మధ్య యుగధర్మం. ప్రత్యేకించి 'పూలవ్యాపారం': దీనికి ప్రధాన కారణం రెండూ సుకుమారవస్తువులు కావడం. అంతే గాక రసికుల శృంగారతృష్ణకు పూలమ్మ్మే విలతులు, చలిపందిళ్ళలోని చెలువలు 'బలం' చేకూర్చేవారు కావడం. పైగా కథానాయికల పాతివ్రత్యమే వర్ణించిన కవులకు ఈ పుష్పలావికల వర్ణనలు రాళ్ళపల్లి వారి మాటలలో 'పండుగ వచ్చినట్లు'.

రాయల కాలం నాడు స్త్రీ 'భోగ్యవస్తువు' కావడంతో స్త్రీలలో కూడా కొందరు 'బరితెగించడం' లేకపోలేదు. వరూధిని నిష్ఠా గరిష్ఠుడైన, నివృత్తి భోగపరుడయిన ప్రవరుని "ప్రాంచద్భూషణ బాహు మూలరుచితో ( బాలిండ్లు పొంగార మైయంచుల్ మోపఁగఁ గౌఁగిలించి యధరం బాసింప" ముందుకు ఉరికింది. చివరకు ప్రవరుడు 'శ్రీహరీ' అని త్రోసివేయడంతో వరూధినికి 'అశనిపాత' మయింది.

రాయల కాలం నాడు రక్తులు విరక్తులున్నారు. అన్య స్త్రీల పట్ల విరక్తతకు ప్రవరుడు సాక్ష్యం. ప్రవృత్తి భోగాల కంటె నివృత్తి భోగాలే శాశ్వతమని, లోకానికి అవసరమని చాటించి చెప్పడానికే పెద్దన మనుచరిత్ర వ్రాశాడు. భోగిని యింటికి బయలుదేరిన రాజా మత్స్యధ్వజుడు అంతఃపురం చేరుకోవడం అలాంటిదే. ఒకటి రెండు సన్నివేశాలున్నా మొత్తానికి రాయలకాలము నాటి ప్రజలు రసికులనడంలో అభిప్రాయ భేదాలు లేవు, మనోరమతో అరణంగా పంపిన చెలికత్తెల అందచందాల వర్ణనలు సాక్ష్యం.

"జవ్వనంపు గ్రొవ్వున నివ్వటిల్లి ........ మాటకారితనంబు మెఱసి, నాగరికపు పనుల గరగరికల ... పసగలిగి, మేలిమైన కులుకుల రసిక జనంబుల మనంబుల మరులు కొలుపం జాలి, సురుచిరాభరణ భూషితంబగు పరిచారికాసహస్రమును ఇందీవరాక్షుడు పంపాడని పెద్దన మనుచరిత్రలో వర్ణించాడు.

సమాజంలో డాబు దర్పాల ప్రదర్శనాకాంక్ష ప్రబలినప్పుడు 'సాంసారిక పక్షం' వెనకడుగు వేయక తప్పదు. ఇలాంటి వ్యవస్థలో అందచందాలకు, ఆకర్షణకు, పరిచర్య పేరుతో పరిహాసానికి, రసికతకు వేశ్యల ప్రాబల్యం పెరిగిందనడం సత్యం. నాట్య సంగీతాలు క్రమంగా వేశ్యల వృత్తులు కావడం కూడా మరొక కారణం. రాయలు ఆముక్తమాల్యదలో శ్రీరంగనాయకుల కళ్యాణం వర్ణిస్తూ తలంటు స్నానం చేయించడానికి స్వర్గం నుండి 'అచ్చరలు' దిగి వచ్చారని వర్ణించాడు. పరమ ఛాందసుడైన విష్ణుచిత్తుని మధుర నుండి సాగనంపుటకు, ఊరివారిని ఎదుర్కొని తోడ్కొని తెచ్చుటకు 'వేశ్యలు' భాగం పంచుకొన్నారని రాయలు వర్ణించాడు. అంతేకాదు పొరుగూళ్ళ నుండి వచ్చిన సామంత రాజులు 'మెరవణి' లోని వేశ్యలతో సరససల్లాపాలాడడం కూడా చదువరుల దృష్టికి తెచ్చాడు. ఊరివారు చాలకున్న ఇతర ప్రాంతాలనుండి 'గాణిక్య' లను తరలించేవారు కూడా లేకపోలేదు.

రాయల కాలంలో సంగీతం చాలావరకు 'ఆడవారి' సొత్తు. వారు వీణ వాయించగలరు. ఆడగలరు. పాడగలరు. చూడికుడుత్తమ్మ వీణతో కాక తంబురతో జతచేసి పాడగలదని రాయలు వర్ణించాడు. మగవారి గానం కంటే ఆడవారి గానంపై మక్కువ ఎక్కువ అని చెప్పవచ్చు. 'బాస కృతి సెప్ప వలతులు' అని రాయలు వర్ణించాడు.

3. శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు 'రాయల నాటి రసికత' పాఠ్య భాగంలో నేటి కాలం వారి ప్రవృత్తులను మెచ్చుకొన్న, నొచ్చుకున్న అంశాలను ప్రస్తావించండి.

ఆంధ్ర సాహిత్య విమర్శకులలో అనంతకృష్ణశర్మ గారొకరు. శర్మగారి పరిశీలన, రచనావిధానం పలువురిని ఆకర్షించిందనడం వాస్తవం. వారు 'రాయల నాటి రసికత' వ్యాసంలో నవీనుల రసికతను కొన్ని చోట్ల మెచ్చుకొన్నారు. మరి కొన్ని చోట్ల నొచ్చుకొన్నారు.

రాయల కాలం వారు జాగరూకులు. పరిపాలకుల ఔన్నత్యం బేరీజు చేసుకోగల సమర్థులు. గూఢచారులున్నారని తెలిసినా వానవెలిసే దాకా ఒక చోట ఆగిన దాగినవారు అశ్వపతి, గజపతి, నరపతులలోఎవరు బలవంతులో చర్చించేవారని రాయలు ఆముక్తమాల్యదలో ఉటంకించినాడు. భయమున్నా కొన్ని విషయాలలో నిర్భయత్వం వారి సొత్తు. ఈ విధానం నేడు కానరాదు.

రాయల కాలంలో కలవారి యిండ్లలో కోపగృహాలు ఉండేవి. కోపగించిన యాజమానురాలిని అనునయించడానికి యజమానులు ఆ గృహాల వైపు నడక సాగించడం సహజం. ఈ అంశం ప్రస్తావిస్తూ రాళ్లపల్లి వారు 'ఏ బుద్ధిమంతుడు దీనిని కల్పించెనో కాని యిది చాలా మంచి పద్ధతి. తక్కినవారు తమ తమ పనులు తకరారు లేకుండ చేసుకోవచ్చును', అని మెచ్చుకొన్నారు.

శర్మగారు ప్రశంసించిన మరో అంశం ఆనాటి వారి కేశసంపద. సాంద్రకేశ సంపదను అలంకారంగా భావించినవారు రాయల నాటి రసికులు. తలవెంద్రుకల సొంపును సొగసును గుర్తించి సంతసించిన వారిలో పెద్దన ఒకడు. కాని నేడు వెంట్రుకలు అలంకారం కాదు. వికారమనే భావన కూడా ఉంది. పైగా పాశ్చాత్య నాగరికతా వాసనల ప్రభావంతో స్త్రీలు కూడా తల కత్తరించుకోవడాన్ని నాగరికతగా భావిస్తున్నారని శర్మగారు నొచ్చుకొన్నారు.

శర్మగారు తన ఆవేదనను ప్రకటించుకొన్న మరొక అంశం. ముతక ఖద్దరు ధారణ. రాయల కాలంలో పురుషులు తెల్ల వస్త్రాలను అపురూపంగా ధరించేవారు. గంధర్వుడు నీర్కాలిపింజధోవతి గట్టిన వ్యక్తి. పాము పొరల లాంటి వస్త్రాలు కూడా లేక పోలేదు. ఈ అంశాలను ప్రస్తావిస్తూ రాళ్ళపల్లి వారు 'ఆ కాలమున నట్టి నూలు, అట్టి నేత సాధ్యములైనవి. ఇప్పటి ఖద్దరు ధారులనేకులు తాము కట్టుకొను వస్త్రము లెంత ముతకగానున్న నంత దేశాభిమాన మెక్కువ చూపినట్లు, స్వరాజ్యమున కంత దగ్గర బోయినట్లు భావించెదరు' అని విసురు ప్రదర్శించారు. అలాగే సర్జుసూటులు, ఇస్త్రీ చెడని వస్త్రధారణం లాంటివి ఇతరుల మెప్పు కోసం ధరిస్తున్నారని భావించారు.

రాళ్ళపల్లి వారు ప్రస్తావించిన ఇంకొక అంశం ఆనాటి వారికి నగల మీదున్న ప్రీతి. సమానములైన అభరణముల ఆశ వలన సంసారంలో శాంతి. కాని నేడు నగల మీద ఆశ మగవారికి చాలా వరకు తగ్గింది. దీని వల్ల ఆర్జించే శ్రమ ఒకరికి, అలంకారం ఒకరికి అనే భావం ఏర్పడింది. నగల సమానత్వం నశించి మగవారి గుండీలు, గడియారం, గొలుసులు, ఉంగరాల సొగసులలో రూపపరివర్తనం చెందిందని శర్మగారన్నారు.

శర్మగారు ఘాటుగా విమర్శించిన మరొక అంశం నేటి వారికున్న సుగంధ ద్రవ్యాల ప్రీతి. రాయల నాటి వారికి సుగంధ ద్రవ్య సేవనం, తపనం ఎక్కువ. కాని ఈ భావం నేడు లేదు. దిగుమతి చేసుకున్న సెంటులో సారాయి కంపు తప్ప మరేమీ లేదు. ఒక వేళ ఆశపడినా స్వతంత్రంగా పూసుకొను ధైర్యము లేదు. వస్త్రధారణలోని మార్పు కూడా దీనికి కారణం. అలాగే 'పూల పెంపకం' లో కూడా "నిర్గంధకుసుమాలకే అగ్ర తాంబూలం" అని శర్మగారు ఆవేదన పడ్డారు.

'రాయల నాటి రసికత' పాఠంలో ప్రస్తావించిన మరో అంశం నాటి, నేటి కాలం వారి 'ఆహార' విషయం. శర్మగారు నాగరిక అనాగరికుల భోజనాదుల్ని, శాఖాహార మాంసాహార రకాల్ని, ఆయా ఋతువులలో ఆరగించే పానీయాలను పేర్కొంటూ అన్ని కాలములందును ఒకటే విధముగా అత్యాహారమో అల్పాహారమో చేసి అజీర్ణ రోగములను వరమడిగి తెచ్చుకొన్నవారము మనము' అని అంచనా వేశారు.

'తాంబూల' సేవనంలో కూడా ఔషధ ప్రయోజనం ఉన్నది. కాని తాంబూలంలోని పరిమళ ద్రవ్యాలను వదలి పెట్టి 'పొగాకు' చేర్చడం నేటి వారికి అలవాటయింది.

చివరగా శర్మగారు ప్రస్తావించిన అంశం రాయల కాలం నాటి భోగతృష్ణ. ఎన్నిటినో సమర్థించిన శర్మగారు ఈ అంశములో మాత్రం కుండ బద్దలు కొట్టినట్లుగా 'రాయల కాలపు వారి యీ భోగతృష్ణను మనదానితో పోల్చికొని చూచిన మనము వారికన్న నెంతో మేలుగా నున్నామనిపించును' అన్నారు. స్త్రీల పట్ల మగవారి అభిప్రాయాలు మారడం 'శ్లాఘ్యవిషయం' అన్నారు.

పాశ్చాత్యులను, పాశ్చాత్య నాగరికతను ఈసడించుకొన్న శర్మగారు మత్స్యధ్వజుని లాగే ప్రవృత్తి భోగాలను తృణప్రాయంగా భావించిన పాశ్చాత్యకన్య 'ఎమ్. స్లేడ్' లో కలిగిన మార్పును శ్లాఘించారు. ఎమ్. స్లేడ్ సర్వ సంపదలతో స్వేచ్ఛా భోగాదులతో కాలం గడుపుతూ ఒక రోజు రాత్రివేళ గాంధీమహాత్ముని జీవిత చరిత్ర చదివి మనసు మారగా భారతదేశంలో గాంధీ ఆశ్రమంలో శిష్యురాలై చేరింది.

శర్మగారు సద్విమర్శకులు. వారి విమర్శలో తులనాత్మక పద్ధతి ఉంది. గుణదోషాలను ప్రదర్శించే నైపుణ్యం ఉంది. ఎదుటి వారిని ఆలోచింపజేసే సహజగుణముంది. చక్కని వచనరచనతో పాఠకుల్ని పరవశింపజేసే సరళశైలి ఉంది.

4. 'రాయల నాటి రసికత' పాఠ్యాంశం ఆధారంగా రసికుడు - రసికత అనే అంశాలను మరియు కావ్యాలలో సమకాలిక జనుల చిత్తవృత్తుల్ని వివరించండి.

ఈనాటి నిత్య జీవితంలో 'రసికుడు' అంటే కేవలం స్త్రీలపట్ల వ్యామోహం ఎక్కువ కలవాడని కొందరు భావిస్తారు. కాని రసికుడంటే భోగి. రసికత్వమంటే భోగ ప్రియత్వం. ఈ భోగాలు అనేక రకాలు. వీటిని ప్రాచీనులు తిరస్కరించలేదు. కాకుంటే భోగాలను ప్రవృత్తి భోగాలని, నివృత్తి భోగాలని వర్గీకరించుకొన్నారు.

ప్రాచీనులు 'అష్ట భోగాలను' వర్గీకరించారు. ఇల్లు, వస్త్రం, ఆభరణం, గంధం, పుష్పం, తాంబూలం, శయ్య, స్త్రీ అనేవి అష్ట భోగాలు. వీటిలో అన్న పాన స్నానాలు లేవు. బహుశ అవి అందరికి సామాన్యం కావచ్చు. లేదా గృహాదులకు ప్రాధాన్యం ఇచ్చివుండవచ్చు. ఏతావతా భోగాలు 11 అని చెప్పడం సమంజసం.

ఇక రసికత్వమన్నది జాతి గొప్పతనాన్ని తెలియజేసే అంశం. రసికత లేనివాడు జీవచ్ఛవం. రసికతకు మూలం సత్త్వం. సత్త్వ మంటే వలపు, ఉత్సాహం మొదలయినవి. ఈ భావాలు మనిషిలో ఉదయిస్తాయి. ఉద్రేకపరుస్తాయి. శారీరకంగా మార్పులు తెస్తాయి. మానసికంగా ఆనందపరవశుల్ని చేస్తాయి. కొన్ని వేళల్లో ఆవేశపూరితుల్ని చేస్తాయి. కార్యోన్ముఖులుగా చేస్తాయి. నాగరికునిగా గుర్తింపు తెస్తాయి. ఇవి లేనివారు నిర్జీవులు. రాయల కాలం నాటి వారు రసికులు వారికున్నంత రసికత ఈ కాలం వారికి లేదని రాళ్ళపల్లి వారి అభిప్రాయం.

సాహిత్యం సమాజానికి దర్పణం లాంటిది. ఏ కవి గాని తన కాలం నాటి ప్రభావాలకు లోనుగాక తప్పదు. తన కాలంనాటి సమాజాన్ని సన్నివేశాల ద్వారా, వర్ణనల ద్వారా పాత్ర చిత్రణలలో ఒక భాగంగా చిత్రీకరించకుండా ఉండలేడు. రాయల కాలం నాటి జనుల జీవితాలను సాక్షాత్తుగా తెలిపే గ్రంథాలు లేవనవచ్చు. అయితే రాయల జీవితాన్ని, రాయలతో సన్నిహిత సంబంధం గల కవుల రచనలున్నాయి. వాటిలో అల్లసాని పెద్దన మనుచరిత్ర. నంది తిమ్మన పారిజాతాపహరణం. రాయల ఆముక్తమాల్యదలు చెప్పుకోదగ్గ గ్రంథాలు. ఇవి ప్రబంధాలు. ప్రబంధాదులలో వర్ణనలకే ప్రాధాన్యం. వర్ణనలు సహజంగా గోరంతను కొండంతగా చెప్పేవి. వీటిలో 'సత్యం' కూడా ఉంటుంది. అనుభవంలో లేని అసత్యవిషయాలను కవులు వర్ణించి వుండవచ్చు. కాని వాటిని సమకాలంలోని కవులు విమర్శించలేదు. అందువల్లనే రాళ్ళపల్లివారు కవి జీవించి తిరిగి చూచి అనుభవించిన సమాజం మన కళ్ళకు ఎదురుగా సత్యమై కనబడుతుండగా అతడు వ్రాసిన కావ్యమంతా అసత్యమనడం అసాధ్యమైన అంశంగా తలపోశారు. తత్త్వ శాస్త్రవేత్తల దృష్టి వేరు. సాహిత్య జగద్విహారుల దృష్టి వేరు. సత్యం లేని అసత్యం గాని అసత్యం లేని సత్యం గాని దొరికే పదార్థం కాదు. అందువల్ల జనుల త్రికరణ ప్రవృత్తులు కావ్యాలలో ప్రతిఫలిస్తాయి.

'శ్రీవిల్లి పుత్తూరు వర్ణన' సమకాలీన జన జీవనానికి ఒక గుర్తు. వానాకాలంలో భార్య పడే ఇబ్బందుల్ని గుర్తించి ముందుగానే ఎండిన కొబ్బరి బొండాల్ని సిద్ధం చేయడం ఒకటి. రంగనాథుడు గోదాదేవిని పెండ్లాడడానికి సిద్ధమయినా, బ్రహ్మ రుద్రాదులను పంపినా మా యింటనే వివాహమాడాలని నిర్దేశించడం మరొకటి. ఇది పాత కాలం నాటి మామల మర్యాదగా రాళ్ళపల్లి వారన్నారు.

ఇక వర్ణనలలోను సమకాలీనాంశాలున్నాయి. హిమగిరులలోనివి ద్రాక్షగుత్తుల వర్ణన పెనుగొండలోనివి కావచ్చు లేదా విజయనగరంలోనివి కావచ్చు. పెనుగొండలోని కోతులు, కార్చిచ్చులు, పందులు, దున్నపోతులే హిమగిరులలో ఉన్నట్లు వర్ణింపబడ్డాయి. స్వరోచి గంధర్వుడయినా అతడు వేటకు వెళ్ళిన వేళ వలలు మోసిన వారు ముసలి బోయవాళ్ళే. వరూధిని గంధర్వాంగన అయినా సామాన్య మనుష్య స్త్రీగానే మసలుతుంది.

కవులు భావాంబర వీధి విహారులయినా భూలోకపు అంచులు దాటిపోలేదు. తాము జీవిస్తున్న సమాజాన్ని ఎదల కావ్యరచన చేయలేదు. చేయలేరు. ఈ దృష్టితో రాయల కాలం నాటి వ్యక్తుల కష్టసుఖాలు, భోగభాగ్యాలు, మానసిక బలహీనతలు వైముఖ్యాలు గుర్తించవచ్చని రాళ్ళపల్లి వారి అభిప్రాయం. ఈ నేపథ్యంలోనే వారు 'రాయల నాటి రసికత' వ్యాస రచన చేశారు.

## సారాంశం :

రాయల కాలంలోని జనుల ప్రవృత్తి భోగాలనే కాక నివృత్తి భోగాలను కూడా వివరించి నాటి ప్రజల రసికతను, ప్రజలహితాన్ని కోరిన నాటి ప్రభువుల సురక్షిత పాలనను, జనాభ్యుదయాన్ని ఈ పాఠంలో అభివర్ణించడం జరిగింది.

## ప్రశ్నలు :

1. రాయల కాలం నాటి సామాజిక జీవన విధానాన్ని సంక్షిప్తంగా వివరించండి.
2. స్త్రీ ని భోగ్యవస్తువుగా భావించిన రాయలనాటి ప్రజల మనః ప్రవృత్తిని వెల్లడించండి.
3. రాయల కాలం నేటి ప్రజల విరక్తి మార్గాన్ని గూర్చి తెల్పండి.

**ఆచార్య కె. సర్వోత్తమరావు**
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

ఖండం - 3

# గద్య భాగం

## పాఠం - 3 బహుకాల దర్శనం

- దేవులపల్లి కృష్ణశాస్త్రి

**శీర్షికలు :**

1. రచయిత పరిచయం
2. పాఠ్యభాగ సందర్భం
3. పాఠ్యభాగ సారాంశం
4. కఠిన పదాలకు అర్థాలు
5. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :**

గద్య భాగంలోని మూడవ పాఠమైన 'బహుకాల దర్శనం' అనే నాటికలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఉపాయంతో డబ్బు గడించే శ్రీరాములు పాత్ర మనస్తత్వాన్ని చిత్రీకరించారు. ప్లీడరు వెంకయ్య, అతని నమ్మిన బంటు వెంకన్న, ప్లాట్‌ఫాం మనిషి శ్రీరాములు అనే ముగ్గురు వ్యక్తులతో బెజవాడ జంక్షన్ వేదికగా సృష్టింపబడిన రేడియో నాటిక ఇది.

### 1. రచయిత పరిచయం:

'బహుకాల దర్శనం' అనే రేడియో నాటిక రచయిత శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం తాలుకా చంద్రమ పాలెం వీరి జన్మస్థలం. తల్లి సీతమ్మ. తండ్రి వేంకట కృష్ణశాస్త్రి. కాకినాడ, పెద్దాపురంలలో ఉపాధ్యాయుడుగా, కాకినాడ కళాశాలలో ట్యూటర్‌గా, హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో ప్రయోక్తగా రాణించినవారు. చివరి రోజులలో గొంతు మూగబోయింది. 1.11.1897 లో జన్మించిన శాస్త్రిగారు 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అంటూ 24.2.1980 లో పరమపదించారు.

భావకవిత్వాన్ని ఆద్యులు కాకపోయినా ప్రతినిధి వంటి కవి. వియోగంలో మాధుర్యాన్ని , విషాదంలో సౌందర్యాన్ని అన్వేషించి దర్శించిన భావకవి. కవితా రచనలోను, కవితా పఠనంలోను, అన్నిటికి మించి వేషంలోనూ ఆనాటి యువకవులకు అనుసరణీయులయ్యారు. తమ రచనలనే కాక ఇతరులు రచనలను కూడా మధుర కంఠంతో పాడి వినిపించడం శాస్త్రిగారి ప్రత్యేకత. ఇంగ్లీష్ కాల్పనిక కవులైన షెల్లీ, కీట్సుల ప్రభావం కృష్ణశాస్త్రిపై ఎక్కువ. అంచేత మిత్రులు ఆంధ్రాషెల్లీ, ఆంధ్రా కీట్సు అని పిలిచేవారు. పద్మభూషణ్, కళాప్రపూర్ణలు వీరి బిరుదులు.

ఋగ్వేధి, మహతి అనేవి గేయసంపుటాలు, కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి అనేవి ఖండ కావ్యాలు. శర్మిష్ఠ, వేణుకుంజం, ఆండాళ్, ధనుర్దాసు, విద్యావతి అనేవి గేయ నాటికలు. క్షీరసాగర మధనం, విప్రనారాయణలు యక్షగానాలు. మేఘమాల వీరి చలన చిత్రాల పాటల సంకలనం. కవిగా, నాటక ప్రయోక్తగా, చతుర సంభాషణాశీలురుగా, మానవతావాదిగా శాస్త్రిగారు ప్రశంసలందుకొన్నారు.

### 2. పాఠ్యభాగ సందర్భం:

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు 1957 సంవత్సరంలో హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ప్రయోక్తగా ఉండేవారు. ఆ సందర్భంలో 'రేడియో నాటికగా' శాస్త్రిగారు 'బహుకాల దర్శనం' వ్రాశారు. ఇది ఒక నాటిక. ఈ నాటికకు రంగస్థలం బెజవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం.

దేశస్వాతంత్ర్యం కోసం, ఆస్తులను అర్పించి, అన్నీ పోగొట్టుకొని, స్వాతంత్ర్యం వచ్చాక తినడానికి తిండికూడా లేని ఒక భారతీయుని జీవితాన్ని ఈ నాటికలో ఆవిష్కరించారు. ప్రభుత్వనిరాదరణ, సాటిమానవుల సహాయ సహకారాలు లేకపోవడంతో సంసారం నెట్టుకు రావడానికి మాటలనే పెట్టుబడిగా పెట్టి పరిచయాలను పెంచుకొని తరువాత డబ్బులు లేవని అబద్ధాలాడి, సానుభూతితో ఎదుటి వ్యక్తి దగ్గర డబ్బు సంపాదించే వ్యక్తి జీవనానికి 'శ్రీరాములు' ఒక ప్రతీక. దేశంలో ఇలాంటి శ్రీరాములు ఎందరో. బతకలేక బతుకుతున్న ఎందరో వ్యక్తుల ఊహాచిత్రం శ్రీరాములు. సన్నివేశంలో సహజత్వం. సంభాషణలో చాతుర్యం. తెలుగుతనం ఉట్టిపడే పదప్రయోగం. భావాలకు తగిన 'యాస' బహుకాల దర్శనం నాటిక ప్రత్యేకాంశాలు.

## 3. పాఠ్యభాగ సారాంశం:-

ఆంధ్రప్రదేశ్ లోని రైల్వేకూడలిలో ప్రసిద్ధి ప్రధాన కేంద్రం విజయవాడ. తెలుగు వారి సంస్కృతిని ప్రతిఫలింపజేసే పట్టణాలలో ఇది ఒకటి. కృష్ణానదీతీరంలోని ఈ పట్టణం మేధావులకు, కళాకారులకు, రకరకాల వర్తక వాణిజ్యాలకు ప్రాణస్థానం. అందువల్ల బెజవాడ జంక్షన్ ఎపుడూ జనసమ్మర్దంతో కిటకిటలాడుతుంది. అటువంటి కూడలి స్థానంలో 'బహుకాల దర్శనం' నాటిక ప్రత్యక్షం కావడం విశేషం.

ఈ నాటికలో వీరయ్య ఒక ప్లీడర్. వెంకన్న వీరయ్య నమ్మిన తరతరాల బంటు. శ్రీరాములు 'ప్లాట్‌ఫాం' మనిషి. రైలెక్కి దిగేవారి మాటల్ని వేషాల్ని పసిగట్టి వారి ఆందోళనను, ఆవేశాన్ని తనకు దగినట్టు మలచుకొని మాటలు గలిపి ఉపాయంతో డబ్బుగడించే బాపతు. ఈ సన్నివేశంతో నాటిక మొదలవుతుంది.

వీరయ్య అసహనంగా రైలు దిగుతూ సామాను తీయించి కార్లో పెట్టించమంటాడు. ఇంటికి వెళ్ళి స్నానం చేసి కోర్టుకు వెళ్లాలని గట్టిగానే చెబుతాడు. ఈ సంభాషణతో వీరయ్య ప్లీడరని, నౌఖరు వెంకన్న అని తెలుసుకొన్న శ్రీరాములు మెల్లగా వారి దగ్గర చేరి 'బహుకాలదర్శనం', 'బహుకాల దర్శనం' అని మొదలుపెడతాడు. 'ఎక్కడ కలుసుకున్నామండి' అని వీరయ్య సందేహిస్తుంటే, 'మరచి పోయారేమిటని నాన్నగారి నడగండి, అని పరిచయం చేసుకున్నాడు. వీరయ్యగారు తన నాన్నగారి పేరు శరభయ్య అంటే తనకు తెలియదేమిటని తికమక పడతాడు. వీరయ్యగారు తన నాన్నగారిని 'నాన్ కో ఆపరేషన్' రోజుల్లో కడలూర్‌లో కలుసుకొన్నారా అంటేను శ్రీరాములు కడలూరు జైలు కధను కల్పించి చెబుతాడు. శరభయ్య గారికున్న తిండి ప్రీతి. తాను పుస్తకాలు చదువకున్నా ఇతరులు చదువుతుంటే వినడానికి కుతూహలపడే మనస్తత్వం ఆకర్షణీయంగా చెబుతుంటే వీరయ్య తబ్బిబ్బయ్యాడు. వీరయ్య మీద మిత్రపుత్రవాత్సల్య వర్షం కురిపిస్తుంటే వీరయ్యకు శ్రీరాములు మీద నమ్మకం కుదిరింది. తనతో ఇంటికి రమ్మని వీరయ్య బతిమాలితే శ్రీరాములు తాను రాజమండ్రి వెళ్ళాలని, తన బావమరిది టిక్కెట్టు సామాన్లతో ట్రైన్ ఎక్కేశాడని, ట్రైన్ ఎక్కడం చేతకాక ప్లాట్‌ఫారం మీద తగలబడ్డానని నిట్టూర్చాడు. వీరయ్యగారు రాజమండ్రికి టిక్కెట్టు తెప్పిస్తానంటే కాసేపు ఆలోచించినట్లు నటించి వాల్తేరుకు వెళ్ళనా, రాజమండ్రికి వెళ్ళనా అని ఆలోచిస్తున్నట్టు నటించాడు. పదిహేను రూపాయలు దగ్గరుంచండి అంటూ చేతిలో పెట్టేసరికి కిమ్మనకుండా సరేనన్నాడు శ్రీరాములు. కోర్టుకు టైమయిందని వీరయ్య సెలవు పుచ్చుకొన్నాడు. ఈ సన్నివేశంతో బహుకాల దర్శనంలో ఒక రంగం పూర్తయింది.

బెజవాడ స్టేషన్‌లో శేషమ్మ, సుబ్బమ్మలు మాట్లాడుకొంటూ నడుస్తుంటారు. ఒకరినొకరు పేర్లతో పలుకరించుకోవడంతో శ్రీరాములకు సంభాషణ సుగమమయింది. కులుపుగోలుతనమున్న సుబ్బమ్మను 'సుబ్బమ్మొదినా' అనడంతో ఆవిడ ఆనందపడింది. శేషమ్మ ద్వారా వారి పెద్దమ్మాయి సీతాలక్ష్మి అని ఆవిడకు అయిదుగురు పిల్లలని విషయం రాబట్టుకొని టిక్కెట్టుకొన్నారా లేకుంటే పట్టుకువస్తానని అన్నాడు. ఆ రోజుల్లో స్త్రీలకున్న సంతాన ప్రీతిని మెచ్చుకొంటున్నట్లు 'కంటే కళ్ళుమూసుకుని కనాలి పిల్లల్ని గాంధారిలాగా' అని కూడా అన్నాడు. తానూ ఆ బోగిలో ఎక్కాలని వుంది గాని ఆ బోగి ఆడవారిది కావడం వల్ల ఎక్కడం సబబు కాదని తన పెద్దరికం ప్రకటించుకొన్నాడు. బెజవాడ స్టేషన్‌లో పెట్టే, పరుసూ పోగొట్టుకొన్నానని, ఎరిగున్న వాళ్ళ దగ్గర డబ్బు పుచ్చుకొని వస్తానన్నట్లు 'వేంకటేసుర్లుతో' చెప్పమని బతిమాలుతాడు. ఈ మాట వినేసరికి ఒకరి దగ్గర అడుక్కోవడమెందుకని శేషమ్మ సుబ్బమ్మలు తమ దగ్గరున్న తొమ్మిది రూపాయలు శ్రీరాములు కిచ్చారు. 'పిల్లల్ని తొంగిచూడనియ్యకండి కిటికీలోంచి' అని హెచ్చరిస్తూ సెలవు తీసుకున్నాడు.

బహుకాల దర్శనం మూడవరంగం చెంచురామయ్య, శ్రీనివాసరావులతో శ్రీరాములు భేటి. శ్రీరాములు చెంచురామయ్యను పేరు పెట్టి పిలుస్తూ శ్రీనివాసరావు 'అయిందా పలకరించడం' అంటూ నీ కథ అంతా తెలుసులే అని హెచ్చరిస్తాడు. చివరకు చెంచురామయ్యతో 'శ్రీరాములు బహుకాల దర్శనమంటూ అడుక్కొనే వైనం' చెప్తాడు. చెంచురామయ్య విసుక్కొంటూ వుంటే శ్రీనివాసరావు అతనికి నచ్చచెబుతాడు.

'తక్కువ వాడు తక్కువ మోసం చేస్తే అది దారుణమైన
నేరం. ప్రభుత్వాలు ప్రముఖులు చేస్తే అది రాజకీయ
తంత్రం. మంత్రాంగం. చిన్నవాడు చిన్న అప్పు చేసి
యెగేస్తే వాడికి కారక్టర్ లేదు. భగవద్గీతలో శ్లోకాలు
విసురుతూ మధ్య మధ్య ప్రార్థనలు చేస్తూ లక్షలు
రుణం చేసి యెగేసి నిక్షేపంగా గౌరవంగా
చెలామణీ అవుతున్న వాళ్ళ నెరుగుదుము.' అన్నాడు.

చివరకు శ్రీనివాసరావు తన వంతుగా పదిరూపాయలు చెంచురామయ్యను అడిగి మరో పదిరూపాయలు శ్రీరాములకిచ్చాడు. మళ్ళీ ఎప్పుడో అంటూ శ్రీరాములు 'బహుకాల దర్శనం' అంటూ కన్నీళ్ళతో నిష్క్రమిస్తాడు.

## 4. కఠిన పదాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| బహుకాల దర్శనం | = | చాలా కాలం తరువాత పరిచితులో, బంధువులో, స్నేహితులో కనబడితే చెప్పే మాట. |
| గవర్నర్ పేట | = | విజయవాడలోని ఒక ప్రాంతం. |
| సంతక్లాసు | = | సంతలాగా కనిపించే రైల్వేబోగి. మూడవ తరగతి. |
| నే వళం | = | తాజాతనం |
| నాన్ కో ఆపరేషన్ | = | సహాయ నిరాకరణోద్యమం. |
| కడలూరు | = | తమిళనాడులో 'చిదంబరం' దగ్గరున్న ఊరు సముద్ర తీర ప్రాంతంలోని ఊరు. కడల్ అంటే సముద్రం. ఒకప్పుడు పేరు పొందిన చెఱశాల. రాయవేలూరు 'తొర్రైప్పాడి' లాంటిదే. |
| జంటనగరాలు | = | సికిందరాబాద్, హైదరాబాద్ లాగా పక్కన పక్కన ఉన్న నగరాలు. |
| రామయ మంత్రి భోజన పరాక్రమం | = | "గ్రామము చేత నుండి పరికల్పిత ధాన్యము నింటనుండి" అని ఒక చాటువు. అగ్రహారాదులుండగా పంట పండుతూ పంటలు అందుతుంటే శ్రామిక శక్తి వెనకడుగు వేసి కేవలం తినడానికి కోసమే పుట్టానంటూ హాయిగా జీవితం గడిపే 'రామయమంత్రి' వృత్తాంతం ఇందులో ఉంది. ఒక్కొక్క 'కడి'. తాటికాయంత ముద్దలు మింగేవాడని ప్రతీతి. భోజన ప్రియుడని సారాంశం. |
| అస్తమానం | = | 'పొద్దస్తమానం' అనడం అలవాటు. 'పొద్దు' ఉదయాన్ని అస్తమానం అస్తమయాన్ని తెలియజేస్తుంది. |
| ఆయకుడుం | = | ఆవిరి కుడుం. |
| మలపగేదె | = | ‹ ఎచ్చి పాలు ఇచ్చే గేదె. |

| | | |
|---|---|---|
| మాలీసు | = | గుఱ్ఱాల శ్రమ తీర్చడానికి చేసే త ... లాడడానికి చెసె ప్రయత్నం కూడా. మనుష్యుల దేహాల్ని తోమేవారిని కూడా మలీసులుగా పరిగణిస్తారు. |
| వాల్తేరు | = | విశాఖపట్టణం. |
| హమేషా | = | ఎపుడూ |
| పల్నాటి యుద్ధంలో నాయకురాలు | = | నాగమ్మ. |
| రాట్నం | = | నూలు వడికే యంత్రం |
| గాంధారి | = | ధృతరాష్ట్రుని భార్య. 100 మంది కొడుకుల్ని కన్న తల్లి. |
| దగాకోరు | = | మోసగాడు. |

## 5. ప్రశ్నలు - జవాబులు

**1. బహుకాల దర్శనం నాటిక కథను వ్రాయండి**

లేదా

**శ్రీరాములు మాటకారి తనాన్ని విశదీకరించండి.**

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు రచించి ప్రదర్శింప జేసిన రేడియో నాటిక 'బహుకాల దర్శనం'. ఈ నాటికలో ప్రధాన వ్యక్తి శ్రీరాములు. అతడు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వ్యక్తి. సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా వ్యవహరించిన వ్యక్తి. తన ఆస్తి పాస్తులన్ని పోగొట్టుకొన్న వ్యక్తి. స్వాతంత్ర్యం వచ్చాక కూడా అతని పరిస్థితిలో మార్పు లేదు. ప్రభుత్వ సహాయం లేదు. తోటి మానవుల ఆదరణ లేదు. అసహాయ ఉద్యమంలో పాల్గొన్నవారు బతుకు తెరువు కోసం ఇతరుల సహాయం కోరడం తప్పని సరి అయింది. కాని అతడెన్ను కొన్న పద్ధతి దోపిడి కాదు. దొంగ తనం కాదు. మాటల గారడితో జీవికకు అవసరమయిన సొమ్ము వారి ద్వారానే స్వీకరించడం 'బహుకాల దర్శనం' నాటిక కథా వస్తువు.

బెజవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంలో శ్రీరాములు తచ్చాడుతుంటాడు. అప్పటికే రైలువచ్చి ఆగింది. రైలు నుండి వీరయ్య దిగాడు. తన నౌఖరు వెంకన్నతో సామాను కారులో పెట్టమని ముందు కారు గవర్నరుపేటకు పోనియ్యమని, స్నానంచేసి, వొళ్ళు మరమ్మతు చేసుకొని ఆ తరువాత కోర్టుకు వెళతానని పురమాయించాడు. అపుడు నౌఖరు వీరయ్యతో 'ఫస్టుక్లాసు' దొరకలేదా అని ప్రశ్నించాడు. వీరయ్య తనకు కనీసం థార్డ్‌క్లాసులో కూడా సీటు దొరకలేదని పక్కన కూర్చొన్న షావుకారు మాటిమాటికి నిద్రలో పైన బడడంతో అసహనంగా రాత్రంతా గడిపానని చెబుతుంటే శ్రీరాములు 'బహుకాల దర్శనం' అని పరిచయం చేసుకొన్నాడు. బాగా పరిచయమున్నట్లు మాటలు కలిపాడు. ఎంతకూ గుర్తుకు రాక వీరయ్య నీళ్ళు నములుతుంటే మీ నాన్నగారిని అడగండి అని మాట పెంచాడు. వీరయ్య ఆతురతతో తన తండ్రి 'శరభయ్య' గారన్నాడు. నాన్నగారితో మీకేలా పరిచయమంటూ చెబుతూనే నాన్ కో ఆపరేషన్ రోజుల్లోనా, కడలూర్ జైల్లోనా అని ప్రశ్నించాడు. ఈ ఆచూకి దొరకడంతో శ్రీరాములు కథ అల్లాడు. కడలూరు జైళ్ళల్లో రామలక్ష్మణుల్లాగా ఉండేవారమని, ఆయన దర్జా ఆయనదే అని తెగ పొగిడాడు. చివరకు వీరయ్యకు శరభయ్య జ్ఞాపకంలో ముంచి ఎత్తుతూ ఇకపైన వర్థిక్లాసులో పయనం చేయవొద్దని ఉచిత సలహా కూడా ఇచ్చాడు. చివరకు పిల్ల లెందరని ప్రశ్నిస్తూ ఆ పిల్లల్ని చూడడానికి తహతహపడుతున్నట్లు కోరిక ప్రకటించాడు. వీరయ్య శ్రీరాములు ఇంటికి ఆహ్వానించాడు. కాని శ్రీరాములు తాను రాజమండ్రి వెళ్ళాలని, తన బావమరది దగ్గర తన టిక్కెట్టు ఉందని అతగాడు ట్రైనెక్కి వెళ్ళిపోవడంతో ఏకాకిని అయ్యానని బాధ వ్యక్తం చేశాడు. వీరయ్య జాలితో తాను రాజమండ్రికి టిక్కెట్టు తెప్పిస్తానని చెబుతుంటే రాజమండ్రికి వెళ్ళాలా వాల్తేరుకు వెళ్ళాలా అని ఆలోచిస్తున్నానని శ్రీరాములు చెప్పాడు. వీరయ్య జాలితో పదిహేను రూపాయలు ఇచ్చి వీడుకోలు చెప్పాడు. న్యాయవాదిని కూడా మాటలతో బోల్తా కొట్టించడం శ్రీరాములు ప్రత్యేకత.

ఇక రెండవ సన్నివేశం. స్టేషన్‌లో శేషమ్మ, సుబ్బమ్మలు తమ ఇంటిలో జరిగిన పెళ్ళివిశేషాలు ముచ్చటించుకొంటుంటే బహుకాల దర్శనమంటూ శ్రీరాములు అక్కడికి చేరుకొన్నాడు. తాను ఆ పెళ్ళికి వచ్చానని, పెళ్ళికూతురు నాగమణి తనకు వరసకు మరదలు అవుతుందని మాటలు పెంచాడు. సుబ్బమ్మను భూషమ్మా అని పిలిచి ఆ తరువాత నాలుక కొరుక్కొని జాగ్రత్త పడ్డాడు. ఆ పెళ్ళిలో మగ పెళ్ళివారు ఆడ పెళ్ళివారిని ఎలా ఏడిపించారో విశదీకరించాడు. సుబ్బమ్మగారిని పలనాటి నాయకురాలిగా, వీరనారి సత్యభామగా పోల్చాడు. దగ్గరుండి రైలెక్కిస్తానని అంటూ రైల్వేస్టేషన్‌లో పర్సు, పెట్టె పోగొట్టుకొన్నానని చెప్పాడు. వారు సానుభూతితో తొమ్మిది రూపాయలిస్తే పుచ్చుకొని ఆ ప్రదేశం నుండి కనుమరుగయ్యాడు. ఏ పెళ్ళిలోనైనా మగపెళ్ళి వారి ఆధిక్యం, ఆడపిల్లవారి అణకువ సహజం. అదీగాక కొందరిలో 'తిండి యావ', సహజం. బస్సునుండో రైలునుండో దిగేవేళ పిచ్చాపాటి మాటలాడుకోవడం సహజం. వీటిని జాగ్రత్తగా పరిశీలించిన శ్రీరాములు పసిగట్టి మాటలు కలపడంలోనే ప్రత్యేకత.

మూడవ సన్నివేశం - శ్రీనివాసరావు తన స్నేహితుడయిన చెంచురామయ్యను పేరుతో పిలుస్తూ 'కావలిలో దిగి సుబ్బు కృష్ణయ్యను తీసుకొని నెక్స్ట్ ట్రైనులో మద్రాసు పోదాం' అంటూ చెబుతుంటే శ్రీరాములు 'బహుకాల దర్శనం, బహుకాల దర్శనం' అన్నాడు. శ్రీనివాసరావు శ్రీరాములతో 'అయిందా? పలకరించడం మేము మాటలాడుతుంటే విని మాటలు కలుపుతావా? మా సంగతులేవైనా కావలిస్తే ముందే చెప్పేస్తా' అన్నాడు. శ్రీనివాసరావుకు శ్రీరాములు సంగతి తెలుసు. అందుకే అలా అన్నాడు.

'శ్రీనివాసరావు శ్రీరాములు' మాటలు వింటున్న చెంచురామయ్యకు సందేహం వచ్చింది. ఎవడతడని శ్రీనివాసరావుని అడిగాడు. బెజవాడ, కాకినాడ, విశాఖపట్టణంలో బస్టాండులో, రైలులో తచ్చాడేవాడని చెప్పాడు. శ్రీరాములుతో పర్సు పోగొట్టుకొన్నావా? భార్యకు సుస్తీఁధా? పిల్లాడికి చదువా అన్ని ప్రశ్నించాడు. చెంచురామయ్య అసహనంతో 'డబ్బు దండుకోనే బాపత్తని' చీదరించుకొంటుంటే శ్రీనివాసరావు శ్రీరాములు దైన్యస్థితిని విడమరచి చెప్పాడు. చివరకు చెరో పది యిచ్చి శ్రీరాముల్ని పంపించేశారు. శ్రీరాములు యధాలాపంగా' బహుకాల దర్శనం' అంటుంటే నాటిక పూర్తవుతుంది.

లోకంలో అమాయకులెందరో. బాధలో ఉన్నారంటే సహాయపడడానికి తహతహపడేవారెందరో. అందుకే శ్రీరాములు మాటకారితనంతో భార్యాబిడ్డలకోసం బతుకుతున్నాడు. స్వాతంత్ర్య యోధుల జీవితాలు ఎలా ఉంటాయో అనడానికి శ్రీరాములు జీవితం సాక్ష్యం.

**2. శ్రీరాములు 'ప్లీడర్ వీరయ్యను' నమ్మించిన విధానం వ్రాయండి.**

వీరయ్యగారు బెజవాడ వాస్తవ్యులు. వారి వృత్తి ప్లీడరి. వారి తండ్రిగారు శరభయ్యగారు. స్వాతంత్ర్య యోధులు. సహాయనిరాకరణోద్యమంలో పోరాడిన వారు. కడలూరులో జైలు శిక్ష అనుభవించినవారు. వీరయ్యగారు న్యాయవాదులయినా ఎదుటి వారిని ప్రశ్నించే నేర్పు కలవారయినా శ్రీరాముల వాక్చమత్కారంలో బోల్తా పడ్డారు. దేవులపల్లి వారి 'బహుకాల దర్శనం' నాటికలో ఇది తొలి రంగం.

వీరయ్యగారు రైలు దిగుతూ వెంకన్నతో 'సామాను తీయించు. కారులో పెట్టించు. ముందు గవర్నర్ పేటకు పోనివ్వు. ఇంటికెళ్ళాక స్నానం చేసి ఆ తరువాత కోర్టుకు వెళతానంటాడు. వీరయ్య నమ్మిన బంటు వెంకన్న. 'ఫస్టు క్లాసు దొరకలేదేమిటని' ప్రశ్నించాడు. అపుడు వీరయ్య సంత క్లాసులో చోటు దొరికింది గాని ఒక షావుకారు పక్కన కూర్చోవడంతో, అతడు నిదురలో మాటిమాటికి ఒరిగి పడడంతో నానా ఇబ్బందులు పడ్డానని చెప్పాడు. ఇదంతా ఆత్మీయతతో కూడిన సంభాషణ. ఈ సంభషణంతా దగ్గరున్న శ్రీరాములు విన్నాడు. వీరయ్యను, వీరయ్య అవస్థను పసిగట్టాడు. వెంకన్న వీరయ్య బాబూ అనడం, వీరయ్య, 'వెంకన్న' అనడం విన్నాడు. ఇంకేం 'వీరయ్య గారూ అలా చూస్తారేవిటి'? అని పరిచయం చేసుకున్నాడు. మాటల్లోని తీయదనం, హావభావాలు, మాటలాడే వ్యక్తి వయస్సు, అనుభవాలు వీరయ్యను బోల్తా కొట్టించాయి.

అసలే ప్రయాణంలో బడలిక, పైగా తొందరగా ఇల్లు చేరుకోవాలనే తపన గల వీరయ్యే శ్రీరాములు పలుకరింతలతో కాస్త ఉపశమనం పొందాడు. ఇదొక మానసిక స్థితి. 'పోల్చుకోలేక పోతున్నారేమిటి? నాన్నగారిని అడగండి' అంటూ మాటలు కొనసాగించాడు. వీరయ్యకు తన నాన్నగారంటే భక్తి, గౌరవాలు పైగా తండ్రిగారి స్నేహితులంటే భయం, భక్తి. అంచేత వెంటనే 'నాన్నగారిని ఎరుగుదురా? నాన్ కో ఆపరేషన్ రోజుల్లోనా' అంటూ అయాచితంగా 'కడలూర్ జైల్లోనా' అని ప్రశ్నించాడు. ఈ రెండు మాటలతో శ్రీరాములు కథ చక్కగా అల్లగలిగాడు. తానూ స్వాతంత్ర్యయోధుణ్ణి అన్నాడు. శరభయ్య గారు తానూ కలిసివుండేవారమని అన్నాడు. కడలూరు జైలులో తాను కంటి రెప్పలా చూచుకొనేవాణ్ణని కల్పించాడు.

సగటు మనిషిలో కొన్ని బలహీనతలుంటాయి. పొగడ్తకు లొంగిపోవడం ఒకటి. వీరయ్యను, వీరయ్య తండ్రిని శ్రీరాములు తెగపొగిడేస్తున్నాడు. వల్లమాలిన సానుభూతి ప్రకటిస్తున్నాడు. ఈ పొగడ్త, సానుభూతులకు వీరయ్య తబ్బిబ్బయ్యాడు. పైగా పిల్లల ప్రస్తావన తెచ్చాడు. వీరయ్య తెగమురిసిపోతూ తన అమ్మాయి 'ఝాన్సీ' అన్నాడు. వీరనారి పేరు పెట్టినందుకు అభినందించాడు. మీ పిల్లల్ని చూడాలని కోరిక వ్యక్త పరచాడు. వీరయ్య గారు తనతో రమ్మని ఆహ్వానించారు. ఇవన్నీ మానవునిలోని దౌర్భాగ్యాలే. కాని ఇంటికి వెళితే ఏ ఇబ్బందులు వస్తాయో శ్రీరాములుకు బాగా తెలుసు. అంచేత 'రాజమండ్రికి' వెళ్ళాలని, తన టిక్కెట్టు బావ మరిది దగ్గర ఉండిపోయిందని, వారంతా రైలెక్కారని, తాను రైలెక్కలేక పోయానని కథ అల్లాడు. ఇవన్నీ లోకంలో సహజంగా జరిగేవే. వీటిని ఆరాతీయడమో, నిజానిజాలు తేల్చడమో సాధ్యం కాని పని అని వీరయ్యకు తెలుసు, శ్రీరాములుకు తెలుసు.

వీరయ్యకున్న రెండు ఇబ్బందులు. ఒకటి త్వరగా ఇల్లు చేరుకోవడం ... రెండవది శ్రీరాములును వదిలించుకోవడం. న్యాయవాది మేధస్సు ఆలోచించింది. ఇంటికి ఆహ్వానించాక శ్రీరాములు వల్ల మరికొన్న ఇబ్బందులు రావచ్చు. లేదా తన పని పాటలకు విఘాతం కలగవచ్చు. అందువల్ల రాజమండ్రికి టిక్కెట్టు తెప్పించనా అన్నాడు. శ్రీరాములుకు టిక్కెట్టు వల్ల లాభం ఉంది. కాని మరల 'రీఫండ్' చేయాలి. కాస్త డబ్బు పోతుంది. అందువల్ల మరో ఎత్తుగడ వేస్తూ 'రాజమండ్రిలో దిగనా? తిన్నగా వాల్తేరు పోనా' అని ఆలోచిస్తున్నట్టు నటించాడు. ఈ పాచిక పారింది. రాజమండ్రికి వెళ్ళడానికి బదులు 'వాల్తేరు' అనడంతో వీరయ్య ఉదారంగా 'పదిహేను రూపాయలు' ఇచ్చాడు. ఆశించిన దానికంటె 'రెండింతల' లాభం దక్కింది.

'బహుకాల దర్శనం' ఒక 'నీతి' నాటిక అని కూడా చెప్పవచ్చు. రైలు ప్రయాణం చేసేవారు ఎలా ఇతరులతో మసలుకోవాలో చెప్పేనాటిక. మానవుల బలహీనతల్ని సొమ్ముగా చేసుకొనే 'మాటకారితనం' బహుకాల దర్శనం లోని ప్రధాన అంశం.

**3. శేషమ్మ, సుబ్బమ్మలను 'శ్రీరాములు' మాటకారితనంతో బోల్తా కొట్టించిన విధానం వ్రాయండి.**

శ్రీరాములు బతికి చెడ్డవాడు. ఆస్తులు పోగొట్టుకొని 'భికారి' అయిన స్వాతంత్ర్య వీరుడు. గత్యంతరం లేక 'ప్లాట్ ఫారం' లో తెలివిగా డబ్బు గడించే మాటకారి. అతని 'ఆఫీసు' రైల్వేస్టేషన్. రైలునుంచి దిగే మధ్య తరగతి మనుష్యులు అతని 'ఖాతాదార్లు'. వారి సంభాషణలు శ్రీరాములు ప్రసంగానికి పెట్టుబడులు. మాటల కలుపుగోలుతనమే 'లావాదేవీలు'. ప్లీడర్‌ను బోల్తా కొట్టించడంలోని విధానం ఆడవారిని నమ్మించడంలో ఉపకరించదు. అందుకే రైలెక్కే 'శేషమ్మ సుబ్బమ్మ' లతో శ్రీరాములు వ్యవహరించిన తీరేవేరు.

శేషమ్మ వయసులో పెద్దది. సుబ్బమ్మ చిన్నది. అంచేత సుబ్బమ్మ శేషమ్మను 'వదినా' అని పిలుస్తుంది. బహుశః రక్త సంబంధం కూడా ఉండవచ్చు. ఇంచుమించు సమాన వయస్కులయినపుడు పేరుతో బంధుత్వవాచకం జోడించడం ఒక సంప్రదాయం. అందువల్ల 'శేషమ్మొదినా' అని సంబోధన.

శేషమ్మ సుబ్బమ్మలు 'అమలాపురంలో' ఒక పెళ్ళికి హాజరయి రాజమండ్రి వెళుతున్నారు. వీరి సంభాషణ అంతా శ్రీరాములు విన్నాడు. తనను 'ఆడపెళ్ళి వారి తాలూకా మనిషిగా' పరిచయం చేసుకున్నాడు. 'అమలాపురంలో' అంటూ రాగాలు తీశాడు. ఆడవాళ్ళు రహస్యం దాచలేరు. అమాయకులు. పైగా ఎదుటివాడు ప్రీతితో పలుకరించే సరికి తమంతకు తామే సూరిగాడి భార్య 'నాగమణి' పేరును ప్రస్తావించారు. నాగమణి తండ్రి 'వెంకటేసుర్లు' పరిచయం ఉన్న వాడిలాగా మాటలు కలిపాడు. తాను ఆడపెళ్ళి వారి తాలూకు కావడం వల్ల, మగ పెళ్ళి వారికి ఏ లోటు రాకుండా వంట పనుల్లో ఉండేవాడినని చెప్పాడు. మనుష్యుల బోలిన మనుష్యులుంటారు కనుక సుబ్బమ్మ

కూడా 'సూరిగాడి పెళ్ళిలో' చూసినట్టుందని చెప్పింది. వెంటనే శ్రీరాములు అనాలోచితంగా 'భూషమ్మోదినా' అన్నాడు. సుబ్బమ్మ తాను భూషమ్మను కానంది. వెంటనే సర్దుకొని తన్ను క్షమించమన్నాడు. సుబ్బమ్మ మెత్తబడింది. సుబ్బమ్మ 'తిండియావ' ను పసిగట్టి అమలాపురంలో సుబ్బమ్మ పల్నాటి యుద్ధంలో నాయకురాలిగా, నరకాసుర వధ సమయంలో సత్యభామలాగా ఉండేదని చమత్కరించాడు శ్రీరాములు. ఈ మాటల్లో వ్యంగ్యం ఉంది. ఎగతాళి ఉంది. పొగడ్త ఉంది. 'ఇదేవిటే యితగాడు నన్ను పట్టించాడూ?' అని సుబ్బమ్మ అంటే ఎందుకయినా మంచిదని శేషమ్మతో 'విసురుకొనుచు వచ్చెను వియ్యపు రొడ్డనలకు పాట పాడిందెవరని' తాను చూచినట్లు పలుకరించాడు. ఈ పాటలు ప్రతి పెళ్ళింట ఆ రోజుల్లో వినబడేవే. కాని శేషమ్మ వెంటనే 'మా పెద్దమ్మాయి సీతాలక్ష్మి' అంది. శ్రీరాములు"బేషయిన గొంతు" అంటూ సీతాలక్ష్మికి పిల్లలా అని ప్రశ్నించాడు. ఎవరిని ఏమి అడగాలో ఎలా అడగాలో తెలుసు కనుక, శేషమ్మ 'అయిదుగురు యికచాలు బాబూ' అంటూ నసుగుతుంటే 'రౌండు కావిళ్ళ కొమ్మ' అని సరిదిద్దాడు. చంకలోని పిల్లోడు నీ కొడుకేనా అని సుబ్బమ్మను అడిగితే అవునంది. 'కంటే కళ్ళు మూసకొని కనాలి పిల్లల్ని గాంధారిలా' అని చమత్కరించాడు. సీతాలక్ష్మికి అయిదుగురయితే సుబ్బమ్మకు ఒక్కటేనా అనడంలో ఎగతాళి కూడా ఉంది. పెళ్ళి తాలూకు వ్యవహారాలు, పిల్లల సంగతులయ్యాక మాటలాడడానికి ఏమీ లేకపోతే తాను వెళ్ళి టిక్కెట్టు తెస్తానన్నాడు. వారు టిక్కెట్లు కొనేసారని తెలిసి నొచ్చుకొని ఇక లాభం లేదని 'ఆడవాళ్ళ కంపార్టుమెంటులో నన్కెక్కనివ్వరు' అంటూ బాధపడ్డాడు. చివరకు శ్రీరాములు పెట్టే, పరుసూ బెజవాడ స్టేషన్లో పోగొట్టుకున్నాడు. తర్వాత యెరుగున్న వాళ్ళెవరి దగ్గరేనా డబ్బుచ్చుకొని వస్తానన్నాడు, అని వేంకటేసుర్లుతో చెప్పమని ప్రార్ధించాడు.

శేషమ్మ సుబ్బమ్మలు శ్రీరాముల్ని తమ బంధువుగానే భావించారు. అతని మాటల్లో నమ్మకం కుదిరింది. అంచేత శేషమ్మ సుబ్బమ్మ దగ్గర ఆరూ తన దగ్గరున్న మూడూ కలిపి టిక్కెట్టు కొనుక్కో అని ఇచ్చారు. రాజమండ్రిలో కనబడతానని మరిమరీ చెప్పాడు. పిల్లల్ని తొంగి చూడనియ్యకండని జాగ్రత్త కూడా చేశాడు.

ఆడవారిని నమ్మించడం ఎలాగో తెలిసిన వ్యక్తి శ్రీరాములు. శేషమ్మ సుబ్బమ్మలను బోల్తా కొట్టించగలిగిన మాటకారి శ్రీరాములు.

### 4. శ్రీరాములు శ్రీనివాసరావుల సంభాషణలోని ఆంతర్యం విశదీకరించండి.

శ్రీరాములు మాటకారి. అతడు స్వాతంత్ర్య వీరుడయినా అన్నీ పోగొట్టుకొన్నవాడు. "దినగండం వెయ్యేండ్లు ఆయుస్సు" లాగా నెట్టుకు వచ్చేవాడు. శారీరకశ్రమ తెలియనివాడు. మాటలు కలిపి సన్నిహితునని భ్రమ కల్పించి డబ్బు గుంజేరకం. మగవాళ్ళని మోసం చేయడం తెలుసు. ఆడవారిని నమ్మించడం తెలుసు. కాని అందరిని అన్నివేళల్లో మోసగించడం కుదురదు. వీరయ్యను, శేషమ్మ, సుబ్బమ్మలను మోసగించిన శ్రీరాములు 'శ్రీనివాసరావుకు' పట్టుబడ్డాడు.

శ్రీనివాసరావు 'ఒరేయ్ చెంచురామయ్యా' అని పలుకరిస్తుంటే శ్రీరాములు బహుకాల దర్శనం. బహుకాల దర్శనం. యెన్నాళ్ళకూ యెన్నాళ్ళకూ ! యెప్పటిమాట అబ్బో నిన్నా మొన్నా సంగతా చెంచురామయ్యా అని పలుకరించాడు. శ్రీనివాసరావు వెనుదిరిగి చూశాడు. శ్రీరాములెవరో అర్ధమయింది. 'మా సంగతులేవైనా కావలిస్తే ముందే చెప్పేస్తా నీకు తెలియదు కనుక' అని అంటుంటే చెంచురామయ్య ఏం చేస్తుంటాడు? అని ప్రశ్నించాడు. 'పద్యాలవీ రాస్తుంటాడు.' అనగానే మాన్పించడం మంచిదన్నాడు. ఆ రోజుల్లో నాటకాల పిచ్చితో సంగీతాభిమానంతో డ్రామా కంపెనీలలో చేరి బతికి చెడ్డవారెందరో.

చెంచు రామయ్య శ్రీనివాసరావుతో 'నువ్వెరుగుదువా' యితన్ని అని ప్రశ్నించాడు. నాకు తెలుసు కాని అతనికే నేనెవరో తెలియదన్నాడు. శ్రీరాములు ఖంగుమన్నాడు. 'ఎక్కడెరుగుదువు బాబూ నన్ను'? అని గతుక్కుమంటూ అడిగాడు. అపుడు శ్రీనివాసరావు నీవెవడవో నాకు తెలియదేమిటి రాజమండ్రి, బెజవాడ, కాకినాడ, విశాఖపట్నంలో స్టేషను దగ్గర కాకపోతే బస్సుస్టాండుల్లో చూసినవాణ్ణే. నీ చిక్కేమిటి?పర్సు పారేసుకొన్నావా? భార్యకి పురుడొయ్యాలా పిల్లాడికి చదువా అని ప్రశ్నించాడు. ఈ సాకులతోనే గతంలో శ్రీరాములు డబ్బు గుంజేవాడు. తన గుట్టు బయట రట్టవుతుంటే శ్రీరాములు మెల్లగా జారుకోదలచాడు. చెంచు రామయ్య 'శ్రీరాములు కథ చెప్పమంటే' శ్రీనివాసరావు సవివరంగా వినిపించాడు.

శ్రీనివాసరావు ముప్పయేళ్ళ క్రితం దేశంలో అతన్ని ఎరగని వాళ్ళులేరు. నాన్ కో ఆపరేషన్ రోజుల్లో ఆస్తి పోగొట్టుకొని, దెబ్బలుతిని, జైల్లో పడ్డవాడు. పెళ్ళాం బిడ్డలకోసం ఇలా తయారయ్యాడని, చెంచురామయ్యతో చెప్పాడు. చెంచురామయ్య శ్రీరాముల్ని 'దగాకోరుగా' తిట్టాడు. కాని శ్రీనివాసరావు శ్రీరాముల్ని తప్పుపట్టలేదు.

తక్కువ వాడు తక్కువ మోసం చేస్తే, అది దారుణమైన నేరం. ప్రభుత్వాలూ ప్రముఖులూ చేస్తే అది రాజకీయ తంత్రం, మంత్రాంగం. చిన్నవాడు చిన్న అప్పుచేసి యెగేస్తే వాడికి కారక్టర్ లేదు. భగవద్గీతలో శ్లోకాలు విసుడుతూ మధ్య మధ్య ప్రార్థనలు చేస్తూ లక్షలు రుణం చేసి యెగేసి నిక్షేపంగా గౌరవంగా చెలామణీ అవుతున్న వాళ్ళ నెరుగుదుము అన్నాడు. చివరకు శ్రీరాముల్ని పిలిచి దేనికోసం చందాలు వసూలు చేసుకుంటున్నావని అడిగాడు. ఏమీ మాటలాడకపోతే చివరకు తానే చెంచురామయ్యతో బీహారు భూకంపానికి, గోదావరి వరద బాధితులకని చెప్పేవాడని వివరించాడు. శ్రీరాములు బాధతో తన గతేమవుతుందేమోనని నీకూ కోపం వచ్చిందా నా మీదా?" అన్నాడు.

శ్రీనివాసరావు తన వంతుగా పది రూపాయలు ఇచ్చాడు. 'నువ్వో పది తీయరా' అని చెంచు రామయ్యను ఆదేశించాడు. చివరకు శ్రీరాములు 'బహుకాల దర్శనం' అంటూ నిష్క్రమించాడు.

మనుష్యుల మీద జాలికి అనేక కారణాలు. బతికి చెడ్డవాళ్ళమీద జాలి ఒక రకం. 'బహుకాల దర్శనం' లో వీరయ్య, శేషమ్మ., సుబ్బమ్మల దానంలో బంధుత్వ ప్రీతి ఉంది. శ్రీనివాసరావు దానంలో సానుభూతి ఉంది. పైగా చెంచు రామయ్యతో కూడా మాటలాడి ఇప్పించడంలో గౌరవం ఉంది. 'బహుకాల దర్శనం' కేవలం డబ్బు సంపాదించుకోవడం కోసమే కావడం దురదృష్టం.

**సారాంశం :** శ్రీరాములు 'బహుకాలదర్శనం' అంటూ యాచించిన వైనాన్ని కవి వివరించడంలో, ప్రభుత్వాలు ప్రముఖులు చేసే మంత్రాంగాల కంటే, లక్షల రుణం తీర్చని పెద్దమనుషుల కంటె యాచనతో బ్రతికే శ్రీరాములు నేరస్థుడు కాడన్నది ఈ నాటికలో కవి నిరూపణ.

**ప్రశ్నలు :**

1. "బహుకాల దర్శనం"లో దేశభక్తుల స్థితి ఎలా ఉందని కృష్ణశాస్త్రిగారు అభిప్రాయపడ్డారు?
2. "బహుకాల దర్శనం" లోని శ్రీరాములు పాత్ర చిత్రణను గూర్చి వ్రాయండి?

రచయిత :
**ఆచార్య కె. సర్వోత్తమ రావు**
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి.

ఖండం - 3

# గద్య భాగం

## పాఠం - 4 మనుచరిత్ర

- దివాకర్ల వేంకటావధాని

శీర్షికలు : 1. రచయిత పరిచయం

2. పాఠ్యభాగ సందర్భం

3. పాఠ్యభాగ సారాంశం

4. కఠిన పదాలకు అర్థాలు

5. మనుచరిత్ర పాఠ్యభాగంలోని పద్యాల భావార్థ వివరణ

6. ప్రశ్నలు - సమాధానాలు.

**లక్ష్యం** : గద్యభాగంలోని నాలుగవ పాఠమైన "మనుచరిత్ర" అనే వ్యాసంలో దివాకర్ల వేంకటావధాని గారు పెద్దనార్యుని మనుచరిత్ర ప్రబంధంలోని కథను; రచనా నేపథ్యాన్ని; మూలానికి, కావ్యేతివృత్తానికి ఉన్న తేడాలను వివరించారు.

### 1. రచయిత పరిచయం

'మనుచరిత్రము' అనే వ్యాసం యువభారతి ప్రచురణ 'కావ్యలహరి' లోనిది. ఈ వ్యాస రచయిత దివాకర్ల వెంకటావధాని. వీరిని 'అవధాని' గారు అని గౌరవంగా పండితులు పిలుస్తుంటారు. అవధాని గారు 1912 జూన్ 23 వ తేదీన గోదావరి జిల్లా 'ఆకుతీగపాడు' గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు వేంకమాంబ, సుందర రామయ్యలు. 'తిరుపతి వెంకట కవులలో' ఒకరయిన దివాకర్ల తిరుపతి శాస్త్రి గారు అవధాని గారికి స్వయాన పినతండ్రి.

అవధాని గారు 1934 లో తెలుగు పండితులుగా ఉద్యోగ జీవితంలో ప్రవేశించి 1951 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉపన్యాసకులుగా చేరారు. తెలుగు శాఖ అధ్యక్షులుగా చిరకాలం రాణించారు. కవిభూషణ, కళాప్రపూర్ణ, విద్యాసనాథ అనేవి వీరి బిరుదులు. నార్లవారు అవధాని గారిని 'ఫోటోగ్రాఫిక్ మెమరీ' గా అభివర్ణించారు. వీరు బహుగ్రంథ రచయితలు. ఎన్నో సాహిత్య సంస్థలకు అధ్యక్షులుగా, సభ్యులుగా సార్థక సేవ అందించిన వారు. సాహిత్య సోపానములు, ఆంధ్రనాటక పితామహుడు, ఆంధ్రవాఙ్మయ చరిత్ర, నన్నయ భట్టారకుడు తిరుపతి వెంకట కవులు, పోతన లాంటి ప్రామాణిక గ్రంథాలు రచించినవారు. 'సాహిత్య సోపానములు' గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి బహుమతి లభించింది. వీరి పరిశోధనా గ్రంథం వాఙ్మయ ఆరంభదశ, నన్నయ భారతము. దివాకర్ల వారు 21. 10. 1986 వ తేదిన మరణించారు. విశ్వవిద్యాలయ ఆచార్యులలో వీరి స్థానం ప్రశంసనీయం.

### 2. పాఠ్యభాగ సందర్భం :

పెద్దన కృతి మనుచరిత్ర. ఇది పంచమహాకావ్యాలలో ఒకటి. ఈ ప్రబంధంలోని కథను, రచనా నేపథ్యం, మూలకథకు ప్రబంధ కథకున్న తేడాలు, కవి పాత్ర పోషణ, రచనా శైలి, భాషావిశేషాలను దివాకర్ల వారు సమగ్రంగా చర్చించారు. ఇది 'కావ్యలహరి'లోని వ్యాసం.

### 3. వ్యాస సారాంశం :

ఆర్యావర్త దేశంలో వరణానదీ తీరంలో అరుణాస్పదమనే పురం ఉంది. ఆ పురంలో ప్రవరుడనే గృహస్థుడున్నాడు. అతనికి అనుకూలవతి భార్య ఉంది. తల్లిదండ్రులున్నారు. అతడు మనోహరాకారుడు, కర్మఠుడు. అతిథి అభ్యాగత సేవానిరతుడు, తీర్థయాత్రా

కుతూహలశీలి. ఒకనాడు ఒక ఔషధసిద్ధుడు ప్రవరుని ఇంటికి విచ్చేశాడు. అతడు చూసిన క్షేత్రాలను, ఆ విశేషాలను చెప్పమని ప్రవరుడు కోరాడు. సిద్ధుడు సంతోషంతో తన క్షేత్ర పర్యటన గురించి విస్తరించి చెప్పాడు. ప్రవరునికి కుతూహలం కలిగింది. ఇంత చిన్నవయసులో ఇన్ని క్షేత్రాలు దర్శించటం వింత కదా అని ప్రశ్నిస్తే 'పాదలేపనం' వల్ల సులభంగా ఆయా క్షేత్రాలు దర్శించగలిగానని సిద్ధుడు చెప్పాడు. ప్రవరుడు తన మనోరథం చెప్పాడు. సిద్ధుడు దంతపు భరణి తీసి ఒక రసాన్ని ప్రవరుని పాదాలకు పూసి వెళ్ళిపోయాడు. ఆ రసమేదో సిద్ధుడు చెప్పలేదు. పాదలేపనం పూయడంతో ప్రవరుడు హిమవత్పర్వతం చూడాలనుకొన్నాడు. లేపన మహిమతో హిమాలయం చేరాడు. అక్కడి దృశ్యాలు చూస్తుంటే పొద్దు పోయింది. మరలి వెళదామనుకొంటుంటే ఎగరలేకపోయాడు. పాదలేపనం కరిగిపోయింది. చివరకు దారి తెలియక చింతిస్తూ దూరంలో ఒక దేవకాంతను చూచి తన యూరికి దారి అడిగాడు. ఆ దేవకాంత వరూధిని. ఆమె ప్రవరుని రూపరేఖా విలాసాలకు ముగ్ధురాలయింది. మోహం పెంచుకొంది తన్ను ఏలుకోమంది కాని ప్రవరుడు తిరస్కరించాడు. కుతర్కాలు చేసింది. అయినా లాభం లేకపోవడంతో పైబడింది. ప్రవరుడు 'శ్రీహరీ' అంటూ త్రోసివేశాడు. గోరు గుచ్చుకొందని వరూధిని ఏడుపు లంకించుకొంది. చివరకు ప్రవరుడు అగ్ని దేవుని ప్రార్థించి ఆ దైవానుగ్రహంతో అరుణాస్పదపురం చేరుకొన్నాడు.

వరూధిని దేవకాంత అయినా మానవ మాత్రుడయిన ప్రవరునిపై మోహం వదలుకోలేకపోయింది. చెలికత్తెల శీతలోపచారాలు వ్యర్థమయ్యాయి. చెలికత్తెలు వరూధినిని ఉద్యానవనంలో విహరింపజేశారు. ప్రవరుడు రావడం, వరూధిని మోహించడం, ప్రవరుని తిరస్కారం ఇవన్నీ తెలిసిన మాయాగంధర్వుడు 'శాంబరి' విద్యతో ప్రవరుడయ్యాడు. ఆ మాయాగంధర్వుడు ఒకప్పుడు వరూధిని వల్ల తిరస్కరింపబడ్డవాడే. వరూధిని ప్రవరవేషధారుని ప్రవరునిగానే నమ్మింది. ప్రాథేయపడింది. మాయా ప్రవరుడు అచ్చం ప్రవరునిలాగా నటించాడు. వరూధిని నమ్మింది. దేశాచారం ప్రకారం సంగమకాలంలో కళ్ళు మూసుకోవాలన్నాడు. సరేనంది, నేను వెళ్ళేవరకు నీవు వెళ్ళకూడదని 'ఆంక్ష' పెట్టాడు. అన్నిటికీ సరేనంది వరూధిని. కొంతకాలానికి ఆమె గర్భవతి అయింది. తన వంచన ఏనాటికయినా బట్టబయలవుతుందని, శాపం తప్పదని, అంగీకారంతో వెళ్ళకపోతే మరణించవచ్చని మాయాప్రవరుడు భావించాడు. సిద్ధుడు కనబడ్డాడని, పాదలేపన విద్య అనుగ్రహించాడని, ఇంటి వ్యవహారాలు చక్కబెట్టి వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. వరూధిని 'స్వరోచి'ని ప్రసవించింది. అతడు పెరిగి పెద్దవాడై మంధర పర్వత సమీపంలో రాజ్యం ఏర్పరచుకొన్నాడు. ఒకనాడు కైలాస పర్వతంలో వేటాడుతుంటే ఆర్తనాదం వినిపించింది. ఒక రాక్షసుడు తన్ను వెంటాడుతున్నట్టు రక్షించవలసిందిగా ఆ వనిత కోరింది.

ఆ వనిత పేరు మనోరమ. ఆవిడ చెలికత్తెలు కళావతి, విభావసి. ఒక రోజు పూలు కోస్తూ ఒక మునిని చూశారు. బాల్య చాపల్యంతో ఆ ముని ముఖాన్ని మనోరమ పట్టుకొంది. ఆ ముని అసురకు పట్టుబడతావని శపించాడు, బెత్తంతో కొట్టాడు. చెలికత్తెలు వద్దని దీనంగా ప్రార్థించినా 'రాజయక్ష్మ' రోగ పీడితులవుతారని శపించాడు. వారు రోగగ్రస్తులయ్యారు. "నేను అమూల్య అస్త్రవిద్యను ఇస్తాను. రాక్షసుని సంహరించవలసిందని" కోరింది. స్వరోచి ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. శాప విమోచనమయింది.

అతడు తన కథ చెప్పాడు.

నలనాభుడు గంధర్వుడు. అతడు జిజ్ఞాసి. ఒక రోజు బ్రహ్మమిత్రుని ఆశ్రమం వైపు కదిలాడు. ఆతడు శిష్యులకు ఆయుర్వేదం నేర్పుతున్నాడు. తనకూ నేర్పమని గర్వంతో అడిగాడు. బ్రహ్మమిత్రుడు కాదన్నాడు. కాని దీక్షతో 'శాంబరి' విద్యతో విద్యలు నేర్చాడు. కాని అహంకారంతో బ్రహ్మమిత్రుని దగ్గరికి వెళ్ళి తాను విద్య నేర్చిన వైనాన్ని చెప్పాడు. బ్రహ్మమిత్రుడు రాక్షసుడవు కమ్మని శపించాడు. అప్పటికి గాని నలనాభునికి తాను చేసిన తప్పేమిటో తెలిసింది. కాళ్ళవేళ్ళాపడ్డాడు. అపుడు ముని నీ కూతురినే వెన్నాడుతుంటే ఒక ధన్యాత్ముని దివ్యబాణంతో స్వస్వరూపం వస్తుందని శాపానికి అవధి చెప్పాడు. నలనాభుడు రాక్షసుడయ్యాడు. అంతఃపురం అల్లకల్లోలమయింది. చివరకు మనోరమను వెంటాడాడు. మనోరమ కోరికతో స్వరోచి బాణప్రయోగంతో రాక్షస జన్మపోయింది. పునః గంధర్వుడయ్యాడు. తన కుమార్తెతో తాను నేర్చిన ఆయుర్వేదం స్వీకరించమన్నాడు, స్వరోచి అంగీకారం చెప్పాడు. మనోరమ తన చెలికత్తెల జబ్బు పోగొట్టమని ప్రార్థించింది. విభవసి 'పక్షిభాష' నేర్పింది. కళావతి 'పద్మిని' విద్య అనుగ్రహించింది. స్వరోచి ముగ్గురి పెళ్ళాళ్ళ మగడయ్యాడు.

ఒక రోజు స్వరోచి భార్యాత్రయంతో విహరిస్తుంటే హంస చక్రవాకి సంభాషణ విన్నాడు. హంస స్వరోచి ప్రణయాన్ని మెచ్చుకొంది. కాని చక్రవాకి తప్పుపట్టింది. ఒకరితో ఒకరి ప్రణయమే సత్యమని, ధన్యమని చెప్పింది. పక్షిభాష తెలిసిన స్వరోచి వీరి సంభాషణను

సొంతం శాంతంగా విన్నాడు. అయినా సిగ్గుపడలేదు. నూరేళ్ళపాటు సుఖం అనుభవించాడు. ఒక రోజు ముగ్గురితో విహరిస్తుంటే ఒక మగ లేడిని చూచాడు. ఆ మగలేడిని ఆడలేళ్ళు బలవంతం చేయడం గుర్తించాడు. అపుడు మగలేడి 'నేను ఇంకా భార్యలతో తిరిగే సంగమాపేక్ష కలిగిన స్వరోచినా' అని అంది. ఈ మాట వినడంతో స్వరోచిలో వైరాగ్య ప్రకంపనలు కలిగాయి. అయినా ఆడువారి మీద మమకారం పోలేదు. ఆరువందల ఏళ్ళు గడిచాయి.

ఒక రోజు స్వరోచి వేటకు కదిలాడు. ఒక అడవి పందిపై బాణం వేయబోయాడు. అపుడొక లేడి తనపై బాణం వేయమంది. కారణమడిగితే తన్ను కావలించుకోమంది స్వరోచి అంగీకరించాడు. లేడి వనదేవతగా మారింది. దేవతలు పంపగా తాను వచ్చానని పరిచయం చేసుకొంది. నీ వల్ల 'మనువు' ఉదయిస్తాడని భవిష్యత్తు నాకొనింది. స్వరోచి వనదేవతతో విహరించాడు. వనదేవత గర్భవతి అయింది. ఒక కుమారునికి జన్మ ఇచ్చింది. స్వారోచిషుడని అతని పేరు. అతడు విష్ణుభక్తుడయ్యాడు, తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన విష్ణువు అవతార కీర్తన చేశాడు. తనకు సాలోక్యప్రాప్తి కావాలని అభ్యర్థించాడు. కాని విష్ణువు రెండవ మనువై ధర్మబుద్ధితో లోకపాలనం చేయవలసిందిగా కోరాడు. మనుత్వం కట్టబెట్టాడు. మనువు పాలనలో ప్రజలు సకల సౌభాగ్యాలతో జీవించారు.

పెద్దన కృతి 'మనుచరిత్ర' అయినా దీనికి 'స్వారోచిష మనుసంభవమనే' పేరుంది. ఈ మనుచరిత్రలో ప్రవర వరూధినుల చరిత్ర, ఇందీవరాక్షుని శాపవృత్తాంతమనే కథలకే వ్యాప్తి. పెద్దన ప్రబంధోచితంగా తీర్చిన మార్కండేయపురాణాంతర్గతకథ 'మనుచరిత్ర'

**4. కఠిన పదాలకు అర్థాలు :**

| | | |
|---|---|---|
| పంచకావ్యములు | = | శృంగార నైషధం, మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, పాండురంగ మహాత్మ్యం అనే అయిదు కావ్యాలు. |
| షష్ఠ్యంతములు | = | కావ్య అవతారికా భాగం చివర షష్ఠీ విభక్తి ప్రత్యయ అంతంగా చెప్పే కందపద్యాలు. |
| కైఫీయత్తు | = | సమాచారము (ఉదా॥ మెకంజీ కైఫీయత్తు) |
| అర్ఘ్యము | = | పూజకు తగిన పెరుగు, తేనె, నెయ్యి మొదలయిన 8 వస్తువులు |
| పాద్యము | = | పాదాలను కడుగుకోవటానికి ఇచ్చే నీరు. |
| మృష్టాన్నము | = | పవిత్రమైన అన్నం |
| గారుడోత్కీర్ణము | = | గరుడపచ్చలతో పొదగబడినది. |
| మకరాంకుడు | = | మన్మథుడు |
| శశాంకుడు | = | చంద్రుడు |
| అంతిక+ఉద్యానము | = | దగ్గరి తోట. |
| పుష్పాపచయము | = | పువ్వులు కోయడం |
| ఉపాలంభము | = | నింద |
| మృగయా సాధనము | = | వేటకు ఉపకరించు సాధనాలు |
| అధ్వాన్నము | = | అధ్వము అంటే తోవ. దారిలో తినడం కోసం ఇంటిలోనుండి తెచ్చుకొన్న అన్నం. కాని తెచ్చుకున్న అన్నం ఎక్కువకాలం శుచిగా రుచిగా ఉండదు. పాసిపోతుంది. పారవేయక తప్పదు. అధ్వశ+అన్నం అనికూడా వ్యవహరిస్తారు. పాడయిపోయింది, పనికి రానిది అనే అర్థాలలో వాడుతారు. |
| కాంతారము | = | అడవి |

| | | |
|---|---|---|
| ంగుష్ఠము | = | బొటనవేలు. |
| ఆసురి | = | అసుర సంబంధమైన |
| శశికళ | = | చంద్రకళ. |
| సాలోక్యము | = | చతుర్విధ ముక్తి భేదాలలో ఒకటి (సారూప్యం, సామీప్యం, సాలోక్యం, సాయుజ్యాలు) |
| మిధున కృత్యము | = | సంభోగం |
| వాచందుముడు | = | ముని |
| అనిమేషస్థితి | = | రెప్పలు వాల్చని స్థితి |
| పాత్రుడు | = | మనుమడు. |
| తిర్యక్కులు | = | పశుపక్ష్యాదులు. |
| గుళుచ్ఛము | = | గుత్తి |
| శతపత్రము | = | పద్మం |
| సైకతము | = | ఇసుక ప్రదేశం |
| ముక్తపదగ్రస్తం | = | చివర చెప్పి విడిచిన పదాన్నే గ్రహించి వ్రాసే అలంకారం |
| జాగిలము | = | కుక్క |
| జయంతుడు | = | ఇంద్రుని కుమారుడు |
| స్వాహాదేవి | = | అగ్నిదేవుని భార్య |
| గృహమేధి | = | గృహస్థుడు |
| పరాఙ్ముఖము | = | పెడమొగము |
| పుచ్ఛ డీకతనము | = | సిగ్గు |
| ఉదయాచలం | = | తూరుపు కొండ |
| బాడబులు | = | బ్రాహ్మణులు |
| నీరజారి | = | చంద్రుడు |
| వలరాజు | = | మన్మధుడు |
| మధుకోశము | = | తేనెతుట్టెలు |
| కులిశము | = | వజ్రాయుధము |
| గీర్వాణవధూటిక | = | దేవతా స్త్రీ |
| ఏకలము | = | అడవిపంది |
| అటజనికాంచె | = | కలాకలసి |
| జాలమున్ | = | ఆకాశం అంటే శిఖరాల నుండి ప్రవహించే అలల చప్పుళ్ళు మద్దెల మ్రోతలలాగా వినబడగా దానికి తగినట్లు ఆడే నెమళ్ళ సమూహ జాలమును ప్రవరుడు దర్శించాడు. |
| వృత్త వైవిధ్యం | = | ఛందస్సులకు సంబంధించిన అనేక వృత్తాల ప్రయోగం |
| పసరము | = | గోమహిష జాతి |
| శాకునికుడు | = | శకునములు, వాటి ఫలితములను చెప్పగల సమర్థుడు |
| దక్షిణ నాయకుడు | = | అనేక స్త్రీల పట్ల సమానమయిన అనురాగము గల నాయకుడు. |

**5. మనుచరిత్రం పాఠ్యభాగంలోని పద్యాలు. భావార్థ వివరణం**

1. కొలుతున్ మద్గురు విద్యా
నిలయున్ గరుణా కటాక్ష నిబిడ జ్యోత్స్నా
దళితాశ్రిత జన దురిత
చ్ఛల గాఢ ధ్వాంత సమితి శఠకోపయతిన్ 1.4

ఈ పద్యం మనుచరిత్రం పీఠికాభాగం లోనిది. పెద్దన కావ్యాదిలో దేవతాస్తుతి తరువాత గురుస్తుతి చేశాడు. పెద్దన మతగురువు శఠకోపయతి. ఇతడు అహోబల మఠాధిపతి. వైష్ణవాచార్యుడు. పెద్దన మొదట నందవరీకుడు స్మార్తుడు. బహుశః శఠకోపయతి వల్ల వైష్ణవం స్వీకరించి వుండవచ్చు.

శఠకోపుడంటే నమ్మాళ్వార్. ఆళ్వారులలో నమాళ్వార్‌కు ప్రత్యేక స్థానముంది. అలాగే పెద్దన గురువులలో శఠకోపునికి పదిల స్థానం. ఆ నమ్మాళ్వార్‌లాగే ఈ శఠకోపుడు విద్యానిలయుడు. ఇక్కడ విద్య అంటే బ్రహ్మవిద్య అని అభిప్రాయం. అతని కటాక్షం దట్టమైన వెన్నెల లాంటిది. వెన్నెల ప్రసరించడంతో చీకటి మటుమాయమవుతుంది. అలాగే గురు కటాక్షం వల్ల అజ్ఞాన అంధకారం తొలగిపోతుంది. వైష్ణవంలో, గురువుకు, అధిక ప్రాధాన్యముంది. అతడు తారకమంత్ర ఉపదేశకుడు. పంచసంస్కారాలు చేసే ఆచార్యోత్తముడు. అందువల్లనే పెద్దన శఠకోపయతిని ఘనంగా కీర్తించాడు.

2. సప్త సంతానములలోఁ బ్రశస్తి గాంచి
ఖిలము గాకుండునది ధాత్రిఁగృతియ కాన
కృతి రచింపుము మాకు శిరీష కుసుమ
పేశల సుధామయోక్తులఁ బెద్ద నార్య 1.14

ఈ పద్యం మనుచరిత్ర అవతారికా భాగంలో ఉంది. రాయల కవితా గోష్ఠిమందిరం భువన విజయం. ఆ మందిరంలో రాయలు సింహాసనం అధిష్టించి పండితులతో ప్రసంగం కొనసాగిస్తూ పెద్దనతో చెప్పిన మాటలివి.

పెద్దనార్య ! తటాకం, ధననిక్షేపం, అగ్రహారం, శివాలయం ఆరామం, సత్కావ్య రచన, పుత్రుడు అనేవి సప్తసంతానాలు. వీటిలో 'కృతి' సర్వశ్రేష్ఠం. తటాకారులు కాలక్రమంలో తగిన పరిరక్షణ లేకపోవడం వల్ల నశించవచ్చు. కాని కృతులకున్న ప్రశస్తి వేరేవాటికి లేదు. అంచేత పెద్దనార్య ! సత్కావ్య రచన చేయవలసిందిగా నా అభ్యర్థన. శిరిసెన పువ్వులలాగా మృదువయిన అమృత తుల్యమయిన పలుకులతో మాన్యకృతిని రచించివలసిందిగా కోరుతున్నాను.

3. హితుఁడవు, చతురవచోనిధి
వతుల పురాణాశ మేతిహాసకథార్థ
స్మృతియుతుఁడ వాంధ్ర కవితా
పితామహుఁడ వెవ్వరీడు పేర్కొన నీకున్ 1.15

ఈ పద్యం మనుచరిత్రలోనిది. రాయలు అల్లసాని పెద్దనను ప్రశంసించడం ఈ పద్యంలోని ప్రధానాంశం. నీవు సాహిత్యాన్ని, సామ్రాజ్యహితాన్ని, లోకహితాన్ని కోరేవాడవు. చాతుర్యం నీ సొమ్ము, నీవు చతుర ప్రసంగాలకు నిధివి, బ్రహ్మాండాది పురాణాలు తెలిసినవాడవు. ఆగమార్థ విదుడవు. రామాయణ భారత కథాసందర్భములు తెలిసిన వాడవు. పైగా ఆంధ్ర కవితాపితామహుడవు. నీకు సాటి ఎవరున్నారు? ఎవరూ లేరని అభిప్రాయం.

4. మనువులలో స్వారోచిష
మనుసంభవ మరియు రససమంచితకథలన్

వినవింపు కలి ధ్వంసక

మనఘ భవచ్చతుర రచన కనుకూలంబున్. 1.16

"మనువులు 14 గురు. వారిలో రెండవ వాడు స్వారోచిష మనువు. అతడే స్వరోచి కుమారుడు. అతని పుట్టుక ఆశ్చర్యకరం. అతని వృత్తాంతం రససమంచితం. పైగా ఆ కథాశ్రవణం కలిధ్వంసకం. నీవు చతురుడివి, చతురవచోనిధివి, అంచేత చతుర రచనకు అనుకూలంగా మనుచరిత్ర వ్రాయడానికి ఉపక్రమించు అని రాయలు పెద్దనను కోరడం ఈ పద్యాంశం.

5. నిక్కము దాపనేల ధరణీసుర నందన ! యింక నీ పయిం
జిక్కె మనంబు నాకు , ననుఁ జిత్తజు బారికి నప్పగించెదో
చొక్కి మరంద మద్యముల చూఱల బ్రాటలు పాడు తేంట్ల సొం
పెక్కిన యట్టి పూవుఁ బొదరిండ్లను గౌఁగిట గారవించెదో. 2.51

ఇది మనుచరిత్రలోని పద్యం. ప్రవరుడు సిద్ధుడు పూసిన పసరు ప్రభావంతో హిమాలయం చేరుకొన్నాడు. అక్కడి వింతలు చూశాడు. మధ్యాహ్నం కావచ్చింది. అరుణాస్పదం చేరుకోవాలనుకొన్నాడు. కాని పసరు కరిగిపోయింది. కాళ్ళాడలేదు. దారి వెతుక్కుంటూ 'వరూధిని' ని చూచి మా ఊరి 'దారి' అడిగాడు. వరూధిని ప్రవరుని అందానికి ముగ్ధురాలయింది. మాటలు కలిపింది. తన కోరికను బహిర్గతం చేసింది.

'విప్రకుమార ! నేను నా మనోభిప్రాయాన్ని దాచకుండా చెబుతున్నా. నా మనసు నిన్ను కోరుతూవుంది. నన్ను మన్మధబారికి అప్పగించడం నీ కిష్టమా? లేక పుష్పరసపానంతో మత్తెక్కిన తుమ్మెదల ఝుంకారంతో నిండిన పొదలలో కావలించుకొంటావా?' అని పద్యభావం,

6. ఏలర యీ చలంబుదిగి యేలర బాల రసాల మాలతీ
జాలములో. శశాంక కరజాలములో వలవంత నశ్రువుల్
జాలుగ నాల్గు జాలు నీఁకఁజాలు భవంబను నంత కాక కున్
బాలయి రాత్రి పంచశరు బారికి ఁజిక్కితి నీకు దక్కితిన్. 3.93

వరూధినిది మోహం గాని ప్రేమ కాదు. మోహావేశంతో వరూధిని ప్రవరునితో సాగించిన ప్రసంగంలోనిదీ పద్యం.

విప్రకుమార! ఎందుకు ఈ పట్టుదల? మాత్సర్యం వదలి నన్నేలుకో. తియ్యమామిడి గున్నలున్నాయి. మాలతీ సమూహాలున్నాయి. మథనతాపంతో రాత్రంతా నేను పడ్డ వెతలు చాలు. మన్మథ బాధనింక తాళలేను. నీవే నాకు గతి. నీకే దక్కాను.

మామిడి చెట్లను మాలతీ తీగెలు అల్లుకోవడం సహజం. 'చెట్టు' పురుషుడయితే 'మాలతి' స్త్రీ అవుతుంది. తీగెలా అల్లుకుపోతానని వరూధిని మనసులోని మాటను బహిర్గతం చేసింది.

7. తంత్రీ నాకు ననుగ్రహింపఁగదె వైద్యంబంచుఁ బ్రార్థించినన్
గంద్రల్గా నటులాది దిక్కృతుల ఁబోకాల్మంటి వోహో మదిన్
దీంద్రల్ గల్గిన వారికే కరణి నేవిన్ విద్య రాకుండునే
గుంద్రాడాచినఁ బెండ్లి యేమిటికిఁ జిక్కుం గష్టముప్టింపచా ! 5.17

ఇందీవరాక్షుడు రాజు. ఒకరోజు అరణ్యంలో బ్రహ్మమిత్రుని ఆ రాజు సందర్శించాడు. ఆ గురువర్యుని ఆయుర్వేద ప్రవచనానికి ముగ్ధుడయ్యాడు. తనకూ ఆ విద్య అనుగ్రహించవలసిందిగా కోరాడు. కాని ముని తూలనాడినాడు. రాజుకు పంతం పెరిగింది. 'శాంబరి' విద్యతో విద్య నేర్చాడు. విద్యానంతరం మునితో తన ప్రజ్ఞను, బ్రహ్మమిత్రుని ఛీత్కారాన్ని ప్రకటించే సందర్భం లోనిదీ పద్యం.

తండ్రి తరువాత తండ్రిలాంటి గురువర్యులు మీరు. త్రికరణ శుద్ధితో విద్య నేర్చుకోవాలని, ఆ విద్యను అనుగ్రహించవలసిందిగా ప్రార్థించాను. కాని నా స్థానాన్ని, నా అభ్యర్థనను ఖాతరు చేయక అగౌరవంతో పొమ్మని ఆదేశించారు. పట్టుదల వుంటే ఏ విద్య అయినా నేర్చుకోవచ్చు. గున్నికలు పొత్తపురాతిని దాచినంత మాత్రాన పెండ్లి ఆగిపోతుందా? పొమ్మని గద్దించినా నేను నీ దగ్గరే విద్య నేర్చుకొన్నాను. 'తండ్రీ' అని గౌరవమిచ్చేలా సంబోధిస్తూ చివరకు 'కష్టముష్టింపచా' అని తన అక్కసు నంతా కక్కడం ఈ పద్యంలోని విశేష ప్రయోగం.

8. పలువురయందు నొక్కనికిని బ్రాఁతియు నొక్కని యందు ( జూడున
గ్గలమగు ప్రేమ పల్వురకు ( గల్గుట యద్భుత మట్లుగాన యి
వ్వెలదులయందు (గూర్మిపస వీనికి నేమియు లేదు వీని యం
దలవడ ( గల్గదీ జలరుహాక్షులకున్ బ్రియ మెవ్విధంబునన్ 6.70

స్వరోచికి ముగ్గురు భార్యలు. మనోరమ, విభావసి, కళావతులు. ఒకరోజు స్వరోచి భార్యలతో తిరుగాడుతూ ఒక కాసారం చేరుకొన్నాడు. ఆ కాసారంలోని ఒక హంస చక్రవాకితో స్వరోచి, అతని భార్యల పరస్పర ప్రేమానురాగాలను మెచ్చుకొంది. కాని చక్రవాకి ఈ సమాన ప్రేమానురాగాలను ప్రశ్నించిన సందర్భంలోని పద్యమిది.

లోకంలో ఒకరికి చాలమంది సుందరుల పట్ల, చాలమంది సుందరులకు ఒక పురుషుని పట్ల ప్రేమ ఉండదు. అందువల్ల స్వరోచికి మనోరమ, విభావసి, కళావతుల పట్లగాని, మనోరమ, విభావసి కళావతులకు స్వరోచిపట్లగాని ఏ మాత్రము ప్రేమ ఉండదు.

9. తగులు నెవ్వఁడొక్క తరుణికి నొకనికి
మెలఁత వలచు నదియు మేలనంగ
వచ్చు ( గాని పెక్కువనితలపై ( గూర్మి
గలుగు ననుట బొంకు గాదె తరుణి. 6.74

వ్యవహారం రెండు రకాలు. లోక వ్యవహారం, మానసిక ఆంతరంగిక వ్యవహారం. మనసులో ఉన్నా, లేకపోయినా మాటల్లో చెప్పడం, చేతల్లో అన్నీ బాగా ఉన్నట్టు నటించడం, కాని మానసిక వ్యవహారం భిన్నంగా ఉండవచ్చు.

ఏ పురుషుడు ఒక యువతిని మోహిస్తాడో, లేదా ఏ జవరాలు ఒకరిని మోహిస్తుందో ఆ ప్రేమ ప్రదర్శన సహజం, సార్థకం. కాని అనేక స్త్రీల మీద ఒకరికి ప్రేమ ఉండటమన్నది సత్యం కాదు. అది బొంకే అవుతుంది.

10. హుంకారం బొనరించి వేతలఁగుఁదోహో నేను స్వారోచినే
పంకేజాక్షులతోడ నెల్లపుడు దర్పస్ఫూర్తిఁ గ్రీడింప ల
జ్జాంకూరం బడఁగించినారు తల పోయన్ నాకు రోఁతయ్యె మి
రింకం బోయి వరింపు (డొక్కరుని భోగేచ్ఛన్ నివారించితిన్ 6.79

ఈ పద్యం మనుచరిత్రలో స్వరోచి విహారంలోనిది. స్వరోచి భార్యలతో వనవిహారం చేస్తూ ఆడులేళ్ళ గుంపుతో ఉన్న ఒక మగ లేడిని చూచాడు. ఆడులేళ్ళు ఆప్యాయంతో మగ లేడిని చేరుతుంటే ఆ మగలేడి తన అయిష్టతను ప్రకటించింది. మృగ భాషలు తెలిసిన స్వరోచి ఆ మాటలు విని విరక్తుడయ్యాడు.

కలకాలం కామినీ జనంతో కాలక్షేపం చేసే స్వరోచిలా నన్నునుకొంటున్నారేమో! మీకు సిగ్గులేదు. సిగ్గుమాలిన పనిని తలచుకొంటేనే రోత పుడుతుంది. ఇక చాలు. మీరు నన్ను వదలిపొండి. మరొకరిని వరించండి. నేను భోగేచ్ఛ వదలుకొన్నాను.

11. మున్ను విప్రాకారమున (గూడుచో శంక ।
గనుమూయ (బనిచె నా ఖచర భర్త

యవ్వరారోహయు నాసక్త గావున
నిచ్చలో నటుసేయ నియ్యకొనియె
నా ప్రతిజ్ఞ పూర్తియయ్యెఁదనంత న
వ్వనితకు రతిపారవశ్యపటిమ
నపుడు తత్ప్రవర దేహ సమిద్ధ శిఖిదీప్తి
శాంబరీ మహిమచే సంగ్రహించి
నట్టి గంధర్వ మూర్తి సౌఖ్యాను భూతిఁ
జలన మేదిన మానసాబ్జమున నిలువ
వెలసెఁ దేజోమయం బైన వృద్ధి నట్టి
మేటి గర్భంబు నెలలు తొమ్మిదియు నిండె. 4.3

మను చరిత్రలో స్వారోచిషమనువుకు ఉత్తమ లక్షణాలు ఏ విధంగా సంప్రాప్తమయ్యాయో విశదీకరించే పద్యం ఇది. వరూధిని ప్రవరుని వలచింది. ప్రవరుడు తిరస్కరించాడు. ఆ సమయంలోనే వరూధినిచే తిరస్కరింపబడిన గంధర్వుడు మాయా ప్రవరుడయ్యాడు. మాటలతో నమ్మించాడు. వరూధిని అతడే ప్రవరుడనుకొన్నది. కాని కలయిక వేళ తన గుట్టు బయట పడుతుందని మాయా ప్రవరుడు సంగమవేళ కనులు మూయడం ఆచారమన్నాడు. వరూధిని అందుకు అంగీకరించింది. అందువల్ల వరూధిని లోచూపులో అసలు ప్రవరరూపమే ఉంది. కనుమూత సుఖప్రాప్తి వేళలో అసహజం కాకుండా సహజమే అయింది. ఆ సంభోగమే గర్భమై నిలిచింది. అది తేజోమయం కనుక తొమ్మిది నెలల పాటు నిలిచింది.

12 శ్రీ వక్షోజ కురంగ నాభ మెదపైఁ జెన్నొంద విశ్వంభరా
దేవిన్ దత్కమలా సమీపమునఁ బ్రీతిన్ నిల్పి నాఁడో యనం
గా వందారు సనందనాది నిజ భక్త శ్రేణికిన్ దోఁచు రా
జీవాక్షుండు కృతార్థుఁ జేయు శుభదృష్టిన్ గృష్ణరాయాధిపున్ 1.1

పెద్దన మనుచరిత్రంలోని తొలి పద్యమిది. విష్ణుమూర్తి కృష్ణరాయలను కృతార్థుని చేయుగాత అని ఆశీర్వచనం.

మహావిష్ణువు లక్ష్మీ దేవిని కౌగలించుకొన్నాడు. లక్ష్మీదేవి కుచసీమ పైని కస్తూరి విష్ణువునకు అంటుకున్నది. ఎదపై ప్రకాశమానంగా కనిపిస్తూ వున్నది. అపుడే సనక సనందనాదులు విచ్చేశారు. మహావిష్ణువు మనోహర రూపాన్ని దర్శించారు. స్వామి లక్ష్మీదేవితో భూదేవిని కూడా ఱొమ్ముపై నిలుపుకొన్నాడని భావించారు. అట్టి విష్ణువు రాయలను కృతార్థునిగా చేయుగాక.

ఈ పద్యంలో అనేక విశేషాంశాలున్నాయి. రాజుకుండవలసిన సంపదలు రెండు. భూసంపద, ధనసంపద. ఏది లేకున్నా కొరతే. లక్ష్మి కాంతిమతి. అందరి దృష్టి ఆనడం సహజం. కస్తూరి నల్లనది. విష్ణువు నల్లనివాడు. నలుపులో నలుపు ఆనదు. బాగా నలుపయితే ఆనుతుంది. సనకసనందనాదులు బ్రహ్మచారులు. అందువల్ల వారికి ఈ కౌగిలింతలు, కస్తూరీ లేపనంలాంటివి తెలియవు. శ్రీదేవి, భూదేవులు వెన్నుని భార్యలు కనుక ఇద్దరు దేవేరులతో ఉన్నాడని భావించారు. సాధారణంగా నాటకాలలో 'కావ్యార్థసూచన' నాందీపద్యంలో ఉంటుంది. ఆలాగే పెద్దన ఈ పద్యంలో విశేషార్థం ధ్వనింపజేశాడు. గంధర్వుడు మాయాప్రవరుడయినా వరూధిని అతనిని అసలు ప్రవరునిలాగా భావించడాన్ని కవి వ్యక్తం చేశాడు.

13. అంకముఁజేరి శైలతనయాస్తన దుగ్ధము లాను వేళ బా
ల్యాంకవి చేష్టఁ దొండమున నవ్వలి చన్ కబళింప బోయి యా
వంక గుచంబుఁ గాన కహివల్లభ హారము గాంచి వే మృణా
ళాంకుర శంక నంటెడు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికిన్ 1.4

మను చరిత్రలోని కావ్యాది పద్యాలలో ఇది ఒకటి. ఈ పద్యంలో 'వినాయక ప్రార్థన' ఉంది. పార్వతీ పరమేశ్వరులు వినాయకుని తల్లిదండ్రులు. పరమశివుడు అర్ధనారీశ్వరుడు. వినాయకుడు బాల శిశువు. బాలురకు స్తన్యం ఇష్టం. వినాయకుడు స్తన్యం సేవిస్తున్నాడు. బిడ్డల అలవాటుగా రెండవవైపు తొండము చాచాడు. ఆవలి చన్ను కనబడలేదు. అది పరమేశ్వరభాగం. అపుడే సర్ప స్పర్శ కలిగింది. లేత తామరకాడయేమో అని సంశయించాడు. అట్టి వినాయకుడు అభీష్ట సిద్ధి కోసం ప్రార్థించాడు.

ఒక దానిని మరో దానిగా అనుకోవడం భ్రాంతి. తాడును పాముగా అనుకోవడం, ఇలాంటిదే. వరూధిని మాయాప్రవరుని అసలు ప్రవరునిగా భావించడం భ్రాంతిమదాలంకారం. పెద్దన వైష్ణవం స్వీకరించినా విష్వక్సేనుని స్తుతించలేదు. వినాయకునే నుతించడం ప్రత్యేకత.

14. నిడుద పెన్నెఱి గుంపు జడగట్ట సగరు ము
        మ్మనుమండు తపము గైకొనిన చోటు
    జరఠ కచ్ఛప కులేశ్వరు వెన్ను గానరా
        జగతికి మిన్నేఱు దిగిన చోటు
    పుచ్ఛదీక తనంబు పోఁబెట్టి గిరికన్య
        పతిఁ గొల్వ నాయాస పడిన చోటు
    వలరాచ ఁరాచవాఁడలి కాక్షు కనువెచ్చ,
        గరఁగిన యలక నికరపుఁజోటు
    తపసి యిల్లాండ్ర చెలువంబు దలఁచి తలఁచి
    మున్ను ముచ్చిచ్చును విరాళి గొన్న చోటు
    కనుపవులు వేల్పు ఁబడవాలు గన్న చోటు
    హర్షమున ఁజూచి ప్రవరాఖ్యు ఁడాత్మలోన. 2.9

మను చరిత్రంలో ప్రవరుడు దర్శించిన వివిధ ప్రదేశాలను విశదీకరించే పద్యం ఇది. భగీరథుడు తపం చేసిన చోట ఆకాశగంగ దిగిన చోటు, పార్వతి శివునికి శుశ్రూష సలిపిన ప్రదేశం. మన్మథుడు బూది పాలయిన స్థలం. అగ్ని దేవుడు సప్తర్షి కాంతలపై మోహం పెంచుకొన్న ప్రదేశం. కుమార స్వామి జనన మందిన ప్రదేశం చూచి ప్రవరుడు ఆశ్చర్యపరవశుడయ్యాడు.

15. తావుల్ క్రేవల ఁ జల్లు చెంగలువ కేదారంబు తీరంబునన్
    మావుల్ క్రోవులు నల్లి బిల్లి గొను కాంతారంబునం దైందవ
    గ్రావాకల్పిత కాయమాన జటిల ద్రాక్షా గుళుచ్ఛంబులన్
    బూవుం దీవెల నొప్పు నొక్క భవనంబున్ గారు దోత్కీర్ణమున్ 2.22

మను చరిత్రంలో ప్రవరుడు హిమవత్పర్వత ప్రాంతంలో దర్శించిన దృశ్యాలలో గరుడపచ్చల గృహమొకటి. ఆ దృశ్య వర్ణన ఈ పద్యంలో వర్ణితం. ఈ దృశ్యంలో క్రమవికాసం ఉంది. ముందు కనిపించేది వరిమడి. ఆ మడిలో ఎర్ర కలువలున్నాయి. అవి పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆ వరిమడి దగ్గర ద్రాక్షగుత్తుల తీగెలున్నాయి. పూల తీగెలున్నాయి. ద్రాక్ష తీగెలు, పూలతీగెలతో ప్రకాశించే గరుడపచ్చల సదనముంది. ఎర్రకలువలు లాంటివి సహజ ప్రకృతి దృశ్యాలు. పూలతీగెలు సహజం కావచ్చు. కాని అందంగా అల్లించడం, ద్రాక్షాలతలు సొంపు అనేవి మానవ ప్రయత్నంతో సాధ్యమయ్యేవి. హిమవత్పర్వత ప్రాంతంలో ద్రాక్షలు ఉండడానికి వీలులేదు. కాని కొండ దిగువ చరియలలో ఉండడానికి వీలుంది. లేదా హంపిలో లేదా పెనుగొండలోని దృశ్యాలను పెద్దన ఈ వర్ణనలో భావించి వుండవచ్చు.

16 అత ఁడావాత పరంపరా పరిమళ వ్యాపారలీలన్ జనా
    స్వత మిచ్చోటని చేరఁబోయి కనియెన్విద్యుల్లతా విగ్రహన్
    శతపత్రేక్షణ ఁజంచరీక చికురన్ జంద్రాస్య ఁజక్రస్తనిన్
    నతనాభి న్నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్ 2.25

మను చరిత్రలోని పద్యం ఇది. ప్రవరుడు వరూధినిని దర్శించిన దృశ్యం ఈ పద్యంలో వర్ణితం. పసరు కరిగిపోగా దారి తెలియక తచ్చాడుతున్న ప్రవరునికి వరూధిని కనిపించింది. ప్రవరుడు దిక్కుతోచక తచ్చాడుతుంటే 'గాలి' వీచింది. ఆ గాలి సుగంధభరితం. ఆ సువాసన 'గాలిజాలు' బట్టి ఇంకా పరంపరగా అనుభవయోగ్యమవుతూ వుంది. అందువల్ల దగ్గర జనవాసముందని ప్రవరుడు గ్రహించాడు. ఆ వాసనల వెంబడి కదలి వెళ్ళాడు. అక్కడ మెఱుపు దీగెలాంటి మేను గలదానిని, కమలాల వంటి కన్నులు కలదానిని, తుమ్మెదల్లాంటి కురులు కలదానిని, చంద్రముఖిని, చక్రస్తనిని, అచ్చర లేమలలో మిన్నయైన దానిని జవరాలిని ప్రవరుడు దర్శించాడు.

17 కమ్మని కుందనంబు కసుఁగందని మేనెలదేఁటి దాఁటులన్
బమ్మెర వోవఁదోలు ఁదెగ బారెఁడు వెండ్రుక లిందు బింబమున్
గిమ్మన నీదు మోము గిరి క్రేపులు మూఁపులు కౌను గానరా
దమ్మక చెల్ల ! వాని వికచాంబకముల్ శతపత్ర జైత్రముల్ 3.6

మనుచరిత్రంలోని పద్యమిది. ప్రవరుడు తిరస్కరించి వెళ్ళిపోగా, వరూధిని విరహంతో తచ్చాడుతూ, చెలికత్తెలతో ప్రవరుని సౌందర్యం వర్ణించే సందర్భంలోనిది.

ఆహా ! నేను ఏమని వర్ణించను? ప్రవరుని శరీరం పరిమళంగల మేలిమి బంగారం. అతని బారెడు నిడుపు కురులు తుమ్మెదల బారును మించినవి. అతని మొగము చంద్రబింబాన్ని అధఃకరించేది. అతని భుజాగ్రాలు పర్వతాగ్రాల లాంటివి. అతని కనులు విశాలం. కమలాలను లెక్కచేయనివి. 'కన్యావరయతే రూపమ్' కన్య మగవానిలో సంపదల కంటే రూపాన్ని అధికంగా ప్రేమిస్తుంది. ప్రవరుని రూపం పడతిని ఆకర్షించింది. చెరగని ముద్ర వేసింది. అందుకు చెలికత్తెలతో మరీ మరీ వర్ణించింది.

18 శ్రేణుల్ గట్టి నభోంతరాళమున ఁ బాటెన్ బక్షులు ష్ణాంశు పా
షాణ వ్రాతము కోష్ణమయ్యె మృగ తృష్ణా వార్ధులింకెన్ జపా
శోణంబయ్యె ఁ బతంగ బింబము దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణంబయ్యె సరోజషండములు నిద్రాణంబులయ్యెన్ గడున్ 3.12

మను చరిత్రంలోని సంధ్యాకాల వర్ణనం. మేతకు వెళ్ళిన పక్షులు బారులు కట్టి ఆకాశంలో వెనుతిరుగుతున్నాయి. సాయంకాలంకాగా అంతవరకు మండుతున్న సూర్య కాంతశిలలు చల్లబడుతున్నాయి. ఎండమావులు అణగిపోయాయి. దిక్కులలో కాంతులణగాయి. కమలాలు ముకుళించాయి. సూర్యమండలం ఎర్రబారింది.

19 ఉరుదరీ కుహర సుప్తోత్థ శార్దూలముల్
ఘురవారి శోణిత శంక ఁద్రావ
వనకుంజమధ్య శాద్వల చర న్మృశ పంక్తి
దావపావక భీతి ఁ దల్ల డిల్ల
నాశ్రమాంతర భూరుహాగ్రముల్ మునికోటి
బద్ధ కాషాయ విభ్రాంతి ఁ జూడ
ఘన సాను శృంగ శృంగాట కుబుల ఁగాంచి
యమరులు హేమాద్రి యనుచు వ్రాల ఁ
గాసె ఁ బేశలరుచి ఁ గింశుక ప్రవాళ
ఘుసృణ కిసలయ కంకేళి కుసుమ గుచ్ఛ
బంధు జీవజపారాగ బాంధ వంబు
లన్నగంబున జరఠారుణా తపములు 3.11

మనుచరిత్రలో తృతీయాశ్వాసంలో వర్ణితమైన సంధ్యాకాల వర్ణన పద్యమిది. ఎండకు తట్టుకోలేక గుహలలో దాగి నిదరబోయి లేచిన పెద్దపులులు సెలయేళ్ళలోని ఎర్ర నీటిని రక్తమనే ఊహతో తాగుతున్నాయి. పొదరిండ్ల నడిమి పచ్చిక నేలలో మేత మేసే జింకలు ఎర్రటి ఛాయతో కనిపించే పొదరిండ్లను కాఱుచిచ్చుగా భావించాయట. ముని పల్లెలలో ఉన్న వృక్షాగ్రముల ఎర్రదనం చూచి తమ కాలి వస్త్రాలని భావించారట. విమానయానం చేసే దేవతలు ఎర్రని శిఖరాలు చదుకాలను చూచి మేరు పర్వతమని దిగి వచ్చారట. ఆ కొండపై మోదుగు పూలు, పవడాలు, కుంకుమపూలు, చిగురుటాకులు, రక్తాశోకం పూగుత్తులు, మంకెనపూలు, జపాకుసుమాల ఎరుపుకు చుట్టాలన్నట్లు సంజయెండలు కాశాయి.

స్ఫుట సౌగంధిక రాగరక్తరుచి మై ( బూనెన్ జపా సన్నిధి
స్ఫటికంబట్లు దయాద్రి గైరిక శిర స్స్థాన స్థితిన్ జంద్రు ( డ్
చ్చొటువాయన్ శుచియయ్యెనౌ ( బ్రకృతి నచ్చుండైన సన్మార్గి యె
స్పటికిన్ గూటమి వంక వచ్చు వికృతిన్ మగ్నుండుగా నేర్చునే 3.24

చంద్రుడు సహజంగా స్వచ్ఛుడు. స్వచ్ఛమైన స్ఫటికం దగ్గర దాసాని పువ్వును పెడితే స్ఫటికం ఎర్రగా కనిపిస్తుంది. చంద్రుడు తెల్లని వాడయినా తూరుపు కొండల శిఖరాలనుండి బయట పడేవేళ ఆ కొండలోని ఎర్రని గైరికాది ధాతువుల కారణంగా ఎర్రగా కనిపిస్తున్నాడు. కాసేపటికి ఆ చోటు వదలిపెట్టగా స్వచ్ఛరూపుడైనాడు. స్వభావముచే నిర్మలుడైన వాడు సహవాస దోషం వల్ల వికారుడయినా ఆ దుస్సహవాసం వీడినప్పుడు స్వచ్ఛుడు కావడం సహజమే.

20. ఒక నేత్రాంబుజ మొక్క గల్లి మొక చన్నొయ్యారపున్ లీల వీ
ధిక ( దోప్రన్ దలు పొరగా నొక పురంధ్రీ రత్న మీక్షించె రా
జకిశోరంబు (దదీయలై వెలయు భాపాలక్ష్ములన్ జూచి త్ర్యం
బక భాగంబు మొఱంగి మైత్రికి శివాభాగంబ యేతెంచెనాన్ 5.69

మనుచరిత్రంలోని పద్యం ఇది. స్వరోచిని దర్శించడానికి వచ్చిన పతివ్రత ఆంగిక నైఖరిని పెద్దన రమణీయంగా వర్ణించాడు. పతివ్రతలు బాహాటంగా కనిపించరు. అందుచేత ఒక కవాటం మూసింది. కవాటం వెనుక దాగింది. ఒక కన్ను, ఒక చన్ను, ఒక పార్శ్వభాగం కనిపించేలా నిలిచి స్వరోచిని దర్శిస్తున్నది. ఆ పతివ్రత గౌరిలా ఉంది. సరస్వతి, లక్ష్మి గౌరి చెలికత్తెలు. సరస్వతి విద్యకు అధినేత. లక్ష్మి సంపదకు. ఆ గౌరి స్వరోచిని చేరిన సరస్వతిని, లక్ష్మిని చూడదలచుకొనే కాంక్షతో వచ్చినదేమో అన్నట్టుగా పతివ్రత కవాటం వెనక దాగి కనిపిస్తున్నదని పెద్దన వర్ణించాడు.

21. విసుమానములు గాఁ గ వసతోడఁ బెన వెట్టి
నెట్టెంబుగా (బేవు ( జుట్టి నాఁడు
బండి కందెన చాయ బైసి మాలిన మేన
మెదడు గందపు రొంపి మెత్తి నాఁడు
కునఖంపు దాచేతి పునుక కప్పెరనిండఁ
బ్రాణి కోటుల నల్ల ( బట్టి నాఁడు
కొకిబికి వేసంపు గూని మూ (పుల మీఁద
మూఁడు పంగల యీ ( టె మోపి నాఁడు
నిట్ట తాడన ( బొడవు చే నిక్కి నాఁడు
నిడుద కోఱల మిడిగ్రుడ్ల నెగడి నాఁడు

నరవరోత్తమ నేడు మూ నాళ్ళ నుండి

యుసుబు గొన వెంట ( దిరిగెడు నసురయొకడు 4.73

మను చరిత్రలో మనోరమను వెంటాడే రాక్షస వర్ణన ఇది. కొవ్వు పొరలు ప్రేవులు తలకు చుట్టుకొన్నవాడు. మసిలాంటి ఒంటిపై గంధం లాగా మెదడు పూసుకొన్నవాడు. ఎడమచేతిలో నెత్తురు నింపిన పుఱ్ఱె పట్టుకొన్నవాడు. మూపుల మీద త్రిశూలం పెట్టుకొన్నవాడు. నిడుద కోఱలు కలవాడు. మిడి గ్రుడ్లువాడు, నిట్టతాడు వంటి ఒడలు కలవాడు అయిన ఒక రాక్షసుడు మూడు దినాల నుండి వెన్నాడుతున్నాడు.

22. పల్లిమ తల్లి లావణ్య సర్వస్వంబు
        విమలాంగ రేఖ నావిర్భవింప
    మంజుల మంజరీ మహిత సౌభాగ్యంబు
        పరివృత్త కుచవృత్తి ( బరిణమింప ।
    బల్ల వచ్ఛద చారు భావాను భావంబు
        మృదుహస్త లీల మూర్తీ భవింప
    రమణీయ ముకుళ విభ్రమ భాగధేయంబు
        కరరుహ స్ఫూర్తి సాక్షాత్కరింప
    జేసి మృగియై వహించు నక్షిద్వయంబు
    భాసురంబుగ ( దన యంక పాళిలోన
    మించు క్రొమ్మించు నుపమించు మెలంత యగుచు
    నిలుచు నవ్వన దేవత నృపతి ( జూచి 6.76

మను చరిత్రలో మనుజాంగనలాగా కనిపించిన వనదేవత వర్ణనం ఇది. లతలే దేహం. పూల గుత్తులే పాలిండ్లు. లేజొంపములే చేతులు. పుష్పముకుళాలే గోళ్ళు. లేడి కన్నులే కన్నులు. వనదేవత శంపాలత - మెరుపు తీగ. స్వరోచి రాజు కౌగిటలో వనదేవత మనుజాంగన లాగా కనిపించింది.

23. పాల ( బుట్టిన మాత్రాన మేలి గుణము
    నే (డు నీకేల గల్గునో నీరజారి
    నీట ( బుట్టిన వా(డు గా ( బోలు వహ్ని
    గోల్చు చున్నా(డు జగమెల్ల ( గరుణలేక 3.41

మను చరిత్రలోని వరూధిని చంద్ర ఉపాలంభనంలోని పద్యమిది. విరహులకు చంద్రోదయం. వెన్నెలలు బాధాకరం. అందువల్ల చంద్రుని ఆడిపోసుకోవడం ప్రబంధాలలోని వర్ణనాంశాలలో ఒకటి అయింది.

ఓ చంద్రా ! నీట బుట్టిన అగ్ని చల్లగా ఉండాలి. కాని ఆ అగ్ని జగాలను కాలుస్తున్నాడు. కాని నీవేమో పాల సముద్రములో పుట్టావు. పాలగుణం రాలేదు. మంచి గుణాలకు మంచి తావు పుట్టుకలే కారణం కాదుగదా ! తోబుట్టువులకే బాధ కలిగించే వాడవు.

24. సాహంకారత శంకరుం డలిగి నేత్రాగ్నిన్ బయిన్ బంపినన్
    స్వాహాకాముకు (డొట నివ్వత(డు గావంబోలు మోమోడి సం
    దేహం బేని రతీశ నీవు మగుడన్ దేహంబుతో నుండు టె
    ట్లాహా ! దైవము దోసకారులకె తోడైవచ్చు నెప్పట్టునన్

మను చరిత్రలో వరూధిని చంద్రో పాలంభనం లోనిదీ పద్యం. శివుడు తపం చేస్తుండగా మన్మధుడు పూల బాణం వేశాడు. కాసంత చలించిన శివుడు తమాయించుకొని మూడవ నేత్రంతో మన్మధుని బుగ్గిపాలు చేశాడు. అగ్ని హోత్రుడు స్వాహాకాముకుడు. అందువల్ల నీ పట్ల కాసంత జాలి ఉంది. అందువల్లనే పూర్తిగా నిన్ను చంపలేదు. ఆ కారణం వల్లనే మరల పునరుజ్జీవితుడవయ్యావు. ఆహా! దైవం సహితం పాపాత్ములకు తోడవుతుంది కదా.

25. దట్టంబు నీ కట్టినట్టి చెంగావికి
బాగు గాదని కేల ( బయట నిమిరె
గోరంటొ గోళ్ళ నిక్కువవు ( గెంపో యని
చెయి పట్టి నయమున సెజ్జ సేర్చె
నగురు ధూపము చేత నయ్యో తనూవల్లి
సెక సోఁ కె నని యెద ( జెయ్యివెట్టె
మృగనాభికా మకరికల ( గప్రము మించె
నని మూరుకొనుచు ( జుంబన మొనర్చె
హారమణు లిటు సూపు నా యణుత నున్న
హో మణులకు ( గాంతి నీ దౌనో కావా
యనుచు నక్కున ( గదియించు నా నెపమున (
గంపమును బొందు సతి మేను గౌఁగిలించె

6 . 8

మను చరిత్రలో స్వరోచి మనోరమను ఏలుకొన్న విధం ఈ పద్యంలో వర్ణితం. చెంగావి చీరకు తగదని పయట నిమిరినాడు. గోరంటాకు పెట్టుకొన్నావా యేమి అని అడిగి చేయిపట్టి శయ్యకు చేర్చినాడు. ధూపం వేసుకోవడం వల్ల మేనుకు సెక సోకిందేమోనని వక్షముపై చేయుంచినాడు. మకరికా పత్రాలలో పచ్చకప్పురం ఎక్కువయిందని వాసన చూస్తూ ముద్దులు నింపాడు. ముత్యాల హారమణులు సరిచూచే నెపంతో కంపిత అయిన మనోరమను కావలించుకొన్నాడు.

26. వాని చక్క ( దనము వైరాగ్యమున ( జేసి
కాంక్ష చేయు వారకామినులకు
భోగబాహ్యమయ్యె ( బూచిన సంపెంగ
పోలుపు మధుకరాంగనలకు ( బోలె

1 . 52

మను చరిత్రలో ప్రవరుని ప్రత్యేకతను నిరూపించు పద్యమిది. తుమ్మెదలకు మకరందం ఇష్టం. కాని తుమ్మెదలకు సంపంగి తావి పడదు. ప్రవరుడు సంపెంగపూవు లాంటివాడు. వారకాంతలకు ప్రవరుడు కొరుకువడలేదు. కారణం ప్రవరునికి వారకామినీ విషయేచ్ఛలేదు.

27. నట విట గాయక గణికా
కుటిల వచశ్శీధురసము ( గ్రోలెడు చెవికిన్
గటు వీ శాస్త్రము వల ది
చ్చట నిను ( జదివింపకున్న జరగదె మాకున్

5 . 9

మను చరిత్రలో ఇందీవరాక్షుడు ఆయుర్వేదం నేర్చుకోవాలని బ్రహ్మమిత్రుని ప్రార్థించాడు. కాని బ్రహ్మమిత్రుడు తిరస్కరించిన సందర్భంలోనిదీ పద్యం.

నటులు, జారులు, గాయకులు, భోగపు చెలువలు మొదలయిన వారి పరిహాస రూపములయిన నిందా వాక్యాలను వినుటలో సమాదర భావం కలవారికి ఈ శాస్త్రం కటువు. నిన్ను చదివింపకున్నంత మాత్రాన మా నిత్య కృత్యాలకు ఏలాంటి లోపం లేదు. నటాదుల మాటలు మద్యం లాంటిది. మద్యం కైపు నిస్తుంది. అలాగే వారి మాటలని భావం.

28. ఆహా ! ధన్యు ఁ డనైతి, మద్విమల వంశాచార విద్యా తప
శ్శ్రీ హోమాదులు నే ఁడుగా ఁ దుది ఫలించెన్ నాగవాసంబు మ
ద్గేహ క్షోణికి బిడ్డ వేఁడుటకు నేతే ఁ గాంచుటన్ బ్రాహ్మ్యమీ
క్రోహో చాలు ఁ బో కాలి పోయెదరొ పోరో నోటి క్రొవ్వేటికిన్ 6 . 45

మను చరిత్రలో కళావతి వృత్తాంతం లోనిదీ పద్యం. కళావతీ మీది కోరికతో దేవాపి అనే గంధర్వుడు తన పరివారంతో వచ్చాడు. వారి వేషాలు జుగుప్సావహం. వీరిని చూచిన కళావతి తండ్రి ఎకసెక్కంగా నాగ సంవారు నా బిడ్డ కోసం రావడంతో ధన్యుడనయ్యాను. నా కులాచారాలకు పవిత్రత కలిగింది. నా జప తపాది విద్యలకు సాఫల్యం దక్కింది. నా బ్రాహ్మణత్వం, చాలు చాలు. వ్యర్థాలాపాలు మాని వెళతారా లేదా వెళ్ళరా. చెప్పండి.

29. ఎవ్వడు మీ ఁదెఱుంగక యథేచ్ఛసుఖైకరతిన్ జరింపఁగా
నవ్వల వంశహాని వ్రతహాని యశోధన హాని పుట్టు ఁ దా
నవ్వెడ ఁ గమ్మనుష్య పశు వయ్యవివేకి చెడున్ జగంబునన్
నవ్వఁగఁ బాలు రౌరవమున బడ ఁ బాలును నిందపాలునై 3.135

మను చరిత్రలో మాయాప్రవరుడు వరూధినిని విడిచి వెళ్ళే సమయంలో చెప్పిన మాటలివి. 'యథేచ్ఛసుఖైకరతి' ఎప్పటికయినా అనర్థమే. ఇది పశుధర్మం. దీని వల్ల వంశహాని, వ్రతహాని, యశోధనహాని. నలువురలో నగుబాటు. పైగా నరక ప్రాప్తి.

30. తొలుదొల్త వాని ఁగన్నుల ఁగాంచినప్పుడ
పల్ల వాధర గుండె జల్లుమనియె
నట రెండు మూఁడంజ లరుగునప్పుడ కాళ్ల ఁ
బంక జాక్షికి ఁదొట్రుపాటు గదిరె
డాయంగ ఁజనునప్పుడ ముఖాంబు జంబున ఁ
గంబు కంధరకు దైన్యంబు దోచె ఁ
గదిసి నిల్చినయప్డు కనుదోయి ఱెప్పల
లలనకు మిగుల ఁజంచలత బెరసె
గటకటా యనునపుడ గద్గదిక వొడమె ఁ
జెఱ ఁగు వట్టిన యపుడ లేఁజెమట గ్రమ్మె
సొలసి మాటాడ నుంకింప ఁదలఁచి మోము ఁ
దేరకొని చూచునపుడ కన్నీరు పొడమె 3 . 91

మను చరిత్రలో మాయాప్రవరుని చూచిన వరూధిని స్థితి ఈ పద్యంలో వర్ణితం. మాయాప్రవరుని వేషంలోని గంధర్వుని చూడగనే వరూధిని గుండె జల్లుమంది. రెండు మూడు అడుగులు వేసేసరికి అడుగులు తడబడ్డాయి. దగ్గరికి వెళ్ళేసరికి మొగాన దైన్యం. కుదురుకొని నిలబడేసరికి కన్నుల్లో చాపల్యం. నన్నింత మోస పుచ్చినావు కదా అనేటప్పటికి డగ్గుతిక. పైట కొంగు పట్టుకోగానే చిరు చెమ్మటలు మాటాడడానికి సిద్ధం కాగానే కన్నీరు.

31. ప్రబల భల్లుక నఖ భల్ల భయద మథన
శిథిల మధుకోశ విసర విశీర్ణ మక్షి
కాంతరాంతర దంతురితా తపమున ఁ
బుడమి తిల తండుల న్యాయమున వెలుంగ 2 . 7

మను చరిత్రలో ప్రవరుడు హిమగిరిలో దర్శించిన దృశ్యాల వర్ణనలోనిదీ పద్యం. ఎలుగు గొడ్లు తమ గోళ్ళతో తేనె తుట్టెలను చిదుమ గొట్టాయి. ఈగలు రేగి అటుఇటు తిరుగుతున్నాయి. ఎండలో వాని పొడ లేర్పడ్డాయి. అపుడు నేల అంతా నూవులు బియ్యం కలయ బోసినట్లు కనిపించింది.

32. పలాశి డాసి రాజుఁ జూచి పల్కెనోరి నోరికీ
పొలానఁ బెన్పొలాన లేక పోవ నీవు దోఁచి తా
బలా బలాలి తోడఁ బాల బట్టి బిట్టు చుట్టినిన్
హళా హళిన్ హలా హలా భయౌ బుభుక్ష దీర్చెదన్

4 . 98

మను చరిత్రలో స్వరోచి రాక్షసుల సమరం వర్ణించే సందర్భం లోనిదీ పద్యం.

ఓరీ ! నా ఆకలి కాలకూటంలా రగిలిపోతున్నది. మనుష్య మాంసం దొరకలేదని తిరుగుతుంటే పరిజన సహితంగా నీవు కనబడ్డావు. నిన్ను నీ సేనను ఈ బాలికను కలిపి మింగి ఆకలి తీర్చుకొంటాను.

33. ఆ మందిడి యతఁడరిగిన
భూమీ సురుఁడరిగెఁ దుహిన భూధరశృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్య దరీ ఝరీ నిరీక్షా పేక్షన్.

1 . 79

మను చరిత్రలో ప్రవరుడు హిమగిరులకు కదలిన సందర్భం లోనిదీ పద్యం. ఇంటికి వచ్చిన సిద్ధుడు ప్రవరుని పాదాలకు పసరు పూశాడు. ఆ పసరు పూయగనే మంచుకొండల శిఖరాలలో నవనవ లాడే అడవుల్ని, బంగారంతో కూడిన గుహల్ని, సెలయేర్లను చూడాలనే ఆపేక్షతో కదలిపోయాడు.

34. ఇంతలు కన్నులుండఁదెరు వెవ్వరి వేడెదు భూసురేంద్ర యే
కాంతము నందు నున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించు లా
గింతయ కాక నీ వెఱుఁగవే మును వచ్చిన త్రోవ చొప్పు నీ
కింత భయంబు లేకడుగ నెల్లద మైతిమి మాట వేటికిన్

1 . 4

మను చరిత్రలో వరూధిని ప్రవరుని ప్రశ్నించిన సందర్భం లోనిదీ పద్యం.

ఓ విప్రవర్యా ! చేరడేసి కన్నులు పెట్టుకొని ఇతరులను దారి అడుగుతున్నావా ? ఒంటరిగా ఉన్న జవరాండ్రను పలకరించాలనే కోరికతో అడగడమే గాని వచ్చిన త్రోవ నీకు తెలియదా ? పలు మాటలేల ? ఏ మాత్రం భయం లేకుండా అడుగుతున్నావంటే మేము నీకు చులకనగా కనబడుతున్నామా.

35 . మృగ మద సౌరభ విభవ
ద్విగుణిత ఘన సార సాంద్ర వీటీ గంధ
స్థగితేతర పరిమళమై
మగువ పొలుపు తెలుపు నొక్క మారుత మొలసెన్

2 . 24

ప్రవరుడు హిమగిరిలో దారి తెలియక తిరుగుతుంటే కవి వర్ణించిన 'మారుతవర్ణనం'. కస్తూరి, పచ్చకప్పురం మొదలయిన పరిమళ ద్రవ్యాలు కలిసిన తమ్మవాసన ఇతర పరిమళాలను కప్పి వేయగా 'మగువ పొలుపు' తెలిపే ఒక గాలి అల్లన వీచింది.

36. వాలారుం గొనగోళ్ళ నీ వలసతన్ వాయించుచో నాటకున్
మేళంబైన విపంచి నిన్న మొదలున్ నీ వంటమిం జేసి యా

యాలాపంబెయ వేళ ( బల్కెడు ( బ్రభాతాయాత వాతాహతా
లోలత్తంత్రుల మేళవింప (గదవే లోలాక్షి దేశాక్షికిన్ 3 . 57

మనుచరిత్రలోనిదీ పద్యం. వరూధినిని సముదాయిస్తూ చెలికత్తెలు మాటలాడిన సందర్భంలోనిది.

మధ్యాహ్న కాల రాగం నాట ఈ నాట రాగానికి స్వరస్థానాలు కుదిర్చిన వీణ ఇప్పటిదాక ముట్టుకుండడం వల్ల గాలి కదలికకు దంతులు ఆ మేళంతోనే వాగుతున్నది. కాని మధ్యాహ్నం దాటి రాత్రి గడచి తెల్లవారుతున్నది. ఈ సమయానికి ఇది తగదు. అందువల్ల దేశాక్షి రాగానికి అనుకూలంగా స్వరస్థానాలు కుదిర్చి జతపరచు.

చకితైణాహుతి దావ మావళిత పుచ్ఛ స్వల్ప గచ్ఛత్తర
క్షుక మద్రి గ్రహయాళు భల్లుకము వక్షోభాగనిక్షిప్త డిం
భక వల్గత్ ప్లవగీ కదంబము ప్రధాంభః ప్రోద్ధి తక్రోడనా
యక మాభీల ముఖ ద్విపిస్థ పుటితంబయ్యెన్ వనంబత్తతిన్ 4 . 38

మనుచరిత్రలోని స్వరోచి వేట వర్ణనంలోనిదీ పద్యం. వేట సమయంలో అడవిలోని జింకలు కార్చిచ్చులో పడి కాలిపోయాయి. తోకలు ముడుచుకొని సివంగులు పరుగెత్తలేకపోయాయి. ఎలుగులు కొండలకెగబాకుతున్నాయి. పిల్లలను కడుపున హత్తుకొని కోతులు గంతులు వైచాయి. మడువులలోనుండి పెద్ద పందులు వెడలిపోయాయి. పెద్ద పులులు నోరు తెరచుకొని తిరుగాడసాగాయి.

## ప్రశ్నలు - జవాబులు

**1. దివాకర్ల వేంకటావధానిగారు 'అల్లసాని పెద్దన' గురించి మనుచరిత్ర రచనకు సంబంధించి తెలియజేసిన అంశాలను వివరించండి.**

డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు ఆంధ్రదేశం గర్వించదగ్గ ఆచార్యులలో ఒకరు. హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చిరకాలం తెలుగుశాఖకు అధ్యక్షులుగా రాణించినవారు. వారు శతాధిక గ్రంథకర్తలు. అవధాని గారు ప్రసంగించిన వ్యాసాలలో 'మను చరిత్రము' ఒకటి. ఈ వ్యాసంలో ప్రధానంగా మూడు భాగాలున్నాయి. మొదటి భాగం పెద్దనకు సంబంధించిన సామాన్య అంశాలను మనుచరిత్ర రచనకు సంబంధించిన విశేషాంశాలను తెలియజేస్తుంది. రెండవ భాగం మనుచరిత్ర కథను వివరిస్తుంది. మూడవ భాగం మనుచరిత్రలోని అనేక అంశాలను చర్చిస్తుంది. ప్రస్తుతాంశం పెద్దనకు సంబంధించిన సామాన్య అంశాలు. మనుచరిత్ర రచనకు సంబంధించిన విశేషాంశాలు.

పెద్దన పూర్తి పేరు అల్లసాని పెద్దన. ఇతని తండ్రి చొక్కయామాత్యుడు. ఇతడు ఋగ్వేద శాఖీయుడు. ఆశ్వలాయన సూత్రుడు వసిష్ఠగోత్రుడు. ఇతడు మొదటి నందవరీకుడు. నందవరీకులు స్మార్తులు. నియోగి బ్రహ్మణ శాఖకు చెందిన వారు. కాని తరువాత కాలంలో వైష్ణవం పుచ్చుకొన్నట్లు ఐతిహ్యం. ఇతని వైష్ణవగురువు అహోబలమఠ స్థాపకుడు శఠకోపయతి. ఇతని కాలం క్రీ . శ. 1437 - 1515.

పెద్దన రచనలు రెండు మొదటిది 'హరికథాసారం'. ఈ గ్రంథం ప్రస్తుతం అలభ్యం, కాని ఈ గ్రంథంలోనివిగా కొన్ని పద్యాలను ఉదాహరించియున్నారు. వాటిలోని ఒక షష్ఠ్యంత పద్యం బట్టి 'హరికథాసారం' శఠకోపయతికి అంకితం చేయబడిందని పరిశోధకులు భావిస్తున్నారు. అంతేగాక ఈ గ్రంథంలోని అంశాలు శ్రీహరి అవతార కథనం కావచ్చని ఊహిస్తున్నారు.

పెద్దన ఏ ప్రాంతీయుడనడంలో అభిప్రాయ భేదాలున్నాయి. కవిచరిత్రలో పెద్దన బళ్ళారి ప్రాంతంలోని దూపాడు పరగణాలోని దోరాల గ్రామవాస్తవ్యుడని చెప్పబడింది. రాయల పెద్దనకు 'కోకట' గ్రామం దానం చేయడం వల్ల పెద్దన జన్మస్థలం 'కోకటం' అని విమర్శకులు భావిస్తున్నారు. ఈ గ్రామం కడపజిల్లా కమలాపురం తాలుకా 'కోకట' గ్రామమయితే పెద్దనను కడప మండల కవిగా చెప్పక తప్పదు. మరి

కొందరు పెద్దన 'పెద్దనపాడు' గ్రామవాసిగా భావిస్తారు. అందుకు ప్రబల నిదర్శనం ఆ గ్రామసమీపంలో పెద్దన ఒక చెఱువు త్రవ్వించినాడనే ఐతిహ్యం. పెద్దనపేర ప్రథమ తాంబూలమిచ్చే సంప్రదాయం ఇప్పటికీ ఉండడం.

పెద్దన తాను అగ్రహారాలు పుచ్చుకొన్నప్పటికి అనేక దానాలు చేసిన ఉదారుడు. క్రీ. శ. 1518 నాటి శాసనంలో పెద్దన సకలేశ్వర దేవుని ధూప దీపనైవేద్యాల కోసం కోకట గ్రామంలోని కొంత భాగం దానం చేసినట్లు చెప్పబడింది. మరి కొంత భూభాగాన్ని చెన్నకేశవస్వామి దీపారాధన కోసం దానం చేసినట్లు ఈ శాసనం విశదీకరిస్తున్నది. అలాగే క్రీ. శ. 1519 నాటి శాసనం అన్నూరు వరదరాజస్వామికి చేసిన కైంకర్యాన్ని స్పష్టం చేస్తుంది. అలాగే పినాకిని నుండి కోకట గ్రామానికి ఒక కాలువ త్రవ్వించినట్లు కోకటం కైఫీయత్తు తెలియజేస్తుంది. అలాగే పెద్దన శివకేశవ భేదం పాటించని వాడని కూడా చెప్పవచ్చు.

పెద్దనకు రాయలకు ఉన్న అనుబంధం ప్రగాఢమనక తప్పదు. పేరులో 'పెద్ద' ఉండడం. ఆస్థాన కవులలో వయసులో పెద్దవాడు కావడం. గుణగణాదులలో వరిష్ఠులు కావడం ఒకరకమయితే 'ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి కేలూత యొసగి యెక్కించుకొనియె' అనడంలోని గౌరవం ఎంతో పెద్దది. కవిగండపెండేరం కాలికి తొడగడం మరో పెద్దతనానికి గుర్తు. కటకాది సీమ నాయకరం అప్పగించడం మరో ఎత్తు. మూరు రాయర గండనితో, ఆంధ్రభోజునితో కృతిరచనకు 'నిరుపహతి స్థలంబు రమణీ ప్రియ దూతిక దెచ్చి యిచ్చు కప్పుర విడెము' కావలెనని అడగడం పెద్దనకే చెల్లు.

ఒక పద్యమో, పాటో, లేదా కావ్యమో వెలువడడానికి తప్పక ఒక కారణముంటుంది. మను చరిత్ర రచనకు కూడా ఒక నేపథ్యముంది. ఒకప్పుడు రాయలు 'భువన విజయం' లో ఆసీనులై కవితాగోష్ఠి సాగిస్తూ

సప్త సంతానములలోఁ బ్రశస్తిఁ గాంచి
ఖిలము గాకుండునది ధాత్రిఁ గృతియ కాన
కృతి రచింపుము మాకు శిరీష కుసుమ

పేశల సుధామయోక్తులఁ బెద్దనార్య. అని ప్రార్థించినట్లు మనుచరిత్ర అవతారిక విశదం చేస్తుంది. పైగా ఏ కథ వ్రాయాలో కూడా ఆదేశించినట్లు 'హితుడవు' పద్యం స్పష్టం చేస్తుంది. అంతేగాక ఎలా చెప్పాలో కూడా కోరినట్లు తెలుస్తున్నది. మార్కండేయోక్త ప్రకారం చెప్పడం, చతుర రచన కనుకూలంబుగా చెప్పడం, ఆ మార్గాలలో రెండు విధానాలని విశ్లేషించవచ్చు.

పెద్దన రెండవరచన 'మనుచరిత్ర'. 'మనుచరిత్రం బందు కొనువేళ' అనే పద్యం బట్టి పెద్దన తన రచనకు 'మనుచరిత్ర' మని నామకరణం చేసినట్లు చెప్పవచ్చు. కాని రాయల మాటలలో 'స్వారోచిషమను సంభవము' అనే సమాసం బట్టి ఈ గ్రంథానికి స్వారోచిషమను సంభవము అని పేరున్నది. పెద్దన గద్యలలో ఈ పేరునే వాడెను. పెద్దన కృతిలో 'స్వారోచిష మను జన్మవృత్తాంతం' ఉంది గాని ఆ మనువు చరిత్ర లేదు. కాని వాడుకలో మాత్రం పెద్దన 'మనుచరిత్ర' అని ప్రచారం. ఆంధ్ర ప్రబంధాలలో 'మనుచరిత్ర' కున్న ప్రచారం మరే దానికి లేదు. ఇది ఆంధ్ర పంచమహాకావ్యాలలో ఒకటి.

## 2. సంస్కృతాంధ్ర మార్కండేయ పురాణాలలోని కథకు మను చరిత్ర కథకు ఉన్న భేదాలను, మార్పులను వ్రాయండి.

పురాణ వాఙ్మయంలో మార్కండేయ పురాణానిక ప్రత్యేక స్థానముంది. ఇతర పురాణాలలో కంటె ఈ పురాణంలో కథలు ఎక్కువ. అందుచేతనే ప్రబంధకవులు ఈ పురాణాన్ని అభినివేశంలో అధ్యయనం చేశారు. అల్లసాని పెద్దన మనుచరిత్రకు సంస్కృత ఆంధ్ర మార్కండేయ పురాణాలు ఆధారం. సంస్కృత మార్కండేయ పురాణంలో 58 వ అధ్యాయం నుండి 64 వ అధ్యాయం దాకా ఉన్న భాగంలో 264 శ్లోకాలలో మనుచరిత్ర కథ ప్రస్తావితం. మారన రచించిన తెలుగు మార్కండేయ పురాణంలో 4 వ ఆశ్వాసంలోని 213 వ పద్యం నుండి, 5 వ ఆశ్వాసంలోని 105 వ పద్యం దాకా మొత్తం 145 గద్య పద్యాలలో మను చరిత్ర కథ వర్ణితం.

ఆంధ్ర సాహిత్యంలో 'ప్రబంధవాఙ్మయం' ఒక విశిష్ట శాఖ. పురాణంలోని ఒక చిన్ని కథను తీసుకొని వర్ణనాదులతో పెంచి వ్రాయడం ప్రబంధ వాఙ్మయ స్వరూపం. ప్రబంధాలు వ్రాసే వేళ నాటక రచనలలో లాగే వస్తు, నాయక, రసపుష్టికి అనుచితమయిన వాటిని పరిహరించడమో లేదా మార్పులు చేయడమో సహజం. ఈ దృష్టితో పెద్దన చేసిన కల్పనలను, మార్పులను పరిశీలించుట సమంజసం.

పేర్ల మార్పులు : సంస్కృతంలో 'బ్రాహ్మణ ప్రవరుడని' మాత్రం ఉంది. ఆ బ్రాహ్మణుని పేరు లేదు. మారన 'ప్రవరాజ్యుడు' అన్నాడు. పెద్దన 'ప్రవరుడు' అని నామకరణం చేశాడు. గుణగణం చేత, రూపంచేత, ఇతర సౌశీల్యాదుల కారణంగా అతడు శ్రేష్ఠుడు, వరుడు, అంచేత ఈ పేరు సార్థకం. వరూధిని చెలికత్తెలలో 'విభావరి' ఒకతె కాగా పెద్దన 'విభావసి' గా మార్చాడు. అలాగే మూలంలో వరూధినిని వంచించినవాడు 'కలి' అని ప్రస్తావితం. కాని పెద్దన 'గంధర్వకుమారుడు' అని మాత్రం చెప్పి ఊరుకున్నాడు.

సన్నివేశ కల్పనలలో మార్పులు : సంస్కృత మార్కండేయ పురాణంలో సిద్దుడు తాను దర్శించిన క్షేత్రాలను వర్ణిస్తుంటే ప్రవరుడు ఆశ్చర్య చకితుడైనట్లు వర్ణితం. ఆంధ్ర పురాణంలో 'నమ్మనెద నీ పలుకులు' అని ప్రవరుడు అవిశ్వాసం ప్రకటించాడు. కాని అతిథిపై అవిశ్వాసముంచడం తగని పని. అందుచేత తెలుగు ప్రబంధంలో ప్రవరుడు తన వినయాన్ని ప్రకటించినట్లు పెద్దన చిత్రీకరించాడు.

మూలంలో సిద్దుడు ప్రవరునికి పాదలేపనం ఇచ్చినట్లుగా వర్ణితం. 'ఒక పసరిదియది' అని చెప్పకుండా సిద్దుడు ప్రవరుని పాదాలకు పూసినట్లు పెద్దన మార్పు చేశాడు. మూలంలో పాదలేపనం కరిగిపోయినా ప్రవరుడు అక్కడి వింతల్ని చూస్తూ కాలం గడిపినట్లు వర్ణితం. కాని పెద్దన ఈ భాగం వదలిపెట్టాడు.

వరూధిని ప్రవరుని కామించింది. మాటలు కలపడానికి ప్రయత్నించింది. కాని వ్యర్థం కావడంతో చివరకు ప్రవరుని కౌగిలించుకోవడానికి సిద్ధమయింది. మూలంలో ప్రవరుడు 'అంట కంటకు నన్ను మృగాక్షి' అన్నాడు. కాని పెద్దన ప్రవరుడు 'ఓర మోమిడి అంసద్వయం బంటి పొమ్మంచు' త్రోసినాడు.

మాయా ప్రవరుడు వరూధిని వంచించడానికి సిద్ధపడినాడు. లేని ప్రేమ ఒలకపోసినాడు. సంగమ సమయంలో కనులు మూయాలని షరతు పెట్టాడు. పైగా 'వాంఛితము తీర నను నీవు వదల ( జెల్ల దేను నిను సమ్మతిల ( జేసి యరుగుదనుక' అని ఆంక్షపెట్టాడు. ఈ రెండవ నియమం పెద్దన కల్పనమే. ఇది మాయాప్రవరుని ప్రవృత్తికి తగినదే.

మనోరమ తన చెలికత్తెలతో అరణ్యంలో విహరిస్తుంది. మునిని దర్శించింది. అతని 'వేషం' మనోరమకు నవ్వు పుట్టించింది. అందుకే ముని మనోరమను శపించినాడని మూలం. కాని శాపానికి ఈ చిన్న నేరం తగదని పెద్దన భావించినట్లుంది. బూచివోలె నున్న 'వాచంయముని మోమును' పట్టుకొన్నట్లుగా వర్ణించాడు. కోపం తీరక ముని నాగబెత్తంతో మనోరమను కొట్టినట్లుగా మార్చాడు. శాపంతో బాటు కొట్టడం చెలికత్తెలకు కోప కారణమయింది.

మూలంలో ముని ఒక చెలికత్తెను 'కుష్ఠువ్యాధి' పీడితురాలవు కమ్మని, మరొక చెలికత్తెను 'రాజయక్ష్మ వ్యాధి' కలగాలని శపించినట్లు వర్ణితం. నేరం ఒకటయినవేళ శిక్ష సమానం కావాలి. అంచేత పెద్దన 'రాజయక్ష్మ' వ్యాధి కలగాలని మాత్రం శపించినట్లు వ్రాశాడు.

ఆంధ్రదేశంలో 'మేనకరిపు సంబంధం' ఎక్కువ. అందుచేత పెద్దన 'స్వరోచి మనోరమల' సంబంధం సంప్రదాయమని పరోక్షంగా నిర్దేశించాడు. వరూధిని తమ్ముడు ఇందీవరాక్షుడని కల్పించాడు. ఇందీవరాక్షుని కూతురు 'మనోరమ' కావడం గుర్తించదగ్గ అంశం.

బ్రహ్మమిత్రుడు గురువు. ఇందీవరాక్షుడు రాజు. ఆయుర్వేద విద్య నేర్చుకోవాలన్న రాజును బ్రహ్మమిత్రుడు శిష్యుడుగా స్వీకరించలేదు. అయినా శాంబరి విద్యతో విద్యనేర్చాడు రాజు. విద్య నేర్చుకొన్న గర్వంతో రాజోచితమయిన అట్టహాసంతో గురువును చూచి నవ్వడం మొదలు పెట్టాడని మూలంలో వర్ణితం. కాని పెద్దన ఇందీవరాక్షుడు పరుషోక్తులతో నొప్పించినట్లు మార్చాడు. మాట మాటల వల్లనే పట్టుదల పెరిగింది. అంచేత విజయగర్వంతో పరుషోక్తులతో దూషించినట్లు వ్రాయడం సమంజసమే. అలాగే ఇందీవరాక్షునికి 'ఏడు రాత్రుల' శాపం పెట్టినట్లు మూలంలో ఉంది. పెద్దన ఈ అవధికి ప్రాధాన్యం ఇవ్వలేదు.

స్వరోచి మనోరమను వివాహమాడినాడు. ప్రథమ సమాగమ ముహూర్తం నిశ్చయమయింది. మనోరమ విశాల హృదయ కావడం వల్ల తన చెలికత్తెల వ్యాధుల గురించి చెప్పింది. స్వరోచి తనకున్న ఆయుర్వేద పరిజ్ఞానంతో ఆ వ్యాధుల్ని నయం చేశాడు. వారిని వివాహమాడినాడు. మూలంలో వివాహోత్పూర్వమే మనోరమ తన చెలికత్తెల వ్యాధుల్ని చెప్పినట్లు వర్ణితం.

స్వరోచి ముగ్గురి భార్యలతో విహరిస్తున్నప్పుడు హంస మిధున సంభాషణ విన్నాడు. విరక్తుడయ్యాడు. దేవేరులతో అడవులకు వెళ్ళాడని మూలం. కాని పెద్దన ఈ అంశం వదలిపెట్టాడు.

మనువు 'విష్ణువు' ఉద్దేశించి తపస్సు చేశాడు. విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. మనువుకు మనుత్వం ఇచ్చాడు. ఆ సందర్భంలో పెద్దన 'దశావతారాలను' వర్ణించాడు. ఈ వర్ణనలకు ప్రధాన కారణం పెద్దన 'విష్ణు భక్తి'.

రాయలు పెద్దనను ' మార్కండేయోక్త ప్రకారంగా' మనుచరిత్రను తెనిగించమన్నాడు. పెద్దన ప్రబంధోచితంగా తెనిగించాడు. ప్రబంధ లక్షణాలయిన వర్ణనలకు ప్రాధాన్యమిచ్చాడు. హిమవద్వర్ణన, సంధ్య అంధకార చంద్ర చంద్రికా వర్ణన, చంద్ర మన్మథమలయ మారుత ఉపాలంభం, పుష్పాపచయం, సంభోగవర్ణన, మృగయావర్ణన, యుద్ధవర్ణన, మందరాపర్వత వర్ణన, పౌరకాంతావర్ణన, వివాహవర్ణన దశావతార వర్ణనలు అదనంగా చేరాయి.

మనుచరిత్ర 'అనువాద' గ్రంథమయినా స్వతంత్ర గ్రంథంగా పరిగణించడానికి ప్రధానం కారణం పెద్దన కవితా చమత్కారమే.

## 3. అల్లసాని పెద్దన 'మను చరిత్ర' వైశిష్ట్యం విశదీకరించండి.

ఆంధ్రవాఙ్మయంలో భారత భాగవతాదుల తరువాత బహుళ ప్రచారములో ఉన్న గ్రంథం మనుచరిత్ర, ఆంధ్ర సారస్వతంలోని పంచమహాకావ్యాలలో 'మనుచరిత్రం' ఒకటి. అష్టదిగ్గజ కవులలో మొదటివాడయిన అల్లసాని పెద్దన రచన 'మను చరిత్ర'. రాయల కోరిక మేరకు పెద్దన 'మార్కండేయపురాణంలోని' చిన్న కథను తీసుకొని వర్ణనాదులతో పెంచి వ్రాసిన ప్రబంధం మనుచరిత్ర. 'ఆంధ్రకవితాపితామహ' బిరుదానికి అన్వర్థమైన రచన ఇదే.

మూలములోని ఒక కథను తీసుకొని అకా చిత్యం పరిహరిస్తూ, ఔచిత్యం పోషిస్తూ వస్తు నాయక రసాది అంశాల పట్ల జాగరూకత వహించి రచన చేసే సంప్రదాయం 'మనుచరిత్ర' నుండి కవులకు మార్గదర్శకమయింది. 'ప్రవర' నామకరణం. ఒక పసరిదియది అని చెప్పకుండా సిద్ధుడు ప్రవరుని పాదాలకు పసరుపూయడం, వరూధిని కావలించుకొన్నవేళ ప్రవరుడు త్రోయడం, వరూధినీ ఇందీవరాక్షులకు చుట్టరికం తెలపడం, ఇక ప్రబంధోచిత వర్ణనలన్నీ మను చరిత్ర వైశిష్ట్యానికి హేతువులు.

వస్త్వైక్యం : మను చరిత్రలో ఏకనాయక కథలేదు. ఈ చరిత్రలో వరూధినే మాయాప్రవర వృత్తాంతం. స్వరోచి వృత్తాంతం, మనోరమవృత్తాంతం, ఇందీవరాక్షవృత్తాతం, విభావసీకళావతుల వృత్తాంతం, మృగీస్వరోచుల వృత్తాంతం, మనుసంభవ వృత్తాంతమనే ఎనిమిది ప్రధాన భాగాలున్నాయి. మనువు కావడానికి తగిన లక్షణాలు తొలి వృత్తాంతంలోగాని రెండవ వృత్తాంతంలోగాని లేవు. ప్రవర గుణశీలములు వరూధినీ గర్భమున అంతర్నిగూఢమయినా ఫలించడం వనదేవతాస్వరోచుల సాంగత్యంలోనే. అందుచేత వస్త్వైక్యమున్నది. వస్తువిస్తృతి తప్పనిసరి అయినది.

వర్ణనలు : ప్రబంధాలలో వర్ణనలకు అత్యంత ప్రాధాన్యమున్నది. మూలములో 150 పద్యాలతో వ్రాయబడిన కథను ఎనిమిది వందల పద్య ప్రబంధంగా తీర్చడానికి 'వర్ణనలే' కారణం. వీటిలో హిమాలయ వర్ణన, అంధకార వర్ణన, చంద్ర చంద్రికా వర్ణన, పుష్పాచయ వర్ణన, చంద్ర మన్మధ ఉపాలంభనం, వేట వర్ణనం, యుద్ధ వర్ణనం, వివాహ వర్ణనం, వసంత వర్ణనం, దశావతార వర్ణనలు ప్రధానములు. మచ్చుకు - ఎలుగు బంట్లు తమగోళ్ళతో తేనెపట్టులను చీలుస్తుంటే తేనెటీగలు ఎగురుతుంటే, ఎండ పొడలు తెల్లగా, ఈగల నీడలు నల్లగా ఉండడం వల్ల నేలంతా నువ్వులు బియ్యం కలిపి జల్లినట్టుగా ఉంది. సిగ్గువిడిచి పెట్టి పార్వతి శివుని కోసం తపం చేయడం, ముక్కంటి చిచ్చుకు మన్మథుడు బూడిద కావడం. రెల్లు గడ్డి కుమార స్వామిని కన్నచోటులను ప్రవరుడు దర్శించి నాడని చెప్పడంతో జరుగబోయే వరూధిని మోహం. ప్రవర తిరస్కారం, వరూధిని గర్భం మొదలయినవి సూచితం. అలాగే చంద్రుడు రక్తుడై తరువాత నిర్మలుడయ్యాడని చెప్పడంలో ప్రవరుని సద్వర్తన వికృతి రాహిత్యం సూచితాలు.

రసవిషయం : ప్రబంధాలలో శృంగారానికే ప్రాధాన్యం. మను చరిత్రలో శృంగార ఆభాస, వీరరౌద్ర అద్భుత రసములతో బాటు శాంతమునకే అగ్రతాంబూలం. ప్రవరుడు వరూధినిని కామించలేదు. మాయా ప్రవరుని శృంగారము కూడా ఏక నిష్ఠం కావడం వల్ల శృంగార ఆభాస స్వరోచి యుద్ధంలో వీరరౌద్రరసములు, ఇందీవరాక్షుడు గంధర్వుడైన సన్నివేశం, లేడి వనదేవతగా మారిన సన్నివేశంలోను అద్భుతం కనిపిస్తుంది. స్వారోచిషమను సంభవ వృత్తాంతంలో శాంతరసానికి ప్రాధాన్యం. తుచ్ఛసుఖాల కంటె శాశ్వత సుఖం వైపు మొగ్గడం శాంతరస సోపానం.

పాత్ర చిత్రణ : మనుచరిత్ర వైశిష్ట్యానికి 'పాత్రపోషణ' ఒక కారణం. ప్రవరచిత్రణలో పెద్దన అడుగడుగున వ్యక్తిత్వం నిరూపించాడు. ప్రవరుడు ఎంత సౌందర్యవంతుడో అంత జితేంద్రియుడు. ఆడు తుమ్మెదలకు సంపెంగ సువాసనవలె ప్రవరుడున్నాడని వర్ణన. ఆదర్శ గృహస్థు చిత్రణకు లక్ష్యంగా పెద్దన ప్రవరుని తీర్చిదిద్దాడు. అతని కర్మపరాయణత్వం, అతిథి సేవాసక్తి, పితృభక్తి, శిష్యానురక్తి మొదలయిన గుణాలను చక్కగా చిత్రీకరించాడు. ప్రవరునిలో జితేంద్రియ లక్షణాలను సన్నివేశాల ద్వారా స్పష్టం చేశాడు. 'కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్' అనడం ప్రవరునికి పెద్దన ఇచ్చిన తీర్పు.

విజయనగర చక్రవర్తుల కాలంలో వెలువడ్డ ప్రబంధనాయికలలో 'వరూధిని' చిత్రణ అత్యద్భుతం - ఇతరులను మోహింపజేసే దేవకాంత భూదేవత సౌందర్యానికి ముగ్ధురాలై మోహంతో ప్రవర్తించడం సన్నివేశాలలోనే ఒక నూతన ప్రక్రియ. రూపానికి, మాటలకు, చివరకు ప్రలోభాలకు లొంగని ప్రవరుని లోగొనడానికి చేసిన ప్రయత్నంలో 'మోహపిశాచి' గా కనిపిస్తుంది. మాయాప్రవర చిత్రణలో నాగరక జనవంచనను పెద్దన 'నాజూకుగా' వర్ణించాడు. అలాగే స్వరోచి ఇందీవరాక్ష చిత్రణలో ఆర్తత్రాణపరాయణత విద్యానురక్తిని ప్రస్ఫుటం చేశాడు. మనోరమకున్న 'సఖ్యనురాగం' సహజంగా వర్ణించాడు. తపసు కారణంగా మనువు తన పాపాన్ని క్షాళితం చేసుకోవడాన్ని వర్ణించి పాత్ర చిత్రణలో కొత్త పంథా ప్రదర్శించాడు పెద్దన.

సమకాలీన అంశాలు : సమకాలీన అంశాల ప్రస్తావనలో పెద్దన కృతకృత్యుడయ్యాడనడం సమంజసం. ఇందీవరాక్షుని నగర వర్ణనలో విజయనగర వర్ణన, స్వరోచి వేట వర్ణనలో రాయల మృగయావిహారం నటవిట గాయక ప్రసంగంలో ఆనాటి వారి జీవన విధానం, వరూధిని మాటలలో 'సుఖాభిలాష' ఒక్కటే పరమార్థంగా భావించే ప్రజానీకం ఒకవైపు ధార్మికప్రవృత్తికి కట్టుబడేవారి వర్గాన్ని పెద్దన వర్ణించాడు. పైపెచ్చు గృహస్థాశ్రమం ప్రత్యేకతను స్పష్టం చేశాడు. తెలుగునాట ఉన్న 'మేనరికం' వ్యవస్థను మనోరమ స్వరోచుల వృత్తాంతంలో సమన్వయించాడు.

పద్యరచనా శిల్పం : మను చరిత్ర ప్రశస్తికి పద్యరచనాశిల్పం కూడా ప్రధాన కారణం. శిరీష కుసుమపేశల సుధామయోక్తులతో కావ్య రచన సాగించడం పెద్దన ప్రత్యేకత. అచలద్వస్తు వర్ణనల కంటె చలద్వస్తు వర్ణనలకు ప్రాధాన్యం ఇవ్వడం మనుచరిత్రలో పలుచోట్ల కనిపిస్తుంది. మాయాప్రవరుని చూడగానే వరూధినిలో కలిగిన భావాలను పెద్దన 'తొలు దొల్త వాని ( గన్నుల ( గాంచినప్పుడ' పద్యంలో వర్ణించాడు. మాయా ప్రవరుని చూడగా గుండె జల్లుమంది. అడుగులు వేయగనె కాళ్ళ తొట్రుపాటు కలిగింది. దగ్గరికి వెళ్ళేవేళ ధైన్యం పొడసూపింది. ఏదో విధంగా ధైర్యం కూడదీసుకొని నిలబడితే కనురెప్పలు కదలసాగాయి. ఏదో చెప్పబోయేసరికి కంఠం బొంగురు పోయింది. మళ్ళీ ఎక్కడికయినా వెళతాడేమో అని వస్త్రపు కొంగు పట్టుకోగానే శరీరమంతా చెమటలు పట్టాయి. మానసిక వికారాలను శృంగార భావాలుగా మలచడం ఈ పద్యం ప్రత్యేకత. అలాగే 'వల్లీమతల్లిలావణ్య సర్వస్వంబు' అనే పద్యంలో వనదేవత వనితగా మారడం వర్ణితం.

ఆలంకారిక శైలి : ఆలంకారిక రచన కవుల వైదుష్యానికి ప్రతీక. భట్టుమూర్తి ఈ కళలో ఆరితేరిన కవి. అతడు పెద్దన శిష్యుడు. పెద్దన ఆలంకారిక శైలికి కావ్యాదిలోని, 'అంకము (జేరి శైల తన యాస్తన దుగ్ధములానువేళ పద్యం, హిమవత్పర్వతాన్ని ప్రవరుడు దర్శించిన వేళ వర్ణితమయిన 'అటజనికాంచె' పద్యం ఉదాహరణాలుగా చెప్పవచ్చు. శాబ్దిక సౌందర్యానికి -

'ప్రకట భల్లుక నచి భల్ల భయద మథన

శిథిల మధుకోశ విసర విశీర్ణ మక్షి

కాంతరాంతర దంతురితా తపమునఁ

బుడమి తలకండుల న్యాయమున వెలుంగ'

వృత్తరచనా వైవిధ్యానికి, 'పలాశి దాసి రాజుఁ జూచి పల్కెనోరినోరి' పద్యం సాక్ష్యం.

ప్రబంధాలలో 'మనుచరిత్ర' తలమానికమని సారాంశం.

**సారాంశం :**

మనుచరిత్రలోని ప్రబంధ లక్షణాలను, పాత్ర పోషణను, రచనా శైలిని, భాషా విశేషాలను సమగ్రంగా చర్చించి మనుచరిత్ర ప్రబంధ వైశిష్ట్యాన్ని ఈ పాఠంలో విశదీకరించడం జరిగింది.

## ప్రశ్నలు :

1. మనుచరిత్ర ప్రబంధ కథను వివరించండి.
2. పెద్దన కవితా ప్రతిభను నిరూపించండి.
3. ప్రవరుని ప్రవృత్తిని తెలియజేయండి.
4. పెద్దన మనుచరిత్రలో కావించిన పాత్ర పోషణను వివరించండి.

రచయిత :
**ఆచార్య కె. సర్వోత్తమరావు**
విశ్రాంతాంధ్రాచార్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి.

ఖండం : 4

# నాటకము

## పాఠం : 1 వర విక్రయము (నాటకము)

- కాళ్ళకూరి నారాయణరావు

**శీర్షికలు :**

1. కవి పరిచయం
2. నాటక ప్రయోజనం

**లక్ష్యం :**

నాటకకర్త జీవిత విశేషాలను, రచనా పరంపరను తెలియజేయడమేగాక, ఆనాటి సామాజిక నేపథ్యం ఆధారంగా వరకట్న సమస్యను ప్రతిబింబించే ఈ నాటక ప్రయోజనాన్ని ఎన్నో రకాలుగా విశదం చేసిన వైనాన్ని పరికించుదాం.

### కవి పరిచయం - నాటక ప్రయోజనం

**1. 0 : కాళ్ళకూరి :** వర విక్రయం నాటకకర్త కాళ్ళకూరి నారాయణరావు. ఆయన తల్లిదండ్రులు అన్నపూర్ణమ్మ, బంగారు రాజు. 28-4-1871 లో పశ్చిమ గోదావరి జిల్లాలోని మత్స్యపురిలో జన్మించారు. ఆయన తొలి గురువు తండ్రి. తండ్రి దగ్గరే రామాయణ భారతాల్ని చదువుకున్నారు. కావ్య నాటకాలంకారాలు పాడి వెంకటనారాయణ దగ్గర నేర్చుకున్నారు. అది స్వాతంత్ర్య సమరం ఊపందుకుంటున్న కాలం. బ్రహ్మసమాజపు భావాలు యువతమీద ప్రభావం చూపుతున్న రోజులు. ఆ ప్రభావానికి కాళ్ళకూరి నారాయణరావు కూడా లోనయ్యారు. ఆయన కళావంతుల కుటుంబానికి చెందిన చంద్రముఖి చంద్రమ్మను పెళ్ళాడారు. 1890 లో ఈ వివాహం జరిగి ఉండవచ్చని పరిశోధకుల భావన. నారాయణరావుకు అన్ని విధాలా తోడుగా ఉన్న మహోన్నత వ్యక్తి బుద్ధిరాజు వీరభద్రరావు. కాళ్ళకూరి నారాయణరావు తమ కృతుల్ని వీరభద్రరావుకు అంకితం చేశారు.

**1. 1. రచనలు :** చిత్రాభ్యుదయం, పద్మవ్యూహం, చింతామణి, మధుసేవ, సంసార నటన, వరవిక్రయం - మొదలైన నాటకాలు; లుబ్ధాగ్రేసర చక్రవర్తి, ధూమశకట ప్రహసనం - అనే ప్రహసనాలు; ప్రతాపరుద్రమదేవి అనే నవల; లక్కికిలక్కి, పెద్దలనాటి ముద్దు కథలు, మూర్ఖ సేవకుడు ముప్పు - వంటి కథలు; సదండ విదండ వివాదం, మారుతము - వంటి విమర్శలు; అనేక వ్యాసాలు, చరిత్ర గ్రంథాలు, గ్రంథ విమర్శలు, కవితలు - అంటూ నారాయణరావు చేపట్టని ప్రక్రియ లేదని చెప్పవచ్చు. ఆయన మేధస్సుకు ఆయన రచనలే తార్కాణం. కవిరాజు, గ్రంథపఠన రచన చతురాస్య, మహాకవి అనే బిరుదుల్ని ఆయనకు వివిధ సంస్థలు, పీఠాధిపతులు ఇచ్చారు. ఆయన తన రచనలనే ఖడ్గంతో సమాజంలోని దురాచారాల్ని, సమస్యల్ని చీల్చి చెండాడేవారు. ఆయనలోని సంఘసంస్కరణాభిలాష ఆయన రచనల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది.

**1. 2. ఇతర వ్యాసకాలు :** నారాయణరావు రచనలు చేయటంలోనే కాదు మరెన్నో శాస్త్ర విద్యల్లో కూడా నిష్ణాతులు. యోగవిద్య, చిట్కా వైద్యం, హస్త సాముద్రికం, మంత్రశాస్త్రం, నాట్యశాస్త్రం మొదలైన వాటిల్లోనే కాకుండా, ఆధునిక కళల్లో ఫోటోగ్రఫీలో కూడా నైపుణ్యం సంపాదించారు. ఆయన హరికథలు కూడా చెప్పేవారు. కొందరు ఆదిభట్ల నారాయణదాసుకు పోటీగా హరికథ చెప్పగలిగే వారని అనేవారట.

**1. 3. వృత్తి :** కాళ్ళకూరి నారాయణరావు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి కొన్నాళ్ళు పనిచేశారు. ఆయనకు న్యాయశాస్త్రంలో కూడా పరిచయం ఉంది. ఆ కాలంలో ఎందరో ఆయన దగ్గరకు న్యాయశాస్త్రంలో సలహాల కోసం వచ్చేవారట.

1. 4. ప్రవృత్తి : ఆ రోజుల్లో తిరుపతి కవులకూ, కొప్పరపు కవులకూ మధ్య విద్యా స్పర్ధలుండేవి. నారాయణరావు కొప్పరపు కవుల అభిమాని. అందువల్ల వీరికీ తిరుపతి కవులకూ పడేదికాదు. ఆయన రచనలు చేయటమే కాదు నాటకాల్లో నటించేవారు కూడా ! ప్రకాశం పంతులు దమయంతి పాత్ర ధరిస్తే ఆయన నలుడిగా, బాహుకుడిగా నటించేవారు. వారికి వీణా వాదనలో కూడా అభినివేశం ఉండేది.

1. 5. వర విక్రయం : వారి రచనలన్నింటిలోకీ ప్రసిద్ధి పొందినది వర విక్రయ నాటకమే ! గురజాడవారి కన్యాశుల్కం సామాజిక శ్రేయస్సును కాంక్షించిన రచనా, కన్యాశుల్క దురాచారానికి ఖండనగా ఎంత ప్రసిద్ధి పొందినదో, వర విక్రయానికి నారాయణరావు రచన అంత ప్రాముఖ్యాన్ని గడించింది. కొప్పరపు కవులు ఈ నాటకం గురించి కీర్తించిన పద్యాలు నారాయణరావు కీర్తికి పట్టిన మణి హారతులనవచ్చు.

శా.॥ కన్యా విక్రయమెట్ల భావుకలోక త్యాజ్యమారీతినే
హైన్యంబౌ వరవిక్రయంబును బ్రపం చానర్థకం బౌటచేఁ
గన్యల గాంచిన యట్టి వారును వరుంగన్నట్టి వారున్ సదా
ధన్యంబౌ గురుమంత్ర నాయకముగా ధ్యానింతురే సత్కృతిన్

చ.॥ లలిత శిరీష పుష్ప మృదులంబు రసాల రసైక మాధురీ
విలసిత ముత్తమోత్తమము విస్ఫుట నూతన భావవైభవో
జ్జ్వలము జనానుకూలము భవత్కృతిరత్నము భవ్యసాంఘికో
క్తుల వెలసెన్ యశోరమలతోఁగృతి భర్తకృతార్థతం గనన్

వర విక్రయ నాటకంలోని ప్రతి అక్షరం కృతికర్త సామాజిక సమస్యల్ని చీల్చి చెండాడటానికి వాడినవి కత్తులనటంలో సందేహం అనవసరం. సమాజంలోని దురాచారాల్ని తన కవితతో ఖండించి అక్షరాల్ని అక్షరాలుగా చేసిన ఘనత నాటకకర్తకు దక్కింది.

## 1. 2 : నాటక ప్రయోజనం :

రచయిత ఎవరైనా సరే సమకాలీన జీవితాన్ని, సాంఘీకాచారాల్ని తమ రచనల్లో ప్రతిఫలింపచేయకుండా ఉండలేరు. ఎటువంటి రచన అయినాసరే, పౌరాణిక, చారిత్రకాల్లో కూడా ఇది అసాధ్యం. రామాయణాది కావ్యాలే తెలుగులో అవాల్మీకాలకు తావు ఇచ్చాయంటే ఇక మిగిలిన కథల గురించి చెప్పనక్కర్లేదు. అందులోనూ కథ సాంఘిక ఇతివృత్తమైతే అందులో సమకాలీన జీవనమేకాదు, సంఘంలోని మంచి చెడ్డలన్నీ కూడా చోటు చేసుకుంటాయి. కవి ప్రతి విషయానికి సాధారణ మానవుడికన్నా అధికంగా స్పందిస్తాడు. ఆ స్పందన వల్ల అతనిలో చెలరేగే భావాలన్నీ అతని రచనల్లో ప్రతిబింబిస్తాయి. సాధారణంగా కవి మనస్సు సగటు వ్యక్తి మనస్సు కన్నా ఎక్కువ సంచలనం పొందుతుంది. మంచిచెడు కాని, ఎగుడుదిగుళ్ళు కాని, సుఖదుఃఖాలు కాని, ఆనందం, విషాదం, ఆశ్చర్యం ఏదైనా కాని కవి స్పందన ఎన్నోరెట్లు ఎక్కువగా ఉంటుంది. ఆ భావాల ప్రభావం అతని రచనలమీద పడుతుంది. అందుకే కవుల రచనల్లో మంచికీ చెడుకీ ఎల్లవేళల ఘర్షణే ! అయితే ప్రతివ్యక్తి కోరుకునేలాగే కవి కూడా మంచి గెలవాలని న్యాయధర్మాలు వర్ధిల్లాలని కోరుకుంటాడు. ఆ కోరిక రచనల్లో కూడా కన్పిస్తుంది. అందువల్ల ఏ రచనల్లోనైనా ధర్మానిదే తుది జయం !

'వర విక్రయం' కాళ్ళకూరి నారాయణరావు చేత రాయబడటానికి గల పరిస్థితుల్ని గురించి తెలుసుకుంటే, అది ఏ ప్రయోజనాన్ని ఆశించి రాయబడిందో తెలుస్తుంది. భారతదేశం అన్యాక్రాంతమయి బాధచెందుతున్న ఆందోళన అణిగి, అప్పుడే స్వజాతీయుల పాలనలోకి వచ్చింది. అంటే స్వరాజ్యం వచ్చిన దాదాపు రెండు దశాబ్దాల అనంతరకాలం నాటి నాటకం ఇది. 1966 లో వెలువడింది. భారతదేశంలో ఎన్నో కొత్త చట్టాలు ఏర్పడుతున్న కాలమది. ఎన్నో చట్టాల్లో మార్పు వస్తోంది. శిక్షాస్మృతి తయారువుతోంది. అటువంటి నేపథ్యంలో రాయబడ్డదీ నాటకం. రచయిత తన నాటకాన్ని అప్పట్లో సమాజాన్ని పీడిస్తున్న ఒక సమస్యను ఆధారంగా చేసుకొని వ్రాశారు. అందులో ఆయన ఎన్నో పాత్రల్ని ఆనాటి సామాజిక నేపథ్యం ఆధారంగా నెలకొల్పవలసి వచ్చింది.

ఈ నాటకం ప్రధానంగా వరకట్న సమస్యపై చిత్రింపబడింది. ఈ నాటకంలో ఆ సమస్య మాత్రమేకాకుండా, అప్పట్లో కొత్తగా ప్రారంభం అయిన పంచాయితీలు, బళ్ళు ఇత్యాదుల గురించి ఉంది. సహాయ నిరాకరణోద్యమం జరిగినా, ఎన్ని మార్పులు రావాలో అన్నీ రాని సమాజం గురించి, అన్నిటి కన్నా ముఖ్యంగా కుహనా సంస్కార వాదుల గురించి కూడా ప్రస్తావన చేశారు. రచయిత, ఆనాటి సంఘంలోని అవకతవకల్ని అద్దం పట్టి చూపించారు.

నాటకం పెళ్ళిళ్ళ వేటతో ప్రారంభమవుతుంది. కాళింది, కమలల తండ్రి అయిన పురుషోత్తమరావు పెళ్ళికొడుకును వెతకడానికి వెళతాడు. ఆయన ఎంతో శ్రమపడి ఎందరినో కలిసినా ఆయన కూతుళ్ళకు తగిన వరుడు లభించలేదు. ఆ వరుడికోసం వెతుకులాడే వేటలో ఆయన చూసిన వాళ్ళు ఎలా ఉన్నారని భార్య భ్రమరాంబతో చెప్పే సంఘటన ఆనాటి సమాజానికి చక్కని దర్పణం పట్టింది.

**1. 2. 1 వరకట్న సమస్య :** ఆ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళికెదిగి ఇంట్లో ఉంటే, పెళ్ళిచేయలేదే, ఇంకా జరగలేదే అనే చింత ఒక్కటేకాదు, ఆ పెళ్ళి జరగని కన్య తల్లి తండ్రులకు ఎవరేమంటారో అనే చింత పెద్దది. అందువల్ల ఎన్నికష్టాలైనా సరే పడి పెళ్ళిచేయాలి. ఆ చింతతోనే పురుషోత్తమరావు అన్ని ప్రయత్నాలు చేస్తాడు. తమ ఆశయాలు, ఆశలు అన్ని ఈ సమస్యకు బలి ఇవ్వాలి. ఈ నాటకమంతా వరకట్న పిశాచి కోరల్లో ఆహుతయిపోతున్న కన్యల జీవితాలకొక ఉదాహరణ.

వరకట్నం అనే ఆచారం ఎక్కడ పుట్టి ఎలా పెరిగిందని రచయిత చేసిన ఊహ మనోజ్ఞమైనది. పేరయ్యచేత ఇలా పలికిస్తాడు.

తే॥ "బ్రాహ్మణుల యింటఁదొలుదొల్త ప్రభవమొంది
కోమటింటను ముద్దులు గొనుచుఁబెరిగి
కమ్మవారింట పెళ్ళున గాపురంబు
సేయు చున్నది కట్నంపు జేడెనేడు"

ముద్దుగా పుట్టి పెరిగి కాపురానికి వచ్చే ఆడదానిలాగ కట్నం కూడా అయిపోయింది. ఆ రకంగా సమాజంలో ప్రభవించిన ఒక ఆచారం దురాచారమై ఎందరో తల్లితండ్రుల దుఃఖానికీ, కన్యల కన్నీటికీ, చివరికి మరణానికి కూడా కారణమయ్యింది.

కట్నం ఇవ్వాలంటే అందరి దగ్గరా డబ్బు ఉండదు. ఆ కట్నం కోసం పడరాని పాట్లు పడాలి. ఎలాగైనా సరే తల తాకట్టుపెట్టి అయినా డబ్బు సంపాదించి తీరాలి. అమ్మడానికి ఏదున్నా సరే !

"కట్ట గృహంబు లమ్మకొని కట్నమునీయక పెండ్లికాని యీకట్టడి వక్రకాలము" అని కాళింది అన్నమాటలు అక్షర సత్యాలు. కట్నమివ్వకుండా ఉంటే పెళ్ళి చేసుకునేవాడు మాటికీ, కోటికీ కూడా దొరకరుకదా ! "లక్షయేళ్ళు తపస్సు చేసినా లభించదు. ఎవరైనా తేగలిగితే... కుదుళ్ళలోకి తెగ్గోయించుకు పోతాను" అంటూ పేరయ్య శపథం చేస్తాడు. అంటే ఆనాటి పరిస్థితుల్లో వరకట్నం ఎంత ప్రాముఖ్యం వహించిందో, వరకట్నం లేని వివాహాలు కలలో తప్ప ఇలలో లేవు అని తెలుస్తోంది.

అప్పుడప్పుడే వెలలు నిర్ణయించటం కూడా జరుగుతోంది. "స్కూలు పయినలు వానికి రెండువేలు - ఇంటరు వానికి మూడు - బియ్యే వానికి నాలుగు ! ఆస్తియేమయిన నున్నచో వంతకు రెట్టింపు" అంటూ పురుషోత్తమరావు భార్యకు ఆనాటి వ్యాపారరీతిని బోధిస్తాడు. "వెలగలేటివారు వెయ్యినూటపదహార్లు, రేటూరి వారు రెండు వేలు, ముంజులూరి వారు మూడు వేలు, వందిరాజు వారు నాలుగు వేలు, అయ్యంకివారు అయిదు వేలు, చింతలూరి చిన్నవాడు తూగినన్ని" అంటూ పేరయ్య పెళ్ళిళ్ళకు నిర్ణయింపబడిన వరకట్నాన్ని ఏకరవు పెడతాడు.

పై రెండు సందర్భాల్ని పరిశీలిస్తే కట్నమనే మాట, ఆ ఆచారం వృద్ధి పొందినంతంగా మరేదీ పొందలేదేమోననిపిస్తుంది. వరకట్నం అనే సరదా కాస్తా ఆచారంగా పరివర్తన చెంది, అది ఎందరి గొంతులకో ఉరితాడై పరిణమించింది. సంతలో వస్తువులకు వెలలు నిర్ణయించినట్లు, పెళ్ళికొడుకులకు వెలలు నిర్ణయించే నీచస్థితి ప్రబలిపోయింది. సమాజంలో వరకట్నం అనేది ఒక హోదా క్రింద పరువు ప్రతిష్ఠలకు ఆధారంగాను భావింపబడేది అన్న నిజాన్ని ఈ నాటకం చాటి చెప్తోంది.

వరకట్నం ఒక దురాచారంగా సమాజంలో రోజురోజుకీ బలం పుంజుకుంటుంటే దొంగతనంగా బేరం పేరుతో ఆ దురాచారాన్ని పెంచిపోషించే వాళ్ళు కొందరు. తమ కొడులకు సంతలో పశువుల్లాగా, అంగట్లో బట్టల్లాగా బేరం మాట్లాడ్డానికి వెనుకాడటంలేదు. పెళ్ళిళ్ళ పేరయ్య, వివాహాల వీరయ్యల కుతంత్రంతో బసవరాజు కట్నం రూ. 5000/- వేల దాకా పెరగటం దీనికి ఉదాహరణ. అంతేకాదు కట్నం పుచ్చుకోవడానికి ముందు బజానాగా ఏదో కొంత ధనం ఇవ్వటం వంటివి - ఈ వరకట్న దురాచారం ఎంత ప్రాబల్యం పొంది సమాజాన్ని ఎంత అధోగతికి ఈడ్చుకుని వెళ్తోందో తెలియపరచడానికి రచయిత సృష్టించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

పురుషోత్తమరావు కాళింది పెళ్ళికోసం తన పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని అమ్మేస్తాడు. కట్నం అంటే అయిష్టం వ్యక్తపరిచే కాళింది వరకట్నాన్ని నిరసిస్తుంది. ఆనాటి సామాజిక వ్యవహారాన్ని మనస్సులో పెట్టుకుని

"ఆ॥ పిండి బొమ్మయైన (బిల్ల విచ్చెదమన(
గానె చేయిచాచు (గట్నమునకు" అని భ్రమరాంబ చేత పలికిస్తాడు రచయిత.

"తే॥ కట్న మర్పించి వరునిచే ( గంఠమునకు(
బుస్తె కట్టించుకొని తృప్తిబొందుకంటె" ఆత్మహత్య మేలని కాళింది చేత రచయిత చెప్పిస్తాడు. వరకట్నం అనే దురాచారం ఎన్ని రకాల ఆడవాళ్ళ జీవితాల్ని హరించకపోతే ఒక స్త్రీ ఆత్మహత్య మేలనే ఉద్దేశాన్ని వెలిబుచ్చుతుంది.

వరకట్నం అనేది దురాచారమనీ, ఆ దురాచారం సమాజంలో వేళ్ళూని సంఘాన్ని ఎంతో పాడు చేస్తోందనీ రచయిత ఈ నాటకంలో ఎన్నో పాత్రలద్వారా హెచ్చరించారు. వరకట్నం ఇచ్చి వివాహం చేసుకునే ఇష్టంలేక కాళింది ప్రాణత్యాగం చేసింది. ఆమె తండ్రి తన ఆదర్శాల్ని కాలరాచి తన బిడ్డ పెళ్ళికోసం ఆరాటపడ్డాడు. కానీ, వాళ్ళద్దరికన్నా ఆ వరకట్నానికి బదులు భర్తనే తన స్వంతం చేసుకున్న కమల తెలివైనది. 'వరకట్నం దురాచారం' అంటూ వీధులవెంట అరచినా, సభలు పెట్టినా, ఉపన్యాసాలిచ్చినా కలగని ఫలితం ఇటువంటి నాటకాలవల్ల కలుగుతుంది. కమల తన కసి తీర్చుకున్న విధానం ఎందరో యువతుల్ని ఆకట్టుకుంది. ఆ రకంగా ఈ నాటకం వంటివి సాంఘిక పరివర్తన కోసం రాయబడ్డవనవచ్చు. వరకట్న సమస్యను చిత్రించి దానికి స్త్రీలు బలి అయినట్టు ఎన్నో ప్రక్రియల్లో ఎన్నో రచనలు వెలుఇడ్డాయి. ఈ వర విక్రయం మాత్రం ఒక క్రొత్తపంథాలో సాగి ఆ సమస్యకు ఒక కొత్త తీర్పును కూడా సూచించింది.

వరకట్నం వల్ల నష్టపోయిన కొన్ని పాత్రల్ని ప్రవేశపెట్టి, ఆ పాత్రల కష్టనష్టాల్ని వాళ్ళచేత చెప్పించి, ఈ వరకట్నం అనే దురాచారాన్ని రూపుమాపడానికి కమల తీసుకున్న చర్య చక్కని గుణపాఠాన్ని చెప్పిందని రచయిత సూచిస్తాడు. వరకట్నం వల్ల నష్టపోయిన వ్యక్తులుగా ఈ నాటకంలో - ఒక అమ్మ, ఒక సెట్టి, ఒక బ్రాహ్మణుడు, అంటూ పేర్లులేని పాత్రలు ప్రవేశపెట్టబడ్డాయి. అందుకు ముఖ్యకారణం ఆ పాత్రలు పడ్డ కష్టాలు ఆ పాత్రలవి కావు. అటువంటి పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న అందరివీ. ఆ విధంగా ఆలోచిస్తే నాటకంలో ఆ పాత్రలు సమాజంలోని వ్యక్తులకు ప్రతీకలే అని అనిపిస్తాయి.

వరకట్న దురాచారాల్ని రూపుమాపాలనే ప్రయత్నంతో ఆశతో రచింపబడ్డ ఈ నాటకం పూర్తి ఫలితాల్ని పొందిందని చెప్పలేం! ఎందుకంటే ఈనాటికీ వార్తాపత్రికలు ఆయా భాషల్లో ఈ వరకట్న దురాచారానికి బలైపోతున్న స్త్రీల గురించి ఘోషిస్తూనే ఉన్నాయి. అయితే, ఒక రచయిత తనచుట్టూ ఉన్న సమాజంలో ఏదైనా మంచి మార్పును ఆశించి రచనలు చేయటం సహజం. ఆ రచనలు వెలువడ్డ కొత్తల్లో రచయిత ఆశించిన ప్రయోజనం కొంతలోకొంత వరకు సఫలం అయిఉండవచ్చు. కాలక్రమేణ ఆ రచనకు, రచయితకు ప్రాధాన్యం తగ్గినపుడు, ఆ రచన ఏ ప్రభావాన్ని చూపకపోవచ్చు. కానీ ఆ రచయిత ఆశయం మాత్రం ఏనాటికీ ఒక్కటే !

ఏ రచయితా తాను జీవిస్తున్న కాలమున పరిస్థితుల్ని కాదని, వాటినుండి వేరయి వ్రాయలేడు. కాబట్టి ఆ సంఘ స్థితిగతులు అతని రచనల్లో తప్పక చోటు చేసుకుంటాయి. ఆనాటి సంఘజీవనంలో ఒకప్రక్క పాశ్చాత్య ప్రభావం మరొక ప్రక్క ప్రాచీన సంస్కృతి రెండూ పోటి పడుతున్నాయి. అటువంటివి కొన్ని ఈ నాటకంలో ఉన్నాయి.

1. 2. 2 వేషం -వ్యవహారాలు: సాధారణంగా వేషభాషల్ని కలిపి వాడతారు. కాని, ఈ నాటకంలో ఆద్యంతం ఒకేభాష వాడబడింది. అయితే ఆనాటి సమాజంలో వేషంతో పాటు వ్యవహారాల్లో మార్పువస్తూ ఉండటం బట్టి వేష - వ్యవహారాల్ని సమీక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సమాజంలో వస్తున్న మార్పులు ఎక్కువగా విద్యార్థులపై ప్రభావాన్ని చూపిస్తాయి. ఆయా కాలాల కనుగుణంగా నడుచుకునే వాళ్ళూ, కొన్నిసార్లు మార్పుల కోసం సంప్రదాయాల్ని కాలరాసే వాళ్ళూ విద్యార్థులే !

1. 2. 3. - విద్యార్థులు : ఆనాటి సమాజంలో విద్యాజ్ఞాన సముపార్జనకు కాదు. మంచి సంబంధం, ఎక్కువ కట్నం ఆశించి చదివించేవారు కొందరు తల్లి తండ్రులు. చక్కగా వేషం వేసుకున్నట్టు రకరకాల దుస్తుల్తో తమ ఆడంబరాన్ని చాటుకోవడానికి కళాశాలలకు వచ్చే వారు విద్యార్థులు.

"పంచాద్రి క్రాపింగు ప్రక్కపాపిడి, జాలు
లేనివాడు ధరిత్రిలేనివాడు"

ఇదీ విద్యార్థుల వరుస. క్రాపింగ్ చేయించుకొని ప్రక్కపాపిడి తీసి తలదువ్వుకోవడం, జాలులాగా వెంట్రుకలు పెంచుకోవడం ఆనాటి నాగరికతకు చిహ్నాలుగా చెప్పవచ్చు.

"చలువ యుద్దములు సైకిలు కట్టు పెడగోచి
లేనివాడు ధరిత్రిలేనివాడు"

పాశ్చాత్య సంస్కృతి భారత యువతపై చూపిస్తున్న ప్రభావానికి ప్రత్యక్ష సాక్ష్యం - ఆ చలువ కళ్ళ జోళ్ళు, సైకిలు కట్టు పెడ గోచీలు. కొన్ని ప్రాంతాల్లో వ్యవహారంలో ఉన్న దుస్తులే అయినా అంతషోకు విద్యార్థులకు అవసరమేనా?

ఇక వాళ్ళ ప్రవర్తన, అలవాట్లు ఇత్యాదులు తెలియాలి కదా?

సీ॥ కాఫీ హోటళ్ళను కాతాలు బిల్లులు
లేనివాడు ధరిత్రి లేనివాడు
సిగరెట్లు బీడీలు చెక్కిటి ఖిల్లీలు
లేనివాడు ధరిత్రి లేనివాడు
-----------------------------------------
తనదు తలమించినట్టి వ్యధావ్యయంబు
లేనివాడు ధరిత్రి లేనివాడు"

ఆనాటి సమాజంలో విద్యార్థుల వ్యవహారం ఇలా ఉండేదన్నమాట. కాఫీ హోటళ్ళలో ఖాతాలు, బిల్లులు ఉంచుకోవడం గొప్పగా భావింపబడేదన్నమాట. సిగరెట్లు, బీడీలు, ఖిల్లీలు కొత్తగా విద్యార్థుల్లోకి ప్రవేశించాయి. తాను చేయలేకపోయినా అధికవ్యయం చేయడం అనేది ఒక హోదాగా పరిణమించింది. విద్యార్థుల్లో అవసరమైన మార్పులు వచ్చినా రాకపోయినా, అప్పుడే దిగుమతి అవుతూ ఉన్న పాశ్చాత్య విద్యపట్ల కన్నా, వెర్రితలలు వేస్తున్న నాగరికత పట్లే వాళ్ళలో ఎక్కువ మోజు ప్రబలుతోందన్నది ఈ నాటకంలో రచయిత అన్యాపదేశంగా సూచించారు.

ఆ విద్యార్థుల్ని పెళ్ళికొడుకులుగా సంబంధం గురించి మాట్లాడాలని ఎవరేనా వస్తే చాలు, వాళ్ళు గొంతెమ్మ కోరికలు కోరతారు. ఆ కోర్కెలకు ఒడ్డూదరీ మాత్రమే కాదు, హద్దూపద్దూ కూడా ఉండవు. మరొకర్ని మనం అడగడమా అనే అభిమానం కూడా లేకుండా అడిగే స్థాయికి ఆ సమాజంలోని విద్యార్థులు ఎదిగిపోయారు.

"సీ॥ నీటైన యింగ్లీషు మోటరు సైకిలు
కొని పెట్టవలెనను కూళయొకడు
రిస్టువాచియు, గోల్డురింగును, బూట్సున
సూట్లుగావలెనను శుంఠ యొకడు
బియ్యేబియెల్ వఱకయ్యెడి ఖర్చు భ
రియింపవలెనను దరిద్రుడొకడు
భార్యతోడను చెన్నపట్టణంబున నుంచి
చదివింప వలెనను చవటయొకడు
ఆ॥ సీమ చదువు చాల సింపిలు నన్నట
కంప వలయు ననెడి యజ్ఞుడొకడు---"

'అడిగే వాడికి చెప్పేవాడు లోకువ' అన్నది సామెత. కానీ, నారాయణరావు ఇచ్చిన పట్టిక చూస్తే 'అడిగే వాడికి ఇచ్చేవాడు లోకువ' అన్పించే లాగా ఉంది. ఇంగ్లీషు మోటరు సైకిలు, అంటే అప్పటికింకా మన దేశంలో మోటారు సైకిళ్ళు స్వయంగా ఉత్పత్తి కావటం లేదనుకోవాలి. లేదా పాశ్చాత్య వ్యామోహమే కారణం అనుకోవాలి. రిస్టువాచి, గోల్డురింగు, బూట్లు, సూట్లు వీటిలో బంగారు ఉంగరం తప్ప మిగిలినవన్నీ దిగుమతి అయిన వస్తువులే ! అంటే వేషంలోను ఆంగ్లపదాల వాడుక చూస్తుంటే భాషలో మాత్రమే కాకుండా వ్యవహారంలోను అనుకరణ అధికమైందన్నమాట ! చదువుకోవాలనే కోరిక చాలా మంచిది. తల్లిదండ్రుల ఆదరణ వల్ల చదవుకోవచ్చు, లేదా కష్టపడి తనంతట తానే చదువుకోవచ్చు. రెండూ లేకుండా పిల్లనియ్యబోయే మామ తన్ను చదివించాలని కోరుకోవటం మంచిది కాదు ! అంతకు మించి భార్యతో బాటు చెన్నపట్టణంలో ఉంచి చదివించాలని అడగటం, సీమ చదువులు చదివించమని కోరటం ఇవన్నీ ఆనాటి సమాజంలోని యువతకు ఏ మాత్రం గౌరవం తక్కువ అన్పించలేదు. అడుక్కోవడం తమ హక్కు అయినట్లుంది వీళ్ళ ప్రవర్తన. ఈ ఆచారం ఈనాటికి అక్కడక్కడ కన్పిస్తూనే ఉంది. పై చదువులు చదివించమని కోరడం విదేశాలకు పంపమని కోరటం ఇవన్నీ ఒక ఎత్తు , పెళ్ళిచేసుకుంటే తమకు ఉద్యోగం వేయించాలని అడిగే పెళ్ళికొడుకుల సంబంధాలు మరొక ఎత్తు.

1. 2. 4 అల్లుళ్ళు : అల్లుడు అంటే ఎవరైనాసరే మునగచెట్టు ఎక్కేస్తారన్నమాట.

సీ॥ "ముడుపులు పూర్తిగా ముట్టుదాకను బుస్తె
ముట్టక చేతులు ముడుచు కొనుచు
తరువాత బాసెక్కి దాఁచ బెట్టినయట్లు
జిలుగు కోరికలకు సిద్ధపడును
అవల గర్భదానమనినంతనే బిఱ్ఱ
బిగిసి లంచంబటఁ బెట్టుమనును
అదిగాక పండుగ లరుదెంచినపుడెల్ల
తండ్రి తద్దినము చందానదిగును

తే. ఇన్ని బుచ్చుకొనియు నెన్నడేని పిల్ల
నంపుమని ప్రార్థన మొనర్పనదరిపడును
ఆఁడపడుచుల నల్లుర నాటకత్తి
యలనెవండేని తనియింపగలడె"

ఎట్టి కోర్కెలు కోరినా, ఎన్ని కోర్కెలు తీర్చినా ఏదో ఒక వంకపెట్టగలవారు అల్లుళ్ళు. ఆ కోర్కెలు తీర్చే శక్తిలేక వాళ్ళను తృప్తి పరచలేక ప్రపంచ సృష్టి స్థితి లయల్ని చేసే ముమ్మూర్తులే ఆడపిల్లల్ని కనలేదట !

స్త్రీకి ఒక్కడే భర్త ! అయితే మగవాడికి అప్పుఇచ్చిన వాడూ, అద్దె ఇంటి యజమానీ, జీతమిచ్చేవాడూ, పన్నులు కూర్చేవాడూ, అల్లుడూ కూడా పుస్తె కట్టని మగలే ! ఈ కాలానికి సమన్వయిస్తే ఇది స్త్రీ పురుషులిద్దరికీ సరిపోతుంది.

'అల్లుడు అంటే దశమగ్రహం' అన్న మాటవల్ల తల్లిదండ్రుల్లాగ ఉండవలసిన అత్తమామలు బానిసల్లా మారటం, ప్రేమాభిమానాలకు బదులుగా అయిష్టం, భయం వాళ్ళను దిగమింగడం, మనం చూస్తున్న విషయాలే ! అందుకే అల్లుడనే వాడు మరొక కొడుకుగా ఉండాలన్న ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రచయిత ఈ రచనలో అల్లుళ్ళను గురించి చెప్పారనిపిస్తుంది.

వరకట్నం అనేది డబ్బు ఇంత అని అడిగి తీసుకోవటం ఒక రకం అయితే, వస్తువులు అడగడం, చదివించాలని, ఉద్యోగం ఇప్పించాలని కోరటం మరొక రకం. పేరులో మార్పేకాని, విషయంలో మాత్రం ఏ మార్పు లేదు. ధనరూపేణ కాకుండా వస్తురూపేణ ఇవ్వటం అన్నమాట. ఇది మళ్ళీ వరకట్నం క్రిందికి రాదు. కారు, ఇల్లు, అల్లుడి చదువు, ఉద్యోగం ఇవన్నీ కూతురి కోసం తండ్రి ఏర్పరచే సౌకర్యాలు. ఆనాటి సమాజం నుండి నేటిదాకా పేర్లల్లో తప్ప వస్తుసంచయంలో ఏమీ మార్పులేదు. ఒక సరదాకోసం బయలుదేరిన ఆచారం దురాచారమై, సతుల జీవితాన్ని బలిగొంటోంది. ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఈనాటికీ వాళ్ళ తల్లిదండ్రులు ఇవ్వగలిగే కట్నాల్ని ఆధారం చేసుకునే జరుగుతున్నాయి. అలా జరిగినా ఇంకాపెట్టుపోతలు తప్పటంలేదు. ఈ దురాచారం ఎందరి జీవితాల్నో బలి తీసుకుంటోంది. లాంఛనాలు అందలేదని ఆరళ్ళు పెట్టే అత్తా ఆడపడుచులు, ఒకప్రక్కా, చెప్పినంత కట్నం ఇచ్చినా ఏవో తక్కువయ్యాయని గొడవలు చేసే భర్తలు ఒక ప్రక్కా, ఆడవాళ్ళ జీవితాలకు ఆడకత్తెరలై పోయారు. ఒక్కొక్కసారి ఆడపిల్లల తల్లిదండ్రులు కూడా తమ తాహతుకు మించిన సంబంధాల్ని చూసి, అప్పుచేసి అయినా తమ కూతుర్ని పెద్ద కుటుంబంలో కోడలుగా పంపాలని ప్రయత్నిస్తారు. కానీ ఆ ప్రయత్నాలు కొన్నిసార్లు ఫలించకపోవచ్చు. ఎదురుచూసిన చోట అప్పుపుట్టక పోవచ్చు. అటువంటి సందర్భాల్లో ఆ పెళ్ళిళ్ళు ఆగిపోవడం కానీ, లేదా పెళ్ళయిన తర్వాత ఆ పిల్లల కాపురాల్లో దుస్సంఘటనలు కాని జరగవచ్చు. ఇటువంటి సందర్భాల్లో ఆడపిల్లలు తాము ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా లెక్కలేనన్ని వార్తాపత్రికల ద్వారా నేటికీ తెలియవస్తూనే ఉన్నాయి.

కట్నం పుచ్చుకుని పెళ్ళి చేసుకోవడం అవమానకారణమనీ, అది తమ వ్యక్తిత్వానికి ముప్పుఅనీ మగపిల్లలు; కట్నం పుచ్చుకుని పెళ్ళిచేసుకోవలసి వస్తే ఆ భర్తలు తమకు స్వంతమయి తమ వెనుక రావాలి కాని, తాము భర్తల ఇళ్ళల్లో వెళ్ళి కాపురం చేయమని చెప్పే ధైర్యం లేదా, కట్నం తీసుకునే పెళ్ళికొడుకుల్ని పెళ్ళిచేసుకోం అని చెప్పే ధైర్యం తెచ్చుకుని ఆడపిల్లలు - జీవితాల్ని దిద్దుకోవాలనే కోర్కెతో రచయిత ఈ నాటకం రచించారనిపిస్తుంది. ఈ వరవిక్రయం నాటకం రాయటంలో రచయిత ఉద్దేశించినది ముఖ్యంగా ఇదే! రచయిత ఆశించిన ప్రయోజనం వరకట్నం అనే మాటలేని సమాజం. ఆడపిల్లలు, వాళ్ళ తల్లిదండ్రులు సంతోషంగా ఉండడానికి, చక్కని వివాహ వ్యవస్థ ఈ దురాచార కారణంగా పాడవకుండా ఉండడానికి రచయిత ఈ నాటకం ద్వారా ఒకమార్పు లేదా ఒకతీర్పు చెప్పారనిపిస్తోంది.

**1. 2. 5 కుహనా సంఘ సంస్కర్తలు :** సంఘసంస్కరణ అనేది వ్యక్తి ఎదుటి వాళ్ళపై ప్రయోగించేది. ఆచరించటం చెప్పినంత సులభం కాదు. ఒక వ్యక్తి తాను నమ్మిన ఆశయాల్ని ప్రబోధించటం చాలా తేలికగా చేయగలడు. కాని, తన ఆశయాల్ని తానే పాటించటం అనేది అంత త్వరగా సమకూడేది కాదు. ఉదా: అసత్యం ఆడకూడదన్న మాట అందరూ చెప్పేదే! అయితే నిజమే చెప్పేవాళ్ళెంతమంది? ధర్మాన్ని కాపాడాలని ప్రసంగించే వాళ్ళెంతమంది ధర్మాన్ని ఆచరిస్తున్నారు?

ఈ నాటకం ద్వారా రచయిత 'It is easy to preach rather than practice' అనే లోకోక్తి సత్యమని చాటారు. పురుషోత్తమరావు కట్నానికి విరోధి. అయితే, కాలానుగుణంగా తమ కూమార్తెల పెళ్ళికోసం కట్నం ఇవ్వడానికి సిద్ధపడ్డారు. అంటే తన ఆశయాన్ని ఆయన వదులుకున్నట్లే! అయితే, అలాచేయవలసి రావడానికి ఆయన పడిన బాధ కుమార్తె కాళిందిని ప్రశంసించిన విధం, గత్యంతరం లేక కూతుళ్ళకు పెళ్ళయితే చాలు తన నమ్మకాలు ఏమైయినాసరే అని రాజీపడేతత్వం, ఇవన్నీ కలసి ఆశయాలనుండి మారినా కుహనా సంస్కారి అనాలనిపించదు. కాని, అతనిద్వారా కొందరు సంఘసంస్కర్తలను పరిచయం చేస్తారు రచయిత. వారి గురించి ఆలోచించవలసిందే!

"బాల్య వివాహములనంటబట బట పండ్లు కొరుకు బాపిరాజుగారేమి చేసినారో విన్నావా ? అభము శుభము నెఱుంగని యాఱేండ్ల పిల్లను నలుబది యేండ్లు గడిచిన నాల్గవ పెండ్లివానికి ముడిపెట్టి - అదేమన - అత్తగారి పట్టన్నారు? స్త్రీ పునర్వివాహముల కొఱకు జిందులు త్రొక్కినా శివయ్యగారు బంగారు బొమ్మవంటి పదునాఱేండ్ల చెల్లెలికి భర్త చావగానే వంటలక్కను మానిపించి, వంట తప్పేలా చేతికిచ్చి, అదేమనమాయమ్మ చావనిమ్మన్నారు. శవవాహనమును గూర్చి శంఖములు పూరించు శరభయ్యగారు - ప్రక్కయింటి యిల్లాలు భర్త చచ్చి, శవవాహకులకు డబ్బిచ్చు శక్తి లేక దేవుడా గోడాయని దేవులాడుచుండ, వీధి తలుపు గొండ్లెము వైచి, విత్తెడు నైవేద్యము పెట్టి, పెరటిత్రోవను పేకాటకు జక్కబోయి - అదేమన, ఆమె వచ్చి అడుగలేదన్నారు? విన్నావా? వీరే కాదు. ఈ యూరి సంఘసంస్కర్తలందఱు నిదే మాదిరి?" - ఇదీ సంఘసంస్కర్తల హడావిడి.

రచయిత పేర్కొన్న పట్టికను పరిశీలిస్తే - ఈ సంఘసంస్కర్తలందరూ ఒకరికి ఉపన్యాసాలిచ్చి తమ వంతు వచ్చేసరికి ఏం పాటించనివాళ్ళు అన్పిస్తారు. పైపైకి ఇది నిజమే ! కానీ నిశితంగా పరిశీలిస్తే అది సరి కాదేమో అన్పిస్తుంది.

రచయిత 'ధనమూల మిదమ్ జగత్' అన్న వాక్యాన్ని అతిగా నమ్మి దానికే తమవంతు జీవితాన్ని ధారపోస్తున్న వాళ్ళను హెచ్చరించడానికే ఈ నాటకం రచించారేమోనన్పిస్తోంది. పై పట్టికలోని వారంతా ఆరేళ్ళ పసిపిల్లను నలువది ఏండ్ల వాడికిచ్చి పెండ్లి చేసిన తండ్రి, చెల్లెల్ని వంటలక్కను చేసిన అన్న; ప్రక్క ఇంటి స్త్రీకి సహాయం చేయవలసి వస్తుందేమోనని పెరటి త్రోవ పట్టిన పెద్ద మనిషి - ముగ్గురూ కూడా ఆయా విషయాల గురించి సభల్లో ఉపన్యాసాలిచ్చి మరొకరు ఎలా నడుచుకోవాలో సలహాలిచ్చినవాళ్ళే ! మరి తమదాకా వచ్చేసరికి ఎందుకు మారిపోయారు ? మొదటిది తండ్రి విషయంలో నాల్గో పెళ్ళి కనుక కట్నం అడిగి ఉండడు. ఎదురు కన్యాశుల్కం ఇస్తానన్నాడో ఏమో! అంటే ఇక్కడ తండ్రి కూడా తన కుమార్తె బ్రతుకును డబ్బుకు బలిచేశాడన్నమాట! రెండవది ఒక అన్న, కన్న తల్లితండ్రులే కాసుకు లెక్క చూసుకుంటే తోడబుట్టిన వాళ్ళు చూసుకోరా? ఆ అన్నకు రెండు విధాలా కలసి వచ్చింది. ఒకటి ఇంట్లో వంటలక్కను మాన్పిస్తే రెండు పూట్ల భోజనంతో సరిపోయే పనిమనిషి దొరకటం, మరొకటి అన్నీ లక్షణంగా ఉన్న పిల్లకే కట్నాలు వేలకు వేలు పోయవలసి వస్తుంటే, మరి రెండవ పెళ్ళి అనగానే వైధవ్యం ప్రాప్తించిన వనిత అని తెలియగానే పెళ్ళికొడుకుల వెల వాళ్ళ ప్రాణాలపై తీపిలా ఎదిగిపోదూ! మరియొక పెద్ద మనిషి గురించి, పక్కింట్లో చావుంటే మనం భోజనం మానుకోగలమా? వాళ్ళు వచ్చి పిలిస్తే సహాయం చేయవలసి రావచ్చు. తీరా చేసే సహాయం శారీరకమో, ధన సంబంధమో మరోసారి చెప్పి బదులు తీర్చుకోగల పరిస్థితి కాదు కదా! ఇన్ని రకాల ఆలోచించి ఆ పెద్దమనిషి నడుచుకుని ఉంటాడు. మొత్తం మీద వీళ్ళందరూ కూడా ధనాన్ని ఆధారం చేసుకుని తమతమ ఆశయాల్ని అమ్ముకున్నవారే, కానీ ఆశయాల మీద ఇష్టంలేక కాదు. అంటే డబ్బుదే తప్పుకానీ వ్యక్తులదికాదు. ఆ రకంగా చూసినపుడు వీళ్ళంతా కుహనా సంస్కర్తలే ! నమ్మకం, ఆశయం, ఆత్మ గౌరవం ఏదీ ధనం కన్నా ముఖ్యం కానపుడు ఇక ఎలా సంఘసంస్కరణ అనేది జరుగుతుంది ? స్వార్థం వదులుకోనిదే పరమార్థం ఎలా సాధింపబడుతుంది? కనుకనే వీళ్ళను స్వార్థపరులై కేవలం ప్రచారానికే సంఘసంస్కరణం అనుకోవడంవల్లే కుహనా సంస్కర్తలనవలసి వస్తోంది.

పాశ్చాత్య వ్యామోహం వల్ల విద్యార్థులే కాదు, అందరూ చెడిపోతున్నారన్నది రచయిత భావం. పేరయ్య లింగరాజుల సంభాషణలోని యోగి వైదికుల ఆచారభ్రష్టత్వం గురించి రచయిత చాలా వివరంగా చెప్పారు. మీసాలు పెంచటం; జుట్టు కత్తిరించుకుని క్రాపింగ్ చేసుకోవటం; చుట్ట కాల్చటం; కాఫీ హోటళ్లు, రెస్టారెంట్లకు పోవటం - వంటివి నేర్చుకుని సత్సంప్రదాయాన్ని మంట గలుపుతున్నారని అలా సంప్రదాయాల్ని విచ్ఛిన్నం కానీకుండా చూసుకోవటం ప్రజల ధర్మమని రచయిత అభిప్రాయం.

**1. 2. 6. ఉద్యోగులు / అధికార్లు :** లంచగొండితనం వేళ్ళూనుతున్న రోజులవి. అధికార దుర్వినియోగం కొద్దికొద్దిగా కాలూనుతోంది. అటువంటి పరిస్థితుల్లో ఉద్యోగుల కష్టాలు, అధికార్ల హడావిడి రచయిత చాలా చక్కగా చిత్రించారు.

తాలూకా బోర్డు ప్రెసిడెంటు పోస్టు బంగారు గుడ్లు పెట్టే బాతులాంటిది. టి.వి. లు ఇత్యాదుల్లో కాస్త డబ్బు చూడవచ్చు. కాంట్రాక్టర్ల కమీషన్లు కొద్దో గొప్పో గిట్టకపోవు. స్కూలు టీచర్లను బదిలీలనీ, ఫైనులనీ బెదిరిస్తే కాస్త రాలకపోదు. అంతచేసినా ఒక్క నెల జీతం వస్తే గొప్పే! పరాయి వాళ్ళయితేనే ఆ డబ్బయినా వచ్చేది. ఆ ఉద్యోగులు బంధువులయితే ఆ కాస్తా కూడా రాదు. - అంటూ బాధపడుతున్న వకీలు వెంగళప్ప గోడువింటే, ఆనాటికే సమాజంలో చెదలు పట్టడం ప్రారంభించిందని తెలుస్తుంది.

ఒక పదవి ఉంటే అందులో ఎన్ని రకాలుగా డబ్బు రాబట్టవచ్చో అలా రాబట్టుకునే ప్రయత్నం చేయడం అలవాటయిందన్నమాట. అధికారాన్ని పదవిని డబ్బు కింద మార్చుకోవటం అనేది వ్యక్తికున్న చాకచక్యంగా చలామణీకి వచ్చిందన్నమాట. అంతేకాకుండా తమ బంధువుల్ని పై పదవుల్లో ఉన్నవాళ్ళు ఉద్యోగస్థులుగా నియమించుకునే వారన్నమాట. అంటే పదవిని డబ్బు సంపాదించుకోవటానికే కాకుండా మిగిలిన ఉద్యోగస్థుల జీతాలు కూడా మిగిలిపోయేలాగ ఏర్పాటు చేసుకుని ఉద్యోగాలు తమవారికివ్వటం కూడా జరిగేదన్నమాట! అధికార దుర్వినియోగం, లంచగొండితనం సమాజంలో ప్రబలకూడదన్న భావాన్ని రచయిత ఈ పాత్ర ద్వారా తెలియపరుస్తున్నారు.

అధికార్ల ఆగ్రహానికి భయపడి చేతులు ముడుచుకుని కూర్చునే వాళ్ళుకూడా 'తలుపులు మూసికొడితే పిల్లైనా ఎదురుతిరుగుతుందనే' సామెతను నిజం చేస్తారని ఒక స్కూలు టీచరు పాత్రద్వారా నిరూపించారు. సెలవు కోసం వాళ్ళుపడే పాట్లు, ఒక మంచి వ్యక్తి ఉంటే అతనితో మొరపెట్టుకుంటేనో లేక అతని సహాయం పొందాలంటేనో వాళ్ళు పడేపాట్లు, ఆపై అధికార్లకూ వీళ్ళకూ పడకపోతే మధ్యనలిగిపోవడం వంటివి సహజంగా వర్ణించారు.

ఎన్నో పాట్లుపడి ఎందరి కాళ్ళు పట్టుకునో సంపాదించుకొన్న పదవి - అందులోనూ అల్లునకు వచ్చిన పదవి, అత్యంత భయపడవలసిన విషయమయిపోయింది. అధికారంలో ఉన్నవాళ్ళు చాలామంది నిరక్షరకుక్షులు లేదా అల్పులు. నిజంగా అర్హత ఉన్నవాళ్ళూ, నిజాయితీగా ఉండేవాళ్ళూ ఏ కొద్దిమందో ఉంటే వారిని బ్రతకనివ్వరు. వాళ్ళ పైఅధికార్లకూ వాళ్ళకూ పడదు. వాళ్ళు ఏ మంచి చేయాలన్నా ఏమీ చేయలేని వాళ్ళుగానే ఉండిపోతారు. మొత్తానికి ఆనాడు సమాజంలో బీజప్రాయంగా మొదలైన పదవీదాహం, అధికార దుర్వినియోగం, లంచగొండితనం మంచివాళ్ళనూ, అర్హత గలవాళ్ళనూ పైకిరానీయకుండా చేయటం వంటివి ఈనాడు మర్రిచెట్టులా ఊడలు దిగి పెకలించరాని విధంగా నాటుకుపోయాయి.

ఇటువంటి అన్యాయాలూ, అక్రమాలూ, వరకట్నం వంటి సమాజనేరాలూ పెరిగిపోకుండా ఉండాలనీ, మనదేశపు ఆచార వ్యవహారాలు, సంస్కృతి పాశ్చాత్య మోహంలో పడి నాశనమయిపోకూడదనీ రచయిత ఆశించి ఈ నాటకాన్ని రచించినట్లు కన్పిస్తుంది. అదే రచయిత కాళ్ళకూరి నారాయణరావు ఈ నాటకంలో ఆశించిన ప్రయోజనం.

## సారాంశం :

నాటకకర్తగానేగాక, బహుముఖీనమైన ప్రజ్ఞాపాటవాలు కలిగిన రచయితగా కాళ్ళకూరి వారిని గురించిన విశేషాలను, వరకట్న సమస్యతో పాటుగా పంచాయతీలను, కొత్తగా వస్తున్న చట్టాలను, కుహనా సంస్కారులను ప్రస్తావిస్తూ నాటి సంఘంలోని అవకతవకలకు దర్పణం పట్టిన ఈ నాటిక ప్రధాన ప్రయోజనం ధర్మానిదే తుది జయమని చాటి చెప్పారు.

## ప్రశ్నలు :

1. వర విక్రయకాలం నాటి సామాజిక స్థితిగతులను గూర్చి వ్రాయండి ?
2. "వర విక్రయం నాటి వరకట్న దురాచారాన్ని ప్రతిబింబించే నిలువుటద్దం" - వ్యాఖ్యానించండి

**ఆచార్య ఎల్.బి. శంకరరావు**
తెలుగు శాఖ
మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై

ఖండం : 4

పాఠం : 2

# వర విక్రయము

- కాళ్ళకూరి నారాయణరావు

శీర్షికలు :

2. ఇతివృత్త వైశిష్ట్యం

(1 - 5 అంకములు)

## లక్ష్యం :

నాంది, ప్రస్తావనలతో ఆరంభమైన వరవిక్రయ నాటకంలోని అంక కథలను వివరిస్తూ, నాటకేతివృత్తంలోని విశిష్టతను వెల్లడించే ప్రయత్నం ఈ పాఠంలో కానవస్తుంది.

## 2. ఇతివృత్త వైశిష్ట్యం

### 2.0. నాంది :

గొప్పదై, పండితుల మంగళ వాక్కులతో కూడినదై, అందమైన అప్సరసల నటనతో, వినోద భరితమైనదై, అహంకార వికారములకు దూరమై, తెగడదగిన ఇరు విధముల శుల్కములు లేనిదై వెలుగొందు గౌరి వివాహము యొక్క తలంపు భద్రమును కలుగచేయును గాక!

### 2.1. ప్రస్తావన :

తొలుత సూత్రధారుడు ప్రవేశిస్తాడు. ప్రవేశించి సభను చూస్తాడు. సభ నిండిఉండటం గమనించి, ఆ మహాకవి కావ్యములంటే విజ్ఞుల కెంతో ఆదరమని సంతసిస్తాడు. సభాసదుల్ని, చూసి, వరవిక్రయ మనే దురాచారాన్ని ఖండించి, కాళ్ళకూరి నారాయణరావు రాసిన నాటకం బుద్ధిరాజు వీరభద్రారాయామాత్యులకు అంకితం ఇవ్వబడింది. ఆ నాటకాన్ని చూడాలన్న కోరికతో వచ్చిన మీ కందరికీ నా కృతజ్ఞతలు. ఏమంటున్నారు? కవి పేరు కలవాడు. కావ్యమా? కాలానికి తగింది నాటకాన్ని వేసే మీరా భరతాగమంలో చతురులు. అందువల్ల మీ ప్రదర్శనకు త్వరపడుతున్నామనా? నిజమే? ఇదిగో ఇప్పుడే మొదలు పెడుతున్నాము అంటూ తెరవంక చూస్తాడు. చూసి, "ఓసీ, ఓసీ, ఎక్కడున్నావు? ఒకసారి ఇటురా"! అని పిలుస్తాడు.

నటి అప్పుడే ప్రవేశించి, "ఏంటి? కొనిపారేసినట్లు గొంతు చించుకుంటున్నావు?" అని అడుగుతుంది. కొని కాకపోతే కోసుకొని తెచ్చానా? నీకు పెట్టిన వెయ్యి రూపాయల నగలు ఏ గంగలో కలిసాయి? అని అడుగుతాడు? మీ సొమ్ము మీకు ఇచ్చి వేస్తే నాకు విడాకులు ఇస్తారా? అంటుంది నటి? ఇది అమెరికా కాదనీ, అర్యా వర్తమనీ ఇక్కడ ఒక్కసారి బొందు కడితే బొందిలో ప్రాణం ఉండేదాకా బందెల గొడ్డులాగా పడి ఉండవలసిందేనని చెప్తాడు. ఆ విషయమేదో ఆడంగుల సభలో ఆలోచించవచ్చు గానీ, పిలిచిన కారణం ఏంటని నటి అడుగుతుంది. పాత్రలను సిద్ధం చేశావా? అని సూత్రధారుడు ప్రశ్నిస్తే త్వరగా రమ్మని కూడా చెప్పివచ్చానంటుంది నటి. మరి ఆలస్యం దేనికంటాడు సూత్రధారుడు. చెవులు వినిపించటం లేదా? లేక చెవుల్లో చెట్లు మొలిచాయా? చరకాగానం విన్పించటం లేదా? అంటుంది నటి.

తెరలోపల "చరకా ప్రభావం ఎవరికి తెలుసు. ఈ ప్రపంచంలో మన చరకా సిరులలో తులతూగుతుంటే ఆ సీమ జాతి చూస్తోంది ఏమరక చరకా" అంటూ పాట విన్పిస్తుంది. సూత్రధారుడు "అదిగో భ్రమరాంబ, కాళింది, కమల పాత్రలు చరకాగానంతో రంగప్రవేశం చేస్తున్నాయి. మనం పోయి మనపని చూసుకుందాం" అంటాడు. ఇద్దరూ నిష్క్రమిస్తారు. ఇది ప్రస్తావన.

## 2.2. ప్రథమాంక కథ :

పురుషోత్తమరావు ఇంటి లోపలి చావడి, పంటెను నూలు చుట్టుతూ భ్రమరాంబ, చరకాగానంతో నూలు వడుకుతూ కాళింది, కమల ముగ్గురూ ప్రవేశిస్తారు.

కాళింది, కమల మోహనరాగంలో ఆదితాళంతో చరకా ప్రభావాన్ని పాడుతుంటారు. ఈ ప్రపంచంలో చరకా ప్రభావం ఎవరికి తెలుసు? సిరులతో తులతూగుతున్న ఆ సీమజాతి వారంతా ఏమర కుండా చరకావంక చూస్తున్నారు. సంవత్సరానికి 20 కోట్ల రూపాయలు సంపాదించే వారికే కాక, మేలి పనులు మానుకొని వాళ్ళ బానిసలమైన వెనుక, చరకా గొప్ప సామ్రాజ్యాన్ని కూర్చుతుంది. అంతులేని ధనాన్ని చేకూరుస్తుంది. కాటకం అనే రాక్షసిని పరిమార్చి సాటిలేని ఒక జాతిని తయారుచేస్తుంది. చరకా ప్రభావం ఎవరికి తెలుసు.

కాళింది తల్లి చేతిలో నూలు అలాగే ఉండటం చూసి, అమ్మా! అదేమే నూలు చేతిలోనే ఉంది? అని ప్రశ్నిస్తుంది. భ్రమరాంబ తనకు ఈ పూట దృష్టి పనిమీద లేదనీ, వాళ్ళ తండ్రి మిల్లె గరిటెడు కాఫీ నీళ్ళు త్రాగి పొద్దున బోయిన వ్యక్తి ఇంతవరకు ఇంటికి రాలేదని బాధపడుతుంది. పన్నెండు గంటలు కొట్టి 15 నిమిషాలు అయింది. ఎక్కడికి ఏ పనిమీద వెళ్ళారో తెలియదు అని బెంగ పడుతుంది. కమల తమ తండ్రికి వేరే పని లేదు. పగలు రాత్రి అల్లుళ్ళను వెతకటమే నంటుంది. భ్రమరాంబ కూతురుతో అమ్మా! ఏం చేయమంటారు? ఆడపిల్లల్ని కన్న తల్లితండ్రుల అవస్థ ఈ స్థితికి వచ్చిందని బాధ పడుతుంది. కన్న పిల్లను ఒకరికిచ్చి పెళ్ళి చేసి, సద్గతులు పొందుదామనుకునే రోజులు పోయి, కట్నాలు ఇవ్వలేక ఆడపిల్లను ఎందుకు కన్నామా? అని బాధపడే రోజులు వచ్చాయని చెప్పి బాధపడుతుంది. “అది నిజమే కాని ఆడ బిడ్డల్ని కన్న తల్లిదండ్రుల బాధకు అర్థం లేదు. ఎందుకంటావా? కార్యమయ్యేదాకా అయ్యో కాలేదని పగలూరాత్రి తేడా లేకుండా బాధపడటం. కార్యమయిన తర్వాత ఆ పిల్లను విడిచి ఎలాగుంటామని అనుక్షణం బాధపడటం అంటుంది కమల. కాళింది ఆమె మాటలకు అడ్డువచ్చి ఊరుకో చెప్పుల చప్పుడు విన్పిస్తోంది నాన్న వస్తున్నట్లున్నారు అని చెప్తుంది.

పురుషోత్తమరావు ఆయాసంతో ప్రవేశిస్తాడు. విపరీత కాలం పుట్టిందని అంటాడు. ఈ కాలం ఇలా ఉందేమని బాధపడతాడు, ధర్మం చెడింది. నీతి నశించింది. పూర్వముండే మర్యాద హరించిపోయింది. అంగట్లో అమ్మే కూరాకులులాగా, వేలం పాటలో పాడబడే చొక్కా, టోపి, పాగా, లంగా, పశువుల్లాగా పెళ్ళి కొడుకుల్ని కూడా వ్యాపారంలో ఎవరు ఎక్కువ ధనమిస్తే వాళ్ళు కొనుక్కునే పరిస్థితి వచ్చిపడింది. ఇంతకన్న ఘోరం మరేదైనా ఉంటుందా? కులంతో ఏం పనిలేదు, పిల్లరూపంతో, జ్ఞానం ఏంటి, ఏ పనిలేదు. పరువు, ప్రతిష్ఠ, బంధువులు వంటివేవీ లెక్కలేదు. బంగారం, చక్కని బట్టలు, లాంఛనాలు అంటూ శుల్కం కట్టినట్టు డబ్బు ముట్టచెప్పాల్సిన రోజులు వచ్చాయి. సంబంధికి కావలసినవి ఇవే అయిపోయాయి.

భ్రమరాంబ ఆయనకు ఎదురువెళ్ళి ఇదేమిటి? ఈ రోజు ఇంత ఆలస్యంగా వచ్చారు భోజనానికి ప్రొద్దు పోలేదా? అని ప్రశ్నిస్తుంది. అప్పుడు ఆయన వెట్టిదానా భోజనం గురించి ఏం బెంగ? లోకం తీరు తెలుసా? అంటూ ఇలా వివరిస్తాడు. కంట్లో పడిన దోమలాగా, నరాలపై వచ్చే కురుపులాగా, కదులుతున్న దంతంలాగా, మర్వాడీ దగ్గర తెచ్చిన అప్పులాగా, పళ్ళ సందులో చిక్కుకున్న పీచు విధంగా చెప్పుల్లో దూరిన రాయిలాగా, గొంతుకు అడ్డం పడ్డ ఆకుకుట్టే పుల్లలాగా, బట్టల్లో చిక్కుకున్న పూచిక విధంగా - ప్రతీక్షణం ఆడపిల్లల పెళ్ళిళ్ళ గురించిన చింత పెద్దదై వేధిస్తుంటే వేరే ఆలోచనలు రావు. పెళ్ళికాని కన్నెపిల్లలున్న తండ్రికి వేరే ఏ బాధలూ బరువుగా తోచవు.

ఇంతకీ ఏం చేసుకొచ్చారనీ ప్రశ్నించిన భార్యతో, కాళ్ళు అరిగేలాగా కాలేజీలన్నీ తిరగటమే తప్ప నిజంగా చేసిన పని చిన్నయెత్తు కూడా లేదంటాడు. కాలేజీల్లో పెళ్ళి కావల్సిన పిల్లలే లేరా? అని ప్రశ్నిస్తుంది, భ్రమరాంబ. పెళ్ళికాని వాళ్ళు ఎంతోమంది ఉన్నా, గవ్వకు కొరగాని వాళ్ళుకూడా కాసుల వెలలో ఉన్నారు. లెక్క నిర్ణయించే ఉంచారు. స్కూలు ఫైనలు అయితే రెండు వేలు, ఇంటరైతే మూడువేలు, బియ్యే వాడైతే నాలుగు, ఆస్తి పాస్తులుంటే రెట్టింపు, రైలు తరగతుల్లాగా పెళ్ళి కొడుకులకు కూడా వెల నిర్ణయింపబడే ఉందన్నమాట. అంతేకాదు - ఇంగ్లీషు వాళ్ళ మోటరు సైకిలు కావాలనే వాడొకడు. రిస్టువాచి, గోల్డురింగు, బూటులు, సూటు, కావాలనే వాడొకడు. బియ్యే బి.ఎల్. వరకు చదువుకయ్యే ఖర్చు భరించాలని అడిగేవాడొకడు, భార్యాభర్తల్ని చెన్నపట్నంలో ఉంచి చదివించాలనే వాడొకడు; సీమ చదువు

కోసం నన్ను పంపమని అడిగే వాడొకడు, ఈ విధంగా వాళ్ళవాళ్ళ కోరికల్నీ ఇష్టాల్నీ తెలిపేవాళ్ళే ఇప్పటి పెళ్ళికొడుకులంటాడు పురుషోత్తమరావు. వాళ్ళ ప్రవర్తన ఎలాగుందని ప్రశ్నిస్తుంది భ్రమరాంబ, అది నువ్వు అడగటం, నేను చెప్పటం రెండూ అనవసరమే అంటూ అక్కడి కుర్రవాళ్ళనిలా వర్ణిస్తాడు పురుషోత్తమరావు - పంచాగ్ని క్రాఫింగు, పక్క డిజుల పాలు లేని వాడీ జగతిలో లేడు. కాఫీ హోటళ్ళల్లో ఖాతాలు, బిల్లులు లేని వాడీ ధరిత్రిలో లేడు. సిగరెట్లు, బీడీలు, నోట్లో ఖిళ్ళీలు లేనివాడీ ప్రపంచంలో లేడు. చలవ అద్దాలు, సైకిలు కట్టు, పెడగోచి పెట్టని వాణ్ణి ఈ లోకంలో చూడటం కష్టం. తన సంపాదన కన్నా అధికవ్యయం చేయని వాడు ఈ లోకంలో లేడు. ఇప్పుడు విద్యార్థులు ఎవరో ఒకళ్ళిద్దరు తప్ప, అందరూ ఈ విధంగానే ఉన్నారు అన్న భర్తను మరి వాళ్ళ తల్లిదండ్రులు చదువులెందుకు మాన్పించరని ప్రశ్నిస్తుంది భ్రమరాంబ. పురుషోత్తమరావు ఆమెను చూసి నవ్వి ప్రస్తుతం చాలా మంది తమ పిల్లల్ని కట్నం కోసం చదివిస్తున్నారే కాని, చదువు కోసం కాదని, పెళ్ళి కుదరగానే చదువు మాన్పిస్తున్నారని చెప్తారు. అటువంటి పరిస్థితుల్లో చూపులకు గుర్రాలలాగా కన్పించే మగపిల్లల్ని పెళ్ళి కొడుకులుగా అంగీకరించటం అనవసరమనీ, పురుషోత్తమరావుతో పాటు సంఘ సంస్కరణ కోసం పాటుపడ్డ వాళ్ళెందరో ఉన్నారు. కనుక వాళ్ళెవరి పిల్లలనైనా చూడకూడదా అనీ ప్రశ్నిస్తుంది భ్రమరాంబ. అందుకు పురుషోత్తమరావు ఇలా సమాధానమిస్తాడు - లేకేం చాలా మందే ఉన్నారు. ఉండీ లాభం ఏమిటి? వేదికలెక్కి, ఉపన్యాసాలివ్వడానికే తప్ప, నిజానికి అవసరం వచ్చినపుడు మాత్రం పట్టుదలలు సున్నే. బాల్య వివాహమన్న మాట చెవిని పడితే పళ్ళు కొరికే బాపిరాజు ఏం చేశాడో విన్నావా? అభం శుభం తెలియని ఆరేళ్ళ పసి పిల్లను 40 ఏళ్ళు పైబడిన వాడి కిచ్చి పెళ్ళి చేసి, అదీ నాల్గవ పెళ్ళి చేసేసి అదేమిటని ఎవరైనా అడిగితే అత్తగారి పట్టుదలే కారణమన్నారు. స్త్రీ పునర్వివాహం గురించి మాట్లాడే శివయ్యగారు బంగారు బొమ్మలాంటి చెల్లెలి భర్త చచ్చిపోగానే ఇంట్లోని వంటలక్కను మాన్పించి ఇంటి పనులకు నియమించి అదేమిటి అని ప్రశ్నిస్తే మా అమ్మ చావలేదండి అంటున్నారు. శవవాహనం గురించి శంఖం పూరించే శరభయ్య గారు ప్రక్కింటి ఇల్లాలు భర్తపోయి, శవవాహకులకు డబ్బిచ్చే గతిలేక కష్టపడుతుంటే ఇంటికి గొళ్ళెం పెట్టించి, భోజనం చేసి పెరటితోవలో పేకాటకు పోయి అదేమిటంటే ఆమె వచ్చి అడగలేదని చెప్పారు. వీళ్ళేకాదు ఈ నాటికీ ఊళ్ళో ఉన్న సంఘ సంస్కర్తలందరూ ఇలాగే ఉన్నారు.

'అయినా ఒకసారి అడిగి చూడక పోయారా' అంది భ్రమరాంబ. అది కూడా జరిగిందనీ ఎవరిని అడిగినా కానీ మా కిష్టమే కానీ మా ఇంట్లో ఆడవాళ్ళు పడనివ్వరండీ అని సమాధానమిస్తున్నారని చెప్పారు పురుషోత్తమరావు. వాళ్ళన్న మాటల్లో మాత్రం ఏం తప్పులేదనీ, కట్నం లేదని అన్నంత మాత్రాన మెడకు ఉరిపోసుకుంటామని బెదిరించే ఆడవాళ్ళు ఉంటే వాళ్ళమాట వినక మగవాళ్ళకు తప్పదు కదా అనీ అంటుంది భ్రమరాంబ.

ఆడదాని మాట దాటలేని వాళ్ళు దేశారాధన ఏం చేస్తారు? చదువులు మాని దేశభటులై తిరుగుతున్న వారికి, రాజకీవిలున్నా వాటి నన్నిటిని కాదని రాట్నాలు చేపట్టిన వారికి, వృత్తుల్ని అసహ్యించుకుని సంపదలు వదలివేసిన వారికి, భోగాల్ని వదిలి కారాగారాల్లో మాడేవారికి, ఇట్లాంటి వాళ్ళందరికీ ఆడవాళ్ళు లేరా? ఎవరో కొందరిలా పిరికి పందలై మగతనాన్ని చంపుకుని తమ ఆడవాళ్ళు కెదురు తిరగలేక తలలూపుతూ కుక్కల్లాగ పడి ఉన్నారు అంటాడు పురుషోత్తమరావు. అయితే చివరికేం చేద్దామనుకుంటున్నారని ప్రశ్నిస్తుంది భ్రమరాంబ. ఏం చేయాలో తెలియక పెళ్ళిళ్ళ పేరయ్యను తమ ఇంటికి రమ్మన్నానని చెప్తాడు పురుషోత్తమరావు. పెళ్ళిళ్ళ పేరయ్యంటే ఎవరని అడిగిన భార్యతో ఆ ఊళ్ళో ఏ పెళ్ళయినా పెళ్ళిళ్ళ పేరయ్య వివాహాల వీరయ్యల చేతిమీదే జరగాలని జవాబిస్తాడు. పురుషోత్తమరావు చేసిన పని బాగుందని భ్రమరాంబ మెచ్చుకుంటుంది. పెద్దమ్మాయికి పదమూడు నిండాయని, చిన్నమ్మాయి ఆమె కన్నా ఒక్క ఏడాదే చిన్నదని త్వరగా పెళ్ళిళ్ళు జరగకపోతే చెడుపేరు వస్తుందనీ, అందువల్ల కాలానుగుణంగా మారక తప్పదనీ ఏ ఎండకాగొడుగు పట్టడం మంచిదనీ చెప్తుంది. వెంటనే అల్లుళ్ళు వస్తే బావుంటుందని అంటుంది.

అందుకు పురుషోత్తమరావు ఆమెతో అల్లుళ్ళు అవి అనవద్దని అంటారు. అల్లుళ్ళు అధికారులని, కనుక ఆడపిల్లల్ని కన్న అపరాధానికి సంచుల కొలది జరిమానాలు వసూళ్ళు చేస్తున్నారని చెప్తారు. కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తామంటుంటే, ఈ కట్నాల గొడవ ఏంటి? అప్పు ఇచ్చినవాడు, అల్లుడు, అద్దె ఇంటి యజమాని, జీతమిచ్చేవాడు, కులవినో పన్నులు కూర్చేవాడు, వీళ్ళందరూ మగవాడికి పుస్తె కట్టని భర్తలే! అందులోను అల్లుళ్ళ బాధ చెప్పనవసరం లేదు. పూర్తిగా ముడుపులు ముట్టేదాకా పుస్తె చేత్తో ముట్టడు. ఏదో దాచి ఉంచిన దాన్ని అడుగుతున్నట్లుగా అలుక పాన్పు ఎక్కి కూర్చుని ఏవేవో కోరికలు కోరతాడు. గర్భదానం మాట వినగానే బిర్ర బిగిసికొనిపోయి, లంచం తెమ్మంటాడు. ఆ తర్వాత ప్రతి పండుగకూ తండ్రి తద్దినంలాగా వచ్చి కావలసినవి పట్టుకు పోతాడు. అల్లుణ్ణి, ఆడబడుచుల్నీ, ఆటగత్తెల్నీ

తృప్తి పరచగలిగిన వాళ్ళీ ప్రపంచంలో లేరు. ఇన్ని మాటలెందుకు? అప్పిచ్చిన వాణ్ణి, అధికారిని మించి అల్లుళ్ళు పెట్టే బాధల్ని భరించలేకే హరిహర బ్రహ్మాదులు కూడ ఆడపిల్లల్ని కనలేదు అంటూ వ్యధ చెందుతారు.

మళ్ళీ ముందులాగే ఆలోచించి మనసు పాడు చేసుకుంటున్నారు. ఒంటి గంటయ్యింది. స్నానం చేసి భోజనానికి రండి అని భ్రమరాంబ పిలుస్తుంది. ఒక్కక్షణంలో స్నానం చేసి వస్తాను. వడ్డించమని చెప్పు పెద్దమ్మాయి ! పేరయ్య వస్తే కూర్చోమను అని లోపలికి వెళతారు.

చెల్లెల్ని తమ తల్లిదండ్రుల మాటలన్నీ విన్నాక ఏమనిపిస్తోందని కాళింది అడుగుతుంది. కూర్చున్నదల్లా చివాలున లేచి, చెప్పమంటావా? తండ్రికి కట్నం బాధ, తల్లికి వియోగం మనకింకొకరి ఇంట్లో దాస్యం చేసే బాధ - ఇన్ని బాధలున్న ఈ ఆడపుట్టుకే పుట్టకూడదనిపిస్తోంది అంటుంది కమల. కాళింది సంతోషంతో చెల్లెల్ని కౌగలించుకుని చాలా బాగా చెప్పావని మెచ్చుకుంటుంది. కాపురం ఉండే ఇల్లమ్మి కట్నాలిస్తే తప్ప పెళ్ళిళ్ళు కాని ఈ చెడ్డకాలంలో అడవుల్లో పుట్టవచ్చు తప్ప రాజుకు కూడా ఆడపిల్లగా పుట్టకూడదు. అలా పుడితే పుట్టినపుడే చచ్చిపోవాలి. అదే మంచిదంటుంది. అక్క మాటల్తో చెల్లెలికొక సందేహం పుడుతుంది. వేశ్యకు వెండి నాణెమే భర్త కదా ! అలాగే ఇప్పటి కర్కశులకు కట్నాలే భార్యలు కదా ! వేశ్య డబ్బు తీసుకోవడంవల్ల వెలయాలైతే మరి వెల తీసుకుని పెళ్ళి చేసుకునే వీళ్ళు వెలమగలు అవరా? అని తప్పక అవుతారు అని చెప్తూనే మనం చేయగలిగింది ఏమీ లేదా? అని ప్రశ్నిస్తుంది కాళింది.

లేకేం శరీరం అశాశ్వతం కదా! క్షణంలో నశించే ఈ జీవితం కోసం, ధనమిచ్చి భర్తల్ని కొనుక్కుని వారికి దాస్యం చేయటం కంటే, పెళ్ళే వద్దని, హాయిగా రాట్నం తిప్పుకుంటూ యోగినుల్లాగా బతికితే సుఖపడమా? మన తండ్రి దీక్షను కూడా కాపాడిన వాళ్ళం కాకపోతామా? అంటుంది కమల. వయసుకు చిన్నదానివైనా వరహాల ఎత్తు మాట్లాడావని చెల్లెల్ని మెచ్చుకుని, ప్రతిజ్ఞ ఒకటి చేస్తుంది కాళింది. - "ప్రాణాలనైనా విడవడానికి తయారవుతానే కానీ, ధనమిచ్చి భర్తను కొని తెచ్చేటటువంటి పెళ్ళికి ఒప్పుకోను. ఇది నా రాట్నం మీద ఆన". కమల ఎవరో వస్తున్న అలికిడి విని అక్కను మాట్లాడవద్దని హెచ్చరిస్తుంది. పేరయ్య ప్రవేశించి పంతులుగారేం చేస్తున్నారని అడుగుతాడు. కాళింది మీ పేరేంటని అడిగితే, పేరయ్య తనకొక సరైన పేరులేదనీ, చిన్నప్పుడు పేరదనీ, పేరిగాడనీ అనే వారనీ, కాస్త వయసు ముదిరాక పేరన్ననీ, పేరయ్యనీ పిలిచేవారనీ, ప్రస్తుతం పేరి శాస్త్రులనీ, పేరి భొట్లనీ, పేరావధాన్లనీ, పేరిచైన్లనీ, అంటున్నారని ఇక ముందు ముందు ఏమంటారో ఈశ్వరుడికే తెలియాలని అంటాడు. కాళింది తండ్రి భోజనం చేస్తున్నారని, వచ్చేదాకా కూర్చోమని కుర్చీ చూపిస్తుంది. పేరి శాస్త్రులు ఇంకా భోజనం కాలేదా? అంటూ బజార్లో పంతులు గార్ని కలిశాక, పండా కొండయ్య గారింట బారసాల సంభావన పుచ్చుకొని, వంకాయలూ, విస్తళ్ళూ కొనుక్కుని మరొక ఇద్దరితో మాట్లాడి, ఇంట్లో స్నానం జపం తపం కానిచ్చి భోజనం చేసి, మంచి శకునం కన్పించాక వచ్చానని చెప్తాడు. పురుషోత్తమరావుగారి పోలికల్ని గుర్తించి ఆయన కూతుళ్ళను పేర్లు అడుగుతాడు. కాళింది తన పేరని, చెల్లెలు పేరు కమలని చెప్తుంది. ఏం చదువుకుంటున్నారని అడగ్గానే ఇదివరకు ఆంగ్లం ఇప్పుడు హిందీ, సంస్కృతం అని జవాబిస్తారు. హార్మోనియం వాయించడం అల్లిక, కుట్టూ మొదలైనవి వచ్చా? అని అడుగుతాడు. ఇలా అడిగినానని ఏమి అనుకోవద్దనీ ఈ రోజుల్లో పెళ్ళి కూతుళ్ళకు కావాల్సిన లక్షణాలు ఇవేననీ చెప్తాడు.

పురుషోత్తమరావు గారు వచ్చేసరికి సిద్ధంగా ఉన్న పేరయ్యను చూసి, ఎండ తగ్గిన తరువాత వస్తారని ఎదురు చూశానంటారు. పేరయ్య పురుషోత్తమరావు గారు కోరినందువల్ల నిద్రకూడా విడిచి వచ్చానంటాడు. అమ్మాయిల్ని చూపించి వాళ్ళకే పెళ్ళి కావలసి ఉందని చెప్పి, వాళ్ళను తల్లిని పిలవమని చెప్తారు. వాళ్ళు లోపలికి వెళ్ళగానే, పేరయ్య పురుషోత్తమరావులు సంభాషణలోకి దిగుతారు.

పేరయ్య గోత్రం అడుగుతాడు. లోపల్నించి వచ్చిన భార్యతో తమ కోసం నిద్రమానుకుని పేరయ్య వచ్చినందుకు సంతోషాన్ని వెలిబుచ్చుతాడు పురుషోత్తమరావు. సంబంధాలేవైనా ఉన్నాయా అని అడిగిన భ్రమరాంబతో సంబంధాలు ఎన్నో ఉన్నాయనీ అయితే, వెల్తిలేని సంబంధం వెతకాలి కదా! అని అంటాడు పేరయ్య. పురుషోత్తమరావు తాను వరకట్నానికి వ్యతిరేకిననీ, ఆ దురాచారాన్ని రూపుమాపటం కోసం పదేళ్ళనుంచి కష్టపడుతున్న కారణంగా కట్నాలు ఇవ్వటం ఇష్టంలేదని చెప్తారు. పేరయ్య మధ్యలో ఆపి, పదేళ్ళ నుంచి కష్టపడుతున్నా ఒక్కళ్ళనైనా మాన్పగలిగారా? మచ్చుక్కి ఒక్కరు కూడా మానరు. వేలెడుండే కుర్రాడికి వేలల్లో వేలం పాటలున్నాయి.

పిచ్చిగా ఆలోచించవద్దు. మా అబ్బాయికి కట్నం ఎక్కువ వచ్చిందంటే గొప్ప, ఎవరు మానతారు? అమలాపురంలో అంబయ్య గారిలాగే భీష్మించుకుని కూర్చుంటే కన్య సమర్తాడటం, అతణ్ణి వదిలెయ్యటం, ఆఖరికి ఒక బ్రహ్మ సమాజంగాడికిచ్చి పెళ్ళి చేయటం జరిగిందని చెప్తాడు. వరకట్నం లేని సంబంధం దొరకనే దొరకదా ! అని ప్రశ్నిస్తారు పురుషోత్తమరావు. ఎన్ని సంవత్సరాలు తపస్సు చేసినా లభించదనీ చెవి కోయించుకుంటాననీ, ఈ మధ్య పెద్ద ఇళ్ళల్లో బల్లమీద రేట్లు రాయిస్తున్నారనీ చెప్తాడు. కొన్ని రోజుల తర్వాత అంగటిలో వస్తువుల్లాగా మగపిల్లల ముఖాలకు ధరలు రాసి అంటిస్తారేమో? నని అనుమానపడ్తాడు. దేశపరిస్థితికి చింతిస్తారు పురుషోత్తమరావు. దీనికే ఆశ్చర్యపోతే కమ్మవారి కథ ఏంటంటాడు పేరయ్య. వరహాల లెక్క అక్కడ పుట్ల భూమిలోకి మారిందంటాడు. ఇద్దరు పిల్లల తండ్రికి 20 పుట్లతో ఇటీవలే పెళ్ళి అయ్యిందట. 46 ఏళ్ళ నలుగురు పిల్లల తండ్రికి 40 పుట్ల భూమి నలభై తులాల గోవతాడు 4 తులాల చుట్లూ, నాలుగు జతల యెడ్లూ, రెండు బళ్ళూ, 10 వందల గజాల పాటిమన్నూ, 30 బళ్ళ ముక్కిన పెంట, వియ్యపురాలికి 6 పాడి గేదెలు, వియ్యంకుడికి 5 బళ్ళ గోగునార ఇచ్చారు. బ్రాహ్మణుల ఇంట పుట్టి కోమట్ల ఇంట ముద్దులు గుడిచి, కమ్మవారింట గౌరవం పొందుతోంది ఈ కట్నం అంటూ ఉపన్యసిస్తాడు పేరయ్య.

అదంతా సరేకానీ మంచి సంబంధాలు చెప్పమంటుంది భ్రమరాంబ. చెప్తానుకానీ, ఇద్దరికీ ఈ సంవత్సరమే చేస్తారా? అని అడుగుతాడు. సంబంధం కుదిరితే తప్పక చేయవచ్చుని, మొదట కాళింది గురించి ఆలోచించమని చెప్తుంది భ్రమరాంబ. ఎటువంటి సంబంధం కావాలి? పిల్లవాడికి చదువు. చక్కదనం, డబ్బు, సంప్రదాయం నాలుగూ ఉండాలా? ఉంటే ఏది ముందు? ఏది తర్వాత? అని అడుగుతాడు పేరయ్య. పురుషోత్తమరావు తనకు చదువు, సంప్రదాయం పైనా, తన భార్యకేమో, చక్కదనం, సంపదపైనా మనస్సుందనీ, ఇద్దరి కోరికలు తీరేలా చూడమని అడుగుతారు. నాలుగు ఉన్నవాణ్ణి తానుకాదు కదా తన్ను సృష్టించిన బ్రహ్మకూడా తేలేడని పేరయ్య చెప్తాడు. అటువంటి స్థితిలో తాను కోరినవే సరి అంటుంది భ్రమరాంబ. బిఏ చదివినా బంట్రోతు ఉద్యోగం దొరకదు. సంప్రదాయం అంటే అయిన కుటుంబాలన్నీ అడుగంటాయనీ, డబ్బులేని వాడు ఈ కాలంలో శ్మశానంలో మొలిచిన తులసి మొక్క అనీ చెప్తుంది. ఆ మాటల్ని మెచ్చుకుంటూనే పేరయ్య కలిగిన వాళ్ళయితే కట్నం ఎక్కువ అవుతుందంటాడు. భ్రమరాంబ సమయాన్ననుసరింపక తప్పదు కదా! అంటుంది. మంత్రి ప్రగ్గడ మాధవరావు గారి కొడుక్కు మాన్యాల మీద రెండువేలు వచ్చినా, అతనికి అడ్డతల అనీ, పచ్చమట్ట బాపిరాజు గారి పిల్లవాడికి పన్నెండు వందలున్నా రంగు బాగులేదనీ, నాదెళ్ళ వారి కుమారుడికి ఐదువందలు వస్తాయంటే అది తగిన ఆదాయం కాదనీ, మంజులూరి ముత్తయ్యగారి దత్త పుత్రుడు పొట్టి అనీ-అంటుంది భ్రమరాంబ. అలా ఎంచితే అసలు పెళ్ళి కొడుకులే దొరకరంటారు పురుషోత్తమరావు. భర్త అభిప్రాయంతో ఏకీభవించక, ఆడపిల్లల్ని ఇచ్చేటప్పుడు తగిన వాళ్ళను వెతకవద్దా? అంటుంది భ్రమరాంబ. పేరయ్య ఆమెను సమర్థిస్తూనే, ఆమె మనస్సులో ఉన్న సంబంధం గురించి అడుగుతాడు. ఆమె సింగరాజు లింగరాజు గారి కుమారుడంటుంది. పురుషోత్తమరావు పిల్లవాడు మంచివాడైనా తండ్రి మూడో సంబంధం గురించీ, అబ్బాయి వయస్సు గురించీ సందేహిస్తారు. పేరయ్య రెండూ పట్టించుకోకూడదంటాడు. ఇంట్లో దీపం పెట్టడానికి ఎవరో ఒకరనీ, ఆ పిల్లవాడు తమ పిల్లకన్నా రెండు మూడేళ్ళు పెద్ద అనీ చెప్తాడు. మరీ గొడవ వస్తే జాతకాలు మార్పు చేయించవచ్చంటాడు. వయసు, వావి, ఇల్లు, ఇంటి పేరు, గోత్రం ఏదీ లెక్కలోకి రాదనీ ఆస్తి ఒక్కటే లెక్కలోకి వచ్చేదని చెప్తాడు. భ్రమరాంబ తన భర్తకు తనకు మూడు ఏళ్ళు తేడా అంటుంది. పురుషోత్తమరావు గారు కాళిందికి ఆ సంబంధాన్ని మాట్లాడమంటారు. పేరయ్య అమ్మాయిల ఆస్తి గురించి అడుగుతాడు. తాతగారిచ్చిన పది ఎకరాలూ అమ్మాయిలదేనని చెప్పగానే, మరి ఇక ఆలస్యం అక్కర్లేదు, త్వరగా పెద్దమ్మాయి సంబంధం చూస్తానని చెప్పి బయలు దేరుతాడు. లింగరాజు గారి సంబంధం కుదిరిస్తే అతణ్ణి సంతోషపెట్టే బాధ్యత తమదంటుంది భ్రమరాంబ.

## 2.3. ద్వితీయాంక కథ :

లింగరాజు తన వ్యాపారపు గదిలోకి ఆయాసంతో ప్రవేశిస్తాడు. పిడకలు, వంట కట్టెలు, పీటలు, చేటలు లెక్క చూసుకుని, పొయ్యిలోకి బొగ్గులు లెక్కించి పాదులుకుండే కాయల్ని లెక్కపెట్టి దూడపాలు విడిచేదాక విలబడి, కొబ్బరికాయల్ని లెక్కపెట్టి ఈ వేళకు ఇంటిలో కాలు పెట్టగలిగాను, ఇంక స్థిమితంగా కూర్చుని గడువు తీరిపోయే కాగితాలు ఏవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. వాయిదా

అయిపోయిన పత్రాలకు, వడ్డీలు పంపని వాళ్ళకు వణికేలాగా నోటీసులు రాయాలి. ఈ పూట కోర్టులో ఏవైనా హియరింగులన్నాయేమో చూసుకోవాలి. ఏదైనా సరే కాస్త ఏమరుపాటుగా ఉంటే దెబ్బతినక తప్పదు. పనివచ్చినపుడు ప్రాణాలయినా వదులుకోవచ్చు కానీ డబ్బు వదులుకో కూడదు. ప్రాణంలో ఉన్నది గాలి మాత్రమే. డబ్బు అలాంటిదా? అందులో లోకమే ఇమిడి ఉంది. అయితే 'ధన మూలమిదం జగత్' అంటారు పెద్దలు. కులంలోను, గుణంలోను లోపం ఉంటే అది సర్దుకోవడానికి పనికి వచ్చేది డబ్బు, వరకట్నాలు, సభా కట్నాలు ఇవ్వడానికి ఉపయోగ పడేది డబ్బు. మున్సిపల్, లోకల్ ఏ ఎన్నికలైనా గెలవడానికి కావల్సింది డబ్బు. మడులు, మాన్యాలు, కొంపలు ఏం కావాలన్నా డబ్బు కావాలి. అంత గొప్పదైన ధనాన్ని పొట్టకు, బట్టకు, చుట్టకు, ఖర్చు పెట్టేవాళ్ళకు మతి లేదనే చెప్పాలి. సంపద పెంచుకోడానికి ఎంతో తెలివి కావాలి. తలలు మార్చయినా, మూటలు విప్పయినా, కొల్లగొట్టయినా సరే సంపద కూడపెట్టాలి. ఆస్తి భార్య పేర రాయించి దొంగ దివాలా తీయాలి. వడ్డీకి వడ్డీ వసూలు చేయాలి. రాత్రుళ్ళు మేలుకొని రామకీర్తనలు పాడుతూ కొంప కాపాడుకోవాలి. అప్పు తీసుకున్న వాళ్ళ ఆస్తంతా వచ్చిచేరేదాకా నిద్ర పోకూడదు. దొంగ లెక్కలు రాసి దొరల కంట్లో దుమ్ముకొట్టి, పన్నులు మాన్పుకోవాలి. ఇన్ని మాటలు ఎందుకు పరువు ప్రతిష్ఠ పట్టించుకోకూడదు. పొట్టకు కూడా ఖర్చు పెట్టకూడదు. బంధువులు వచ్చినా మాట్లాడకూడదు. ఒక విస్తరి ఇంట్లో ఎక్కువగా వేయకూడదు. కష్టపడుతున్న వాళ్ళను చూసి బాధపడకూడదు. అప్పు చేస్తే తిప్పించుకోకుండా ఇవ్వకూడదు. భార్యకు కూడా పెట్టె తాళాలు ఇవ్వకూడదు. వేయి అబద్దాలకైనా వెనుకాడ కూడదు. ఇన్ని రకాలుగా కాపాడకపోతే డబ్బు దక్కదు. ఇలా కాపాడితే గాని ఇంటా బయటా మర్యాద లేదు. డబ్బులేకపోతే పలుకుబడి లేదు. అసలు బ్రతుకే లేదు. ఈ కాలం వెర్రివాళ్ళు పత్రికలు, పరిశోధనలు, సంఘ సంస్కరణలు, సహాయ నిరాకరణలు, స్వాతంత్ర్యం అంటూ లేనిపోని గొడవలు తెచ్చి పెట్టుకుని కష్టపడతారే కానీ, ఒక్కరైనా వడ్డీలు పెరిగే విధానం గురించి ఆలోచించే వాళ్ళు లేరుకదా! కలువు లాగ కంచెలపై పాదులాగ, నాచులాగా వడ్డీ కంటే గొప్పది ఏదీ లేదు. నిజం కన్న అబద్దం తియ్యగా ఉంటుంది. భార్య కన్నా, పిల్లల కన్నా, ముండ పిల్లలు తీపి. జీతం కన్నా లంచం తీపి. ఈ ప్రపంచంలో అన్నిటికన్నా అసలు మీద వచ్చే వడ్డీ తీపి అని డబ్బు గురించీ ఆలోచిస్తూ గబుక్కున్న ఆనాడు పొద్దున్న లక్ష్మీ ప్రార్థన చేయలేదన్ని గుర్తుకు తెచ్చుకుని లెంపలు వేసుకుని ప్రార్థన చేస్తాడు. ఇనప్పెట్టె ముందు నిలుచుండి. చేతులు జోడించి ఒక దండకం చదువుతాడు. తల్లీ బిడ్డ, భార్య, దేవుడు, మోక్షం అన్నీ ధనమే. డబ్బుకోసం నిద్రాహారాలు మానవచ్చు. అసత్యం ఆడవచ్చు డబ్బు కోసం ఏదైనా చేయవచ్చు అంటూ తన ఇనప్పెట్టె ఆలయంగా, తన ప్రాణాలు పూజా సుమాలుగా, శరీరమే నైవేద్య కుంభంగా తన ఇంటినే ఉండమని వేడుకొంటాడు.

లింగరాజు సేవకుడు ఘంటయ్య ప్రవేశించి వంటసామాను అడుగుతాడు. అంత తిండియావ పనికి రాదనీ, ఎవరైనా భోజనానికి పిలుస్తారేమో చూద్దామనీ చెపుతాడు. రాత్రి పద్దులు రాసుకోమని ఘంటయ్య వివరాలు చెపుతాడు-మానెడు బియ్యం, వంటకట్టెలు మూడు, పిడకలు రెండు, సగం చీల్చిన నిప్పుపుల్ల, ఉద్దరిణెడు ఉప్పు, ముందురోజు చింతపండు పులుసు తుక్కు, మిరపకాయలు మూడు, అమ్మవారికి టెంకా, అబ్బాయికో ముక్కా మాగాయ, లింగరాజుకు గరిటెడు, అతని కొడుకుకు అరగరిటెడు గంజి, మిగిలినది చద్దన్నంలో, అని లెక్క చెప్పి, తాను మాత్రం బైటనుంచి బంగాళదుంప కూర తెచ్చుకున్నానంటాడు. లింగరాజు కాకిగూడు పడగొట్టి వంటచెరకు తెచ్చుకోమంటాడు. అటువంటి పాపపు పన్లు తన చేత చేయించవద్దంటాడు ఘంటయ్య.

దరిద్రం ఎక్కువైన ప్రతివాడూ ధర్మ పన్నాలు చెప్పేవాడే అని విసుక్కుంటాడు లింగరాజు. అయినా కొడుకు పెళ్ళి అయి కోడలు వచ్చేదాకా తీసి వేయడం, ఉద్యోగంలోంచి కుదరదని బాధ పడతాడు.

లింగరాజు కొడుకు బసవరాజు ప్రవేశించి తల్లికి, బండికట్టిన వాడు అద్దె అడుగుతున్నాడంటాడు. 'ఇంట్లో లేనని చెప్పక పోయావా?' అన్న తండ్రితో అబద్దాలు ఆడకూడదని గురువులు చెప్పారంటాడు. కలం కొని ఇమ్మని అడిగిన కొడుకును అలుకపొన్నుమీద అడగమని సలహా ఇచ్చి, బండివాడికి నచ్చ చెప్పి వెళ్ళమంటాడు. అది తనవల్ల కాదని వెళ్ళిపోతాడు బసవరాజు.

లింగరాజు స్వగతంగా ఇలాగ అనుకుంటాడు- "ఆ వన్నెల విసనకర్ర సంగతి అలాగ, ఈ కుర్రవాడి సంగతి ఇలాగ ఉంది. టీచర్లు కలాలు, కాగితాలు అంటూ ఖర్చు చేయించటం వల్లే గాంధీగారు చదువుకు స్వస్తి చెప్పమంటున్నారు. అయినా ఈ రోజుల్లో చదువుకునే వాళ్ళకే కట్నం. ఆ కట్నం కోసం కాకపోతే మరెందుకని పెంచుతున్నట్టు నాకైతే మొదటి పెళ్ళికి 2 వేలు, రెండోపెళ్ళికి 4 వేలు, 3 వ పెళ్ళికి

8 వేలు మొత్తం 14 వేలు కట్నం వచ్చింది. అదేం పాపమో కానీ ఈ కుంకకు వెయ్యి, రెండువేలు ఇస్తామనే వాళ్ళే తప్ప, పట్టుమని పది ఇస్తామనే వాళ్ళులేరు. ఆ కుంక తలుపు తీసిపోయాడు, ఎవరో వస్తున్నట్లుంది" అనుకుంటూ బయటకు వెళ్తాడు.

అంతలో పేరయ్య అతన్ని దీవిస్తూ ప్రవేశిస్తాడు. ఏదో పనిమీదే వచ్చి ఉంటావనుకుంటానంటాడు లింగరాజు. పేరయ్య, అతనితో తిన్నగా విషయం చెప్పటం ఇష్టంలేక అప్పుకావాలంటాడు, లింగరాజు తొమ్మిదణాల చొప్పున వడ్డీ ఇమ్మంటాడు. ముప్పాలా ఇచ్చేవారున్నారా అంటే చివరకు పావలా అర్ధణాకు ఒప్పించమంటాడు. కాగితాలు తెప్పిస్తాననీ, రూపాయ వడ్డీకి ఒప్పిస్తాననీ, తన కమీషన్ తగ్గించకూడదనీ పేరయ్య చెప్తాడు. అనువు చూసుకుని అబ్బాయికింకా పెళ్ళి చేయలేదేమని ప్రశ్నిస్తాడు. లింగరాజు సంబంధాలు వస్తున్నాయని చెప్తానే, పేరయ్యను ఒక మంచి సంబంధం చెప్పమంటాడు. పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారి పెద్ద కుమార్తె అందం గురించి చెప్తాడు. లింగరాజు పేరయ్యతో, అందం చదువు ఎందుకుగాని తిండి తక్కువ తినాలి, పనంతా చెప్పకుండా చేయాలి, కొట్టినా పడాలి-అలాంటి పిల్ల కావాలంటాడు పేరయ్య. అన్ని లక్షణాలు ఉన్నా కట్నం దగ్గరే గొడవ అంటాడు. వేయి రూపాయల బాలతొడుగు, 500 వచ్చే మాన్యాలు ఉన్నాయంటాడు. లింగరాజు, కట్నం లేకపోతే మర్యాద కాదంటాడు. పేరయ్య, గౌరవార్థం ఏదో కొంచెం అడగవచ్చంటాడు. ఒక మేడ, పది ఎకరాల పొలం తప్ప నాన్ కోఆపరేషనులో ఉద్యోగం వదిలేసిన, పురుషోత్తమరావు వద్ద మరేం లేవంటాడు. అటువంటి గొప్పవాళ్ళను కష్టపెట్టకూడదనీ, అందువల్ల ఆ పదెకరాల నేల, 1116 రూపాయలు, వెండిచెంబు, కంచం వంటివి ఇమ్మని చెప్పమంటాడు లింగరాజు. పేరయ్య ఆ సంబంధం కుదరదనీ, 1116 లకైతే కుదురుస్తాననీ అంటాడు. లింగరాజు ఎలాగైనా ఏదో కాస్త రాబట్టి తాను తిని, మరొకరికి దక్కనివ్వాలని బోధచేస్తాడు. కట్నం ఇవ్వనంటున్న పురుషోత్తమరావుగారిని ఏదో పనిమీద రప్పించి వీరయ్యతో బేరం పెట్టించి, మూడువేలు సాధిస్తానని పేరయ్యా; కాదు 5 వేలని లింగరాజు మాట్లాడుకుంటారు. కట్నం 5 వేలకు, పేరయ్యకు 500 కు బేరం కుదురుతుంది. ఆడపిల్లకు పెట్టే సొమ్ముల్ని గురించి అడిగితే 5 వేలకు సొమ్ములు చేయించే ఉంచానంటాడు. పేరయ్య వెళ్ళాక, పది ఎకరాల భూమి, 10వేలు, బాలతొడుగు వేయి, కట్నం 5 వేలు మొత్తం 16 వేలు. లాంచనాలు, అలుకపాన్పు, ఆషాఢపట్టి, గర్భదానపు బెట్టు, ఇంకా ఎన్నో ఉన్నాయనీ, దేవుడి దయవల్ల ఈ పెళ్ళికుదిరితే లాటరీ తగిలినట్లు డబ్బు వస్తుందనీ, ఇంటిపనులన్నీ చేయగలది కాబట్టి పనివాడిని మాన్పించవచ్చనీ లింగరాజు సంతోషిస్తాడు.

**2.4.1. తృతీయాంకం - మొదటి రంగం కథ :** లింగరాజు పడక గదిలో అతని భార్య సుభద్ర పుస్తకం చదువుకుంటూ ఉంటుంది. దాన్ని చటుక్కున మూసి వేస్తుంది. చదువుతూన్న పుస్తకంలోని పాత్రలను ఉద్దేశించి- విమలా, విజయులదే వివాహమని అంటుంది. సమానమైన వయస్సు, రూపం లేని వాళ్ళ దాంపత్యం సరిగా ఉందని అంటుంది. డబ్బుకు ప్రాధాన్యమిచ్చి దంతాలు ఊడిన వాడికైనా కూతుళ్ళను కట్టపెట్టే తల్లిదండ్రులు ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో, ఆడదానిగా పుట్టేకన్నా అడవిలో మానై పుట్టటం మంచిది అనుకుంటుంది. ముదివయసుకు తోడు పీనాసితనం కూడా ఉంటే తనకు లాగే అవస్థలు తప్పవంటుంది. తన భర్త లాంటి భర్త పగవారికి కూడా వద్దంటుంది. నగలంటే నవ్వులతో కాలం గడుపుతాడు. కోక కొనమంటే గొల్లుమంటాడు. పుస్తకం అడిగితే డబ్బు లేదంటాడు. కాగితం అడిగితేనే కోపపడతాడు. తాంబూలం వేసుకుంటే విసుక్కుంటాడు. కానికి పువ్వులు కొన్నా కస్సుమంటాడు. వ్రతం చేస్తానంటే ఏడుస్తాడు. ముష్టి పెడితే నెత్తి మొత్తుకుంటాడు. పండగ పబ్బాలకైనా పిండివంట అనే మాట అంటే భగ్గుమంటాడు. ఎంత సాధ్వి అయినా ఇటువంటి మొగుడితో ఎలా కాపురం చేయగలదు? అని బాధ పడుతుంది. అంతే కాకుండా లింగరాజు గురించి మళ్ళీ ఇలా అనుకుంటుంది- జడవేసుకుంటే సానివా? అనీ, చీర కట్టుకుంటే షోకా? అనీ అంటాడనీ, వంటవాడిని పిలిస్తే వెంటనే వస్తాడనీ, పొలితో మాట్లాడితే పొంచి వింటాడనీ, చదివినా రాసినా జగడమేననీ, పెరటిలోనికి వెళ్ళినా అనుమానమనీ, గడపదాటితే తనకొడుకును వెంట పంపిస్తాడనీ, ఇటువంటి చేష్టలు సరా? అంటే, పెంకిదానివంటాడనీ, అటువంటి మగడితో కాపురం కఠినమనీ బాధ పడుతుంది. ఇక సంసారం గురించి ఆలోచించవలసిన అవసరమే లేదంటుంది. పుడకలు, పిడకలు భోషాణంలో దాచి లెక్కపెట్టి ఇస్తాడు. ఉప్పు, పప్పు తన గదిలో ఉంచుకుని తూచి ఇస్తాడు. పెరటిలోని కూరల్ని బైట అమ్మించి చచ్చు పుచ్చులే ఇంటికి ఇస్తాడు. వండినదంతా తిని, మిగిలిన వాళ్ళకు అంట్లే మిగులుస్తాడు. తిరుగుతుండగానే దీపం ఆర్పేస్తాడు. మాట్లాడేలోపు అరుస్తాడు. అటువంటి మొగుడితో కాపురం ఎంతటి సాధ్వికైనా కష్టమే! అని బాధపడుతుంది.

'వెన్నెల విసనకర్ర ఏం చేస్తోంది' అంటూ లింగరాజు ప్రవేశిస్తాడు 'ఏం చేస్తోందంటే ఉసూరుమని ఏడుస్తోంది' అంటుంది సుభద్ర. 'ఎప్పుడూ ఏదో ఒక వంకన కోపం, చిరాకే తప్ప ఏనాడైనా సంతోషం ఉందా?' అని అడిగిన భర్తకు చచ్చాక అని సమాధానమిస్తుంది. ఎవరి

చావు అనగానే మీకు చావులేదు, ఇంకా ఎన్ని కట్నాలు పుచ్చుకోవాలో ఎవరి గొంతుకలు కోయాలో అంటుంది. కట్నాల మాట ఎటుంచినా ఇకతాను జన్మకు పెళ్ళి చేసుకోననీ, బుద్ధి వచ్చిందనీ అంటాడు. డబ్బును చూసి ఎవరో ఒకరికి పిచ్చి పుట్టి పెళ్ళి చేస్తామంటే సిగ్గు వదలి చేసుకుంటావని భర్తను దెప్పుతుంది. ఆ అదృష్టం వస్తే చూసుకుందాం కానీ, నామీద కోపం ఏంటని అడిగిన భర్తకు, అతనిమీద కోపం లేదనీ, మెడలు వంచి ఆ పెళ్ళి చేసిన తండ్రిమీద మాత్రమే కోపమనీ సమాధానం చెపుతుంది. చదువు, వయసు, పరువు దేన్ని గురించీ ఆలోచించకుండా డబ్బే ముఖ్యం అనుకుని పిసినారికి ఆడపిల్లల్ని కట్టపెట్టే తల్లిదండ్రులుండగా, తల్లే మెడ కోసినట్టు మరి ఎవరినైనా ఏమి అనగలం? అని ప్రశ్నిస్తుంది. భర్త దైవంతో సమానం కదా ! తేలికగా మాట్లాడవచ్చా? అని అడిగిన భర్తను, అర్ధాంగి అయిన ఆలికి అన్నం పెట్టకుండా కూడపెట్టి తీసుకుపోయే వారెవరైనా ఉంటారా? అని ఎదురు ప్రశ్నిస్తుంది.

సంపాదించే వాడెవ్వడూ ఖర్చుపెట్టడని లింగరాజు రహస్యం చెపుతాడు. చెట్టునాటే వాడు వేరు పండు తినేవాడు వేరు. ఇల్లుకట్టేవాడు వేరు కాపురం ఉండేవాడు వేరు. ఆస్తికోసం తగాదా పడేవాడు వేరు, వచ్చిన ఆస్తిని మింగేవాడు వేరు. అలాగే ధనం చేర్చే వాడొకడు దాన్ని ఖర్చు పెట్టేవాడొకడు. వేశ్యను ఉంచుకునేవాడు, సుఖాన్ని అనుభవించేవాడు వేరు. ఇది ప్రపంచ ధర్మం. తను చెప్పే విషయం వినమని అడిగిన భార్యతో వివాదాలు వద్దనీ, ఒక శుభవార్త చెప్పడానికి వచ్చానని అంటాడు. ఎవరైనా అప్పుకోసం వస్తున్నారా? అని అడిగినపుడు కొడుకుకు పెళ్ళి కుదిరిందని పురుషోత్తమరావు పుత్రిక అని చెపుతాడు. కాళింది, కమల ఎవరైనా కట్నమే కదా ముఖ్యం అంటుంది సుభద్ర. భర్త క్షౌరం చేయించుకోవటం గురించి అడుగుతుంది. తన ప్రాణం పోయాక అంతా ఆమె క్షౌరానికే సరిపోతుందని చెప్పగానే ఎందుకు బాధ డబ్బు నెత్తిన పెట్టుకునే పొమ్మంటుంది. అదిగొప్ప అదృష్టమనీ, సంపద గొప్పతనం తెలియకే బ్రహ్మ చావులేని జీవితాన్ని ఇవ్వలేదనీ, కనీసం పోయేటప్పుడు సంపదను వెంట తీసుకుపోయే మార్గం కూడా చూపలేదనీ బాధపడతాడు.

**2.4.2. రెండవ రంగం కథ :** లింగరాజు గారి ఇంట్లోని కచేరి చావడిలో లింగరాజు, పురుషోత్తమరావు, బసవరాజు, పేరయ్య, వీరయ్యలు కూర్చుని ఉంటారు.

లింగరాజు మున్నంగి వారికి తమ కుటుంబానికి మూడు తరాలుగా సంబంధం ఉందంటాడు. మూర్తిరాజుగారు ఆ సంగతులన్నీ గుర్తుతెచ్చుకుని ఉత్తరం కూడా రాశారంటాడు. అంతలో మాటలందుకొని వీరయ్య మూడు వేల కట్నం, మూడు తరాల బాంధవ్యానికి తోడంటాడు. వీరయ్యను విసుక్కుని ఆ మూడు వేలు తామే ఇవ్వగలమంటాడు పేరయ్య. మీరేం ఎక్కువ అనలేదు కదా! అంటే పురుషోత్తమరావు మరొక 500/- కలుపుకోమంటాడు. పేరయ్య, వీరయ్యలు పురిఎక్కించి వేలం పాటను అయిదువేల దాకా పెంచుతారు. పేకలో ఒకులు, నడివీధిలో బట్టలు లాగే పెళ్ళికొడుకును గురించి బేరాలు చేస్తున్నారని తనలో తానే అనుకుంటాడు బసవరాజు. బేరం కుదరదని చెప్పి పురుషోత్తమరావుతో బయటికి వెళ్తాడు పేరయ్య. లింగరాజుతో, బేరం చెడదుకదా, తన పాఠం తాను బాగానే చెప్పాను కదా అని వీరయ్య అడుగుతాడు. కోర్టుల్లో బ్రతికే వాళ్ళకు ఆ మాత్రం అలవాటు ఉంటుందిలే అంటాడు. బసవరాజు ఇదంతా ఏదో కుట్ర కాబోలనుకుంటాడు.

పేరయ్య, పురుషోత్తమరావుతో వీరయ్య లేకపోతే తప్పక సంబంధం కలిసేదనీ, అయిదువేల దాకా వచ్చినా, అటువంటి పిల్లవాడు వేరే దొరకడనీ అంటాడు. మరొక అయిదు వందలదాకా ఇవ్వవచ్చనీ, అయితే భ్రమరాంబను సంప్రదించే అవకాశం లేదనీ అంటాడు పేరయ్య. లింగరాజుతో తమకు ఆ సంబంధం ఖాయం చేయమనీ, మరొక అయిదు వందలు ఎక్కువ ఇస్తాననీ అంటాడు పురుషోత్తమరావు. వీరయ్య అడ్డు పడతాడు. పేరయ్య పురుషోత్తమరావు దగ్గర్నుంచి రూ 10/- లింగరాజుకు ఇప్పించి బజానా రాయిస్తాడు. లింగరాజు, పురుషోత్తమరావు కుమార్తె కాళిందికి, తన కుమారుడు బసవరాజుకు 5000 కట్నం, రవ్వల ఉంగరం, వెండి చెంబు, కంచం, పావకోళ్ళు, పట్టుబట్టలు, వియ్యపురాలి లాంచనాలు, రాకపోకల బళ్ళు, భోజనవసతులు, ఉపాహారాలు ఇచ్చి 5 రోజులు అన్ని గౌరవాలతో పెళ్ళి జరిపి, అంపకాలనాడు తమకు పట్టు బట్టలు, మిగిలిన వారికి ఉప్పాడ బట్టలు పెట్టాలని రాసి ఇచ్చి, సంతకం చేస్తాడు. ఏదో మతలబు కోసమే రసీదు అని దాన్ని పురుషోత్తమరావుకు ఇస్తాడు పేరయ్య. లింగరాజు తాతగారు పిల్లపేర రాసిన ఆస్తి తాలుకు కాగితాలడుగుతాడు. తప్పక పంపుతానంటాడు పురుషోత్తమరావు.

**2:5.1. చదుర్ధాంకం - మొదటి రంగం కథ :** కాగితంలో చుట్టిన ఛాయాపటాన్ని తీసుకుని కమల మేడ మీదకు వెళ్ళి, విప్పిచూసి, చేసుకోదగ్గవాడే అని మెచ్చుకుని అక్కకు చూపాలనుకుంటుంది. ఆ ఛాయాపటాన్ని వర్ణిస్తుంది. కన్నులు పెద్దవి, కనుబొమ్మలు

తీర్చిదిద్దినట్లున్నాయి. ముక్కు సొగగాను, నుదురు ఎత్తుగాను ఉన్నాయి. తల వెంట్రుకలు ఒత్తుగానే ఉన్నాయనవచ్చు. రంగుకూడా బాగానే ఉంది. అన్నీ బాగున్నాయి కనుక తన అక్కకు తగినవాడే అంటుంది. అక్కను తాయము ఇస్తాను త్వరగా రమ్మని పిలుస్తుంది. కాళింది ప్రవేశించి అది ఏమిటని అడుగుతుంది. ఒక చిత్రం చూపుతానంటుంది. ఎవరిది అన్న ప్రశ్నకు బావదని సమాధానమిస్తుంది. ఆ పటాన్ని చూడనక్కర్లేదనీ, చూసినందుకు కూడా సుంకమివ్వవలసి వస్తుందేమోనని కాళింది అంటుంది. సుంకం ఇచ్చినా చూడదగ్గ అందమే అంటుంది కమల. కమల ఆగడాన్ని ఆపుతూనే అంత అందగాడైతే ఆమెనే చేసుకోమంటుంది. 'ఎక్కడా మొగుడు దొరకకపోతే అక్క మొగుడే గతి' అనీ ! ఇద్దరూ కలసి తిని, ఇచ్చిన కట్నం రాబట్టవచ్చనీ అంటుంది. కనీసం ఇద్దరి చాకిరీ వల్ల ఇంటి వెచ్చం గడపవచ్చు అంటుంది, కాళింది. కమల అక్కమాటల్ని మెచ్చుకుంటుంది. శుభలేఖల్లో వేయించటానికి, తమ ఫోటోలు తీసిన నరేంద్ర చేత, ఆ ఫోటో కూడా తీయించారని కమల చెప్తుంది. అప్పుడే, అంతదూరం పెళ్ళిపనులు అవుతున్నాయా! అని కాళింది ఆశ్చర్యపోతుంది. ముహూర్తానికి మూడు వారాల వ్యవధే ఉందని చెప్పి, కమల తండ్రికి పటాన్నిస్తుంది. ఆయన ఆమెనే దాచమంటాడు. కాళింది నిట్టూరుస్తూ వెళ్ళిపోతుంది. భ్రమరాంబ బయటకు వచ్చి భర్తను ఎక్కడకు వెళ్ళారని ప్రశ్నిస్తుంది. ఊరంతా తిరిగానంటాడు పురుషోత్తమరావు. కమలకు ప్రస్తుతం పెళ్ళిచేసే ఉద్దేశం లేదు కదా! ఎందుకు తిరగాల్సి వచ్చిందని అడుగుతుంది. కట్నం డబ్బు అందిన తర్వాతే పెళ్ళి పనులు చేయటానికి లింగరాజు గారు నిర్ణయించుకుని కబురు పంపారనీ, అందువల్ల అప్పుకోసం తిరుగుతున్నాననీ చెప్తాడు. కట్నం పెళ్ళిలో ఇచ్చేదే కానీ, లంచం లాగా దొంగతనంగా ఇంటికి పట్టుకువెళ్ళి ఇచ్చేది కాదుకదా ! అంటుంది భ్రమరాంబ. లింగరాజు గురించి తెలిసికూడా అడగటం ఎందుకు? అని అయినా, ఆ పాడుపని అందరిలో జరిగేకన్నా ఎవరికీ తెలియకుండా జరగడమే మేలనీ పురుషోత్తమరావు అంటాడు. అసలు ఏం పని జరిగిందని అడిగిన భార్యతో అప్పు పుట్టడం ఎంత కష్టమో తెలిసి వచ్చిందంటాడు.

అప్పు సంపాదించటం కోసం, మానాభిమానాలు మాపుకోవాలి. విసుగు, కోపం ఉండకూడదు. తగిన సమయం కోసం ఎదురు చూడాలి. తిరగమన్నప్పుడల్లా తిరగాలి. నువ్వే దేవుడివని మెచ్చుకోవాలి. ఇచ్చకాలతో మురిపించాలి. బ్రోకరుకు రుసుము పెంచాలి. గుమాస్తాగాళ్ళను తృప్తి పరచాలి. అప్పుకు నాలుగు రెట్లు ఆస్తి ఉన్నట్లు చూపించాలి. వడ్డీ ఎంత చెప్పినా ఒప్పుకోవాలి. ఏ షరతులు పెట్టినా శిరసావహించాలి. అప్పు పుట్టే చోట కూడా ఇవన్నీ చేయకపోతే అప్పుపుట్టదు.

అప్పు పుట్టిందా? అని అడిగిన భ్రమరాంబతో పుట్టి ఉంటే పురాణం చెప్పుకోవలసిన పనేంటి? అంటూ తమ పది ఎకరాల భూమి మీద 5 వేల కంటే అప్పు ఇచ్చేవాళ్ళు కనపడటం లేదంటారు. తమ అవసరానికి ఎంత కావాలని ప్రశ్నిస్తుంది భ్రమరాంబ. 5,500/- కట్నం కాకుండా మిగిలిన అన్ని ఖర్చులకూ కలుపుకుని ఎలాగైనా ఏడువేలు కావల్సి ఉంటుందంటాడు. ఏం చేయాలను కుంటున్నారంటే, వచ్చిన వెలకు ఆ భూమిని అమ్మేయాలనుకుంటున్నాను! 'అమ్మబోతే అడివి కొనబోతే కొరివి' అని ఏడు వేల అయిదువందలకన్న పెట్టేవాళ్ళు లేరని పేరయ్య భూమి విషయంలో ఎంతో కష్టపడుతున్నాడని చెప్తాడు.

అంతలో పేరయ్య రావడాన్ని చూసి భ్రమరాంబ అతను వచ్చేశాడంటుంది. అతడు వగరుస్తూ, "అయ్యా! మీ దగ్గర్నుంచి ఇంటికెళ్ళగానే ఈ పూట ఏదో పనిమీద మా అల్లుడు వచ్చాడండి. అతడికి మాటల సందర్భంలో విషయం అంతా చెప్పాను. అట్లాంటి వాళ్ళకు సహాయం చేయకపోతే ఎలాగ? అని 8000/- వేలకు అంటే మరొక 500/- పెంచుకుని ఆ పొలాన్ని అతని పేర రాయించుకున్నాడు. మీరేం అంటారో చెప్పండి' అని అడుగుతాడు. "ఎంత చెడి అమ్మినా ఒక ఎకరానికి వెయ్యి చొప్పున పది ఎకరాలకు కనీసం పదివేలైనా వస్తుందనుకున్నాను. ఎక్కడా బేరం కుదరనప్పుడు ఏం చేయగలం? ఎవరో ఒకరు కొనుక్కునే కన్నా నా ఆస్తి కొనేది మీ అల్లుడే అవటం నాకు సంతోషమే, దస్తావేజులు రాయించండి" అంటాడు పురుషోత్తమరావు. "దస్తావేజు రాయించటం కాదు, వెంటనే రిజిస్టరీ కూడా చేయించేయాలి. అతడి మనసు మారేలోపు మీరు ఆ కాగితాలతో తయారుగా ఉండండి. నేను స్నానం, పూజ, భోజనం ముగించి వస్తాను" అని చెప్పి తనలో తాను ఆ బేరంలో 2 వేలు లాభం వికరమనీ, ముందు అల్లుడిపేర రాయించినా కొన్ని రోజుల తర్వాత తన పేర మార్పించుకోవచ్చనీ అనుకుంటాడు.

స్నానం చేసి, భోజనానికి రావచ్చునా? అని అడిగిన భర్తతో ఆ భూమి కూడా లేకపోతే ఎలా బ్రతకగలుగుతాం? అని భ్రమరాంబ ప్రశ్నిస్తుంది. పురుషోత్తమరావు- "కూలి, నాలి లేక తినడానికి తిండిలేక మలమల పస్తులతో మాడే వాళ్ళు; ఇల్లు వాకిలి, ఇల్లాలు లేక

చెట్లనీడలో బతికేవాళ్ళు; తొడుక్కోవడానికి పాత బట్టలేక, పడుకోవడానికి చాపలేక చలికి వణికేవాళ్ళు; కళ్ళు, కాళ్ళు లేక బ్రతికే దారిలేక దేవుడా! అని వాపోయే వాళ్ళు, మొదలైన వారినందరిని కన్నార చూసి కాపాడే వాడెవడో వాడే మనల్ని కూడా కాపాడతాడు. బ్రతుకు గురించి ఇంత బాధెందుకు?" అని వివరిస్తాడు. భ్రమరాంబ నిజమే అంటూ భగవంతుణ్ణి కీర్తిస్తుంది. "రాతిలో ఉండే కప్పను, బొరియలోని చీమను, గంగలోని చేపను, మట్టిలోని వానపామును, పుట్టలోని చెదలను, కలుగులోని ఎలుకను, నాభిలోని క్రిములను, పేడలోని పురుగును పెంచే తండ్రి; చెట్లకు నీరు, శిశువుకు స్తన్యం దయచేసే తండ్రి - దయా స్వరూపుడై ఉండగా, మనకు గానీ, ఎవరికీ గానీ ఏం లోపము' అంటుంది.

**2.5.2: రెండవ రంగం కథ :** పురుషోత్తమరావు గారింటిలోపలి చావడి. కాళింది, భ్రమరాంబ ప్రవేశిస్తారు. ఆ పూట భోజనానికెందుకు రాలేదని ప్రశ్నిస్తుంది భ్రమరాంబ. ఆకలి లేదని సమాధానమిస్తుంది కాళింది. తల్లి కూతురితో, "పెళ్ళి అంటే ఆడపిల్లలకు కళ వస్తుంది. నీవు నీళ్ళు కారుతున్నావేం?" అని అడుగుతుంది. అడిగినందువల్ల చెప్తున్నాననీ, తనకు ఆ పెళ్ళి ఇష్టం లేదనీ సమాధానం చెప్తుంది. పెళ్ళికొడుకు నచ్చలేదా? అని అడిగిన తల్లికి, పెళ్ళే నచ్చలేదని చెప్పి, 'తల్లిదండ్రులు కులానికి, తాము రూపానికి తక్కువ వారం కానప్పుడు అంత హైన్యస్థితికి కారణం ఏమిటి? కట్నం ఇచ్చి వరుణ్ణి గడించుకోవటం కన్నా తక్కువతనం ఉండదుకదా! అని బాధపడుతుంది. అసలు ఆ దురవస్థ తమకు మాత్రమే కాదనీ, లోకంలో ఎందరికో ఆ బాధ ఉందనీ అంటుంది తల్లి. ధనవంతులు కాని వాళ్ళుకూడా, ఏదోకాస్త ఉన్నవారైనా సరే కొంప, గోడు అమ్మో, సంచుల్లో డబ్బు నింపుకుని, సంతకెళ్ళినట్లు పెళ్ళి మగపెళ్ళి వారి తల్లిదండ్రులు విధించిన డబ్బు వాళ్ళచేతిలో పోసి, మరీ తమ కూతుళ్ళకు మొగుళ్ళను కుదుర్చుకొని వస్తున్నారుకదా!" అని నచ్చ చెప్తుంది. కావచ్చు కానీ, తాము వాళ్ళను అనుకరించవలసిన అవసరం ఏముంది? అడిగే వాళ్ళకు పాపభయం లేకపోయినా, ఇచ్చే వాళ్ళకు సిగ్గయినా ఉండాలనీ, వరకట్న దురాచారం అనే నాటకంలో పాత్రలవటం తగదనీ కాళింది వాదిస్తుంది. అప్పుకన్నా, ఆవళి దక్షిణకన్నా పన్నుకన్నా, తండ్రి తద్దినం కన్నా- అన్నిటిని మించిన అవసరమైన ముఖ్యమైన విషయం అయికూర్చున్నది కట్నం. అటువంటప్పుడు తప్పేది లేదని భ్రమరాంబ భావం. "అమ్మా! అదేమి మాట. ఇంటికెదురుగా చక్కని గుడి ఉండగా మొక్కుబళ్ళు తీర్చటం కోసం తిరుపతి కెళ్ళినట్టు, కులానికి గౌరవం తేగలిగిన కుర్రవాళ్ళు ఎందరో లేమి కారణంగా పెళ్ళి జరగకుండా ఉండగా, డబ్బుకు ముఖ్యత్వం ఇచ్చి కట్నం అడిగే వాళ్ళను ఏవిధమైన ఏహ్యత చూపకుండా, వాళ్ళ వెనకబడి పరుగులెత్తి పిల్లనివ్వటం ఎందుకు?" అని కాళింది తల్లిని అడుగుతుంది. తెలివి తక్కువగా అప్పటి దేశ, కాల, పరిస్థితుల్ని తెలియక మాట్లాడుతోందని కూతుర్ని విసుక్కుంటుంది భ్రమరాంబ. పిండిబొమ్మ కూడా పిల్లనిస్తామనగానే, కట్నం కోసం చెయ్యిచాపే పరిస్థితి వచ్చిందనీ, కట్నం లేకుండా తాళికట్టే వరుడు ప్రపంచం అంతా వెదికినా దొరకడనీ కూడా వివరిస్తుంది. 'లోకం అంత గొడ్డు పోయినపుడు, పెళ్ళే వద్దనుకోవచ్చు కదా! కట్నం కోరి వచ్చే ఖరముతో తగుదునని కాపురం చేసేకన్నా, పెళ్ళి వద్దనుకుని మగపిల్లలాగే తల్లి దండ్రులకు తోడుగా ఉండటం తగిన పని కదా! 'అని కాళింది తల్లిని ప్రశ్నిస్తుంది. పెళ్ళికాని ఆడపిల్ల ఇంట్లో ఉంటే ఆ తల్లిదండ్రుల అవస్థ చెప్పతరం కాదంటుంది భ్రమరాంబ. చిన్న పిల్ల అయిన కారణంగా ఆ బాధలు కూతురికి తెలియవంటుంది. "పక్క వాళ్ళ అమ్మాయికి పిల్లవాడు కుదిరితే మనపిల్లకెవ్వడో మగడనీ, పరాయి వాళ్ళ ఆడపిల్లల పెళ్ళి చూసేటప్పుడంతా మనపిల్లకెప్పుడో పెళ్ళి అనీ, ఎదుటి ఇంటికి అల్లుడు వచ్చినపుడంతా మనింటికెపుడొస్తాడో అనీ, ప్రక్క వాళ్ళ పిల్ల కాపురం గురించి విన్నపుడంతా మనపిల్ల కెలాంటి కాపురం కుదురుతుందోననీ-ఆడపిల్ల పుట్టినప్పట్నించి ఆమె మెళ్ళో పుస్తె పడేదాకా మేలుకున్నా, నిద్రపోతున్నా, భోజనం చేస్తున్నా, ఎలా ఉన్నా, ఏం చేస్తున్నా, తల్లి పడే బాధ వివరించటం జరగని పని" అని కష్టాల్ని ఏకరవు పెడుతుంది. అంత కష్టపడి పెంచిన పిల్లకు, కట్నమిచ్చి భర్తను తేవటం అవమానం కాదా? అని అడిగిన కూతురితో ఆ అవమానం అడిగిన వాళ్ళదే గాని ఇచ్చిన వాళ్ళది కాదంటుంది భ్రమరాంబ. తల్లి మాటలకు అడ్డు వచ్చి ఇచ్చినా అవమానమేనంటూ కాళింది. కొన్ని ఉదాహరణలు చెప్తుంది. తాగేవాళ్ళు ఉండటం వల్లే కల్లుతీస్తున్నారనీ, కొనే వారుండటం వల్లే గోవధ జరుగుతోందనీ, వెళ్ళే వాళ్ళుండబట్టే వేశ్యావృత్తినీ-దేనికైనా ప్రోత్సాహమే కారణం అని తేల్చి చెప్తుంది.

భ్రమరాంబ బయట తలుపు చప్పుడు విని, కూతురితో, వాళ్ళ తండ్రివచ్చారని చెప్పి, వెళ్ళి తలుపు తీస్తుంది. పేరయ్య, పురుషోత్తమరావులు లోపలికి వస్తారు. వెళ్ళిన పని అయిందా? అంటుంది భ్రమరాంబ. చాలా బాగా జరిగిందనీ, రిజిస్ట్రార్ చేతిలో 5/- పెట్టగానే అందరినీ వెనకబెట్టి త్వరగా పని తెమిల్చాడనీ చెప్తాడు పేరయ్య. పేరయ్య చేత కట్నం డబ్బులు పంపవచ్చా? అంటూ 'ఏదోగా ఉన్నావేం?" అని భార్యను ప్రశ్నిస్తాడు పురుషోత్తమరావు. కాళింది పెళ్ళి వద్దని గొడవ చేస్తోందనీ, ఎంత చెప్పినా ఒప్పుకోవడం లేదనీ భ్రమరాంబ చెప్తుంది. భర్త లక్షణాలు, తిక్క, కూతురుకు వంట పట్టాయనీ, కట్నం ఇవ్వటం ఆమెకిష్టం లేదనీ అంటుంది. తమ తిక్క తమ పిల్లలకు రావటం మంచిదే అయినా దైవం ప్రతికూలించిందని బాధపడుతూ కుమార్తెను పిలవమంటాడు.

ఇక్కడే ఉన్నానంటూ కాళింది వస్తుంది. 'మీ అమ్మతో ఏదో అన్నావట' అన్నప్పుడు 'అమ్మకు చెప్పినమాటే మీకూ చెప్పాలని వచ్చా' నంటుంది. తనపై ప్రేమ ఉందా? అని అడిగిన కూతురుతో ఆ సందేహం ఎందుకు వచ్చిందని అడుగుతాడు పురుషోత్తమరావు. ప్రేమ ఉంటే కూతురని ఒకరి చేతిలో పెట్టి పంపకుండా కొడుకనుకుని తమ ఇంటిలోనే ఉంచుకుంటే తన్ను పెంచలేని సమయం వస్తే తానే కష్టించి తల్లిదండ్రుల్ని పెంచుతానంటుంది కాళింది. బిడ్డను వేరే వాళ్ళింటికి పంపటం ఆమెపై ప్రేమలేక కాదనీ, ఆమెకు పెళ్ళి పరమావధి అనీ, ఆమెకంటూ ఒక కుటుంబం ఏర్పరచి ఇవ్వటం తమ బాధ్యత కనుక గుండె బండ చేసుకునే బిడ్డను మరొకరింటికి పంపుతారని చెప్తాడు. ఎంత చెప్పినా తనకు మాత్రం ఆ పెళ్ళి నచ్చలేదనీ, కట్నం ఇచ్చి వరుడి చేత తాళి కట్టించుకునే కన్నా, తనకు తానే ముప్పేట తాడుతో కంఠానికి ఉరిపోసుకుని చావటం మేలనీ అంటుంది. ఆమెతండ్రి ఆమెను కౌగలించుకుని, తనకు బుద్ధి చెప్పగలిగినంత దానవయినందుకు తన ఆయుస్సు కూడా పోసుకుని బ్రతకమని దీవిస్తాడు. వరశుల్కం మాన్పించాలని వేదికలెక్కి ఉపన్యాసాలెన్నైనా ఇచ్చి, వ్యాసాలు రాసి పత్రికల్లో ప్రకటించి, చివరకు ఆమె పాటి ధైర్యం కూడాలేని వాడినయ్యానని బాధపడతాడు. భ్రమరాంబ కూతురుకు బుద్ధి చెప్పటం మాని, ఆమె మాటలకు తాళం వెయ్యవద్దని మందలిస్తుంది. కూతుర్ని ఏం అనకుండా మంచి మాటల్తో నచ్చచెప్పమంటాడు. కాళింది ఆ ఏహ్యకర కృత్యం ఏమాటలచేతా సరికాదనీ, తనపట్ల దయతో అవమాన చిహ్నమైన ఆ పెళ్ళి ప్రయత్నాలు ఆపమనీ సూచిస్తూ మాటలురాక ఏడుస్తూ తండ్రి కాళ్ళపై పడుతుంది.

ఆమెను లేవనెత్తి, తండ్రి, "నేనేం చేయనమ్మా! పెళ్ళి కాని పిల్ల ఇంట్లో ఉంటే అపనిందల పాలుకామా? లోటులేని చోట్లలోనే లోపాన్ని కల్పించుకుని, సంతుష్టి చెందే ఈ ప్రపంచం, రవ్వంత లోపం కన్పిస్తే బతకనిస్తుందా?" అని బాధ పడతాడు. కాళింది తండ్రితో, "మీరు కూడా అలాగే ఎందుకు మాట్లాడతారు? నాకు ఇంగ్లీషు నేర్పిస్తున్న దొరసానికి 46 ఏళ్ళున్నాయి. ఏం అవమానం వచ్చింది?" అని ప్రశ్నిస్తుంది. భ్రమరాంబ మంచి ఉపమానమే అని విసుక్కుంటుంది. ఆమె దేశానికి మన భారతదేశానికి గల తేడా తెలుసుకోమనీ, అక్కడలా కాకుండా ఇక్కడ ఆడది ఆడదే; మగవాడు మగవాడేననీ; ఆ దేశంలో స్త్రీ పురుషులకు తేడా లేదనీ, మంకుతనం పనికిరాదనీ, చెప్పి భ్రమరాంబ కాళిందిని లోపలికి తీసుకుని వెళ్తుంది.

పురుషోత్తమరావు పేరయ్యతో, 'అంతా చూశారా' అంటాడు. చిన్నపిల్లలు లోకం తెలియక, కష్టసుఖాలు తెలియక ఏదో మాట్లాడతారని పేరయ్య అంటాడు. సలహా అడుగుతాడు పురుషోత్తమరావు. కట్నం పంపిస్తే కార్యం ఆగదని తెలుసుకుంటుందనీ, పెళ్ళి అవగానే భర్తతోడిదే లోకం అవుతుందనీ అంటాడు పేరయ్య. ఆ సొమ్ము లెక్కకట్టి ఇచ్చి, బజానా ఆపనా? అంటారు. ఆ బ్రహ్మణుడి నోట్లకు మారకం అడుగుతాడంటాడు పేరయ్య. డబ్బు ఇచ్చి ముట్టినట్లు ముక్క రాయించుకు వస్తానని చెప్పిన పేరయ్య, ఆడపిల్లల్ని అంత చదవనివ్వకూడదనీ, అంత చనువు ఇవ్వకూడదనీ, తాను అందుకే తన కూతుర్ని చదివించలేదనీ, పెళ్ళయి లక్షణంగా అయిదుగురు పిల్లల తల్లి కూడా అయిందనీ అనుకుంటాడు.

వరకట్నం ఇచ్చి పెళ్ళి చేయటమంత నీతి తప్పటం మరొకటి లేదని నిన్నటి దాకా బుద్ధులు చెప్పి, ఈవేళ తన కూతురు పెళ్ళి అనేటప్పటికి కిక్కురుమనకుండా కుమారుని తండ్రి కాళ్ళ దగ్గరకు కట్నం పంపించాడు అని రేపటినుంచి నలుగురు నన్ను తలుచుకొని నవ్వేలాంటి పని చేశానని బాధపడతాడు పురుషోత్తమరావు.

**2.6. పంచమాంకం కథ :** కాళింది, కమలల గదిలో కాళింది పచారు చేస్తోంది. కట్నం కాళ్ళ దగ్గరకు పంపటం కూడా జరిగింది. ఇక చేయగలిగేది ఏదీ లేదని బాధ పడుతుంది. తేట తెల్లంగా మనసు తెలిపినా, ఏడ్చినా, మొత్తుకున్నా తన తల్లికి తన బాధ తెలియలేదనీ, అది తప్పని నిందించవలసిన తండ్రి కూడా చల్లగా జారుకున్నాడనీ, తన్ను చెల్లని డబ్బుగా చేసిన దైవాన్ని నిందిస్తుంది. స్త్రీ జీవితానికి ఏ మాత్రం గౌరవం లేక, మంచి మెప్పులేక, పెళ్ళికోసం ఇళ్ళుకూడా అమ్ముకుని కట్నాలు అర్పించుకోక పోతే పెళ్ళిళ్ళు జరగవు. ఆడపుట్టుకే అవమానపు పుట్టుక అయిపోయిందంటూ బాధ పడుతూ, తాను చేయవలసిన దేమిటని ప్రశ్నించుకుంటుంది. "డబ్బు ఆశించి తాళికట్టే వాణ్ణి చేసుకునే కన్నా తల్లిదండ్రుల్ని ఎదిరించి మొండికెత్తటం తగిన పనేనా?" అని కాళింది ఆలోచిస్తుంది.

"అక్కా! ఈ ఆశ్చర్యకరమైన మాటవిన్నావా?" అంటూ వార్తా పత్రిక చేతపట్టుకుని కమల వస్తుంది. ఏమిటని ప్రశ్నించిన కాళిందికి, కమల ఆ వార్తను చదివి విన్పిస్తుంది. "ఓరుగల్లులో ఒక యువతి ఒక యువకుణ్ణి వరించింది. ఆ యువకుడు ఆరువేలు కట్నం అడిగాడు. ఆమె తలిదండ్రులు ఆ కట్నం ఇవ్వలేక వేరే పెళ్ళి ఖాయం చేశారు. అన్యుల్ని వివాహం చేసుకోవటం ఇష్టం లేక ఆ యువతి విషం తాగింది. ఆమె మరణించింది. వరశుల్కమనే దురాచారం వల్ల ఇంత ఘోరం జరిగింది"- ఆ వార్త వినగానే కాళింది, "చాలా చక్కని పనిచేసింది. పుట్టినప్పుడే చావు ఎప్పుడని సకలజీవుల నుదుట బ్రహ్మ రాసే ఉంటాడు. మరి అటువంటప్పుడు మనస్సు ఒల్లని పనులు చేసి ఆత్మను దుఃఖ పెట్టేకంటే చావటం ఉత్తమం" అంటుంది. అంత సాహసం చేయగల శక్తి అందరికీ రాదనీ, తల్లి భోజనానికి పిలుస్తోందనీ కమల చెప్తుంది. కాళింది ఆకలి లేదనటంతో కమల పొద్దు పోయిందనీ, తండ్రి భోజనం చేసి హరికథకు వెళ్ళాడనీ, తల్లి మాత్రం తమ కోసమే ఎదురు చూస్తోందనీ చెప్తుంది. కాళింది కమలను కట్నండబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తెలుసా? అని ప్రశ్నిస్తుంది. కమల పోతునూరులోని పొలం అమ్మారని సమాధానమిస్తుంది. జరిగిన దానికి కాళింది బాధపడుతుంది. కమల, "ఏం చేయగలం? ఈ రోజుల్లో పిల్లలెందుకని నీ ఉద్దేశం? కొడుకుగా పుడితే చదివించడానికే తాతల నాటిసొమ్ము ఖర్చు పెట్టవలసి వస్తోంది. కూతురై పుడితే కొంపలు అమ్మి కట్నం పేరిట లంచం పెట్టి పెళ్ళిళ్లు చేయాలి" అని జవాబిస్తుంది. కాళింది కమలతో, 'అమ్మ భోజనానికి పిలుస్తోంది. వెళ్ళమని చెప్తుంది. కమల కాళిందిని కూడా రమ్మంటుంది. కాళింది తలనొప్పిగా ఉందనీ, పడుకుంటే గానీ తగ్గదనీ చెప్పి చెల్లెల్ని పంపించివేస్తుంది. కమల వెళ్ళిపోతుంది.

కాళింది తనలో తాను ఇలా ఆలోచిస్తుంది: "ఆ పది ఎకరాలూ కూడా అమ్మటం అయిందికదా! ఇంక వీరికేది దారి? మా ప్రాణాలకు ఉసూరుమంటూ బ్రతకాల్సిందేనా? ఈ దుష్టకార్యం జరగకుండా ఆపేవారే లేరా? అన్నట్లు దారి లేకేం? ఆ ఓరుగల్లులోని యువతి ఒక దారి చూపించింది కదా! ఆ దారిలోనే నేనెందుకని నడవకూడదు? ఈశ్వరాదేశం కాకపోతే ఈ రోజే ఆ వార్త ఎందుకు చెవిన పడాలి? కమల ఆ ధైర్యం, సాహసం అందరికీ రావంది కదా! నేనాపాటి సాహసం కళ్ళుమూసుకుని చేయలేనా? మానం కాపాడుకోలేకపోయినపుడు మానవతి అని ఎలా అనిపించుకోగలను? చెడునుంచి మరలించేదే స్నేహం; పాపం కానిదే పని, పుణ్యం సంపాదించడానికే బుద్ధి, అనుభవించినదే ఐశ్వర్యం, స్వాతంత్ర్యం ఉన్నదే జన్మ, మర్యాద కాపాడుకొన్న వాడే మగాడు, మానం దక్కించుకొన్నదే మగువ; ఇప్పుడు కాకపోతే ఏనాడూ నా ప్రాణాలు పోకుండా ఆపుకోగలనా? ఏనాడు తల్లి గర్భాన ప్రాణి పడిందో ఆనాడే మృత్యువు కూడా వెంట పడుతుంది. పుట్టిన ప్రాణిని మృత్యువు ముద్దిడుకొనే కదా తల్లికి ఇస్తుంది. అందువల్ల ప్రాణం కోసం ఆలోచించకుండా, నా తల్లి దండ్రులకు ఒక లేఖ రాసి పెట్టి మరీ ఈ అవమానకరమైన ఆడబ్రతుకును విడిచిపెడ్తాను. అయినా ఆత్మహత్య అధోగతికీ అపకీర్తికీ కారణమవుతుంది కదా? అలా చేయవచ్చా? నన్ను నేను మభ్యపెట్టుకుంటున్నాను కానీ, బుస్సీ కంటపడటం ఇష్టంలేక వెలమ ఆడపడుచులు బుగ్గి కాలేదా? రుస్తుంఖానుకు లోబడటం ఇష్టం లేక పెద్దాపురం క్షత్రియ స్త్రీలు అగ్నిలో దూకలేదా? ఆ యుద్ధంలో పరిమార్చటం హత్యగా కాక వీరంగా గౌరవింపబడటంలేదా? భర్తతో సహగమనం చేయటం బలవన్మరణం అని కాకుండా పాతివ్రత్యం అనిపించుకోవటం లేదా? మరి అవమానాన్ని తప్పించుకోడానికి ప్రాణత్యాగం చేస్తే అది ఆత్మారాధనే తప్ప ఆత్మహత్య ఎలాగవుతుంది? ఈ త్యాగం వల్ల నాకు గౌరవం దక్కటం మాత్రమేకాదు, నా తల్లిదండ్రులకు ధన నష్టం జరగకుండా కూడా ఉంటుంది." అనుకుని తల్లిదండ్రుల్ని సంబోధించి ఉత్తరం రాసిపెట్టి, గదికి, శయ్యకు నమస్కరిస్తుంది. రాట్నాన్ని ముద్దు పెట్టుకొని తమ కిరువురికి ఋణం తీరిపోయిందని బాధపడుతూనే, రాట్నపు గానం ప్రపంచంలో విన్పించాలని కోరుతూ తన గుర్తుగా ఒక బారెడు దారం భక్తికి నిదర్శనంగా తీస్తుంది.

కాళింది మెల్లగా పెరటిలోని బావి దగ్గరకు వెళ్తుంది. తాను, కమల పెంచిన మల్లెలకు, చేమంతులకు నమస్కరిస్తుంది. తర్వాత భగవంతుణ్ణి స్మరిస్తూ తన జీవితాన్ని ఇలా పూర్తి చేస్తున్నందుకు మన్నించమంటుంది. తల్లిదండ్రులకు కాళింది అనే కూతురే పుట్టలేదని అనుకోమని చివరి నమస్కారాలర్పిస్తుంది. గర్భశోకంతో బాధ పడవద్దని వేడుకుంటుంది. చివరకు భరతమాతనుద్దేశిస్తూ ఇలా అంటుంది- "ఓ భరతమాతా! నమస్కారం! నువ్వే నిర్భాగ్యస్థితిలో ఉండి నీ పిల్లల్ని ఎలా బాగు చేయగలవు? ఓ పాలకులారా! మీకు ఎప్పుడూ పన్నుల గొడవే తప్ప, ఆ పన్నుల బాధలు కనపడవు కదా! వంగ రాష్ట్రం కోసం తప్ప వరకట్నం కోసం శిక్షాస్మృతులు ఏర్పరచరు కదా! ఓ సంఘ సంస్కర్తలారా! ఉపన్యాసవేదిక మీద వాగటమే కానీ మీరు చెప్పే ధర్మాలయినా మీరు పాటించరు కదా! పాచి నోటితో కాఫీ, ప్రాతఃకాలంలో క్షౌరం, మైలగుడ్డతో తిండి, కాఫీ హోటళ్ళలో టిఫిను, ఇంట్లోనూ ఇంగ్లీషు, పాడుమొగం, గొల్లవాడి చేతి రొట్టె, స్వమత ధర్మాలపై రోత,

పదవులకోసం పాకులాట, దాస్యం కోసం తప్ప త్యాగం అంటే పడనిగుణం; తప్ప మరి ఇంకే సంఘసంస్కరణలు మీరు చేయలేరు కదా! దేశ సేవాదురంధరులు కూడా వరకట్న దురన్యాయము గురించి ఆలోచించరు కదా! సుంకమంటే పన్ను కదా! పన్ను కట్టందే కన్యకు పెండ్లి యోగ్యత లేదనటం కన్నా అన్యాయమేముంది? అవమానం కదా? మీ బిడ్డలకు జరిగే అన్యాయాన్ని అడ్డుకోలేరు మీరు, దేశమాతకు జరిగే అన్యాయాన్నెలా అడ్డుకోగలరు? మీ అల్లుళ్ళు కట్టమన్న పన్నే అడ్డుకోలేని మీరు దొరల పన్నుల్ని ఎలా అడ్డుకుంటారు? ఈ వరకట్నం వల్ల ఎందరు ఆడపిల్లలు, ఎన్ని కుటుంబాలు నాశనమవుతున్నాయో ఎవరైనా ఆలోచిస్తున్నారా? కాసుకుగతి లేకపోయినా, అక్షరం ముక్క రాక పోయినా, కన్యనిస్తామనగానే కట్నం కోసం ఎంత బిగిసిపోతున్నారో చూశారా? ఇలాగే జరిగితే తిండికి, బట్టకు ఉంటుందా? మగపిల్లల్ని కన్నప్పటి నుంచి తల్లి తండ్రులు కట్నం ఆశతోనే కదా పెంచుతున్నారు. ఆ స్త్రీలు మాత్రం ఆడ పుట్టుక పుట్టలేదా? ఆడపిల్లల్ని అవమానించవచ్చా? ఆ అవమానం కాళిందినైనా నన్ను మాత్రం అంటుకోదు. ఈ దురాచారాన్ని విడవకపోతే నా ఉసురు మీకు తగలక మానదు. అదృష్టం లేక ఆడపుట్టుక పుట్టి, లంచం ఇచ్చి తాళి కట్టించుకోవద్దు. పుట్టగానే ఆడపిల్లను అవతల పారేయండి. కమలా! మనిద్దరం ఒకే కంచంలో తిని, ఒకే మంచం మీద పడుకున్నాం, నిన్ను వదలటం చెల్లీ నాకు, కష్టమైనా ఇది తప్పని పరిస్థితి. తప్పని స్థితి వస్తే నీవూ నాలాగే చేయి కానీ అవమానాన్ని భరించకు. నాకు అప్రతిష్ట తేవద్దు" అని అనుకుంటుంది.

చివరగా అవమానాన్ని పోగొట్టుకోవడానికే ప్రాణాలు వదులుతున్నాననీ, జీవితాన్ని ముగిస్తున్నానీ చెప్పి మనస్సును ప్రశాంతంగా ఉండమనీ, సాహసాన్ని దరిచేరమనీ, పిరికితనాన్ని పారిపొమ్మనీ అడుగుతుంది. ఆఖరిగా బావికి నమస్కరించి ఏ బావి నీటితో పెరిగానో ఆ బావికే తన శరీరాన్ని అర్పిస్తున్నానని అంటుంది. కాళింది ఆకాశవాణి పిలుస్తున్న పిలుపును వింటున్నట్టుగా నటించి భగవద్ధ్యానంతో బావిలో దూకుతుంది.

## సారాంశం :

చరకా గానంతో ఆరంభమైన నాటక ప్రథమాంకంలో భ్రమరాంబ, పురుషోత్తమరావులు వరకట్న సమస్యకు విసిగిపోతూనే కుమార్తెకు వివాహ ప్రయత్నం చేయడం, ద్వితీయాంకంలో పిసినారి లింగరాజు పేరయ్య ద్వారా పురుషోత్తమరావుగారి సంబంధాన్ని కుమారునికి కుదిర్చే ఆలోచన చేయడం, తృతీయాంకంలో రూ. 5,500/- కట్న నిర్ణయం, చతుర్థాంకంలో తన కట్నంకోసం పొలం అమ్మడం ఇష్టం లేని కాళింది తండ్రితో వివాహప్రయత్నం మానుకొమ్మనడం, పంచమాంకంలో కాళింది మరణం అనే అంశాలు పై పాఠంలో వివరించబడ్డాయి.

## ప్రశ్నలు :

1. నాందీ, ప్రస్తావనలను వివరించి వరవిక్రయ నాటకంలో వాని ధర్మాలను సమన్వయించండి.

2. కాళింది త్యాగబుద్దిని వివరించండి.

ఆచార్య ఎల్.బి. శంకరరావు
తెలుగు శాఖ,
మద్రాసు విశ్వవిద్యాలయం
చెన్నై

## ఖండం : 4

## పాఠం : 3 వర విక్రయము

- కాళ్ళకూరి నారాయణరావు

శీర్షికలు :

3.1. ఇతివృత్త వైశిష్ట్యం (6-10 అంకములు)
3.2. నాటకలక్షణ సమన్వయం

లక్ష్యం : నాటకేతివృత్త వైశిష్ట్యాన్ని వెల్లడించే ప్రయత్నంలో ఆరునుండి పది అంక కథలను పరిశీలించడం, నాటకలక్షణ సమన్వయం ఈ పాఠంలో కానవస్తుంది.

### 3.1.1 షష్ఠాంకం - మొదటి రంగం కథ :

లింగరాజు తన వ్యాపార గదిలో కూర్చుని ఉంటాడు. సాధారణంగా కొత్తగింజలు వచ్చేరోజుల్లో కోమట్లు అప్పుకోసం వస్తారు. కానీ ఆ సంవత్సరం ఎవరూ రాలేదని అనుకుంటాడు. అప్పుచేసి ఆస్తి ఉన్నా తీర్చలేనిదే అప్పు; నూరు అప్పు ఇచ్చి వెయ్యికి రాయించుకునేదే నోటు; బంగారం తాకట్టుపెట్టుకుని ఇచ్చే అప్పే అప్పు; వడ్డీ వచ్చినరోజే రోజు - ఇది అతని ఆలోచనారీతి. ఘంటయ్య జీతమిస్తే బట్టలు కుటించుకుంటానంటాడు. లింగరాజు గాంధీగారిలా పంచా కట్టుకోమని సలహాయిస్తాడు. గాంధీగార్ని మెచ్చుకున్నా ఖద్దరు కట్టరేం అని ఘంటయ్య అడిగితే, ఖరీదు తగ్గించక పోవటమే కారణమని లింగరాజు సమాధానమిస్తాడు. భార్య ఏం చేస్తోందని నౌకర్ని అడుగుతాడు. గదిలో కూర్చుని కథలు చదువుకుంటోందని చెప్తాడు. ఆవైపుకే వెళ్ళవద్దని చెప్పాను కదా అన్న యజమానితో ఆమెను కొరుక్కు తిననని చెప్పి, ఘంటయ్య వెళ్ళిపోతాడు.

లింగరాజు తనలో తాను ఇలా అనుకుంటాడు : పెంకి కుంక ఎంత మాటన్నాడు? అయినా వాణ్ణి అని లాభంలేదు. వయసు చెల్లిన తర్వాత పెళ్ళిచేసుకున్న హీనులకిలాంటి చెప్పుదెబ్బలు తప్పక తరచు తగులుతూనే ఉంటాయి. వయస్సు ఉడిగి ఏళ్ళు పై బడ్డాక రెండోపెళ్ళి చేసుకోవటం; ఆస్తి దాయాదుల చేతికి దక్కుతుందన్న భయంతో పరాయివాళ్ళ పిల్లల్ని పెంచుకోవటం; క్రొత్త అల్లుడని మర్యాద మక్కువ చూపిస్తే అదే నిజమని నమ్మి అత్తవారింట ఉండటం; అప్పుల వాళ్ళను తప్పించుకోడానికి సొత్తు మరొకళ్ళ పేరుమీద రాయటం - ప్రపంచంలో ఈ నాలుగూ చేసేవాళ్ళు బుద్ధిలేని వాళ్ళని ఆర్యులైన వాళ్ళంటారు. అందులోనూ మూడవ పెళ్ళి చేసుకున్న నన్ను గురించి చెప్పటం ఎందుకు ?

అతని కొడుకు బసవరాజు పత్రికచేత పట్టుకుని ప్రవేశిస్తూ "ఆ సంగతి పత్రికలో కూడా పడింది నాన్నా!" అంటాడు. ఏ సంగతని ప్రశ్నించిన తండ్రితో, "ఆ పిల్ల బావిలో పడి చచ్చిపోయిందని నా క్లాసులో పిల్లలంతా నన్ను కాకుల్లా పొడుస్తున్నారు. పొడుకట్నం కోసం ఎందుకింత పాకులాట." అని అడుగుతాడు. గాంధీగారు స్వరాజ్యం కోసం పాకులాడటం లేదా? అని అడిగిన తండ్రితో అది ఆయన కోసం కాదంటాడు. కొడుకుతో ఇది మాత్రం తాను తనకోసం చేస్తున్నది కాదనీ, ఆ పత్రికలోని వివరాలు చదవమనీ అడుగుతాడు. బసవరాజు పత్రికలోని వివరాలిలా చదువుతాడు: "మా ఊళ్ళోని పుణ్యమూర్తుల పురుషోత్తమరావుగారి పెద్దకుమార్తె కాళిందికిని, లుబ్ధాగ్రేసరచక్రవర్తి సింగరాజు లింగరాజుగారి కుమారునికిని పెళ్ళి నిశ్చయం చేసి అందుకుగాను రూ 5,500/- కట్నం ముందుగానే పుచ్చుకోవటం మూలంగానూ, కాళిందికి కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేకపోవటం వల్లా, తన తల్లితండ్రులకు ఒకలేఖ రాసి పెట్టి ఆత్మహత్యచేసుకుంది. ఆ లేఖ వివరాలు క్రింద ఈయబడ్డాయి. 'నా ప్రియమైన తల్లితండ్రులకు నమస్కారాలు! కట్నం ఇచ్చి తెచ్చిన వరుణ్ణి పెళ్ళి చేసుకోవటం నాక్షేమానికీ, మీ సౌఖ్యానికీ కూడా భంగమనీ భావిస్తూ వీటి రెండింటినీ నివారించటం కోసం నేను ఈ లోకాన్ని విడిచి పెట్టి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను.

ఈ ఉత్తరం రాసి మీ అనుజ్ఞ తీసుకుంటున్నాను. అమ్మకాని, మీరు కాని నాకోసం బాధపడవద్దు. మీకు నా నమస్కారాలు. చెల్లికి నా ముద్దులు." అంటూ లేఖతో సహా ఒక పొరుడు ప్రకటించిన వార్తను చదివి విన్పిస్తాడు.

లింగరాజు తన్ను లుబ్ధాగ్రేసరచక్రవర్తి అన్నదెవ్వరో తెలిసికొని అతనిపై దావా వేయాలని అంటాడు. పేరయ్య ప్రవేశిస్తూ అతన్ని అంతమాట అనగల ధైర్యం ఎవరికుందని ప్రశ్నిస్తాడు. బసరాజు అక్కడనుంచి వెళ్ళిపోతాడు. పేరయ్యను రమ్మని ఆహ్వానిస్తాడు లింగరాజు. విశేషాలడిగిన లింగరాజుతో భ్రమరాంబగారి దుఃఖం అడ్డుకోలేనిదిగా ఉందంటాడు. చచ్చిపోయిన ఆమె, పెళ్ళి తర్వాత చచ్చిపోయినా బాగుండేదనీ, ఆస్తి అయినా దక్కేదనీ బాధపడతాడు లింగరాజు. పేరయ్య ఆ సొమ్ము గురించి అడగడానికే వచ్చానని చెప్తాడు. ఆ సొమ్ము ఇవ్వనని లింగరాజు, ఇవ్వకపోతే దావావేయక తప్పదని పేరయ్య వాదించుకుంటారు. రసీదు తన దస్తూరీలో రాయలేదనీ కనుక చెల్లదనీ లింగరాజు చెప్తాడు. అటువంటి పరిస్థితే వస్తే సాక్ష్యం చెప్పడానికి చాలామంది ఉన్నారని పేరయ్య అంటాడు. అతని వంతు 500/- తిప్పి ఇవ్వడానికి తయారా అని అడిగిన లింగరాజుతో తప్పదు కదా అంటాడు. పేరయ్య వైదికులు నియోగుల్ని మించిపోయారని లింగరాజుతో అంటాడు. వైదికులు నియోగులు ఏమేం చేస్తున్నారో ఏకరవు పెడతాడు. నియోగులు మీసాలమీద నిమ్మకాయలు నిలబెడితే, వైదికులు మామిడికాయలు నిలబెడుతున్నారు. వాళ్ళు జుట్టుమానేస్తే వీళ్ళు బొట్టు మానేశారు. వాళ్ళు మూరెడు గోచీ పెడితే వీళ్ళు బారెడు పెడుతున్నారు. వాళ్ళు వేలెడు చుట్ట కాలిస్తే వీళ్ళు జానెడు చుట్టకాలుస్తున్నారు. వాళ్ళు కాఫీ హోటళ్ళకు పోతే వీళ్ళు రెఫరేషమెంట్ హౌసులకు పోతున్నారు. లింగరాజు మాటల్లో ఏమీ గొప్పతనం లేదనీ, అటువంటి చప్పిడి ఆలోచనలు తాము చేయమనీ కూడా చెప్తాడు. లింగరాజు పేరయ్య ఆలోచన అడుగుతాడు. ఆ సొమ్ము, భూమి దక్కించుకోవాలంటే ఆ రెండో పిల్లను పెళ్ళి చేసుకోవటం మంచిదని సలహా చెప్తాడు. లింగరాజు ఎలాగైనా ఆ సంబంధం ఖాయం చేయమంటాడు. ప్రయత్నిస్తానని పేరయ్య వెళ్ళిపోతాడు. అల్లరి పడే కన్నా సంబంధం చేసుకోవటమే మంచిది కదా! అనుకుంటాడు.

### 3.1.2 రెండవ రంగం కథ :

పురుషోత్తమరావు గారింట్లో ఆయన, పేరయ్య, భ్రమరాంబ, కమల కూర్చుని ఉంటారు. ఏం తేల్చారని పురుషోత్తమరావు అడుగుతాడు. ఏం చెప్పగలం? నాన్ కోఆపరేటర్లు కనుక ఆయన కోర్టుకు వెళ్ళడన్న సంగతి బాగా తెలిసిన లింగరాజు డబ్బు ఇవ్వకుండా గొడవ చేస్తున్నాడంటాడు పేరయ్య. ఏంచేద్దామని అడిగిన పురుషోత్తమరావుతో, కోర్టుకు వెళ్ళడం కానీ, డబ్బు పోగొట్టు కోవటం కానీ, సరి కాదనీ అందువల్ల చిన్నమ్మాయిని ఆ అబ్బాయికిచ్చి చేయటం మంచిదనీ అంటాడు.

డబ్బుపోయినా ఇక అతనితో సంబంధం వద్దు అని తన అభిప్రాయం చెప్తాడు పురుషోత్తమరావు. డబ్బు తప్ప పరువు, ప్రతిష్ఠ, పాపభయం ఏమీ లేని వాళ్ళతో చుట్టరికంచేసి ప్రతిరోజు బాధపడేకంటే, మంచి గౌరవం, ఆదరం ఉన్న వాళ్ళతో చుట్టరికం కలుపుకోవటమే మేలంటాడు. పేరయ్య, "మీకింత పట్టుదల వద్దు, అతన్ని అసహ్యించుకుని ఆ పిల్లవాణ్ణి వదులు కోవద్దు. ఏభైఏళ్ళు దాటిన అతడింకా ఎన్నాళ్ళు బతుకుతాడు? ఆ తర్వాత పెత్తనం మీ అమ్మాయిదేకదా! అయినా అంత డబ్బు పోగొట్టుకోవటం, అమ్మా! మీరయినా చెప్పండి జరిగింది మర్చిపోవాలేకానీ, అదే తలుచుకుంటూ బాధపడుతూపోతే మిగిలిన పనులెలా జరుగుతాయి ?" అని అంటాడు. భ్రమరాంబ ఏడుపు ఆపకుండానే, కాళిందిని వర్ణిస్తుంది: "నున్నటి చెక్కిళ్ళు, ఆ ముఖం, ఆ పెదవులు, చక్కని కనుబొమ్మలు, నుదురు, కౌశపాశం, మృదువైన మాటలు, ఆ గొంతులోని మార్దవం, ఆ నడక, ఆ వినియం - నిద్రలో కూడా నాకు మరపు రావటం లేదు. నేను ఎంత దురదృష్టవంతురాల్ని ? ఏ నాడూ నా మాట కెదురు చెప్పలేదు. తండ్రి గీచిన గీటు దాటలేదు. చదువంటే వెనుదీయలేదు. రాట్నం పని అంటే ఇష్టం. అదీ, ఇదీ కావాలని అడిగిందిలేదు. తినేటప్పుడు గొడవపెట్టలేదు. ఆటలకైనా అలగదు. పొరుగింటికి కూడా వెళ్ళి ఎరగదు. సరదాగా కూడా అబద్ధం చెప్పదు. మచ్చుక్కి కూడా పొల్లుమాటలాడదు. బతుకున్నంత కాలం ఆబిడ్డను మరవటం కుదరదు."

ప్రతిక్షణం, రాత్రీ పగలనక బాధపడుతూ ఆ చిన్నపిల్లను హడల గొట్టకు అంటాడు పురుషోత్తమరావు. "ఎంత చెప్పినా వినవు. ఇది వెర్రికాదా ? ఎవరి సమయం అయిన తర్వాత ఎవరుంటారు? నాటకంలో వేషం వేసేలాగ పాత్ర అయిపోగానే వెళ్ళిపోవాలి కదా!" అని ఊరడిస్తాడు. పేరయ్య, నాటకంలో ఆటగాడు పాత్రల్ని తెరమీదికి తెచ్చి ఆ పాత్ర అయిపోగానే కింద పారేసే లాగే, భగంతుడు కూడా

చేస్తాడనీ, తన పొడుంకాయను ఉదాహరణగా చెప్తాడు. ఆమె అభిప్రాయం అడిగినపుడు, తమ అభిప్రాయాలవల్ల జరిగిన నష్టం ఎలాగూ సరికట్టలేమనీ, చిన్న కూతురు మనసులో ఏముందో తెలుసుకోకుండా, ఏంచేయ వద్దనీ భ్రమరాంబ అంటుంది. పేరయ్య దాన్ని ఆమోదించి, కమలను ఆమె అభిప్రాయం చెప్పమంటాడు. ఆ అబ్బాయిని చేసుకోవటమా? లేక ఆ డబ్బు అతని పాలచేసి ఊరుకోవటమా నిర్ణయించమంటాడు.

కమల ఏంచేయాలని ఆలోచిస్తుంది; "ఇట్లాంటి పరిస్థితిలో నేనేం చేయాలి? అక్కలా సిద్ధాంతాల్ని అనుసరించాలా? లేక తల్లి తండ్రులకు మనశ్శాంతిని కలుగచేయాలా? అక్క అన్న మాటలు పరమసత్యాలు. కట్నం పుచ్చుకునే వాళ్ళచేత తాళికట్టించుకోవటం కంటే, గతి మాలిన పని మరొకటి లేదు. ఆ పెళ్ళి నాకిష్టం లేదంటే తల్లితండ్రులు బలవంత పెట్టరు, అదినిజం, అయితే అందువల్ల లాభం ఏమిటి? ఆ 5,500/- లు వాళ్ళకే వదులు కోవాలి. అంతకంటే ఆ పెళ్ళి చేసుకుని తగిన ప్రాయశ్చిత్తం చేయగలిగితే వాళ్ళ డబ్బూ వ్యర్థం కాదు. ఈ లోకానికొక పాఠం నేర్పినట్లు అవుతుంది. అదేసరి, కర్రను కాలిస్తే నిప్పు, భూమిని తవ్వితే నీరు, పెరుగు చిలికితే వెన్న, ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం లభించకపోదు."

పురుషోత్తమరావు కమలతో పేరయ్యకు సమాధానమివ్వమని చెప్పానే, ఆమె ఇష్టానికి మారుగా ఏంజరగదని చెప్తాడు. 'మీ ఇష్టం' అన్న కమలతో ఆమె ఇష్టాన్ని చెప్పమనీ, దానికే ముఖ్యత్వమనీ అంటాడు. ఆ పెళ్ళి విషయంలో అన్ని విషయాల్లో తన ఇష్ట ప్రకారం జరగనిస్తారా అని అడుగుతుంది. పురుషోత్తమరావు అలాగే కానిమ్మంటాడు. కమల ఆ పెళ్ళి తనకు ఇష్టమే నంటుంది. భ్రమరాంబ ఆలోచించమనీ, తమనిక కష్టాలపాలు చేయవద్దనీ అంటుంది. కమల తన ఇష్టాన్ని చెప్తుంది. పేరయ్య కమలను మెచ్చుకుంటాడు. పురుషోత్తమరావు పేరయ్యతో ఆ నెలలోనే పెళ్ళి నిశ్చయిస్తే భ్రమరాంబ బాధల్ని మర్చిపోయి, ఆలోచనల్లో పడుతుందంటాడు. పేరయ్య అలాగే చేసుకు వస్తానంటాడు. వయసుకన్నా ఎక్కువ ఆలోచనా శక్తితో, కాళింది చేసిన దుఃఖపూరిత చర్యకు మారు చేసిందని కమల తల్లిదండ్రులు ఆనందిస్తారు. "అక్కా! నీ అభిప్రాయానికి విరుద్ధంగా ఇలా చేశానని అనుకోవద్దు. నా మీద ప్రేమగానే ఉండు. నీ అభిప్రాయానికి విపరీతంగా చేయటం కాదు కానీ, వాళ్ళమీద కసితీర్చుకోవడానికి నాకీ ఉపాయమే తోచింది." అంటూ కమల అక్కను తలచుకుంటుంది.

### 3.2.1 సప్తమాంకం మొదటి రంగం కథ :

లింగరాజు పడకగదిలో లింగరాజు, సుభద్ర ఉంటారు, ఆ పెళ్ళి సందర్భంలోనైనా నగలివ్వమనీ, నలుగురు వచ్చిపోయేటప్పుడు కూడా అలాగే ఉండాలా అనీ ప్రశ్నిస్తుంది. పెళ్ళికింకా రెండురోజులుందనీ అప్పటిదాకా ఒంటిమీద అరిగిపోవటం తప్ప మరిఏమీ లేదనీ అంటాడు. సుభద్ర కోపంగా, నగ అరిగిపోతుందనీ, బట్టలు చిరిగిపోతాయనీ, బియ్యం తరిగి పోతాయనీ, గోల ఎందుకనీ, స్వారీ చేయని గుర్రం, చదువని పుస్తకం, తీసుకోని మందు, తినని వంటకం, అనుభవించని ధనం వ్యర్థమనీ అంటుంది. మర్నాడు తప్పక ఇస్తానన్న లింగరాజుతో శుక్రవారం అని సున్నా చుట్టడానికా అంటుంది. కోడలి కేమి నగలు పెడతారని చెప్తుతుంది. కోడలి నగల గురించి పేచీ ఎందుకంటాడు ? లింగరాజు, ఆడవాళ్ళకు నగల రుచి ఎవరు మప్పారో అని తిట్టుకుంటాడు. రోజుకోరకం దిగుమతి అవుతున్నాయనీ, కంసాలులకు, షరాబులకు మాత్రం తరగని పని, మంచిలాభం అంటాడు. అతని వంటి భర్తలకు మాత్రం ప్రాణసంకటం అంటుంది. సుభద్రతో, తాను చెప్ప జాగ్రత్తగా వినమంటాడు. పెళ్ళి అయిదు రోజులూ, వియ్యాల వారు పంపే అరిసెలు, సున్ని, అప్పడాలు, వడియాలు, విధవలకని పిండి, స్వయం పాకం చేసుకునే వాళ్ళకని ఉప్పు, పప్పు, బియ్యం, నెయ్యి, బెల్లం, చింతపండు, మిరపకాయలు మొదలు కట్టెలు, పిడకలు, పసుపు కుంకమల దాకా తనకు అప్పగించాలంటాడు. ఎందుకంటుంది సుభద్ర. బజారులో అమ్మిస్తానన్న లింగరాజును చూసి లోకం నవ్వుతుందని హెచ్చరిస్తుంది. మొన్న ఆ మధ్య ఉమామహేశ్వరరావు అలాగే చేశాడనీ, తాను మాత్రం పోలీసులకు పది రూపాయలిచ్చి, సంభావనలకోసం వచ్చేవాళ్ళను అడ్డుకోమంటాననీ లింగరాజు చెప్తాడు. తన చీరల సంగతి కూడా అంతేనా అన్న భార్యతో, "నీచీరల కేమే పిచ్చిముఖమా ! ఐదు రోజులకు ఐదు చీరలు కాకుండా అప్పగింతల కొక చీర, చీరలే కాదు నీకు రావాల్సిన లాంచనాలూ చాలా ఉన్నాయి. ప్రతిరోజు ఒక మొహరీ చొప్పున ఐదు మొహరీలు, కాసులు, వెండి పలుదోము పుల్లలు, బంగారు తాటాకులు, వెండి పల్లుకుట్టు పుల్లలు, వెండి కప్పులు, ప్లేట్లు, కుర్చీలు, కాలిపీటలు, అద్దాలు, దంతపు దువ్వెనలు, కుంకుమ భరిణెలు, గంధపు చెక్కలు, విసనకర్రలు, భోజనంలో వెండి చేపలు, పసిడి పీతలు,

కాటుక కాయలు, గంధపు గిన్నెలు, తలనూనె బుడ్లు, సబ్బు, పౌడరు, చేతిరుమాళ్ళు, ఇలా అయిదురోజులూ ఎన్నో వస్తాయి. నీదే అధికారం. గ్రామ దేవతకైనా ఒక్కరోజే జాతర, కానీ పెళ్ళికొడుకు తల్లికి మాత్రం ఐదు రోజులు అధికారం" అంటూ వివరిస్తాడు.

పెళ్ళికైనా క్షౌరం చేయించుకోమంటే ఆసంగతి మరిచి పొమ్మంటాడు. సుభద్ర తనలో తాను సృష్టిలోని విచిత్రాల గురించి ఇలా తర్కించుకుంటుంది. "కనికరం లేదు. ప్రేమ పొట్టచీల్చినా కనపడదు. సిగ్గు, పాపభీతి మచ్చుక్కి కూడా లేవు. నిజం పలకడంరాదు. లోభిని దేవుడు ఏ పదార్థంతో చేశాడోగానీ. అయినా రాజు దుర్మతినే తనతో ఉంచుకుంటాడు. ఆడపిల్లలు తుంటరినే వరిస్తారు. వానకొండల దగ్గరే పడుతుంది. అలాగే డబ్బుకూడా లోభి దగ్గరకే వచ్చిచేరుతుంది. అయినా సంపద కాలంలా తిరుగుతుందే కానీ, ఒకచోట నిలవదు కదా! పేదవాడి కొడుకు లోభిగా పుట్టవచ్చు. అతడికొడుకు త్యాగి కావచ్చు. త్యాగి కొడుకు పేదవాడు కావచ్చు. సిరికూడా చక్రంలా పైకీ, కిందికీ తిరుగుతూనే ఉంటుంది. ఇదేకదా సృష్టిలోని చిత్రం."

### 3.2.2 రెండవ రంగం కథ :

పురుషోత్తమరావు గారింట్లోని పెళ్ళి పందిరి. పురుషోత్తమరావు ప్రవేశిస్తూ, ఆరోజు మూడవ రోజనీ, ఇంకొక రెండు రోజుల పెళ్ళికార్యం ఉందనీ, ఆడపిల్ల పెళ్ళిచేయటం కన్నా అశ్వమేధయాగం చేయటం సులభమనీ అనిపిస్తోందంటాడు. తెల్లవారగానే నీళ్ళు, పళ్ళుతోముకునే పుల్లలు పంపాలి. కావిళ్ళతో కాఫీలు, టిఫిన్లు పంపాలి. భోజనాలకు రమ్మని పిలవాలి. తినేటప్పుడు వారి కోర్కెలు కనిపెట్టి మరీ తీర్చాలి. ఒక్కడు రాకపోయినా పచ్చిమంచినీళ్ళు తాగకుండా ఎదురు చూడాలి. ఇంతచేసి చెడ్డపేరు తప్ప ఏమీ మిగలదు.

అంతలో ఘంటయ్య ప్రవేశించి, వియ్యపురాలు లేచేవేళయింది. కనుక అమ్మగార్ని పంపమంటాడు పురుషోత్తమరావు ఎందుకంటాడు. ఘంటయ్య కళ్ళుతుడవటం, పళ్ళుతోమి, కాళ్ళుమడిచి, కొకసర్ది, నీళ్ళుపోసి, కొత్త చీరకట్టి, పారాణి గంధంపూచి, అత్తరు పన్నీరు చల్లి, దిష్టితీసి, హారతిచ్చి, ఇంకా ఎన్నోచేయాలి అంటాడు. ఇవన్నీ ఎక్కడ వినలేదనీ, ఇటువంటి స్త్రీల అవస్థతో పోలిస్తే తన అవస్థ లెక్కలేనిదని అనుకుంటాడు పురుషోత్తమరావు.

పురుషోత్తమరావు భార్యను పిలిచి వియ్యపురాలు లేచే వేళయిందట వెళ్ళమంటాడు. భ్రమరాంబ మోహరీలు అడిగి తీసుకుని వెళ్తుంది. పురుషోత్తమరావు పేరయ్యతో ఇక రెండు రోజులు గడిస్తే చాలంటాడు. పేరయ్య అది గడ్డురోజు అనీ, లింగరాజు భారీగా సంభావన లిస్తారని ఎందరో వస్తే అతను పోలీసుల్ని పెట్టించాడనీ అంటాడు. వీరయ్య వచ్చి, ఇంకా ఫలహారాలు రాలేదంటాడు. ఎవరికి వాళ్ళు కాఫీ హోటళ్ళకు పోదామనుకుంటుంటే ఆపి తాను వచ్చాననీ అంటాడు. ఇప్పుడే పంపిస్తానన్న పురుషోత్తమరావుతో, వీరయ్య, "ముందురోజు పంపిన ఉప్మాలో నిమ్మపళ్ళ రసం లేదనీ, ఇడ్లెన్లలో అల్లం ముక్కలు లేవనీ, కాఫీలో పంచదార లేదనీ - ఈ రోజు బాగాలేకపోతే తెచ్చిన వాళ్ళ ముఖానే కొట్టాల్ని ఆలోచిస్తున్నారు. చుట్టలు, సిగరెట్లు, బీడీలు మంచివి పంపండి. చీట్లపేక చిరిగిపోయింది, మరొకటి పంపండి" అని చెప్పి వెళ్తాడు

పురుషోత్తమరావు మగపెళ్ళివారు మిలిటరీ ఫోర్సులాగున్నారనీ, అధికారం చెలాయిస్తున్నారనీ అనుకుంటాడు. పేరయ్య, పురుషోత్తమరావు చేతిలో ఎక్కువ డబ్బు ఉండదనీ, తనకు రావలసింది రాబట్టుకోవటం మంచిదనీ, ఆడపిల్ల పెళ్ళి చేశాక మిగిలేది ఏమీ ఉండదనీ అనుకుంటాడు. పిల్ల పెళ్ళి చేస్తే మిగిలేదంతా - మొదటిరోజు హడావిడి, రెండోరోజు ఆయాసం, మూడోరోజు మంగళాష్టకాలు, నాలుగో రోజు సిగపట్లు, ఐదోరోజు అప్పగింతలు, ఏడోరోజు వంటబ్రాహ్మల తగవు, ఎనిమిదోరోజు అప్పిచ్చినవాడి నోటీసు, తొమ్మిదో రోజు జవాబు, పదోరోజు దావా పదకొండో రోజున స్టేటుమెంటు, పన్నెండున విచారణ, పదమూడున డిక్రీ, పధ్నాలుగున టముటము, పదిహేనోరోజు వేలం, పదహారోరోజు చిప్పఅంతే - అదే పదహారో రోజు పండగ కనుక తనకు రావల్సింది ముందే పుచ్చుకోవాలి అనుకుంటాడు.

### 3.2.3. మూడవ రంగం కథ :

పురుషోత్తమరావుగారు భోజనాల పందిట్లో ఉంటారు. రెండు గంటలు అయినా ఒక్కరూ భోజనానికి రాలేదని బాధపడతారు. పిలిచినా పలక్కుండా బిగదీసుకుని కూర్చునే వాళ్ళు, సుష్టుగా తిని కూర్చుని రాననే వాళ్ళు, పిల్వగానే ముందే వస్తే పరువు తక్కువనుకునే వాళ్ళు

- ఇలాంటి వాళ్ళుంటారని బెంగపడతాడు. పేరయ్య వగరుస్తూ అలసిపోయి వచ్చి కూర్చుంటాడు. పెళ్ళివారు బ్రాహ్మల్ని పోలీసులతో పాడిపించి నందుకు బయటకు వస్తే కొడతారనే భయంతో ఇంట్లోనే వండించుకుని తిన్నారంటాడు. మరి మిగిలినవారు రాలేదేమి అని అడిగితే, "లింగరాజు మొదటి భార్య మేనమామ బావ మరది తోడల్లుడి తమ్ముడికి ఇడ్లెన్లలో అల్లం ముక్కలు తక్కువయ్యాయని అలిగాడట. పెళ్ళికొడుకు తండ్రి బాపతు పినతండ్రి సవతి తల్లి తమ్ముడి బావమరదికి వేలువిడచిన మేనమామ కొడుక్కు రాత్రి చిన్న పీట వేశారని కోపంతో భీష్మించుకున్నాడు. వియ్యపురాలి అన్న పిన్నత్తగారి ఆడపడుచు తోడికోడలి సవతి తల్లి తమ్ముడు మేనమామగారి మేనత్తకొడుకు మేష్టరుగారి స్నేహితుణ్ణి అందరితోపాటు ఆదరించలేదనీ, రైలుకు పోతానని రంకెలు వేస్తున్నాడు. స్టూడెంట్లు బంగాళదుంపలకూర, పకోడీల పులుసు, చేయించ లేదని ఈ పూట మానేస్తారట. వాళ్ళంతా రాకుండా మిగితావాళ్ళం ఎలా వస్తామని ఆలోచిస్తున్నారు. ఇక మీరు వెళ్ళి కాళ్ళా వేళ్ళాపడితేకానీ, నావల్లకాదంటాడు. ఊళ్ళోవాళ్ళు వస్తాం, వస్తాం అంటారే కానీ ఎవరూ రాలేదని పేరయ్య ఒక్కొక్క కారణంగా చెప్తాడు.

భ్రమరాంబ కోపంగా వస్తుంది. "పేరయ్యగారూ! చాలా మంచి సంబంధమండీ! వాళ్ళకు రావల్సిన వన్నీ పిండిమరీ పుచ్చుకుంటున్నారు. మనకు రావాలంటే మాత్రం ఆనవాయితీ లేదంటారు. మనం ఇచ్చిన కట్నాన్ని బట్టి మంగళహారతిలో రు. 516/- రావాలా, వాళ్ళు వరహాకన్నా ఇవ్వనంటున్నారు. ఇంతేకాదు వియ్యపురాలి పినతల్లి కూతురి తోడికోడలి అక్క ఆడుబిడ్డ సవతి ముఖాన అద్దిన మొహరీ మోటుగా ఉందట. అందుకని ఆమె అలిగిందట. వియ్యపురాలు బాధపడుతోంది. అమ్మలక్కలందరూ ఆమెకు పురెక్కిస్తున్నారు." విసుగ్గా అంటుంది.

'వెళ్ళి కాళ్ళమీద పడి బతిమాలుదాం పద' అంటాడు పురుషోత్తమరావు. భార్యతో సహా వియ్యాలవారిని చూడడానికి వెళ్తూ ఆకాశం కేసి చూసి చేతులు జోడించి ఇలా అనుకుంటాడు. 'మళ్ళీ ఆడపిల్లపెళ్ళి, లోభి చుట్టరికం, ఎముకలు కొరికే లౌక్యం కలవారి పొందు సర్వేశ్వరా! ఈ జాతికి మాత్రం విధించావు. పగవాళ్ళకు కూడా ఇట్లాంటి జీవితాన్ని విధించవద్దు' అని ప్రార్థిస్తాడు.

### 3.3.1. అష్టమాంకం కథ : మొదటి రంగం :-

వెర్రి బుర్రల వెంగళప్ప కచేరి చావడిలో వెంగళప్ప కూర్చుని ఉంటాడు. తనలో తాను మాట్లాడుకుంటూ ఉంటాడు "పది అయింది. ఇంకేం వస్తాయి? పదికొట్టేసరికి కోటూ, పాగా తగిలించుకుని కోర్టులో అక్కడక్కడ తిరుగుతూ మనిషి కనపడగానే పట్టుకుంటుంటే ఎంతమందికని కేసులు దొరుకుతాయి? ఈ రోజుల్లో నాలుగే వృత్తులు. సిగరెట్ల దుకాణం కాఫీ హోటలు, మెడికల్ ప్రాక్టీసు, ప్లీడరీ ఏ వీధిలో చూసినా ఇవే కదా! వీటిల్లో కాఫీ హోటలు ఫస్టు, ప్లీడరీ లాస్టు, నాన్‌కో ఆపరేషన్ కొంత, స్టాంపు డ్యూటీ పెరిగి పూర్తిగానూ ఈ వృత్తిని పాడు చేశాయి. తాలుకా బోర్డు ప్రెసిడెంటు పోస్టు రాకపోతే బీరువాలమ్ముకుని బతకాల్సి ఉండేది. ప్రస్తుతం దీంట్లోనూ తిప్పలే! టి. ఏ. ఫిక్సైడు అయింది. ఈ సంవత్సరం కమీషను కూడా క్రితం ఏడే వాడేసుకున్నాను. ఈ స్కూలు టీచర్లను భయపెడితే - బదిలీలనీ, ఫైనులనీ, బర్తరఫులనీ అంటే ఒక నెల జీతం ఇవ్వటం కష్టం. అన్నిటికీ పైన స్వరాజ్య పార్టీ వాళ్ళు. నోట్లు లేక పోవటం వల్ల ఓట్లు కొనలేం. బ్రాందీకి డబ్బులేదు. ఇంటి దానికి డబ్బివ్వకపోతే చెప్పు దెబ్బలు తప్పవు. ఎవరో వస్తున్నట్లుంది" అనుకుని గంభీరం నటిస్తాడు.

వచ్చినవాడు అచ్చన్నపేట స్కూలు అయిదోటీచరుననీ, తన భార్య ప్రసవానికి కష్టపడుతోంది కనుక రెండురోజులు సెలవుకోసం వచ్చాననీ అంటాడు. నువ్వు కనవు కదా! లీవు లేదు పొమ్మంటాడు వెంగళయ్య. ఇన్స్‌పెక్టర్ని చూసి వచ్చావన్న టీచరుకు ఫైను వేస్తాడు. సస్పెండు చేస్తానంటాడు. కనికరించమన్న టీచరును ఉద్యోగం మంచి తీసేస్తున్నానంటాడు. ఆ మాట విన్న టీచరు కోపాన్నంతా మాటల్తో కక్కుతాడు: " ఆ మాటకూడా అన్నావుకదా ! ఇంకేం చేయగలవు ? మూడేళ్ళు అవగానే ఈ పదవి పోతే అడుక్కుతినే యోగం పడుతుంది బాధ నీకే గానీ, మాకీ మాత్రం పని దొరక్కపోదు. అన్ని నీచమైన పన్లూ చేసి ఈ పదవి సంపాదించావు. ఎక్కడ చూసినా మున్సిపాలిటీల మా బోర్డులు నీలాంటి నీచులు లేదా నిరక్షరకుక్షులతో నిండి ఉన్నాయి. మీ మాటలు నమ్మి ఓటు వేసేవాళ్ళననాలి. ఇన్స్‌పెక్టరు నీతో కలసి నీ పాటకు తాళం వేయటం లేదనే కదా! ఆయనంటే నీకు నచ్చదు. అతని వల్లే ఏదో ఇంత అన్నం తింటున్నాం ! నీకేం అర్హత ఉంది? ఎంత మంది నీ జీవానికి పడి ఏడుస్తున్నారో ! ఎందరి ఉసురుకొడుతోందో? భగవంతుడు మా మొర వినకపోడు. నీకు ఈ మాటు పోస్టు ఊడిపోతుంది. ఈ మాటలు గుర్తుంచుకో !" అని కోపంగా వెళ్ళిపోతాడు. వెంగళయ్య ఆ టీచరన్న మాటలకు సమాధానం చెప్పలేక పోవడానికి గిల్టీకాన్షస్సే కారణం కాబోలునని, అందరూ తన్ను చూసి భయపడతారు ఈ మాటలు విని ఉంటే ఇంకేం ఉందనీ అనుకుంటాడు.

లింగారాజు వస్తూ తీరికగా ఉన్నారా? అని అడుగుతాడు. పార్టీల్ని పంపించి, ఎవరో టీచరు ఏదో చెప్తుంటే వింటూ ఉన్నాననీ, వచ్చికూర్చుని విషయం చెప్పమనీ అంటాడు. లింగరాజు, పురుషోత్తమరావు కుమార్తెకు 4,000/- నగలు పెట్టాననీ, మూడేళ్ళయినా పిల్ల కాపురానికి, రాలేదనీ, ఆ నగలు తాకట్టు పెట్టిన వారివనీ వారిపుడు కష్టపెడుతున్నారనీ అంటాడు. ఆ నగలు తీసుకోవాడనికి పిల్ల తండ్రి పేరున కేసు పెడ్డదామంటాడు. వెంగళయ్యతో తండ్రిమీదే కాదు, ఆ పిల్లను కోర్టుకీడ్చి నగలు ఇప్పించాలంటాడు; లింగరాజు. పసిపిల్లను నగల్తో తీసుకుని వెళ్ళి పంపటం లేదని, ఇంజక్షన్ ఇప్పించవచ్చునీ, లింగరాజు అడిగినట్లుగానే మనోవర్తి లేకుండా ఆ సంబంధం తప్పించవచ్చునీ, మున్సబు గారితో చెప్పి ఏర్పాటు చేస్తాననీ అంటాడు. సాయంకాలం కొడుకును తీసుకుని రమ్మని వెంగళయ్య చెప్తాడు. ప్లీడరు ఇంటికి రాగానే ఫీజు గోల సిద్ధమనీ, రోగి బతికినా చచ్చినా సరే వైద్యుడు డబ్బు తీసుకోవాలనుకుంటాడనీ, వాజ్యం గెలిచినా ఓడినా ప్లీడరుకు ముందే ఫీజు ఇవ్వక తప్పదనీ తనలో తానే అనుకుంటాడు.

3. 3. 2. రెండవ రంగం కథ : కమల నూలు వడుకుతూ పెద్దలు కదురు తిరిగినా, కవ్వం తిరిగినా కాటకం ఉండదని అనుకుంటుంది. రాట్నం పగలూ రాత్రి అనక కాల చక్రంలా తిరిగితే, విష్ణు చక్రంలాగా క్షామాన్ని పారద్రోలితే, భూలోకమంతా బాగుండదా అనకుంటూనే, ఎందుకు తండ్రి వస్తున్నాడా ? అని లేచి నిలుచుంటుంది. చివరకు లింగరాజు కోర్టు కెళ్ళాడని నోటీసు చూపిస్తాడు. పురుషోత్తమరావు ఆ నోటీసు చదివి విన్పిస్తాడు, "హైకోర్టు వకీలు వెర్రిబుర్రల వెంగళప్ప నుంచి పుణ్యమూర్తుల పురుషోత్తమరావు గారికి మా క్లయింటు సింగరాజు బసవరాజు గారికి మీ కుమార్తె కమలను ఇవ్వటంవల్ల నాలుగు వేల రుపాయల కిమ్మత్తుగల మంచి బంగారు నగలు పెట్టారనీ, వాటిని హరించే ఉద్దేశంతోనే చిన్నదాన్ని కాపురానికి పంపకుండా ఉండటం వల్లనూ, మీ పై దావా వేయబడింది. మీరు సంజాయిషీ ఇవ్వాలి. ఈ నోటీసు అందిన ఇరవై నాలుగు గంటల్లోగా ఆపిల్లను కాపురానికి పంపి, రసీదు తీసుకోక పోతే దావా వేయటమే కాక ఖర్చులు కూడా రాబట్టుకోవలసి ఉంటుంది. ఇట్లు వెర్రి బుర్రల వెంగళప్ప బి.ఎ., బి.యల్.

కమల సమాధానం రాయవద్దనీ, దావాకూడా దాఖలు చేయనీయమనీ అంటుంది. ఆమె తండ్రి. "నీ అభిప్రాయం అడిగినపుడెల్లా సమయం వస్తే చెప్తానంటావు. ఇప్పుడేం అపకీర్తి వస్తుందో ! అని ఆందోళనగా ఉంది. పరులకు దాస్యం చేస్తూ పరువు మాలి బతికేకన్నా పస్తుమేలు, సరసం తెలియని వారితో జగడం పెట్టుకుని కోర్టుకు వెళ్ళేకంటే కొరతమేలు." అంటారు. తండ్రి చెప్పినది నిజమే అయినా ఈ వ్యవహారం అటువంటిది కాదనీ అన్నీ తనకు వదిలివేసి పరమశాంతంగా ఉండమనీ అంటుంది. ఆమె ఇష్టమనీ, అలాగే చేయమనీ ఆమె తండ్రి వెళ్ళిపోతాడు. కమల ఆకాశంకేసి చూసి చేతులు జోడించి, "సర్వేశ్వరా ! నిన్ను నమ్ముకుని, కష్టములను ఓర్చుకుని, చేపట్టి భరించే కృపామయుడవని నమ్మి నీపాదాలను సేవిస్తున్నాను. బాలను, బేలను, దీనురాలను ఐన నన్ను ఏవిధంగా ఏ సమయంలో ఎలా కాపాడతావో?" అని ప్రార్థిస్తుంది.

## 3. 4. నవమాంకం కథ :

న్యాయస్థానంలో అభియోగపత్రం చదువుతూ న్యాయాధిపతి, ఎదుట కుర్చీలో వెంగళప్ప, అతని వెనకాల లింగరాజు, బసవరాజు, రెండోవైపు కమల, పురుషోత్తమరావు ఉంటారు. పురుషోత్తమరావు న్యాయస్థానానికి వచ్చిన దాన్ని గురించి ఆలోచిస్తుంటాడు. "కోర్టు ఎక్కడం కంటే కొరత ఎక్కడం మేలు. ఒక మనిషి ముందు మరొకడు నిలుచుని ఉంటే, మరొకడు బల్ల గుద్దుతూ మాటి మాటికి ఏ ప్రశ్న వేసినా తల ఒగ్గి సమాధానం చెప్తూ నిట్టూర్చే దానికన్నా అవమానం ఏం కావాలి? ధనలోభమో, పట్టుదలో, దురాశో ఏదో ఒక దానివల్ల వెర్రెత్తి కూట సాక్ష్యాలను ఏర్పరచుకొని, ఇల్లూ వాకిలి ముసలి వాళ్ళ కొదిలేసి, బ్రోకర్ల దుర్బోధలు నమ్మి ప్లీడరు కోరిన ఫీజులిచ్చి పూట కూళ్ళ భోజనాలు చేసి కోర్టే దేవాలయంగా భావించి, జడ్జీ దైవమనుకుని తిరిగే కర్మ, ప్రజలకెందుకు పట్టిందో? కారణం కట్నం, సాక్షుల కొరుకుడు, ఏజెంటు ఖర్చులు, ప్లీడరు ఫీజు, పెరిగిన స్టాంపు డ్యూటీలు, కోర్టు గుమస్తా ముడుపు, రైలు ఛార్జీలు, కాఫీ హోటళ్ళ ఖర్చు అంటూ పెరిగే ఖర్చులకు కొంపాగోడూ అమ్ముకుని గెలిచినవాడు లోపలా ఓడిన వాడు బయటా ఏడ్వటం కన్నా ఏమి మిగుల్తుంది?"

బసవరాజు చివరకు తన పెంపుడు తండ్రి తన్ను కోర్టులో నిలుచో పెట్టాడు కదా! అని బాధపడతాడు. పెళ్ళి కాగానే చదువు మాన్పించి, ప్రజలు హేళన చేసేలాగు కోర్టుకెక్కించి, ధనమే బ్రతుకనుకునే పెంపుడు తండ్రికన్నా సవతి తల్లి ఎంతో మేలు కదా! అనుకుంటాడు.

న్యాయాధిపతి, వెంగళప్పతో ఆ వ్యవహారం అంతదూరం వచ్చి ఉండకూడదనీ, ఇరువురికీ రాజీచేసి ఉండవలసినదనీ చెప్తాడు. వెంగళప్ప అలా అనవద్దనీ తన క్లయింటుకు అయిదువేలు కట్నం కూడా వచ్చిందనీ, మద్రాసులో అతని వంటి మర్యాదస్థుడు లేడనీ అంటాడు. మళ్ళీ సర్దుకుని అతని తండ్రికి మూడు పెళ్ళిళ్ళు అయ్యాయనీ, ముప్పైవేల కట్నం వచ్చిందనీ, మూడుసార్లు మున్సిపల్ మెంబర్‌గా పోటీ చేశారనీ చెప్తాడు. న్యాయాధిపతి ఆ చరిత్ర వ్యర్థమని రాజీ గురించి ఆలోచించమనీ చెప్తాడు. వెంగళప్ప, ఆ విషయం ఈశ్వరుడు చెప్పినా వినడనీ, దావా తమ పక్షం అయ్యేలా రికార్డు ఉందనీ సాక్ష్యం కూడా ఉందనీ, అంతకు ముందు వచ్చిన తీర్పులన్నిటినీ ఏకరవు పెడతాడు. న్యాయాధిపతి లింగరాజుతో, 'మీరయినా మీ అబ్బాయిని ఒప్పించలేరా' అని అడుగుతాడు. లింగరాజు తమ నగలు తమకిప్పించి, తమకూ వారికీ ఏ సంబంధం లేకుండా చేస్తే తన కొడుకును ఒప్పిస్తానంటాడు. న్యాయాధిపతి కోడలు ఎందుకు వద్దని అడుగుతాడు. ఆ పిల్ల అణకువగా కాపురం చేయదంటాడు లింగరాజు. పురుషోత్తమ రావుగార్ని మీరయినా అమ్మాయికి నచ్చ చెప్పగూడదా అంటారు. పురుషోత్తమరావు, న్యాయాధిపతితో తాను ఏం చేయలేనని అంటాడు. అపుడు ఆ వ్యవహారం సానుకూలం పడే స్థితిలేదు కనుక కోర్టు వ్యవహారంగాక తప్పదనీ న్యాయాధిపతి అంటాడు.

కమల, మనస్సును కుదుట పరచుకుని ధైర్యం తెచ్చుకుని దైవాన్ని ప్రార్థించి, సరస్వతిని వేడుకుని అక్కను తనకు తోడు రమ్మని కోరుకుని న్యాయాధిపతిని, "తాము ధర్మదేవతకు సమానం. ఇది ధర్మదేవత పీఠం కనుక నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా అనుకుని నాకు మాట్లాడ్డానికి అనుజ్ఞ ఇవ్వండి" అని వేడుకుంటుంది. వెంగళప్ప ఆమె మాట్లాడకూడదనీ, మైనారిటీ తీరని వాళ్ళు మాట్లాడకూడదనీ ఎన్నో తీర్పులున్నాయంటాడు. కమల, "అయ్యా! చట్టం, సందర్భం వేరు వేరు. సందర్భాన్ని బట్టి చట్టం మారాలేకానీ, చట్టాన్ని బట్టి సందర్భం మారదు కదా! వయస్సు విషయంలో చట్టం చెప్పిన దానికి తగకపోయినా, నాకు వకీలును పెట్టుకునే స్తోమత లేదు కనుక భగవంతుడిచ్చిన తెలివితో నా స్వవిషయాన్ని చెప్పుకునే నేర్పు ఉంది. కనుక నాకు అవకాశం ఇవ్వ"మని వేడుకుంటుంది. న్యాయాధిపతి ఆమె చెప్పాలనుకుంటున్న విషయాన్ని చెప్పడానికి అనుమతిస్తాడు.

కమల ఇలా చెప్తుంది - "దావాలో మొత్తం రెండు విషయాలు - ఒకటి నాకు వాళ్ళు పెట్టిన నగలు. ఇవిగో ఆ నగలు. వీటిని కల్యాణవేళ నాకు బహూకరించారు. బహుమతిగా ఇచ్చిన వస్తువుల్ని తిరిగి తీసుకునే హక్కు దాతకు లేదు." అంతలో వెంగళప్ప వెనక్కు తీసుకోడానికి హక్కుందని కలకత్తా తీర్పులున్నాయని వెదుకుతాడు. న్యాయాధిపతి అతన్ని ఆపి రెండవ విషయం ఏమిటని అడుగుతాడు. కమల ఆ విషయాన్ని శ్రద్ధగా వినమంటుంది. తన భర్త తన ఇంటికి వచ్చి తన మాట ప్రకారం నడచుకోవాలే కానీ, తన్ను భర్త ఇంటికి రమ్మనడానికి అతనికి అధికారం లేదంటుంది. వెంగళప్ప కోర్టు తీర్పు వెదికేలోపు న్యాయాధిపతి అతన్ని అడ్డుకొని, కమలను కారణం చెప్పమంటాడు. కమల, తన భర్తను వేలంలో తాము రూ. 5,500/- లకు కొన్నామంటుంది. న్యాయాధిపతి అదెలాగని ప్రశ్నిస్తాడు. కమల, తనకు కాళింది అనే అక్క ఉండేదనీ, ఆమె కోసం సంబంధాలు చూస్తున్నపుడు మున్నంగి వారితో పోటీలో తన తండ్రి పెళ్ళి కొడుకును రూ. 5,500/-లకు కొన్నారంటుంది. లింగరాజు అది అబద్ధమంటూ అరిచి వెంగళప్పను చెప్పమంటాడు. వెంగళప్ప ఉలికిపడి లేచి అదంతా అబద్ధమనీ అవసరమైతే గంగలోదిగి ప్రమాణం చేయిస్తాననీ అంటాడు. కమల అగ్రిమెంటు, డబ్బు ముట్టినట్టు ఇచ్చిన రసీదు, రెండూ న్యాయాధిపతికి ఇస్తుంది. న్యాయాధిపతి వాటిని చూసి, అవి వాళ్ళిచ్చినవేనా అని అడుగుతాడు. లింగరాజు వాటిని కల్పించారంటాడు. వెంగళప్ప అది ఫోర్జరీ అని, ఆర్డర్ ఇవ్వాలనీ అడుగుతాడు. కమలకు ఇండియన్ పీనల్ కోడ్ 467 సెక్షన్ ప్రకారం ఆ ఆర్డర్ ఇమ్మని కోరుతాడు. న్యాయాధిపతి, మరి ఆమె అక్కకు ఆ పెళ్ళి ఎందుకు జరగలేదంటాడు. కమల కొని తెచ్చిన వరుణ్ణి చేసుకోవడానికి, ఇష్టపడక, తన అక్క చేసుకున్న ఆత్మహత్య గురించి చెప్పి, వార్తా పత్రిక చూపిస్తుంది. న్యాయాధిపతి అది చదివి, అంత ఘోరం జరిగింది కనుకే ఆ అబ్బాయిని కమల కిచ్చి పెళ్ళి చేయవలసి వచ్చిందా? అని అడుగుతాడు. చేయక తప్పింది కాదని, చేజిక్కిన సొమ్ము వాపసివ్వడానికి ఒప్పుకోక పోవటం వల్ల తనకా పెళ్ళి చేసుకోవలసి వచ్చిందంటుంది.

లింగరాజు వాళ్ళు డబ్బు ఇచ్చి ఉన్నా, అది కట్నమే తప్ప క్రయం ఎలా అవుతుందని ప్రశ్నిస్తాడు. కమల ఆ రెండింటికి భేదం లేదంటుంది. ఉందనుకుంటే కట్నం పెళ్ళి జరిగేటప్పుడు ఇస్తారేకానీ వేలం, బజానా, అగ్రిమెంటు వంటివి ఉండవని చెప్తుంది. అంతేకాక ఎక్కడైనా పెళ్ళి పత్రికలో వారి కుమారునికి వీరి కుమార్తెనిచ్చి అని కదా ఉండాలి. ఇదెలాగుందో చూడమని న్యాయాధిపతికిస్తుంది. న్యాయాధిపతి ఒక శుభలేఖను చూసి, "నా కుమార్తె చి॥ సౌ॥ కమలకు బ్రహ్మశ్రీ సింగరాజు లింగరాజు గారి కుమారుడు బసవరాజునిచ్చి" అని ఉండటం

చూసి నవ్వుతాడు. ఆ శుభలేఖ పురుషోత్తమరావు గారిది కావచ్చని ఊహించి, లింగరాజు గారి శుభలేఖను కూడా పరిశీలిస్తాడు. కానీ అందులోనూ "నా కుమారుడు చి॥ బసవరాజును బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారి కుమార్తె చి॥ సౌ॥ కమలకు ఇచ్చి" అనే ఉంటుంది. స్పష్టంగా శుభలేఖలోనే కమలకు ఇచ్చినట్లుగానే ఉంది కనుక లింగరాజుగారు అతని కుమారుణ్ణి ఇచ్చి వేసినట్లేనంటాడు.

లింగరాజు అది అన్యాయమనీ, వాళ్ళ శుభలేఖలు వేసినప్పుడు తమవి కూడా అచ్చువేయించమంటే అలా మోసం చేశారనీ అంటాడు. వెంగళప్ప అది ఫోర్జరీ కేసనీ పురుషోత్తమరావు మీద కూడా ప్రాసిక్యూషన్ ఆర్డరు వేయవలసిందేననీ అంటాడు.

కమల, తన తండ్రికి ఏం తెలియదనీ, పెళ్ళికి శుభలేఖలు వేసినప్పుడు న్యాయాన్ని బట్టి తానే ఆ మార్పు చేయించాననీ, అప్పుడు వాళ్ళు అడ్డు చెప్పకుండా ఇప్పుడిలా మాట్లాడటం సరికాదనీ అంటుంది. తన భర్త మీద హక్కు తనకుందో, తనమీద హక్కు భర్తకుందో న్యాయాధిపతినే చెప్పమంటుంది.

బసవరాజు తనలోతాను, "నా అవజ్ఞ చేతనే ఇదంతా జరిగింది. ఈ వ్యవహారం ఇంత దూరం రావడానికి నేనే కారణం. పరువు పోయింది. పండితులు పామరులు కూడా విని ఇంటింటా నా చరిత్రే ఇక చెప్పుకుంటారు. అందరూ హేళన చేసే స్థితికి వచ్చాను. లోభి అయిన నా తండ్రికింకా మంచిబుద్ధి రాలేదు. ఇంకా మూర్ఖుడిలా పలకకుండా ఉండటం సరికాదు. ఆమె చెప్పినదంతా నిజం. ఇతడు చేసినదంతా నాకు తెల్సు. ఇప్పటికైనా న్యాయానికి నేను కట్టుపడకపోతే దైవం నన్ను సహించడు" అనుకుంటాడు.

వెంగళప్పను, న్యాయాధిపతి ఏం చెప్తారని ప్రశ్నిస్తాడు. బసవరాజు ముందుకు వచ్చి, అట్లాంటి పరిస్థితిలో మాట్లాడవలసింది తానే కానీ, అతడు కాదంటాడు. ఆ దావా కాగితాల మీద సంతకాలు చేసింది తానే అయినా, అది తండ్రి బలవంతం మీద జరిగింది కనుక ఆ దావాను రద్దు చేసుకుంటానంటాడు. ఆమె అసత్యం ఆడనే లేదనీ తన తండ్రి మాటల్లో నిజం లేదనీ చెప్తూ, తన తండ్రి చేసిన తప్పులు తనకు ఇష్టం లేదంటాడు. తన తండ్రి ఆమెదగ్గర డబ్బు పుచ్చుకుని తనను అమ్మాడనీ, ఆమెకు తాను సేవకుడననీ, ఏ పని చేయమన్నా చేస్తాననీ, ఇక కట్నం పుచ్చుకున్న ప్రతిమగవాడూ తన్నుతాను అమ్ముకున్న వాడే కానీ భర్తలమని చెప్పుకునే అర్హత లేని వారనీ వివరిస్తాడు.

న్యాయాధిపతి అతన్ని మెచ్చుకుని ఇది లోకంలో అందరికీ ఒక పాఠం కాగలదంటాడు. లింగరాజు తన కొడుకు భార్యతో కలిసిపోవడం చూసి అతన్ని నిందిస్తాడు. బసవరాజు, "సుగుణవతీ! ధనం గురించి ఆలోచించి నా తండ్రి నీకు ఎగ్గులు చేశాడు. దాన్ని మనస్సులో ఉంచుకోకుండా నన్ను దాసుడిగా స్వీకరించు. నువ్వు ఏం చెప్పినా చేస్తాను. ఇక నేను నీకు సేవకుడినై ఉంటాను." అంటాడు. కమల నవ్వుతూ, తన నగలమూట, కాగితాల కట్ట భర్తకందించి ఇక నుండి ఇద్దరం ఈ వరకట్న దురాచారాన్ని రూపు మాపడానికి పాటు పడదామంటుంది. లింగరాజు కోపంగా, తన్ను అవమానపరచిన బసవరాజుకు ఆస్తిలో చిల్లిగవ్వ కూడా దక్కనివ్వనని తన యజ్ఞోపవీతం మీద ఆనపెడతాడు.

## 3.5. దశమాంకం కథ :

రాజ వీధిలో పురుషోత్తమరావు, భ్రమరాంబ, కమల, బసవరాజు ప్రవేశిస్తారు. పురుషోత్తమరావు, కొసరి కొసరి కట్నం పుచ్చుకోవటం గొప్ప అనుకునేవాళ్ళను, ముద్దుగ పిల్లనిస్తామని వస్తే కట్నం కోసం బేరం చేసే వాళ్ళను, కొడుకు పెళ్ళిచేసి అప్పులు తీర్చి ఏదైనా నిల్వ ఉంచుకోవాలనుకునే వాళ్ళను, ముడుపులు ముంగిట పెడితేకాని పల్లకీ లెక్కని వాళ్ళను అంతకన్నా అవమానం లేదని నిందిస్తారు. ఇంతకు ముందెవరైనా ఇలా వరుణ్ణి అమ్ముకున్నారా? అని ప్రశ్నిస్తాడు. పూజ్యమైన భరత భూమిలో వరవిక్రయం పేరుతో నరమాంస విక్రయం జరుగుతోందని బాధపడతాడు.

బసవరాజు యువతనుద్దేశించి ఇలా నిందిస్తాడు : కట్నాలకోసం పుస్తకాలు చేత పట్టుకుని పాఠశాలలకెళ్ళే చవటలుగా, పిలిచి పిల్లనిస్తామంటే వారి కొంపలమ్మించే కుమతులుగా, అలుక పాన్పులెక్కి అవీ ఇవీ కావాలని గొడవ పెట్టుకునే అధములుగా, ఎంత పెట్టినా తిని వెంటనే నిష్ఠూరాలాడే నీచులుగా, ఉండే మగవాళ్ళు కట్నం పేరిట చిల్లిగవ్వ తీసుకున్నా భార్యకు జీవితాంతం దాస్యం చేయవలసిందేనంటాడు. అలా చేయని పక్షంలో మరు జన్మలో అత్తవారింట కుక్కలుగా పుట్టక తప్పదంటాడు.

భ్రమరాంబ కట్నం కోసం ఆశించే ఆడవాళ్ళను నిందిస్తుంది. మగబిడ్డ పుట్టినప్పటి నుంచీ కట్నాల గురించే ఆలోచించటం, మర్యాదలంటూ రేయి పగలూ కట్నాలకోసం వేధించటం; అయిదు రోజులు రాణుల్లాగ' చీటికీ మాటికీ అలగటం; లాంఛనాల పేరుతో పిల్ల తల్లిదండ్రుల ఇళ్ళను గుల్ల చేయటం; ఆడపుట్టుక పుట్టి ఆడవాళ్ళనే అవమానించటం, సిగ్గు లేక ధనమే సర్వస్వం అనుకోవటం కంటే హీనమైన బ్రతుకులేదంటుంది.

కమల కట్నం ఇచ్చి అయినా పెళ్ళి చేసుకునే స్త్రీలనుద్దేశించి, వెల ఇచ్చి అయినా పుస్తె కట్టించుకోవాలనుకునే కన్నెలూ, కట్నం పుచ్చుకునే భర్తతో కలసి పల్లకీలో కూర్చునే పెళ్ళి కూతుళ్ళూ, కోరినవెల తెచ్చుకున్న దాసులకే దాస్యం చేసే వాళ్ళూ, తమ పెళ్ళి కోసం తమ వారిని ఋణగ్రస్తుల్ని చేసే వాళ్ళూ-తలచి చూస్తే, స్త్రీ జాతికే అవమానం కాదా! ఇకనైనా పౌరుషం తెచ్చుకుని మెలగమని ఉద్బోధిస్తుంది.

ఒక బ్రాహ్మణుడు కట్నం కన్నా కాలకూట విషం మేలనీ, దానివల్లే తనకీ దుర్గతి పట్టిందనీ అంటాడు. తగిన బేరం వచ్చేదాకా తన్ని మరీ పిల్లవాణ్ణి పాఠశాలకు పంపాను. పోటీలు పెట్టి నాలుగు సంచులు సంపాదించాను. పోట్లాడి మరీ లాంఛనాలు లాగాను, అలా వచ్చిన సొమ్ము పెట్టి పెంకుటిల్లు కొన్నాను. ఇల్లు కాలిపోయి, భార్య చనిపోయి, కొడుకు పిచ్చివాడయి, కోడలు లేచిపోయి అనేక కష్టాలు వచ్చి పడ్డాయని వాపోతాడు.

ఒక స్త్రీ తన గోడిలా చెప్తుంది : వడ్డీలు పెంచి మాన్యాలు గడించాను. పదిపుట్ల భూమితో నా బిడ్డను ఒక కుక్కకిచ్చాను. అలుకపాన్పుపై శంగిలి బీడు కూడా ఇచ్చాను. అన్నీ తీసుకుని నాకుమార్తెను వొదిలి మరొక దానితో కాపురం చేస్తున్నాడు. నాకు కూడూ, నా బిడ్డకు కూడూ, గుడ్డ, కొంప కాని లేవు. అన్నీ ఊడ్చి అల్లుడికి పెడితే, అంతా నష్టమే తప్ప లాభం లేదు.

ఒక శెట్టి తనకత చెప్తాడు - పెసలు, చోళ్ళు అన్నిటిలో మట్టి బెడ్డలు కలిపాను. మేనల్లుడింట్లో ఉండగా పిల్లనింకొకరికిచ్చి చేశాను. పదివేలిచ్చి అన్ని మర్యాదలూ చేశాను. గుంటూరు మేళం, గూడూరు సుందరిని పిలిపించాను. అయిదు రోజులు ముందూ వెనకలు చూళ్ళేదు. దివాలా తీశాను. కోర్టు కెళ్ళాను. ఆఖరకు పెసరట్ల జంగిడే గతయ్యింది.

ఇలా ఒక్కొక్కరు తమ కష్టాల్ని చెప్పుకుంటారు. లింగరాజు చటుక్కున ప్రవేశించి - "చివరకు పందిని పొడిచిన వాడు బంటు అన్పించుకున్నారు. మీ ప్రబోధం వింటూ నేనూ మీ వెనకే వస్తున్నాను. ప్రజలు మిమ్మల్ని, మీ కూతుర్ని అల్లుణ్ణి పొగడని వాళ్ళు లేరు. నన్ను హేళన చేయని వాళ్ళూ లేరు. బట్ట, తిండి అంటూ ఏ ఖర్చూ పెట్టకుండా, వడ్డీలకు వడ్డీలు చేర్చి, పద్దులు పత్రాలూ దిద్ది కొంపలార్పి, కాయిమ్మి, కసరమ్మి వోట్లమ్మి - ఇలా ఎన్నో రకాలుగా డబ్బు చేర్చాను. అతిధి, చుట్టం, గురువు, యాజకుడు, దేవుడు అనిలేకుండా ప్రవర్తించాను. కట్నం కోసం గడ్డి కరిచాను. నాలాంటి నీచుడు మరొకడుండడు" అని పశ్చాత్తాప పడతాడు.

పురుషోత్తమ రావు గత జలసేతుబంధనం వల్ల ప్రయోజనం లేదనీ, ఇక ముందేం చేయాలో ఆలోచించమనీ అంటాడు. లింగరాజు కోడల్ని కొడుకును తీసుకునివెళ్ళి ఆస్తి వాళ్ళకిచ్చి హరి నామస్మరణ చేసుకుంటూ బతుకుతానంటాడు. ఆ మాటలు మనసారా అన్నప్పుడే మంచివనీ అడగ్గా తన కొడుకును, కోడల్ని మంచి చేసుకోకపోతే తనకు చివరి కాలంలో కర్మచేసే అవకాశం కూడా లేకుండా పోతుందనీ, కట్నంకోసం తాను పడ్డ పాటులూ పెట్టిన కష్టాలూ మర్చిపోయి మన్నించమని వేడుకుంటాడు.

అందరూ కలిసి మంగళా శాసనం చేస్తారు. ఆడపిల్లల వివాహం కోసం తండ్రులు పడే బాధలు పోవాలి; కట్నాల కోసం గడ్డి కరిచే వాళ్ళంతా కష్టాలపాలు కావాలి; కట్నం పుచ్చుకున్న వాళ్ళు భార్యలకు దాస్యం చేయాలి; కొన్న వాళ్ళచేత పుస్తెలు కట్టించుకునే పాట్లు తప్పాలి; కట్నం పుచ్చుకోవటం గొప్ప అనే భావం ఆడవాళ్ళను వీడాలి; ప్రపంచంలో కాళింది వంటి కన్యలు జన్మించి పేరు ప్రఖ్యాతులు పొందాలి.

## 3.6. నాటక లక్షణ సమన్వయం :

నాటకం దృశ్యకావ్యం అని పిలవబడుతోంది. ఇందులో సాహిత్యానికేకాక అభినయానికి కూడా స్థానం ఉంటుంది. పాత్రోచితమైన వస్త్రాభరణాలేకాక సంఘటనలకు తగ్గ హావభావ ప్రదర్శన కూడా ఉంటుంది. విమర్శకులు నాటకానికి కొన్ని లక్షణాలను చెప్పారు. ఆ లక్షణాలన్నీ, అవి నాటకంలో ఎంత వరకూ పాటింపబడ్డాయో గమనించడం అవసరం.

**3.6.1. నాంది :** నాటక లక్షణాల్లో మొదటిది నాంది. ఏ పని ప్రారంభించినా అది నిర్విఘ్నంగా శుభంగా జరగాలనే కోర్కెతో భగవత్ప్రార్థన చేసి ప్రారంభించటం మన భారతీయ సంప్రదాయం. ఆ రకంగానే నాటకం చక్కగా జరిగి, ప్రదర్శన ఆటంకం లేకుండా జరిగి, లాభదాయకం కావాలనే కోర్కెతో నాటకంలో నాంది రాయబడుతుంది. నాటకారంభంలో పూజాదికాలు నిర్వర్తింపబడతాయి. దాన్ని పూర్వరంగం అంటారు. ఈ పూర్వరంగం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి క్రియారూపమైన పూజాదికాలు - అవి సాధారణంగా అందరూ చేస్తారు. రెండవది వాగ్రూపమైంది. తమ ఇష్ట దైవాన్ని తనకు నాటక రచనకై తగిన శక్తి నివ్వమని కోరుతూ రచయిత చేసే ప్రార్థన ఇది. దాన్నే నాంది పద్యం అంటారు.

ఈ నాంది గురించి పలువురు, పలురకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు. 'నందయతీతి నాంది' - ఆనందింప చేసేది కనుక నాంది అన్నారు. ఏ కావ్యంలోని ఏ పద్యమైనా రసానందాన్ని కలుగజేసేదే కదా! ఈనాంది పద్యం ప్రత్యేకత ఏమిటి? అనేది కొందరి అనుమానం. ఆనంద స్వరూపుడైన ఆ పరమేశ్వరుడు నాట్యం చేయాలని యత్నించినపుడు నంది తన వీపునే రంగస్థలంగా అమర్చాడట. పరమ భక్తుడైన ఆ నందీశ్వరుణ్ణి గుర్తుకు తెచ్చుకోడానికే 'నాంది' అనే పద్యం రాయబడుతుందన్నదని కొందరి మతం. అయితే ఇదంతా నాంది శబ్ద నిర్వచనానికి సంబంధించింది. ఇందులో ఏకాభిప్రాయం విమర్శకుల్లో లేదు.

నాంది లక్షణం విషయంలో కూడా పండితుల మధ్య ఏకాభిప్రాయం కన్పించటంలేదు. కొందరు నాంది పద్యంలో ఎనిమిది పదాలే ఉండాలన్నారు. మరికొందరు పన్నెండు పదాలే ఉండాలన్నారు. ఇంకా కొందరు పద్దెనిమిది పదాలు ఉండవచ్చన్నారు. వేరే కొందరు ఇరవై నాలుగు పదాలు ఉండాలని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. పై సంఖ్య పదాలదని కొందరూ, కాదు పద్య పాదాలదని కొందరూ అభిప్రాయపడ్డారు. ఈ నాంది పద్యం చంద్రుని పేరు తప్పక కలిగి ఉండాలని కొందరు చెప్పారు. అయితే ఈ లక్షణాలు ఏలాభాన్ని ఆశించి చెప్పబడ్డాయో సరిగా తెలియటంలేదు. నాందికి చెప్పిన లక్షణాలన్నీ సరిగా కుదరకపోయినా, నాంది పద్యం అర్థం చేతగాని, శబ్దం చేతకాని నాటక కథను సూచించాలి అన్న లక్షణం మాత్రం సబబని అనిపిస్తుంది. సూచనా మాత్రం చేత నాటకం చూడడానికి వచ్చిన లేక చదువుతున్న సామాజికులందరూ అర్థాన్ని గ్రహించలేకపోయినా, సహృదయులైన కొందరయినా తప్పక గ్రహిస్తారు. ఆ సూచనా ప్రాయమైన వాక్యమో పద్యమో చమత్కారం కలిగి ఉండాలి. ఆ లక్షణాన్ని కాళిదాసు, భవభూతి లాంటి గొప్ప నాటకకర్తల నాటకంలో చూడవచ్చు. సూత్రధారుడు రంగంలోపల జరిగే పూజను నిర్వర్తించి రంగస్థలం పైకి వచ్చి నాంది పద్యాన్ని పఠించి వెళ్ళి పోతాడు. అందుకే సూత్రధారుణ్ణి 'పూర్వరంగ ప్రవర్తకు'డని కూడా అంటారు.

వరవిక్రయం అనే ప్రస్తుత నాటకంలో నాందిపద్యం ఉంది. ఈ నాటకంలో 'పూర్వరంగ ప్రవర్తకుడు' సూత్రధారుడు' ఇద్దరూ ఒకరే!

ఉ॥ 'భూరి వరిష్ఠమై విబుధ పుంగవ మంగళ వాక్సమృద్ధమై
చారు తరప్సరోనటన సంభృతమై సవినోదమై యహం
కార వికార దూరమయి గర్వ్యత రోభయ శుల్క శూన్యమౌ
గౌరి వివాహ సంస్మరణ గల్గగ జేసెడు గాక భద్రముల్'

శబ్దపరంగాగానీ, సూచనా ప్రాయంగా గాని కథాంశాన్ని చెప్పాలన్న లక్షణంతో ప్రార్థనా పూర్వకమైంది ఈ పద్యం. పద్య సంఖ్యాదులు ఈ నాటకంలో పాటించబడలేదు.

'భూజనులకు శుభమును కూర్చునదై, విబుధుల వాక్కులచే మంగళమైనదై, అందమైన అప్సరసల నాట్యముచే హృదయంగమమైనదై, వినోదముకలదై, అహంకార వికార దూరమై, ఇరు ప్రక్కల శుల్కములు లేనిదైన గౌరి వివాహమును స్మరించుటచే భద్రములు కలుగుగాక!' - అనేభావం ఈ పద్యంలో నిక్షిప్తమైంది.

గౌరీ శంకరుల వివాహం గురించి ముచ్చటించటంవల్ల, భగవంతుని సంస్మరణ వల్ల, నమస్క్రియ వల్ల ఇది నాంది పద్యం అయింది. కాళిదాసు తన 'రఘు వంశాన్ని' పార్వతీ పరమేశ్వరులను ధ్యానించే ఆరంభించాడు. ఈ వర విక్రయ నాటకకర్త అయిన కాళ్ళకూరి నారాయణరావు కూడా గౌరీ శంకరుల్ని ధ్యానించి నాటకాన్ని ప్రారంభించాడు. మంగళా శాసనం పలికే ఈనాంది పద్యం అర్థం నాటకానికి, దాని అర్థానికి బాగా సరిపోయింది. పైగా ఈ పద్యం నాటకం యొక్క ఉద్దేశాన్ని, కథను కూడా సూచన ప్రాయంగా చెపుతోంది. నాటకకర్త

ఉద్దేశం వరకట్న దురాచారాన్ని గర్హించటం. ఏ విధంగానైనా ఆ దురాచారాన్ని రూపుమాపటానికి ఒక దారి కనుక్కోవటం. ఆ ఉద్దేశాన్ని సూచన ప్రాయంగా తెలియజేయాలని ఒక సమాసాన్ని ప్రయోగించాడు. గర్హిత రోభయ శుల్క శూన్యమా' అనేదే ఆ సమాసం. 'గర్హింపదగ్గ ఇరు పక్షముల వారిచ్చిపుచ్చుకునే శుల్కము లేని' అనే అర్థాన్నిస్తుంది. అంటే ఇరుపక్షాలలో ఎవరు ఎవరికిచ్చినా శుల్కమనేది గర్హింపదగ్గదే గదా! వరకట్నమో, కన్యాశుల్కమో ఏదైనా సరే వివాహ బంధం యొక్క పవిత్రతను కించపరచేదే! అది సమాజంలో ఒక దురాచారం క్రింద పరిగణింపవలసినదే! ఆ విధంగా చూచినపుడు ఈనాటకాన్ని నాటకకర్త సంఘంలో ప్రబలిపోతున్న దురాచారాన్ని, ఖండించడానికి ఈ నాటకాన్ని వ్రాసాడనిపిస్తుంది. తన కలాన్నే కత్తిగా మార్చి దురాచారపు తలల్ని ఖండించాలన్నదే కవి ప్రయత్నం. కవి ఆశయం ఆ దురాచారానికి ఏ కన్య యొక్క తల్లి తండ్రులూ బలి కాకూడదన్నదే! ఇంతకు ముందు అంటే ఈ నాటకం రాయబడటానికి ముందే గురజాడ రాసిన 'కన్యాశుల్కం' సంఘంలో ఆ ఆచారంవల్ల ఏర్పడే కష్ట నష్టాలూ, అందువల్ల వచ్చే కష్ట సుఖాలు అన్నింటినీ వివరించింది. విధవా వివాహం గురించి పఠితల మనస్సుల్ని ఆకర్షించే విధంగా చెప్పింది. అంతలో కన్యాశుల్కం-వరకట్నంగా పరిణమించింది. అది వెర్రితలలు వేయటం ప్రారంభించింది. అది సరదాగా కాక ఒక ఆచారంగా మారి, దురాచారంగా నిలిచిపోయింది. అందువల్ల నారాయణరావు ఒక రచయితగా ఆ దురాచారాన్ని ఖండించి, దానిలోని దోషాల్ని ప్రజలకు తెలియపరచటం తన బాధ్యతగా భావించి, ఈ నాటకాన్ని వ్రాశారనిపిస్తుంది. ఆ దురాచారానికి ఒక చక్కని తీర్పు కూడా సూచించారు, రచయిత.

**3.6.2. ప్రస్తావన :** నాంది తర్వాత మరొక సూత్రధారుడు వచ్చి ప్రస్తావన చేస్తాడు. అతణ్ణి ప్రస్తావన ప్రవర్తనుడని అంటారు. 'సూత్రమును ధరించువాడు' అనే అర్థంతో సూత్రధారుడు వాడుకలోకి వచ్చింది. నాటకంలో సూత్రం అంటే సూచన. సూచన అనేది నాల్గు విధాల అభినయాన్ని గురించి ఉంటుందని చెప్పబడుతోంది. కాని కొందరు, ఒకప్పుడు తోలు బొమ్మల వాళ్ళు తాళ్ళు పట్టుకుని ఆడించేవారనీ, అందువల్లే సూత్రధారుడనే పేరు వచ్చిందనీ అంటారు. సూత్ర శబ్దానికి లోకంలో ఒక రూఢి అయిన అర్థం ఉంది. అదే కీలకం. ఆంగ్లంలో దీన్నే 'Clue' అంటారు. ఈ అర్థాన్ని తీసుకుంటే ప్రదర్శన యొక్క కీలకాన్నంతటిని తన చేతిలో ఉంచుకునే వాడన్న అర్థం పొసగుతుంది. దాన్ని మనసులో ఉంచుకునే దశరూపక కర్త- సూత్ర ధారుడు పాత్రలగుణాన్ని, కవిమనోభావాల్ని, కథా స్వభావాన్ని బాగా ఆకళించుకుని ఒక దానితో ఒక దానికి విరోధం లేకుండా సామరస్యంగా నడపగలవాడని అంటాడు.

కావ్యార్థాన్ని ప్రస్తుతించటం వల్లనే (Introduced) అది ప్రస్తావన అవుతుంది. దీనికే ఆ ముఖం అనీ, స్థాపన అనీ పేర్లున్నాయి. ఈ ప్రస్తావనలో సూత్రధారుడు నటి, మారిష విదూషకుల్లో ఎవరితోనైనా కవి గురించి, సభ గురించి, ప్రదర్శన గురించి చిత్ర విచిత్రంగా సంభాషణ జరుపుతాడు. ఒక రకంగా ఇది దృశ్య కావ్యానికి ఉపోద్ఘాతం అనవచ్చు. సూత్రధారి నిర్దిష్ట పాత్ర ప్రవేశాన్ని గురించి చెప్పటం ప్రయోగ అతిశయం అనబడుతోంది. పాత్ర ప్రవేశ సూచన చేసే లక్షణం ప్రస్తావనలోనే కాకుండా ప్రతి పాత్ర ప్రవేశించేటప్పుడు అన్ని అంకాల్లోనూ విధిగా పాటింప బడవలసిందే!

వర విక్రయ నాటకానికి నాంది, ప్రస్తావనకు కూడా ఒకే సూత్ర ధారుడే! నాంది పద్యం చదివిన వెంటనే నటిని సూత్రధారుడు తానే కథను, కవిని పరిచయం చేస్తాడు. సూత్రధారుడు ప్రవేశిస్తూనే సభను వర్ణిస్తాడు. ఎక్కువ మంది ఆనాటకం చూడటానికి వచ్చారని సంతోషిస్తాడు.

"వర్తమాన వరశుల్క దుర్నయ దూరీకరణమునకై బుద్ధిరాజు వీరభద్ర రాయామాత్యుల వారి కంకితముగా, మహాకవి కాళ్ళకూరి నారాయణరావు గారిచే రచింపబడిన వర విక్రయ రూపకమును విలోకించు..." అంటూ కృతి భర్తను, కృతి కర్తను గురించి ఈ నాటక ఉద్దేశ్యాన్ని గురించి చెప్తాడు.

తే॥ "కవి ప్రసిద్ధుడు కావ్యమా కాలవిహిత
మైన యది మీరలా భరతాగమమున
జతురు, లటుగాన మీ ప్రదర్శనము కొరకు
ద్వరపడుచునున్న వార మెంతయును మదిని"

సూత్రధారుడు కవి యొక్క ప్రతిభా పాటవాల్ని, కావ్యం యొక్క గుణాల్ని చెప్పి ఆ కావ్యం కాలానుగుణమైనదంటాడు. అంటే కాలానికి తగిన కథ అని ప్రశంసిస్తాడు. ఇక నాటకం వేసే వాళ్ళు భరతాగమాన్ని నేర్చిన వాళ్ళు. అందుకే సభలోని వాళ్ళంతా నాటకం చూడ్డానికి ఉవ్విళ్ళూరుతున్నారని చెపుతున్నారంటాడు.

నాటక కర్త, నాటక భర్తల్నే కాకుండా అది వరవిక్రయం లేదా వరకట్న దురాచారాన్ని గురించి ఆ కాలానుగుణమైన కథను కలిగిందని సూచిస్తాడు. ప్రదర్శన ప్రారంభం కాబోతోందని చెప్తూ నటిని పిలుస్తాడు. ఈ నాటకంలో ప్రస్తావనలో సూత్రధారుడికి సహాయం నటి! ఆమె కథను సూచన ప్రాయంగా చెప్పటంలో సహకరిస్తుంది. నటిని కొని తెచ్చానంటాడు. ఆమెను పెండ్లాడడానికి ఆమె తండ్రికిచ్చిన డబ్బు గురించి గుర్తు చేస్తాడు. ఆమె ఆ సొమ్ము తీసుకుని విడాకులిమ్మంటుంది. ఆ మాటలిక్కడ పనికిరావనీ, ప్రాణం ఉన్నంతవరకూ బొందు మెడలో పడ్డాక తలవంచ వలసిందేననీ అంటాడు. అంటే ఈ కథలో కన్యాశుల్కం, వరకట్నం, విడాకుల ప్రస్తావన వంటివి ఉంటాయన్న విషయాన్ని సూచిస్తున్నాడన్నమాట.!

తర్వాత 'పాత్రల్ని ప్రవేశపెట్టాలి కదా! సిద్ధపరచావా' అని అడుగుతాడు. ఇక్కడ పాత్ర ప్రవేశాన్ని సూచించటం అనే లక్షణం పాటింపబడుతోంది. చరకాగానం చేస్తూ కాళింది, కమల, భ్రమరాంబ ప్రవేశిస్తున్నారని చెప్పి వాళ్ళిద్దరూ నిష్క్రమిస్తారు. కథను సూచించడం నుంచి, పాత్రల్ని ప్రవేశ పెట్టడం వరకు సూత్రధారుడు నిర్వర్తించవలసిన పని. దాన్ని ఎంతో చక్కగా సూత్రధారుడు నటి సహాయంతో చేసినట్లు నాటకకర్త రచించాడు. కవిపేరు, కృతి భర్తపేరు, సభ, నాటక కథాసూచన, పాత్ర ప్రవేశం - ఇవే ప్రస్తావనలోని ముఖ్యాంశాలు. వీటిని నాటకకర్త ప్రస్తుత వరవిక్రయ నాటకంలో పరిపూర్ణంగా కూర్చారు.

**3.6.3. అంకం - రంగం :** దృశ్యకావ్యమైనా శ్రవ్యకావ్యమైనా విభజింపబడటం సర్వసాధారణ విషయం. శ్రవ్య కావ్యాల్లో ఆశ్వాసాలు, ఉచ్ఛ్వాసాలు, సర్గలు అంటూ విభజనలుంటాయి. పఠితలకు విరామాన్ని కల్గించటం, కథలో ఒక విశ్రాంతి నేర్పరచటం దీని ముఖ్యోద్దేశం. నాటకం ఎప్పుడూ అంకంగానే విభజింపబడుతుంది. అంక విభజన చేయటంలో ఎన్నో రకాల నియమాలు పాటించాలి.

**3.6.3.1. అంక లక్షణాల్లో మొదటిది :** లోకంలో జరిగే వృత్తాంతంలో ఒకనాటి సంఘటన మాత్రమే అంకంలో చెప్పబడాలి. కథ ఎంత దీర్ఘకాలం జరిగినా ఒక అంకం ఒక్కదినానికే సంబంధించింది కావాలి. అంతమాత్రమే స్వీకరించాలి. ఉదా : వరవిక్రయ నాటకంలోని ప్రథమాంకం. భోజనాల వేళ అవుతున్నా పొద్దున్నే బయటకు వెళ్ళిన పురుషోత్తమరావు ఇంటికి రాలేదని భార్య, కుమార్తెలు బాధపడటం, పురుషోత్తమరావు వచ్చి పెళ్ళికొడుకులకోసం తాను పడ్డ బాధ చెప్పటం, పేరయ్య వస్తాడని తెలపటం, పేరయ్యరాక, పెళ్ళి సంబంధాల వేట గురించిన చర్చ - ఇక్కడితో మొదటి అంకం పూర్తవుతుంది. ఈ కథంతా తెల్లవారిన దగ్గర్నుంచి భోజనాలు చేసేవేళ లోపుగానో, భోజనాలు అయిన వెంటనేనో జరిగిందే! అంటే ఒక్క పూటలో జరిగిందన్నమాట. కథంతా కొన్నేళ్ళు జరుగుతుంది. అయినా ఒక అంకంలో ఒకనాటి సంఘటనే తీసుకోవాలి అనే నియమం చక్కగా పాటింపబడింది.

**3.6.3.2.** కథంతా ఒక నాయకుణ్ణి ఆధారంగా చేసుకొని నడవాలి. ప్రతి అంకంలోను నాయకుడు రావాలి. లేదా కనీసం అతని ప్రస్తావన అయినా ఉండాలి. నిజానికి వరవిక్రయంలో ముఖ్యపాత్ర వరకట్నానిదే! అదే నాయిక నాయకుడు అనాలి. కానీ, కథాగమనాన్ని బట్టి చూస్తే ఈ కథలో నాయికలు ఇద్దరు. వాళ్ళిద్దరి కథే ఇది. అయితే వాళ్ళిద్దరికీ పెళ్ళికొడుకుగా చెప్పబడే బసవరాజే ఈ నాటకానికి నాయకుడు. పెళ్ళి సంబంధాలు వెతకటంతో అతడి ప్రస్తావన ప్రారంభం అవుతుంది. నాటకంలోని ప్రతి అంకంలోను ఆ పాత్ర లేకున్నా, అతడి గురించి ఏదో ఒక పాత్ర మాట్లాడుతూనే ఉంటుంది. పెళ్ళి సంబంధం చూడటంతో మొదలయ్యే ఈ పాత్ర చివరగా న్యాయాధికారి ఎదుట తాను తన భార్యకు అమ్ముడు పోయాననీ, తాను ఆమె సొత్తే కాబట్టి ఆమె మాట జవదాటకుండా ఆమెతోనే ఉంటాననీ చెప్పటం దాకా అతని గురించి ఏదో ఒక రకంగా ఎవరో ఒకళ్ళు మాట్లాడటం వినిపిస్తుంది. ఈ రకంగా అతడే నాయకుడనీ, అతణ్ణి గురించిన ప్రస్తావన ప్రతి అంకంలోనూ ఉండటంవల్ల కూడా అతడే నాయకుడనీ చెప్పవచ్చు.

**3.6.3.3.** అంకంలోని కథ ఒకటో రెండో పాత్రలు కాకుండా ఎక్కువ పాత్రలు ప్రవేశించే వీలు కల్పించేలా ఉండాలి. ఈ లక్షణాన్ని వర విక్రయంలో అన్ని అంకాల్లోనూ చూడవచ్చు. ఉదా : మొదటి అంకంలో భ్రమరాంబ, కాళింది, కమల, పురుషోత్తమరావు, పేరయ్య వంటి పాత్రలు కన్పిస్తాయి. దశమాంకంలో పురుషోత్తమరావు, బసవరాజు, భ్రమరాంబ, కమల, ఒక బ్రహ్మణుడు, ఒక శెట్టి, ఒక అమ్మ, లింగరాజు - అంటూ తొమ్మిది పాత్రలు కన్పిస్తాయి.

**3.6.3.4.** కథ బీజానుగుణంగా బిందువ్యాప్తి పురస్కృతంగా ఉండాలి. ప్రతి కథకు ఆదిమధ్య అంతాలుంటాయి. ఈ మూడూ నాటకంలో బీజం, బిందు, కార్యం అని పిల్వబడతాయి. ఏ ప్రయోజనాన్ని ఆశించి కవి కావ్యం రాస్తాడో అది బీజం. దాన్ని నిర్ధారణ చేసి

చెప్పాలి. ఆ బీజం పుష్పఫల సమృద్ధితో వృద్ధి పొంది బీజశక్తి కథలో వ్యాపించటం బిందువు. అంకం బీజంతో ప్రారంభమయి కథ వ్యాపిస్తే అది ఇతివృత్త క్రమ వికాసం. కొన్ని అంకాలకు సంబంధం ఉంటుంది. కథను ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి రాశారో ఆ ప్రయోజనానుగుణంగా నడపటమే కారణం. ప్రతి అంకంలోను ప్రదర్శనీయమైన కథే ఉండాలి. ప్రదర్శింపరానిది, ప్రదర్శనకు వీలు లేనిది, ప్రదర్శింపనక్కర్లేనిది (అయోగ్య, అసంభావ్య, అనావశ్యక) ఘట్టాల్ని ప్రదర్శించవలసిన అవసరం లేదు. వాటిని కథకవసరం అనుకుంటే అర్థోపక్షేపకంగా సూచించవచ్చు. అంకంలోని ఏదో ఒక పాత్ర దృశ్య కథా భాగంలో పైవాటిని సూచనప్రాయంగా ప్రసంగించవచ్చు.

కథ బీజంగా ప్రారంభం అయి, వ్యాప్తి చెందాలన్న లక్షణాన్ని కాళ్ళకూరి నారాయణరావు చక్కగా పాటించారని చెప్పవచ్చు. ఉదా : మొదటి అంకంలోనే పెళ్ళి సంబంధాలు వెతుకుతున్నప్పుడే కట్నం లేకుండా పెళ్ళికొడుకులు దొరకరవటం బీజం. పేరయ్య ప్రవేశం తర్వాత ఏఏ తరహాకు చెందిన పెళ్ళికొడుకులు, ఏఏ అర్హతల్లో కావాలనుకుంటే ఎంతెంత ధరో చెప్పించినపుడు కథ బిందు వ్యాప్తి చెందుతోందని చెప్పవచ్చు. ఈ రకంగా అంకాలుగా విభజింపబడి సలక్షణ సమన్వితంగా ఉన్న ఈ నాటకంలోని కొన్ని అంకాలు చిన్న రంగాలుగా కూడా విడదీయబడ్డాయి.

**3.6.4. అర్థోప క్షేపకములు :** ప్రదర్శనీయము కానివి అర్థోపక్షేపకాల్లో చూపబడతాయి. అంకంలో ఉండే కథాగమనం జరుగుతూ వుండగా, ఆ అంకాల్లో చెప్పబడనివి అర్థోపక్షేపకాల్లో చెప్పబడతాయి. అంటే అంకాల్లో రసవద్ఘట్టాలే ఉంటాయి. నీరసం, అనుదాత్తం, అనుచితం అయిన ఘట్టాలు అంకాల్లో కథాంశాలుగా ప్రదర్శింపబడకూడదు. వాటిని సూచన ప్రాయంగా చెప్పాలి. ఏవైనా పాత్రలు అటువంటి ఘట్టాల్ని గురించి ప్రసంగిస్తాయి.

ప్రాణివధ, యుద్ధం, విప్లవం, ముట్టడి, భోజనం, వస్త్రధారణ, శయనం, ఆలింగనం వంటివి ప్రదర్శనీయాలు కావు. అటువంటి వాటిని పరిహరించటమే మంచిది. అవి సామాజికుల్ని మానసిక కల్లోలానికి, ఉద్రేకానికి లోను చేయవచ్చు. అందువల్లే అవి వర్జనీయాలయ్యాయి.

వర విక్రయం నాటకం మొదటి అంకంలోనూ, పెళ్ళిలోనూ భోజనాల ప్రసక్తి కన్పించినా అది సూచనగా చెప్పబడిందే కాని, అంకంలో ఒక భాగంగా చోటు చేసుకోలేదు. అలాగే పంచమాంకంలో "హా! పరమేశ్వరా!" అని బావిలో పడును. అని చెప్పబడింది. ప్రదర్శనలో బావి దగ్గర నిలుచుని ఆమె తన సంభాషణ చెప్పడం వరకే ఉంటుంది. ఆరవ అంకంలో భ్రమరాంబ తన కుమార్తె అందం తలచుకుని దుఃఖించటం చెప్పబడింది. అంటే కాళింది మరణం ప్రదర్శనీయం కాదు కనుక అది ప్రదర్శించటం జరగదన్నమాట. దృశ్యాల్లో ప్రదర్శింపబడే కథాగమనం వర్తమాన కాల క్రియా రూపంగానూ, ప్రవర్తితమైన కథాభాగం విష్కంబాదుల్లో భూతకాల క్రియారూపంగానూ ప్రయోగింపబడటం సహజం. జరుగుతున్న కథను ప్రేక్షకులు చూస్తున్నప్పుడు అది వర్తమానంగానూ, జరిగిన దాన్ని గురించి ఏ పాత్రయినా ప్రస్తావించినప్పుడు ప్రేక్షకులు దాన్ని వినటం భూతకాలంగానూ నాటకాల్లో చోటు చేసుకుంటుంది.

**3.6.5. పంచ సంధులు :** నాటక భర్త తన రచనకు ఎన్నుకున్న కథాగమనాన్ని ఎలా సన్నివేశాలుగా విభజించుకుని వ్రాయదలచుకుంటాడో, ఆ ప్రణాళికకు 'అర్థ ప్రకృతులు' అని పేరు. వీటినే ఇంగ్లంలో, (Elements of Plot) అంటారు. అర్థ ప్రకృతి అంటే కథ - పాత్రల మాటల ద్వారా, నటన ద్వారా నడవటం. అటువంటి దాన్నే ఆ కార్యావస్థనే సంధి అంటారు. సంధి అనే పదానికి అనుకూల్యం, అవిరోధం, సమన్వయం అని అర్థాలు చెప్పుకోవాలి. రచయిత పథకం ప్రకారం ఇవి ఉంటాయి.

కథను రెండు భాగాలుగా విభజించవచ్చు. ఆధికారికం (Main theme), ప్రాసంగికం (Episodical theme) అధికారి నాటకానికి నాయకుడే. అతడు కాని, అతని ప్రసంగం కాని ఉండే కథ ఆధికారికం. కొన్ని పాత్రలు మాత్రమే నాటకంలో మొదటినుంచి చివరిదాకా ఉంటాయి. మరికొన్ని పాత్రలు ఏదో ఒక అంకంలో ప్రవేశించి, వచ్చిన పని కాగానే వెళ్ళిపోతాయి. అటువంటి పాత్రల కథ ప్రాసంగికం అనబడుతోంది.

ఆధికారిక ఇతివృత్తంలో బీజం, బిందువు, కార్యం అనే మూడు అర్థ ప్రకృతులుంటాయి. ప్రాసంగికం కూడా ఉండే కథలో బీజం, బిందువు, పతాక, ప్రకరి, కార్యం అనే అయిదు అర్థ ప్రకృతులుంటాయి. అయితే కథ ఆధికారికమైనా, ప్రాసంగికమైనా వాటికి అయిదే

కార్యావస్థలుంటాయి. వాటికి క్రమంగా ఆరంభం, యత్నం, ప్రాప్త్యాశ, నియతాప్తి, ఫలాగమం అని పేర్లు. ఇవి అర్థ ప్రకృతుల్తో కలిపి ప్రయోగించినపుడు సంధులవుతాయి. అవి కూడా అయిదే! ఆ సంధులు ముఖం, ప్రతిముఖం, గర్భం, అవమర్శం, నిర్వహణం (ఉపసంహారం) అనేవి. వీటిని ఆంగ్లంలో (Structural divisions) అంటారు.

కథానాయకుడు ఏ ఫలాన్ని ఆపేక్షించి ఉత్సాహంగా ఒక కార్యానికి పూనుకుంటాడో ఆ కథా భాగమే ఆరంభం. అది రచయిత ప్రణాళికలో బీజం అవుతుంది. ఈ రెంటి కలయికే 'ముఖ సంధి', నిజానికి వరవిక్రయం అనే నాటకంలో ఈ ఆరంభం, ముఖసంధి అనేవి పురుషోత్తమరావుకే వర్తిస్తాయి. అల్లుళ్ళు కావాలన్న కోర్కెతో, కూతుళ్ళ పెళ్ళి త్వరగా జరిపించాలన్న ఉత్సాహంతో పురుషోత్తమరావు పెళ్ళికొడుకుల్ని వెతకటం ఆరంభం. రచయిత ప్రణాళిక ప్రకారం వరుల విక్రయం అనేది ఈ పెళ్ళి కొడుకుల వేటతో ప్రారంభం అవుతుంది. కట్నం వద్దనే పెళ్ళి కొడుకు దొరకడనటం, పెళ్ళి కొడుకుల అత్యాశలు రచయిత నాటకానికి బీజం. కనుక ఈ రెండూ కలిసిన ముఖసంధి పెళ్ళికొడుకుల వేట.

ఏ పని కూడా ఉత్సాహం మాత్రంతోనే ఫలాన్నివ్వదు. దానికి ఎంతో దృఢమైన ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నమే రెండవదైన బిందువు అనే కార్యావస్థ. ఇది 'ప్రతిముఖ సంధి' అనబడుతుంది. అల్లుళ్ళ వేటలో విసిగి వేసారిన పురుషోత్తమరావు తీవ్ర ప్రయత్నం చేయాలని నిశ్చయించుకుని పెళ్ళిళ్ళ పేరయ్యను పిలిపించటం, పెళ్ళి కుమారుడి కోసం ప్రయత్నించటం 'ప్రతిముఖ సంధి' అనవచ్చు.

ప్రయత్నం మాత్రమే ఫలప్రాప్తికి కారణం అనలేం. ఏదైనా ఒక దశలో ఆ ప్రాప్తి గురించి సందేహం ఏర్పడి ఆశ నిరాశ కావచ్చు. అనేటువంటి పరిస్థితి ఎదురుకావచ్చు. అటువంటి సందేహాస్పదమైన అవస్థే ప్రాప్త్యాశ. లింగరాజు కొడుకును బసవరాజును తన కుమార్తెకు మాట్లాడినపుడు, పేరయ్య, వీరయ్యల మధ్య సాగిన బేరంలో ఆ సంబంధం జరుగుతుందో జరగదో అన్న అనుమానం పురుషోత్తమరావులో కలగటం, అతను వెనుకాడటం అనేవి ఈ మూడవ సంధి ప్రాప్త్యాశగా పేర్కొనవచ్చు. నిరాశ తొలగిపోవడానికి హేతువుగా ఏదైనా ఒక కార్యం జరిగినపుడు పతాక అనే ప్రాసంగికం అతనికి తోడవుతుంది. అలా జరగకపోయినా బీజం విచ్ఛిన్నం కాకుండా బిందువు తోడ్పడుతుంది. అది ప్రయత్నాన్ని మరింత బలపరుస్తుంది. అటువంటప్పుడు అది 'గర్భం' అనే సంధిగా పేర్కొనవచ్చు. ఆ బేరం పురుషోత్తమరావు నెగ్గటం, ఆ తర్వాత అతని ప్రయత్నం వృధా అన్నట్లు కాళింది మరణం, పురుషోత్తమరావు నిరాశ చెందటం, చివరికి కమల తండ్రి సొమ్ము దక్కించుకోడానికీ, అక్కకు జరిగిన అన్యాయానికి పగ తీర్చుకోవటానికి నిశ్చయించుకుని పెళ్ళికి ఒప్పుకోవటంతో - గర్భం అనే సంధి కనపడుతుంది.

నిరాశపోయి ఫలప్రాప్తి నిశ్చయమని తోచే భావాన్ని కలుగచేసేదే నియతాప్తి. ప్రకరి అనే అర్థ ప్రకృతి ప్రవేశించే భాగం ఇదే! ఇక్కడ కథ బిందువు కార్యానికి తోడై నడుస్తుంది. ఈ నియతాప్తి నడిచేదాకా అవమర్శం అనే సంధి ఉంటుంది. పురుషోత్తమరావు తన ఆశయాల్ని పక్కనబెట్టి, కూతుళ్ళు పెళ్ళికోసం పూర్వీకుల భూమిని కూడా అమ్ముకుంటాడు. మొదటి కూతురు చనిపోగా, రెండవ కూతురు కమల పెళ్ళి చేసుకుని కూడా పుట్టింటిలోనే ఉంటుంది. కథలో రచయిత ఆశించిన ఫలితానికి ఈ నియతాప్తి తోడ్పడుతుంది. అంటే వరకట్నాన్ని రూపుమాపాలన్న రచయిత ఆశయం, ఆ దురాచారాన్ని సమాజంలోంచి పారద్రోలాలన్న కోరికలకు ఇక్కడే కథలో ఒక రూపం ఏర్పడుతుంది. కమల అత్తింటికి వెళ్ళకపోవటం, లింగరాజు కేసు నమోదు చేయటం రచయిత కథను తాను ఆశించిన ఫలితం వైపు త్రిప్పుతున్నాడన్నమాటకు బలాన్నిస్తాయి.

సంకల్పం ఫలించి ప్రయత్నంలో వచ్చిన అపాయం తొలగిపోయిన తర్వాత ఫలప్రాప్తి లభిస్తుందన్న నమ్మికే ఫలాగమనం అనేది. ఈ కార్యావస్థగల సంధే నిర్వహణ సంధి. రచయిత ఏ ఫలాన్ని ఆశించి తన నాటకాన్ని రాస్తాడో అది ఇక్కడ నెరవేరుతుంది. వర విక్రయ నాటకంలో వరకట్నాన్ని దూరాచారంగా రుజువు చేసి దాన్ని ఖండించటమే రచయిత ఆశించిన ఫలితం. అది చివరి రెండు అంకాల్లో నెరవేరుతుంది. ప్రయత్నం పురుషోత్తమరావుదే అయినా ఈ ఫలప్రాప్తి మాత్రం కమల, బసవరాజులకు దక్కింది. కమల అత్తవారింటికి రాలేదని లింగరాజు కేసు నమోదు చేస్తాడు. కాని, కమల తన తరపున తానే వాదించుకుంటానని అడిగి, తనకు బసవరాజు నిచ్చి వివాహం చేశారు కనుక అతడే తన ఇంటికి రావాలంటుంది. దానికి సాక్ష్యాధారాలు చూపిస్తుంది. బసవరాజు కూడా ఆమె చెప్పిన వాటికి అంగీకరిస్తాడు. అందువల్ల కట్నమిచ్చి ఆమె బసవరాజును కొనుక్కుంది అన్నమాట ఋజువవుతుంది. ఆ కారణంగా బసవరాజు తానే అత్తవారింటికి

వస్తానని అంగీకరిస్తాడు. వరకట్నం అనే దురాచారానికి స్త్రీలు బలికారాదనీ, కట్నం తీసుకున్న మగవాడే భార్యకు లోబడి ఉండాలనీ ఒక తీర్పునిస్తాడు రచయిత. ఈ తీర్పు ప్రకారం వరకట్న దురాచారాన్ని అధిగమించి సంఘం కళ్ళు తెరిపించిన కమల, ఆమెకు తోడుంటానన్న బసవరాజులే ఈ నాటకానికి నాయికా నాయకులవుతారు. కానీ, కథను మొదటినుంచి చివరి దాకా నడిపిన ముఖ్య పాత్ర పురుషోత్తమరావు. రచయిత ఈ నాటకంలో ఇదమిత్థంగా నాయకుడితడే అని తేల్చి చెప్పలేని పరిస్థితిని సృష్టించాడు. అయితే రచయిత ఆశయం మాత్రం నెరవేరింది.

నాటకానికి మన అలంకారికులు చెప్పిన లక్షణాల్ని దాదాపుగా పాటించి ఇతివృత్తాన్ని చక్కగా నిర్వహించి, చక్కని పాత్ర సృష్టితో తన ఆశయ సాధనకై నాటకాన్ని రచించిన రచయితను మెచ్చుకోవలసిందే!

## సారాంశం:

ఆరవ అంకంలో కట్నం తిరిగి ఇవ్వకపోతే దావాలో ఇరుక్కోవలసి వస్తుందని కమలను తన కోడలిగా స్వీకరించడానికి లింగరాజు సిద్ధపడడం, వివేచన కలిగిన కమల దానికి అంగీకరించడం, ఏడవ అంకంలో వివాహసమయంలో మగపెళ్ళివారిని నిరంకుశాధికారాలు, ఎనిమిదవ అంకంలో కమలను కాపురానికి పంపమని సింగరాజు పురుషోత్తమరావుకు నోటిసు ఇవ్వడం, తొమ్మిదవ అంకంలో న్యాయంకోసం కమల జరిపిన పోరాటంలో భర్త బసవరాజు సహకరించడం, దశమాంకంలో అందరిలో పరివర్తన వచ్చి వరకట్న దురాచారం పోవాలనే ఆకాంక్షతో నాటకం ముగియటం జరిగింది. నాంది నుండి భరత వాక్యం వరకు నాటకలక్షణాల సమన్వయం కూడా ఈ పాఠంలో వివరింపబడింది.

## ప్రశ్నలు :

1. వరవిక్రయ నాటక నావకాచిత్యాన్ని వ్రాయండి
2. నాటకలక్షణాలను వివరించి మీ నాటకంతో అన్వయింతండి

ఆచార్య. ఎల్.బి. శంకరరావు
తెలుగు శాఖ
మద్రాసు విశ్వవిద్యాలయం
చెన్నై

ఖండం : 4

## పాఠం : 4 వర విక్రయము

- కాళ్ళకూరి నారాయణరావు

**శీర్షికలు :**

4.0. పాత్ర చిత్రణ

4.1. చిన్న పాత్రలు

4.2. అప్రధాన పాత్రలు

4.3. ప్రధాన పాత్రలు

4.4 సారాంశం

4.5. ప్రశ్నలు - సమాధానాలు

**లక్ష్యం :** ఈ పాఠంలో నాటకంలోని ప్రధాన పాత్రలనేగాక, కథాగమనానికి ప్రధాన పాత్రల పరిపోషణకు దోహదంచేసే అప్రధాన పాత్రలను కూడ భిన్న కోణాల్లో పరిశీలించి వాటి వైశిష్ట్యాన్ని నిరూపించడం కానవస్తుంది.

### 4.0 పాత్ర చిత్రణ

పాత్రలు కథను అన్ని వేళలా నడిపించవు కవే కథను నడిపిస్తాడు. కొన్నిచోట్ల పాత్రలు కనుమరుగై కవే కన్పించవచ్చు. అయితే నాటకంలో దీనికి భిన్నంగా జరుగుతుంది. పాత్రలే నాటకంలో మాట్లాడుతాయి. ప్రతి సన్నివేశాన్ని అవే నడిపిస్తాయి. పాత్ర చిత్రణ కవి ప్రతిభకు గీటురాయి [illegible] విధంగా ఉంటుంది. అన్నిటి మనస్తత్వం ఒకటికాదు. అలాగే గుణగణాలు కూడా! ప్రతి నాటకంలోను ప్ర[illegible]ాన పాత్రలచుట్టూ కథ అల్లబడి ఉంటుంది. అప్రధాన పాత్రలు కథాగమనానికీ, ప్రధాన పాత్రల ప[illegible]ు.

వర విక్రయం నాటకంలో కూడా ప్రధాన, అప్రధాన పాత్రలున్నాయి. పాత్ర చిన్నదా? పెద్దదా? అన్న విషయం ముఖ్యంకాదు. కథాగతికి ఏ పాత్రలయితే తోడ్పడతాయో అవి ప్రధాన పాత్రలుగా గ్రహింపబడతాయి. ఈ నాటకంలోని ముఖ్యపాత్రలు కాళింది, కమల, వాళ్ళ తండ్రి పురుషోత్తమరావు, లింగరాజు, అతని కొడుకూ (పెళ్ళికొడుకూ) అయిన బసవరాజు వీళ్ళే కథాగమనానికి ముఖ్యం. వీళ్ళకు తోడ్పడుతూ కథాగమనంలో కన్పించే పాత్రలు భ్రమరాంబ (కాళింది, కమలల తల్లి), లింగరాజు భార్య సుభద్ర, పెళ్ళిళ్ళ దళారీలైన పేరయ్య, వీరయ్యలు, ఒక్కొక్క అంకంలోనే కన్పించే పాత్రల్లో ఘంటయ్య, (లింగరాజు నౌకరు), న్యాయాధిపతి, వెంగళప్ప అనే వకీలు. ఒక్కసారి మాత్రం కనపడే ఘంటయ్య, టీచరు, ఒక బ్రాహ్మణుడు, ఒక అమ్మ, ఒక సెట్టి కూడా చెప్పవలసిన పాత్రలే!

వర విక్రయం కథాగమనానికి తోడ్పడే పాత్రల్ని, అంటే ఈ అప్రధాన పాత్రల్ని మళ్ళీ విభజించవచ్చు. కొన్ని పాత్రలు ఆదినుంచి కన్పిస్తూ ఉంటాయి. ఆ పాత్రలు అక్కడక్కడా నాటకంలో కనబడి, కథను నడిపించడంలో సహాయం చేస్తాయి. మరికొన్ని పాత్రలు నాటక ఉద్దేశాన్ని, ఏదోఒక పాత్ర యొక్క స్వభావాన్ని తెలుసుకోడానికి పనికి వస్తాయి. అట్లాంటి పాత్రలు నాటకం మొత్తం మీద ఒకే ఒక్కసారి మాత్రం నాటకంలో ప్రవేశిస్తాయి. అలాంటి పాత్రల్ని చిన్న పాత్రలుగా పేర్కొనవచ్చు. వాటిని కొంచెం పరిశీలిద్దాం.

## 4.1. చిన్న పాత్రలు :

వర విక్రయం నాటకంలోని చిన్న పాత్రల పట్టికలో అంటే ఒకే ఒక్క రంగంలో లేదా అంకంలో కన్పించే పాత్రలు కొన్ని ఉన్నాయి. అవి: ఘంటయ్య, ఒక టీచరు, ఒక బ్రాహ్మణుడు, ఒక తల్లి, ఒక సెట్టి. ఈ పాత్రల్ని పరికిద్దాం.

**4.1.1. ఘంటయ్య :** ఘంటయ్య లింగరాజు ఇంటి నౌకరు. వంటవాడు అన్నీ అతనే! అయితే లింగరాజుతో ధైర్యంగా మాట్లాడగలడు. సింగరాజు, లింగరాజు లెక్కలు అడుగుతాడు. ఘంటయ్య పిడకలకీ, పుడకలకీ లెక్కలు చెప్తాడు. అన్నం, గంజి అన్నీ వివరాలూ చెప్తాడు. తాను మాత్రం బయటనుంచి బంగాళదుంపకూర తెచ్చుకుని తిన్నానంటాడు. తనకేం కావాలో తనెలా బతకాలో తెలిసిన వ్యక్తి. తన యజమాని కోసం పని చేసినా, బ్రతుకు తెరువుకోసం ఉద్యోగం చేసినా, మానాభిమానాలున్న వ్యక్తిగానే ఈ పాత్ర కన్పిస్తుంది. లింగరాజు తన మూడోభార్య సుభద్ర ఉండే గదివైపుకు వెళ్ళ వద్దన్నప్పుడు కొరుక్కు తింటామా? అని అడుగుతాడు. తమ మీద తమకే నమ్మకం లేని వ్యక్తుల్ని, నీచమనస్తత్వం కలవారిని ఎవరూ గౌరవించరని నాటకకర్త ఈ నాటకంలో ఈ పాత్ర ద్వారా నిరూపించారు. నాటకంలోని ద్వితీయాంకంలోనే ఈ పాత్ర కన్పిస్తుంది.

**4.1.2. టీచరు :** అష్టమాంకంలోని మొదటి రంగంలో వకీలు వెంగళప్పను కలవడానికి వచ్చే పాత్ర టీచరు. పై అధికారికి అణిగిమణిగి ఉండాలనే ఆలోచన ఉన్నా, మంచితనాన్ని చేతకాని తనంగా భావించే వ్యక్తుల్ని సహించకూడదన్న నిజాన్ని పఠితలకు ఈ పాత్ర ద్వారా చెప్పారు, నాటక రచయిత. అచ్చన్న పేట స్కూలు అయిదో తరగతి టీచరుగా తన్ను పరిచయం చేసుకుని, తన భార్య ప్రసవంకోసం పడుతున్న కష్టాల్ని చెప్పి సెలవు అడుగుతాడు. వెంగళప్ప నిరాకరించడమే కాకుండా, తన అధికారాన్ని ప్రదర్శిస్తూ, సస్పెండు, ఫైను అంటాడు. ఇంకా బతిమాలాడని ఉద్యోగం నుంచి తీసేశానంటాడు. అప్పుడు ఆ టీచరు వెంగళప్ప దుష్కార్యాలన్నీ ఏకరువు పెడతాడు. ఉద్యోగం, చదువుకున్న వాడికి ఎక్కడో ఒకచోట తప్పక దొరుకుతుందనీ, కానీ, ఈ పదవుల్ని నమ్ముకుని అధికారం చెలాయించే వారికి ఆ పదవీ కాలం తీరగానే, ఉన్న గొప్పతనం పోతుందనీ అంటాడు. ఎవరెవరి కాళ్ళో పట్టుకుని ఓట్లు కొనుక్కొని సంపాదించిన పదవుల్ని చూసుకుని మురిసిపోయి, అవి ఇచ్చే గౌరవం, అధికారం చాలా గొప్పవనుకుని ఎదుటి వాళ్ళను హీనంగా చూస్తే, ఆ పదువులు పోయిన తర్వాత ఎవ్వరూ వాళ్ళను గౌరవించరని, రచయిత ఈ పాత్ర ద్వారా చెప్పిస్తాడు. అర్హతల వల్లకాక అల్పులకు అధికారం వస్తే పాపాలు, అరాచకం, అధికమవుతాయి. ఆ విషయం గుర్తించకుండా తమ అడుగులకు మడుగులు వత్తాలనీ, తాము అన్న మాటల్లా చెల్లుబడి కావాలనీ, అనుకుని ఎవరినైనా అవమానపరచటం వల్ల నష్టపోయేది ఏనాటికైనా వారేనని చెప్తాడు. ఎవ్వరైనా ఒక్కడు మంచివాడై ఉండి ఇటువంటి అల్పుల అధికారాలకు అడ్డుపడి న్యాయం చేస్తే, అతన్ని అవమానించే వరకూ అతనికి అన్యాయం చేసే వరకూ, నిద్రించలేరని హేళనగా అంటాడు. చివరగా ఎందరి ఉసురు, ఎందరి కన్నీళ్ళు అతనిలాంటి వాళ్ళు పాడై పోవడానికి ఏదో ఒక నాటికి కారణం కాకపోదంటూ చెప్పి నిష్క్రమిస్తాడు. ఈ పాత్ర ద్వారా రచయిత సంఘంలో ఉన్నత పదవుల్లో ఉన్న కొందరు వ్యక్తుల స్వభావాన్ని వివరిస్తాడు. పదవి, అర్హత ఉన్న వాళ్ళకే దక్కాలితప్ప, వాళ్ళు చెప్పే మాయమాటల్ని నమ్మి ఏదోఒక కారణం వల్ల ఎవరినో ఎన్నుకుంటే, అల్పులకు పదవీ బాధ్యతల్ని అప్పగిస్తే, ఎటువంటి కష్టాల్ని ఎదుర్కొనవలసి వస్తుందో రచయిత ఈ పాత్ర ద్వారా తెలియజేస్తూ సమాజాన్ని హెచ్చరించారు.

**4.1.3. బ్రాహ్మణుడు :** దశమాంకంలో కన్పించే పాత్రల్లో ఇది ఒకటి. కట్నం ఎంత నీచమైనదో చెప్పడానికి సమాజంలో వరకట్నాన్ని రూపుమాపడానికి రచయిత యత్నించి ఆ ప్రచారం చేయటం కోసం సృష్టించిన పాత్రల్లో ఇది ఒకటి. తగిన బేరం రాగానే అబ్బాయి చదువు ఆపేసి, పెళ్ళిచేసి, అన్యాయపు కట్నం దోచి, అంతటితో ఆగక, లాంఛనాలవీ రాబట్టానంటాడు. ఆ డబ్బుతో ఒక పెంకుటిల్లు కట్టానంటాడు. ఆ ఇల్లు కాలిపోయిన తర్వాత భార్య చచ్చిపోయి, కొడుకు వెర్రివాడయిన తర్వాత, కోడలు మరెవరితోనో లేచి పోయిందని చెప్తాడు. తాను మాత్రం ఇలా ఒంటరి వాణ్ణి అయ్యానంటాడు. ఇవన్నీ కట్నం కోసం తాను అంత తాపత్రయ పడడం వల్లే జరిగిందంటాడు. కట్నం కోసం పీడించటంవల్ల ఏం లాభం లేకపోగా, ఎన్నో కష్టాలకు కారణమయ్యిందని బాధపడతాడు. వరకట్నం ఒక దురాచారం అని ప్రచారం చేయటం కోసం రచయిత సృష్టించిన పాత్రల్లో ఇది ఒకటి.

**4.1.4. అమ్మ :** వడ్డీలకు తిప్పిన డబ్బు, పది పుట్లు పండే భూమి, అలుకపాన్పుమీద కోరినవన్నీ ఇచ్చి, ఒకడికి తన కూతుర్నీ ఇచ్చి పెళ్ళిచేసిన తల్లి తన బాధను చెప్పుకుంటుంది. అన్నీ తీసుకున్న అతను ఆమె కూతుర్ని వదిలేసి మరొకామెతో పోయాడు. ప్రస్తుతం ఆమెకు ఇల్లులేదు. ఆమె కూతురికి కూడు, గుడ్డ, కొంప ఏమీ లేవు. ఉన్నవన్నీ ఊడ్చి అల్లుడికి పెట్టేవాళ్ళ బతుకులు ఇలాగే అవుతాయంటుంది ఆమె. వరకట్నం వల్ల ఏర్పడే కష్టనష్టాల్ని వివరించడానికి నాటక రచయిత సృష్టించిన పాత్రల్లో ఇది కూడా ఒకటి. ఇవన్నీ దశమాంకంలో వచ్చే పాత్రలే!

**4.1.5. పెట్టి :** వ్యాపారంలో ఎన్నో దొంగపనులు చేసి బియ్యం పప్పు మొదలైన వాటిల్లో పెడ్డలు కలిపి సంపాదిస్తాడు. ఇంట్లో ఉన్న మేనల్లుణ్ణి కాదని, పదివేలు కట్నమిచ్చి కూతురికి పెళ్ళి చేశాడు. గుంటూరు మేళం, గూడూరు చిన్నదాని పీకపాట కూడా పెట్టించి, అయిదు రోజుల పెళ్ళి ఎంతో ఘనంగా చేశాడట. ఆ తర్వాత దివాలా తీసి, కోర్టుకెక్కి, చివరికి పెసరట్లు అమ్ముకుని బతికే స్థితికి దిగజారానంటాడు. పడ్డకష్టం, కూడబెట్టిన డబ్బు, అన్నీ పోయి పదిమందికి యజమానిగా బ్రతికిన వ్యక్తికి ఇంత నీచపు స్థితి రావడానికి కారణం ఆ వరకట్నమే నంటాడు. నాటక రచయిత ఈ మూడు పాత్రల్ని దశమాంకంలో నాటకం పూర్తయ్యే వేళలో ప్రవేశపెట్టి వరకట్న దురాచారానికి వ్యతిరేకంగా ప్రచారం చేయటమే ఆ పాత్రల లక్ష్యంగా భావించాడు. ఈ పాత్రలన్నీ, జరిగిన వన్నీ చెప్పిన వెంటనే లింగరాజు ప్రవేశించి తన తప్పు ఒప్పుకోవటంవల్ల రచయిత తాను సృష్టించిన ఈ పాత్రలవల్ల అనుకున్న ఫలితాన్ని సాధించాడనవచ్చు.

## 4.2 అప్రధాన పాత్రలు :

ప్రధాన పాత్రల చుట్టూ కథ నడిస్తే ఆ కథను నడపటంలోను, పాత్రల స్వభావాల్ని వెలికి తేవటంలోను తోడ్పడేవి ఈ అప్రధాన పాత్రలు. ఇవి నాటకంలో మొదటి నుంచి చివరిదాకా కూడా ఉండవచ్చు. నాటకంలో ఆద్యంతం కన్పించే పాత్రలన్నీ ప్రధాన పాత్రలవ్వాలని లేదు. ఆ విధంగా ఈ వరవిక్రయం నాటకంలో కన్పించే పాత్రల్లో పుణ్యమూర్తుల పురుషోత్తమరావు భార్య భ్రమరాంబ, లింగరాజు భార్య సుభద్ర, పెళ్ళిళ్ళ పేరయ్య, వివాహాల వీరయ్య, వెర్రి బుర్రల వెంగళప్ప, న్యాయాధిపతి మొదలైన పాత్రలు నాటక కథాగమనంలో తమ వంతు భాగాన్ని నిర్వహిస్తాయి.

**4.2.1. భ్రమరాంబ :** హైందవ సంప్రదాయాన్ని నమ్మి జీవించే ఒక సాధారణ స్త్రీ. ఆమెకు తన భర్త, పిల్లలతోడిదే లోకం. ఆమె పాత్ర ఆదినుంచి అంతం దాకా ఉంటుంది. నాటక ప్రారంభంలోనే తన పిల్లల్తో కలసి కదురు త్రిప్పి నూలు వడుకుతూ కన్పిస్తుంది. మొదటి అంకంలోనే ఆమె మనస్తత్వం మనకు అర్థం అవుతుంది. నూలు వడుకుతున్నా, ఆమె పరధ్యానంగానే ఉంటుంది. బయటకు వెళ్ళిన భర్త భోజనం వేళ దాటిపోతున్నా ఇంటికి వచ్చి చేరలేదనే భయం ఒక ప్రక్క, పిల్లల పెళ్ళి గురించిన బెంగ మరోప్రక్క, ఆమె మనస్సును సంచలనానికి లోను చేస్తాయి.

తే॥ కన్య నొక్కరి కొసగిన సద్గతులు గాంతు
మనుచు సంతోషపడు కాలమంతరించి
కట్నములు పోయజాలక కన్యనేల
కంటిమాయని వ్యధపడు కాలమొదలె'

అని ఆమె తన కూతుళ్ళతో అంటుంది. ఆమె బాధనే కాకుండా, నాటక రచయిత ఈనాటి వరకట్న దురాచారం వల్ల ఏర్పడ్డ పరిస్థితిని కూడా చెప్తాడు.

కాలేజీలో చదివే వాళ్ళ గురించి కానీ, సంఘసంస్కర్తల గురించి కానీ ఆమెకు ఏమీ తెలియదు. ఆమె పాలంటే తెలుపనీ, నీరంటే నలుపనీ అనుకునేంతటి అమాయకత్వం కలది. కానీ, లోకంతోపాటు, కాలంతోపాటు మారాలని అనుకుంటుంది. భర్త కట్నం ఇవ్వకూడదని అనుకుంటూ, సంఘ సంస్కరణ గురించి మాట్లాడినా, లోకంతోపాటు అంటూ కట్నమిచ్చయినా తమ కూతుళ్ళకు మంచి సంబంధం తెచ్చి పెళ్ళి చేయాలనుకునే సగటు తల్లి ఆమె.

తన కూతుళ్ళకు సంబంధాలు తెచ్చిన పేరయ్యతో తన కోర్కె చెప్పేటప్పుడు కూడా, కంటికింపుగా ఉండేవాడు, ధనవంతుడు కావాలంటుంది. దానికి కారణం చెప్తూ చదువుకున్న వాళ్ళు ఉద్యోగాలు లేక, ఉద్యోగాలున్నా ప్లీడర్లు కేసులు లేకా తిరుగుతున్నారనీ,

సంప్రదాయంగల కుటుంబాల్లో కూడా జరగని వెన్నో జరుగుతున్నాయనీ, అందువల్ల అన్నిటికన్నా ముఖ్యంగా రూపం, సంపదా కావాలని కోరుతుంది. ఈ పాత్రను రచయిత లోకంలోని సాధారణ పత్నికి, తల్లికి ప్రతీకగా చిత్రించారు. నాటకం ఆద్యంతం ఈ పాత్ర ఎక్కడా తన భర్త గురించో, బిడ్డల గురించో తప్ప, తన్ను గురించి ఆలోచించిన దాఖలాలు కూడా లేవు. ఆమె భారత దేశ నారీమణి. ప్రేమే ఆమె స్వరూపం. ఆమెకు స్వార్థం తెలియదు. తనవారి కోసమే జీవితం అనుకునే స్త్రీ. ఆమె లోకానికే ఒక ఉదాహరణ.

పెళ్ళి నిశ్చయం అయింది. కాళింది ఎందుకో సంతోషంగా లేదని తెలుసుకున్నది భ్రమరాంబ. ముందుగా పిల్లవాడు నచ్చలేదేమో అనుకున్నది. కాళింది కట్నం ఇచ్చే పెళ్ళి వద్దంటుంది. తల్లి తన బిడ్డను పిచ్చిదానిలాగా చూస్తుంది. కట్నం అంటే ఏమిటో తెలియకుండా కట్నం లేకుండా పెళ్ళి జరగదని ఆమెకు తెల్సు. కట్నం అనేది అన్నిటికన్నా ఆఖరికి తండ్రి తద్దినం కన్నా ముఖ్యమైనది అని ఆమె కట్నం గురించి చెప్తుంది. ఆకాలపు స్థితిగతుల్ని మనస్సులో ఉంచుకుని కట్నం ఇవ్వక తప్పదంటుంది. కట్నం గొప్పతనం గురించి తెలుసుకుని దాన్ని కూతురికి వివరిస్తుంది.

ఆ॥ పిండి బొమ్మయైన బిల్లనిచ్చెదమన
గాన చేయిచాచు గట్నమునకు
ఇట్టి తరిని గట్నమీయకుండగ బుస్తె
కట్టు వరుడు జగతి గానబడునె'

అని ప్రశ్నిస్తుంది. దేశ కాలాల్ని గుర్తించి, తమ జీవితాల్ని సాధ్యమైనంత వరకు సుఖమయం చేసుకోవాలనుకునే సాధారణ జీవి ఆమె. తల్లి తండ్రులు తమ కూతుళ్ళ పెళ్ళి గురించి ఎన్నెన్ని కలలు కంటారో, అవి ఎలా ఉంటాయో వివరించటంలో రచయిత ఆమెను భారతదేశపు తల్లులకు ప్రతీకగా చేశారు. ఎవ్వరితో మాట్లాడుతున్నా, ఏం చేస్తున్నా ఆమె ధ్యాస భర్త చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఆమె పిల్లల్తో మాట్లాడుతూనే భర్త కోసం ఎదురుచూస్తుండటంలో తెలుస్తుంది.

కాళింది మరణంతో ఆమె మానసికంగా క్రుంగిపోతుంది. ఎంత వద్దని చెప్పినా వినకుండా, కూతురి మరణానికి తామే కారణమన్న విషయం ఆమెకు మరపుకు రాదు. ఇష్టంలేని పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నందువల్లే తమ కూతురు కాళింది మరణించిదన్న విషయం ఆ తల్లి జీర్ణించుకోలేకపోతుంది. ఎప్పుడూ కమలను అంటిపెట్టుకుని తన ఒళ్ళోనే ఉంచుకోవటం మొదలు పెడుతుంది.

పేరయ్య పురుషోత్తమరావులిద్దరూ లింగరాజు నుంచి డబ్బు రాబట్టే దారిలేక కమలనిచ్చి పెళ్ళి చేయాలనుకున్నప్పుడు, ఆమె అయిష్టత చూపిస్తుంది. కాళింది అంధాన్ని, గుణగణాల్ని గుర్తుకు తెచ్చుకుని బాధపడుతుంది. తమ జీవితాంతం సంతోషాన్నిచ్చి సాగనంపుతారని అనుకునే పిల్లలు అర్థాంతరంగా మరణిస్తే అది తల్లిదండ్రుల పాలిట పిడుగుదెబ్బే! అందులోనూ తమ నిర్ణయమే ఆమె మరణానికి కారణం అన్న నిజం ఆమెను మరింత బాధిస్తుంది. పుత్ర శోకంతో క్రుంగిపోయి దేనిమీదా ఆసక్తి లేని విధంగా మారిపోతుంది.

కమల పెళ్ళి గురించి భర్త, పేరయ్య మాట్లాడగానే ఆమెకు మళ్ళీ కాళింది జ్ఞాపకాలే! కమల అభిప్రాయం అడగమన్నప్పుడు, తమ ఆలోచన ఫలితాన్ని ఒకసారి చవిచూచి, పడ్డ బాధచాలనీ, మరొకసారి తాము ఏం ఆలోచించవద్దనీ, కమల మీద ఇష్టంతో ఆమె అభిప్రాయం ప్రకారమే అన్నీ జరగాలనీ, కనీసం ఆమె అయినా తమకు దక్కాలని కోరుకునే ప్రేమ స్వరూపిణి, తల్లి మనసులో తన బిడ్డలకే తప్ప మరెవ్వరికీ ముఖ్యత్వం ఉండదన్న విషయం రచయిత ఈ పాత్ర ద్వారా నిరూపించాడు. కమల పెళ్ళికి ఒప్పుకున్నానని చెప్పినా ఆమె మనసులో బాధ తగ్గదు సరికదా, పెరుగుతుంది. కానీ, ఆ డబ్బుకోసం మరొక కూతుర్ని బలిచేయడానికి, గర్భశోకానికీ ఆమె తయారుగా లేదు. తమ బిడ్డలే లోకమనుకున్న ఆమె, ఒక బిడ్డను పోగొట్టుకుంది. అందుకే తమ నిర్ణయాల్ని ఒక ప్రక్కకు తోసి తన చిన్న కూతురు విషయంలో, ఆమె ఎప్పుడూ తమ కళ్ళెదురుగా, ఆరోగ్యంగా ఉండాలన్నదే ఆమె కోరిక. ఆమెకు మిగిలిన ఒకే ఒక బిడ్డ బాగుపడాలనే ఆమె కోరిక సమంజసమే, ఆమె ధీరురాలు కాదు సగటు తల్లి.

పెళ్ళిలో ఆమె హడావిడి, పడినబాధ చెప్పనలవికాదు. ఆడపిల్ల తల్లి అయినందుకు ఉరుకు పరుగుమీద వియ్యాలవారికి అన్నీ అందించినా, వారికి సంతోషం లేదు సరికదా ఏదో ఒక కొరత చెప్తూనే ఉంటారు. వారి కిచ్చిన మొహరి మోటుగా ఉందనీ, టిఫిన్ సరిగా లేదనీ, ఉప్మాలో జీడిపప్పు తక్కువయ్యిందనీ, ఇలా ఎన్నెన్నో! ఎంత చేసినా, కోపంతో వారు చేసేవి భరించినా స్త్రీ సహజమయిన బుద్ధితో తమకు చేయవలసినవి ఏమీ చేయటం లేదని బాధపడుతుంది. 'వారి లాంఛనాలు వారు పుంజాలు తెంపి పుచ్చుకొంటున్నారు? మనకీయవలసి వచ్చినప్పుడు 'మా కానవాయితీ లేదంటున్నారు' అన్న ఆమె పలుకులు స్త్రీ, సాధారణంగా పెళ్ళిళ్లలో వియ్యాలవారి గురించి అనేవేకదా! సంతృప్తి అనేది మగపెళ్ళివారి కుండదు. అలాగే వాళ్ళు పుచ్చుకోవటమే తప్ప, ఇవ్వటం అనేది ఉండదు. అందువల్ల ఆడపెళ్ళి వారిలో ఏర్పడే అసంతృప్తిని ఈ ఒక్క వాక్యంలో రచయిత చూపించారు. మగపెళ్ళి వాళ్ళ అలుకలు తీర్చలేక, ఆడపిల్లను కన్న తల్లిదండ్రులు పడే బాధలు ముఖ్యంగా పెళ్ళికూతురి తల్లికుండాల్సిన సహనం, వీటినన్నిటినీ మూసపోసి రచయిత సృష్టించిన పాత్ర ఇది.

వరకట్నమనే దురాచారంవల్ల తాను పడ్డ కష్టాల్ని గుర్తుంచుకుని, నాటకాంతంలో ఆ దురాచారాన్ని ఖండిస్తూ ఆమె చెప్పేమాటలు మాణిక్యాలవంటివి. ఆ వరకట్న దురాచారాన్ని రూపు మాపాలన్న ఉద్దేశంతో రచయిత ఆమె నోట పల్కించిన మాటలు తమ కొడుక్కి కట్నం కోరుకునే ప్రతి స్త్రీకి కొరడా దెబ్బలే!

"సీ॥ మగబిడ్డ పుట్టిన మఱునాడె మొదలు శు
 ల్కములె లెక్కించు రాక్షసులార!
మర్యాదకై చూచు మరల గట్నాలకై
 రేపవల్ వేధించు రేచులార!
అయిదు ప్రొద్దుల రాణులై చీటికిని మాటి
 కలిగి కూర్చుండు గయ్యాళులార!
లాంఛనంబుల పేర లక్ష చెప్పుచునిల్లు
 గుల్లసేయు దరిద్ర గొట్టులార!
తే. ఆడపుట్టువు పుట్టరే ఆడువారి
నిట్టు లవమాన పఱచుట కించుకేని
సిగ్గు పడకుండ దగునె ఛీ ఛీ ధనంబె
పావనంబుగ చూచుట పరువె మురువె'

స్త్రీగా జన్మించి స్త్రీని గౌరవించలేని జీవితాలు వ్యర్థమని వివరిస్తుంది. భర్త, పిల్లలే లోకమనుకునే స్త్రీకి కష్టం అంటూ వస్తే లోకాన్ని తుచ్ఛంగా చూడగలదన్న నిజాన్ని రచయిత ఈ పాత్ర ద్వారా నిరూపించారు.

**4.2.2 సుభద్ర :** ఈమె లింగరాజు మూడవ భార్య. రచయిత ఈ పాత్రను పరిచయం చేయటమే ఆమె తన పెళ్ళికి బాధపడుతున్నట్లుగా చేస్తాడు. తల్లిదండ్రులు దారిద్ర్యం కారణంగానో, మరే కారణంగానో కూతుళ్ళను రెండో పెళ్ళి వాడికి, మూడో పెళ్ళి వాడికి ఇచ్చి చేసేస్తే, ఆ పెళ్ళిళ్ళను అంగీకరించి, అటువంటి వయస్సు మళ్ళిన భర్తతో, తమ వయస్సుతో సమానమైన అతని పిల్లల్తో సర్దుకుని పోలేక వారుపడే బాధ, వారి మనస్సుకుండే ఇష్టాయిష్టాల్ని గుర్తించని పెద్దలకు బలైపోయిన జీవితం - వీటన్నింటికీ ప్రతీక ఈ పాత్ర. ఈమెకు నవలలు చదవటం అంటే చాలా ఇష్టం. ఆ నవలల్లోని నాయికా నాయకుల్లాగా సమానమైన ఈడు జోడుకావాలని కోరుకుంటుంది. ఆ వయస్సు సహజంగానే ఈమెకు నగలు, చీరలు వంటి వాటిపట్ల ఆసక్తి ఎక్కువ. కానీ, ఈమె భర్త లింగరాజు పరమలోభి. ఈమెకు బట్టలు ఇవ్వటం కాదు కదా! కనీసం తాను క్షౌరం చేయించుకోడు. ఈమె చిన్న చిన్న కోరికలు కూడా తీరవు. నిజానికి ఈ వరవిక్రయం నాటకంలో జాలికొలిపే పాత్ర ఈమెదే! ఈమె మనస్సులో ఎన్ని కోరికలున్నా, ఎన్ని ఆశలున్నా, ఏం ఉన్నా ఈమె మాత్రం లింగరాజు భార్య, అంతకన్న ఈమెకే మాత్రం ప్రాధాన్యం లేదు. భర్తను ఎదిరించి ఏం మాట్లాడలేదు. తన కర్మకు తన వారిని, తన దురదృష్టాన్ని, తనకు పెళ్ళి చేసిన తల్లి దండ్రుల్ని, లోభి అయిన తన భర్తను తలచుకుని బాధ పడగలదు. అంతేకాని ఏమీ చేయలేని సగటు స్త్రీ ఈమె!

ఈమె ప్రవేశించే మొదటి రంగంలోనే 'సమాన వయోరూప సంపత్తి లేని దాంపత్యమేమి దాంపత్యము' అనటంలోనే ఈమె మనస్తత్వం మనకు తెలుస్తుంది. ప్రాయం సరిగా లేకపోయినా, భర్త ముసలివాడైనా సర్దుకు పోవచ్చు కానీ, దానికి లోభం తోడైతే ఎంత కష్టమని బాధపడుతుంది. ఈ రెండూ చాలవన్నట్టు భర్తకు అనుమానమొకటి!

"సీ॥ జడమైచుకొన సాని పడుచువటే యను

జీరకట్టిన షోకు మీతె ననును

......................................

చదివిన వ్రాసిన జగడమాడును దొడ్డి

లోని కేగిన ననుమానపడును"

ఈ అనుమానం వయసు మళ్ళటం వల్ల వచ్చినదే కావచ్చు. కానీ, పిసినారితనం అదెంతటిదంటే భార్యకు చీరలు, నగలుకొని పెట్టడం కాదుకదా! ఇంట్లో కాసే కూరలు కూడా అమ్ముకునేటంత. మరీ అటువంటి భర్తతో కాపురం చేయటం అంటే లోకానికి, అపనిందకు వెరసే తప్ప మరొకటేమీ కాదు!

బసవరాజు పెళ్ళికి చీరలు, నగలు ఇవ్వమని సుభద్ర భర్తని అడుగుతుంది. అతను పెళ్ళిరోజు పెట్టుకుంటే చాలంటాడు. "ఈ ఎన్నె వారిక కోడలికేమి నగలు పెట్టుదురు?" అని ఆమె ప్రశ్నిస్తుంది. ఈ ఒక్క ప్రశ్న తప్పించి ఈ నాటకం మొత్తం ఆమె భర్తను నిలదీసి ప్రశ్నించినట్లుగాని, ఎదురు పల్కిన వేళలు కాని కన్పించవు. దైవోపహతమైన స్త్రీగా, తల్లిదండ్రులు తన్ను ధనం గురించి ఆలోచించి అటువంటి వ్యక్తికి కట్ట పెట్టడం గురించి బాధపడుతున్న ఆడదానిగానే ఈమె చిత్రింపబడింది.

ఆనాటి సమాజంలో ఆడదానికున్న స్థానమేమిటో ఈమె పాత్ర ద్వారా తెలియపరచారు రచయిత. తలిదండ్రులు కుమార్తె భారం దించుకోడానికి, తాము తూగ గలిగిన కట్నానికి ఎవడు వస్తే వాడికిచ్చి పెళ్ళి చేసేవారు. ఆ భర్త వయస్సు, రూపం, గుణం, పరువు, ప్రతిష్ఠ వేటితోనూ లెక్కలేదు. కేవలం ధనమే ప్రధానం. అందులోనూ తక్కువ కట్నానికి వస్తే వాడు ఎన్నో పెళ్ళి చేసుకుంటున్న పెళ్ళి కొడుకైనా, ఎందరు పిల్లలున్నా, పెళ్ళి కూతురికి ఇష్టమే లేకున్నా ఏం పట్టింపు లేదు. పెళ్ళి అయితే చాలు, బాధ్యత తీరిపోయింది. అనుకునే తల్లి తండ్రులు ఒకపక్క; భార్య కూడా వ్యక్తేనని ఆమెకూ కోరికలుంటాయనీ అనుకోని అసలలా ఆలోచించటమే మగతనానికి తక్కువనుకునే భర్తలొక పక్క; తనతో సమ వయస్సు వారో లేక కొన్నిసార్లు పెద్దవారో అయిన సవతి పిల్లలొక పక్క, ఇన్నిటినీ కాదనే ధైర్యం లేక, సమాజం ఏమంటుందో అనే భయం ఒక పక్క - నాలుగు దారులూ మూసివేయబడ్డ జీవితం ఆనాటి స్త్రీది. ఆ సమాజంలో స్త్రీ చదవటం కూడా ఒక నేరం కిందే భావింపబడేది. అటువంటి అభాగ్య స్త్రీలకు ప్రతీక లింగరాజు భార్య సుభద్ర.

**4.3.2.3. పెళ్ళిళ్ళ పేరయ్య :** పెళ్ళిళ్ళు కుదిర్చి పెళ్ళి కుమార్తె, పెళ్ళి కుమారుడు రెండు వేపులా తమకంటూ ఎంతో కొంత పుచ్చుకునే వాళ్ళు ఈ పెళ్ళిళ్ళ పేరయ్యలు. పురుషోత్తమరావుకు మంచి చేస్తున్నట్లు కన్పిస్తూనే ఆయన కూతుళ్ళకు పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తూనే తన కమీషను గురించి ఆలోచిస్తుంటాడు. లౌక్యం తెలిసిన మనిషి. లింగరాజుతో, పురుషోత్తమరావు వరకట్నానికి వ్యతిరేకి అని చెప్తాడు. కానీ లింగరాజు కోరిక ప్రకారం 5000/- దాకా కట్నం వచ్చేలాగా వివాహాల వీరయ్యతో కలిసి పాట పెంచుతానని, తనకు మాత్రం అయిదు వందలైనా గిట్టుబాటు కాకపోతే కుదరదనీ బేరం పెడతాడు. ఆ డబ్బు కూడా పురుషోత్తమరావు నుండే రాబట్టాలన్నదే అతని తలంపు.

పురుషోత్తమరావు, పెళ్ళికోసం తనకున్న భూమి అమ్మకానికి పెట్టాలని ప్రయత్నించినపుడు కూడా పేరయ్య సహాయం పేరుతో స్వలాభం చూసుకోగల గడుసరి. వాళ్ళ అవసరానికి ఎంతో బెంగతో సహాయం చేస్తున్నట్లుగా నటిస్తూ ఆ భూమిని అల్లుడి పేర రాయించి తర్వాత మార్చుకోవచ్చని అనుకుంటాడు.

అదృష్టమనగా యిదీ! అధమం రెండు వేలయినా లాభిస్తాయి. ప్రస్తుతం అల్లుడు పేర వ్రాయించి, పదిరోజులు పోయాక పిరాయించుకుంటాను" అని అనుకోవటంలో అతని గడుసుతనం మనకు తెలుస్తుంది.

కాళింది పెళ్ళి వద్దన్నప్పుడు ఆడపిల్లలకు చదువు చెప్పించకూడదనీ, అలా చదవనివ్వటం వల్లే ఈ ఆశయాలు ఇత్యాది అంటూ ఆడపిల్లలు చెడిపోతున్నారనీ అంటాడు. "అందుకనే ఆడపిల్లలకు చదువంటే నాకు అరికాలు మంట నెత్తికెక్కుతుంది" అనటంలో అతడు స్త్రీ విద్యకు వ్యతిరేకి అని తెలుస్తుంది.

కాళింది మరణానంతరం, లింగరాజుతో మాట్లాడి, ఆ డబ్బు వెనక్కు ఇప్పించాలనప్పుడు అతను కాస్త న్యాయం మాట్లాడుతున్నట్లు కన్పిస్తాడు. వాళ్ళ డబ్బు, కార్యం జరగలేదు కనుక ఇచ్చేయాలని అంటాడు. నియోగి వైదీకి తేడాను తీవ్రంగా ఖండిస్తాడు. వైదీకులు నియోగులకంటే ఒక ఆకు ఎక్కువే తిన్నారన్నది అతని వాదం. పురుషోత్తమరావుతో మాట్లాడి కమలకు, బసవరాజుకు పెళ్ళిచేస్తే డబ్బు పోదనీ, లేదంటే అనవసరంగా కోర్టుకు వెళ్ళవలసి ఉంటుందనీ, ఆ అవమానం వద్దనీ చెప్పి ఒప్పిస్తాడు. పెళ్ళి ఆగిపోతే ఎలా అన్న బాధకన్నా తన కమీషన్ పోతుందేమోనన్న బెంగే ఎక్కువగా కన్పిస్తుంది. పేరయ్య లౌక్యం తెలిసిన మనిషిగానే చిత్రంపబడ్డాడు.

లింగరాజు గొప్పగా సంభావన లిస్తాడని ఎదురు చూస్తున్న బ్రాహ్మణులు పెళ్ళికి వస్తే, పోలీసుల్ని ఏర్పాటు చేయించటం వల్ల గొడవ రావచ్చని చెప్తాడు. ఆడపిల్ల పెళ్ళంటే ఎంత కష్టమో తెలిసీ, 16 రోజుల పండుగ నాటికి దివాలా తీస్తారని తెలిసుండి కూడా తన కమీషన్ మీదే అతని దృష్టంతా! లౌక్యం తెలిసిన, బ్రతక నేర్చిన బ్రాహ్మణుడుగానే ఈ నాటకంలో పేరయ్య మనకు కన్పిస్తాడు.

**4.2.4. వివాహాల వీరయ్య :** పేరులో ఉన్నట్లే కేవలం వివాహాలు చేయించటం ఇతని పని. సంబంధాలు కుదర్చటమే కాదు. సంబంధాలు కుదిర్చేటప్పుడు కమీషను ఎక్కువ ఇస్తానంటే పెళ్ళికొడుకు తండ్రికి సహాయంగా దొంగ వేలంపాట కూడా పాడగలడు. పురుషోత్తమరావు కాళిందికి పెళ్ళి సంబంధం కుదుర్చుకోడానికి వచ్చినపుడు వీరయ్య, పేరయ్యతో కలిసి ముందే నిర్ణయించుకున్న ప్రకారం వేలంపాటను 5,500 దాకా లాగుతాడు. అంటే ఆనాటి సమాజంలో ఇటువంటివి ఉండే వన్నమాట. పెళ్ళికొడుకు ఇంటివారి తరపున అది లేదు, ఇది లేదు అంటూ గొడవలు తెచ్చేవాడిగానే కన్పిస్తాడు. ప్రత్యేకంగా ఈ పాత్రకంటూ ఏ విశిష్టతా లేదు. కానీ, పెళ్ళి కొడుకుల వేలంపాటకు ఇతనొక ప్రతీక అంతే!

**4.2.5. వెర్రి బుర్రల వెంగళప్ప :** వరవిక్రయంలో కన్పించే వకీలు వెర్రి బుర్రల వెంగళప్ప. పదవీ వ్యామోహం, అధికార దాహం ఉన్న పాత్రది. తన అధికారాన్ని దుర్వినియోగం చేసేవ్యక్తి కూడా! తన వకీలు వృత్తిలో చేతినిండా సంపాదించే అవకాశం లేకున్నా! లంచాలు పుచ్చుకోగలిగే తాలూకాబోర్డు ప్రెసిడెంటు పదవి వల్ల లాభాన్నే పొందుతున్నాడు. ఒక ప్రక్క కమీషన్లు, మరొక పక్క ఫైన్లు, లంచాలు అంటూ ఎంత పట్టాలని ప్రయత్నించినా ఒక్కోసారి ఏమీరావనీ, ఒక్క నెల జీతంతోనే తృప్తి పడాలనీ బాధపడతాడు. ఇంకొకరి కష్టార్జితం ఇతనికి బెల్లం ముక్కతో సమానం. సరిగా కేసులు లేని వకీళ్ళకూ, వ్యక్తిగత లోభ మోహాలకూ ఈ పాత్ర ఒక సంకేతం. అధికార దుర్వినియోగమే కాకుండా లంచగొండితనం కూడా వుంది. ఈ వకీలుకు కేసు పెట్టి ఎదుటివాళ్ళను కేసు పేరిట తిప్పటం, డబ్బులు వసూలు చేయటం తప్ప, తనవైపు వారు కేసు నెగ్గాలనే పట్టుదల కూడా లేదు. అందుకే లింగరాజు మాటమీద కమల తండ్రిమీద కేసుపెడతాడు.

వాదనకు వెళ్ళినప్పటి నుంచీ ప్రతి మాటకూ ముందు వచ్చిన తీర్పుల్ని చూపించటమే ముఖ్యం అనుకుంటాడు. కోర్టులో వాదనంటే అంతకు ముందు అలాంటి సందర్భంలో ఏఏ ఊళ్ళో ఎలాంటి తీర్పు వచ్చిందో చూపించగలిగితే చాలనుకుంటాడు. నిజానికి సందర్భోచితంగా సమాజంలోని వ్యక్తుల కోసం న్యాయస్థానాలే కానీ, న్యాయస్థానాల కోసం వ్యక్తులు కాదని కూడా గ్రహించలేనివాడు. ఎప్పుడూ తీర్పు మీదా, డబ్బు మీదా తప్ప మరిదేనిమీదా వెంగళప్ప దృష్టిపడదు.

**4.2.6. న్యాయాధిపతి :** ఈ నాటకంలోని చిన్న పాత్రల్లో ఉదాత్తమైన పాత్ర న్యాయాధిపతిదే! సమాజం కోసమే న్యాయం, కానీ న్యాయస్థానాల కోసం వ్యక్తుల జీవితాల్ని బలి ఇవ్వకూడదనే సంస్కారం కలవ్యక్తిగా ఈ పాత్ర చిత్రింపబడింది. పేరు పెట్టకపోయినా రచయిత ఈ పాత్రను చక్కని న్యాయాధిపతిగా చూపించారు.

కేసు న్యాయస్థానానికి రాగానే రెండు పక్షాల వారికీ పొత్తు కుదర్చాలని ప్రయత్నించిన న్యాయాధిపతి మెచ్చుకోతగ్గవాడు. "న్యాయాధిపతిగా కాక గృహస్థుగా నడుగుచున్నాను." అనటంలో అతని సహృదయత గోచరిస్తుంది. న్యాయాధిపతిగా తనకున్న అధికారాన్ని పురస్కరించుకొని, కమలకు వాదించటానికి అనుమతినీయటంలో న్యాయం న్యాయస్థానం కన్నా గొప్పదన్న అతని నమ్మకం బయల్పడుతుంది.

కమల శుభలేఖలోని వివరాల్ని చదవగానే ఆమె వాదనలోని గొప్పతనాన్ని, నిజాన్ని అర్థం చేసుకుని, న్యాయం చేకూర్చాలన్న ఆత్రుత ప్రదర్శించటంలో - న్యాయాధిపతి కేవలం న్యాయస్థానంలోని తన పదవికే కాక మానవత్వానికి కూడా ముఖ్యత్వమిచ్చే వ్యక్తిగా కన్పిస్తాడు. కథమలుపు తిరగడానికి దోహదపడే పాత్ర ఇది.

### 4.3. ప్రధాన పాత్రలు :

నాటకంలో కథ ఏ పాత్రల్ని ఆధారంగా చేసుకుని నడుస్తుందో వాటిని ప్రధాన పాత్రలంటారు. ఈ నాటకం పేరు వరవిక్రయం. వరుని విక్రయం అన్న పేరున్న ఈ నాటకంలోని వరుడు బసవరాజు, అతని పెంపుడు తండ్రి లింగరాజు, వరుణ్ణి కొనుక్కున్న ఆడపిల్లల తండ్రి పురుషోత్తమరావు, అతని కుమార్తెలు కాళింది, కమల. వీరి చుట్టూనే కథ అల్లబడింది. కథాగమనానికి వీళ్ళే కారణం. అందువల్ల వీళ్ళే ఈ నాటకంలోని ప్రధాన పాత్రలుగా మనం పరిగణించవచ్చు.

**4.3.1. బసవరాజు :** సింగరాజు లింగరాజు దత్తపుత్రుడు. పెంపుడుతండ్రి గుణాలంటే ఇతనికేం పెద్ద గౌరవం ఉన్నట్టు కన్పించదు. ఈ పాత్ర ద్వితీయాంకంలోనే ప్రవేశిస్తుంది. నిజానికి ప్రధాన పాత్రలన్నిటిలోనూ ఇదే చిన్న పాత్ర. అయినా ఈ పాత్రను ఆధారం చేసుకునే ఈ నాటకంలోని కథంతా సాగుతుంది. తొలి ప్రవేశంలోనే బండివాడికి తండ్రి ఇంట్లో ఉండీ లేనని చెప్పమన్నప్పుడు వ్యతిరేకిస్తాడు. ఫవుంటెను పెన్నుమీద కోరిక, తన వయస్సులో అందరిలాగే ఇతనికీ వుంది. అయినా తండ్రి ఆ కోరిక తీర్చదని గ్రహిస్తాడు. అబద్ధాలు చెప్పటం మంచిది కాదని తమ ఉపాధ్యాయులు బోధించారని అంటాడు. ఇతడు నాటకంలో ప్రవేశ పెట్టబడిన స్థితి చూస్తే ఒక సరాసరి విద్యార్థిగానే తోస్తుంది.

తృతీయాంకం రెండో రంగంలో పెళ్ళిళ్ళ పేరయ్య, వివాహాల వీరయ్యలు వేలం పాట పాడుతున్నప్పుడు బసవరాజు అనుకునే మాటల్ని బట్టి తెలివైన యువకుడిలా కన్పిస్తాడు. కాని తండ్రి ముందు ధైర్యంగా నిజం చెప్పలేడు. తన మనస్సులో ఉన్నదాన్ని అడిగే పాటి సాహసం చేయగల వాడిలాగా కన్పించడు. బహుశ పెంపుడు తండ్రి కనుక కాబోలు!

తే. "పేకలో నోకులం బాడువీక నడిబ
జారులో గుడ్డలం బాడు సరణి పెండ్లి
కొడుకునిట్లు మధ్యనిడి కసి గొన్నయట్లు
వేలముం బాడు టెన్నడు యెఱుఁగ"

పేకలో ఓకులు, నడి బజారులో గుడ్డలు అమ్మేటట్లు కొడుకును అమ్మటం ఒక కొత్త విషయంగా ఉందనుకుంటాడే తప్ప, దాన్ని ఆపడానికి ప్రయత్నం ఏమీ చేసినట్లు కన్పడదు. కానీ, తెలివి తేటలు లేని వాడేం కాదు ఈ బసవరాజు. పేరయ్య, వీరయ్యల పాట వింటూ వీరయ్య పాల్సుగాడని నిశ్చయించుకుని, అక్కడ నుండి మౌనంగా వెళ్ళిపోతాడు. తెల్సిన నిజాన్ని నిర్భయంగా చెప్పలేని వానిగా ఈ పాత్ర రచయిత చేత చిత్రింపబడింది.

పెళ్ళిలో కాని, మరెక్కడా కాని ఈ పాత్ర గురించి ఏమీ చెప్పబడలేదు. ఒక మౌన సాక్షిగా మాత్రమే ఈ పాత్ర వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. పఠితలకు బసవరాజు ప్రత్యక్షంగా మళ్ళీ నాటకంలోని చివరి రెండు అంకాల్లోనే కన్పిస్తుంది. అదీ కోర్టులో. కోర్టులో తండ్రి కేసు పెట్టినప్పుడు కాని, భార్య కాపురానికి రాకపోవడానికి వాళ్ళు కారణాలు కల్పించినపుడు కాని, నోరు మెదిపిన దాఖలాలే లేవు. కమల న్యాయ స్థానంలో తన తండ్రికి బదులు తనకే వివరం చెప్పుకునే అవకాశాన్ని ఇవ్వమని అడుగుతుంది. బసవరాజును ముందు తన అక్కకోసం నిశ్చయం చేసుకున్నారనీ, కాని ఆమె కట్నమిచ్చి పెండ్లాడ్డానికి ఇష్టపడక ఆత్మహత్యకు పాల్పడిందనీ, ఆ సొమ్ము తిరిగిరాని కారణంగానే తనకు ఆ పెళ్ళి చేశారని చెప్తుంది.

బసవరాజు పైన చెప్పబడ్డవన్నీ తన అవజ్ఞ చేతనే జరిగాయని, తన్నుతానే నిందించుకుంటాడు. పరువు మర్యాదలు నశించి, లోకంలో పండితులు పామరులనే భేదం లేకుండా అందరూ తన గురించి చెప్పుకుని నవ్వుకునే లాంటి జీవితమైందని బాధపడతాడు. లోభి అయిన

తండ్రివల్లే ఇదంతా జరిగిందని అవమాన పడతాడు. ఇకనైనా తాను సమాధానం చెప్పకుండా ఉండిపోతే, తన కన్నా పెద్ద మూర్ఖుడుండడని తనలో తానే తర్కించుకుంటాడు. ఆది నుంచి అబద్ధం గిట్టని పాత్రగా కన్పించే బసవరాజు.

తే ॥ "ఆమె చెప్పిన దెల్ల యథార్థ మీతఁ
డాచరించిన దెల్ల నాయాత్మ యెఱుగు
నిట్టిచో న్యాయమునకేను గట్టు వడక
యున్న దేవుడు ననుఁజూచి యోర్చువాఁడె?"

అని తన్ను తానే ప్రశ్నించుకుంటాడు. మొదటినుంచీ ధర్మ విరుద్ధంగా అన్పించిన వాటిని అసహ్యించుకున్నా, అన్నిటినీ మౌనంగా సహించిన బసవరాజు దైవభీతి వల్ల ధర్మచ్యుతిని అడ్డుకోవాలనే యత్నం చేస్తాడు.

నవమాంకంలో న్యాయస్థానంలో ధైర్యంగల యువతకు ప్రతీకగా మట్లాడతాడు. జరిగిన వాటిలో మంచి చెడు వివరించడానికో, విశ్లేషించడానికో ఏ మాత్రం మొగ్గుచూపడు. తన్ను కమలకు తండ్రి అమ్మినట్లు, తాను అమ్మబడినది నిజం అనీ చెప్తాడు. కట్నాలకు అమ్ముడు పోయిన యువకులంతా భార్యకు దాసులమే తప్ప భర్తలమని చెప్పుకునే అర్హత లేని వారమేనంటాడు. భార్యతో ఆమె ఆనతి ప్రకారం నడుచుకుంటాననీ, ఆమెకు భృత్యుడిగా ఉంటాననీ అంటాడు. నిజాన్ని నిజంగా గుర్తించి తన తప్పుకు పరిహారం చేసుకుంటాడు. ఈ నాటకంలో మలుపు ఇతడు ధైర్యం చేయటం వల్ల ఏర్పడుతుంది. మూడు నాలుగు చోట్ల మాత్రం కన్పించినా, బసవరాజు పాత్ర వరకట్న దురాచారానికి కారణం అయ్యే పరిస్థితినుంచి యువత దాన్ని ఎదిరించి, తిరస్కరించి తమ ఆత్మ గౌరవాన్ని దక్కించుకోవాలని చెప్పేటట్లు చిత్రింపబడింది. బసవరాజు ముందే ధైర్యం చేసి తండ్రి లోభాన్ని ఎదిరించి ఉంటే కథ ఏ మాత్రం కదిలేది కాదు! అక్కడే కథ అయిపోయి ఉంటుంది. ధైర్య సాహసాల్ని తనలో దాచుకుని చేతకాని వాడిలా కన్పిస్తూ, మంచి ఇది అని చెప్పగల శక్తి లేక తల ఒగ్గినట్లుంటూ, చివరకు అతడు చేసే సాహసం పఠితల చేత ఆ పాత్రను మెచ్చుకునే లాగా చేస్తుంది. అందువల్లే ఈ పాత్ర మేర చిన్నదయినా కూడా ప్రధాన పాత్రల్లో ఒకటిగానే పరిగణింపబడుతుంది.

**4.3.2. కాళింది :** కాళింది పురుషోత్తమరావు పెద్ద కుమార్తె. పాత్ర పరిచయమే రాట్నంతో నూలు వడకుతూ, దేశాభిమానం గల పాటను పాడుతున్నట్లు రచయిత చేశారు. ఈమె స్వతంత్రభావాలు గల స్త్రీగా, దేశాభిమానమున్న యువతిగా చిత్రింపబడింది. తల్లి తండ్రులమీద ప్రేమ, గౌరవం కలది. వాళ్ళ భావాల్ని అర్థం చేసుకుని గౌరవం చూపగలది. తల్లి ముఖంలో ఏదో బాధ గూడు కట్టుకుని ఉండటం గమనిస్తుంది. అదేమిటని ప్రశ్నిస్తుంది. అల్లరిగా సమాధానం చేప్పే చెల్లిని మందలిస్తుంది. నిదానమైన గుణం, బాధ్యతాయుతమైన ప్రవర్తన కలదని చెప్పడానికి ఈ వివరాలు చాలు. తల్లిదండ్రులు తమ వివాహాన్ని గురించి పడుతున్న దిగులంతా చూసి, కట్నమిచ్చి పెళ్ళి చేసుకోవడమంత హీనమైన పని మరొకటి లేదనుకునే స్త్రీ ఈమె. కట్నం ఇవ్వకపోతే కన్నెగానే బ్రతకాలనే పరిస్థితిలో 'భూపతికేనియు నాడు బిడ్డగాఁ బుట్టరాదు, పుట్టు నెడఁ బుట్టిన యప్పుడె గిట్టఁగాదగున్' అనగలిగిన స్త్రీ. వరకట్నం అనే దురాచారాన్ని ఖండించడం కోసం ఏదైనా చేయవచ్చు అంటుంది.

తే॥ "........... ప్రాణములనైన
విడిచెదంగాని, యడిగిన విత్త మిచ్చి
వరుని గొని తెచ్చినట్టి వివాహమునకు
సమ్మతింప నా రాట్నము సాక్షిగాను"

అంటూ శపథం చేసి ఆ శపథాన్ని నెరవేర్చుకున్న ఆదర్శ యువతి, కాళింది.

వరకట్నం దురాచారమని చాటి చెప్పడం కోసం రాయబడ్డ ఈ 'వర విక్రయం' అనే నాటకంలో నాయిక ఎవరన్న ప్రశ్న తలెత్తక మానదు. తన శపథాన్ని నెరవేర్చిన కాళింది నాయిక అవుతుందా?

కమలపైన కాళిందికి చాల ప్రేమ. చెల్లెల్ని కౌగలించుకుని పలుక గలంత ప్రేమ. కానీ, పెళ్ళి కొడుకు ఛాయాచిత్రం చూపడానికి తెచ్చి ఆటలు పట్టించినపుడు మాత్రం ఆమెకు చెల్లెలిమీద కోపం వచ్చింది. తల్లి తండ్రి ఆ సంబంధాన్ని పెళ్ళిపత్రికల వరకు తెచ్చారని విన్నప్పుడు కాళింది కోపం, అసహాయత కలిసి ఆమెను అన్నం తిననివ్వలేదు. భోజనం చేయలేదేమి అని తల్లి అడిగినపుడు తన అయిష్టాన్ని చెప్తుంది. వరకట్నం మిచ్చి పెళ్ళాడటం కన్నా చిన్నతనం లేదంటుంది. అందువల్ల పెళ్ళి చేసుకోవటమే తనకు ఇష్టం లేదని బాహాటంగా చెప్తుంది. ఆమె ఉన్నతమైన భావాలున్న ఆదర్శయువతిగా దర్శనమిస్తుంది.

"చ॥ తిరముగ నింటి ముందుఁ బెను దేవళముండగ మ్రొక్కు బళ్ళతో
దిరుపతి కేగినట్లు కులదీపకు లెందఱొ లేమిచే వివా
హరహితులై కనంబడెడు నప్పుడు వారికి రోసి కట్నమే
పరువుగ నెంచు వారికయి పర్వులిడం బనియేమి వచ్చెనే?"

అని ధైర్యంగా అడగగలిగిన పిల్ల. ఎన్నో బాధలుపడి కని పెంచిన ఆడపిల్లను కట్నమిచ్చి మరీ ఇంకొకరి పాలు చేయటంలో ఏమి లాభమని తల్లిని నిలదీసి ప్రశ్నించటమే కాకుండా, కొనే వాళ్ళుంటేనే అమ్మకం అంటూ లోకనీతినీ, ఆర్థిక నీతినీ కలబోసి కట్నాలిచ్చే వాళ్లుండబట్టే కదా పుచ్చుకునే వాళ్ళున్నారని ఎదురు తిరిగి ప్రశ్నించగల ధీరురాలు. అంతే కాకుండా మెల్లగానే తన తండ్రిని ఎదిరించి మాట్లాడుతున్నట్టుగా ధిక్కరిస్తున్నట్టు కాకుండా మెల్లగానే తన మనస్సులోని భావాల్ని బలంగా చెప్పగలదు. కూతురికి పెళ్ళిచేసి మరొకరింటికి పంపే తీరాలి అన్న ఆలోచనను మాని తన్ను ఒక కొడుకు అనుకుని ఇంట్లోనే ఉంచుకోమని, "మీరు పెంచలేకున్న గష్టించి మిమ్ము నేనె పెంచుదాన' అని చెప్పేటంత ఆత్మ విశ్వాసం కల స్త్రీ. ఆ వరకట్నపు వివాహాన్ని చేసుకోనని తండ్రిని ప్రాధేయపడుతుంది. కాళ్ళపై బడి వేడుకుంటుంది. తాను నమ్మిన ఆదర్శానికి కట్టుబడడం చాలా గొప్పగా భావిస్తుంది. తనకు పాఠాలు నేర్పిన దొరసాని లాగా అవివాహితగా ఉండిపోతానంటుంది. వరకట్నపు సమస్య ఆమె మనస్సును పాశ్చాత్య సంస్కృతివైపు ఆకర్షితురాల్ని చేస్తుంది.

కట్నం పంపామని తల్లిదండ్రులు చెప్పినప్పుడు ఆమె చాలా బాధపడుతుంది. ఎంత చెప్పినా తల్లికి తోచలేదని, తండ్రి కూడా తన మెట్టు నుంచి దిగి మరీ వరకట్నం ఇవ్వడానికి సిద్ధమయ్యాడనీ, స్త్రీ బ్రతుకు హేయ్యమయిందనీ తలచుకుని క్రుంగిపోతుంది. అస్వతంత్ర జీవితంలో ఏమి చేయాలో తోచక బాధపడుతుంది. కట్నం పుచ్చుకుని పెళ్ళి చేసుకుని భర్తను తెచ్చుకునే కన్నా, తల్లి తండ్రుల్ని ఎదిరించటం పెద్ద తప్పు కాదేమోనని ఆలోచిస్తుంది. అంతలో కమల ఒక యువతి ఆత్మహత్య గురించి, చెప్పినప్పుడు ఆమెను మెచ్చుకుని, ఆ స్త్రీ సాహసాన్ని పొగడుతుంది. ఆమె చర్యను సమర్థిస్తుంది. ఆ భావం బలం పుంజుకుని తల్లిదండ్రులు తన మాట మన్నించని విపత్కర పరిస్థితుల్లో వాళ్ళను కాదని ఎదిరించి వాళ్ళను కష్టపెట్టే కన్నా, తన ఆశయాన్ని కాపాడుకోవటం కోసం ప్రాణత్యాగం చేయటమే మేలని నిర్ణయించుకుంటుంది.

అటువంటి పరిస్థితుల్లో కూడా ధైర్యాన్ని కూడగట్టుకుని, తల్లి తండ్రుల్నే కాదు, తాను పెంచిన చెట్లపాదుల్ని కూడా క్షమాపణ అడుగుతుంది. సంఘసంస్కర్తలనే పేర చెలామణి అవుతున్నవారి ధూర్త గుణాలు, పాలకుల అత్యాశ, పదవీలాలస మొదలైన వాటినే కాక ఆడవారిగా పుట్టి కట్నం కోసం మరొక ఆడపిల్ల జీవితాన్ని పాడుచేస్తున్న స్త్రీలను కూడా నిందిస్తుంది. భగవంతుని ప్రార్థించి ప్రాణత్యాగం చేస్తుంది.

నమ్మిన ఆదర్శం కోసం నిలబడి, తల్లితండ్రుల ఎదుట వాదాడుతుంది. తండ్రి వస్తుంటే మాట్లాడుతున్న చెల్లిని అడ్డుకునేటంత గౌరవం చూపిన కాళింది తన ఆశయానికి ఎదురు పల్కినపుడు తల్లి తండ్రుల్ని ఎదిరించాలని కోరుకుందంటే ఆమె ఆత్మస్థైర్యం, ఆశయంపై మక్కువ మనకు తెలుస్తాయి. మనో వాక్కాయ కర్మల్ని ఏకం చేసి తాము నమ్మిన దానికోసం బతికి, తమ నమ్మిక వమ్మయితే ప్రాణత్యాగానికి సిద్ధపడగల సాహస బాలికలు ఈ సమాజానికి ఎంత అవసరమో ఈ పాత్ర చాటి చెప్తుంది. కాళింది, తల్లికి తండ్రికి ప్రియ తనయ, కమల గౌరవాభిమానాలు చూపే అక్క, పాఠకులకు ఒక ఆదర్శ యువతిగా చిత్రింపబడింది.

**4.3.3. కమల :** ఈమె పురుషోత్తమరావు, భ్రమరాంబల రెండవ కుమార్తె. కాళింది చెల్లెలు. ఈమె చలాకీతనం, చిలిపితనం, ధైర్యం, వివేచనాజ్ఞానం ఉన్నదానిగా మనకు అగుపిస్తుంది. ఇంట్లో చివరిదైన కారణంగా కాస్త అల్లరి పిల్లగా ఉన్నా ఆ అల్లరి వెనుక ఆలోచనా స్రవంతి

జాలువారుతూనే వుంటుంది. తెలివి తేటలతో అన్నీ తనకు అనుగుణంగా మలచుకోగల నేర్పరి. వ్యక్తిగతంగా ఎంతో మంచిది. తల్లి దండ్రులపైనా, అక్కపైనా అలవిమాలిన ప్రేమానురాగాలు ఈమె పల్కుల్లో విన్పిస్తాయి. కానీ, ఏ విషయమైనా నేరుగా కాక వ్యంగ్యాత్మకంగా పల్కటం ఈమె లక్షణం. వరకట్న దురాచారానికి ఒక కొత్త కోణంనుంచి పరిహారం వెతికిన సాహస యువతి. అక్క దుర్మరణానికి పరిహారంగా ఎదుటి వాళ్ళనుంచి తమ ధనం పోకుండా కాపాడవలసిన భారాన్ని తనపై వేసుకుని ఆ కార్యాన్ని సాధించిన స్త్రీ. అందువల్లే వరకట్న దురాచారాన్ని ఖండించే ఈ వరవిక్రయ నాటకానికి నాయిక కాళింది కాదు, కమలే అనవచ్చు.

తండ్రి తమకు సంబంధాలు వెదకడానికి వెళ్ళాడని తల్లి చెప్పినపుడు ఆడపిల్లల్ని కన్నవాళ్ళకు మరేమి 'పనుండద'ని ఆమె వెక్కిరిస్తుంది. అక్కడా, పేరయ్యను ఆటపట్టించేటప్పుడు కమల అల్లరిపిల్లగా కన్పిస్తుంది. కానీ వరకట్నం కాదని మనమేమి చేయగలం అన్న అక్కతో, తనువే అశాశ్వతమైనపుడు, క్షణభంగురమైన జీవితం కోసం, "ధనమిడి భర్తలంబడసి దాస్యమొనర్చుటకంటె బెండ్లియే, యనువుగ మానిపించుకొని హాయిగ రాట్నము త్రిప్పుకొంటూ బ్రతకటం శ్రేయస్కరం" అన్నప్పుడు ఆదర్శయువతిగా మనకు సాక్షాత్కరిస్తుంది. అక్కకు నిశ్చయించిన బసవరాజు ఛాయాపటము తెచ్చి కాళిందిని ఆటపట్టించే వేళల్లో కమల చిలిపితనం గోచరిస్తుంది. భవిష్యత్తు చెప్తున్నట్లు 'ఎక్కడను మగఁడు దొరకని యెడల అక్క మగఁడే దిక్క'నే సామెత చెప్తుంది. కాళిందికి ఒక యువతి సాహస చర్య గురించి చెప్తుంది. వార్తా పత్రికలోని విషయాన్ని చెప్తూ, అక్క దగ్గర ఆ యువతి సాహసాన్ని మెచ్చుకునేటప్పుడు కమల సాహసమంటే ఇష్టపడే కన్యలా కన్పిస్తుంది.

కాళింది చనిపోయిన తర్వాత ఆ డబ్బు కోసం కమలను బసవరాజుకు ఇచ్చి పెళ్ళి చేయమని పేరయ్య సలహా చెప్తాడు. కమల తల్లి తండ్రులు ఆ విషయంలో నిర్ణయం ఆమెదే అన్నప్పుడు, అక్క బాటలోనే నడిచి తల్లిదండ్రుల్ని విషాదంలో ముంచటమా? లేకపోతే వాళ్ళకు గుణపాఠం నేర్పటమా? అని తనలో తానే వితర్కించుకుని దారి ఎన్నుకునేవేళ, కమల వివేకవతి అని తెలుస్తుంది. అక్కను క్షమించమని కోరటంలో నిజాయితీ, కసితీర్చుకుంటాననటంలో ధైర్యం, ఆలోచిస్తే ఏ విషయంలోనైనా చక్కని జవాబు దొరక్కపోదు అనే ఈమె మాటల్లో విజ్ఞతా గోచరిస్తాయి.

కమల కూడా అక్క కాళింది లాగే కదురు రాట్నం అంటే చాలా ఇష్టమున్న పిల్ల. రాట్నం, కవ్వం తిరిగితే దేశంలో క్షామముండదనటంలో ఆమెకున్న దేశాభిమానం వ్యక్తమవుతుంది. కమల లింగరాజు వేసిన దావా గురించి నోటీసు గురించి తండ్రి చెప్పినపుడు, తనమీద నమ్మకం ఉంచి ఆ విషయాన్ని తనకు వదిలిపెట్టి నిశ్చింతగా ఉండమని తండ్రికి ధైర్యం చెప్తుంది.

ఉ॥ "గట్టిగ నిన్నె నమ్మకుని కష్టములోర్చిన వారినేరి చే
పట్టి భరించు కేవల కృపామయమూర్తి వటంచు నెట్టనం
బట్టి తి నీదు పాదములు బాలను, బేలను, దీనురాలన
న్నెట్టుల తేల్చెదో తరుణమియ్యది యే సుమి డాయ వచ్చెడున్"

అంటూ భగవంతుని ప్రార్థించినా, ఆమె బేల కాదనీ, అబల కాదనీ నిరూపించుకుంటుంది.

దావాకోసం న్యాయస్థానానికి వచ్చిన తర్వాత, న్యాయాధిపతిముందు తనకు తానే ధైర్యం తెచ్చుకుని, తనకు మాట్లాడే అవకాశం ఇమ్మని అడుగుతుంది. అక్కడ ఆమె సాహసం బయల్పడుతుంది. ఆమె మాట్లాడకూడదన్నప్పుడు, "చట్టము వేరు సందర్భము వేరు. సందర్భములను బట్టి చట్టము మారునేకాని చట్టములను బట్టి సందర్భములు మారవు" అంటూ నీతి, న్యాయాలు సమకాలీనాలు అంటూ తాను నమ్మిన విషయాన్ని ధైర్యంగా చెప్పగల దక్షత ఉన్న యువతిగానే చిత్రింపబడింది. బహుమతిగా ఇచ్చిన నగలను తిరిగి తీసుకునే హక్కు దాతకు లేదని చెప్పినప్పుడు, కమలకు వ్యవహార దక్షత, సమాజ పోకడలు తెలుసుననిపిస్తుంది. రెండవది భర్త తన ఇంటికి వచ్చి తన మాట ప్రకారం నడచుకోవాలే తప్ప, తాను తన భర్త ఇంటికి వెళ్ళి భర్త మాట విననక్కరలేదనీ, అందుకు కారణం అంటూ జరిగినదంతా చెప్తుంది. అంతే కాకుండా కట్నం వేరు, క్రయధనం వేరు అంటే మరి తమ విషయంలో, "కట్నము వివాహ కాలమున ఇచ్చుట కలదు. కాని వేలము, బజానా, అగ్రిమెంటు, ముందుగా చెల్లించుట ఇట్టి ఆచారమెచ్చటను లేదు. అందువల్లనిది క్రయ ధనమగుట కాక్షేపణ మేమియు లేదు." అంటుంది. ఆనాటి కోర్టు వ్యవహారాలు, సమాజపు స్థితిగతులు చక్కగా ఆకళించుకున్నట్లు కన్పిస్తుంది. అంతేకాకుండా "పెళ్ళి

కుమార్తెకు పెళ్ళి కుమారునిచ్చి" అని ఇరువైపుల పత్రికల్లోను ఉండటాన్ని బట్టి భర్త తనకు స్వంతమనీ, తన ఇంటికి వచ్చి ఉండాలనే విషయాన్ని ప్రతిపాదిస్తుంది. చివరకు తన భర్తను తనతో తీసుకుని వెళ్ళటంలో ఆమె విజయం కన్పిస్తుంది.

అనుకున్న విషయాన్ని ఆచరించగలిగే శక్తియుక్తులున్న ఆదర్శ మహిళగా కమల పాత్ర చిత్రింపబడింది. ఆమె గెలుపు ఆమెను ఈ వర విక్రయ నాటకానికి నాయికను చేసింది. ఆమె ఒక ధీర వనితగా ఆదర్శయువతిగా మనకు దర్శనమిస్తుంది.

**4.3.4. లింగరాజు :** సింగరాజు లింగరాజుగా పేర్కొనబడే ఈ పాత్ర ఈ వరవిక్రయ నాటకంలో ఒక విధంగా చూస్తే ప్రతినాయకుడు అనవచ్చు. మన భారతదేశపు కావ్య నాటకాల్లో ప్రతి నాయకులు, నాయకులు ఉంటారేకాని విలన్లు ఉండరు. ఈ వర విక్రయం నాటకం వరకట్న సమస్యను ఆధారంగా చేసుకుని రాయబడింది. కట్నం అన్నది ఈ లింగరాజుకు బహిః ప్రాణం వంటిది. ఆ కట్నం డబ్బుకోసం, దాన్ని దక్కించుకోవటం కోసం, లింగరాజు ఏ కష్టానికైనా తయారే. ఏ పని చేయడానికైనా వెనుకాడడు. వరకట్న సమస్య చుట్టూ తిరిగే ఈ నాటకంలో నాయికా నాయకులు మరి ఇతర పాత్రలు కష్టాల పాలవడానికి లింగరాజే కారణం. అందుకే అతణ్ణి ఈ నాటకానికి ప్రతి నాయకుడని పేర్కొనవచ్చు.

లింగరాజు పరమ లోభి. కాకికి చేయి విదల్చడు, సరికదా! కాకి గూడు కొట్టి ఒకనాటి వంటకు పుల్లలు సమకూర్చుకోమని పనివాణ్ణి పురమాయిస్తాడు. ఈ పాత్ర ధనాన్నీ, ధనలక్ష్మినీ కీర్తిస్తూనే పరిచయం అవుతుంది. ధనమే ప్రధానం. ప్రాణానికి కూడా ముఖ్యత్వమియ్యడు.

"చ॥ పిడుకలు వంట కట్టెలును బీటలు చేటలు లెక్కజూచియే
ర్పడ పాయి బొగ్గులం గొలిచి పాదుల కాయలనెంచి, దూడపా
ల్విడిచిన దాఁక నిల్చఁబడి వాకిట కొబ్బరి చెట్లకాయలన్
గడన మొనర్చి యిప్పటికిఁ గాలిడఁ గల్గితి నింటి లోపలన్" అంటూ ప్రవేశించే ఈ పాత్ర స్వభావాన్ని ఈ ఒక్క పద్యంలోనే రచయిత వివరించారు. 'ధనమూల మిదం జగత్' అనే సూక్తిని మనసారా నమ్మినవాడు. ధనం సంపాదించటం చాలా కష్టంతో కూడుకున్న పని. మరి ఆ ధనాన్ని "పొట్ట కొఱకొ, బట్ట కొఱకొ, లంక పొగాకు చుట్టకొఱకొ" ఖర్చు చేయటం చాలా తప్పుగా భావిస్తాడు. డబ్బు తలలు మార్చి కానీ, మూటలు విప్పికానీ, కొల్లగొట్టికానీ కూడపెట్టవచ్చు. ఆస్తులు భార్యల పేరరాసి, దొంగ దివాలా తీయవచ్చు. వడ్డీకి వడ్డీ పెంచి లాక్కోవచ్చు. రాత్రి నిద్ర పాడైపోయినా అప్పులు తీసుకున్న వాళ్ళ ఆస్తి చేయి మారి దక్కేదాకా కష్టపడాలి. లింగరాజుకు ఆరవ ప్రాణం వడ్డీ. వడ్డీ అసలుకన్నా తీపి. అంటే లోభత్వమే కాకుండా వడ్డీలు గుంజే నీచత్వం కూడా ఈ పాత్రలో మూసపోసుకుందన్నమాట. అతణ్ణి వంటకు సామాన్లు అడిగితే బియ్యం పప్పులు మొదలు పిడకలు, పుడకలదాకా లెక్క చెప్పాలి.

పెంపుడు కొడుకు బసవరాజు బండికి కిరాయి అడిగితే, ఇంట్లో ఉండీ, లేదని చెప్పమంటాడు. అంటే ఎంత డబ్బు వచ్చినా ఫర్వాలేదు కానీ, ఒక్కపైసా కూడా తన చేతిలోది ఖర్చు కాకూడదన్నమాట. వరకట్నం విషయంలో ఇతని ప్రవర్తన ఎలా ఉంటుందో రచయిత ఇక్కడ సూచిస్తున్నారనుకోవచ్చు. పెన్నుకు డబ్బడిగితే అలకపాన్పుమీద పుచ్చుకోమనటంలో ఎదుటివాళ్ళ కష్టంతో పబ్బం గడపుకోవాలేకాని, తాను మాత్రం పైసా ఖర్చు చేయకూడదనే అతని మనస్తత్వం తెలుస్తుంది. కుఱ్ఱవాళ్ళకు చదువుంటేనే గాని కట్నం పల్కటంలేదు, కనుక తన కొడుకును చదివిస్తానంటాడు. పైసా ఖర్చుపెడితే, దానికి ఇబ్బడి ముబ్బడి రాబడి ఉండాలనే స్వభావం ఇతనిది.

లింగరాజు స్వభావం బాగా తెలిసినవాడు పేరయ్య. పెళ్ళి విషయం కూడా తిన్నగా చెప్పకుండా వడ్డీకి డబ్బు అప్పుకావాలంటూ మొదలుపెట్టి, తర్వాత సంబంధం గురించి అడుగుతాడు. కట్న కానుకలు ఇవ్వటం, పుచ్చుకోవటం ఒక ప్రక్కన పెడితే, ఇతనికి కావాల్సిన కోడలికి కొన్ని లక్షణాలున్నాయి.

'తే॥ తిండి యొక ప్రక్క వెలితిగా దినవలయు
చెప్పకయె యింటి పనులెల్ల జేయవలయు

ఊరికే కొట్టినను పడియుండవలయు' అటువంటి కన్యనే కోడలుగా స్వీకరిస్తానంటాడు. లోభానికి, అత్యాశకు మారుపేరు లింగరాజు. వేలంపాటలో ఎలాగైనా కట్నం పెంచాలనీ, పేరయ్యకు రావాల్సిన కమీషను డబ్బు అతడే సంపాదించాలని నిబంధన పెడతాడు. లోభంతో పాటు లింగరాజు నైచ్యం ఇక్కడ ప్రస్ఫుటమవుతుంది.

సుభద్రకు భర్తమీద గౌరవం తక్కువ. ఆమెకు ఇతడు ఈడు జోడు కాదని బాధపడుతుంది. భార్యకు చీరలు నగలు కొనడు సరికదా ఆమెకున్నది కూడా వాడనీయడు. అంతేకాదు తిండి కూడా సరిగా పెట్టడు. ఆమె పుస్తకాలకోసం డబ్బు పాడుచేస్తోందని అతని భావం. చివరకు క్షవరం చేయించుకుంటే ఖర్చని అది కూడా చేయించుకోడు. డబ్బును కూడా తీసుకుపోగలిగే అవకాశం ఉంటే దైవం అటువంటి అవకాశాన్నిస్తే, తన ధనాన్ని మాత్రం తనతోపాటు తీసుకుని వెళ్ళాలని ప్రయత్నిస్తాడు. అంత డబ్బు యావ కలవాడు లింగరాజు.

వీరయ్య, పేరయ్యల సహాయంతో తన పెంపుడు కొడుకును వేలం పాడి 5,500/- రూ. కట్నం క్రింద కుదుర్చుకోవటమే కాదు. పురుషోత్తమరావు నుండి పది రూపాయలు బజానా క్రింద పుచ్చుకొని, దానికి కాయితం రాసిస్తాడు. అమ్మటం అనేది కొనటం కన్నా ఎక్కువ మక్కువ కలిగించే విషయం. పెంపుడు కొడుకును కాదుకదా! చివరకు తన్ను కూడా అమ్ముకుంటే కలిసి వస్తుందంటే సరే అనే రకం వ్యక్తి. ఇక పెళ్ళిలో కట్నం కాకుండా మరేం ఇవ్వాలో జాబితా రాసి, బజానా పుచ్చుకుంటాడు. లింగరాజు మంచి వ్యవహర్తలాగా కూడా కన్పిస్తాడు.

లోభత్వానికి తోడు అనుమానం కూడా లింగరాజుకు ఎక్కువే. తమ పనివాడు ఘంటయ్యను భార్య ఉండే గదివైపు కూడా వెళ్ళడానికి అనుమతించడు. ఏ పనికోసమో ఆ గది దాటి వేరే వైపు వెళ్ళవలసి వస్తే, అటు తిరిగి కూడ చూడకూడదు - వంటి ఆంక్షలు పెడతాడు. ఉచిత సలహా లివ్వటంలో దిట్ట. ఘంటయ్యకు ఖద్దరు కట్టమనీ, బయటనుంచి ఏమీ తెచ్చుకుని తినవద్దనీ చెప్తాడు. తాను తినడు ఇతర్లను తిననివ్వడు.

లింగరాజు, రెండవ పెళ్ళి వయసు ముదిరాక చేసుకోవటం, ఆస్తి దాయాదుల పరమవుతుందని వేరే వాళ్ళ బిడ్డను పెంచుకోవటం కొత్తగా పెళ్ళయిన అల్లుడికి ఎక్కువ మర్యాద చేస్తారని అత్తవారింట గడపటం, అప్పుల వాళ్ళ బారినుంచి తప్పించుకోడానికి ఆస్తి భార్యపేర పెట్టడం- తప్పులని పెద్దలు చెప్పారని వాపోవటం మాత్రమే కాస్త అతణ్ణి తెలివైనవాడిగా చూపెడుతుంది. ఈ ఒక్క సన్నివేశం తప్పితే అతడు మిగిలిన అన్నిచోట్లా ఒక లోభిగా సంకుచిత మనస్తత్వం ఉన్న వాడిగా కన్పిస్తాడు.

వార్తాపత్రికలో కాళింది మరణం గురించి వచ్చినప్పుడు కూడా, ఆమె మరణానికి కాక తన గురించి చెడుగా రాశారనీ, దావావేయాలనీ అనుకుంటాడు. ఏ విషయంలోనైనా లాభం చూడాలనే మనస్తత్వం లింగరాజుది. పేరయ్య కట్నం డబ్బు తిరిగి వెనకకు ఇవ్వాలని చెప్పినప్పుడు క్రుంగిపోతాడు. అతని పేరాశ అతనిచేత "అది సరే కాని ఆ చచ్చిన దెష్ట ఆ ముడి కాసింతయు పడిన తరువాతనైన జచ్చినది కాదే" అనిపించింది. ఆ డబ్బు ఇవ్వనక్కర్లేదనీ, తన దస్తూరి అని ఎవ్వరూ చెప్పలేరనీ కూడా అంటాడు. డబ్బు దక్కించు కోవటం కోసం ఎంత నైచ్యానికైనా ఒడికట్టగలవాడు లింగరాజు. వడ్డీలు గుంజటం, అప్పులు ఎగగొట్టటం మాత్రం కాదు, దస్తూరీలు మార్చడానికి కూడా తయారన్నమాట. ఆ డబ్బు దక్కించుకోవటం కోసం కమలను తన కోడలిగా చేసుకోవటానికి అంగీకరిస్తాడు.

పెళ్ళిలో మగపెళ్ళివారి ఆగడాలకు ప్రతిరూపం లింగరాజు. తాను పెట్టవలసిన వాటిమాటే రానీయకుండా, ఆడపెళ్ళి వారి నుండి ఏయే రోజులు ఏమేమి పుచ్చుకోవాలో జాబితాలు భార్యకు చెప్తాడు. చీరనుంచి పసుపు కుంకుమ నుంచి నూనెవరకు అన్నీ రాబట్టుకొనేవే! పెళ్ళిలో మగపెళ్ళి వారిని సంభావన అడగడానికి వచ్చిన బ్రాహ్మణుల్ని పోలీసుల్ని పెట్టి వెళ్ళ గొట్టించేటంత కర్కోటకుడు. లోభిని తిట్టవద్దు, కొట్టవద్దు అప్పు అడిగితే చాలు ప్రాణం పోతుందన్న నానుడికి ఇతడే చక్కని ఉదాహరణ.

వకీలుతో తమ కోడలు పెళ్ళయి మూడేళ్ళయినా కాపురానికి రాలేదని చెప్పేటప్పుడు కూడా, కొడుకు జీవితం గురించి లింగరాజు బాధపడలేదు. కుదువ నగలు పెళ్ళికూతురికి పెట్టి, అవి తిరిగి రాలేదనీ, తాకట్టు పెట్టినవాడు గొడవ పెడుతున్నాడన్నదే అతని బాధ. కేసు ఎలాగైనా గెలవాలని ప్లీడరు ముందు ఎంతో వినయం నటించే అతనికి వకీళ్ళంటే ఏమాత్రం గౌరవం లేదు. ఒక్క వకీలనే కాదు ఏ వృత్తి

మీదా అతనికి నమ్మకం లేదు. డబ్బే ముఖ్యం అని ప్రతివ్యక్తీ భావిస్తున్నాడనే అభియోగం లింగరాజుది. అయితే డబ్బుతో ప్రాణానికి లంకె ఉన్న మనిషి అతడే! కోర్టులో తమ నగలు, ఖర్చులు ఇస్తే కొడుకును ఒప్పిస్తానంటాడు. ప్రేమ, అనురాగం, కరుణ, ఆశ, నిరాశ, ఇష్టం అంటూ ఎన్ని రకాల భావాలు మనిషిలో ఉండడం సాధ్యమో అతనికి అన్నీ డబ్బు మీదే తప్ప మరి ఎవ్వరిమీదా కలగవు. పాత్ర చివరి దాకా ఈ గుణాల మూసే!

నాటకాంతంలో మాత్రం చచ్చిన పామును ఇంకా చావకొట్టవద్దు అంటూ తాను కూడా తన ప్రవర్తనలోని లోపాన్ని తెలుసుకుని వచ్చి, మిగిలిన వారిలో కలవటం వల్ల రచయిత ఆ పాత్రలోనూ మార్పు వచ్చి, మానవత్వం ఉన్న పాత్రే అని నిరూపించారు.

వరవిక్రయం అనే నాటకంలో ఆ విక్రయాన్ని జరిపి తద్వారా నాటక కథ నడవడానికి ఆలంబన అయిన పాత్ర లింగరాజు. చివరిదాకా లోభత్వమే అతని గుర్తు. లోభం, స్వలాభం, నైచ్యం, అనుమానం కలగలిపితే లింగరాజు పాత్ర. ఆ పాత్రలో మార్పు ద్వారా సమాజంలో ఏ వ్యక్తి అయినా ఎప్పుడో ఒకప్పుడు పరిస్థితుల దృష్ట్యా మారక తప్పదని రచయిత సూచించారు.

**4.3.5. పురుషోత్తమరావు :** ఈ నాటకంలోని పాత్రలన్నింటిలోకి ఉదాత్తమైన పాత్ర పురుషోత్తమరావు. పేరుకు తగిన వ్యక్తి. మంచి భర్తగా, తండ్రిగా, ఒక సంఘసంస్కర్తగా, మనసున్న మనిషిగా ఈ పాత్ర దర్శనమిస్తుంది.

పాత్ర ప్రవేశించిన దగ్గరనుండి సంఘంలో జరుగుతున్న మార్పులు, యువత మారిపోతున్న తీరు, వీటి గురించి బాధపడుతుంటే చక్కని సంస్కారవంతమైన వ్యక్తిగానే పురుషోత్తమరావు మనకు కన్పిస్తాడు.

కుమార్తెల పెండ్లికోసం బాధపడే తండ్రిగా వాళ్ళకు సంబంధాలు చూస్తున్నా, ఎక్కడా కట్నం పుచ్చుకోని పెళ్ళికొడుకులు దొరకకపోవటం అనే విషయంపై బాధపడతాడు. చదువులు కేవలం కట్నం సంపాదించుకోవడానికే తప్ప మరెందుకూ కాదన్న నిజాన్ని భరించలేని సగటు మనిషి. "ప్రస్తుతము చాలామంది బాలురను పాఠశాలలకంపుట - విరివిగా కట్నములు లాగుటకు కాని విద్య కొఱకు కాదు' అన్న చేదు నిజాన్ని నొక్కి వక్కాణిస్తాడు.

సంఘ సంస్కర్తల గురించి ప్రస్తావన రాగానే తత్కాల కుహనా సంస్కర్తల మేలి ముసుగులు ఒలిచి చూపించిన వ్యక్తి. సంఘ సంస్కరణమంటే వేదికలమీద ఉపన్యాసాలివ్వటమే తప్ప, నిజజీవితంలో పాటించబడేవి కావన్న సూక్ష్మాన్ని వివరిస్తాడు. తాము సంఘ సంస్కర్తలయినా తమ ఇంట తమ మాట చెల్లదనీ, ఇంటిలోని వాళ్ళు తమ మాట ప్రకారం జరగనీయరనీ చెప్పే వాళ్ళే తప్ప ఒక్కరైను తమ నమ్మకాల ప్రకారం ఆదర్శాలననుసరించి మనలేని వాళ్ళేనని చెప్తాడు. తప్పించుకునే భావంతో, "నాకిష్టమే కాని మా వారు పడనివ్వరండి" అనే వాళ్ళే ఎవ్వరైనా!

ఆడపిల్లల పెళ్ళి చేయలేక అల్లుళ్ళను అధికారులుగా అతి సగటు మనిషికి ప్రతిరూపం పురుషోత్తమరావు. అతని మాటల్లో..

తే ॥ అప్పసంగిన వాడుమ అల్లుడద్దె
యింటి యజమానుడును జీతమిచ్చువాడు
కుల వినోదియు పన్నులు కూర్చువాడు
బుస్తె కట్టని మగలె పో పురుషులకు"

అటువంటి బాధల్ని తట్టుకుని, తన ఆదర్శాన్ని మంటగలిపి అయినా, కుమార్తెల పెళ్ళిళ్ళు చేయాలని ప్రయత్నించే కష్టతండ్రి పురుషోత్తమరావు. పెళ్ళి కొడుకుల్ని వెతికేటప్పుడు కూడా తన నమ్మకాలకు, ఇష్టాలకే కాకుండా భార్య ఇష్టా యిష్టాలకు కూడా ముఖ్యత్వం ఇవ్వాలని నమ్మే వ్యక్తి. అందుకే పేరయ్యతో, "నాకేమో చదువు, సంప్రదాయము వీనిపై నున్నది. దానికేమో చక్కదనము, సంపత్తు వీనిపై నున్నది. మీరు మా ఉభయుల కోరికలు తీరునట్లు చూడవలెను" అంటాడు.

పేరయ్య, వీరయ్యల సహాయంతో లింగరాజు పన్నిన గూడుపుఠాణి పురుషోత్తమరావుకు అర్థం కాదు. ఎన్నడూ ఇటువంటి మూర్ఖపు ఆలోచనలు, కుతంత్రాలు నేర్చిన వ్యక్తిలాగా కనపడడు. అందువల్ల వాళ్ళ వేలంపాటకు బలి అయి 5000/- రూపాయలకు ఒప్పుకుంటాడు. కాని పురుషోత్తమరావు మంచి నిజాయితీ మాత్రమే కాకుండా పౌరుషం కోసం కూడా కష్టపడే వ్యక్తిలాగ అన్పిస్తాడు. వేలంపాటలో అతని పౌరుషం, పరువు కోసం ప్రాకులాట, అంతదూరం పాడేలా చేశాయి.

అప్పుకోసం యత్నించి, చివరకు కుమార్తె పెళ్ళికోసం ఉన్న పది ఎకరాల ఆస్తిని అమ్మకానికి పెట్టినప్పుడు, అతని భార్య భ్రమరాంబ తమ బ్రతుకుతెరువు గురించి బాధపడుతుంది. కాని పురుషోత్తమ రావు తమ కన్నా సమాజంలో ఎంతో మంది మరింత నీచస్థితిలో బ్రతుకుతున్నారని వాళ్ళను తలచుకుని వాళ్ళకన్నా తమ పరిస్థితి బాగుందని సంతోష పడమంటాడు. దైవభక్తి, అన్యులపట్ల జాలి కలిగినవాడు

కాళింది పెళ్ళి వద్దని అన్నప్పుడు, బిడ్డపై ప్రేమలేక ఏ తల్లిదండ్రులు తమ బిడ్డలకు పెళ్ళిళ్ళు చేయరంటాడు. ఆడపిల్ల ఏ నాటికో ఒకనాటికి పరుల ఇంట వెళ్ళి బ్రతకవలసిందే, కనుక గుండె రాయి చేసుకుని మరీ ఒక్కొక్క తండ్రీ తమ పిల్లలకు పెళ్ళి చేస్తాడని వివరిస్తాడు కాళింది కట్నమిచ్చి పెళ్ళి చేసుకునే ఇష్టం లేక, పెళ్ళి వద్దని నిరాకరించినపుడు,

చ॥ సౌరదిగ హెచ్చుచున్న వరశుల్క విపద్దశ మాన్పఁబూని బి
ట్ట అచితి వేదికాస్థలుల నాడితి చెక్కు సభాంతరంబులం
బఱ బఱ వ్యాసముల్ బరికి పత్రికలం బ్రచురింపబంపితిన్
హర హర! నీదు పాటి తెగువైనను లేక భ్రమించితిన్ తుదిన్"

అంటూ తన చేతకాని తనానికి, సంఘపు కట్టు బాట్లను మీరలేని గుణానికి తానే చింతిల్లుతాడు. ఎదుటి వారిలో తప్పులు వెదకటమే ధ్యేయంగా బ్రతికే వారి మధ్య తన తప్పుకు చింతించే సంస్కారవంతుడిగా కన్పిస్తాడు, పురుషోత్తమరావు. ఏ లోపం లేకుండానే లోపాలు వెతికే ఈ లోకంలో పెళ్ళికాని పిల్లంటే ఎన్ని కారణాలు వెతుకుతారో, ఎంత అవమానపడాలో తలచుకుని తన అశక్తతను తానే గర్హిస్తాడు.

లింగరాజు నుండి డబ్బు తిరిగి రాదు కనుక కమలను అతని కుమారుడికి ఇచ్చి పెళ్ళి చేద్దామనగానే - "అయిదువేల యైదు వందలు నా బ్రాహ్మణుడు హరించినను సరియే కాని, యిక నాయనతో సంబంధము నాకిష్టము లేదు. "అన్నప్పుడు ప్రేమ పూరితమైన తండ్రి మనస్సు కన్పిస్తుంది. తన బిడ్డ ప్రాణాలే పోయాక, డబ్బు కోసం ఉన్న ఒక్కగా నొక్క కూతుర్ని బలి పెట్టలేనన్న అతని అభిప్రాయం చాలా గొప్పది. కాని, కమల పెళ్ళికి ఒప్పుకోగానే, "ఆమె ఇష్టప్రకారం ఏమి చేసినా ఒప్పుకుంటానని హామీ ఇస్తాడు." మాట తప్పని వ్యక్తిగానే నడుచుకుంటాడు. పేరయ్యకి త్వరలో ముహూర్తం పెట్టమని చెప్తాడు. కాళింది మరణాన్ని ఆ దుఃఖాన్నించి తన భార్య విముక్తురాలు కావడానికి, ఈ పెళ్ళి హడావిడి మంచిదని భావిస్తాడు. మంచి తండ్రిగా, మంచి భర్తగా కన్పిస్తాడు.

తండ్రిగా తన పిల్ల పెళ్ళి పట్ల అత్యంత ఆసక్తి ఉన్నా "ఆడ పిల్లలకు పెండ్లి సేయుట కంటె అశ్వమేధ యాగము సేయుట సులభము" అని సమాజ స్థితి గతుల్ని తెలియ పరుస్తాడు. ఆడపిల్ల పెళ్ళి చేయడానికి తండ్రి ఎన్ని కష్టాలు పడాలో అంతకంటె కొన్ని రెట్లు ఎక్కువ తల్లి పడుతోందని భార్యపట్ల జాలి చూపిస్తాడు. భోజనాల వేళ, అలుక తీర్చే వేళ అంటూ ఎన్నో కష్టాలకోర్చి పెళ్ళి జరిపిస్తాడు. కష్టాల్ని తనలోనే దాచుకుని సుఖాల్ని తన వాళ్ళకు పంచి ఇచ్చే సగటు భారతీయుడు పురుషోత్తమరావులో దర్శనమిస్తాడు.

పెళ్ళయి మూడేళ్ళు గడిచినా తన కూతుర్ని ఏనాడూ ఎప్పుడూ అత్తవారింటికి వెళ్ళావని కూడా అడిగిన వాడుకాదు. కాని లింగరాజు పంపిన నోటీసుతో బాధపడి కుమార్తెను ఏం చేయాలని అడుగుతాడు. ఆమె కేసు పెట్టనీయండి, కోర్టుకే వెళదాం కాని సమాధానం ఇవ్వ వద్దన్నప్పుడు కూడా కూతుర్ని ఒక ప్రశ్న కూడా వేయలేదు. పైగా "నీ మాటయే నాకు నిత్రాట" అంటూ తన కూతురి మీదున్న నమ్మకాన్ని ఒక్కమాటలో చెప్తాడు. "కోర్టుకెక్కుట కంటె కొఱత యెక్కుటే మేలు" అని భావించినా కూతుర్ని మాత్రం కోపగించలేదు. 'నీ మాట ప్రకారం చెయ్యి' అని తాను ఇచ్చిన మాటను చివరి దాకా కాపాడుకుంటాడు. సత్యాన్ని, ధర్మాన్ని నమ్మిన వాడిలా పురుషోత్తమరావు కన్పిస్తాడు.

కోర్టులో న్యాయాధిపతి అడిగినపుడు కూడా తాను అసహాయ వాదినని, ఆ కోర్టులో వ్యాజ్యానికీ తనకూ సంబంధంలేదనీ చెప్తాడు. అవసరాలకు కొన్ని ఆశయాల్ని మార్చుకున్నా అతని దేశభక్తి, సంఘ సంస్కరణాభిలాష అక్కడక్కడ రచయిత సూచిస్తూనే ఉంటాడు.

పురుషోత్తమరావు, వరకట్నం అనే సాంఘిక దురాచారానికి లొంగి, క్రుశించి పోయిన సగటు సంఘజీవి. తన పిల్లల మీద, భార్య మీద ఉన్న ప్రేమను చంపుకోలేడు. అందువల్ల కొన్నిసార్లు తన మనస్సుకు వ్యతిరేకంగానైనా సరే, తన ఆశయాల్ని కాలరాచైనా సరే, ఎన్ని కష్టాల కోర్చయినాసరే, తన వాళ్ళను సుఖపెట్టాలనే ప్రయత్నిస్తాడు. ఈ నాటకం ఫలవంతం అవడానికి తోడ్పడే పాత్రల్లో ముఖ్యమైనది ఈ పాత్ర.

వరవిక్రయ క్రియను లింగరాజు చేసి లాభం పొందినా చివరకు ఆ ఫలం దక్కింది పురుషోత్తమరావుకే!

## సారాంశం :

ఈ విధంగా ప్రధాన, అప్రధాన పాత్రల పరిశీలనతో పాటుగా ఘంటయ్య, టీచరు, బ్రహ్మణుడు, సెట్టి వంటి అతి చిన్న పాత్రలను గురించి కూడా వివరించి అభివ్యక్తిలో ఎంతో ప్రయోజనాన్ని సాధించడం జరిగింది.

## ప్రశ్నలు :

1. సింగరాజు లింగరాజు లుబ్ధాగ్రేసర చక్రవర్తి నిరూపించండి.
2. పురుషోత్తమరావు పంతులు గుణ శీలాలను వివరించండి?
3. వరవిక్రయ నాటకములో కమలపాత్రకు గల ప్రాధాన్యమును వివరించండి?
4. వరవిక్రయ నాటకంలో స్త్రీ పాత్రలను గూర్చి వ్రాయండి?

రచయిత :
**ఆచార్య ఎల్.బి. శంకరరావు**
తెలుగు శాఖ
మద్రాసు విశ్వవిద్యాలయం
చెన్నై.

ఖండం : 5

# వ్యాసములు

## (సమకాలీన, సామాజిక, వైజ్ఞానిక, సాంస్కృతిక విషయాలు)

శీర్షికలు :

1. విద్య
2. మాతృభాషలో విద్యాబోధన
3. పత్రికలు
4. సామ్యవాదం
5. వ్యవసాయ శాస్త్రం
6. కళలు
7. సినిమా
8. ఎలక్ట్రానిక్ ప్రసారసాధనాలు
9. ప్రయాణ సాధనాలు
10. దుస్తులు
11. ఆటలు
12. నీటి పారుదల
13. నిరుద్యోగ సమస్య
14. ఐక్యరాజ్య సమితి
15. సమానత్వం
16. నాకు నచ్చిన ప్రాచీన కవి

### 1. విద్య :

'విద్' అనే ధాతువుకి 'to know' తెలుసుకోవడం అని అర్థం. దేన్ని నేర్చుకోవడమైనా అది విద్యే అవుతుంది. నాలుగు గోడల మధ్య కూర్చొని గురువు సమక్షంలో నేర్చుకొనేదే విద్య అనుకోవడం పొరబాటు. వ్యక్తి మెదడుకు ఏదైతే శిక్షణ ఇస్తుందో అదంతా విద్యే. ప్రజల్ని జ్ఞానవంతుల్ని చేసేది, ప్రయోజన దృష్టిని కలిగించేది విద్య అన్న విషయం అందరికీ తెలిసిందే. అది మనిషి నుంచి వేరు చేయలేని సంపద అన్నాడు వి. పి. కర్యారస్. ఉత్తమమైన, సంపూర్ణమైన సమాజాల్ని నిర్మించడానికి అవసరమైన విశ్వాసాన్ని కల్గించేది విద్యమాత్రమే.

విస్తృతార్థంలో 'విద్య' అంటే 'నేర్చుకోవడం' అనే అర్థమున్నా పాఠశాలల్లో, కళాశాలల్లో నేర్చుకొనే చదువుకే 'విద్య' అనే అర్థం క్రమంగా రూఢిలోకి వచ్చింది.

ప్రాథమిక విద్య : 'మొక్కై వంగనిది మానై వంగునా' అని సామెత. బడి చదువులో మొదటి ఎనిమిదేండ్ల పాటు సాగే ప్రాథమిక విద్య, విద్యలో అతిముఖ్యమైన దశ. విద్యావిధానానికి ఈ విద్యే ప్రాతిపదిక అవుతుంది. ఈ నేపథ్యంలోనే తర్వాతి విద్య కొనసాగుతుంది. ఉన్నతమైన వ్యక్తిత్వం ఏర్పడడానికి మంచి అలవాట్లు అలవడడానికి, భావవ్యక్తీకరణ సామర్థ్యం పెంపొందడానికి ప్రాథమిక విద్య దోహదపడుతుంది.

వినడం, రాయడం, చదవడం ఈ దశలో ప్రధానంగా నేర్చుకొనే అంశాలు. ఈ దశలో మంచి విద్య అలవడినట్లయితే మళ్లీ జీవితంలో వెనక్కి చూడడం, తగ్గడం వుండదు. సమస్యలను పరిష్కరించుకోవడానికి కావలసిన శక్తిని, అనుభవాన్ని ప్రాథమిక విద్య సమకూరుస్తుందనడంలో విప్రతిపత్తి లేదు.

## ఉన్నత విద్య :

భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవడానికి కావలసిన అభిప్రాయాలనూ, వ్యక్తులనూ సమకూర్చేది ఉన్నత విద్య. జాతి అభివృద్ధి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం విలువల సమగ్ర అవగాహన మీద ఆధారపడి వుంటుంది. సామాజిక విలువలు తరిగితే ప్రజాజీవితానికి భద్రత వుండదు. హత్యలు, దోపిడీలు, కుల మత వర్గ విభేదాలు, అసూయా ద్వేషాలు సమాజంలో ఒక్కోసారి మితిమీరిపోయి ప్రజాజీవితాన్ని అతలాకుతలం చేస్తుంటాయి. అలాంటి సమయాల్లో హింసను, భద్రతారాహిత్యాన్ని, దోపిడీని అరికట్టడానికి, ప్రజల్లో నైతిక విలువల్ని పెంచడానికి విద్య మంచి సాధనమవుతుంది. విద్య ద్వారా శాంతి సాధన సులభమవుతుంది. ఆచరణయోగ్యమైన పద్ధతుల్ని, అలవరచుకోవడానికి, జీవితానికి కావలసిన విజ్ఞానాన్ని పెంపొందింప చేసుకోవడానికి ఉన్నతవిద్య చాలా ఉపయోగపడుతుంది. ఉత్తమమైన విద్య దేశం యొక్క శక్తిని వృద్ధి చేస్తుంది అన్నాడు నెహ్రూ.

జీవిత సమస్యలను పరిష్కరించేదే విద్య అని గాంధీజీ సెలవిచ్చాడు. అదే అభిప్రాయాన్ని రవీంద్రనాథ ఠాగూర్ కూడా వ్యక్తం చేశాడు. 'మానవ సమస్యలన్నిటికీ మూల పరిష్కారం విద్యలోనే వుందని నా నమ్మకం' అన్నాడాయన.

ఈ అభిప్రాయాన్ని క్రోడీకరిస్తే సమాజాభివృద్ధి విషయంలో విద్యార్థిపైన ఎంత బాధ్యత వుందో అర్థం అవుతుంది. అందుకే విశ్వ సౌభాగ్యానికి విద్యార్థి పట్టుకొమ్మ కావాలన్నాడు ఠాగూర్.

'మన చదువు మనలో క్రూరత్వాన్ని, దర్పాన్నీ పెంచకూడదు. ప్రేమనూ, దాక్షిణ్యాన్ని ఎక్కువ చేయాలి. ప్రకృతి సిద్ధమైన, నిర్మలమైన స్వభావాన్ని, తోటి మానవులను అవసరంలో ఆదుకోవాలనే ఆతురతనూ అభివృద్ధి చేయాలి. మనసుకు స్వేచ్ఛనూ, హృదయానికి దాక్షిణ్యాన్నీ, వ్యక్తికి నిజాయితీని 'అలవరచాలి' అని సెలవిచ్చారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.

శీలరహితమైన విద్య చాలా అపాయకరమైంది అన్నాడు గాంధీ. అలాంటి విద్య సమాజానికి మేలు చేయడం అటుంచి కీడు చేస్తుంది. జీవితగమనానికి విద్య ఎప్పుడూ అడ్డుగోడ కాకూడదు.

విద్యకున్న విలువ ఎంతగొప్పదైనా చదువుకంటే సంస్కారం గొప్పది అనే విషయాన్ని మరిచిపోకూడదు. సంస్కారానికి చదువు మెరుగులు దిద్దాలి. సంస్కారం లేని చదువు కాయగాయని చెట్టులాంటిది. విద్య వినయ సంపదను పెంచాలి. 'విద్య నొసంగును వినయంబు' అన్నారు పెద్దలు. వినయమంటే అణగి మణగి వుండడం, అడుగులకు మడుగులొత్తడం కాదు. ఎదుటి వాళ్ల అభిప్రాయాలను గౌరవించడం.

ఉద్యోగం పొందడానికి ఒక పాస్‌పోర్టులాంటిది విద్య అని చాలామంది అభిప్రాయం. అయితే కావచ్చు. కానీ అంతకంటే కూడా ఉత్తమ సంస్కారాన్ని సమకూర్చడానికి విద్య దోహదం చేస్తుంది. మనిషికి ఖరీదైన బట్టలు, నగలూ, నాణేలు అలంకారాలైతే కావచ్చు. కానీ వాగ్భూషణమే మంచి భూషణమంటాడు భర్తృహరి. నలుగురితోను మంచిగా మాట్లాడ్డం, చెడ్డపనులకు దూరంగా వుండడం సంస్కారమనిపించుకుంటుంది. వీలైనంతవరకు పక్కవాళ్లకు సహాయపడడం అలవాటు చేసుకోవాలి.

'జపతపంబుల కన్న
చదువు సాముల కన్న
ఉపకారమే మిన్న
ఓ కూనలమ్మా' అన్నారు ఎంతో అనుభవంతో మన పెద్దలు.

ధనాన్ని దొంగలు దొంగిలించే వీలుంటుంది. కాని విద్యా ధనాన్ని మాత్రం ఎవరూ దొంగిలించలేరు. ఎవరికైనా ఇస్తే తరిగేది ధనం. ఎవరికైనా నేర్పితే పెరిగేది విద్య. ఇవ్వడం గురువు బాధ్యత. గురువును మార్గదర్శకంగా తీసుకొని భావి జీవితానికి పూలబాట నిర్మించుకోవడం

శిష్యుని కర్తవ్యం. గురువు శిష్యునికి ఆదర్శప్రాయంగా వుండాలి. చదువుతో పాటు శుచీ శుభ్రత, క్రమశిక్షణ, సత్ప్రవర్తన, విశ్వప్రేమ, సోదరభావం, శీలసంపద మొదలైన సద్గుణ సంపత్తులను శిష్యులకు వారసత్వంగా ఇచ్చినప్పుడే చెప్పే విద్యకు విలువ దక్కుతుంది.

'బడికిరారో చిన్న - బడికిరా చిన్న
బడి అంటె విజ్ఞాన భాండారమన్న
చదువునేర్వనివాడు - సరిగ ఓరన్న
రెండు కాళ్ళే ఉన్న - మొండి పశువన్న

అన్న మాటల్లోని సత్యాన్ని గ్రహించి విద్యకు ప్రాధాన్యమివ్వాలి. ప్రభుత్వం ప్రతి ఒక్కరికి విద్య అందుబాట్లో వుండేట్లు చూడాలి. విద్య ద్వారా సద్గుణసంపత్తులను వారసత్వంగా ముందు తరాలవాళ్లకు అందించాలి.

## 2. మాతృభాషలో విద్యాబోధన:

మనిషికి ఎలాంటి కష్టం, ప్రయత్నం లేకుండా పట్టుబడేది మాతృభాష. ప్రపంచంలో ఏ వ్యక్తి అయినా తన భావాలను మాతృభాషలోనే అత్యంత స్పష్టంగా వ్యక్తం చేయగలడు. అలాగే ఎంతటి క్లిష్టమైన విషయాలనైనా మాతృభాషలో బోధించినప్పుడు సులభంగా అర్థం చేసుకొని ఒంటపట్టించుకోగలడు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలన్నీ ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయ స్థాయి దాకా మాతృభాషలోనే విద్యాబోధన చేస్తున్నాయి. సర్వ విషయాలను మాతృభాషలోనే బోధిస్తున్నాయి. అందువల్ల విషయం సమగ్రంగా అవగాహన అవుతూ దేశ అభివృద్ధి ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతున్నది.

ప్రపంచభాషగా చెలామణిలో ఆంగ్లం, ఇతర దేశభాషలైన ఫ్రెంచి, జర్మన్ మొదలైన భాషలను ప్రాధాన్యమిస్తున్న వలస దేశాలు అభివృద్ధి పథాన నడవలేకపోవడానికి ప్రధాన కారణం మాతృభాషల్ని ఆయాదేశాలు పక్కన పెట్టడమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భారతదేశంలో ఇంగ్లీషు భాషకున్న ప్రాధాన్యం ఇతర దేశీయ భాషలకు లేదు. బహుభాషా వ్యవహర్తలున్న దేశం భారతదేశం. ప్రాంతీయ భాషలకు కొన్ని రాష్ట్రాల్లో ప్రాధాన్యమున్నా ఆంధ్ర రాష్ట్రంలాంటి కొన్ని రాష్ట్రాల్లో అది ద్వితీయ భాషగానే చలామణి అవుతుంది. మాతృభాషలోనే విద్యాబోధన జరగాలనే ప్రయత్నం భారతదేశంలో జాతీయోద్యమ కాలంలోనే తలెత్తినప్పటికీ ఆ ఆశయం ఇప్పటికీ పూర్తిగా నెరవేరలేదు.

భారతదేశంలో విద్యా విషయంగా ఆంగ్లమాధ్యమానికున్న ప్రాధాన్యం మాతృభాషలకు లేకపోవడం పట్ల విద్యావంతులు, మేధావులు, రాజకీయవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరభాషలో విజ్ఞాన బోధన చేయడం అసంభవం, అనర్థకం కూడా అన్నాడు గాంధీ.

ఆయా ప్రాంతాల్లో విద్యలాంటి ప్రయోజనాల కోసం ప్రాంతీయ భాషలే అధికార భాషలుగా వుండాలన్నాడు నెహ్రూ. మాతృభాష ద్వారానే విద్య, సంస్కృతి సామాన్య ప్రజల్లోకి త్వరితంగా వ్యాపిస్తుందన్నది ఆయన అభిప్రాయం. పాండిత్యాన్ని పెంచే విద్యకంటే శీలాన్ని తీర్చి దిద్దకలిగే విద్య ఉన్నతమైనది. ఎందుకంటే చదువుకంటే సంస్కారం గొప్పది. మాతృభాషలో సంస్కారాన్ని పెంచేది, సంస్కృతిని ప్రతిబింబించేవి, ప్రాంతీయమైన అవసరాల దృష్ట్యా రూపొందించుకున్న విషయాలు ఆయా భాషల్ని సుసంపన్నం చేసే నీతి కథలు, జాతీయాలు, సామెతలు, నానుడులు, ఆర్యోక్తులు, లోకోక్తులు మొదలైన వాటి రూపంలో పుష్కలంగా వుంటాయి. వాటి ద్వారా విద్యాబోధన జరిగినప్పుడు విద్యతో పాటు వివేకం, ఉన్నతమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకొనే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దానివల్ల సమాజం, దానితోపాటు దేశం బాగుపడే అవకాశముంటుంది. మాతృభాషలో విద్యను బోధించడం వల్ల మనసులు చురుగ్గా పని చేస్తాయన్నాడు ఠాగూర్.

ఇంగ్లీషు భాషతో నిమిత్తం లేకుండానే రష్యాదేశం విజ్ఞానాభివృద్ధిని సాధించింది. కానీ మనం ఇంగ్లీషు లేకుండా బతకలేమనే స్థితికి వచ్చాం. దీనికి కారణం మనమనసుకు పట్టిన దాస్యభూతం. ఇలాంటి నిరాశను నేనెప్పుడూ అంగీకరించను. మనకు మనభాషల్లో విద్యవుంటే మనకెప్పుడో స్వరాజ్యం వచ్చేది అని మాతృభాష పట్లవున్న చిన్నచూపును చూచి ఎంతో ఆవేదనను వ్యక్తం చేశాడు గాంధీ.

పాఠశాల, కళాశాల విద్యాస్థాయిల్లో మాతృభాషనే బోధనా భాషగా చేయాలన్నది విశిష్టమైన భావన. అన్నిచోట్ల బోధనా భాష ఒకటిగానే వుండాలి. ప్రాథమిక స్థాయిలో కేవలం మాతృభాషలో విద్యనభ్యసించి కళాశాల స్థాయిలో మరోభాష (ఇంగ్లీషు) బోధనా భాషగా వుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందుల పాలయ్యే ప్రమాదం వుంది. ఒక్కసారిగా మాతృభాషా బోధన నుంచి ఇతర భాషా బోధనతో కూడిన విద్యారంగంలో అడుగుపెట్టడం వల్ల భాష సంపూర్ణంగా పట్టుబడక పోవడంతో శక్తిమించిన శ్రమను అనుభవించడమేగాక నిరాశా నిస్పృహలకు లోనై ఎందుకూ పనికిరాని వాళ్లమన్న భావన వాళ్లలో పెరిగిపోయి విద్యపట్ల వెనకడుగు వేసే ప్రమాదముంది. తెలుగు మాధ్యమంగా చదివి ఆంగ్లమాధ్యమంగా వున్న కళాశాలల్లో అడుగుపెట్టి ఇబ్బంది పడుతున్న వాళ్లను కళ్లారా చూస్తూనే వున్నాం. అందువల్ల ఉన్నత విద్యాస్థాయిలో కూడా ప్రాంతీయ భాషలను అంటే మాతృభాషనే బోధనా భాషగా అవలంబించాలి.

తల్లిపాలకు, పోతపాలకు వున్నంత తేడా మాతృభాషకు, పరభాషలకు ఉంది. తల్లిపాలు బిడ్డ ఆకలిని తీర్చడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పోతపాలు ఆకలిని తీర్చగలదేమోకాని దానివల్ల జరిగే అనార్థలే ఎక్కువగా వుంటాయి.

మాతృభాషా బోధన విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకొనేట్లు చేస్తుంది. కాబట్టి దానివల్ల సంపూర్ణ ప్రయోజనం చేకూరుతుంది. వచ్చిరాని మిడిమిడి జ్ఞానంతో పరభాషల్లో విద్యార్జన చేసేవాళ్లకు డిగ్రీలు చేతికి రావచ్చు కానీ దానివల్ల అనర్థాలే ఎక్కువ. వైజ్ఞానిక ప్రపంచంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలంటే మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి.

## 3. పత్రికలు

'వార్తయందు జగము వర్తిల్లుచున్నది
అదియె లేనినాడు అఖిల జనులు
అంధకారమగ్నులగుదురు కావున
వార్త నిర్వహింప వలయు పతికి' (మహాభారతం సభాపర్వం 1-51)

అన్నాడు నన్నయ. విషయం తెలిస్తే విశ్లేషణకు చోటుంటుంది. సమస్య ముందుంటే పరిష్కారానికి ఆలోచనలు దారులు వెతుక్కుంటాయి. అధ్యయనం చేసే కొద్దీ అందులోని లోటుపాట్లు తెలుస్తాయి. ప్రజాస్వామ్యంలో పత్రికలు అనివార్యం. అవి నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయం.

'వార్తా పత్రికలు ప్రపంచానికి దర్పణాలు' అంటాడు జేమ్స్ ఎల్లిస్. వార్తా పత్రికలు ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎన్నో విషయాలను అప్పటి కప్పుడు తాజాగా అందిస్తాయి. పత్రికలు కేవలం వార్తలనే కాకుండా శాస్త్ర సంబంధమైన విషయాలు, కళలు, సాహిత్యం మొదలైన ఎన్నో రంగాలకు సంబంధించిన అంశాలను అందించి సమాజాభివృద్ధికి దోహదకారులు అవుతున్నాయి. ఉద్యమాలకు వూపిరి పోసి ప్రగతి సాధనకు తోడ్పడుతున్నాయి. అందుకే 'అణచివేతకు, అజ్ఞానానికి వ్యతిరేకంగా పోరాడటానికి మనిషి చేపట్టిన అతిశక్తివంతమైన ఆయుధం పత్రికా రచన అంటాడు జేమ్స్‌గార్ఫీల్డ్. దిన, వార, పక్ష, మాస, త్రైమాస పత్రికలు ఎన్నో భాషల్లో వెలువడుతూ విశ్వవిన్యాసాన్ని నట్టింట్లో ప్రదర్శింపజేస్తున్నాయి.

## పత్రికల పుట్టుక

పత్రిక ఏ భాషలో మొదట ప్రారంభించబడిందో చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. వార్తా పత్రికలు యూరప్‌లో మొదట వుదయించాయంటారు. తొలి పత్రికల్లో 1502 లో జర్మనీలో వెలువడిన 'న్యూజేటుంగ్' పేర్కొనదగింది. 1566 లో ఇటాలియన్ భాషలో ఒక వార్తా పత్రిక ప్రచురించబడింది. హాలెండ్‌లో 1656 లో కేరాంట్ పత్రిక ముద్రించబడింది. ఇంగ్లీష్‌లో మొదటి వార్తాపత్రికైన 'గజిట్' 1665 లో లండన్‌లో వెలువడింది. మొదటి దినపత్రిక 'డైలీ కరెంట్'. అది 1702 లో ప్రారంభించబడింది ఈ విధంగా మొదలైన పత్రికా రచన ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లిపి వున్న అన్ని భాషల్లోనూ లెక్కకు మించినన్ని పత్రికలలో విరాడ్రూపాన్ని దాల్చింది.

భారతదేశంలో 1780 జనవరి 20 న కలకత్తానగరం నుంచి 'బెంగాల్‌గెజిట్' పేరుతో మొదటి పత్రిక ఇంగ్లీషు భాషలో వెలువడింది. 1818 లో బెంగాలీలో మొదటి దేశభాషా పత్రిక ప్రచురించబడింది. 1835 లో 'సత్యదూత' పేరుతో తెలుగులో మొదటి మాసపత్రిక వెలువడింది. 1874 లో కందుకూరి వారి 'వివేకవర్ధిని' తొలి తెలుగు సమగ్ర మాసపత్రికగా భావించబడింది.

పత్రికా బాధ్యతను ప్రధానంగా నిర్వహించే వ్యక్తిని సంపాదకుడంటారు. జాతీయ, అంతర్జాతీయ విషయాలను విశ్లేషించి సంపాదకీయం రాయటం ఇతని ముఖ్యమైన పని. లీడర్ అన్నా ఎడిటోరియల్ అన్నా సంపాదకీయమని అర్థం.

**దినపత్రికలు :** సమాజంలో దినపత్రికల పాత్ర అద్వితీయం. జాతీయ, అంతర్జాతీయ రంగాలకు, వివిధరంగాలకు చెందిన విషయాలను తెల్లవారేసరికి దినపత్రికలు అందిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా 9 వేల దాకా దినపత్రికలు వెలువడుతున్నాయి. వీటిలో మూడువంతులు ఉదయం పత్రికలు, ఒకవంతు సాయంత్రం పత్రికలు భారతదేశంలో ప్రధాన భాషలన్నిట్లోను దినపత్రికలు ప్రచురించబడుతున్నాయి. కొన్ని పత్రికలు భారతీయేతర భాషల్లోను వెలువడుతున్నాయి.

ప్రతికల ప్రచురణలో అగ్రస్థానంలో వున్న దేశం సోవియట్ యూనియన్ అక్కడ 6 వేలకు పైగా పత్రికలు వెలువడుతున్నాయి.

ప్రధానంగా దినపత్రికలలో ఏ రోజుకారోజు జరిగే వార్తా విశేషాలుంటాయి. వాటితోపాటు కొన్ని కాలమ్స్ ఉంటాయి. వాటిలో ఆయా అంశాలకు సంబందించిన వ్యాసాలు, ఇతరాలు చోటు చేసుకుంటాయి. వార, మాసపత్రికలలో ప్రధానంగా కథలు, సీరియల్స్ వివిధ రంగాలకు చెందిన వ్యాసాలు, చిత్రవిచిత్రాలైన వార్తలు, పాఠకులలేఖలు, క్రీడారంగ విశేషాలు, చిత్రరంగ విషయాలు, కార్టూన్‌లు, కామిక్సు, ఫోటోలు, పజిల్స్, సెక్స్ విషయాలు, క్రైమ్ వార్తలు మొదలైన ఎన్నో విశేషాలుంటాయి.

దినపత్రికలలో అతిపెద్ద పత్రిక 'న్యూయార్క్ టైమ్స్'. దాని ఆదివారం సంచికలో 500 పేజీలుంటాయి. 1965 లో అక్టోబరు 17 న వెయ్యి పేజీలలో ఆ పత్రిక వెలువడింది. న్యూయార్క్ నుంచే ప్రచురించబడే 'వాల్‌స్ట్రీట్ టౌన్స్ యారిట్' వెల 500 రూపాయలు. ప్రపంచంలో లార్డ్‌రాయ్ హార్బర్ట్ థామ్‌సన్ 357 దిన, వార, మాస పత్రికలను నడుపుతున్నాడు.

వివిధ శాఖలనుంచి వార్తలను సేకరించి పోస్టుద్వారానో, టెలిఫోన్, టెలిగ్రాఫ్, టెలిప్రింటర్స్, ఇ-మెయిల్ ద్వారా విలేకరులు వార్తలను పంపుతారు వీళ్ళలో ఎన్నోరంగాలకు చెందిన వాళ్లుంటారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జపాన్ పత్రికా కార్యాలయాలకు విలేకరులు పావురాలద్వారా వార్తలను, ఫోటోలను పంపేవారు. పత్రికలలో వార్తలను ప్రచురించడానికి ముందు ఆయా శీర్షికలను సంపాదకవర్గం పరిశీలిస్తుంది. ప్రత్యేక సందర్భాలలో ప్రభుత్వోద్యోగులు పరిశీలిస్తారు.

వార్తా పత్రికలు లేకుండా ఉపగ్రహాల ద్వారా ఇళ్ళలో అమర్చుకున్న టి.వి.లలో, కంప్యూటర్లలో వార్తావిశేషాలు ప్రసారం అవుతున్నాయి.

## 4. సామ్యవాదం

అందరికి ఆర్థిక సమానత్వాన్ని కాంక్షించే వాదం సామ్యవాదం. సమాజంలో ఆర్థికపరంగా ఎక్కువ తక్కువలున్నాయి. అలాకాక సామ్యావాద వ్యవస్థలో భూములు పరిశ్రమలు, గనులు, రవాణా సంస్థలు, బ్యాంకులు, మొదలైనవి. ప్రజల వుమ్మడి ఆస్తిగా వుంటాయి.

యూరప్ ఖండంలో 1820-30 మధ్యకాలంలో వ్యాప్తిలోకి వచ్చిన మాట సోషలిజం. దాన్నే తెలుగులో సామ్యవాదం అని పిలుస్తున్నాం. ఈ వ్యవస్థలో ప్రతివ్యక్తీ శక్తికొద్దీ పనిచేయాలి. కృషికి తగిన ప్రతిఫలం అనుభవించాలి.

కష్టజీవుల్లో అగ్రస్థానంలో వున్న శ్రామిక వర్గానికీ, అసంఖ్యాకులైన ఇతర కష్టజీవులకు అంటే మధ్యతరగతికి చెందిన చిన్న చిన్న రైతులు, ఉద్యోగులు, విద్యావంతులకు మధ్యవున్న అడ్డుతొలగించి అందరూ సమానమే అని చాటి చెప్పేది సామ్యవాదం.

మానవులందరూ సమానులే. ఎక్కువ తక్కువలు లేదు. అలాగే ఒకరిది గొప్ప పుట్టుక మరొకరిది నీచమైన పుట్టుక కాదు పుట్టుకరీత్యా ఎవరూ ఉత్తములూ కారు, తక్కువ వాళ్లూ కారు అన్నది సామ్యవాద సిద్ధాంతం.

'ఏ సమాజం కూడా సగం బానిసగా, సగం స్వతంత్రంగా బతకడం సరికాదు' అంటాడు అబ్రహామ్ లింకన్. మానవులు కొంతమంది యజమానులుగా పెత్తనం చెలాయించడం కొంతమంది బానిసల్లాగా ఒకరి కింద పనిచేస్తూ వాళ్ళ అడుగులకు మడుగులొత్తుతూ వాళ్ల మోచేతికింది నీళ్లు తాగుతూ బతకడం సరైన పద్ధతికాదు. మనుషుల్లో ఎక్కువ తక్కువలను పాటించడమంటే మానవత్వాన్ని రెండు ముక్కలు చెయ్యడమే. మంచితనాన్ని మంటగలపడమే.

పుట్టుకతో ఎవరూ బానిసలు కారు. వ్యవస్థ బానిసల్ని సృష్టించింది. పెట్టుబడిదార్లను, భూస్వాముల్ని, జమిందార్లను, ధనికులను సృష్టించి మిగిలిన వాళ్ళ శ్రమను దోచుకోమంది. ఇది చాలా అన్యాయం. మానవుని స్వార్థపూరితమైన, నిరంకుశమైన ఈ వ్యవస్థనుంచి సమానత్వాన్ని కాంక్షిస్తూ పుట్టించే సామ్యవాదం.

ధనికులకు, కడుపునిండా కూడైనాలేని కోట్లాదిమంది పేద ప్రజలకు మధ్య అఘాతం వున్నంతకాలం నిజమైన అహింసాయుత మైన ప్రభుత్వం ఏర్పడడం కష్టసాధ్యం. రాజభవనాలకు, పూరిపాలకులకు మధ్యవున్న తేడా స్వతంత్ర భారతదేశంలో ఒక్కరోజు కూడా వుండరాదు అని కాంక్షించాడు గాంధీ. ఇలాంటి నేపథ్యం నుంచి ఎన్నోవాదాలు పుట్టుకొచ్చాయి.

ప్రజాతంత్ర సామ్యవాదం :- ప్రజాస్వామ్య సంస్కరణల ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని సోషలిజంగా మార్చడానికి వీలుంటుందని ప్రజాతంత్ర సామ్యవాదం చెప్తుంది. వర్గాలు, వర్గపోరాటాలు, సామ్యవాద విప్లవం వీటిని గురించి మార్క్సిజం చెప్పిన మౌలిక సూత్రాలను ప్రజాతంత్ర సామ్యవాదులు వ్యతిరేకిస్తారు.

సంక్షేమ రాజ్యం :- పెట్టుబడిదారీ విధానం శ్రామికుల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడమేగాక, వాళ్ల అభివృద్ధికి హామీ కల్పిస్తుందని పెట్టుబడిదారుల ఆదాయాన్ని, కార్మికుల ఆదాయాన్ని ఒకే స్థాయికి తెస్తుందని వాళ్లమధ్య వున్నతేడా ఆవిధంగా సమసిపోతుందని సంక్షేమ రాజ్యవాదుల అభిప్రాయం. అందువల్ల సామ్యవాదాన్ని వీరూ వ్యతిరేకిస్తారు.

మానవతావాదం :- వ్యక్తి ఔన్నత్యాన్ని, స్వేచ్ఛనూ అతడు సర్వతోముఖ వికాసం పొందాల్సిన అవసరాల్నీ గుర్తించి, మానవునిపట్ల గౌరవం, ప్రేమ ప్రాతిపదికగా సామాజిక సంబంధాలను మెరుగుపరచాలని ఈవాదం కాంక్షిస్తుంది. ఆర్థిక అసమానత్వం, పీడన, అరాచకం మొదలైన దుష్టశక్తుల నుంచి బయటపడే అవకాశం దీనివల్ల సిద్ధిస్తుందని మానవతావాదుల నమ్మకం.

ప్రతిదేశంలోను, ప్రతిచోట ఎంతోకొంత దోపిడీవుంది. బలవంతుడు బలహీనున్ని మరింత అణచివేతకు గురిచేయడం. అన్నిరకాలుగా ఇంకా బలహీనుని చేయటం. ఇది అన్యాయమని భావించిన వాళ్లందరూ దాన్ని రూపుమాపడానికి ఎన్నో ప్రయత్నాలు సాగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థనుంచి సామ్యవాద వ్యవస్థను నిర్మించడం అంతసులభంకాదు. అంత తొందరగా సాధ్యమయ్యేది కాదు. మొదట 'వ్యక్తి' స్వార్థం నుంచి బయటపడాలి. సొంతమేలుకు మాత్రమే పాటుపడే వ్యక్తి ఏదో ఒక రంగంలో పేరు పొందవచ్చు. కానీ అందరి మేలును కాంక్షించేవాడు మాత్రమే పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలిగిన మహా పురుషుడవుతాడు. కాబట్టి మానవాళి కష్టాలను తొలగించే ప్రయత్నంలో సామ్యవాదానికి బాటలు నిర్మించడంలో ప్రతిపౌరుడు పాలుపంచుకోవాలి.

## 5. వ్యవసాయ శాస్త్రం

ఆటవికదశలో కాయకసుర్లు, పచ్చిమాంసం తిని కాలం వెల్లబుచ్చిన ఆదిమమానవుడు క్రమంగా తన మేధస్సును వుపయోగించి జీవితాన్ని సుగమం చేసుకొనే ప్రయత్నాలు ప్రారంభించాడు. చెట్టు తొర్రల్లో, కొండగుహల్లో నివసిస్తూ ఎన్నో ఈతిబాధల్ని అనుభవించి వాటి బారినుంచి బయటపడటానికి గూడు ఏర్పాటు చేసుకున్నాడు. దొరికినప్పుడు కడుపునింపుకొని లేనినాడు కడుపు కాల్చుకున్న అనుభవంతో చెట్లునాటి, పంటల్ని పండించి ధాన్యాన్ని నిలువచేసుకొనే స్థితికి చేరుకున్నాడు. ఇలా ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొనే ప్రయత్నం చేసిన మానవుడు మళ్లీ వెనక్కి తిరిగి చూడలేదు. ఆటవిక దశతో పోల్చిచూస్తే ఈనాడు మానవుడు సాధించిన అభివృద్ధి ఎలాంటిదో తెలుస్తుంది.

క్రీ.పూ. 6 వేల సంవత్సరాలకు ముందే వ్యవసాయం రంగం మొదలైందని శాస్త్రవేత్తల అంచనా. ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు మొదలైన వాటిని పండించటం, పశువుల్ని పెంచి తద్వారా పాడిపరిశ్రమను అభివృద్ధి చేయటం, గొర్రెలు, మేకలు, కోళ్లు పెంచటం, చేపల రొయ్యల పెంపకాలు - వీటిద్వారా ఆకలిని అధిగమిస్తున్నాడు మానవుడు.

వ్యవసాయరంగానికి ప్రకృతి సహకారం ఎంతో అవసరం. వర్షాలు, వాతావరణ విశేషాల తోడ్పాటుతో పాటు భూసారాన్ని సంరక్షించటం, పంటలకు ఎరువులువేయటం, నీటి వనరుల్ని కల్పించటం మొదలైన వాటిని గురించి తెలియజేసేది వ్యవసాయ శాస్త్రం. అలాగే భూమిని సాగుచేయటానికి కావలసిన పనిముట్లను తయారు చేసుకోవడం, వ్యవసాయానికి తోడ్పడే ఎద్దులు, దున్నలు, ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు మొదలైన వాటిని పెంచడం మొదలైన మెలకువలను ఈ శాస్త్రం తెలియజేస్తుంది.

## పంటలు : రకాలు

పండించే ధాన్యాల్లో మానవుని మేధస్సు కారణంగా ఎన్నో వేల రకాలు రూపుదిద్దుకున్నాయి. ఒక్క వరిలోనే పదివేల రకాలున్నాయంటే ఆశ్చర్యపోతాం. రష్యాలో వాతావరణ పరిస్థితులను అనుసరించి 5 వేల రకాల గోధుమలు పండించబడుతున్నాయి. 47 దేశాల నుంచి సేకరించిన 4300 రకాల పత్తి విత్తనాలు ఆ దేశంలో తాష్కెంట్‌లోని ఒక ప్రయోగశాలలో భద్రపరచబడ్డాయి.

భారతదేశంలో ఖరీఫ్, రబీ పంటలని రెండురకాలు వ్యాప్తిలో వున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ దాకా పండే వరిలాంటి పంటల్ని ఖరీఫ్ పంటలంటారు. శీతాకాలపు పంటల్ని రబీ పంటలంటారు. అక్టోబర్ నుంచి ఏప్రిల్ మధ్యకాలంలో పండే పొగాకు, మిరప నూనెగింజల్లాంటివి వీటిని వాణిజ్యపు పంటలని కూడా అంటారు.

నీటి వనరులు : ఇరిగేషన్ ప్రాజెక్టుకంటే గొప్ప బంగారు గని ఏదీ ప్రపంచంలో లేదు అన్నాడు సర్ ఆర్థర్ కాటన్. అందుకే సముద్రాల్లో కలిసిపోతున్న నీటిని అదుపు చేయటానికి నదులకు ఆనకట్టలు నిర్మించబడ్డాయి. అయినా ప్రపంచ నదీజలాల్లో 12 శాతాన్ని మాత్రమే మానవుడు వినియోగించుకుంటున్నాడంటే ఈ రంగాన్ని ఇంకా ఎంతగా అభివృద్ధి చేయాలో తెలుస్తుంది.

వ్యవసాయరంగానికి తోడ్పడే బావుల్ని తవ్వడం క్రీ.పూ. 3వేల సంవత్సరాల నాడు మొహెంజదారోలో మొదలైంది. భూగర్భంలో భూమి పొరల మధ్య వున్న నీటిని గొట్టపుబావుల ద్వారా ఈనాడు వినియోగించబడుతోంది. కానీ వర్షాభావం వున్న ప్రాంతాల్లో బావులు, చెరువులు ఎండిపోయే కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఎరువులు : పంటలు సమృద్ధిగా పండటానికి పశువుల పేడ, కుళ్లిన ఆకులలుములు సహకరిస్తాయి. వాటితోపాటు నైట్రోజన్, కార్బన్‌లాంటి రసాయనిక ఎరువులు 19వ శతాబ్దం నుంచి వాడుకలోకి వచ్చాయి. వానపాములు మట్టిని సారవంతం చేస్తాయి. అందువల్ల వాటిని పెంచే ప్రక్రియ మొదలైంది. అమెరికాలో 90 వేల వానపాముల ఫారాలున్నాయి. ఇవి వాటిని విక్రయిస్తాయి.

## పంటల్ని నాశనం చేసే కీటకాలు - కలుపు మొక్కలు :

పంటల్ని నాశనం చేసే కీటకాలు 5 వేల రకాలున్నాయి. వీటి వల్ల దాదాపు 20 శాతం పంట నాశనమవుతుంది. మరో 20 శాతం పంటను పక్షులు, ఎలుకలు ఆరగిస్తున్నాయి. రసాయనిక పద్ధతుల ద్వారా క్రిమి కీటకాలను అదుపు చేసే ప్రక్రియ 1840 లో యూరప్‌లో మొదలైంది. కానీ వీటి వాడకం వల్ల మనుషులో రోగాల నిష్పత్తి పెరిగిందని జనం వాపోతున్నారు.

కలుపు మొక్కల కారణంగా పంట దిగుబడి తగ్గిపోతుంది. వీటిని నిర్మూలించడం చాలా కష్టం. పంట సమయంలో వీటిని తాత్కాలికంగా అదుపు చేసినా కొన్నిరకాల మొక్కలు ఎన్ని సంవత్సరాలైనా భూమిని అంటిపెట్టుకొనే వుంటాయి. కొన్ని ఋతువుల్లో ఒక్కో మొక్కనుంచి వేలకొద్దీ ఇవి పుట్టుకొస్తుంటాయి. పైగా ఇవి గాలి, నీరు, మనుషులు, జంతువుల ద్వారా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుంటాయి. ఒకప్పుడు భూమిని లోతుగా పదే పదే దున్నడం ద్వారా, చేతితో, పనిముట్ల సహాయంతో ఏరివేయటం ద్వారా కలుపు మొక్కల్ని అదుపు చేసే ప్రక్రియ వుండేది. క్రమంగా వాటి నిర్మూలనకు రసాయనిక పదార్థాలను వాడడం కూడా అమలులోకి వచ్చింది.

**వ్యవసాయంలో వైజ్ఞానిక విప్లవం :**

ఒక ధ్యాన్యపు మొక్క మొలిచినచోట రెండు మొక్కల్ని ఎవడు మొలిపిస్తాడో వాడు సమాజానికి మహోపకారం చేసిన వాడవుతాడు. వృక్షశాస్త్రంలో చిన్నతరగతులకు చెందిన మొక్కల సంపర్కంలో మేలైన జాతి మొక్కల్ని సృష్టించే విధానం ఎప్పుడో మొదలైంది. ఈ హైబ్రిడ్ విధానం వల్ల పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.

సస్యవిప్లవం : మెక్సికోలో పరిశోధనలు జరిపి 'మెక్సికన్' అనే సంకరజాతి గోధుమ విత్తనాలను సృష్టించిన వాడు అమెరికన్ శాస్త్రజ్ఞుడైన బోర్లాగ్. సస్య విప్లవ పితామహుడిగా పేరుపొందిన ఇతని గోధమ విత్తనాల వల్ల 6 సంవత్సరాల్లో 6 రెట్లు పెరిగింది. మేలురకం వంగడాల వల్ల ఏడాదికి రెండు మూడు పంటల్ని పండించే అవకాశం కల్గింది.

ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రానిక్ ఇంజన్లు మొదలైన వాటి వల్ల వ్యవసాయరంగంలో శారీరక శ్రమ కొంతవరకు తగ్గిందనాలి. అయినా ఇవి పేదరైతులకు అందుబాటులో లేవు.

వ్యవసాయ రంగం ఎంత అభివృద్ధిని సాధించినా ప్రకృతి వైపరీత్యాలు రైతుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఎంతోమంది రైతులు. అప్పుల ఊబిలో కూరుకొని బయటపడలేక ఆత్మహత్యల పాలవుతున్నారంటే వ్యవసాయ శాస్త్రం సాధించాల్సిన అభివృద్ధి ఇంకా ఎంతో వుందనాలి.

## 6. కళలు :

ఒక వ్యక్తి తాను అనుభవించిన ఆనందాన్ని ఎదుటివాళ్ళలో కల్గించటానికి చేసే ప్రయత్నమే 'కళ' అంటాడు టాల్‌స్టాయ్. కళ జీవితాన్ని రసమయం చేస్తుంది. హృదయ స్పందనను కలిగిస్తుంది. పరిసరాల స్వరూపాన్ని మార్చివేసి ఏదైతే చుట్టూవున్న వ్యక్తులకు ఆనందాన్ని సమకూరుస్తుందో అదే నిజమైన కళ. కళకు, జీవితానికి విడదీయరాని బంధం వుంది. ప్రతి ఒక్కరిలోను ఏదో ఒక కళ దాగి వుంటుంది. మానవజాతి అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందటానికి కళదోహదం చేస్తుంది. 'తిండికి లేని జాతికి మతంగాని, కళగాని ఉండటానికి వీల్లేదు. అన్నార్తులైన ప్రజాకోటికి ఉపకరించేది ప్రతిదీ నాకంటికి అందంగా కనబడుతుంది' అంటాడు గాంధీ. కళ జీవితగమనాన్ని సజావుగా సాగేట్లు చేయాలి కాని అడ్డుగోడగా నిలబడరాదు. అసలు ప్రజల జీవన సమస్యలతో సంబంధం లేని కళ కళేకాదు.

మనసును కదిలించడం కళాకారుని కర్తవ్యం. స్తబ్దత నుంచి చైతన్యాన్ని కల్గించడం అని విధి గతాన్ని గుర్తు చేస్తూ వర్తమానాన్ని కళ్లెదుట నిలుపుతూ భవిష్యత్తువైపు నడిపించేవాడు నిజమైన కళాకారుడు.

కళ అన్నది ఉమ్మడి ఆస్తి. దానిని ఆస్వాదించే హక్కు అందరికీ వుంది. ప్రజల ఆలోచనలకు, సంస్కృతీ సంప్రదాయాలకు, అనుభూతులకు, ఇష్టాయిష్టాలకు కళారూపాలు అద్దం పడతాయి.

**లలిత కళలు :**

శిల్పం, చిత్రలేఖనం, నాట్యం, సంగీతం, సాహిత్యం, నాటకం లలితకళలుగా ప్రసిద్ధి కెక్కాయి.

శిల్పకళ : కంటికి కన్పించే విషయాలకు, మనసులో మెదిలే భావాలకు రూపకల్పన చేయడమే శిల్పకళలోని విశిష్టత. మానవుడు మొట్టమొదట అభ్యసించిన కళగా ఇది పేరు పొందింది. ఆటవిక దశలో వేటకోసం, ఆత్మరక్షణకోసం రాతి పనిముట్లను తయారు చేయడమనే ప్రక్రియ నుంచి ఇది పుట్టింది. శిల, లోహం, కర్ర, దంతం, గాజు, మట్టి, పింగాణి, లక్క మొదలైన వాటిని ఉపయోగించి అపురూపమైన విగ్రహాలను, బొమ్మలను తయారు చేసే కళాకారులు ప్రపంచవ్యాప్తంగా వున్నారు. అపురూపమైన కళానైపుణ్యంతో అతి సూక్ష్మమైన జొన్న, రాగి, గోధుమ, బియ్యం మొదలైన గింజలపైన నగిషీలు చెక్కి కళాఖండాలను సృష్టిస్తున్నారు. ఎడ్వర్డ్ కేజర్‌యాన్ అనే ఆర్మేనియన్ యువకుడు మనిషి వెంట్రుకపైన 100 ఏనుగులను చిత్రించి దాన్ని మరొక వెంట్రుకలో తొలిచిన రంధ్రంలో అమర్చాడంటే శిల్పకళ ఎంతగా అభివృద్ధి చెందిందో వూహించవచ్చు.

**చిత్రలేఖనం :**

మనసుకు ఆహ్లాదాన్ని అందించే అత్యంత మనోజ్ఞమైన కళ చిత్రకళ. 20 వేల సంవత్సరాలకు ముందు చిత్రించిన చిత్రాలు స్పెయిన్, ఫ్రాన్స్ దేశాల్లో బయటపడినా క్రీ.పూ. 3 వేల సంవత్సరాల నాడు చిత్రకళ నిండుదనాన్ని సంతరించుకుంది. రకరకాల రంగులను వుపయోగించి కాన్వాసుపైన, గోడలపైన, నేలపైన, చెక్కలపైన, వస్త్రాలపైన, లోహం, కాగితం, చర్మం మొదలైన వాటిపైన చిత్రాలు గీయటం వుంది. 1479లో చిత్రించబడిన మోనాలీసా చిత్రం వందకోట్ల రూపాయలకు ఇన్సూర్ చేయబడింది. ఇలాంటి చిత్రాలు ఇంకా ఎన్నో వున్నాయి. సహజత్వాన్ని ప్రదర్శిస్తూ అందరి మనసుల్ని ఆకట్టుకొంటున్నాయి.

నాట్యం : ఒక పాట యొక్క భావాన్ని తాళలయ బద్ధంగా, హావభావ స్ఫోరకంగా అంగ విన్యాసాలద్వారా అభినయించడాన్ని నాట్యం అంటారు. సామాన్యులకు వినోదాన్నందించే కళల్లో నాట్యం ప్రధానమైంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ జాతులకు, తెగలకు, ప్రాంతాలకు చెందిన నృత్యరూపాలు వేలకొద్దీ వున్నాయి. జానపదనాట్యం, భరతనాట్యం, కూచిపూడి, కథకళి, కథక్ మొదలైనవి భారతదేశంలో ప్రసిద్ధమైన నాట్యవిశేషాలు.

**సంగీతం**

శ్రవ్యరూపంలో మానవునికి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తున్న అద్భుతమైన కళ సంగీతం. దీనిని ఇష్టపడని వాళ్లంటూ వుంటారు. సంగీతాన్ని ఆస్వాదించలేని వాళ్ల రాక్షసత్వాన్ని కలిగివుంటారంటాడు సంజీవదేవ్. పశువులు, పాములు కూడా సంగీతానికి తలలూపుతాయి. జానపద సంగీతం, లలితసంగీతం, శాస్త్రీయ సంగీతం, వాద్య సంగీతం మొదలైన రకాలెన్నో సంగీత కళను సుసంపన్నం చేస్తున్నాయి.

**సాహిత్యం :**

విశ్వ శ్రేయః 'కావ్యం' అని సంస్కృత సూక్తి. అంటే లోకకళ్యాణమే కావ్య లక్ష్యం. అది సమాజాన్ని ప్రతిబింబిస్తూ, చారిత్రక సత్యాలను కళ్లముందుంచుతూ మానవజాతి ప్రగతికి ఎంతగానో తోడ్పడుతున్నది. కవి తానునుభవించిన హృదయ భావాలను, అనుభూతులను కవితగా మార్చి ఉపదేశరూపంలో మానవాళికి అందిస్తాడు. అల్పాక్షరాలలో అనల్పమైన భావ సంపదను పొందుపరిచి ప్రజాపరం చేస్తాడు. భాష, భావం అనే వజ్రాలను సానబెట్టి నగిషీలు చెక్కి అందంగా ఉంగరంలో పొందికగా అమర్చేవాడు కవి అంటాడు అలెగ్జాండర్ పోప్.. సాహిత్యంలో రకరకాల ప్రక్రియలుంటాయి. కవిత్వం ప్రధానంగా ఛందోబద్ధమైంది. గేయంలో మాత్రా ఛందస్సులుంటాయి. ఈ రెండింటికి భిన్నమైంది వచన కవిత్వం, అంటే ఇందులో ఛందస్సుండదు. పురాణం, ఇతిహాసం, శతకం, కావ్యం, యక్షగానం, సంకీర్తనం ప్రాచీన సాహిత్య ప్రక్రియలు. జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర, కాల్పనిక సాహిత్యం, నవల, నాటిక, కధానిక, వ్యాసం, విమర్శ మొదలైనవి ఆధునిక సాహిత్య ప్రక్రియలు. వీటన్నిటికంటే అత్యంత ప్రాచీనమైంది మానవుని పుట్టుకనుంచి అనుభూతి ప్రేరకంగా, అనుభవపూర్వకంగా, అప్రయత్నంగా పుట్టి తరాలుగా వాగ్రూపంలో సంక్రమిస్తూ వస్తున్న సాహిత్యం జానపద సాహిత్యం.

సాహిత్యం మనిషి ఒంటరి తనాన్ని దూరం చేసే ఒక మహాసాధనం. అందుకే మంచిపుస్తకాలు మన దగ్గరవుంటే మంచి మిత్రుడు దగ్గరలేని లోటు తీరుతుంది అంటారు పెద్దలు.

నాటకం : 'కావ్యేషు నాటకం రమ్యం' అంటే సాహిత్య ప్రక్రియ లన్నిట్లోను నాటకం రమ్యమైంది. జాతి సంస్కృతికిది ప్రతిబింబం. దీనికి అభినయం కూడా తోడైతే దీనివిలువ రెట్టింపవుతుంది. సాహిత్యం, సంగీతం, నాట్యం, అభినయం, చిత్రలేఖనం మొదలైన వాటి సమాహారమిది. అందుకే అందరినీ అలరిస్తుంది. ఆనందాన్ని అందిస్తుంది.

ఉపసంహారం : కళారూపాలు అనంతం. నైపుణ్యంతో కూడుకున్న ప్రతిచిన్న పని కళాసంబంధమైందే. మనిషి మనుగడకు తోడ్పడే ప్రతి అంశం కళారూపమే. వంటచేయడం కళ. ముగ్గులెయ్యడం కళ. చివరికి పద్ధతిగా తినడం కూడా కళే. ప్రజాసంబంధమైన కళల వేళ్ళను వాళ్ళ జీవితపు లోతుల్లోకి విస్తరింప చేయాలని, ప్రజల మనోభావాలకు ఆవేశాలకు, ఆశలకు సమన్వయాన్ని సాధించి సమైక్యపరచి సముద్ధరించాలని లెనిన్ మహాశయుని అభిప్రాయం.

## 7. సినిమా

**సినిమా - పుట్టుపూర్వోత్తరాలు :**

మానవునికి విజ్ఞానాన్ని, వినోదాన్ని తద్వారా మానసిక వికాసాన్ని అందించే కళలో అపూర్వమైంది. అద్భుతమైంది సినిమా. సంగీతం, సాహిత్యం, ఆహార్యం, అభినయం మొదలైన ఎన్నో కళల సమ్మేళనంతో దృశ్యరూపంలో సినిమా అన్ని వర్గాలవాళ్లను అలరిస్తున్నది. ప్రజా జీవితానికి అద్దం పట్టే సినిమా కళలో ప్రజాజీవితంలోని ఎన్నో విశేషాలను, రకరకాల సమస్యలను, వ్యక్తుల మధ్యవున్న సంబంధాలను కళాత్మకంగా దృశ్య రూపంలో మలచడం కన్పిస్తుంది.

సినిమాలో నటించే పాత్రలు, దృశ్యాలు, వస్తువుల కదలికలను యధాతథంగా చిత్రించడానికి వీలైన మూవీ కెమెరాను ఫ్రాన్సుకు చెందిన ఎటియని జూల్స్‌మారే 1882లో కనిపెట్టాడు. ఫోటో ఫిల్మ్‌ను 1884లో జార్జి ఈస్ట్‌మన్ తయారు చేశాడు. 1895లో ఫ్రాన్స్‌లోనే ప్రొజెక్టర్‌ను తయారు చేసి డిసెంబరు 28న ప్రేక్షకుల సమక్షంలో ఫిల్మ్‌ను విజయవంతంగా లుమేరీ సోదరులు ప్రదర్శించారు. దాంతో చలనచిత్ర కళలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. మొదట మాటలు, పాటలు లేని మూకీ చిత్రాలు నిర్మించబడ్డాయి. 1925లో అమెరికాలో వార్నర్ బ్రదర్స్ సంస్థ మొట్టమొదటి టాకీ చిత్రాన్ని నిర్మించింది. భారతదేశంలో 1896లో బొంబాయిలో సినిమా ప్రదర్శన జరిగింది. కలకత్తాలో 1907లో నిర్మించబడిన ఎల్ఫిన్ స్టోన్ పిక్చర్ ప్యాలెస్ మొదటి భారతీయ థియేటర్. ఆ విధంగా ఉత్తర భారతదేశంలో మొదలైన చలనచిత్ర కళ క్రమంగా దక్షిణానికి వ్యాపించింది. హాలీవుడ్‌లో శిక్షణ పొందివచ్చిన ఆర్. ప్రకాష్ 1925లో 'భీష్మ' అనే మూకీ చిత్రాన్ని నిర్మించాడు. ప్రముఖ దర్శకుడు, నిర్మాత హెచ్.ఎం. రెడ్డి 1931లో తెలుగులో 'భక్త ప్రహ్లాద' అనే టాకీ చిత్రాన్ని నిర్మించాడు.

### సినిమా - రకాలు

కథను బట్టి సినిమాల్లో సాంఘిక, చారిత్రక, పౌరాణిక, జానపద మొదలైన సినిమాలున్నాయి. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన బాలల సినిమాలున్నాయి. మామూలు కథా చిత్రాలుకాక, డాక్యుమెంటరీలు, కార్టూన్ చిత్రాలు, సైన్స్ చిత్రాలు, కమర్షియల్ చిత్రాలు, బ్లూఫిలిం చిత్రాలు, న్యూస్ రీల్ చిత్రాలు ఇలా ఎన్నో రకాలున్నాయి.

**రంగుల సినిమా :** మూకీ చిత్రాలు టాకీలుగా పరివర్తన చెందినట్లే ప్రారంభంలో నలుపు - తెలుపులతో మొదలైన సినిమాలు క్రమంగా రంగులుగా చిత్రాలుగా మారాయి. 1932 నుంచి సినిమాలు రంగుల్లో వెలువడుతున్నాయి. వీటిలో టెక్నికలర్, గేవా కలర్, ఈస్ట్‌మన్ కలర్, సోవో కలర్, ఫూజి కలర్ మొదలైన రకాలున్నాయి.

**సినిమా ప్రదర్శన :** ప్రొజెక్టర్‌లో శక్తివంతమైన ఎలక్ట్రికల్ ఆర్క్‌లైట్ నుంచి ప్రసరించే కాంతివల్ల, ప్రొజెక్టర్‌లో అమర్చబడ్డ లెన్స్‌వల్ల ఫిల్మ్‌లోని చిత్రాలు తెరపైన పెద్దవిగా కనిపిస్తాయి. సినిమాలో వినబడే ధ్వనిని 1906లో ఫ్రాన్స్‌లో శాస్త్రజ్ఞులు కనిపెట్టారు. తర్వాత చిత్రాన్ని తీసేటప్పుడే ఏకకాలంలో ఫిల్మ్‌మీద శబ్దాలు రికార్డ్ అవుతాయి. దానినే సౌండ్ ట్రాక్ అంటారు. సినిమాల్లో పాత్రలు పాడే పాటల్ని ఇతర గాయనీగాయకులు చేత పాడిస్తారు. సినిమాల్లో సంభాషణలతో పాటు సన్నివేశాల కనుగుణంగా వాద్యసంగీతం ఉంటుంది. రంగులలో త్రి డైమెన్షనల్ సినిమా టెక్నిక్‌తో (త్రిడి) కూడినవి కూడా వున్నాయి. వీటిని వీక్షించే ప్రేక్షకులకు సినిమాలోని పాత్రలు తమమధ్యనే తిరుగుతున్నట్లు, సన్నివేశాలు తమ సమక్షంలోనే జరుగుతున్నట్లు అన్పిస్తుంది.

దేవతలు, రాక్షసులు, దెయ్యాలు, ఆకాశంలో ప్రయాణం చేయడం, ఫైటింగ్‌లు, వాహనాలు ఢీకొనడాలు మొదలైన దృశ్యాలను నమూనాలను తయారుచేసి స్టూడియోల్లోనే నిర్మిస్తారు. ఆయా సన్నివేశాలకు కావలసిన సెట్లు నిర్మిస్తారు.

### సినిమాలు - ప్రయోజనం

సినిమాల వల్ల కలిగే ప్రయోజనాలెన్నో వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వున్న పుణ్యక్షేత్రాలు, కట్టడాలు, ఉద్యానవనాలు, కొండలు, అడవులు ఇంకా మన జీవితంలో చూడలేని ఎన్నో ప్రదేశాలను చూడగలం. వివిధ ప్రాంతాలకు , దేశాలకు, తెగలకు చెందిన ప్రజల

ఆచారవ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాల్ని తెలుసుకొనే వీలు కలుగుతుంది. చక్కని సందేశాన్ని అందించే సినిమాల వల్ల పెద్దవాళ్లలో కూడా పరివర్తనను తీసుకురావచ్చు. ప్రజల్లో దేశభక్తి, సౌశీల్యం కల్గించడానికి, సామాజిక చైతన్యానికి సినిమాలు దోహదం చేస్తాయి.

ఇటీవలి కాలంలో సందేశాత్మక సినిమాలు కరువైనాయి. నేటి సినిమాల్లో అశ్లీలత, సంఘవిద్రోహక చర్యలు, లైంగిక విషయాలు మొదలైన వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. దీనివల్ల యువత పెడదారులు తొక్కే ప్రమాదం పొంచివుంది.

ఏది ఏదైనా చెవులతో విన్న దానికన్నా కళ్లతో చూసినదాని ప్రభావం మనిషిమీద ఎక్కువగా ఉంటుంది. వినోదాన్ని కల్గించటంతో పాటు ప్రజల్లో నైతిక విలువల్ని పెంచడానికి సినిమారంగం కృషి చేయాలి.

## 8. ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలు

ఎలక్ట్రానిక్ పరికరాలతో పనిచేసే టెలిఫోను, టెలిగ్రాఫ్, రేడియో, టెలివిజన్, రాడార్ మొదలైనవి ఇటీవలి కాలంలో ప్రసారసాధనాలుగా బాగా ప్రయోగంలోకి వచ్చాయి.

టెలిఫోన్ : టెలిఫోన్‌ను 1876 మార్చి 10న అలెగ్జాండర్ గ్రహంబెల్ కనుగొన్నాడు. క్షణాలమీద విషయాల్ని ఎవరికి అందాలో వాళ్లకు అందించడానికి టెలిఫోన్ ఉపకరిస్తుంది. ఇది ఈనాడు అత్యంత ముఖ్య అవసరంగా మారిపోయింది. కార్డ్‌లెస్ ఫోన్‌లు, సెల్‌ఫోన్లు బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. తెరపైన మనిషిని చూస్తూ మాట్లాడే పద్ధతి కూడా వుంది.

టెలిగ్రాఫ్ : టెలిగ్రాఫ్‌ను అమెరికాలోని శామ్యూల్ మోర్స్ 1837లో కనిపెట్టాడు. ఒకచోటినుంచి మరోచోటికి తీగద్వారా మాట్లాడ్డం కాకుండా ఇంగ్లీషులోని 26 అక్షరాలకున్న సాంకేతాల మోర్సుకోడ్ ద్వారా ధ్వనుల రూపంలో రిసీవర్ స్టేషన్‌కు పంపడాన్ని టెలిగ్రాఫ్ అంటారు. ఈ ధ్వనులకు అనుగుణమైన అక్షరాలతో మాటలను కూర్చుకుంటారు.

రేడియో : 1895లో మార్కోనీ ఇటలీలో రేడియోను కనిపెడితే అంతకంటే కొద్దిరోజులు ముందు 1895లోనే రష్యన్ శాస్త్రవేత్త బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతిని కనిపెట్టాడు. 1921లో రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. వీటిద్వారా ప్రముఖుల ప్రసంగాలు, వార్తలు, సంగీతం, సంక్షేమ కార్యక్రమాల వల్ల కలిగే లాభనష్టాలు, కథలు, కబుర్లు, శాస్త్రసంబంధమైన విశేషాలు మొదలైనవెన్నో సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

టెలివిజన్ : 1926లో బ్రిటన్‌లో జాన్‌లాజిబయర్డ్ టెలివిజన్‌ను కనుగొన్నాడు. రకరకాల అంశాలకు సంబంధించిన దృశ్యాలను కూడా టెలివిజన్‌లో స్పష్టంగా చూడవచ్చు. టి.వి.లో ప్రసారం చేయాలనుకున్న అంశాలను టి.వి. కెమెరాలతో ముందు ఫిల్మ్ తీసి దాన్ని టి.వి. కేంద్రంనుంచి టెలివిజన్ ట్రాన్స్‌మీటరు ద్వారా ప్రసారం చేస్తారు. టి.వి. సెట్‌లోని పరికరాలు విద్యుత్తరంగాల రూపంలోవున్న తరంగాలను గ్రహించగానే దృశ్యాలు టి.వి తెరపై కనపడ్డమేగాక ఏకకాలంలో మాటలు లేదా పాటలు, ఇతర ధ్వనులు వినిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వార్తలు, పాటలు, ప్రసంగాలు, సినిమాలు, క్విజ్ కార్యక్రమాలు, సాంస్కృతిక, రాజకీయ, విద్యా, వాణిజ్య, క్రీడారంగాలకు చెందిన విశేషాలను ఎన్నింటినో ఇంట్లో కూర్చునే దర్శించే భాగ్యాన్ని టెలివిజన్ అందిస్తున్నది. రేడియో తర్వాత మధ్యతరగతి వాళ్లను విశేషంగా అలరిస్తున్న శ్రవ్య, దృశ్య రూప ప్రసారమాధ్యమాల్లో టెలివిజన్ స్థానం అనితరతుల్యం. కృత్రిమ ఉపగ్రహాల సహాయంతో ప్రపంచంలో ఎక్కడైనా ఒక కేంద్రం నుంచి ప్రసారం చేయబడే టి.వి దృశ్యాలను ఏ మారుమూల వున్న టి.వి. సెట్టు అయినా గ్రహించగల్గుతుంది. జేబులో పెట్టుకోవడానికి వీలైనంత చిన్న టి.విలను అంటే నాలుగంగుళాల పొడవు, రెండంగుళాల వెడల్పుతో వున్నవాటిని అమెరికా శాస్త్రజ్ఞులు తయారు చేశారు. ఇంత చిన్న టి.విలో ప్రపంచవ్యాప్తంగా వున్న అన్ని టి.వి. స్టేషన్ల కార్యక్రమాలు స్పష్టంగా ఈ చిన్న టి.విలో కన్పించటం విశేషం.

రాడార్ : రేడియో తరంగాల ద్వారా ఎక్కడో దూరాన వున్నవాటి ఉనికిని తెలుసుకోడానికి వుపయోగించే యంత్రం రాడార్. చాలా శక్తివంతమైన యంత్రాలతో ఇది పనిచేస్తుంది. దీనిని 1922లో టైలర్, యంగ్ అనే ఇద్దరు అమెరికన్ శాస్త్రవేత్తలు కనిపెట్టారు. దీనివల్ల తుఫాను రాకను ముందే తెలుసుకోవచ్చు. ఓడలు సముద్రయానం చేసే సందర్భాల్లో వీటి ఉపయోగం ఎక్కువ.

వార్తా సౌకర్యాల్లో, క్షణాలమీద ఒకచోట నుంచి మరోచోటికి విషయాల్ని చేరవేయడంలో ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగం ఒకగొప్ప విప్లవమని చెప్పవచ్చు. అమెరికాలో అబ్రహాం లింకన్ హత్య గురించిన వార్త యూరప్‌కు తెలియడానికి పదిహేను రోజులకు పైగా పడితే మనిషి చంద్రమండలంపైన నడవగలడన్న విషయాన్ని నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అక్కడి నుంచి భూమికి ఆ వార్తను కేవలం 3 సెకండ్లలో తెలియజేశాడు. ఈ ఘనత ఎలక్ట్రానిక్ పరికరాలదే.

## 9. ప్రయాణ సాధనాలు

ఒకప్పుడు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కేవలం కాలినడకతో వెళ్లేవారు. క్రమంగా గాడిద, గుర్రం, ఒంటె, ఏనుగు మొదలైన జంతువులపైనెక్కి ప్రయాణం చేసేవాళ్లు. ఆ తర్వాత ఆ జంతువులు లాగే బండ్లపైన ప్రయాణం సాగించేవాళ్లు. దీనివల్ల ఒకరికంటె ఎక్కువమంది ఒకేసారి ప్రయాణం చేసే వీలు కల్గింది. ఆ తర్వాత యంత్రాల సహాయంతో నడిచే వాహనాల్లో ప్రయాణం చేయటం మొదలైంది. ఒకచోటనుంచి మరోచోటికి కొన్ని వేలమంది ఒకేసారి ప్రయాణం చేయటానికి వీలైన వాహనాలను మానవుడు తయారు చేసుకొని గమనాన్ని సుగమం చేసుకున్నాడు.

పరిసరాలను బట్టి ప్రయాణ సాధనాలు వ్యాప్తిలో వుండడాన్ని గమనించవచ్చు. ఎస్కిమోలు మంచుపై ప్రయాణం చేయటానికి వీలుగా కుక్కలు లాగే స్లెడ్జి బండ్లను వుపయోగిస్తారు. నార్వేలు మంచుపైన రెయిన్ డీర్‌లు లాగే బండ్లను వాడతారు. అరేబియా వాళ్లు ఎక్కువగా ఒంటెలపైన ప్రయాణం చేస్తుంటారు.

మనుషులనేగాక సామాన్లనుకూడా తీసుకుపోవడానికి 12వ శతాబ్దం తర్వాత రకరకాల చక్రాల బండ్లు వాడుకలోకి వచ్చాయి. బండ్లకు వాడే చక్రాలు క్రీ.పూ. 3 వేల సంవత్సరాలనాడు సుమేరియన్లు కనిపెట్టారు.

**సైకిలు :** ప్రయాణ సాధనాలన్నిట్లోను అతి తేలికైన వాహనం సైకిల్. ఇంగ్లాండు, ఫ్రాన్సు, ఇంగ్లండు దేశస్థులు సైకిళ్లపైన దేశసంచారం చేస్తుంటారు. ఇది కనిపెట్టబడినప్పటినుంచి (18వ శతాబ్దం) ఇప్పటి దాకా ఎన్ని వాహనాలు వ్యాప్తిలోకి వచ్చినా సామాన్యునికి సంచారంలో దీని తోడ్పాటు గమనించదగింది. దీనిని ప్రాతిపదికగా మోటారుసైకిళ్లు, స్కూటర్లు మొదలైన రెండు చక్రాల వాహనాలు విరివిగా వాడుకలోకి వచ్చాయి.

**కారు :** 1770 లో ఫ్రెంచి కాగ్‌నాట్ అనే వ్యక్తి కారును కనిపెట్టాడు. దానికానాడు రోడ్‌వాగెన్ అని పేరు పెట్టబడింది. ఆ యంత్రం ప్యారిస్‌లో ఇప్పటికీ వుంది. 1885లో కారల్ బెంజీ అనే జర్మన్ దేశస్థుడు పెట్రోలు ద్వారా నడిచే కారును కనిపెట్టాడు. 1903లో ఫోర్డు ఒక కంపెనీని పెట్టి పెద్ద ఎత్తున కార్లను తయారుచేశాడు. కార్లలో సామాన్యంగా 15,000 విడి భాగాలుంటాయి. కానీ 80,000 విడిభాగాలతో తయారుచేసిన రోల్స్‌రాయిస్ కారు ప్రసిద్ధమైంది.

కార్లలో 300 లకు పైగా రకాలున్నాయి. ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే అందుబాటులో వున్న కార్లు ఇప్పుడు మధ్యతరగతి వాళ్లకు మామూలు ప్రయాణ సాధనమైపోయింది. కార్ల తర్వాత జీప్‌లు, బస్సులు, లారీలు జనజీవనంలో ప్రముఖ స్థానాన్ని సంతరించుకున్నాయి. ఇంగ్లాండ్‌లో ఒకేసారి 250 మంది ప్రయాణీకుల్ని తీసుకెళ్లే బస్సు తయారు చేయబడింది.

**రైళ్ళు :** 1801లో ఇంగ్లాండ్‌లో రిచర్డు ట్రెవిథిక్ ఆవిరితో నడిచే యంత్రాన్ని కనిపెట్టాడు. 1814లో ఇంగ్లాండ్‌లో రైలింజను తయారైంది. 1830లో మొదటి ప్యాసింజర్ రైలు నడిచింది. బొగ్గుతో నడిచే రైళ్ల స్థానంలో కరెంట్ సహాయంతో నడిచే రైళ్లు వచ్చాయి. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులకు అత్యంత సౌకర్యంగానే కాకుండా, చౌకగా అందుబాటులో వున్న ప్రయాణ సాధనాలు రైళ్ళే.

మామూలుగా నడిచే రైళ్లతో పాటు, భూగర్భంలో నడిచేవి (ప్రపంచంలో 47 దేశాల్లో) మెట్లు ఎక్కే రైళ్లు (స్విట్జర్లాండ్) గాలిలో రైళ్లు (జపాన్‌లోని అయస్కాంతపు రైళ్లు) సముద్రం కింద నడిచేవి (జపాన్‌లోని హోన్సు, హొక్కాయ్ అనే ద్వీపాల మధ్య) సొరంగాల్లో నడిచేవి ఇలా ఎన్నో రకాల రైళ్లు వాడుకలో వున్నాయి.

విమానం : పక్షిలాగా గాలిలో ఎగరడానికి సంబంధించిన కథలెన్నో వున్నాయి. ఆ కోరికతో రెక్కలు కట్టుకొని ఎగిరి నేలపై పడ్డవాళ్లున్నారు. తర్వాత గాలికంటే తేలికైన వేడిగాలి సహాయంతో 1783లో బెలూన్‌లో మొట్టమొదటిసారి మనిషి ఆకాశంలో విహరించాడు. అమెరికాకు చెందిన రైట్ సోదరులు మోటారు అమర్చిన చిన్న విమానంలో 1903 డిసెంబర్ 17న మొదటిసారిగా ఆకాశంలో విహరించారు. విమానం నుంచి కిందికి దూకటానికి పారాచూట్ అనే పరికరం 1912లో కనిపెట్టపడింది. జెట్ విమానాలు, సూపర్‌సానిక్ విమానాలు, ఇంజన్ లేక భూమ్యాకర్షణ శక్తిపైన, గాలిపైన ఆధారపడి నడిచే గ్లయిడర్ విమానాలు ఎన్నో కనిపెట్టబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య సంబంధాలను దగ్గర చేయటానికి విమానాలు తోడ్పడుతున్నాయి.

ఓడలు : 3 వేల సంవత్సరాలకు ముందే మానవుడు చిన్న చిన్న పడవలను తయారుచేసి కాలువల్లోను, నదులలోను, సముద్రాల్లోను ప్రయాణం చేశాడు. నౌకాయాన చరిత్ర అత్యంత ప్రాచీనమైనవని అరేబియన్ నైట్స్ కథల్లోని సిందూబాద్ సాహసగాథలు తెలియజేస్తాయి. క్రీ.శ. 1400 నాటికి సముద్ర ప్రయాణాలు బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. వీటివల్ల దేశ విదేశాలమధ్య వాణిజ్యం బాగా పెంపొందింది. పెద్ద పెద్ద నౌకల్లో రంగస్థలాలు, సినిమాహాళ్లు, ఆటస్థలాలు, భోజనశాలలు కూడా ఉంటాయి. ప్రయాణానికి వాడేవి, వ్యాపారం కోసం వాడేవి, యుద్ధనౌకలు విరివిగా ఉపయోగంలో ఉన్నాయి. నౌకా దిక్సూచి సహాయంతో ఇవి ఎలాంటి ఆటంకం లేకుండా గమ్యాన్ని చేరుకోగలుగుతాయి.

## 10. దుస్తులు

'నీ సంతోషం కోసం విందారగించు. ఇతరుల సంతోషంకోసం దుస్తులు ధరించు, అని పెద్దల మాట. విందు భోజనం తిన్నవాళ్లకు మాత్రం సంతృప్తినిస్తుంది. కానీ ధరించే దుస్తులు చూపే వాళ్ళకు కనువిందు కల్గిస్తుంది. అనాదినుంచి వస్త్రాలంకరణ పట్ల మనిషికున్న శ్రద్ధ, మోజు గురించి అందరికి తెలిసిందే. రంగు, డిజైన్లను బట్టి ఏభైవేల రకాలకు పైగా వ్యాప్తిలో వున్నాయంటే మానవ జీవితంలో వస్త్రాలకున్న ప్రాధాన్యత ఎలాంటిదో అర్థమవుతుంది. అలాంటి వస్త్రాల పుట్టు పూర్వోత్తరాల గురించి తెలుసుకుందాం.

ఆటవిక దశలో చెట్ల ఆకుల్ని, బెరడుల్ని ధరించిన మానవుడు 7 వేల సంవత్సరాలకు ముందు కొత్తరాతియుగంలో చేతితో అల్లిన వలలలాంటి బట్టల్ని ధరించేవాడు. క్రీ.పూ. 4వేల సంవత్సరాలనాడే ఈజిప్టులో లినెన్ అనే ఒకలాంటి నారవస్త్రాలు తయారయ్యాయి. చైనాలో 2,500 నాడు సిల్కు వస్త్రాలు తయారు చేయబడ్డాయి. భారతదేశం నూలు వస్త్రాలకు ప్రసిద్ధి. వాటి తయారీ క్రీ. పూ. 2 వేల సంవత్సరాలనాడు మొదలైంది.

వస్త్రాలు నేయడానికి ఉపయోగపడే మగ్గాన్ని ఈజిప్షియన్లు మొదట క్రీ.పూ. 4వేల సంవత్సరాలప్పుడు కనుగొన్నారు. వాళ్లు ఒక అంగుళం నిడివిలో 540 సన్నని దారాలను వుపయోగించారంటే నేతలో వాళ్లు ఎంత అభివృద్ధిని సాధించారో తెలుస్తుంది. వస్త్రాలు నేయటానికి కావలసిన దారాలు చెట్లనుంచి, జంతువులనుంచి, ఇతర కృత్రిమ పదార్థాల నుంచి తయారవుతున్నాయి.

భారతదేశంలో తయారయ్యే చేనేత వస్త్రాలకు మించినవి, అందమైనవి ప్రపంచ వ్యాప్తంగా మరెక్కడా లేదు. ఉన్నతమైన హస్తకళా నైపుణ్యాన్ని ఇవి ప్రదర్శిస్తాయి. క్రీ. పూ. 4వ శతాబ్దంలోనే మన దేశంలో వివిధ రంగుల్ని వుపయోగించి రకరకాల డిజైన్లను ప్రింటు చేసేవారు. తర్వాత ఈ అద్దకం కళ అన్ని దేశాలకు వ్యాపించింది. మొదటి నూలు మిల్లు కలకత్తాలో 1817లో స్థాపించబడింది. ఈనాడు మనదేశంలో 3 వేల రకాల వస్త్రాలు తయారవుతున్నాయి.

18వ శతాబ్దంలో యంత్రాల ద్వారా వస్త్రాలను తయారు చేయడం మొదలైంది. పత్తినుంచి గింజల్ని వేరు చేయడం, నూలు వడకడం, నేయడం, డిజైన్లువేయడం మొదలైన పనులన్నీ యంత్రాలే చేస్తాయి. దాదాపు 15వేల రకాల రసాయనాలను వస్త్ర పరిశ్రమలో వుపయోగిస్తున్నారు.

1952లో ఎలిజబెత్‌రాణి పట్టాభిషేకానికి ధరించిన గౌను డిజైను తెలుసుకోవడం కోసం అమెరికా నుంచి వచ్చిన ఒక వ్యక్తి ఇంగ్లాండులో ఆ డిజైను చేసిన వ్యక్తికి 1,00,000 రూ. ఇచ్చాడట. ప్యారిస్ నగరానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ 2 కోట్ల రూపాయల విలువైన

గౌను తయారు చేశాడంటారు. 1970లో రిచర్డ్‌బర్డన్ ఎలిజబెత్ టేలర్‌కు 10 లక్షల రూపాయల ఖరీదైన బొచ్చు కోటును బహూకరించారట. టర్కీలో 25 లక్షల రూపాయల దుప్పటిని 6 గురు పనివాళ్లు 10 సంవత్సరాలు శ్రమించి తయారు చేశారంటారు. తయారైన బట్టల్ని అందంగా కుట్టడానికి 10 వేల రకాల కుట్టుమిషన్లు వ్యాప్తిలో వున్నాయి. వస్త్ర ప్రపంచానికి చెందిన అద్భుతాంశాలు ఇంకా ఎన్నో వున్నాయి.

బంగారు, వెండి దారాలతో తయారు చేసిన జరీతో చీరెలు, దోవతెలు మొదలైన వాటిని తయారు చేస్తారు. సూది, దారం వుపయోగించి చేతిద్వారా, మిషన్ల ద్వారా బట్టలపై కళాత్మకంగా రకరకాల తీగెల్ని, పువ్వుల్ని డిజైన్లను కుట్టడం తూర్పు దేశాలలో పుట్టి పశ్చిమాసియా ద్వారా యూరపు ఖండానికి వ్యాపించింది. ఎంబ్రాయిడరీలో పూసలు, అద్దాలు, లోహపు బిళ్లల్ని కలిపి కుట్టడం వుంది.

వాతావరణం నుంచి శరీరాన్ని రక్షించుకోవడం కోసం మొదలైన వస్త్రధారణ ఒక్క అద్భుత ప్రపంచాన్నే సృష్టించింది. అందం కోసం వాటిని ధరించడం క్రమంగా మామూలై పోయింది. జీవన గమనంలో వస్త్రాల వాడకం ఆయా సందర్భాలకు అనుగుణంగా రూపు దిద్దుకొన్నాయి. ఈనాడు వాటి తయారీలోను, ధరించడంలోను పోటీ పెరిగింది. దేశదేశాల్లో పోటీ ప్రపంచంలో వస్త్రధారణ రకరకాల పోకడలతో వెర్రితలలు వేస్తోంది. 'కొత్తొక వింత, పాతొక రోత' అన్నట్లు నిన్న వున్న పద్ధతి నేడుండటం లేదు. కాల చక్రంలో మళ్లీ పాత పద్ధతులు కొత్తదనాన్ని సంతరించుకొన్న సందర్భాలూ ఎక్కువే. వస్త్రధారణ విషయంలో సినిమాల ప్రభావం కూడా వుంది. అలంకరణ పట్ల అభిరుచిలేని వ్యక్తులు చాలా అరుదుగా కన్పిస్తారు. జరీజల్తారులు, నగిషీ అల్లకాలతో కూడిన వస్త్రాలను ఎక్కువమంది ఇష్టపడతారు. అవి ఖరీదైనవి కూడా. కానీ మనిషి అందచందాల్ని తీర్చిదిద్దే దుస్తులు ఆ మనిషి వ్యక్తిత్వానికి అద్దం పడతాయనడంలో సందేహం లేదు.

## 11. ఆటలు

మానవునికి ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కల్గించే వాటిలో ఆటలు మొదట నిలుస్తాయి. క్రీడలకు టైం లేనివారు రోగాలకు టైం ఇవ్వాల్సి వస్తుందంటారు జాన్‌వనమకర్. ఆటలవల్ల కలిగే శరీరవ్యాయామం, ఉత్సాహం, సంఘీభావం మరివేటి వల్ల లభించవు. వ్యక్తి శారీరకంగాను, మానసికంగాను ఎదగడానికి వ్యాయామంతో కూడుకున్న ఆటలు ముఖ్యపాత్రను పోషిస్తాయి. అంతేకాదు తీరిక సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవడానికి ఆటలు తోడ్పడతాయి. శారీరకంగా ఆరోగ్యంగా వుంచడమేగాక ఆటలు మనసుకు ఉత్తేజాన్ని కల్గించి జీవితాన్ని ఆనంద సాగరంలో ముంచెత్తుతాయి.

**ఆటలు - పుట్టుక :** వేట నుంచి ఆట పుట్టింది. శ్రమనుంచి పాట పుట్టింది. నాలుగువేల సంవత్సరాలకు పూర్వమే ఈజిప్టుదేశంలో బంతాట, బొంగరాలు మొదలైన ఆటలెన్నో వ్యాప్తిలో వుండేవి. ఆట ఆనంద సంకేతం. అందుకే చిన్న పిల్లలు ఎప్పుడూ ఆటల్లో మునిగితేలుతుంటారు. 'బాలస్తావత్ క్రీడాసక్తః' అని భజగోవింద స్తోత్రంలోని ఒక శ్లోకపాదం.

మొదట శారీరకంగా ఆడుకొనే చెడుగుడు, కుంటాడ, ఉప్పర పట్టె, ఒప్పులకుప్ప, చెమ్మచెక్క, నాలుగు స్తంభాలాట, తొక్కుడు బిళ్ల మొదలైనవి. వ్యాపించి వుంటాయి. క్రమంగా ఆటల్లో బంతి, బొంగరం, గోలీ, చిల్లాకట్టె మొదలైన వస్తువులు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత కర్రసాము, కత్తిసాము, గుర్రపుస్వారి లాంటి ఆటలు వ్యాప్తిలోకి వచ్చాయి. మేధస్సుకు పదును పెట్టే చదరంగం, పాచికలు మొదలైన వెన్నో ఆటల వర్గంలో చేరాయి. బంతితో ఆడే వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, బ్యాట్‌తో ఆడే క్రికెట్, హాకీ ఆటల్లో ప్రసిద్ధంగా ఈనాడు కన్పిస్తున్నాయి.

మానవ జాతి పుట్టినప్పటి నుంచి వున్న కుస్తీతోపాటు బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో, కరాటే, ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిలో వున్నాయి. వీటితో పాటు కోడిపందాలు, గుర్రపుపందేలు, డేగలవేట, కుక్కల రేసులు, పావురాల పందాలు, కార్ల పందేలు ఎన్నో వున్నాయి.

భారత్‌లో హాకీ, సోవియట్ యూనియన్‌లో ఫుట్‌బాల్, అమెరికాలో బేస్ బాల్, ఇంగ్లాండ్‌లో, ఆస్ట్రేలియాలో క్రికెట్, ఫుట్‌బాల్, కెనడాలో ఐస్ హాకీ, జపాన్‌లో జూడో జాతీయ క్రీడలుగా ప్రసిద్ధి పొందాయి.

ఆటల్లో పోయిని కూర్చేవేగాక, పైశాచికంగా దెబ్బతీసేవీ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కొన్ని శతాబ్దాల నుంచి జూదం కొనసాగుతూ వుంది. జూదంలో రాజ్యాలను, భార్యాబిడ్డలను, సర్వస్వాన్ని పోగొట్టుకున్న వాళ్ల చరిత్రలో ఎందరో కన్పిస్తారు. ఇప్పటికే జూదం ఒక వ్యసనంగా మారి ఎన్నో కుటుంబాలను కూలదోస్తున్నది. అందుకే అవ్వయార్ జూదమూ, వాదమూ వేదనను కల్గిస్తాయన్నారు. 14వ శతాబ్దంలో పశ్చిమ యూరప్‌లో వ్యాపించిన పేకాట ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించి ఎన్నోసంసారాలను ఛిన్నాభిన్నం చేస్తున్నది.

ఆట కూటాలు, క్రీడారంగాలు, క్లబ్‌లు ఆటస్థలాలుగా వున్నాయి. ఆటల పోటీల్లో బహుమతుల్ని పంచడం ఆనవాయితీ, కప్పులు, ట్రోఫీలు బహూకరించి ఫుట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, హాకీ మొదలైన ఆటల్ని ప్రోత్సహిస్తున్నారు. క్రీడోత్సవాలెన్నో దేశ దేశాల్లో నిర్వహించ బడుతున్నాయి. ఒలింపిక్ క్రీడలు, ఆసియా క్రీడోత్సవాలు, కామన్వెల్త్ క్రీడలు ప్రసిద్ధంగా చెప్పుకోతగ్గవి.

ఆటల్లో అద్భుత ప్రదర్శనలెన్నో చోటు చేసుకున్నాయి. బిగించబడిన తీగపైన ఒక ఫిన్‌లాండ్ దేశీయుడు 1960లో 40 గంటల 5 నిముషాలు నిలబడ్డాడు. ఇలా తీగెలపైన నిలబడడం, చేతులపైన వందలకొద్దీ మైళ్ళు నడవడం, నిప్పుపైన నడవడం, గుండెపై ఏనుగు నెక్కించుకోవడం, బండల్ని పెట్టుకొని సమ్మెటతో పగల కొట్టించుకోవడం, పండ్లతో వీపుకు గుచ్చిన దబ్బనాలతో వాహనాల్ని లాగడం సూదులపైన, ముండ్లపైన పడుకోవడం, ఒంటి కాలిపై రోజుల తరబడి నిలబడడం, వారం పదిరోజుల పాటు సైకిలు తొక్కడం, నీళ్ళపైన రోజుల తరబడి తేలి వుండడం, సముద్రాన్ని ఈదడం మొదలైన అద్భుతాలు చేసి ఒకర్ని మించి ఒకరు ముందున్న రికార్డులను బద్దలు చేసి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

దాగుడు మూతలాడుకొనే దశనుంచి గాలిలో అద్భుత విన్యాసాలు చేసే దశవరకు క్రీడారంగం అభివృద్ధి చెందింది.

## 12. నీటి పారుదల (Irrigation)

మన దేశం వ్యవసాయిక దేశం. వ్యవసాయానికి నీరు చాలా అవసరం. నీటి వినియోగాన్ని బట్టి పంట ఉత్పత్తిని పెంచే అవకాశముంది. కేవలం వర్షాల మీద ఆధారపడి పండించే పంటలు కొన్నయితే నీటి పారుదలను ఆధారం చేసుకొని పండించే పంటలు మరికొన్ని. వ్యవసాయదారుడు నీటి కోసం వర్షాల మీద ఆధారపడితే అనుకున్నంత పరిమాణంలో కాని, అనుకున్న సమయంలో కాని నీరు లభిస్తుందనే నమ్మకం వుండదు.

వర్షం పంటకు ఎంత అవసరమో అంత మాత్రమే కురుస్తుందని చెప్పలేం. మన దేశంలో మూడవ వంతు మాత్రమే పంటకు అనువుగా కావలసినంత వర్షం కురుస్తున్నది. మిగిలిన ప్రాంతాల్లో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొని వున్నాయి. వర్షాభావం వల్ల పంటలు ఎండిపోతే అతివృష్టి వల్ల పంటలు నీరెక్కువై తక్కువ దిగుబడి రావడం లేదా పంటలు నీళ్లలో మునిగి పోవడం, వర్షం వల్ల వరి, ఇతర పంటల ధాన్యం రాలిపోవడం మొదలైన ఇబ్బందులెన్నో వున్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించి వ్యవసాయ రంగంలో నీటి విషయంగా ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితిని తొలగించడానికి కృత్రిమమైన నీటి పారుదల వసతులను ఏర్పాటు చేస్తున్నారు.

నీటి వసతుల వల్ల వ్యవసాయ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతాయి. సేద్యపు భూమిని విస్తరించుకోవచ్చు. ఒకే భూమిలో రెండు మూడు సార్లు పంటల్ని పండించవచ్చు. రసాయనిక ఎరువులను వాడి తగిన మోతాదులో నీటిని సరఫరా చేసి పంట దిగుబడిని అభివృద్ధి చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవసాయం అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి నీరు పారుదల ప్రాణాధారమవుతుంది.

మన దేశంలో అమలులో వున్న నీటిపారుదల వసతులను మూడు రకాలుగా విభజించవచ్చు. బావులు, చెరువులు, కాలువలు. బావులు వ్యక్తిగతమైనవి. ఎవరి పొలాల్లో వాళ్లు వీటిని తవ్వుకుంటారు. ఒక్కో బావి పది నుంచి పదిహేనెకరాల దాకా

నీటిని సమకూర్చగలదు. ఇటీవలి కాలంలో గొట్టపు బావుల ప్రాముఖ్యం విపరీతంగా పెరిగింది. ఈ బావులు లోతుగా వుండడం వల్ల అధిక పరిమాణంలో ఎక్కువ నీరందే అవకాశం వుంది.

చెరువులను ప్రభుత్వం నిర్మించి నిర్వహిస్తున్నది. ఇవి ఎక్కువగా దక్కను ప్రాంతంలో వున్నాయి. చెరువుల వల్ల ఉపయోగాలు ఎక్కువనే చెప్పాలి. వర్షపు నీటిని వృధా కాకుండా చెరువులు నిలువ చేస్తాయి. ఆ విధంగా నిలువున్న నీటిని అవసరం కొద్దీ అందు బాటులో వున్న పొలాలకు సరఫరా చేసుకోవచ్చు. ఈ నీరు భూసారాన్ని కూడా పెంచుతుంది.

నీటి పారుదల విషయంలో అత్యంత ముఖ్యమైనవి కాలువలు. వీటిని కూడా ప్రభుత్వమే నిర్మించి నిర్వహిస్తుంది. నీటి విషయంలో కాలువల్ల నిర్మాణానికి ఖర్చు ఎక్కువవుతుంది. నిర్వహణ వ్యయం కూడా ఎక్కువే. అయినా నీటి పారుదల సౌకర్యం పెరిగి అధిక పంటను పండించే అవకాశం కాలువల వల్ల కలుగుతుంది. కొన్ని లక్షల ఎకరాల భూమికి నీటిని సమకూర్చే సామర్థ్యం కాలువలకు వుంటుంది. అంతే కాదు, వరదలను అదుపులో పెట్టడానికి, రవాణా సౌకర్యాలను పెంపొందించడానికి కాలువలు తోడ్పడతాయి.

నీటి పారుదల వనరుల వల్ల కొన్ని నష్టాలు కూడా లేకపోలేదు. వీటివల్ల ఏటా రెండు పంటలు పండించే అవకాశమున్నా రైతులు వాణిజ్య పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కాయధాన్యాలు, నూనె గింజలు పండే పొలాల్లో జనుము లాంటి పంటల్ని పండించడం వల్ల భూసారం తగ్గి ఎరువులను ఎక్కువగా వాడాల్సి వస్తున్నది. కాలువలలోని నీరు భూమి లోపలి పొరలలోకి ఇంకినప్పుడు భూగర్భజలాలు పైకి వస్తాయి. వాటితోపాటు భూమిలో వుండే లవణాలు కూడా పైకి వచ్చి భూసారాన్ని నశింపజేస్తాయి. పంటలకు హాని కల్గిస్తాయి. కాలువలను సిమెంటు కాంక్రీటుతో గట్టిపరచడం, భూగర్భ జలాలను గొట్టపు బావులతో తోడివేయడం ద్వారా ఈ సమస్యను నివారించవచ్చు.

భూమిని చదును చేయడం, సరైన వంగడాలను వాడడం, తక్కువ కాలపు పంటలను ప్రవేశపెట్టడం మొదలైన చర్యల ద్వారా నీటి పారుదలను సద్వినియోగం చేసుకొని అధిక వుత్పత్తిని సాధించవచ్చు.

'ఉప్పొంగే నదుల జీవ జలాలను ఉప్పు సముద్రం పాలు' కాకుండా సరైన విధానాలను, పద్ధతులను రూపొందించే బాధ్యత ప్రభుత్వం మీద వుంది.

## 13. నిరుద్యోగ సమస్య

భారతదేశంలో ఈనాడు యువకుల మనసులను నిరాశకు గురి చేస్తున్న అంశం నిరుద్యోగం. విద్యావంతులలో గత కొన్ని సంవత్సరాలలో నిరుద్యోగ సమస్య మరీ తీవ్రరూపం దాల్చింది. ఉద్యోగాలు కోరుతూ ఉద్యోగ సాధక కేంద్రాల (Employment Exchanges) లో పేర్లు నమోదు చేసుకుంటున్న వాళ్ల సంఖ్య నానాటికీ పెరిగి పోతున్నది.

'పంచవర్ష ప్రణాళికల' ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించినప్పటికీ ఈ సమస్య రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నదే కాని పరిష్కరించబడడం లేదు. మన దేశంలో లక్షలకొద్దీ సాంకేతిక, వ్యవసాయిక, వైద్య విద్యలనభ్యసించిన పట్టభద్రులు నిరుద్యోగులుగా వున్నారని తెలుస్తున్నది. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించే కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నది. అయినా సమస్య సమస్యగానే వుంటున్నది.

ఆంధ్రరాష్ట్రంలో సాంకేతిక పట్టభద్రుల నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థ ఎన్నో పథకాలను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం కూడా స్వయం ఉపాధి పథకాల లక్ష్య సాధనకు కృషి చేస్తున్నది. కానీ వాటి అమలులో చిత్తశుద్ధి లోపించడం వల్ల అవి నిరుద్యోగులకు సంపూర్ణ సహకారాన్ని అందించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జంటగా కలిసి పని చేసినప్పుడే వారి సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనే వీలుంటుందని ఆర్థిక శాస్త్రవేత్తల భావన. ఈ విషయంలో ఆంధ్ర ప్రభుత్వం ముందంజలో వుందనే అభిప్రాయం కూడా ఉంది. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలోని పరిశ్రమల శాఖను ఈ స్వయం ఉపాధి పథకాలు (Self Employment Schemes) విజయవంతం చేశాయి. వీటికి రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థ కూడా తోడ్పాటునందిస్తున్నది.

స్వయం ఉపాధి పథకాల ద్వారా ఉద్యోగం కల్పించడమే గాక వ్యక్తిలో నమ్మకాన్ని (Self Confidence) కల్గించడం ప్రధానమైన అంశం. ఈ పథకాలకు కేటాయించిన వనరులను తగ్గించకుండా చూడడం ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ బాధ్యత. విద్యావకాశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉద్యోగావకాశాలను కల్పించే ప్రణాళికలను రూపొందించడం వల్ల నిరుద్యోగ సమస్య కొంతవరకు పరిష్కారం కాగలదు. పారిశ్రామిక, వ్యవసాయిక రంగాలలో సాధించవలసిన అభివృద్ధి కూడా ఎంతో వుంది

దేశ అభివృద్ధికి మూలకారకాలైన పారిశ్రామిక, వ్యావసాయిక, వైద్యరంగాల్లో నిరుద్యోగ సమస్య కారణంగా యువతరంలో అశాంతి చోటు చేసుకుంటున్నది. యువతతో తీవ్రవాద ధోరణి ప్రబలడానికి నిరుద్యోగ సమస్య ప్రధాన కారణంగా కన్పిస్తున్నది.

దేశంలో వెనకబడిన ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి కావలసిన పథకాలను రూపొందించి వృత్తిరీత్యా సాంకేతిక నిపుణులను కేటాయించినట్లయితే, ఈ సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుంది. సాంకేతిక విద్యారంగంలో నిర్మాణాత్మకమైన మార్పుల్ని తీసుకురావడం సాంకేతిక విద్యను పారిశ్రామిక శిక్షణతో ముడిపెట్టడం ద్వారా కూడా కొంతవరకు ఈ సమస్యను అధిగమించే వీలుంది. అధిక జనాభాను అరికట్టకుండా ఆకాశం అందుకొనే ధరలొకవైపు, అదుపులేని నిరుద్యోగం యింకొకవైపు, అని దశాబ్దాలుగా పాడుకొంటూనే వున్నాం. దానికి పరిష్కార మార్గాల్ని అన్వేషించే ప్రయత్నం ముమ్మరంగా సాగినప్పుడే నిరుద్యోగ సమస్యను దూరంగా నెట్టేయగలం.

## 14. ఐక్యరాజ్యసమితి (U. N. O)

మధ్యయుగం నుంచి 19 వ శతాబ్దం దాకా జాతీయతకు ప్రాధాన్యమున్నా 20 వ శతాబ్దంలో అంతర్జాతీయత శ్రేష్ఠమని మానవుడు గుర్తించాడు. అగ్ర రాజ్యాలు అతి భయంకరమైన మారణాయుధాల ద్వారా ప్రజా జీవితాల్ని అతలా కుతలం చేస్తున్న సమయంలో - ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధంలో మారణాయుధాల్ని ప్రయోగించి మానవ జాతికి, ఆర్థిక వ్యవహారాలకు తీరని లోటు ఏర్పడినప్పుడు, 1920 లో నానాజాతి సమితి (League of Nations) అవతరించింది. అంతర్జాతీయంగా సహకారాన్ని అందించుకోవడం, శాంతి భద్రతల్ని కాపాడడం ఆ సమితి ముఖ్యోద్దేశం.

సిసీలియా, ఆలాండు ద్వీపాల్లో ఒడంబడికను కుదర్చడంలో, 1921లో అల్బీరియా నిర్మూలనను నివారించడంలో, 1923లో ఇటలీ, గ్రీకు దేశాలమధ్య వున్న అంతఃకలహాలను అంతమొందించడంలో, గ్రీకు రాజకీయ బాధితులకు మళ్లీ జీవనోపాధిని కల్పించడంలో, ఆస్ట్రియా , హంగరీ లాంటి దేశాలకు ఆర్థిక సాయాన్ని అందించడంలో, మధ్యధరా రాజ్యాలలో పాలనా పద్ధతులను మెరుగుపరచడంలో నానాజాతి సమితి చాలా తోడ్పడింది.

1945 లో ఐక్యరాజ్యసమితి స్థాపన జరిగింది. దీనికి అగ్రరాజ్యాలు ప్రధాన పాత్ర వహించాయి. మొదట ప్రపంచంలోని 51 దేశాలు సమితి సభ్యత్వాన్ని పొందాయి.

ఐక్యరాజ్య సమితి వ్యవస్థ సమర్థవంతంగా వుండడానికి, రాజ్యాలకు సభ్యత్వాన్ని ప్రసాదించడానికి, శాంతి భద్రతలను నెలకొల్పడానికి, వెనుకబడిన దేశాలకు ఆర్థిక సాయాన్ని అందించడానికి, మానవ ప్రాథమిక హక్కుల్ని పరిరక్షించడానికి ఒక 'మూల శాసనం' (Charter) ఏర్పడింది, సభ్యత్వం పొందాలనుకున్న రాజ్యం అర్జీ పత్రం పెట్టుకుంటే భద్రతాసమితి పరిశీలించి సిఫారసులు చేస్తుంది. మహాసభ (General Assembly) సభ్యత్వాన్ని ప్రసాదిస్తుంది. సభ్యత్వాన్ని ఇచ్చే అధికారం మాత్రం ఒక మహాసభకే వుంటుంది.

సభ్య రాజ్యాలన్నీ మహాసభలో పాల్గొంటాయి. ఒక్కొక్క రాజ్యం 5 మంది ప్రతినిధులను పంపవచ్చు. ప్రతిరాజ్యానికి ఒక ఓటు అర్హత ఉంటుంది. మహాసభ సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా సమావేశమై అంతర్జాతీయ, సాంఘిక, ఆర్థిక సమస్యలను గురించి చర్చించి తీర్మానాలు చేస్తుంది. సాధారణంగా ప్రతి సమావేశానికి ఒక అధ్యక్షుని, ఏడుమంది ఉపాధ్యక్షులను, ఇతర సంఘ సభ్యులను సమితి ఎన్నుకొంటుంది. ఆయా తీర్మానాలను హాజరైన సభ్యులలో మూడింట రెండువంతులు ఆమోదించాలి. మహాసభ చాలా శ్రేష్ఠమైంది. పర్యవేక్షణ సంఘంగా పని చేస్తుంది.

ఐక్యరాజ్య సమితి ముఖ్యంగా ఏడు ప్రాథమిక సూత్రాలను ప్రోత్సహిస్తుంది. 1. సభ్యులు సహృదయంతో తమ తమ బాధ్యతల్ని నిర్వహించడం 2. రాజ్యాల సార్వభౌమత్వ సమానత్వం. 3, 4. సభ్యరాజ్యాలు బలప్రయోగంతో గాక శాంతియుతంగా అంతఃకలహాలను సాధించడం. 5. సభ్య రాజ్యాలు సమితికి ఆర్థిక సహాయాన్ని అందించడం. 6. సభ్యులు కాని రాజ్యాలు కూడా మూల శాసనం ప్రకారం ప్రవర్తించడం. 7. అంతర్జాతీయ విషయాల్ని పరిశీలించడం.

సమితి వ్యవహారాలను నడపడానికి మహాసభతోపాటు భద్రతాసమితి (Security Council), ఆర్థిక, సాంఘీకమండలి (Economic and Social Council), ధర్మకర్తృత్వ మండలి (Trusteeship Council), అంతర్జాతీయ న్యాయస్థానం (International Court of Justice) సచివాలయం (Secretariat) మొదలైన అంశాలుంటాయి. ఇవిగాక ప్రపంచ ఆరోగ్యసంఘం (WHO), అంతర్జాతీయ కార్మిక సంఘం (ILO), ఐక్యరాజ్య విద్యా సాంస్కృతిక శాస్త్ర సంఘం (UNESCO), ఆహార వ్యవసాయ సంఘం (FAO), అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF), ప్రపంచ తపాలా యూనియన్ (UPU) మొదలైనవి ఉంటాయి.

భద్రతా సమితి శాశ్వతంగా పనిచేసే విభాగం. అంతర్జాతీయ శాంతి పరిరక్షణ దీని ప్రధాన బాధ్యత. తగాదాలకు తలదూర్చిన రాజ్యాలను సంప్రదింపుల ద్వారా, న్యాయపద్ధతిద్వారా, శాంతియుతంగా పరిష్కరించడానికి ఈ సమితి ఆదేశమిస్తుంది. ఇందులో అమెరికా, చైనా, బ్రిటన్, ఫ్రాన్సు, గణతంత్ర చైనా శాశ్వతసభ్యులు. రెండు సంవత్సరాల పదవీకాలంతో పదిమంది తాత్కాలిక సభ్యులుంటారు.

18 దేశాలకు పరిమితమైన ఆర్థిక సాంఘీకమండలి ఉన్నత జీవన ప్రమాణాల్ని కల్పిస్తుంది. మానవ ప్రాథమిక హక్కుల్ని పరిరక్షిస్తుంది.

అంతర్జాతీయ న్యాయస్థానం సమితికి చెందిన న్యాయశాఖ. ఇది నియమించిన శాసనాలకు సభ్యరాజ్యాలు బద్ధులై ఉంటాయి. లేకుంటే సమితి తగిన చర్యలు తీసుకుంటుంది.

ధర్మకర్తృత్వమండలి ముఖ్య లక్ష్యాలలో అంతర్జాతీయ శాంతి భద్రత, అధిష్ట ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, స్వయం పరిపాలనా శక్తి, స్వాతంత్ర్యాల ప్రోత్సాహం మొదలైనవి చెప్పుకోదగ్గవి.

న్యూయార్కులో నెలకొల్పబడ్డ సచివాలయంలో ప్రధాన పాలనాధిపతి, ప్రధాన కార్యదర్శి, కొంతమంది ఉపకార్యదర్శులు సహాయకులుగా ఉంటారు. సమితికి సంబంధించిన సమావేశాల్ని ఏర్పరచడం, పరిశీలనా సమాచారాల్ని సేకరించడం. కార్యనిర్వాహక వర్గ ప్రతినిధిగా వ్యవహరించడం దీని పని.

నానాజాతి సమితితో పోలిస్తే ఐక్యరాజ్య సమితి చాలా మెరుగైన సంస్థ. మానవ సంక్షేమానికి, అంతర్జాతీయ శాంతి భద్రతలకు ఈ సంస్థ దోహదం చేస్తుంది.

## 15. సమానత్వం

సమాజంలో ప్రజా జీవితంలో నిత్యం వినపడే మాటలలో సమానత్వం ఒకటి. 18 వ శతాబ్దంలో జరిగిన ఫ్రెంచి విప్లవకాలం నుంచి ఈ మాటకు విశేష ప్రాచుర్యం కలిగింది. ఫ్రెంచి విప్లవకారులు స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం - వీటికోసం మహావిప్లవాన్ని నడిపించారు.

సామాన్యార్థంలో అందరికీ సమానమైన అవకాశాలు, ఆదరణ లభించడమే సమానత్వం. కానీ నిజ జీవితంలో ప్రజల మధ్య ఈ సమానత్వం మచ్చుకైనా కన్పించడంలేదు. రూపురేఖల్లో, తెలివి తేటల్లో, శక్తి సామర్థ్యాలలో, కన్పించేది అసమానత్వమే కాని సమానత్వం కాదు. ఈ అసమానత్వాన్ని రూపుమాపడం మనిషికి సాధ్యమయ్యేపని కాదు. అలాగని సంఘజీవితంలో వ్యత్యాసాలను సమర్థించడం కూడా సబబు కాదు. ప్రకృతి వికృతిని కల్పించిన అభాగ్యులను చిన్నచూపు చూడడం మానవత్వం అన్పించుకోదు. అసమానతా గుణం వల్ల మనిషిలో దానవత్వం తాండవిస్తుంది. సమాజంలో దోపిడీ వ్యవస్థ స్థిరంగా నిలిచిపోతుంది. న్యాయానికి, మానవత్వానికి చోటుండదు. సమాజం భిన్న తరగతులుగా చీలిపోతుంది. భిన్న వర్గాల మధ్య అడ్డుగోడలు ఏర్పడతాయి. పై తరగతుల వాళ్ళు కింది తరగతుల వాళ్లను స్వార్థప్రయోజనాలకోసం బానిసల్లాగా వాడుకొంటారు. వాళ్ళపట్ల అమానుషంగా ప్రవర్తిస్తారు. ఈ దుర్భరమైన అసమానతలకు విరుగుడుగా సమానత్వ నినాదం అంకురించి విప్లవ రూపాన్ని దాల్చింది.

మానవుడు మానవుడుగా గౌరవ ప్రదమైన జీవనం గడపాలంటే సమానత్వాన్ని కొంతవరకైనా గుర్తించి తీరాలి. జాతి, మత, కుల, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా వ్యక్తిత్వ వికాసానికి సమానమైన అవకాశాల్ని అందరికి కల్పించాలి. ఎవరి శక్తి సామర్థ్యాలను అనుసరించి వారు ఈ అవకాశాల్ని వినియోగించుకొనేట్లు చూడాలి. సమాజంలో స్థానం, అధికారం వారి వారి శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటాయి. అందరికీ సమానమైన, విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలను కల్పించాలి. ప్రజలందరికి ప్రధానంగా అవసరమైన కూడు, గూడు, గుడ్డలాంటి కనీస అవసరాల్ని సమకూర్చాలి. భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని పోషించడం కోసం కనీస అవసరాలను అలక్ష్యం చేయకూడదు.

శాసనాలు ప్రజలందరికి సమానంగా వర్తించేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన వుంది. ఆస్తి, కులం, మతం, పుట్టుక, వర్గవిభేదాలు మొదలైన వాటివల్ల చట్టాలు ఎక్కువ తక్కువల్ని సృష్టించరాదు. భారతరాజ్యాంగం ఈ రకమైన సమానత్వాన్ని పౌరులందరికి కల్గించింది. కానీ ఆచరణ శూన్యం.

ప్రజాస్వామ్య వ్యవస్థకు సమానత్వ సూత్రం మూలం. ఈ సూత్రాన్ని కాదనడమే విప్లవాలకు కారణమవుతుందని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు. ఆర్థిక రంగంలో సమానత్వాన్ని సాధించడానికి స్త్రీ పురుషుల మధ్య వున్న తేడాను అంతంచేసి ఆస్తిలో, వస్తువాహనాల్లో సమానమైన వాటాను ఇవ్వాలి. అయినా వ్యక్తుల మధ్య ఆర్థికపరమైన సమానత్వాన్ని సాధించినా వారి గుణగణాలవల్ల, శ్రద్ధ, పొదుపు మొదలైన వాటిలోని తేడాలవల్ల అసమానతలు అంకురిస్తున్నాయి.

దుఃఖ బీజనమైన పేదరికాన్ని అంతం చేయడానికి కనీస జీవన సదుపాయాలను కల్పించి ఉపాధి కల్పన వంటి నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థిక యంత్రాంగాన్ని నడపాలి. పౌరుడనే పదానికి సర్వవిధాలా సార్థకతను కల్పించాలి. ప్రభుత్వం కనీస సదుపాయాలను ప్రజలందరికి సమానంగా కల్పించి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడినప్పుడే సమానత్వానికి అర్థం, పరమార్థం.

## 16. నాకు నచ్చిన ప్రాచీన కవి

నన్నయ, తిక్కనలు అనే మహాకవి ద్వయానికి ఈయన కలిస్తేనే తెలుగులో కవిత్రయం అయింది. ఆ మహాకవే ఎర్రన.

ఎరుపు అభ్యుదయానికి ప్రతీక. ఎర్రన అనే పేరు పెట్టడం వల్ల కాబోలు తనకు ముందు కవులు, తన సమకాలికులూ చెప్పని ఎన్నో అపూర్వమైన, అపురూపమైన విషయాల్ని చెప్పాడీయన.

ఒక విషయాన్ని ఎవరైనా బాగా వింటే చెవియొగ్గి విన్నారని అంటాం. దాన్నే ఇంకా అందంగా చెప్పాలంటే మనసు పెట్టి విన్నారని అంటాం. ఈ విషయాన్నే ఎర్రన ఎలా చెప్పాడో గమనించండి. ఒక మహర్షి కథ చెబుతుంటే శ్రోతలు తమ నిండైన మనసులు చెవులకు ఆభరణాలుగా చేసుకొని విన్నారట. (తమనెమ్మనములు చెవులకు సొమ్ములుగా చేసుకొని విన్నారు). ఇంత సుందరంగా చెప్పడం అందరికీ సాధ్యమయ్యే విషయంకాదు.

'లేదురా యిటువంటి భూదేవియెందు' అని రాయప్రోలు సుబ్బారావు దేశభక్తిని వ్యక్తంచేస్తే 'There is no land like England' అనే ఆంగ్ల వాక్యానికి అనువాదంగా భావిస్తారు. కానీ 14 వ శతాబ్దంలోనే 'మన భూమి బోలు భూమి యెందును పుట్టదు' అంటాడు ఎర్రన.

'అరచేతిని అడ్డంపెట్టి సూర్యకాంతిని ఆపలేం. అనే విప్లవాత్మకమైన వాక్యానికి మాతృకలాంటి వాక్యం. మనకు ఎర్రనలో కనిపిస్తుంది. 'ఇనుడరచేత మాటువడుటెన్నడు గల్గునె ?' అని 'Breast feeding is best for the baby' అని చిన్నపిల్లల వైద్య నిపుణుల్లు ప్రస్తుతం నొక్కి వక్కాణిస్తుంటే 'తల్లి చనుబాలు గ్రుక్కెడు తక్కినయవి పుట్టెడును ఒక్కరూపు' అని ఆనాడే ఆయన అనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

'ధర్మాత్మా! మీరు చంపుతూ చంపుతూ వుంటే మేం మాత్రమే మిగిలి వున్నాం. మా ముందుగానీ, మా వెనకగానీ ఎవరూ లేరు. మా వంశాలన్నీ సమూలంగా నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. దయచేసి మీరిక్కడి నుంచి దయార్ద్రబుద్ధితో వెళ్ళిపొండి, అని పాండవుల వేటకు గురి అయిన కొన్ని జంతువులు ఒక వేకువ జామున ధర్మరాజుకు కలలో కనబడి ఆయనను ప్రార్థించాయి. ఆయన సహృదయతతో స్పందించి తమ్ములతో విషయం అంతా చెప్పాడట. అక్కడినుంచి వేరే చోటికి వెళ్ళిపోయారట పాండవులు అదీ కథ. వాతావరణ సమతౌల్యానికి నిలువుటద్దంగా నిలుస్తుందీ సంఘటన.

బీదతనమనేది ఎంత దుర్భరమైనదో అందరికీ తెలిసిందే! అయినా దాన్ని అనుభవించిన వాళ్లకే దాని కోరల కరుకుతనం, క్రూరత్వపు తీక్షణత్వం పూర్తిగా అర్థమయ్యేది. ఆ విషయాన్ని గురించి ఎర్రన ఇలా అంటాడు. 'దరిద్రుడున్ మృతుడు నిక్కము తుల్యులుగారె ధారుణిన్'. (దరిద్రుడూ, చచ్చిపోయిన వాడూ ఇద్దరూ సమానులే). గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా చెబుతున్నాడు కవి.

ఆనాది నుంచీ తండ్రి కూతుర్ని ఆప్యాయంగా 'తల్లీ' అని సంబోధించడం పరిపాటి. అయితే ఏర్రన ఒక మామ పాత్రతో కోడల్ని 'తల్లీ' అని సంబోధింప జేశాడు. ఎంత ఉదాత్తమైన, మహోన్నతమైన సమాజాన్ని సందర్శించాలకుంటున్నాడ కవి! మామలందరూ తమ కోడళ్లను తమ సొంత కూతుళ్ళలాగా చూసుకోగలిగితే ఎంత బాగుంటుంది !

'అంతేలే ! పేదల కన్నులు

వినమ్రములు వెతల వ్రణమ్ములు

తుఫానులో తడిసిన జడిసిన

గోమాతల కన్నుల తమ్ములు' (శ్రీ శ్రీ) అనే ఈ కవితా పంక్తుల చిత్రం ఎర్రన మహాకవి హరివంశంలో చేసిన భయంకరమైన వర్ష వర్ణనలో ఆవులు పడిన ఆవేదన అనే 'ఫ్రేం'లో పెట్టి చూస్తే తప్ప సమగ్రంగా అవగాహన కాదంటాడు విమర్శ కాగ్రేసరుడైన ఆరుద్ర. ఆధునిక సౌధానికి ప్రాచీనపు పునాదులు నిర్మించిన కవి ఎర్రన.

'నిశ్చల కళా విజ్ఞాన సర్వస్వమోయనగ' అని తొలిసారిగా ఈయన వాడిన 'విజ్ఞాన సర్వస్వం' అనే మాటనే 'ఎన్‌సైక్లోపీడియా' అనే ఆంగ్లపదానికి అనువాదంగా మనం తెలుగులో నేడు వాడుకుంటున్నాం.

ఇలా అత్యంత నూతనమైన అభివ్యక్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి, నేటికి పనికి వచ్చే ఆర్థిక, ఆరోగ్య, అభ్యుదయాది విషయాల్ని చెప్పిన ప్రాచీన మహాకవి ఎర్రన సహృదయులందరికీ నచ్చిన కవి అవుతాడు.

రచయిత :

**ఆచార్య పి. ఎల్. శ్రీనివాసరెడ్డి,**

తెలుగుశాఖ,

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపూర్.

**B.A./B.Com./B.Sc./B.B.M. DEGREE EXAMINATION, DECEMBER 2006**

**(Examination at the end of Second Year)**

**Part I - Telugu**

**Paper II - POETRY, PROSE, DRAMA, PROSODY, POETICS AND ESSAY**

**Time : Three hours** **Maximum : 100 marks**

1. దిగువ పద్యాల్లో ఒక దానికి ప్రతిపదార్ధ తాత్పర్యాలు రాయండి: (8)

(a) వనిత కుచద్వయంబు పయివ్రాసిన కుంకుమ పత్రభంగము
ల్లనిత నితాంత ఘర్మకణజాలము చేఁత గరింగి మెల్లమె
ల్లన వెలిపట్టు పయ్యెద కెలంకుల జాఱుట యొప్పెమానసం
బున నెలకొన్న క్రోధరసము న్వెడఁబెట్టుచు నున్నకైవడిన్.

(b) తలగడిగించి ధౌత పరిధానము గట్టగ నిల్చి లెస్సగా
నలకల యందు గల్గు తడియాఱిచి క్రొవ్విరు లానటించి మై
వలయజ చర్చచేసి గృహమాధవ దత్త మనోజ్ఞ భోజనం
బులొసగె దల్లి తండ్రి నిజపుత్రులు భర్తయు దోభుజింపగన్.

2. క్రింది వాటిలో ప్రతిభాగం నుంచి రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి: (4 x 3 = 12)

అ – భాగం

(a) గ్రంథంబుల్ చదివించి నీతి కుశలుంగావించి రక్షింపరే.

(b) మాన రహితమైన బ్రతుకు మానినికేలా?

(c) తేనె పూసిన కత్తి ధాత్రీ సురుండు

(d)ననువంటి మూర్ఖునకటా విధియేగతి సృష్టిచేసెనో!

ఆ – భాగం

(a) జాగృతి హేతి వాదరల రుధిరమేమి?

(b) శౌర్యదావాగ్ని నా లేఖినీ ముఖాంతరమునందు.

(c) లేస్తోంది ఉషఃకాంతుల్లోంచి ఒక హస్తం.

(d) ఒక కొత్త శకాన్ని లోకం మీదికి విసిరేస్తుంది.

ఆ–భాగం

(a) శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదు

(b) గత చారిత్రకయశః కలాపమ్ము వివరించకు

(c) నిద్రాణాంధ్ర ధరాస్థలి నేడు మేలుకొల్పగలను

(d) సిపయిన్ ఒక ఘోర భారము మోపగా వచ్చితిని చెల్లీ.

3. కింది వానిలో ప్రతిభాగం నుండి ఒక దానికి సమాధానం రాయండి. (2 × 10 = 20)

అ–భాగం

(a) నిగమశర్మ అక్క తమ్ముని వల్ల పాడయిన తనపుట్టింటిని చక్కదిద్దిన విధానాన్ని పేర్కొనండి.

లేదా

(b) పాఠ్యభాగమాధారంగా సీతాపరిత్యాగ వృత్తాంతాన్ని వివరించండి.

ఆ–భాగం

(a) శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనదిలేనే లేదని శ్రీ శ్రీ ఎందుకు భావించాడో తెలపండి.

లేదా

(b) దాశరథిగారు దర్శించిన ఆంధ్రాభ్యుదయం ఎట్టిది.

4. కింది వానిలో ప్రతి భాగం నుంచి ఒక దానికి సమాధానం రాయండి. (2 × 10 = 20)

అ–భాగం

(a) జంఘాల శాస్త్రి స్వభాషాభిమానాన్ని తెలపండి.

లేదా

(b) రాయల నాటి రసికతాలక్షణాల్ని వివరించండి.

ఆ–భాగం

(a) బహుకాల దర్శనంలో దేవులపల్లి దృక్పథాన్ని తెలియజేయండి.

లేదా

(b) మనుచరిత్ర పాశస్త్యాన్ని విశదీకరించండి.

5. కింది వానిలో రెండింటికి సమాధానాలు రాయండి. (2 × 10 = 20)

(a) కమల పాత్రచిత్రణ గావించండి.

(b) సింగరాజులింగ రాజు గుణశీలాల్ని పరిశీలించండి.

(c) వరవిక్రయం నాటక లక్షణాల సమన్వయం చేయండి.

(d) వరవిక్రయం నాటక నామ సార్థక్యాన్ని వివరించండి.

6. కింది వానిలో ఒక దానిని గూర్చి వ్యాసం రాయండి. (10)

(a) సామాజిక సమస్య-ఎయిడ్స్-యువత.

(b) నీటి సమస్య – పరిరక్షణ.

(c) మతసామరస్యం.

7. (a) (i) కింది పద్యాపాదానికి గణ విభజన చేసి, ఛందస్సును గుర్తించి, యతిని పేర్కొనండి. (5)

మసకపుఁబాముకాటుగతి మచ్చరమన్విసమగ్గ లింపఁగన్.

లేదా

(ii) కింది వాటిలో ఒక దానికి సోదాహరణంగా లక్షణాన్ని తెలపండి

(1) కందం

(2) శార్దూలం

(b) (i) కింది పద్యంలో అలంకారాన్ని తెల్పిలక్షణంతో సమన్వయించండి. (5)

చేటి కానీత పీఠికాసీన యగుచుఁ

బద్మకర్ణిక గొలువున్న పద్మవోలెఁ

గుడి వలన నింత యొరగా ఁగొమరు మెఱసి

బిడ్డచను ఁద్రావ నిట్లను బిసరుహాక్షి.

లేదా

(ii) కింది అలంకారాల్లో ఒక దానికి సోదాహరణంగా లక్షణం తెల్పండి.

(1) రూపక

(2) దృష్టాంత.

B.A./B.Com./B.Sc./B.B.M./B.H.M. DEGREE EXAMINATION, JUNE 2010.

(Examination at the end of Second Year)

Part I — Telugu

Paper II — POETRY, PROSE, DRAMA, PROSODY, POETICS AND ESSAY

Time : Three hours | Maximum : 100 marks

1. క్రింది పద్యాలల్లో ఒక దానికి ప్రతి పదార్థతాత్పర్యాలు రాయండి. (8)

(a) అజ్ఞుల్ గొందఱు మేము దామనుచు మాయంజెంది సర్వాత్మకుం

బ్రజ్ఞాలభ్యుదురన్వయ క్రమములన్ భాషింపగా నేరరా

జిజ్ఞాసాపథ మందు మూఢులు గదా! చింతింప బ్రహ్మాది వే

దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నిరతుల్ దర్శింపగా నేర్తురే.

(b) అనవిని ప్రేటు యురగాంగన యుంబలెనేయి వోయ భ

గ్గన దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి హె

చ్చిన కనదోయి కెంపుతన చెక్కుల ఁగుంకుమ పత్ర భంగం సం

జనిత నవీన కాంతి వెదచల్లన గద్గద భిన్నకంఠియై.

2. కింది వానిలో ప్రతి భాగం నుంచి రెంటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి. (4 × 3 = 12)

అ–భాగం

(a) గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం గావించి రక్షింపరే

(b) సానబట్టిన మకరాంకు శస్త్రమనగ

(c) ఏలబేలవైతివి యీాగుణం బేల నీకు

(d) ఏమి వినియెదమ్మరొయింకన్

3. క్రింది వాటిలో ప్రతిభాగం నుంచి ఒకదానికి సమాధానం రాయండి: (2 x 10 =20)

అ – భాగం

(a) ప్రహ్లాదుని విద్యాభ్యాస వృత్తాంతాన్ని వివరించండి.

(b) సత్యభామను శ్రీకృష్ణుడు అనునయింపజేస్తూ మాట్లాడినతీరు ఎట్టిది?

ఆ – భాగం

(a) 'తిలక్ మానవతావాది' అని ఆర్తగీతం గేయం ద్వారా నిరూపించండి.

(b) లకుమత్యాగ వృత్తాంతాన్ని వివరించండి.

4. ఈ క్రింది వాటిలో ప్రతిభాగం నుంచి ఒకదానికి సమాధానం రాయండి: (2 x 10 =20)

అ – భాగం

(a) స్వభాషనేర్చుకోవడం సులభమని జంఘాలశాస్త్రి వివరించిన తీరుతెల్పండి.

(b) రాయల కాలం నాటి రసికతను తెలియజేయండి.

ఆ – భాగం

(a) బహుకాల దర్శనం ఆధారంగా శ్రీరాములు గుణశీలాలెట్టివో వివరించండి.

(b) స్వరోచి జన్మ వృత్తాంతాన్ని తెల్పండి.

5. దిగువ వాటిలో రెండింటికి సమాధానాలు రాయండి: (2 x 10 =20)

(a) కాళింది గుణగణాన్ని వివరించండి.

(b) వరవిక్రయం నాటకంలో కమలపాత్ర ప్రాధాన్యాన్ని తెల్పండి.

(c) సింగరాజు లింగరాజు పరమలోభి యెట్లో నిరూపించండి.

(d) వరవిక్రయం నాటకంలో నాంది ప్రస్తావనలను వివరించండి.

6. క్రింది వాటిలో ఒకదానిని గూర్చి వ్యాసం రాయండి: (10)

(a) ప్రాచీన భాషగా తెలుగును గుర్తించాలా!

(b) ప్రసార సాధనాలు

(c) సంస్కృతిలో కాలచక్రమహోత్సవాలు.

7. (a) (i) క్రింది పద్యపాదానికి గణవిభజన చేసి, ఛందస్సును గుర్తించి యతిని పేర్కొనండి : (5)

కట్టడి జీవితాల్గడువ గౌతమ బుద్ధుడు జ్ఞాన మార్గముల్

లేదా

(ii) క్రింది వాటిలో ఒకదానికి సోదాహరణంగా లక్షణాల్ని తెల్పండి:

(1) కందం (2) తేటగీతి

(b) (i) క్రింద పద్యంలో అలంకారాన్ని తెల్పి, లక్షణంతో సమన్వయించండి. (5)

కోపసదనంబునకున్ చనియెను లతాంగి హరిచందన కోటరమునకు నాగ తరుణియుఁబోలెను

లేదా

(ii) క్రింది అలంకారాల్లో ఒకదానికి సోదాహరణంగా లక్షణం తెల్పండి:

(1) ఉత్ప్రేక్షాలంకారం (2) అర్థాంతరన్యాసాలంకారం.

B.A./B.Com./B.Sc./B.B.M./B.H.M. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of Second Year)

Part I — Telugu

Paper II — POETRY, PROSE, DRAMA, PROSODY, POETICS AND ESSAY

Time : Three hours

Maximum : 100 marks

1. దిగువ పద్యాల్లో ఒకదానికి ప్రతిపదార్థ తాత్పర్యాలు రాయండి : (8)

(a) అంచిత భక్తితోడదనుజాధిపు గేహ సమీపముంబ్రవే
శించి సురారి రాజసుతుఁజేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రములాకుమారుడా
వించి పఠించెనన్ని యుఁజలింపని వైష్ణవభక్తి పూర్ణుడై.

(b) అలికులరావముల్ గిసల యాకులకోకిలకాక కాకలీ
కలకల నాదముల్ సెలఁగఁ గమ్మని తమ్మికొలంకు తెమ్మెరల్
వొలయఁగఁదొంటి చందమున బుద్ధికి నేమియు నింపుగామికిం
గలఁగుచు సత్యభామ చెలిఁగన్గొనియించుక సంశయించుచున్.

2. కింది వాటిలో ప్రతిభాగం నుండి రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి : (4 × 3 = 12)

అ – భాగం

(a) కోపింకపుమయ్య దనుజకుంజర వింటే

(b) సానఁబట్టిన మకరాంకు శస్త్రమనఁగ

(c) తొలి జన్మము నోము ఫలము తోయజనేత్రా

(d) కులధ్వంసంబు నీకర్హమే

ఆ – భాగం

(e) ఖరీదు కట్టే షరాబులేడోయ్

(f) రసాతలమంట శిరస్సు వంచిన వాణ్ణి

(g) ఈకలలు కాగితపు పేలికలైరాలినవి

(h) ఎవరయ్యా? ప్రగాఢ సాహిత్యమూర్తి

3. కింది వాటిలో ప్రతిభాగం నుంచి ఒకదానికి సమాధానం రాయండి : (2 × 10 = 20)

అ – భాగం

(a) "ప్రహ్లాద చరిత్రము" ఆధారంగా హిరణ్య కశిపుని మనస్తత్వాన్ని తెలపండి.

(b) పాఠ్యభాగమాధారంగా సీతాదేవి గుణగణాలను పరిశీలించండి.

ఆ – భాగం

(c) "ప్రతిజ్ఞ" లో శ్రీశ్రీ చెప్పిన అభ్యుదయ భావాలను విశదీకరించండి.

(d) పాఠ్యభాగమాధారంగా లకుమ ఆత్మసమర్పణాన్ని వివరించండి.

4. కింది వాటిలో ప్రతిభాగం నుంచి ఒకదానికి సమాధానం రాయండి : (2 × 10 = 20)

అ – భాగం

(a) పానుగంటివారు తెలియజేసిన మాతృభాషాభిమానాన్ని తెలపండి.

(b) రాయలపాటి జీవన విధానాన్ని విశదీకరించండి.

ఆ – భాగం

(c) "బహుకాలదర్శనము" మానవమనస్తత్వానికి ప్రతిబింబమెట్లో తెలపండి.

(d) పాఠ్యభాగమాధారంగా పెద్దన కథాకథనాన్ని పరిశీలించండి.

5. దిగువ వాటిలో రెండింటికి సమాధానాలు రాయండి : (2 × 10 = 20)

(a) పురుషోత్తమరావు

(b) సుభద్ర

(c) సింగరాజులింగరాజు

(d) వరవిక్రయం – కన్యాశుల్క దురాచారం.

6. క్రింది వాటిలో ఒకదానిని గూర్చి వ్యాసం రాయండి : (10)

(a) మాతృభాషలో విద్యావిధానం

(b) జాతీయ సమైక్యత

(c) సమాజంలో ప్రసార సాధనాల పాత్ర.

7. (a) (i) కింది పద్యపాదానికి గణవిభజన చేసి, ఛందస్సును గుర్తించి, యతిని పేర్కొనండి : (5)

"నిన్నున్ మెచ్చరు నీతిపాఠ మహిమన్నీతోడి దైత్యార్భకుల్"

లేదా

(ii) కింది వాటిలో ఒకదానికి సోదాహరణంగా లక్షణాన్ని తెల్పండి :

(1) మత్తేభం

(2) చంపకమాల

(b) (i) కింది పద్యంలో అలంకారాన్ని తెల్పి లక్షణంతో సమన్వయించండి : (5)

చేటికానీత పీఠికాసీన యగుచుఁ
బద్మ కర్ణికఁ గొలువున్న పద్మవోలెఁ
గుడివలన నింత యోరగాఁ గొమరు మెఱసి
బిడ్డ చన్నుఁద్రావ నిట్లను బిసరుహాక్షి.

లేదా

(ii) కింది అలంకారాల్లో ఒకదానికి సోదాహరణంగా లక్షణం తెలపండి :

(1) ఉత్ప్రేక్ష

(2) స్వభావోక్తి

**(DTEL 21)**

B.A./B.Com./B.Sc./B.B.M./B.H.M.
DEGREE EXAMINATION, DECEMBER 2011.

(Examination at the end of Second Year)

Part I — Telugu

Paper II — POETRY, PROSE, DRAMA, PROSODY, POETICS AND ESSAY

Time : Three hours Maximum : 100 marks

1. క్రింది వాటిలో ఒక పద్యానికి ప్రతి పదార్థ తాత్పర్యాలు రాయండి. (1 × 8 = 8)

(a) తనయుడు గాడు శాత్రవుడు దానవ భర్తకు వీడు, దైత్య చం
దనవన మందు గంటకయుత క్షితి జాతము భంగిఁబుట్టి నా
డనవరతంబు రాక్షసకు లాంతకు బ్రస్తుతి సేయుచుండు దం
దనమున గాని శిక్షలకు డాయడు పట్టుకొట్టు దుద్ధతిన్

(b) ఈసున బుట్టి డెందమున హెచ్చిన శోకదవాలనంబు చే
గాసిలి యేడ్చెఁబ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రేసఖమైన మోము పయి జేల చెఱంగిడి బాలపల్లవ
గాల సకషాయ కంఠ కలకంఠవధూ కలకాకలీ ధ్వనిన్.

2. క్రింది వాటిలో ప్రతి భాగం నుండి రెండు సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి. (4 × 3 = 12)

అ–భాగం

(a) చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ.

(b) మానరహితమైన బ్రదుకు మానిని కేలా?

(c) కర్ణునౌదలనె భారత సంహిత నిల్చు చాడ్పునన్

(d) నీ సేశీల్య మిల్లాంధ్ర కెల్లను మేల్బంతి.

ఆ–భాగం

(e) విప్లవ శంఖం వినిపిస్తారోయ్

(f) ఏభగవంతునికి నివేదించుకొనగలదు

(g) ప్రతిఫలించే మహాకావ్యం నాకు కావలె

(h) మన బ్రతుకులో నేడపూర్వమైన దినమురా

3. క్రింది వాటిలో ప్రతి భాగం నుండి ఒకదానికి సమాధానం రాయండి. (2 × 10 = 20)

అ–భాగం

(a) ప్రహ్లాదుని విష్ణుభక్తిని వివరించండి.

(b) నంది తిమ్మన సత్యభామ హృదయ ఆవేదనను వర్ణించిన విధానాన్ని వివరించండి.

ఆ–భాగం

(c) 'ప్రపంచపుబాధ అంతా శ్రీ శ్రీ బాధ' వివరించండి.

(d) 'నాదేశం – నా ప్రజలు లో శ్రామిక చైతన్యాన్ని వివరించండి.

4. క్రింది వాటిలో ప్రతి భాగం నుండి ఒకదానికి సమాధానం రాయండి. (2 × 10 = 20)

అ–భాగం

(a) రాయల కాలం నాటి సామాజిక జీవన విధానాన్ని పరిచయం చేయండి.

(b) బహుకాల దర్శనంలో దేశ భక్తుల స్థితిని కృష్ణశాస్త్రి వివరించిన తీరును పరిచయం చేయండి.

ఆ–భాగం

(c) అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' వైశిష్ట్యాన్ని విశదీకరించండి.

(d) పానుగంటి వారి జంఘాల శాస్త్రి ఉపన్యాస పరంపరను ప్రస్తుతించండి.

5. క్రింది వాటిలో రెండింటికి సమాధానం రాయండి. (2 × 10 = 20)

(a) వర విక్రయ కాలం నాటి సామాజిక స్థితిగతులు

(b) నాందీ ప్రస్తావనలను వర విక్రయానికి అన్వయించండి.

(c) వర విక్రయంలోని స్త్రీ పాత్రల్ని పరిచయం చేయండి.

(d) వర విక్రయ నాటక నామౌచిత్యం

6. క్రింది వాటిలో ఒకదానిని గూర్చి వ్యాసం రాయండి. (1 × 10 = 10)

(a) సమానత్వం

(b) విద్య

(c) నిరుద్యోగ సమస్య.

7. (a) (i) క్రింది పద్యపాదానికి గణవిభజన చేసి, ఛందస్సును గురించి యతిని పేర్కొనండి. (1 × 5 = 5)

'తనయుడు గాడు శాత్రవుడు దానవ భర్తకు వీడు దైత్యచం.

లేదా

(ii) క్రింది వాటిలో ఒకదానికి సోదాహరణంగా లక్షణాన్ని తెల్పండి.

(1) ఉత్పల మాల

(2) శార్దూలం

(b) (i) క్రింది పద్యంలో అలంకారాన్ని తెల్పి లక్షణంతో సమన్వయించండి. (1 × 5 = 5)

'అల్లలన యతని పచనము
లెల్లన్ విని మొదలు నఱుక నించుక పడిలో
ద్రెళ్ళెడి కదలిక పలె, హా
తల్లే! యని బెట్టు సొరిగి ధరపై బడియెన్'

లేదా

(ii) క్రింది అలంకారాల్లో ఒకదానికి సోదాహరణంగా లక్షణం తెల్పండి.

(1) ఉత్ప్రేక్షాలంకారం

(2) స్వభావోక్తి అలంకారం.

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. &Title** |
|---|---|---|
| B.A.,B.Com. | IInd Year | Paper - II : Telugu |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)